# క్రీస్తు ప్రభుని ప్రియ సాక్షులు

## (అద్భుత సాక్ష్యాలు)

సేకరణ

శ్రీమతి గ్రేస్ విజయ

# INDEX

1. ఉహించని నిజాలు **– ఇందిర** ................................................ 1

2. దుష్టుడుగా జీవించిన నన్ను ప్రభువు రక్షించారు.
**– మంజిత్ పాల్** (విజయవాడ)................................................ 14

3. ఆశ్చర్యకార్యాలు అద్భుతాలు చేయు దేవుడు నా రక్షకుడు........................
**– జాన్‌వెస్లీ (ఎడ్లపాడు)** ................................................ 20

4. మరణము నుండి తప్పించుట కేవలము దేవుని చిత్తమని నమ్మాను............
**– ఆలీపిరిజ్**................................................ 25

5. క్రైస్తవుడిగానే క్రీస్తును ఆలస్యంగా తెలుసుకోగల్గాను ............................
**– అశోక్ హివాలె** ................................................ 27

6. క్రీస్తే సజీవుడు. మార్గము సత్యము జీవము గల దేవుడని నమ్మాను............
**కల్పన (ఏలూరు)** ................................................ 29

7. క్రీస్తులో నిలిచి మంచి సాక్షిగా నుండుట తెలుసుకున్నాను .....................
**– యోహాను రెడ్డి (కరీమునగర్)** ................................................ 31

8. అయోగ్యురాలనైన నన్ను ప్రభువు గుర్తించి ప్రేమించి గొప్ప జీవితమిచ్చారు
**– క్రైస్టల్ బీర్లో (అమెరికా)** ................................................ 35

9. పై రూపాన్ని కాక నా రక్షకుడు నా హృదయాన్ని లక్ష్య పెట్టునని గ్రహించాను
**– హనోకు (ఆంధ్రప్రదేశ్)** ................................................ 38

10. సాధారణ వ్యక్తినైన నన్ను అసాధారణ అద్భుతాలకు సాక్షిగా నిలిపారు.
**– రాబ్బీ క్రైర్న్ క్రాస్ (అమెరిక)** ................................................ 40

11. నేను నమ్మిన దేవుడు అప్పుల బాధ నుండి విడిపించారు .....................
**– కిరణ్ (దుబాయ్)** ................................................ 49

12. ఎన్నికలేని నన్ను ఘనమైన పాత్రగా క్రీస్తుసేవ చేయు భాగ్యమిచ్చారు.
**– లూకాగారు (వేల్పూరు/ప॥గో॥జిల్లా)** ................................................ 51

13. నిజమైన శాంతి సమాధానములు యేసు క్రీస్తులోనే గలవని నమ్మాను
**– గుత్తుల నిత్యానందము (తూ॥గో॥జిల్లా)** .................................. 57
14. విగ్రహాల నారాధించే నేను నిజదేవుడు క్రీస్తే స్వస్థపర్చు రక్షకుడని నమ్మాను
**– నీలు (ముంబాయి)** ....................................................... 63
15. నా రక్షణకు క్రీస్తే ఆధారమని నమ్మి క్రీస్తు ప్రార్థనలను ఆలకించువాడని ఆశ్రయించాను. **– డాక్టరు ప్రీతి కృష్ణ** .................................. 65
16. దిక్కులేని నాకు దేవుడే దారి చూపి రక్షించారు – **ఊర్వసి – ఢిల్లీ** ......... 68
17. దుష్ట శక్తుల బారినుండి క్రీస్తు నన్ను రక్షించి కాపాడారు.
**– యాస్మిన్ సూరి (నార్త్ కారొలీనా)** ......................................... 70
18. నేను నమ్మిన క్రీస్తు సజీవుడు **– రీటా సుబరాయ్(నార్త్ ఇండియా)** ..... 72
19. అంధకారము నుండి వెలుగైన క్రీస్తును కొనుగొన్నాను
**– బ్రదర్ విఠల్‌రావ్(మచిలీపట్నం/ఎ.పి)** ...................................... 75
20 . శరీరాశలను జయించి క్రీస్తులో పయనించుట శాంతినిస్తుంది అని గ్రహించాను
**– పియా (నార్త్ ఇండియ)** ................................................... 80
21. యేసు నన్ను వెదకి రక్షించి ఆయన సేవ అప్పగించి నడిపిస్తున్నారు
**– రమేష్ అసలేటి (విజయవాడ)** ............................................. 85
22. అజ్ఞానురాలనైన నన్ను క్రీస్తు తన అమూల్య సేవకై పిలిచారు..................
**– ఎస్తేరు(తులసి)(తూర్పు గో॥జిల్లా)** ....................................... 89
23. మరణ ఛాయలో వెలుగునిచ్చిన క్రీస్తు నా ప్రభువు
**– చిట్టి సుందర కుమారి(హన్నా) (చిన గొల్లపాలెము)** .................... 95
24. నిజ రక్షణానుభవం అనగా క్రీస్తును అంగీకరించి వెంబడించుటయే
**– జ్యోతి (నరసాపూర్ / కరీము నగర్ జిల్లా)** ............................... 99
25. దురాత్మల శక్తిపై విజయమిచ్చి క్రీస్తు సాక్షిగా నన్ను మార్చారు. ...............
**– జీవ(చెన్నాయ్)** ........................................................ 103

26. వ్యసనముల నుండి విడుదలనిచ్చి క్రీస్తు నన్ను రక్షించారు
**– సుగుణ భూషణరావు (మచిలీపట్నం)** ................................. 106
27. నేను నమ్మిన దేవుడు ఎంతైన నమ్మదగిన దేవుడు ఇద్దరు స్నేహితుల కథ (సజీవ సాక్ష్యము) **– డాక్టరు కె.వి. క్రాంత్** ................................ 108
28. నేను నిన్ను ఏర్పరచుకొని యున్నాను అని వాగ్దానమిచ్చి క్రీస్తు నన్ను నడిపించారు
**– మదన్ మోహన్ (తణుకు)** ................................................ 112
29. విగ్రహాల పూజ నుండి తప్పించి క్రీస్తు నన్ను రక్షించాడు
**– పొట్టి వీరయ్య(సినీ నటుడు/హైదరాబాద్)** ................................ 117
30. విత్తినదే కోయుదుము **– డా॥ యస్.వి.జోబ్.** ................................ 118
31. క్రీస్తును లక్ష్యపెట్టిన వాడను కాను **– బ్రదర్ జి. ఏబెల్** .................. 123
32. నేను నిష్ప్రయోజకుడనైన లోకస్థుడను **– డా॥ జాషువా జేసుదాస్** ....... 126
33. సుఖానుభవమే నా మతము **– సహో. జి.బి. సాల్మన్** .................. 130
34. గొప్ప విశ్వాస వీరుడు **– సహో. బొల్లెద్దు జాన్ గారి వృత్తాంతము** ...... 134
35. పవిత్రనదిలో ఆత్మహత్యయే శరణ్యమని తలంచితిని
**– సహో. పాల్ నాథన్** ...................................................... 143
36. త్రాగుబోతు సిపాయి కథ **– సహో. నతానియేలు** ....................... 150
37. ఖర్చుతో కూడిన కర్మకాండలు, తీర్థయాత్రలు నాకు శాంతిని పాపక్షమాపణను ఇవ్వలేదు. ఒక వ్యాపార వేత్త అద్భుత గాథ **– సహో. సూరయ్య** ...... 153
38. దిక్కులేని వారికి అండగా నిలిచిన క్రీస్తు కీర్తనీయుడు
**– మారియోకాపెచ్చి (ఇటలీ)** ................................................ 157
39. నా కృప నీకు చాలును అని నా యేసు చెప్పారు
**– లేన్స్ ఆర్మ్ స్టాంగ్ (అమెరికా టెక్సాస్)** ................................ 163
40. ఒంటరి తనంలో తోడు క్రీస్తే **– హువాంగ్ నెహుయ్ (థాయివాన్)** ...... 167

41. మాఫియాలో మార్పు **– దావూద్ ఇబ్రహీమ్** ................................ 172

42. అమ్మల కథ  చరిత్ర **– శ్రీమతి జార్విస్** .................................... 182

43. మంచం మీదనుండి క్రీస్తు మహిమను చాటిన మహానుభావుడు ........... 185

44. విద్యార్థులేమి చేయగలరు? అని సంశయము రావచ్చు! .................. 188

45. మోడుబారిన నా జీవితాన్ని చిగురింపజేసిన నా రక్షకుడు క్రీస్తు
యోహాను 25:2 **– సుజాత గవిని** ......................................... 203

46. మరణపు అంచులు తాకిన నా జీవితాన్ని రక్షించిన జీవాధిపతి నా క్రీస్తు
యెహాను 14 – **విజయ కుమార్** .......................................... 205

47. అద్భుతాలు చేయు క్రీస్తు నన్ను మరణము నుండి రక్షించిన రక్షకుడు
**– యార్లగడ్డ విశాల్ (విజయవాడ)** ........................................ 208

48. జీవమిచ్చిన క్రీస్తు నా రక్షకుడు
**– రాణి పాల్  (నిజామబాద్)** .............................................. 212

49. మాను మాకును కాను,  గానీ మామూలు మనిషిగా మార్చి స్వయంగా మాట్లాడిన రక్షకుడు క్రీస్తు
**– లక్ష్మి / డోర్క (శ్రీకాకుళం)** ............................................. 229

# మంచి మాట - సాక్షుల పరిచయం

**మరణ ఛాయలో వెలుగునిచ్చిన క్రీస్తు నా ప్రభువు (చిన్న గొల్లపాలెం)**

ఆమె జీవితం మోసంతో, దొంగతనాలతో గడిచింది. అత్త విశ్వాసి గాని భర్త త్రాగుబోతు. మరణించాలని ప్రయత్నించగా ఆమె బిడ్డ ఆపింది. ముఖర్జీ గారి బోధనలు ఆమెను రక్షించగా దర్శనాలు పొంది క్రీస్తు బిడ్డగా జీవిస్తుంది.

**వ్యసనముల నుండి విడుదల నిచ్చి క్రీస్తు నన్ను రక్షించారు. (సుగుణ భూషణరావు) (మచిలీపట్నం)**

ఆంజనేయ భక్తునిగా అతని బాల్యము గడిపినారు. భార్య క్రీస్తును నమ్మినందున ఆమె అకాల మరణములో క్రీస్తు దర్శనాన్ని చూచింది. ప్రభువు పిలుస్తున్నాడని ధైర్యంగా తెలిపింది. ఆమె మరణం అతనిలో జీవం కల్గించగా క్రీస్తు సాక్షిగా మారాడు. బిడ్డలంతా ఉన్నత స్థితి చేరుటకు క్రీస్తే ఆధారమని సాక్ష్యమిస్తున్నాడు.

నేను నమ్మిన దేవుడు ఎంతైన నమ్మదగినవాడు:- ఇద్దరు స్నేహితుల కథలో అద్భుత స్వస్థత, డాక్టరు గారి సాక్ష్యము ఆశ్చర్యము కల్గిస్తుంది.

**నేను నిన్ను ఏర్పరచుకొని యున్నాను అని క్రీస్తు నడిపిస్తున్నారు (మదన్ మోహన్ (తణుకు)**

తప్పించి, ఒప్పించి, రక్షించిన దేవుడని సాక్ష్యమిస్తున్నాడు. గతంలో కాలు కాలి ధనుర్వాతం వచ్చి ప్రమాద స్థితి ఎదుర్కొన్నాడు. అనేకమంది దైవజనుల ప్రార్ధన రక్షించింది. ఉద్యోగంలో శ్రమలనెదుర్కొన్నాడు. వాగ్ధానాలన్నీ నావె అంటూ అన్నిటిని స్వతంత్రించుకొని మంచి సాక్షిగా జీవించుట ఆశ్చర్యము, ఆనందము కల్గిస్తుంది.

**విగ్రహ పూజ నుండి తప్పించారు. (పొట్టి వీరయ్య) (సినీనటుడు)**

ఆశ్చర్యంగా అన్యుల జీవితాలను మార్చగల శక్తి క్రీస్తునామంలో వాక్యంలో ఉందని చాటిచెప్పే సాక్ష్యము.

**విత్తినదే కోయుదుము:- డా॥ జోబ్‌గారు**

మన క్రియలు మన వెంటనే వస్తాయి. క్రీస్తును ఎలా వెంబడించాలో మెళకువలను తెల్పు సాక్ష్యము ప్రతి విశ్వాసికి కనువిప్పు కల్గిస్తుంది.

**క్రీస్తును లక్ష్యపెట్టిన వాడను కాను (బ్రదర్ ఏబెల్‌గారు)**

వీరు మా అమ్మ గంటా సంతోషమ్మ, నాన్న గంటా జాన్‌గారి వద్ద రక్షణ పొందినారు. ఆంటీ అనగా మా అమ్మగారని తెల్పుట కెంతో ఆనందిస్తున్నాను. గంటా సామియేలు గారి కుమారుడు ఏబెల్ అన్నయ్య మా పెదనాన్న గారి కుమారుడు. బందరులో ఎల్.యి.ఎఫ్ విభాగానికి అధినేత. నేడు బి.ఎస్.ఎన్.ఎల్. అధికారిగా నున్న జాన్ క్రీస్తోస్తం గారి మామగారు. భార్య ప్రిస్కిల్ల ఏబెల్ గారి కుమార్తె. గొప్ప విశ్వాసి. మంచి క్రమంలో బిడ్డలను పెంచారు. మా కుటుంబాలన్నీ గర్వించగల సాక్ష్యము ఈ లోకంలో మిగిల్చిన ధన్యజీవి. హల్లెలూయ.

**నేను నిష్ప్రయోజకుడనైన లోకస్తుడను (డా॥ జాషువా జేస్‌దాస్)**

కీ.శే. దానియేలు గారు, వారి కుమారుడు జాషువా గారి పరిచర్యలలో కొన్ని లక్షల మంది విశ్వాసులు బలమైన సాక్షులుగా జీవించుట దేవునికి మహిమయే. అట్టి సహవాసములో నిలిచిన జేస్‌దాస్ గారు ధన్యులు.

**సుఖానుభవమే నా మతం (సహో. జి.బి. సాల్మన్)**

ఎల్.ఇ.ఎఫ్. సహవాసములో అధినేతల అందరికీ మంచి అనుచరుడై గొప్ప పరిచర్యలు అందించిన త్యాగమూర్తి. గొప్ప అనుభవాలు, అద్భుతాల నిలయమైన సాక్ష్యము యవ్వనస్తులందరికీ స్ఫూర్తి కాగలదు.

**గొప్ప విశ్వాస వీరుడు (బి. జాన్‌గారు)**

నా బాల్య జీవితములో జాన్‌తాతయ్యగారు మాకొక దేవదూతలాగ కన్పించేవారు. నా తల్లి గంటా సంతోషమ్మ గారు తండ్రిగా ప్రేమిస్తూ మా యింటికి ఆహ్వానించేవారు. ఆ సహవాస కూడికలలో సింహ గర్జనగా ఆ గంభీర ప్రార్థనల స్వరం నాకింగా నా చెవులలో మారుమ్రోగుతుంది. సైతానులు పారిపోగల శక్తిగల సేవచేసిన గొప్ప దైవజనుడు. వారి సంతతి నేడు రేపల్లెలో గొప్ప సేవ చేయుచున్నారు.

**పవిత్ర నదిలో ఆత్మహత్యయే శరణ్యమని తలంచితిని (పాల్ నాధన్‌గారు)**

గొప్ప త్యాగపూరితమైన అద్భుత సాక్ష్యాన్ని దైవజనుడైన జాషువా దానియేలుగారు గొప్ప స్ఫూర్తిని కలిగించే, ఉజ్జీవాన్ని కలిగించే సాక్ష్యాన్ని స్వయంగా రచించగా ఆ సహవాసం, వారందరి సాక్ష్యాలను సేకరించుటలో ప్రభువు కృప నాకు సుపరిచితులైన విశ్వాసుల

సాక్ష్యాలను పరిచయము చేయుట ప్రభువు నాకిచ్చిన గొప్ప అవకాశము, ధన్యతగా భావించి వారికి వారి బృందానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**ఒక త్రాగుబోతు సిపాయి కథ (నతానియేలు గారు)**

నటనా జీవితంలో అందరినీ మోసం చేస్తూ గడిపేవాడిని. ఉజ్జీవ కూటాలను జాన్‌గారు నిర్వహించిన సమయములో వారిని హింసించదలచాడు. ఏదో రీతిగా చివరి కూటమునకు వెళ్ళగా జాషువా గారి ప్రసంగము హృదయాన్ని తాకింది. దేవుని హస్త బలాన్ని చూడగలిగినాడు. ప్రభువు మాట్లాడగా మంచి సాక్షిగా జీవించి ప్రభువును చేరారు.

**ఖర్మ కాండము శాంతినవ్వలేదు (సూరయ్య గారు)**

నాటకాలు వేస్తూ, వేదాంతాలతో పాత్రలను రక్తి కట్టించేవాడు. అతని భార్య స్నేహితురాలు క్రీస్తును పరిచయము చేసారు. సూరయ్య గారి కుమార్తె యొక్క ఉబ్బసం వ్యాధిని క్రీస్తు ప్రార్థనల ద్వారా బాగుచేసారు. సూరయ్యగారు జీవితాన్ని ప్రభువు కర్పించి సాక్షిగా మారారు.

**దిక్కులేని వారికి అండగా నిలిచిన క్రీస్తు కీర్తనీయుడు (మారియోకాపిచ్చి) (ఇటలీ)**

మాలిక్యూలర్ బయాలజీలో నోబిల్ బహుమతి పొందిన అనామకుడు చిన్న వయస్సులో కాల్పులకు గురయ్యాడు. 31/2 సం॥లలో తల్లికి దూరమయ్యాడు. రాత్రి కాలంలో ఆకలితో ఏడ్చాడు. అద్భుతంగా జీవితగమనం దేవుడే మార్చాడు. వింతైన అద్భుత సజీవగాథ.

**నా కృప నీకు చాలు అని నా యేసు చెప్పారు (లేన్స్ ఆర్మ్ స్ట్రాంగ్) (అమెరికా)**

గొప్ప క్రీడాకారుడయ్యాడంటే అతని గతం ఎంత ఆశ్చర్యం కలిగిస్తుందో డాక్టర్లు ఆశ్చర్య పడే జీవితం, బాధల నెదుర్కొన రీతి కంటనీరు తెప్పిస్తుంది. అద్భుత గాథ చదివి గ్రహించండి.

**మాఫియాలో మార్పు (దావూద్ ఇబ్రహీమ్)**

నేటి తరంలో యీ పేరు వినని వారేలేరు. వీరి చరిత్ర సేకరించిన రచయిత జాన్ శేఖర్ గార్ని అభినందించక తప్పదు. యీ పుస్తకానికి గౌరవాన్ని తెచ్చిన కొన్ని గాథలు చదువరులందరికీ విజ్ఞానాన్ని అందించగలవు.

**అమ్మల కథ (శ్రీమతి జార్విన్)**

Mother's day విశిష్టత నేడు ప్రపంచమంతా మే రెండవ ఆదివారం. గొప్పగా తల్లులను గుర్తించి అభినందించే వేడుక వెనుకనున్న వీరాభిమానం గల కుమార్తె తల్లి కొరకేమి చేసిందో వివరించిన ప్రతి విషయము అందరూ తప్పక తెలుసుకోవలసిన అమూల్య సత్యాలు.

**మంచము మీద నుండి క్రీస్తు మహిమను చాటిన మహానుభావుడు (మైఖేల్ ఏంజిల్) (రోమ్)**

రోములో నిలిచిన గొప్ప కట్టడం యొక్క విశిష్టత సిస్టీన్ ఆలయంలో పైకప్పు చక్కని క్రీస్తు తైలవర్ణ చిత్రం. ఆయన గొప్ప చిత్ర కళకు సజీవసాక్ష్యము. ఈ గొప్ప వ్యక్తి జీవిత విశేషాలు అత్యంత ఆసక్తిని కలిగిస్తాయి.

**విద్యార్థులేమి చేయగలరు? (హొసన్న మనోకరన్)**

చిన్న వయస్సులో అంకిత భావముతో క్రీస్తును వెంబడించి అత్యున్నత వైద్య వృత్తిని అభ్యసించింది. ఊహించాని స్వచ్ఛంద సేవలను చేయుటలో దిట్ట. యింటిలోనే మిషనెరీ సేవ ఆరంభమవుతుందనే సత్యం చాటి చెప్పారు.

ఆమె అకాల మరణము అందరినీ దు:ఖసాగరములో ముంచింది. ఏంచేయాలన్నా యువత చేయగలదని చేసి చూపిన ఉత్తమ ఆదర్శ యువతి. దేవుడామె ఆత్మకు శాంతినిచ్చి పరలోకములో ప్రభుని కౌగిలిలో నిత్యానందములో నుండిన ధన్య కన్య.

**మోడు బారిన నా జీవితాన్ని చిగురింప జేసిన నా రక్షకుడు క్రీస్తు (సుజాత గవిని)**

జీవితమంతా కన్నీటి మయము కాగా దేవుడు కనికరించి అర్థం చేసుకోగల భర్త విజయ కుమార్ ఆమె జీవితంలోకి ప్రవేశించడం ద్వారా క్రొత్త జీవితం ఆరంభించింది. దేవుడు ప్రేమామయుడని తెల్పింది.

**మరణపు అంచులను తాకిన నా జీవితాన్ని రక్షించిన జీవాధిపతి నా క్రీస్తు (విజయకుమార్)**

అవ్యస్థంగా అనాధగా ఆస్పత్రిలో గాయపడిన నన్ను ఆదుకున్న నర్స్ నాకు భార్యగా లభించింది. ఆమె క్రీస్తు ప్రేమను నాకు రుచి చూపించింది. నా భార్య, యిద్దరు బిడ్డలకు తండ్రినయ్యాను. క్రీస్తు ప్రేమలో ఎంతో శాంతితో జీవిస్తున్నాను.

చిట్టి సుందర కుమారి – నామకార్థ క్రైస్తవ జీవితాన్ని జీవించిన నాలో క్రీస్తు ప్రేమజ్యోతి వెలిగించారని తెల్పిన సాక్ష్యము సంతోషము కలిగిస్తుంది.

# 1.ఊహించని నిజాలు

**ఇందిరాదేవి**



2 కొరింథీ 5:17 "ఎవడైనను క్రీస్తునందు ఉన్న ఎడల వాడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను".

పరిచయము:-

నా పేరు ఇందిరా దేవి. నా జన్మస్థలము గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామం. నా తల్లిదండ్రులైన తిరువెంగళరావు, సీతావరలక్ష్మమ్మ గార్లకు ఐదుగురు సంతానము. నాకు ఇద్దరు అన్నయ్యలు, ఒక అక్క చెల్లి ఉన్నారు. 15 సం॥ల వయస్సులో మోదుకూరు వాస్తవ్యులైన రామక్రిష్ణయ్య వెంకటసుబ్బమ్మ గార్ల ద్వితీయ కుమారుడైన జానకిరామయ్యగారితో నాకు వివాహం జరిగినది.

మా చిన్న అమ్మమ్మ గారైన జానకమ్మగారు నన్ను చిన్నప్పటి నుండి పెంచి పెద్దచేసి నాకు కట్నకానుకలు ఇచ్చి వివాహం జరిపించి, ఆమె బ్రతికినంతకాలము నన్ను ఎంతగానో ప్రేమించినారు. మాది విగ్రహారాధికుల కుటుంబము. ఇటువంటి కుటుంబములో నుండి నా జీవితములో ఊహించని సంఘటనలు జరిగినవి. వాటన్నింటిని సాక్ష్య రూపములో వ్రాయాలని ఆశిస్తున్నాను.

మాకు ఇద్దరు బాబులు, ఒక పాప. మావారు ఉద్యోగ రీత్యా ఖమ్మం మిల్క్ ప్రాజెక్ట్‌లో పనిచేసేవారు. మేము విగ్రహారాధికులమై యుండగా ఖమ్మం నుండి మా అత్తగారి గ్రామమైన మోదుకూరుకు కనకదుర్గ ఉత్సవాలకు వచ్చినాము. దసరా ఉత్సవాలు 9 రోజులు జరిగిస్తారు. పండుగ రోజున మేము గుడికి వెళ్ళి వచ్చినాము. ఆరోజు నా భర్తగారు చెయ్యి నొప్పి అని చాలా బాధపడినారు.

మరుసటి రోజు మా పుట్టిల్లు మామిళ్ళపల్లి వెళ్ళినాము. అక్కడ కూడా విజయదశమి రోజున గుడికి వెళ్ళివచ్చిన తరువాత మా వారికి చెయ్యి నొప్పి తట్టుకోలేనంతగా వచ్చినది. వెంటనే ఊరిలో ఉన్న డాక్టర్ గారిని పిలిపించినాము. డాక్టర్‌గారు దగ్గరలో ఉన్న పొన్నూరు తీసుకొని వెళ్ళమన్నారు. కాని అక్కడ ప్రైవేటు డాక్టర్లు మా వారికి సీరియస్‌గా ఉన్నదని చేర్చుకోలేదు. చివరికి అమెరికన్ హాస్పటల్‌లో చేర్చినాము. వాళ్ళు కూడా తగ్గుతుందని

నమ్మకం చెప్పలేము అన్నారు. ఈ సంఘటన 7-10-1979న జరిగినది.

అప్పుడు మా వారి మనస్సు కన్నీటి మయంగా ఉండగా మా పెద్దలు, బంధువులు అంతా దు:ఖముతో నుండగా ఆ హాస్పటల్‌లో ఉన్న చిన్న ఉద్యోగి నేను మీ కొరకు యేసు ప్రభువుకు ప్రార్థన చేస్తాను అని అన్నారు. మాకు ఇష్టము లేకపోయినప్పటికి తప్పనిసరి పరిస్థితులలో ఒప్పుకొన్నాము. అప్పటి వరకు మేము మాకు తెలిసిన దేవుళ్ళందరికీ మ్రొక్కుకొనుచుండగా, ఆ సహోదరుడు విని దేవుడు ఒక్కడే అని చెప్పి యేసుక్రీస్తు నామమున ప్రార్థన చేసినారు. అయినా మేము అయిష్టంగానే ఒప్పుకున్నాము.

ఆ సహోదరుడు ప్రార్థన చేస్తూ ఉండగా 10 నిమిషములలో నాకు మగతగా నిద్ర పట్టింది. నిద్రలో ఆకాశమునకు, భూమికి మధ్య సరిపడిన వ్యక్తి తెల్లని వస్త్రములు ధరించి, నల్లని గిరజాల జుట్టుతో నాకు కనిపించి "నన్ను నమ్ము" నీ భర్తకు తగ్గితే నా సన్నిధికి వస్తావా? అని చేయి చాపి చెప్పినాడు. అంత తెల్లని తెలుపు. అలాంటి దుస్తులు ధరించిన వారిని నేను ఎప్పుడు చూడలేదు. నేను ఆ వ్యక్తిని వెంకటేశ్వరస్వామి అనుకొని మా అమ్మగారితో చెప్పినాను. అతను కాదు, ఆయన యేసుక్రీస్తేనని మా అమ్మ మాకు ప్రార్థన చేసిన సహోదరుని పిలుచుకొని వచ్చి నాకు కలిగిన దర్శనములను చెప్పినది.

అది విన్న ఆ సహోదరుడు "అమ్మా దేవుడు మీయందు ఉన్నాడు, తప్పకుండా నీ భర్తగారికి స్వస్థత చేకూరుతుంది. మీరు ప్రభువును ఆరాధించండి. దేవుడు తప్పకుండా మీకు సహాయం చేస్తాడు అని చెప్పినాడు. అప్పటి నుండి నా నోటి ద్వారా ప్రభువు పలుకులు తప్ప మరి ఏమియు వచ్చియుండలేదు. అది దేవుని కృప. నా భర్తగారికి ఆ హాస్పటల్‌లో కూడా నయం కాలేదు.

డాక్టర్లు ఇది హార్ట్ ఎటాక్ అని చెప్పి పొన్నూరు నుండి గుంటూరు జనరల్ హాస్పటల్‌కు తీసుకుని వెళ్ళమన్నారు. అక్కడ కూడా డాక్టర్లు 7 రోజుల వరకు చెప్పలేము అని అన్నారు. చాలా వేదనతో ప్రభువును ప్రార్థిస్తున్నాను. నెల రోజుల తర్వాత స్వస్థత చేకూరింది. ఇంటికి వచ్చిన దగ్గర నుండి తిరిగి విగ్రహారాధన మొదలు పెట్టినాము. ముందు యేసుక్రీస్తుకు ప్రార్థన చేసుకొని తర్వాత విగ్రహారాధన చేసేవారము. చేయకపోతే ఏమి అవుతుందోననే భయంతో చేసినాము.

24-12-1981న మరల రెండవసారి హార్ట్ ఎటాక్ వచ్చినది. ఆరోజు తెల్లవారితే క్రిస్టమస్. అయితే నేను నా భర్తగారి పేర ఆరోజు నా స్వగ్రామమైన మోదుకూరులో వెంకటేశ్వరస్వామి గుడిలో అభిషేకం చేయించడానికి వెళ్ళాము. నేను లేని సమయంలో

మా వారికి మరల హార్ట్ ఎటాక్ వచ్చింది. అప్పటికే మావారు విజయవాడ మిల్క్ ప్రాజెక్టుకు ట్రాన్స్‌ఫర్ అయి వచ్చినారు. మేము విజయవాడలో ఉంటున్నాము. మిల్క్ ప్రాజెక్ట్‌లోని సహోద్యోగులు ప్రైవేటు హాస్పటల్‌లో చేర్చుకోనందున మరల అమెరికన్ హాస్పటల్‌లో చేర్చినారు.

నేను ఊరినుండి వచ్చేసరికి హాస్పటల్‌లో ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో మరి ప్రభువును ప్రార్ధించాను. దేవుడు మరల స్వస్థపరిచినాడు. అయినా మేము విగ్రహారాధన చేస్తూనే ఉన్నాము. లోకాచారములు పాటిస్తున్నాము. అలా 6 సం॥లు గడిచినాయి. దేవున్ని మేము వదిలిపెట్టినా దేవుడు మాత్రం మమ్మల్ని వదిలిపెట్టలేదు.

మా వారికి మరల సంగం జాగర్లమూడికి ట్రాన్స్‌ఫర్ వచ్చినందున మా నివాసము తెనాలికి మార్చినాము. మా పెద్దబాబు అక్కడే ఇంటర్ మీడియట్ చదువుతూ రెండవ సంవత్సరం పరీక్షలో ఫెయిల్ అయినాడు. మేము కోప్పడతామని చెప్పకుండా వెళ్ళిపోయినాడు. ఎటు వెళ్ళనది తెలియదు. అప్పుడు మేము వేదనతో కృంగియుండగా, మా చిన్న అత్తగారి కుమారుడు దైవదాసులు పూర్ణచంద్రరావు గారు మమ్మల్ని ఆదరించుటకు వచ్చి "మా పట్ల దేవుని ఉద్దేశములు, దేవుని ఏర్పాటు, యేసుక్రీస్తు ప్రేమను గూర్చి, మరియు ఆయన ఈ లోకానికి ఎందునిమిత్తం వచ్చినది, ఆయన ప్రజలకు చేసిన మేళ్ళను, నిజదేవునికి విగ్రహారాధన ఎంత అయిష్టమో, మానవుని పట్ల దేవుడు కలిగి ఉన్న గొప్ప ఉద్దేశాన్ని పూర్తిగా వివరించి చెప్తూ ఉండేవాడు.

నన్ను బలపరచి, ధైర్యపరచి యేసుక్రీస్తు భక్తిబాటలో నడిపిస్తు ఉండగా మా బంధువుల నుండి, రక్త సంబంధీకుల నుండి వ్యతిరేకత వచ్చినది. చాలా రోజులు దైవజనులు మా యింటికి వచ్చుటకు కూడా వీలు లేకుండా పోయింది. మా పెద్దబాబు తప్పిపోయిన సందర్భములో పూర్ణచంద్రరావు గారు శివకుమారి అనే విశ్వాసియైన సహోదరిని నాకు పరిచయము చేసిరి. ఆ సహోదరిని దేవుడు ముఖాముఖిగా మాట్లాడుతూ ఉన్నట్లు ఉండేది.

మా పెద్దబాబు విషయం దేవుని సన్నిధిలో ఏడ్చి ప్రార్ధన చేసి పండుకొన్నాను. దేవుని స్వరము నాకు ఈ విధముగా మొట్టమొదటిసారిగా వినబడినది. "నేను ఇల్లు కట్టుటకే వచ్చినాను. పడద్రోయుటకు రాలేదు". రెండవసారి కీర్తనలు 2వ అధ్యాయము చదవమని దేవుని స్వరము వినబడినది. అప్పుడు నా దగ్గర బైబిల్ గ్రంథంలోని పాత నిబంధన గ్రంథము లేదు. అప్పుడు వెంటనే దైవజనులను పిలువనంపించి కీర్తనలు 2వ

అధ్యాయము వివరించి చెప్పమని అడిగినాను. ఈ కీర్తనలో చాలా గొప్ప మర్మములు ఉన్నవని, నిన్ను రానున్న రోజులలో దేవుడు వాడుకుంటాడు కనుక నీవు భయపడవద్దు. దేవుడు నీ పట్ల గొప్ప ఉద్దేశాన్ని కలిగి ఉన్నాడు అని చెప్పినారు.

నా భర్తగారు ఆఫీసునుండి వచ్చిన తరువాత వారికి కూడా వాక్యాన్ని గూర్చి, నన్ను దేవుని సన్నిధికి వెళ్ళుటకు ఆటంకపరచవద్దు అని చెప్పినారు. ఆయన నన్ను ఆటంకపర్చటానికి ఒక్కొక్కసారి భయము వేసి ఊరుకునేవారు. ఒక్కొక్కసారి కోప్పడుతూ ఉండేవారు. తరువాత శివకుమారి అనే సహోదరి తెనాలి అంబేద్కర్ కాలేజిలో సువార్త సభలు జరుగుచూ ఉండగా నన్ను అక్కడకు తీసుకొని వెళ్ళినది.

అక్కడ దైవజనులు క్రీస్తు సిలువ బలియాగమును గూర్చి, రక్షణను గూర్చి చెప్పడము జరిగినది. అప్పుడు నా పాపములను గుర్తించి పశ్చాత్తాపపడి క్రీస్తును నా స్వంత రక్షకునిగా అంగీకరించినాను. అప్పటి నుండి దేవుని వాక్యము ద్వారా పరలోకము, నరకము, సైతానును గూర్చి వివరముగా తెలుసుకుంటూ ప్రభువులో సాగుచున్నాను.

ఒకరోజు మా పెద్దబాబును గూర్చి ప్రార్థిస్తుండగా దేవుని దర్శనము కలిగెను. ఆ దర్శనములో దైవజనులు ప్రసంగము ముగించి వేదిక మీద నుండి దిగివస్తున్నారు. అతను అమెరికన్ దైవజనులు. అప్పటి వరకు నేను అమెరికన్ దైవజనులను చూసి ఉండలేదు. ఆ దర్శనములో దైవజనుల యొద్దకు నా చిన్నబాబుకు ప్రార్థన చేయించుదామని వెళ్ళినాను. ఆ ప్రార్థనలో పెద్దబాబు కూడా ప్రార్థన చేయించుకోవటానికి నిలబడినాడు. అప్పుడు దైవజనులు మా ఇద్దరి కుమారుల మీద చేతులుంచి ప్రార్థించి, ఆశీర్వదించినారు. అప్పుడు మా పెద్దబాబు ఎక్కడ నుండి వచ్చినాడు. ఇది కలా? నిజమా? అని దైవజనులను రెండు సార్లు అడుగుతూ ఉండగా నాకు మెళుకువ వచ్చినది.

ఈ దర్శనం సోమవారం వచ్చినది. గురవారం దైవజనులను పిలిపించగా 126వ కీర్తనలో ఉన్న ఆదరణ వాక్కులతో నన్ను ధైర్యపరచినారు. ఈ దర్శనము గూర్చి చెప్పి ప్రార్థిస్తూ ఉండగా మీ బాబు బిజయవాడలో మీ వారి స్నేహితుని ఇంటికి వచ్చినాడని ఫోను వచ్చినది. ప్రార్థన ముగించుకొని నేను, పూర్ణచంద్రరావు గారు విజయవాడు వచ్చి బాబును ఇంటికి తీసుకొని వెళ్ళినాము. దేవుడు చేసిన గొప్ప కార్యమును చూచి మా బంధువులు, మా ఇంటి ఓనర్స్ ఎంతో ఆశ్చర్యపోయి, ఎంతో సంతోషించి, దేవుని స్తుతించి, మహిమపరచినారు. దేవుని పాదములు పట్టుకొనిన వారిని ఎంతమాత్రము సిగ్గుపరచడని

నాకు దృఢనిశ్చయత కలిగినది.

దేవునిలో కొనసాగుచుండగా, ఈ భక్తి జీవితంలో ఎన్నో అవరోధములు వచ్చినవి. భర్తగారి నుండి ఎన్నో శోధనలు ఎదుర్కొంటున్న సమయంలో 18-2-1989న మేము విజయవాడలో ఇల్లు కట్టుకోవటానికి దైవజనులచే ప్రార్థన చేయించి శంఖుస్థాపన చేసినాము. అయితే బోరు త్రవ్విస్తే నీళ్ళు రావడానికి రాయి అడ్డు పడింది. అప్పుడు నా భర్తగారు పూజ చేయకుండా మొదలు పెట్టాము. అందుకే నీళ్ళు పడలేదు అని చాలా మాటలతో నన్ను కృంగదీస్తున్న సమయంలో నేను దేవుని సన్నిధిలో ఉపవాసము ఉండి ప్రార్థిస్తుండగా మధ్యాహ్న సమయములో దేవుడు నాతో మాట్లాడినారు.

వేరొక దిక్కు చూపించి అక్కడ బోరువేయించి 114 అడుగులు త్రవ్వినచో ఇసుక పడుతుందని, 9 అడుగుల్లో ఇసుకలో నీళ్ళు ఉంటాయి అని దేవుని స్వరం వినబడింది. ఆ స్వరం వినగబడగానే నేను మా ఇంటి ప్రక్కవారితో చెప్పినాను. ఆ రాత్రికి మావారు ఇంటికి రాగానే మా ఇంటి ప్రక్కవారు నీళ్ళు పడినవా అని మా వారిని అడిగినారు, వేరేచోట వేయించినాము. 114 అడుగుల్లో ఇసుక తగిలింది. అక్కడ నుండి 9 అడుగుల్లో నీళ్ళు పడినవి అని వారితో చెప్పినారు.

మధ్యాహ్నం దేవుడు నాకు చెప్పిన విధముగానే జరగటం నా భర్తగారి ద్వారా వినిన మా ప్రక్క ఇంటివారు దేవుడు ముందుగానే నాకు తెలియపరచిన విధమును చూసి చాలా ఆశ్చర్యపోయినారు. నేను కూడా దేవునికి కృతజ్ఞతలు చెల్లించుకున్నాను. ఇల్లు కట్టుచున్నంతకాలము ఎన్నో అవరోధములు కలిగినవి. ఇల్లు పూర్తయ్యేసరికి ప్రభువు నాపట్ల ఎన్నో గొప్ప అద్భుత కార్యములు చేసినారు.

మా వారికి మరల రాజమండ్రికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. మేము ఫ్యామిలిని విజయవాడకు మార్చినాము. మేము ఇల్లు కట్టుచూ ఉండగా ఆ ఏరియా వరదతో నిండి, బయటకు వెళ్ళుటకు వీలులేకపోయినది. ఈ సమయంలో మా అక్కగారి పాప బ్యాంకు పరీక్ష వ్రాయుటకు మా యింటికి వచ్చినది. బయటకు వెళ్ళుటకు వీలుకాని పరిస్థితులలో నేను తెల్లవారుజామున దేవుని సన్నిధిలో ప్రార్థిస్తూ ఉండగా "మీ పాదములకు ఇసుకరేణువులు కూడా అంటనీయను" అని ప్రభువు నాతో వాక్యము ద్వారా మాటలాడెను. అయ్యో ఈ నీళ్ళు ఎలాపోతాయి, ఇసుక రేణువు అంటకుండా ఎలా తీసుకొని వెళతాడు, ఇది అసాధ్యం అని నేను నా జ్ఞానంతో ఆలోచన చేయుచుంటిని. కాని తెల్లవారేసరికి దేవుడు మా ఏరియాకు మునిసిపాలిటీ వారి ద్వారా ఒక పడవను పంపడం జరిగింది. ఆ పడవ

చూడగానే నేను చాలా ఆశ్చర్యపోయి మా అక్కగారి అమ్మాయిన ఆ పడవలో పంపించి ప్రభువును ఎంతగానో మహిమపరిచాను. ఆ సమయంలో దైవజనులు మోజెస్ చౌదరిగారు, విశ్వప్రసాద్‌గారు మరియు సహవాసులు ఆ వరదనీటిలో సహితము నన్ను దర్శించి, ఎంతగానో బలపరచి, ధైర్యపరచి, ప్రార్థించి వెళ్ళేవారు.

నాకు వాక్యబలము లేనప్పటికి, దేవుని యందలి అచంచలమైన విశ్వాసముతో ప్రార్థనచేస్తూ, విశ్వాస జీవితములో ముందుకు కొనసాగుతూ ఉండగా నా భర్తగారు చాలా హీనమైన మాటలతో నన్ను దూషించేవారు. ఆ సమయములో మావారు రాజమండ్రి నుండి విజయవాడకు ట్రాన్స్‌ఫర్ చేయించుకోవటానికి ఎన్నో ప్రయత్నాలు చేసి విసిగిపోయినారు. రూ. 10,000లు ఖర్చుపెట్టినప్పటికి ట్రాన్స్‌ఫర్ కాకపోవుట వలన నన్ను నానారకములుగా మాట్లాడినారు.

ఈ బైబిల్ ఇంటిలోకి రావటం వలన దరిద్రం చుట్టుకున్నది. నాకు ఏ పని కావటం లేదు. ఇక నుండి బైబిల్‌ను చదివిన, ప్రార్థన చేసిన చంపివేస్తానని బెదిరించేవారు. కానీ నేనైతే ఎంతో ప్రార్థన చేస్తూ, ప్రభువా నాకు ఈ అవమానాల నుండి ఎప్పుడు విడుదల నిస్తావు, మా వారికి ఎందుకు ట్రాన్స్‌ఫర్ కావడం లేదు అని చాలా బాధపడుతూ ప్రార్థించాను. మా పిల్లలు కూడా నాన్న వద్దు అంటే నీకు ఈ భక్తి ఎందుకు అనేవారు. ఈ మాటలకు నేను చాలా నలిగిపోయేదాన్ని,

అయితే ప్రభువు నన్ను దైవజనుల ద్వారా, దర్శనముల ద్వారా, వాక్యముల ద్వారా, విశ్వాసుల ద్వారా, బలపరుస్తూ భక్తి జీవితంలో ఒక్కొక్క మెట్టు ఎక్కిస్తూ నన్ను నడిపించినారు. అయితే ఒకరోజు దర్శనములో ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ పేపర్స్ పోస్టుమెన్ నాచేతికి ఇచ్చినట్లుగా నేను దేవునికి స్తోత్రం చెప్తున్నట్లుగా కనిపించినది. ఆ దర్శనంలోనే 3 నెలల్లో ఈ ఇరుకులు, ఇబ్బందులు తొలగిపోతాయి అని ప్రభువారు నాతో చెప్పినారు. అలాగే ఖచ్చితంగా 3 నెలలకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్ పేపర్సు పోస్ట్‌మెన్ నాచేతికి ఇచ్చినాడు. దేవుడు చెప్పినది ఖచ్చితంగా నెరవేరుట చూచి దేవున్ని ఎంతగానో మహిమపరచినాము.

మా వారికి ట్రాన్స్‌ఫర్ వస్తే 50 రూ॥లు కానుక ఇస్తాను అని అనుకున్నాను. ఆ రాత్రి ఒక సహోదరి వాళ్ళ ఇంటి దగ్గర ప్రార్థన జరుగుతుంటే వెళ్ళినాను. మా వారు ఆఫీసు నుండి ఇంటికి వచ్చి మీ అమ్మ ఎక్కడకు వెళ్ళింది అని అడిగినారు. మా పిల్లలు ప్రార్థనకు వెళ్ళినది అని చెప్పినారు. బయటకు ప్రార్థనకు వెళ్ళకుండా ఇంటిలోపెట్టి తలుపు వేయమని పిల్లలతో చెప్పినారు. తెల్లవారితే ఆదివారము ప్రార్థనకు వెళ్ళుటకు డబ్బులు

లేవు. 50 రూ॥లు కానుక ఎలా ఇవ్వాలి అని ఆలోచన చేస్తుండగా 2 సం॥ల క్రితం 50 రూ॥లు తీసుకున్న ఒక సహోదరుడు ఆ సమయంలో ఆశ్చర్యముగా తీసుకువచ్చి ఇచ్చినాడు. బయట పనిమీద వెళ్ళిన మా వారు ఇంటికి రాకముందే, నేను మా దొడ్డిలో చెట్టుకు కాచిన చిక్కుడు కాయలు కోసి, వాటిని అమ్మగా వచ్చిన డబ్బులతో చార్జీలు పెట్టుకొని 50 రూ॥లు కానుక తీసుకొని మందిరమునకు వెళ్ళినాను. అలా ప్రభువు అన్ని విషయములో నడిపిస్తూ వచ్చినారు.

మా పాప ప్రభువును నమ్మేదికాదు. నేను సైన్సు స్టూడెంట్‌ను, నేను ఇవన్ని నమ్మను అనేది. విశ్వాసులు వచ్చినా, ప్రార్ధన చేసుకొంటున్న చాలా చిరాకుపడేది. మేము ప్రార్ధన చేసుకుంటుంటే టి.వి. చాలా పెద్ద సౌండ్‌తో పెట్టేది. వాళ్ల నాన్నగారు నన్ను కోపడుతుంటే ప్రార్ధన ఇంట్లో చేసుకోవచ్చు గదా, మందిరమునకు వెళ్ళాలా మరీ చాదస్తం అనేది. పెద్దబాబు కూడా ప్రభువు అంటే ఇష్టపడేవాడు కాదు, యేసు క్రీస్తే దేవుడా?

అందరూ దేవుళ్ళే, అందరిలో ఈయన కూడా ఒక దేవుడు అనేవారు మీరు క్రీస్తు ఒక్కడే దేవుడు అంటారు. అందుకు ఎవ్వరూ చర్చికి రారు అనేవారు. కుటుంబము అంతా జనవరి ఫస్ట్‌కి, క్రిస్టమస్‌కు మాత్రం మందిరమునకు వచ్చేవాళ్ళు. చిన్నబాబు మాత్రం చిన్ననాటి నుండి మందిరమునకు వస్తూ ప్రార్ధన చేసుకొంటూ వుండేవాడు. మావారు కూడా పదే పదే చెప్పగా అప్పుడప్పుడు మందిరమునకు వస్తూ వుండేవారు. అలా దేవునిలో కొనసాగుతూ ఉండగా బాప్తిస్మం పొందుటకు అర్హురాలనో కానోనని ప్రభువు సన్నిధిలో ప్రార్ధించాను.

ప్రభువు వారు దైవజనుల ద్వారా రూతు గ్రంథం 3:10,11లో నుండి వాక్యం ద్వారా నన్ను బలపరచినారు. ఆ మరుసటి ఆదివారం బాప్తిస్మం తీసుకోవడానికి తీర్మానించుకొన్నాను. మా వారు నన్ను ఏమన్నా అంటారేమోనని ఇంట్లో చెప్పలేదు. అయినా మా పాపకు నేను బాప్తిస్మం తీసుకొన్నట్లు కలలో కనిపించింది అని నాతో చెప్పడం జరిగింది. దానితో నేను మనస్సు ఇంకా దృఢపరచుకొని 1992 జనవరి మీటింగ్స్‌లో బాప్తిస్మం పొందినాను. ఆరోజు రాత్రి ప్రార్ధన ముగించుకొని ఇంటికి వచ్చేసరికి చాలా ప్రొద్దుపోయినందున ఇంట్లో ఎవ్వరూ నాతో మాట్లాడలేదు. మా చిన్నబాబు మాత్రం తలుపుతీసి భోజనం చేయమన్నాడు. ఒకరోజు రాత్రి నా భర్తగారు ఒళ్ళునొప్పులతో చాలా బాధపడుచున్నారు. అప్పుడు రాత్రి 2 గం॥లు అయినది. వారిని హాస్పటల్‌కు తీసుకొని వెళ్ళాలంటే కొన్నివేల రూపాయలు కావలెను. కానీ 117 రూ॥లు మాత్రమే ఉన్నవి. ఎవరివద్దనైనా అప్పుగా తెచ్చుటకు అది అర్ధరాత్రి సమయం కాబట్టి ఏమిచేయాలో తోచక

మా పెద్దబాబు, నేను చాలా బాధపడుతూ మావారికి ఉపచారములు చేస్తున్నాము. కాని నిమిష నిమిషము బాధ ఎక్కువగుచూ ఉండగా నేను ఆయన మంచము దగ్గర మోకరిల్లి నన్ను నేను మరచి దు:ఖిస్తూ నేనీ పరిస్థితుల్లో ఏమి చేయను ప్రభువా ప్రార్థిస్తూ ఉండగా, ప్రార్ధన ముగించేసరికి నా భర్తగారు గాఢనిద్రలో ఉన్నారు. అప్పుడు దేవునికి కృతజ్ఞతలు తెలుపుకొని నేను నిద్రించితిని.

ఆ సమయములో నాకు కలలో "ఒక పూజారి రూపములో కనులు ఎర్రవిగా, చింతనిప్పుల వలె చేసుకొని కొట్టుటకు నాపైకి రాగానే, నేను కూడా అతనిపై తిరగబడితిని. అప్పుడు అతడు నా మంగళసూత్రం గొలుసు లాక్కొని వెళ్ళబోతుంటే, నేను ప్రభువు వారికి ప్రార్థించుటకు కూర్చుంటిని. వెంటనే అతని కాళ్ళు, చేతులు విరిగిపడిపోయి నువ్వు ప్రార్థించకు అని అరుస్తూ, నా మంగళ సూత్రం గొలుసు విసిరి నా చేతిలో చేసినాడు. కానీ అతని దగ్గర ముత్యాలు పచ్చులహారములు చాలా ఉన్నవి. నేను తీసుకొనబోయి, అవి ఇతరులవి కాబట్టి తీసుకొనకూడదని వెనుతిరిగి పరుగెత్తుచుండగా మెళుకువ వచ్చినది.

నా శరీరమంతా చమటలతో తడిసిపోయి ఉన్నది. నా భర్తగారు మాత్రం క్షేమంగా నిద్రపోతూ ఉన్నారు. అలా నా భర్తగారిని ప్రభువు వారు ప్రాణాపాయము నుండి కాపాడినారు. అలా కొద్దిరోజులు జరుగుతూ ఉండగా మా పాప ఇంటర్ మీడియట్ రెండవ సంవత్సరం ఫెయిల్ అయినది. ఒక సబ్జక్టు మిగిలింది. చాలా తెలివైన పిల్ల, ఎలా తప్పినది అని తననెరిగిన వారందరు అన్నారు. అప్పుడు నేను ప్రార్ధన చేసుకోమని చెప్పినాను. నేను ప్రార్ధన చేస్తుండగా

యెషయ 14:12లోని "తేజో నక్షత్రమా" వేకువచుక్క నీ వెట్లు ఆకాశమునుండి పడితివి? జనములను పడగొట్టిన నీవు నేలమట్టము వరకు ఎట్లు నరకబడితివి? అని ఈ వచనం ద్వారా దేవుడు మాట్లాడినాడు. 15 రోజుల తరువాత ఫెయిలయిన సబ్జక్టు వ్రాసినది. ఆ పరీక్ష పాస్ అయ్యేటట్లు ప్రతిరోజు మా పాపను కూర్చోబెట్టి ప్రార్ధన చేస్తూ ఉన్నాను. ఆ పరీక్ష పాస్ అయ్యింది. వాళ్ళ నాన్నగారు చాలా ప్రయత్నం చేసినప్పటికి తాను ఇనిస్టెంట్‌గా పరీక్ష వ్రాయడం వలన అనుకొన్న కాలేజిలో సీటు రాలేదు.

ఆ సమయంలో ప్రభువు నాకు దర్శనంలో "నా కుమార్తెకు అనుకొన్న గ్రూపుకు కాలేజిలో సీటు ఇచ్చినట్లు చెప్పియున్నారు. కాబట్టి నీవు మందిరమునకు వచ్చి ప్రార్ధన చేసుకోమని మా పాపకు చెప్పినాను. అలాగే కొద్దిరోజులకే సీటు వచ్చింది. కానీ మందిరమునకు రాలేదు. నేను దర్శనములో చూచిన కార్యములన్ని జరగటం చూసిన

మావారు మా పాపను మందిరమునకు వెళ్ళమని పంపించినారు. అలాగైతే దేవుడు నాకు సహాయం చేస్తే నేను ప్రభువును నమ్ముకుంటాను అని చెప్పింది. నీవు ముందు దేవుని మందిరమునకు వచ్చి, ప్రార్థన చేసి, నీ హృదయమును దేవునికి అప్పగించు అని చెప్పినాను.

మా పాప దేవుని మందిరమునకు వస్తు ప్రభువును నమ్ముకొని మారుమనస్సు పొందుకొన్నది. తరువాత డిగ్రీ పూర్తిచేసి ఎం.బి.ఎ. సీటు కొరకు ఎంట్రన్సు వ్రాసినది. 550 ర్యాంకు వచ్చినది కానీ సీటు రాలేదు. ఒ.సి. కౌన్సిలింగ్ అయిపోయినది అని వాళ్ళ ఫ్రెండ్స్ చెప్పినారు. చాలా నిరుత్సాహపడింది. సీటు నిమిత్తం ప్రార్థించుచుండగా నాకు దర్శనంలో ప్రభువు మా పాపకు సీటు వచ్చినట్లు చూపించినారు. మా పాప బాధపడుతూ వాక్యం చదువుచుండగా హబక్కుకు 2:2,3 ల ద్వారా మాట్లాడినారు. ఆ మరుసటి రోజు ఇంటర్వ్యూ లెటరు వచ్చినది. ఆ విధంగా సీటు ఇవ్వడం ద్వారా ప్రభువు మా పాపను బలపరుస్తూ వచ్చినారు.

మా చిన్నబాబు విషయంలో కూడా ఎం.బి.ఎ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొరకు దేవుని సన్నిధిలో ప్రార్థన చేస్తుండగా, అందులో 69వ ర్యాంకు వచ్చేటట్లు ప్రభువు ఎంతగానో సహాయం చేసినారు. ప్రభువు వాక్యములు, దర్శనముల ద్వారా నా పట్ల జరిగించిన కార్యములన్నింటిని గ్రహించిన నా భర్తగారు విగ్రహారాదన మానివేసి, అప్పుడప్పుడు మందిరమునకు వస్తూ ఉండేవారు. మా చిన్నబాబుకు ఎం.బి.ఎ. సీటు వచ్చిన రోజు రాత్రి ప్రభు సన్నిధిలో ప్రార్థన చేస్తూ, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి నిద్రపోయినాను. ఆ రాత్రి ప్రభువు స్వరం నాతో మాట్లాడుతూ ఉన్నది. నేను చేసిన కార్యములు సాక్ష్యరూపంలో వ్రాసి "ఊహించని నిజాలు" అని పేరు పెట్టమని చెప్పినారు.

అలా ప్రభువులో నేను కొనసాగుతుండగా ఒకరాత్రి మేడపై మేము పండుకొనియున్నాము. అయితే ఆరాత్రి దర్శనములో "ఒక వృద్ధుడు నీ మంగళ సూత్రం గొలుసు నలిగిపోయినది, ఎన్నాళ్ళో పనిచేయదు" అని చెప్పినపుడు చూచుకుంటే ముళ్ళు ముళ్ళుగా ఉన్నది. మెళకువ వచ్చిన తరువాత చూసుకుంటే బాగానే ఉన్నది. వెంటనే మా వారిని నిద్రలేపి నాకు కలవచ్చింది అని చెప్పితిని ఆయన ఎప్పుడూ పీడకలలే వస్తూ ఉంటాయి నోరు మూసుకొని పండుకోమన్నారు. అక్కడ నుండి మావారి ఆరోగ్యం రోజురోజుకు దిగజారుతూ ఉన్నది. ఆకల వచ్చినప్పటి నుండి విశ్వాసులను, దైవజనులను పిలిపించుకొని, వారికి చెప్పి ఎక్కువగా ప్రార్థనచేస్తున్నాము. ఈకల గురించి మావారి ఆరోగ్య విషయం 1995 సం॥ అక్టోబరు 14,15 తేదీలలో మందిరములో విశ్వాసులతో కూడి ప్రార్థన చేస్తూ

ఉన్నప్పుడు ఆ రాత్రి నేను మందిరములోనే నిద్రించుచుండగా, మా ఇంటి మీద దుష్టశక్తులు ఆవరించినట్లు నాకు కనబడింది. మా ఆయన మరుసటి రోజు అక్టోబరు 16న హార్ట్ ఎటాక్ వచ్చిన మావారు మరణించినారు.

మావారు మారు మనస్సు పొందనప్పటికిని, మా బంధువులందరూ ప్రభువును ఎరుగని వారయినప్పటికి, బంధుమిత్రుల మధ్యలో సమాధి కార్యక్రమాన్ని దేవుడు ఎంతగానో ఘనంగా జరిపించినారు. జ్ఞాపకార్ధకూటము కూడా బంధుమిత్రుల మధ్యలో దైవజనుల వాక్యపరిచర్య ద్వారా దేవుని నామమునకు ఎంతో మహిమకరంగా జరిగినది.

పెద్దబాబుకు కూడా దైవసంకల్పం చొప్పున ప్రార్ధనా పూర్వకముగా ప్రభువు మందిరములో అన్యజనుల మధ్యలో దేవునికి మహిమ వచ్చులాగున దుర్గాశిరీషతో వివాహము జరిగినది. ప్రభువునకు స్తోత్రములు కలుగును గాక!

నా రెండవ బాబు సురేష్ కుమార్ వివాహ విషయములో కూడా ఎలా జరుగుతుంది అనే విషయం ముందుగానే ప్రభువు వారు తెలియపరచడం జరిగింది.

ఒక రూమ్‌లో జరుగుతున్నట్లు కలలో చూపించారు. మరల ఒకరోజు తెల్లవారు జామున నేను చిన్నబాబు వివాహ విషయములో ప్రార్థిస్తుండగా “దిగులు పడకు, భయపడకు, నీకు నేను తోడుగానున్నాను” అని ప్రభువు స్వరం వినబడింది. ప్రభువు వారు చెప్పినట్లుగానే ఐలాపురం హోటల్ రూమ్‌లో రమాదేవి అనే బిడ్డతో ఘనంగా వివాహం జరిగింది.

మా పెద్దబాబు బిజినెస్ దెబ్బతిని, మా కుటుంబము ఆర్థికంగా కూడా చాలా ఒడుదుడుకుల మధ్య కొనసాగుచున్న సమయంలో మా దగ్గర అప్పుతీసుకున్నవారు ఇవ్వనప్పుడు, ఎంతో బాధపడుతూ ప్రార్థిస్తుండగా ప్రభువారు స్వరముతో మాట్లాడి, మా డబ్బంతా “అణాపైసలతో సహా ఇస్తాను” అని వాగ్దానం చేసినారు. కానీ పరిస్థితులన్నీ చాలా గడ్డుగా తయారైనవి. కాని కొన్ని రోజుల తర్వాత మా పెద్దబాబు మధుసూధన్‌రావు రియల్ ఎస్టేట్‌లో పనిచేస్తుంగా దేవుడు చెప్పినట్లుగానే ఆశీర్వదించి కుటుంబ పరిస్థితులన్నీ చక్కబర్చినారు.

అన్నిటికన్న ముఖ్యమైన ఆశ్చర్య కార్యము “మా కుమార్తె వివాహ విషయములో చాలా నలిగిపోయినాము. నా భర్తగారు చివరి రోజుల్లో చేయవలెనని చాలా తొందరపడ్డారు. కాని మా కుమార్తె వివాహం చేయలేకపోయారు. మా కుమార్తె అప్పుడు ఎం.బి.ఎ. మొదటి సంవత్సరం చదువుచున్నది. మా కుమార్తె 1996 జనవరిలో మరనాత విశ్వాస సమాజములో దైవదాసులు మోజెస్ చౌదరిగారిచే బాప్తిస్మము తీసుకొన్నది. మా కుమార్తెను

ప్రభువు నందు ఉన్న వ్యక్తికి ఇచ్చి వివాహం చేయవలెనని నిశ్చయించుకొన్నాము. మా కుమార్తె కూడా మంచి విశ్వాసియైన వ్యక్తిని వివాహం చేసుకొనుటకు నిర్ణయించుకున్నది.

మార్చి 31, 2005న నాకు దర్శనములో చూపించిన బాబు తల్లిగారైన నాగేశ్వరమ్మగారు ఫోన్ చేసి, తన కుమారునికి దర్శనము ద్వారా మా కుమార్తెతో వివాహం జరిగినట్లు చూపించారని, జకర్యా గ్రంథము ద్వారా మాట్లాడారని ఏప్రిల్ 9న విజయవాడ వచ్చి మాట్లాడుకుందామని చెప్పినారు. దేవునికి అసాధ్యమైనది లేదని నా జీవితములో రుజువు పరచినందుకు ప్రభువు నామమునకు స్తోత్రములు.

ఏప్రిల్ 9న మా యింటికి వచ్చినారు. ఒకప్పుడు నాకు దర్శనములో మీకుమార్తెకు కట్నకానుకలు అవసరం లేదని ప్రభువు వారు విశ్వాసిరూపంలో వచ్చి మాట్లాడినారు. అలాగే పెండ్లి కుమారుని తల్లిదండ్రులు ఇద్దరు మా గృహమునకు వచ్చి, వారి సాక్ష్యం చెప్పి, ప్రార్థన చేసి, మా కుమార్తెను వారి కుమారునికి ఇచ్చే విషయాలు మాట్లాడుకున్నాము. మాట్లాడుకొనేటప్పుడు ఎటువంటి కట్నకానుకల విషయం ప్రస్తావించలేదు. వారి స్వగ్రామం చీరాల. తండ్రి పేరు బాబురావుగారు. వారు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్లో అసిస్టెంట్ ఎ.ఇ.గా. చేసి రిటైర్డు అయినారు. దేవుడు నాకు దర్శనంలో చూపిన విధంగా కుటుంబం మొత్తం రక్షణపొందిన ప్రార్థన కుటుంబము. దానిని బట్టి దేవునిని స్తుతించినాము. ఆయన కార్యముల "కంటికి కనబడవు, చెవికి వినబడవు, హృదయమునకు గోచరము కావు" అని చెప్పినట్లు నిజంగానే నమ్మలేని నిజాలు నాపట్ల, నాకుటుంబము పట్ల ప్రభువువారు చేసినారు.

మరల పెండ్లి కుమారుడు జాషువా సింగపూర్ నుండి ఫోన్ చేసి మాట్లాడినారు. అప్పుడు కూడా ఆ బాబు దైవసంబంధమైన విషయాలు, జాబు విషయం నాతో మాట్లాడినారు. మాట్లాడినపుడు నేను ఈ విధంగా అడిగినాను "మా పాప విషయం ముందు తెలిసినపుడు మీరు ఏ సమాచారం చెప్పలేదు కదా ఇప్పుడు ప్రభువారు ఏమైనా తెలియపరిచారా అని అడిగితే, నాకు కళ్యాణితో వివాహం జరిగినట్లు దర్శనంలో ప్రభువు చూపించినారు. అని చెప్పినారు.

అప్పుడు ఆ బాబు కూడా కట్నాల విషయము ప్రస్తావించలేదు. నేను కూడా నా కుమార్తె జాబు విషయం, భక్తి విషయం గూర్చి మాట్లాడటం జరిగింది. ఈ విషయాలు దైవజనులు పూర్ణచంద్రరావు గారికి తెలియపరచి, దేవునికి కృతజ్ఞతలు చెల్లించినాను. మరనాత విశ్వాస సమాజ దైవదాసులుకు, దైవదాసురాంద్రకు తెలియపరచగా వారు సంతోషించి చాలా ఆశర్యపోయినారు. దేవుడు ఏదైనా చేయగలిగిన వారని, ఆయన

చెప్పినది నెరవేర్చగలరని వారు కూడా ప్రభువుని ఎంతో ఘనపరచినారు.

నా కుమార్తెకు ఏప్రిల్ 30,2005న నిశ్చితార్థం జరుగుతుందని ప్రభువారు చెప్పినట్లుగానే పెండ్లికుమారుని తల్లి దండ్రులు ఏప్రిల్ 29,30న వారి మందిరంలో మీటింగ్స్ జరుగుచున్న సమయంలో వివాహ సంబంధమైన సంగతులు, తేదీలు నిర్ణయించుకోవడానికి రమ్మని మాకు ఫోన్‌చేసినారు. అలాగే దేవుని సన్నిధిలో ప్రార్థించి, ప్రభువారిని మహిమపరుస్తూ లోకసంబంధమైన ఆలోచనలు ప్రస్తావించకుండా పరిశుద్ధ వివాహ విషయాలను దైవజనుల సమక్షంలో మాట్లాడుకొన్నాము.

తరువాత మరనాత వ్యవస్థాపకులు మా ఆత్మీయ తండ్రిగారైన మోజెస్ చౌదరిగారి గృహంలో, ఇంకా కొంతమంది దైవజనుల మధ్య ప్రార్థనాపూర్వకంగా పెండ్లి కుమారుని తల్లిదండ్రులు, నా కుమారులు, లగ్నపత్రికలు పుచ్చుకున్నారు. 17-06-2005న వివాహం జరుపుటకు నిర్ణయించినారు.

వివాహ కార్యక్రమం దేవుని మహిమార్థమై జరగాలని, బంధువులు అందరూ వివాహానికి రావడానికి సహాయం చేయమని ప్రార్థిస్తుండగా, నేను అక్కడ ఆశీనుడనై అత్యంత మహిమకరంగా జరిగించుకుంటాను అని ప్రభువారు నాకు స్వరం వినిపించినారు. అలాగే తండ్రి కుమార, విశ్వాస సమాజ వ్యవస్తాపకులు, మా ఆత్మీయ తండ్రిగారైన గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే పరిశుద్ధ వివాహము జరుపబడినది.

ఇంకా అనేకమంది దైవజనుల ప్రార్థనలతో, ప్రసంగములతో, దేవుడు మాట్లాడిన విధము, ప్రభువు వారు చేసిన కార్యమును, వధువు, వరులను చూచిన మా బంధుమిత్రులు అంతా విగ్రహారాధికులు అయినప్పటికి వారి దేవుడు వారి పక్షమున గొప్ప కార్యము చేసెనని చెప్పుకొనిరి. ప్రభువారు నేను ఆశీనుడనై నా నామ మహిమార్థమై జరిగించినారు. అక్కడ కూడా దైవజనులు ప్రసంగించేటప్పుడు దేవుని నామం ఎంతగానో మహిమపరచబడినది. తర్వాత పెండ్లికుమారుని ఆత్మీయంగా బలపరచిన హైదరాబాదు సంఘస్తుల మధ్యలో కూడా దేవుడు చేసిన కార్యమును బట్టి వారు కూడా రిసెప్షన్ జరిపించినారు.

దేవుని నామం ఎంతగానో మహిమపరచబడింది. ఆయనకే మహిమ. ఒకరోజు మేము ఇల్లు కట్టుకొనుచుండగా అనేక సమస్యలు ఎదురై మానసికంగా కృంగిపోయి చనిపోతే బాగుండును అని సైతాన్ నాలో ప్రేరేపణ కలిగించగా ప్రభువు వారు బైబిల్ చదివే ఆలోచన కలిగించినారు. జీవగ్రంథంలో 128 కీర్తన 3-6వ వచనములతో మాట్లాడి

నీవు చనిపోవద్ద నీ భోజనపు బల్లచుట్టూ నీ పిల్లలు ఒలీవ మొక్కలులాగా ఉంటారు. నీ పిల్లల పిల్లలను చూస్తావని ఆ వాక్యం ద్వారా నన్ను ప్రభువు వారు ధైర్యపరచి బలపర్చినారు.

కాలగమనాన నా పెద్ద కుమరునికి ఒక కుమార్తె, రెండవ కుమారునికి ఇద్దరు కుమారులు, నా కుమార్తెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కలిగి దేవుని వాగ్ధానము నెరవేర్చబడ్డది కాబట్టి నా సాక్ష్యము చదివే బిడ్డలకు నా మనవి మన జీవితాలలో ఎలాంటి ప్రతికూల పరిస్థితి ఏర్పడినప్పటికి, మనకు జీవితం మీద విరక్తి పుట్టినప్పటికీ దేవుడు మన ప్రతి పాపము నుండి విడుదల కలిగించి ఆయన కృపా బాహుళ్యములో భద్రపరిచి ఆయన పాత్రగా వాడుకుంటారు. ఘనత, ప్రభావములు చెల్లునుగాక. ఆమెన్!

ముగింపు!

ఇందిరాదేవి అను నేను నా కుమార్తె వివాహమును గూర్చి ఇంత ఆసక్తిగా ఈ సాక్ష్యము ఎందుకు వ్రాసినాను అంటే “ప్రభువారు ఊహించని నిజాలు” అనే పేరుతో ఈ సాక్ష్యాన్ని వ్రాయమన్నారు. అంతేకాక, నా కుమార్తె వివాహం పట్ల దేవుడు చేసిన కార్యం మా మట్టుకు మాకైతే భూమ్యాకాశములు పట్టజాలనంత కార్యముగా తోచినది. ఎందుకంటే నా కుమార్తె వివాహ విషయంలో 8 సం॥లు ప్రార్ధనలో కనిపెట్టడం జరిగినది. కాని ప్రభువారు నన్ను భక్తి జీవితంలో నడిపించిన విధము చాలా గొప్పది.

నన్ను, నా కుమార్తెను ప్రభువు ఎంతగా ప్రేమించారో, అంతగా నలుగగొట్టి, ఒక్కొక్కమెట్లు భక్తి జీవితంలో నడిపిస్తూ, ఎన్నో అనుభవాలతో ఆయన రూపులోనికి రావడానికి సహాయం చేసినారు. ఈ నా సాక్ష్యం చదివిన ప్రతి ఒక్కరికి వారి వారి అనుభవాలలో, వారి వారి పరిస్థితులలో “ఊహించని నిజాలు” అనే ఈ నా సాక్ష్యం ద్వారా ఆదరణ, ఆత్మీయంగా, భౌతికంగా ఆశీర్వాదం కలగాలని ప్రభువారి సన్నిధిలో ప్రార్ధిస్తూ కోరుకుంటున్నాను. ఆమెన్.

మీ అందరికీ వందనములు. యెహోవా 24:15లో చెప్పినట్లు నేను, నాయింటివారు యెహోవాను సేవించునట్లు మాకుటుంబము కోసము, పిల్లల పిల్లల తరములు ప్రభువువారి రక్షణలో కొనసాగునట్లు ప్రార్ధించమనవి.

---------

## ౨. దుష్టుడుగా జీవించిన నన్ను ప్రభువు రక్షించారు

**మంజిత్ పాల్ (విజయవాడ)**

**లూకా 19:10 "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను."**



**పరిచయము :–**నా తల్లి దండ్రులు మంచి క్రైస్తవులు గనుక వారి ప్రేమలో బాల్యం గడిచింది. 7వ తరగతిలో దుష్టుని సహవాసానికి గురయ్యాను. మనిషికి సంతోషము అనేది అనుభవించక పోతే జీవితమే కాదు, సంతోషం, ఆనందం, తృప్తి, సిగిరెట్టులో వుందని నాచెడ్డ స్నేహితుడు నేర్పించాడు. రోజుకు 70 సిగరెట్లు త్రాగేవాడిని. విపరీతంగా తాగేవాడిని. అంతేకాదు 7వ తరగతిలో త్రాగుడు అలవాటయింది. చిన్నతనంలో ఎంతత్రాగినా మత్తు ఎక్కని స్థితి కల్గింది. నాలుగు సంవత్సరాలుగా స్కూలుకు క్రమంగా వెళ్ళేవాడిని కాదు. ఒకరోజు రోడ్డుడపై తిరుగుచున్న నన్ను గమనించిన నా తల్లి "ఇక్కడ ఏమిచేస్తున్నావు? అని ప్రశ్నించగా స్కూలుకు సరిగా వెళ్ళుటలేదని నిజము చెప్పాను.

మా అమ్మగారు రైల్వే స్కూలులో టీచరుగా పనిచేసేవారు. నా పరిస్థితి గమనించి, వెంటనే స్కూలు మార్పుచేసింది. నాలో మాత్రము మార్పురాలేదు. పుస్తకాలు మోయుటకు మదులు హింసచేయు వస్తువులైన సైకిల్ చైనులు, రాడ్డులు నా దగ్గర వుండేవి. హైస్కూలు విద్య ముగించుకొని జూనియర్ ఇంటరులో చేరాను. ఇంజక్షన్ ద్వారా మత్తు ఎక్కించుకొనే స్థాయికి చేరాను.

ధనవంతులైన స్నేహితులతో స్నేహంచేసేవాడిని. సైకిల్ పందాలలో పాల్గొనేవాడిని. వాటిద్వారా డబ్బులు కూడా సంపాదించేవాడిని. ఈ రేసుల పిచ్చిలో హైదరాబాదు చేరాను. కొందరి స్నేహితుల ప్రభావము వల్ల వ్యక్తులను చంపుట లేదా కాళ్ళు, చేతులు విరుగగొట్టు విద్యను నేర్చుకోవాలని కొందరు ప్రొఫేషనల్స్‌తో సంప్రదించాను. వారు డబ్బు యిస్తే నేర్పించగలమని హామీ యిచ్చారు. ఒక లక్షరూపాయిలు ఒక్కవారంలో తెచ్చుకోమన్నారు. అది ఎలాగూ నాకు అసాధ్యమగునని సర్దాగా చెప్పారు. అదే నిజమని నమ్మాను.

మాది మధ్యతరగతి కుటుంబము. మా దగ్గర అంత డబ్బులేదు. ఆ డబ్బుకోసం ప్రార్ధన కూడా చేసుకొనేవాడిని. పనికిమాలిన ప్రార్ధనలు దేవుడు వినడు. ఇంటిలో 10

వేలు దొంగతనము చేసాను. స్నేహితుల వద్ద కొంత సొమ్ము అప్పు తెచ్చుకున్నాను. మా ప్రక్కనే ఎ.టి.యమ్. ఆఫీసు ఉంది. రాత్రి వేళ రాళ్ళతో పగులగొట్టి దొంగతనం చేయాలని ప్రయత్నించాను. ఆ మిషను దగ్గరకు వెళ్ళగా No Cash, నగదుగా డబ్బు ఉండదన్నారు.

ఆ తర్వాత నాంపల్లి స్టేషన్‌కు వెళ్ళాను. ఒక వ్యక్తి తన బిడ్డతో మాట్లాడుట జాగ్రత్తగా విన్నాను. 4 సంవత్సరాల కోర్సు చదువుటకు 50 వేలు తీసుకొని వెళ్ళుచున్నట్లుగా విన్న మాటను బట్టి నాకు కావలసిన సొమ్ము దొంగతనం చేయదలంచాను. మంచి వాడివలె నటించి మాటలు కలిపాను. నేను కూడా అతనితో పాటు టికెట్టుకొని ప్రక్కగా చేరాను. ఆ సొమ్ము దొంగిలించి చివరకు హైదరాబాదు చేరాను. లక్షరూపాయలు చెల్లించి హింసచేయుటలో మెళుకువలు సంపాదించ దలిచాను. నీవు అసాధ్యుడవేనని పలికి నీకు కాళ్ళు, చేతులు విరుగగొట్టుట ఎట్లో నేర్పించగలను. దానికి 40 వేలు చాలు అన్నాడు. రోజూ బయటకు వెళ్ళి వస్తుంటే నన్ను ఇంట్లో ప్రశ్నించగా పార్కులో ప్రార్థన చేసుకుంటున్నానని అబద్ధము చెప్పేవాడిని.

నేను నేర్చుకున్న విద్యను ప్రాక్టీసు చేసుకొని ప్రయోగించుట ఎట్లో ఆలోచించసాగాను. ఒకవేళ కాలు చేయి విరుగకపోతే నాకే హాని కలుగుతుందని గ్రహించి కుక్కపై ప్రయోగించాలని నిర్ణయించుకున్నాను. ఇక ఒక కుక్కపై ప్రయోగించగానే నాలుగా కాళ్ళను విరుగగొట్ట గల్గాను. యీ రీతిగా కనబడిన కుక్కలన్నీటినీ గాయపర్చాను.

ప్రతిరోజూ యింటికి చాలా ఆలస్యంగా వెళ్ళేవాడిని. మేము ఒక అపార్టుమెంటులో నుండేవారము. అపార్టుమెంటుకు వాచ్‌మెన్ ఉండేవాడు. ఒకరోజు అతను నన్ను ప్రతిరోజూ ఆలస్యంగా వస్తున్నావేమి? అని ప్రశ్నించాడు. నాక చాలాకోపం వచ్చింది. రోజూ త్రాగుతావేమి అని కూడా ప్రశ్నించగా, నీవెవరివని నన్ను ప్రశ్నిస్తున్నావు. కేవలము నీవు పనివాడివి కద! అని అన్నాను. అతనిని నేను కొట్టదలంచగా అతనే నన్ను బాగా కొట్టాడు. ఆ రాత్రి నేను బాగా బెదిరించి నిన్ను చంపుతానన్నాను. ఆ కుటుంబము నాకు భయపడి పారిపోయారు.

గతంలో చాలా విఱ్ఱవీగి జీవించాను. హింస చేస్తూ గడిపాను. నేను చంపకుండా వేరే కిరాయి హంతకులతో చంపించదలచాను. కొందరికి డబ్బులిచ్చి వాచ్‌మెన్‌ను నా ముందే చంపాలని చెప్పాను. కాళ్ళు చేతులు ముందుగా కట్టిపడేసి, పాదాల నుండి ముక్కలుగా నెమ్మదిగా బాధ తెలిసే రీతిగా నరకాలని తెల్పాను. సైతానుకు బానిసనై కఠినమైన హృదయంతో హింసతలపెట్టిన దుర్మార్గుడను.

అన్ని విషయాలు నేను చెప్పినట్లే చేసారు. బాధతో మాంసము ముక్కలుగా పడగా రక్తధారలతో బాధపడుట స్వయంగాచూచి పైశాచికానందంతో నిలిచాను. ఆ క్షణంలో అపార్టుమెంటులో ఒకరి కారు వచ్చింది. లైట్లు పడగానే హింసించే వారంతా పారిపోయారు. నేను మాత్రమే మిగిలాను. నేనే ఈ హింసకు కారణమని నన్ను గుర్తించి పోలీసులకు, నా తల్లిదండ్రులకు చెప్పుతారని ఊహించి వారిని కూడా చంపుతానని బెదిరించాను.

ఆ రోజుల్లో 1998వ సంవత్సరము కార్గిల్ యుద్ధ కాలంలో ఇంటరు చదివే రోజుల్లో బూతులు వాడేవాడిని. నా నీచమమైన అలవాట్లు వింతగా నుండేవి. ఒక నోటుపుస్తకములో ఎ నుండి జెడ్ వరకు డిక్షనెరీవలె బూతులన్నీ సేకరించి వ్రాసుకొని, అవన్నీ ప్రయోగించి ప్రజల్ని బాధించేవాడిని.

ఆ కారణంగా అసహ్యకరమైన బూతులు తిట్టి యిద్దరు ముస్లిమ్ వ్యక్తులను బాధపర్చాను. ఎందుకిలా అకారణంగా తిడ్తున్నావని అడిగినవెంట నే వారిని విపరీతంగా కొట్టి బాధించాను. దాని ప్రతిఫలంగా “నిన్ను చంపేస్తాము. ఒక వారం కనిపెట్టు” అని బెదిరించారు. ఆ వారం తర్వాత నేను కాలేజీ క్యాంటీన్ వద్ద నుండగా 180 మంది నన్ను చంపాలని ప్రయత్నించారు. గోడఎక్కి దూకి పారిపోవాలని ప్రయత్నించాను. నన్ను పట్టుకొని కాలేజీ గ్రౌండు మధ్యలో నిలువచెట్టారు. కొందరు నన్ను చూచి తగినశాస్తి జరిగిందని ఆనందించారు. కొందరు జాలిపడ్డారు. నన్ను కొట్టేవారికి అలుపు వచ్చేవరకు హింసించి, రక్తము కారేవరకు కొట్టినందున చాలా స్థలాలలో ఎముకలు విరిగిపోయాయి. చనిపోయానని తలంచి నా ముఖంపై కాళ్ళు పెట్టి అవమానపర్చి నన్ను వదిలిపెట్టారు. ఎవరో నన్నుచూచి జాలిపడి నిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. కొంతకాలానికి కోలుకున్నాను గానీ నా బ్రతుకు మారలేదు. నాకీ నీచమైన జీవితమెందుకు? అక్రమ పద్ధతిలో డబ్బు సంపాదించే హీనస్థితి ఎందుకు? నేను ఆత్మహత్య చేసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించాను.

ఒకరోజు సైకిల్ మీద, గోల్కొండ పోర్టువద్ద పైకెక్కి దూకి చనిపోవాలని నిర్ణయించుకున్నాను. క్రమంగా పైకి ఎక్కుచున్నప్పుడు ఒక స్వరం వినిపించింది. “సమయము అయిపోయింది. క్రిందికి దిగి వచ్చేయ్యాలి”. నా కన్నా ముందు పరుగెత్తుకొని వచ్చి నా భుజంపై చేయి వేసాడు. నా సైకిలు అక్కడనే ఉంది. నా సంచికూడా ఉంది. చావు మాత్రం రాలేదు. తెలియని భయము ఆవరించింది. యిల్లుచేరాను. మా నాన్న నా పరిస్థితి గమనించి

"బాబూ విజయవాడ అత్తగారింట్లో ఆద్యాత్మిక రిట్రీటు సభలు జరుగుతున్నాయి. వెళ్ళు అని చెప్పారు. నేను సరేనని జవాబిచ్చాను. ఆ తర్వాత నా వ్రేలు కోసుకొని రక్తంతో తీర్మానము చేస్తూ ఒక ఉత్తరం వ్రాసుకున్నాను. "దేవుడనేవాడు వుంటే దిగివచ్చి నాతో మాట్లాడాలి. లేనిచో నేను తప్పక మరణిస్తాను". ఇక నా కుటుంబీకులను చూడనేమోనని బాధపడ్డాను. చాలా దు:ఖం కల్గింది. ఏడుస్తూనే బస్సుఎక్కి కూర్చొనగా నా పాపజీవితమంతా జ్ఞాపకము వచ్చింది.

అది 1999వ సంవ్సరము సెప్టెంబరు నెల పటమట గవర్నమెంటు స్కూలు ఆవరణములో ఉజ్జీవకూటాలలో దైవజనుడి ప్రసంగము విన్నాను. ఈ ప్రపంచంలో ప్రేమించేవారెవరైనా ఉన్నారా? అని ఆలోచించాను. ఆ ప్రసంగంలో దేవుని ప్రేమ, దీర్ఘ శాంతము గూర్చి వర్ణించుటకారంభించాడు. నీవు 20 సంవత్సరాలలోపు వయస్సు కల్గియున్నావా? యేసు ప్రేమించుటను బట్టి మాత్రమే ఈ స్థలములో నున్నావని గుర్తించు. ఎత్తైన స్థలం నుండి దిగువకు ప్రయాణించిన యెరుషలేము నుండి ఎరికో ప్రయాణికునిగా నున్నావా? మీటింగు పూర్తి అయినతర్వాత బాగా దు:ఖముతో నున్న నన్ను చేరిన సేవకుడు "ఎందుకేడ్చుచున్నావని" ప్రశ్నించాడు. యేసు, నాలాటి పాపిని కూడా ప్రేమించగలడా? అన్నాను. నిన్ను కూడా ఆయన తప్పక ప్రేమిస్తున్నారు బాబు నమ్ము అన్నారు.

నా పాత రోత జీవిత గాధలన్నీ ఆయనకు వివరించాను. ఏమీ దాచిపెట్టలేదు. 7వ తరగతిలో ఆరంభించిన త్రాగుడు వ్యసనము, సిగరెట్లు త్రాగుట, కిళ్ళీలు సేవించుట, ఇతరులను హింసించి బూతులు తిట్టుట, తల్లిదండ్రులను మోసగించి దొంగతనం చేయుట, అబద్ధాలు చెప్పుట యివన్నీ నేరాలేనని ఒప్పుకున్నాను. వెక్కిళ్ళుపెట్టి ఏడుస్తున్న నాతోపాటు దైవజనుడు కూడా ఏడ్చాడు. నిన్ను ప్రేమిస్తున్నానని శాశ్వత ప్రేమతో విడువక దయచూపు గొప్ప దేవుడని బైబిలు వివరిస్తుంది అని చెప్పిన దైవజనుని ప్రతి మాటలను నమ్మాను. పౌలు సంఘమును హింసించినపుడు క్రీస్తు దర్శించి నీవు హింసిస్తున్న యేసునని చెప్పుకున్నాడు. నన్ను కూడా క్రీస్తు క్షమించగలడని నమ్మకము కల్గింది.

ఇకను పాపము జోలికి వెళ్ళనని తీర్మానంతో ప్రభువును కన్నీటితో క్షమించమని ప్రార్థన చేసుకొనిన వెంటనే ఆయన క్షమ, ప్రేమ నన్ను తాకింది. గుండెలలో భారమంతా పోయింది. నెమ్మదితో పైకి లేచాను. ఆయన నన్ను క్షమించాడన్న నిశ్చయత కల్గిన వెంటనే నా స్నేహితులతో నా సాక్ష్యము చెప్పాను.

ఇకనేను ఆయనను సేవించాలని ఆశించాను. నాలో మార్పును యింటివారితో పాటు బయటి ప్రజలు కూడా గుర్తించారు. నేను బాధపెట్టిన వారిలో కొందరు నా జీవితంలో మార్పును గూర్చి నమ్మలేక అక్టోబరు 5వ తేదీన నన్ను చంపుటకు కిరాయి రౌడీలు ఒక్కొక్కరు కొన్నివేలు తీసుకొని నన్ను హతమార్చుటకు నిర్ణయించారు. నేను తలవంచి మౌనంగా ప్రార్థించాను. ఆ దయగల దేవుడు నాకు సమయోచితంగా పలుకబడిన మాట వెండిపళ్ళెంలో నుంచిన బంగారు పండ్ల వంటిదనే వాక్యాధారంగా నా నోట పలికిన మాట ఏదనగా నేను హింసచేసే కిరాతకుడిగా 5 రోజుల క్రితం వరకు జీవించాను. నిజమేగానీ నా రక్షకుడు నా జీవితాన్ని క్షమించి నాలో నూతన జీవమిచ్చారు. నేను పూర్తిగా మారిపోయాను. తిరిగి మిమ్ములను హింసించలేనని క్లుప్తంగా నా సాక్ష్యము వివరించాను. వారంతా నా మాటలు శ్రద్ధగా విన్నారు. ఎంతో పాపిగా జీవించిన వీడు మారిపోయాడంటే ఆ దేవుడు మనల్ని ఏంచేస్తాడో నన్న భయం వారిలో కల్గింది.

నన్ను వదలి పారిపోయారు. వెంటనే దేవున్ని స్తుతించాను. మోకరిల్లి కృతజ్ఞత తెల్పాను. నేను రక్షింపబడని పాపిగానున్నట్లయితే దుండగుల చేతిలో తప్పక మరణించేవాడినే. క్రీస్తుచూపు, కల్వరి ప్రేమకు సాటియైనది మరేదీలేదని గ్రహించాను. నీకోసం, నాకోసం, అందరికోసం ఆయన శ్రమలు సహించి సిలువలో అవమానాలు భరించి ప్రాణమిచ్చాడు.

ఒకసారి ప్రయాణములో గతంలో హింసించిన వాచ్‌మెన్ కన్పించాడు. నన్ను చూచి భయపడ్డాడు. తనను వెదకి తిరిగి చంపుతానని బెదిరి పారిపోయాడు. ప్రేమతో అతనిని సమీపించి క్రీస్తు రక్షించాడని చెప్పి క్షమాపణ కోరగా అతను ఆశ్చర్యపడ్డాడు.

ప్రతినాలుక క్రీస్తే దేవుడని ఒప్పుకొని క్రీస్తుతో నిత్యత్వంలో గడపాలని ఆ ప్రేమామయుని సంకల్పము. గనుక చదువరీ, ఆ క్రీస్తు ప్రేమను గుర్తించగలవా? దినమెల్లా చేతులు చాచి నిన్ను ఆదరించి సంరక్షించి నడిపించుటకు సిద్ధంగా నున్న క్రీస్తు సన్నిధికి చేరగలవా? నీ జీవితానికి యజమానిగా ఆయనను నిలుపుకుంటావా? ఆయన ప్రేమ కల్వరిగిరిలో సార్థకమైనది గనుక నిత్యజీవమునకు వారసత్వం పొంది నిర్భయంగా జయజీవితం జీవించాలని నా దీన ప్రార్థన.

ఎన్నో పాపాలు చేసి, అశాంతితో, భయాలతో, వేదనతో నున్న నన్ను క్షమించి ఆయన సేవకు పిలిచిన ప్రభువు నమ్మదగినవాడు, పరిశుద్ధుడు, నీతిమంతుడు గనుక సమస్త దుర్నీతి నుండి నిన్ను పవిత్రునిగా చేయు సమర్థుడని తెలుసుకున్నావా?

నేడు నా జీవితాన్ని క్రీస్తు పాదాలవద్ద సమర్పించి ప్రతిచోట ఆయన సాక్షిగా జీవిస్తూ ఆయన సువార్త ప్రకటించే భాగ్యము పొందాను. నా సేవకై ప్రార్థించండి. ప్రభువు మీతోనుండుగాక. ఆమెన్.

ప్రేమా, ప్రేమా, ప్రేమా, ప్రేమా – యేసయ్య ద్వి ప్రేమా,
నా యేసుని మారని ప్రేమ – రుధిరము చిందిన ప్రేమా
సెలయేరులైన ప్రేమా... ఆ...
హోరికరుడను, హింస కరుడనగు నన్ను క్షమియించిన యేసు ప్రేమా...

హల్లెలూయ ఆమెన్.

# 3. ఆశ్చర్యకార్యాలు అద్భుతాలు చేయు దేవుడు నా రక్షకుడు

**జాన్‌వెస్లీ (ఎడ్లపాడు)**



**కీర్తనలు 78:4 "యెహోవా స్తోత్రార్హ క్రియలను, ఆయన బలమును, ఆయన చేసిన ఆశ్చర్య కార్యములను దాచకుండా వాటిని వారి పిల్లలకు మేము చెప్పెదము".**

**పరిచయము:-** ప్రభుని ఉన్నత నామములో మీకు శుభములు. క్రీస్తు మా కుటుంబముల పట్ల చూపిన ప్రేమ, ఆయన చేసిన అద్భుతాలన్నీ నా సాక్ష్యము ద్వారా వివరించి చెప్పాలని ఆశిస్తున్నాను. నా పేరు యేసేబు అని పెట్టగా నా తల్లి భక్తిగల విశ్వాసితో ప్రభువు సూటిగా మాట్లాడగా జాన్ వెస్లీగా మార్చారు. మా పితరులు గతంలో అన్యులుగానే జీవించేవారు. నాన్నపేరు కోటిరెడ్డి. మొదటిగా క్రీస్తును మా జీవితాలలో ప్రవేశించుటక ప్రధమ కారణము ఏమనగా మా నానమ్మ గారి అనారోగ్యము వలననే సంభవించింది.

మా నానమ్మ తన 30వ యేట భర్తను కోల్పోయింది. విధవరాలుగా నుండి ధనుర్వాతము వాతపడింది. ఆమె అన్యదేవతలందరినీ భక్తితో ఆరాధించేది. పాతాళగంగలో నీరు త్రాగింది. ఇత్తడి బల్లిని త్రొక్కింది. పుణ్యక్షేత్రాలు దర్శించేది. తనకు భయంకర వ్యాధి కల్గినపుడు అందరి దేవుళ్ళను ప్రశ్నించింది.

"నేను భక్తితో పూజించిన మీరంతా నా కష్ట సమయంలో ఆదుకోలేరా? నాతో మాట్లాడలేరా? అని ప్రశ్నించింది". ఆమె ప్రార్ధనలకు జవాబుగా ఒక దేవుడు ప్రత్యక్షమై వాస్తవాన్ని తెలియజేసాడు. "అమ్మా, నీవు ప్రశ్నించిన ప్రశ్నలకు మా వద్ద జవాబులేదు. మేము అసహాయులము. పైనున్న వాడే నిన్ను రక్షించగలడు. "అయ్యా, కనీసము నేను మరణిస్తే మోక్షాన్ని ప్రసాదిస్తారా? అన్న ప్రశ్నకు తిరిగి అదే జవాబునిచ్చాడు. పైనున్నవాడే అన్నింటికి సమర్ధుడు. సమస్తము చేయగలడు" యీ జవాబు చాలా నిరుత్సాహం కల్గించింది. ఎన్నో యాత్రలు చేసాను. పుణ్యక్షేత్రాలు దర్శించాను. నా ప్రశ్నలకు జవాబు ఏ రీతిగా తెలుసుకోగలను? నీవే చెప్పలేకపోతే నాకు తెలుసుకొనే అవకాశము ఏది? అని అడిగింది.

"అమ్మా, మీ యింటికి రేపు ఒక వ్యక్తి వస్తాడు. నిన్ను సర్వసత్యంలోనికి నడిపించే పైవాడిని గూర్చి వివరిస్తాడు కనిపెట్టుకో" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ కలలో కన్పించి

చెప్పిన మాటను నమ్మి, తర్వాత రోజు చాలా ఆశతో కనిపెట్టసాగింది. మా నానమ్మ అన్నయ్య ఆమెను దర్శించాలని వచ్చినప్పుడు ఒక క్రైస్తవ విశ్వాసియైన పాస్టరు గారిని వెంటతీసుకొని వచ్చారు.

ఆమె ఆయనను సూటిగా ప్రశ్నించింది. "అయ్యా, రాత్రి కలలో ఒక దేవుడు వచ్చి పైనున్నవాడిని గూర్చి ఒక వ్యక్తి వివరించి చెప్తాడన్నాడు. అది మీరే అయితే నాకు ఆ పైవాడిని గూర్చి చెప్తారా? అమ్మా, క్రీస్తుప్రభువే ఆపైవాడు. ఆయన గొప్ప దేవుడని నా దగ్గరున్న బైబిలు గ్రంథములో వ్రాసివుంది.

**ఫిలిప్పీ 2:10,11 "పరలోకమందున్న వారిలో గాని, భూమి మీద ఉన్నవారిలో గాని ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని కలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి ప్రతినామమునకు పైనామము ఆయనకు అనుగ్రహించెను".**

మరొక వాక్య భాగములో కూడా క్రీస్తే పైవాడని ఋజువున్నదని తెల్పాడు.

**అపొస్తలు 4:12 "మరి ఎవని వలనను రక్షణ కలుగదు. ఈ నామముననే మనము రక్షణ పొందవలెను, కానీ ఆకాశము క్రింద మనుష్యులలో యియ్యబడిన మరి యేసునామమున రక్షణ పొందుతాము" అనెను.**

ఈ సువార్త వివరాలు విన్నతర్వాత మా నానమ్మకు మరికొంత అనుమానము కల్గింది. ఎంతోకాలం నుండి సేవించిన మా దేవుళ్ళు, ముక్కోటి దేవతలు చేయలేని పనులు మీయేసు చేయగలడా? అని ప్రశ్నించింది. చాలా సహనంతో ఆ పాస్టరుగారు మరికొన్ని అనుభవాలు, క్రీస్తు సువార్తను తెల్పి, అసాధ్యాలను సుసాధ్యం చేస్తాడు. నమ్మినయెడల ఆయన మహిమను చూస్తాడు అన్నాడు.

అప్పటికే ఆమె రోగ తీవ్రతవల్ల క్షీణించి, అసహాయస్థితికి చేరినందున, పోనీ ఈ దేవుడిని నమ్మి చూస్తాను అనే నిర్ణయానికి చేరింది. ఆమెలో నున్న ప్రాణభీతిని బట్టి యేసును ఆశ్రయించాలిని ఆశించింది. ఆరాత్రి "యేసయ్యా, పైవాడివి నీవేనని తెలుసుకున్నాను. నన్ను క్షమించి నారోగాన్ని తీసివేయండి" అంటూ దీనంగా ప్రార్థించింది. ప్రార్థనలు ఆలకించే దేవుడు మనకున్నాడు. ఆ రాత్రి ఆమెకు దర్శనములో క్రీస్తు కన్పించి సూటిగా మాట్లాడారు. "అమ్మా, నేను నీ రోగాన్ని స్వస్థపర్చుచున్నాను" అని చెప్పి, ఆమెలో నున్న నల్లని పదార్థాన్ని బయటకు తీసివేస్తున్నట్లు చూపారట. మా నానమ్మ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించింది. ఆమె తోబుట్టువుల ఏడుమందిలో ఆమె మాత్రమే దీర్ఘాయువులో

104 సంవత్సరాలు జీవించింది. ఆమె జీవించినంతకాలమూ, ప్రభువుతో జీవిస్తూ, ఆయన మెల్లని స్వరాన్ని వినేది. ప్రతిపనికి సంప్రదించేది. ఆలోచనకర్తయగు దేవుడు ఆ యింటి అవసరాలను గూర్చి, యింటికి చేరు వస్తువులను గూర్చి ప్రతి విషయాన్ని స్పష్టంగా తెలిపి మా నాన్నను, యిరుగుపొరుగు వారిని, బాల్యంలో నన్ను కూడా చాలా ఆశ్చర్యము కల్గించే వివరాలు తెల్పేది. వినుట ద్వారా విశ్వాసము కల్గును గనుక మేమంతా క్రీస్తును నమ్మాము.

ఆమె గత రెండు సంవత్సరాలక్రితము ప్రభువునందు నిద్రించింది. ఆమె విశ్వాసాన్ని కాపాడుకొని అనేకులలో క్రీస్తుపట్ల ప్రేమను పెంచింది. మా నాన్న పూర్తిగా క్రీస్తును నమ్మాడు. అమ్మకూడా విశ్వాసియైనందున నేను బాల్యము నుండి దేవుని భయము కల్గి జీవించాను. యవ్వనంలోనికి వచ్చిన తర్వాత ఈ భక్తి ప్రార్థనల పట్ల చిరాకు కల్గింది. ఎప్పుడూ ప్రార్థన, వాక్యము, చర్చి కార్యకలాపాలుంటే జీవితంలో ఆనందం, సర్దాలు కోల్పోతున్నానని భ్రమపడ్డాను.

ఆ రోజుల్లో నేను ఇంజనీరింగు విద్యాభ్యాసం చేసే రోజుల్లో అనుకోని రీతిగా స్టూవర్టుపురంలో జరుగుచున్న ఉజ్జీవ కూటమునకు వెళ్ళాను. L.E.F, లీమెన్స్ ఎవాంజిలికల్ ఫెలోషిప్ వారు నిర్వహించిన మీటింగ్‌లో దైవజనుడు దానియేలుగారి పుత్రుడు జాషువా దానియేలుగారు గంభీర స్వరంతో సూటిగా మాట్లాడే మాటలన్నీ నా కొరకే చెప్తున్న అనుభూతి కల్గింది.

"ఓ యవ్వనస్తుడా, ప్రభువు నిన్ను రోజూ పిలిస్తే ఎక్కడికి వెళ్తావు? భక్తి నీకు భారముగా నున్నదా? నీ తలంపుల వల్ల తలలో ముళ్ళ కిరీటాన్ని ధరించిన క్రీస్తుప్రేమను గుర్తించలేవా? నీ చేతులతో, కాళ్ళతో చేసిన పాపాలవల్ల క్రీస్తు సిలువలో మేకులు కొట్టబడి ఘోరశ్రమలు నీ కోసం భరించాడని నమ్మగలవా? యీ మాటలు నాలో భయము కల్గించాయి. నరకములో నిత్యాగ్నికి గురికాగలనేమోనన్న భయం ఆవరించింది. నా రక్షణకై నా తల్లిదండ్రులు నానమ్మ చేసిన ప్రార్థనల ఫలితంగా నాలో నిజమైన పరివర్తన కల్గింది.

నాకు రక్షణ నిచ్చిన దేవుడు వెంటనే నా సేవ చేయ్యమని సూటిగా మాట్లాడారు. నేను బాగా చదువుకున్నాను. నాకు వివాహమయింది. నా భార్యను పోషించాలి, అవసరాలన్నీ తీర్చుకోవాలంటే నాకు ఉద్యోగం అవసరము. యింటింటికి వెళ్ళి యాచించలేను కదా! అని సంశయించాను. ప్రభువు తిరిగి నన్ను వాక్యము ద్వారా ధైర్యపరిచారు. ఆయన పట్ల ప్రేమను బట్టి ఆయన పిలుపును నిరాకరించలేకపోయాను.

**కీర్తనలు 127:3 "తన ప్రియులు నిద్రించు చుండగా ఆయన కారికిచ్చుచున్నాడు"** ఆయనే

ఇచ్చి పోషించేవాడని తెలుసుకోగల్గాను. నీ లోటులన్నీ తీర్చగల దేవుడను, నేను నీ యాజకుడనని తెల్పారు. నేను నా భార్య వినయంతో దేవుని సిన్నధి వెదకి, కలనిపెట్టి ప్రార్థించరుట నేర్చుకొనగల్గాము. నీతిమంతుడు విశ్వాసము ఆధారంగా జీవించగలడని అద్భుతాల ద్వారా మాకు ఋజువు చేసారు.

## అద్భుతాలు ఆరంభము

**మోదటి అద్భుతము:–** ఒకరోజు మా యింటిలోనికి 5 కిలోల బియ్యము తెచ్చుకొని పచ్చడితో తిని జీవించేవారము. ఆ పాత్రలోని బియ్యము మాకు 40 రోజులుగా మూడు పూటలు తినగల్గునట్లు సమృద్ధితో మా కడుపులను నింపారు. సారెపతు విధవరాలికి జరిగిన అద్భుతాన్ని చూచాము. మేము ఆ రోజుల్లోనే ఎదురింటి కుటుంబమువారు అన్నము వండుకొని రెండురోజులయిందని తెలుసుకొని మా కున్న 5 కిలోల బియ్యంలో 3 కిలోలు వారికిచ్చాము. అదొక అద్భుతమే. కానాను విందులో నీటిని ద్రాక్షారసం చేయగల్గిన అద్భుతాలు నేడు జరుగుట చూడగలము. విశ్వాసము, పరిశుద్ధత వల్ల సాధ్యమగునని గ్రహించాము.

**రెండవ అద్భుతము:–** ఒకసారి మా యింటిలో గ్యాస్ అయిపోయినందున చాలా యిబ్బంది పడ్డాము. గ్యాస్కొనే డబ్బులేదు. వెంటనే యిద్దరమూ ప్రార్థించాము. "గ్యాస్ నిండుగా వుంది, నీవు వెలిగించిచూడు అనే స్వరాన్ని నా భార్య విన్నది. నా కయితే దర్శనంలో గ్యాస్ నింపుట చూచాను. యిద్దరకూ ఒకే ఫలితము లభించింది. వెంటనే గ్యాస్ వెలిగించి చూడగా క్రొత్తగా గ్యాస్ నిండినట్లు దేదిప్యమానంగా వెలుగుట మాత్రేమే కాదు మాకు సిలిండరు 3 నెలలకు సరిపోతుంది గాని 7 నెలలుగా దానిని వాడాము. క్రీస్తు సజీవుడు. నిన్న, నేడు, రేపు ఒకేరీతిగా నుండువాడు. నమ్ముట నీవలనైతే నమ్మువానికి సమస్తము సాధ్యమగునన్న వాగ్ధానము మాపట్ల నెరవేరింది.

మా సంఘస్తులతో యీ రెండు అనుభవాల్ని గూర్చి సాక్ష్యమిచ్చాము. ఒక వృద్ధరాలు చిన్న సిలిండరుతో వంటచేస్తూ వుండేది. అది అయిపోయినందున, మా సాక్ష్యము విని ప్రార్థించింది. ఆమెకు కూడా గ్యాస్ నిండుగా వుండేటట్లు చేసి సహాయము లభించినందున సాక్ష్యమిచ్చింది. ఈ కాలములో యివి సాధ్యమా? అని ఆశ్చర్యపడవద్దు. సాక్ష్యమనగ కనని, వినని సంగతులను తెల్పుటయే కదా!

**హెబ్రీ 13:5 "తనను నమ్మిన వారిని విడువడు, ఎడబాయడు."**

దేవునిపై పరిపూర్ణంగా ఆధారపడి పరిశుద్ధంగా జీవించుట విశ్వాసి కనీస కర్తవ్యము.

**మూడవ అద్భుతము:-** ఒకసారి వాక్యపఠనములో ఏలియా జీవితాన్ని గూర్చి అద్భుతాలను ధ్యానించినప్పుడు నాకొక ఆలోచన కల్గింది. కాకి మాంసపు రుచి నోటితో పట్టినను జాగ్రత్తగా దేవుని ఆదేశానుసారముగా ఏలియా ఆకలి తీర్చుట నిజమైన అద్భుతము. దీనిని నమ్మిన నేను దేవున్ని ప్రార్థించి నాకొక అద్భుతాన్ని చూపమన్నాను. అదేమనగా నా యింట్లో టూత్‌పేస్టు లేదు. కాకిద్వారా నాకు పంపమన్నాను. మరుసటి రోజు ఉదయాన్నే యింటి ముందు 200 గ్రాముల పేస్టు పడివుంది. ఒక చివర కాకిముక్కు నొక్కివున్నట్లు గమనించి దేవున్ని స్తుతించాను. ఆయనను శోధించినందుకు క్షమించమని అడిగి దేవున్ని ఘనపర్చాను.

దేవుడు మనము అడిగితే యిచ్చేదేవుడు. మనలో విశ్వాసము చాలినంత వుండాలి. క్రీస్తుకొరకు నమ్మకంగా జీవించాలి. యెహోవా బలమును, ప్రభావమును గూర్చి దాచక యితరులకు సాక్ష్యము చెప్పాలి. ఆయన సమర్థుడు. ప్రేమించే దేవుడు. అయితే నమ్మకంగా ప్రేమించాలి. నీతిమంతుడు విశ్వాసంతో జీవిస్తాడు.

నా ఇమెయిల్

PasterJohn Wesley@rediffmail.com

మా పరిచర్యల వెబ్‌సైట్ - www.jwem.org Ph No: 8985902877

నా జీవితానుభవం చదివిన మీరు విశ్వాసంతో దేవుని వాగ్ధానాలన్నీ నమ్మాలని తెలుపగలను. పేదలకు అండగా వుండండి. మీ ప్రార్ధనా జీవితం ద్వారా, సాక్ష్యం ద్వారా పౌలులు, సైఫనులు, ఎలియా, ఎలీషా, యెహోషువా, మోషెలను లేవనెత్తండి.

**ఫిలిప్పి 4:19 "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తుయేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును"**

ప్రభువు మీ ద్వారా గొప్ప కార్యాలు జరిగించగలరని నమ్మండి. కృంగిన వారిని లేవనెత్తండి. నిన్ను నమ్మినవారు వేదనలో, బాధలలో, శ్రమలోనుంటే ఆదుకోండి. నా జీవితంలో దేవుడు గొప్ప కార్యాలు జరిగించుట, గతంలో మా నానమ్మలో ఆరంభమయిన విశ్వాస జీవితమే పునాదిగా నున్నదని నా విశ్వాసము. అన్య దేవతలను పూజించే వంశములోనుండి ప్రభువు మమ్ములను వెదకి రక్షించారు. క్రీస్తుప్రేమలో నడిపిస్తూ సాక్షిగా నిలిపారు. ఆయన ప్రేమ వర్ణించ వీలులేనిదని తెలుపగలను. నా కుటుంబముతో క్రీస్తును సేవించుచూ సాగిపోవు నావిశ్వాస జీవితం కొరకు దయతో ప్రార్థించండి. ప్రభువు దీవెన సదా మీతో ఉండుగాక. ఆమెన్.

# 4. మరణము నుండి తప్పించుట కేవలము దేవుని చిత్తమని నమ్మాను

**ఆలీపిరిజ్**



**హెబ్రీ 13:5 "నిన్ను ఏ మాత్రము విడువను, ఎన్నడును ఎడబాయను".**

**పరిచయము:-** నా పేరు ఏలి. నేనొక డాక్టరును. అమెరికాలో ఒక ప్రాంతంలో అపార్ట్‌మెంటులో నుంటున్నాను. ఒక అనుమానాస్పదమైన వ్యక్తిని గూర్చి కేసు దర్యాప్తులో కీలకపాత్ర వహించే నన్ను ఒక దుండగుడు మా యింటిపై దాడిచేసాడు.

అది సెప్టెంబరు 25వ తేదీ, 2012వ సంవత్సరములో సంభవించిన అనుభవము. అకస్మాత్తుగా పిస్టలు చేతిలోనుండి గురిపెట్టి నన్ను కాల్చాడు. నాకు ఎడమ భుజముపై పెద్ద గాయమయింది. వెంటనే నేలకొరిగిపోయాను. నేను పైకి చూచిన వెంటనే ఆ యిరుకులో నుండి యేసుక్రీస్తు నాపై చూస్తూ నేను చాచిన మరొక చేయిని తాకుటకై ముందుకు వచ్చారు. ఆయన చేతిలో ఈక ఉంది. దాన్ని కదిలిస్తూ ఏదో ఆప్యాయంగా చెప్పాలని ప్రయత్నించుట చూచాను. పైనుండి ఒక కవరు అడ్రస్ వ్రాసినది నా కందించారు. "నీవు, నిన్ను బాధించిన వ్యక్తిని క్షమించు. నేను నిన్ను క్షమించి నీకు మరణము సంభవించకుండా రక్షించాను కదా! అన్నారు. నేను స్పృహలోనే ఉన్నాను. నా వల్లకాదు. ఏ రీతిగా క్షమించగలను? అన్నాను. నీవు చేయగలవు అని చెప్పారు. నా జీవితంలో యిది అద్భుతమైన అనుభవం. క్రీస్తుప్రేమ నన్ను మార్చింది. మనకున్నది ఒకే ఒక జీవితము. ఎప్పుడు మరణించవలసి వస్తుందో తెలియదు.

**యోహాను 3:16 "దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమిస్తున్నారు".**

ప్రతివ్యక్తిని ప్రేమించగలడు. అందరము పరలోకం చేరాలని, ఆయనతో ఆనందంగా నిత్యత్వంలో గడపాలని కోరుకుంటున్నారు. యేసే రక్షకుడు. పాపాలను క్షమించే దేవుడని నమ్మాలని గ్రహించాను.

ఆ క్షణంలో మరొక అద్భుతం జరిగింది. నన్ను పిస్తోలుతో కాల్చిన వ్యక్తి కాపుకాసుకొని ఉన్నాడు. అకస్మాత్తుగా నా ముందున్న తలుపు తెరుచుకున్నది. అది ఎవరుతీసారో కలియచూచాను. అక్కడెవరూ లేరు. కేవలము క్రీస్తు నా కొరకు తలుపుతీసి నన్ను రక్షించారు. నేను వెంటనే బయటకు రాగానే కాల్పుల శబ్ధం విన్పించింది. ప్రభువు కన్పించినపుడు నేను ప్రశ్నించాను. నేను నిన్ను నమ్ముతున్నాను. నేను నీకొరకేమి చేయగలను? అని అడిగాను.

క్షమించుట, శత్రువుని ప్రేమించుట క్రీస్తుకు మాత్రమే సాధ్యమనుకున్నాను. నా అసహాయతలో 27 ఆపరేషన్లు నాపై జరిగాయి. నన్ను నేను డాక్టరునయినా బహుగా వినయంతో తగ్గించుకొన్నాను. నా శత్రువుకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. నేనతనిని క్షమించాను. నేను వైద్యునిగా పదవీ విరమణ తర్వాత నా జీవితం ఆయనకు పూర్తిగా అర్పించి ఆయనే నిజమైన గొప్పదేవుడని నా ఊపిరిఉన్నంత వరకు సాక్షిగా జీవించుటకు నిర్ణయించుకొని ప్రతిచోట ఆయనను గూర్చి సాక్ష్యమిస్తూ ఆయన ప్రేమలో సాగిపోవుచున్నాను.

క్రీస్తుప్రేమను ఎవరూ వర్ణింపలేరు. తనను చంపిన వారిని చూచి వీరేమి చేస్తున్నారో వీరికి తెలియదు. వారిని క్షమించమని చెప్పిన ప్రేమగల క్రీస్తును అనుకరిస్తూ సైఫనును రాళ్ళతో కొట్టి చంపిన సమయంలో క్రీస్తువలె వాళ్ళను క్షమించలేదా? నా ప్రాణాపాయంలో నా కొరకు తలుపుతీసి నన్ను రక్షించిన క్రీస్తుకొరకు నేను నా శత్రువును క్షమించాలి. ఆయన కనబడి చెప్పిన ఆజ్ఞను పాటించుట నా కర్తవ్యమని నమ్మాను. ఎంత విద్యావంతులైనా, విద్యా విహీనులైనా క్రీస్తుప్రేమకు అర్హులేనని నమ్మాలి. నీకు నా సాక్ష్యము స్ఫూర్తినిస్తే నిన్ను బాధించేవారిని క్షమించగలవా? ప్రభువు కృప నీతోనుండుగాక. ఆమెన్.

---------

## 5. క్రైస్తవుడిగానే క్రీస్తును ఆలస్యంగా తెలుసుకోగల్గాను

**అశోక్‌హివాలె**



**సామెతలు 28:13** "అతిక్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు. దానిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును".

నా బాల్యము ఒక మంచి క్రైస్తవులుగా నున్న తల్లిదండ్రుల పెంపకములో పెరిగినను క్రీస్తును ప్రేమించలేదు. నాన్న సంఘకాపరిగా నుండేవారు. అందరివలె సామాన్య క్రైస్తవునిగా చాలా పాపాలు చేసేవాడిని. అబద్ధాలు చెప్పేవాడిని. సినిమాలు చూచుట, దొంగతనము చేయుట, ముఖ్యంగా తరగతిలోని విద్యార్థుల పుస్తకాలు దొంగిలించేవాడిని. చేయి చూచి జ్యోతిష్యము చెప్పుట నేర్చుకోగల్గాను. యీ అక్రమమైన పాప జీవితంలో రాజీపడి జీవిస్తూ మనశ్శాంతిని పూర్తిగా కోల్పోయాను.

మా యింటికి వచ్చే అతిథులలో ఒక అంకుల్‌గారు నా పరిస్థితిని బాగా గమనించి నన్ను చేరి నా పాపస్థితినుండి క్రీస్తును చేరి పశ్చాత్తాపంతో పాపాలన్నీ ఒప్పుకోమని సువార్త బోధించారు. ఆయన చూపిన ప్రేమ, ఆయన సలహా నాకు నచ్చినందున నాకు కరువైన శాంతికోరి క్రీస్తును ఆశ్రయించాను. నా పాపస్థితిని ప్రభువు చాలా స్పష్టంగా చూపించారు. హస్త ప్రయోగము చేయుట పాపమని తెలియలేదు. జ్యోతిష్యమును నమ్ముకొనుట తప్పని తెలుసుకున్నాను. నేను చేసిన దొంగతనాలన్నీ ప్రభువు సన్నిధిలో ఒప్పుకొని క్షమాపణ కోరాను.

నేను ప్రభువు దగ్గర పాపాలన్నీ ఒప్పుకున్న తర్వాత ఆయన నన్ను పూర్తిగా క్షమించారనే నిశ్చయత కొరకై వేచియున్నాను. దైవ వాక్యము ద్వారా సూటిగా ప్రభువు మాట్లాడారు.

యెషయా 44:22 "మబ్బు విడిపోవునట్లుగా నేను నీ అతిక్రమములను, మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచి వేసియున్నాను. నేను నిన్ను విమోచించియున్నాను. నా యొద్దకు మళ్ళుకొనుము".

నా మనస్సులో సంశయాలన్నీ మాయమయిపోయాయి. ప్రశాంతత నాలో నిలిచింది. బైబిలు చదువుటలో ఆసక్తి పెరిగింది. చాలా వాక్యాలను కంటస్తము చేయసాగాను.

నా విద్యాభ్యాసము సవ్యంగా కొనసాగించి బి.ఎ.పూర్తిచేసాను. దేవుని సేవ చేయాలన్న ఆసక్తి కల్గింది. పుస్తకాలు ముద్రించుట, కరపత్రాలు తయారుచేసి యితరులకందించుట, అన్య భాషలలో నున్న బైబీలు సందేశాలను తర్జుమా చేయుటలో నా జీవితంలో 28 సుదీర్ఘ సంవత్సరాలను వినియోగించాను.

యింకనూ ఆయన పాదసేవలో నిమగ్నమయ్యాను. దేవుని చెంతనే మన జీవితంలో బద్రత దాగియుంటుందని తెలుసుకున్నాను. ఆయనే మనందరి సంరక్షకుడు. తెలిసి తెలియని జ్ఞానంతో మనుష్యులను నమ్మించి జరిగినవి జరగబోవు సంగతులు చెప్పే జీవితానికి పూర్తిగా స్వస్తి చెప్పాను. భక్తుల సహవాసంలో నున్న ధన్యతను గ్రహించాను. క్రమమైన క్రైస్తవ విశ్వాస జీవితాన్ని కొనసాగించి అనేకుల అభిమానాన్ని, గౌరవాన్ని పొందాను. నాలో పాపములేని జీవితం గమనించి క్రీస్తును గూర్చి తెలుసుకోవాలన్న వారికి తగిన కరపత్రాలు యిచ్చి దేవుని ప్రేమను తెలియజేయుటలో ఆనందిస్తున్నాను. క్రీస్తు పరిశుద్ధుడు. మనము కూడా పరిశుద్ధ జీవితం జీవించాలని కోరు. ప్రభుని ఆశ్రయించు. ఆమెన్.

# ౬. క్రీస్తే సజీవుడు. మార్గము సత్యము జీవము గల దేవుడని నమ్మాను

(ఏలూరు)



యోహాను 14:1 'మీ హృదయము కలవరపడనీయకుడి. దేవునియందు విశ్వాస ముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి".

పరిచయము:- నా పేరు కల్పన. మాది ఏలూరు. బాల్యంలో క్రైస్తవ సంస్థలో చదువుకొన్నాను. నా తరగతిలోని పిల్లలందరము కలిసి క్రైస్తవులు ఆరాధించే సమీపంలో నున్న చర్చికి సర్దాగా వెళ్ళేవారము. మేము అన్య దేవతలను పూజించేవారము గాని క్రీస్తుప్రభువు యెడల చాలా ప్రేమ, నమ్మకముండేది. ఒకసారి పిక్‌నిక్ ఏర్పాటు ఏర్పాటుచేసి ఆరోజుల్లో ఒక్కొక్కరిని 3 రూపాయిల చొప్పున డబ్బు చెల్లించమని టీచరు చెప్పారు. మాకు డబ్బులులేవు. మా స్నేహితులము ముగ్గురము క్రీస్తును అడిగి ప్రార్ధన ద్వారా పొందాలని తీర్మానం చేసుకొని చర్చికివెళ్ళాను. "ప్రభువా మా నాన్నగారు వచ్చి నాకు డబ్బులు కట్టేరీతిగా నాకు సహాయము చేయండని అడిగాను. అద్భుతముగా నేను కళ్ళుతెరిచి చూచేసరికి మా నాన్న కనబడ్డారు. నా ప్రార్ధనలకు జవాబిచ్చారని నమ్మాను. డబ్బులు యిచ్చినందున ఆనందంగా పిక్‌నిక్‌కి వెళ్ళాను.

నేను హిందువుగానే పెరిగి, హిందువుల వ్యక్తిని వివాహమాడాను. బిడ్డలు కలిగారు. అన్ని దేవుళ్ళకు ప్రార్థించేదాన్ని. యేసు ప్రభువును ప్రార్థిస్తే జవాబిస్తాడని బాల్యంలోని రోజులు జ్ఞాపకము చేసుకున్నాను. ఎందుకయినా మంచిది యేసును సేవించాలనే మనస్సు కల్గి చర్చికి వెళ్ళాను. మంచి పాటలు, ఆరాధన తర్వాత బైబిలు వాక్యాలు, బోధనలు విన్నాను. నాకు చాలా ఆనందము కల్గింది. 7 రోజులు ఉపవాసముండి ప్రార్థించినచో మనము కోరినవి దేవుడిస్తారని ఆ పాస్టరుగారు తెలిపారు.

ఆ తర్వాత ఒకన్నయ్య తెల్లబట్టలతో కన్పించి "అమ్మా, అమ్మ నాన్న లేకపోయినా నీకు నేనున్నాను" అన్నారు. తప్పకుండా యేసయ్య ఆ మాటలు చెప్పారని నమ్మాను. క్రీస్తునే వెంబడించి అన్య దేవతలకు దూరమయ్యాను. నాలో వింతైన శాంతి కల్గింది. క్రమంగా చర్చికి వెళ్ళి దైవసందేశాలు విన్నాను. విశ్వాసము కల్గింది. బాప్తీస్మము అవసరమని

గ్రహించాను. ప్రభువే నన్ను మంచి మార్గములో నడిపించారు. నా అవసరాలన్నీ ఆయనకు చెప్పి ధైర్యంగా జీవించసాగాను.

నాకున్న ఆడపిల్లల వివాహాలు చేయవలసిన సమయము వచ్చింది. కట్నము యివ్వవలసి వచ్చింది. పాస్టరుగారితో చెప్పాను. “అమ్మా, దేవునికి చెప్పు, ఆయన అన్ని సమస్యలకు జవాబు నిస్తారన్నారు. ఒక స్థలము అమ్మి డబ్బు పొందాలని తలంచాను. 50 వేలు యిస్తామని ఒక ఆఫీసులోని వ్యక్తులు అభయమిచ్చారు. కొద్దిరోజులలో పెండ్లి జరుగనై యుండగా ఆ ఆఫీసు మూసివేసారు. చాలా ఖంగారు పడ్డాను.

నాకు మంచి ప్రార్థనాత్మ గల ప్రార్థనా గుంపుతో పరిచయముంది. ప్రతి సమస్యలలో ప్రార్థన ద్వారా దేవుని సహాయాన్ని కోరేవారము. సరిగ్గా మా పాప పెండ్లి దగ్గరకు వచ్చి, పెండ్లి కూతురిని చేయు సందర్భములో ఒక సోదరి నన్ను సమీపించి “కల్పనగారూ, మీరు ఆశించిన డబ్బు దొరికిందా?” అని అడిగింది. పరిస్థితి చెప్పాను. ఒకసారి మా యింటికిరండి అని పిలిచింది. వెళ్ళి సంప్రదించగా ఆమె బ్యాంకువారి టోకెన్ 50 వేలు విలువగలది నాకిచ్చింది. “మీరు వెళ్ళి బ్యాంకులో సొమ్ము తీసుకోండి అని సహాయము చేసింది.

కేవలము దేవుడే యీ సహాయాన్ని అందించి మేలు చేయకటకు నా ప్రార్థనా గుంపులోని సోదరిని ప్రేరేపించినందున దేవునికి కృతజ్ఞత తెల్పాను. మానసికంగా ఆంధోళనలను తొలగించు దేవుడు. అవసరాలు తీర్చు దేవుడు. ప్రతి వ్యక్తి క్రీస్తును ఆశ్రయించి మేలు పొందాలని నా ప్రార్థన. అన్యుల కుటుంబములో జన్మించి, జీవించి బాల్యంలో నమ్మిన క్రీస్తును తలంచగానే అద్భుతాలు చేసిన ఆ ప్రభువుకే మహిమ. ఆమెన్.

## 7. క్రీస్తులో నిలిచి మంచి సాక్షిగా నుండుట తెలుసుకున్నాను

**యోహాను రెడ్డి (కరీము నగర్)**

**కీర్తనలు 119:66 "నేను నీ ఆజ్ఞలయందు నమ్మికయుంచి యున్నాను. మంచి వివేచన మంచి జ్ఞానము నాకు నేర్పుము".**



**పరిచయము:–** పసితనంలో పరిపక్వము లేనివానిగా నిర్లక్ష్య జీవితాన్ని జీవించాను. నామకార్ధ క్రైస్తవునిగా జీవించినను క్రమంగా క్రీస్తుప్రేమలో నిలిచి మంచి సాక్షిగా మారాను. క్రీస్తు స్వరూపంలోకి మారే క్రైస్తవునిగా మారుటకు చాలా కాలము పట్టింది.

మా నాన్న పేరు మామిడి గంగారెడ్డి గారు. బాగా త్రాగుడుకు బానిసగా యిష్టానుసారంగా జీవించేవాడు. మరణభయం కల్గి, ఒకసారి సెటిలైట్‌లో పడి అందరూ చనిపోతారన్న భయముతో నున్నప్పుడు సోమయ్యగారనే విశ్వాసి పరిచర్యల ద్వారా క్రీస్తునుగూర్చి తెలుసుకొని ఆ శక్తిని ఆశ్రయించి మంచి విశ్వాసిగా జీవించారు. ఆయన భక్తి ప్రభావము మాకు సహాయపడింది.

మొదటిగా నాన్నగారు చర్చికి వెళ్ళాలని బలవంతం పెట్టినా వెళ్ళేవాడిని కాదు. ఆటలపై ఆసక్తి వుండేది. మా నాన్న పాస్టరుగా మారి దైవసేవలో నుండేవారు. నేను 10వ తరగతి పూర్తిచేసిన తర్వాత ఇంగ్లీషు నేర్చుకోవాలంటే బైబిలు కాలేజీ చాలా ఉపయోగపడగలదనే స్వంత జ్ఞానంతో ఆ సంస్థలో చేరాను.

2001వ సంవత్సరములో బైబిలు కాలేజీలో చేరిన తర్వాత ఆలోచనలు క్రొత్తగా చెలరేగాయి. విజయవంతమైన క్రైస్తవ జీవితము ఎలా జీవించాలి? మంచి క్రైస్తవ కుటుంబములో జన్మించిన చాలునా? బాప్తీస్మం ద్వారా మంచి జీవితం జీవించగలనా? వాక్యం చదివి ప్రార్థించగల్గితే చాలునా? అసలు క్రీస్తును నమ్మి ఆయన బిడ్డగా అధికారము పొందాలని ప్రసంగాలు విన్నానుగాని రక్షణానుభవం గానీ, నా పాపాలు క్షమించబడిన నిశ్చయతలేని జీవితంలో చాలా కాలము గడిపాను.

ఒకసారి మా నాన్న గారితో చర్చికి వెళ్ళగా మంచి సువార్త బోధించే దైవజనుడి ద్వారా క్రీస్తు సందేశాన్ని శ్రద్ధగా విన్నాను. క్రీస్తు ఎందుకీలోకానికి వచ్చారు? ప్రతివ్యక్తి కోసం వచ్చారని నమ్ముట మాత్రమేకాదు నీకోసం, నీ ఒక్కడి రక్షణ కోసం కూడా వచ్చారని

నమ్మగలవా? క్రీస్తులో క్రొత్త జీవితం, ఎంతో శాంతితో, ఆనందంతో, తృప్తితో నిండినదై ఆదర్శంగా నుండి అందరి మన్ననలు పొందగల్గినదని తెలుసుకోగల్గితే నీవీరోజే తీర్మానము తీసుకోవచ్చును. ఎందుకు ఆలస్యం చేసి గొప్ప రక్షణను నిర్లక్ష్యము చేస్తున్నావు? అని హెచ్చరించగా నా హృదయంలో కలవరము చెలరేగింది. నాన్నగారి జీవితము వారి ఆదర్శము హెచ్చరికలు స్ఫూర్తిగా నిలిచాయి. ఎంతకాలము వ్యర్ధంగా జీవించగలను? నాకు క్రీస్తులో మంచి జీవితము జీవించే ధన్యత కావాలనిపించి, యేసూ, నన్ను దయతో క్షమించి నీ బిడ్డగా చేర్చుకో అని ప్రార్థించిన వెంటనే గొపప నెమ్మది, ఆనందం నాలో నెలకొన్నది.

మారు మనస్సు పొందుట అంటే పాపాలు క్షమించబడిన నిశ్చయత కల్గుట అని పూర్తిగా గ్రహించి క్రొత్త ఆశయాలతో జాగ్రత్తగా జీవించుటకారంభించాను. నాలో కల్గిన మార్పును నాతోటివారు గమనించి, నా సీనియర్స్ అభినందించారు.

2001వ సంవత్సరము అక్టోబరు 14వ తేదీ నా ఆత్మీయ పుట్టినరోజుగా, మరపురాని రోజుగా దేవుని స్తుతించుట నా భాగ్యముగా భావిస్తాను. నాలో వింతైన ఆలోచనలు కల్గాయి. పాస్టరుగారు వివేకంతో, జ్ఞానంగా బోధించిన పద్ధతి ద్వారా నాలాటివారు క్రీస్తును నమ్మినట్లుగా నేనుకూడా ఆత్మీయంగా బలపడి సేవకునివలె దైవసేవ ద్వారా యితరులను రక్షణానుభవంలోకి నడిపించాలనే ఆత్మలభారము కల్గింది. అదే నిర్ణయంతో ప్రార్థించాను.

నాలో గణనీయమైన మార్పు కల్గింది. 6 నెలల తర్వాత నా యింటివారంతా నాలో మార్పును గమనించారు. నేను వేదాంత కళాశాలలో చదివిన 4 సంవత్సరాలలో అనేక విభిన్న సమస్యలను ఎదుర్కొన్నాను. ప్రతిరోజూ శ్రద్ధగా బైబిలు చదివి ధ్యానించి ప్రార్థించుకొనేవాడిని. నాకన్న ముందుగా కోర్సు ముగించినవారు మా కాలేజీలో ప్రవేశించి కాలయాపనచేస్తూ నెలకు 10 రోజులుగా మాతో క్యాంపస్‌లో కలిసి వుండేవారు. డబ్బు అవసరాలు తీర్చాలని అడగాలని వచ్చేవారు. వారు వృథాగా సమయాన్ని గడుపుట గమనించి బాధపడేవాడిని. సరియైన సేవచేయు పద్ధతి అది కాదని గ్రహించాను.

**మత్తయి 6:31 "యేమి తిందుమో, యేమి త్రాగుదుమో, యేమి ధరించుకుందుమో అని చింతింపకుడి. అన్య జనులు వీటి విషయమై విచారింతురు. మీకు ఏమి కావలెనో పరలోకపు తండ్రికి తెలియును. కాబట్టి మీరు ఆయన రాజ్యమును, నీతిని మొదట వెదకుడి అప్పుడు అన్నియు మీకనుగ్రహింపబడును.**

ప్రప్రథమంగా దేవుని రాజ్యమును గూర్చి ధ్యానిస్తూ, ఏ అవసరాలు తీరకపోయినా, నివాసము ఉన్ననూ లేకపోయిననూ సేవలో ముందుకు సాగాలనే నిర్ణయంతో సాగిపోయాను. అద్భుత రీతిగా నా ఆశనుబట్టి మేడగది అనే సర్ధిలో చేరాను. వారంతా డబ్బులకాశించే వారుకాదు. దసరా సెలవులలో 2006వ సంవత్సరంలో భారభరితసేవ చేయుచుండగా వారితో ఏకీభవించాను. ఆ యువకులంతా యితరుల ఆత్మల రక్షణార్ధము ప్రాణము పెట్టుటకు తెగించే సాహసం గలవారు.

ఆ రోజుల్లో లీడరుషిప్ క్యాంపు నిర్వహించగా క్రీస్తుసేవలో ఉన్నత ఆశయాలు ఎట్లు కల్గియుండాలి అనే అంశమును గూర్చి చాలా స్పష్టంగా వివరించారు. చక్కని క్రియాత్మక అనుభవాలను నేర్పించారు. సేవా భారంతో శ్రమలనెదుర్కొనుట నేర్చుకొన్నాను. నేర్చుకొన్న విషయాలు జీవిత గమనములో ఆచరించాలని తెలుసుకున్నాను. దేవుని చిత్తమును కొనుగొనుట చాలా అత్యవసరమని గ్రహించి నా సేవను కొనసాగించాలంటే నేనెట్టు సేవచేయాలో దేవుని చిత్తాన్ని కనుగొన గల్గాను. ఎట్టి క్లిష్టపరిస్థితులు ఎదురైనను నిత్యము దేవునిపై ఆధారపడాలని నేర్చుకున్నాను. సాధారణంగా సైతాను చేతులలో నలిగిపోవు వారిని విడిపించాలంటే శ్రమించాలి. యిబ్బందులు ఎదుర్కోవాలి. యివన్నీ ఓర్పుతో భరించి సేవలో ముందుకు పోదలిచాను. గతంలో

**అపొ 4:21 "వీరిని శిక్షించు విధమేమియు కనుగొనలేక వీరిని గట్టిగా బెదిరించి విడుదల చేసిరి".**

ఆది క్రైస్తవులు ఎన్నో నింద దూషన బెదిరింపుల నెదుర్కొని ధైర్యము కొరకు ప్రార్థించారు. ఆ రోజుల్లో స్టీపెన్ అనే సోదరుని ద్వారా విశ్వాస యాత్రలో మెళుకువలను నేర్చుకొనగల్గాను. యువకులు, చిన్నవారల జీవితాల్లో దైవపరిచర్య చేయుట కవకాశాలు కల్గించారు. యీ పరిచర్యలలో శ్రమపడేవారి సమస్యలు తీర్చుట కూడా సేవలో భాగమని తెలుసుకోగల్గాను. ఎటు గమనించినను కోత విస్తారము పనివారు కొద్దిమందిగానున్నారని తెలుసుకున్నాను.

**మత్తయి 9:31** కోత కోయాలంటే పనివారు కావాలి. కోతకు పనివారిని పంపాలని ప్రార్థించాము. గొప్ప భక్తుల జీవిత చరిత్రలు, విశ్వాస జీవితంలో అభివృద్ధి కల్గించే పుస్తకాలు కొని లైబ్రరీలో నుంచి అందరూ చదువుకొనగల్గు అవకాశాలు కల్గించాము. అనాధ బాల బాలికలు చదువుతున్న సంస్థలలో వారి అవసరాలు తీర్చు విధానాలు వెదకి వారిని సంరక్షించుటకు దేవుడే సహకరిస్తున్నారు.

వివిధ ప్రాంతాలలో క్రీస్తు జీవితము, బోధనలు ఆధారంగా వీడియో ఫిల్ములు, పాటల సి.డి.లు ఉపయోగించి అన్ని వయస్సులలో నున్నవారు కూడా ఆత్మీయంగా బలపర్చుటకు ప్రయాస పడుచున్నాము. స్థానికి సంఘస్తులు గణనీయమైన సహకారాన్ని అందిస్తున్నారు. మా పరిచర్యలో ప్రతివ్యక్తికి రక్షణ నందించి వారిని క్రీస్తు స్వభావము గలవారిగా మార్చాలనే ధ్యేయంతో సాగిపోతున్నాను.

ఉచితంగా సేవచేస్తూ అనేకమందిని క్రీస్తును ప్రేమించే వారిగా మార్చాలని నా ఆశయము. దేవునికి మహిమ కల్గాలి. మా పరిచర్య ఈ నవసమాజానికి అత్యవసరమని గ్రహించి దేవుని సహాయంతో మంచి సేవచేస్తూ దేవున్ని ఘనపర్చుచున్నాను.

నా సెల్ నంబరు 9573858568


నా వెబ్ సైట్, నా ఇమెయిల్ Christian Philosophy tv@gmail.com

నా సేవకై ప్రార్థించండి. ప్రభువు తోడుగా నుండుగాక ఆమెన్.

# 8. అయోగ్యురాలనైన నన్ను ప్రభువు గుర్తించి ప్రేమించి గొప్ప జీవితమిచ్చారు

క్రైస్టల్ బీర్లో (అమెరికా)

**యోహాను 14:27 "శాంతి మీ కనుగ్రహించి వెళ్ళుచున్నాను. నా శాంతినె మీకనుగ్రహించుచున్నాను".**



**పరిచయము:-** నేను అమెరికాలో నున్న మంచి కుటుంబములోనే జన్మించాను. కాని నా బాల్యం చాలా వింతగా గడిచింది. చాలా బిడియంగా, సిగ్గుగా ఉండేది. నేనంటే నాకే యిష్టత ఉండేది కాదు. నేను అందంగా లేననియు, యితరులెవ్వరూ నన్ను ప్రేమించలేరనే ఆత్మనూన్యతా భావం నాలో ఉండేది. నాలుగు, ఐదు గ్రేడులు చదివే రోజుల్లో సౌత్ కారొలీనా వెళ్ళి నివసించే రోజుల్లో అందరూ క్రొత్తవారే. అంతా క్రొత్తగా ఉండి చాలా దిగులుగా ఉండేది.

నా కెవరూ స్నేహితులుండేవారు కారు. చాలా సిగ్గుతో కుంచుకుపోయేదాన్ని. ఎలా అందరితో స్నేహంగా ఉండాలో తెలియక స్కూలుకు వెళ్ళాలంటే చాలా బాధగా ఉండేది. నాకాళ్ళపై నేను నడిచి వెళ్ళాలనిపించేది కాదు. నా స్నేహితులుగా చేసుకోవాలని వారిని చేరినప్పుడు "నీవంటే, నీ మాటలంటే మాకు చిరాకుగా ఉంది. నీ వంటేనే మాకసలు యిష్టంలేదు" అని చాలా స్పష్టంగా చెప్పి బాధించేవారు.

ఒక్కొక్కసారి అద్దములో నా ప్రతిబింబాన్ని చూచుకొని ఎందుకు నన్ను అందరూ యిష్టపడుట లేదేమి అని చాలా బాధకల్గేది. వారి బెదిరింపులు నన్ను గాయపర్చేవి. ఇక హైస్కూలులో చేరాక నేనే కాస్త గంభీరంగా ఉండేదాన్ని. నా పరిస్థితి కాస్త మారింది. నేను చాలామంది కంటే మంచిదాన్నని గుర్తించారు. నాకు కూడా మంచి స్నేహితులు చేరువయ్యారు.

నన్ను యిష్టపడే ఒక బాయ్‌ఫ్రెండ్ కూడా లభించగా కాస్త ఆనందం కల్గింది. ఆ తర్వాత గతంలో ఎంతో సంతోషంగా గడపవలసిన బాల్యాన్ని చాలా కోల్పోయానని చాలా దు:ఖపడ్డాను. గ్రాడ్యుయేషన్ పూర్తయింది. నా బాయ్‌ఫ్రెండ్‌తో వివాహం ఆశించాను. అతనికి ఆర్మీలో చేరాలని ఆశ కల్గింది. నాకు ఇమెయిల్ చేసి సంతోషపెట్టేవాడు. గతంలో నా తల్లిదండ్రులు క్రీస్తు గురించి చెప్పేవారు గానీ నాకాసక్తి ఉండనందున నాకు క్రీస్తుప్రేమ, త్యాగము, సందేశాలు నాకసలు తెలియని స్థితిలో చాలాకాలము గడిచింది. నా జీవితంలో

నా కొరకు దేవుడు దాచియుంచిన మేలు ఎంతో గొప్పదని గ్రహించలేని మూర్ఖురాలిగా జీవించాను. నాకు కాబోయే భర్త నా బాయ్‌ఫ్రెండ్ ఆర్మీనుండి వచ్చిన తర్వాత వివాహ ప్రయత్నాలు చేయు సమయంలో మా అత్త మామ గార్లు విశ్వాసులైనందున నన్ను వారితో దేవాలయానికి తీసుకొని వెళ్ళాలని ప్రయత్నించేవారు. నాకు యిష్టత లేనందున నాకు అర్జంటు పని వుందని తప్పించుకోవాలని ప్రయత్నించాను. పని వున్నదని అబద్ధాలు చెపి ఆదివారమంతా పనిచేసే స్థలంలో గడిపేదానిని.

ఒకసారి మా అత్త మామలు తప్పనిసరిగా రావాలని బలవంతం చేసి వెంటబెట్టుకొని తీసుకొని వెళ్ళారు. చాలా చిరాకుగానే వారితో కూర్చుని దైవసేవకుని సందేశాన్ని వినుటకు తప్పించుకోలేక పోయాను. చుట్టూవున్న వారిని గమనించి చూస్తే అందరూ అతి శ్రద్ధగా వాక్యం వినుట గ్రహించాను.

నాలో కాస్త మార్పు కల్గింది. ఏమైనా క్రొత్త విషయాలు తెలుస్తాయిని తలంచి మా అత్త మామలను సంతోషపెట్టాలనే తలంపుతో శ్రద్ధగా వాక్యము విన్నాను. వారు పాడే పాటలు ఆరాధన కాస్త ఆకర్షించాయి. క్రమంగా చర్చికి వెళ్ళుట కారంభించిననూ, నా హృదయంలో తగిన స్పందన రాలేదు. నా భర్తగా రాబోయే వ్యక్తిని దూరం చేసుకోదలచలేదు. నా బాయ్‌ఫ్రెండ్ ప్రేమ పొందాలంటే వారి తల్లిదండ్రులను గౌరవించాలని తలంచి ఆసక్తితో చర్చిలో ఆరాధనలో పాల్గొన్నాను.

ఒకరోజు నా బాయ్‌ఫ్రెండ్ తిరిగి ఆర్మీకి వెళ్ళిపోయారు. మరలా ఒంటరితనం మిగిలింది. ఆ తర్వాత నా వివాహము జరిగింది. క్రొత్తగా కెంటకీ, అమెరికాలో స్థిరపడ్డాము. భర్తను నమ్మి, ఆయనను ప్రేమిస్తూ, దేవునిని ఘనపరచాలని నా తల్లిదండ్రులు హెచ్చరించేవారు. మేమున్న ప్రాంతానికి సమీపంలోనున్న చర్చికోసం వెబ్‌సైట్‌లో వెదికాము. మేమున్న స్థావరానికి 45 నిమిషాలు ప్రయాణము చేస్తే ఆ ప్రాంతంలో నున్న మంచి చర్చికి ఆరాధనలకు వెళ్ళాము. వారి మంచి సందేశాలు బోధించే వారు. వారి బోధనలు నాకు నచ్చాయి.

నేను కూడా బాప్తీస్మం తీసుకొని క్రీస్తును వెంబడించాలని కోరుకున్నాను. నాలో ఆశాజ్యోతి వెలిగింది. క్రీస్తు ప్రేమలో నున్న ఔనత్యాన్ని గ్రహించుకోగల్గాను. నా బలహీనతలన్నీ ఒప్పుకొని క్రీస్తు అందించే రక్షణను స్వీకరించాను. నాలో తెలియని శాంతి, ఆనందము కలుగగా నా భర్తతో తెలిపాను. మంచి క్రైస్తవులుగా జీవించాలంటే బాప్తీస్మము అవసరమని గ్రహించాను.

మా అత్త మామలు, నా భర్తతో కలిసి చర్చికి వెళ్ళాము. నా భర్త కూడా బాప్తీస్మం తీసుకున్నారు. మా భారం పూర్తిగా తొలిగిపోయింది. నా భర్తను చాలా ఆప్యాయతగా గొప్పగా ప్రేమించుట కారంభించాను. జీవితాన్ని, నా పరిచయస్తులను నమ్మకంగా ప్రేమించుట కారంభించి మంచి నెమ్మది పొందగల్గాను. గతంలో నున్న ఆత్మన్యూనతా భావాలన్నీ తొలిగిపోయాయి. నన్ను మాటలతో బాధించిన వారందరినీ ప్రేమించుట అవసరమని గ్రహించాను.

ఒకసారి నా కారులో ప్రయాణం చేస్తూ మంచి క్రైస్తవ విశ్వాసులు పాడిన పాటలు వింటున్న సమయంలో There is no greater love than me “నా ప్రేమకంటే మించిన ప్రేమ లోకానలేదు” అనే అర్థము గల మాట విన్నాను. ఆ స్వరం అతి మధురంగా, శ్రావ్యమైన గొంతుతో పలికిన రీతి చూడగా యేసు నన్ను గుర్తించి ప్రేమించుచున్నారని నమ్మాను. అది నాకున్న విశ్వాసాన్ని అధికము చేసింది. కొండంత బలాన్నిచ్చింది. నా జీవితంలో క్రీస్తును గూర్చి ఆయన ప్రేమను గూర్చి సాక్ష్యమిచ్చుటకు బలపర్చింది. గత జీవితంలో గడిపిన నిరుత్సాహ చిహ్నాలేమీ నాలో లేవు. ప్రతి దినము నూతన వాత్సల్యంతో దేవుడు నన్ను ప్రేమిస్తూ కాపరిగా నన్ను నడిపించుట ద్వారా చాలా ఆహ్లాదకరంగా జీవితాన్ని కొనసాగిస్తున్నాను.

నా చిన్న జీవితంలో నేర్చుకొనిన గొప్ప సత్యమేదనగా దేవుని దృష్టి యదార్థ వంతులను బలపర్చుటకు దినమెల్లా సంచారము చేస్తుంది. ప్రతి ఒక్కరిని సృష్టించుటలో గొప్ప ఉద్దేశ్యము దాగివుంటుంది. అది అనుదిన ప్రార్థన, వాక్యపఠనము ద్వారానే సాధ్యమవుతుంది. ఆయన మెల్లని స్వరం వాక్యం ద్వారా గ్రహించి ఆయనకు లోబడుట ప్రతి విశ్వాసి కర్తవ్యము. దేవునిని అధికముగా ప్రేమించుట మన కర్తవ్యము. ఆయనను మహిమపర్చి ఘనపర్చుటకు నిత్యము ఆరాధన మన మనస్సులో వుంచుకోవాలని నేర్చుకోగల్గాను. అప్పుడే మన జీవితాలకు అర్థం లభిస్తుంది.

గతంలో తెలియని స్థితిలో చాలా నిరాశ, దు:ఖంలో మంచి ఆనందంలో జీవించు అనుగ్రహం అనుభవించక నష్టపడ్డాను. ఎన్నో శ్రమలు, నిరాశలు దాటి నిత్యానందం లభించే గొప్ప పెన్నిధియైన క్రీస్తు ప్రేమను రుచిచూచి ఎరిగాను. నా హృదయారాధన అంతా “ఎందుకో నన్నింతగా నీవు ప్రేమించితివో దేవా

అందుకో నా దీన స్తుతి పాత్ర –హల్లెలూయ యేసయ్యా ॥

నా వలె గతంలో నున్న నిరాశతో నుండే వారికి నా సాక్ష్యం నిరీక్షణాధారంగా నిలిచి దేవున్ని మహిమపర్చాలని ఆయన ప్రేమను గర్తించాలనేది నా సందేశము. దేవుని కృప మనతో నుండు గాక. ఆమెన్.

## 9. పై రూపాన్ని కాక నా రక్షకుడు నా హృదయాన్ని లక్ష్య పెట్టునని గ్రహించాను.

హనోకు (ఆంధ్రప్రదేశ్)



**యెషయ 62:3 "నీవు యెహోవా చేతిలో భూషణ కిరీటము గాను, నీ దేవుని చేతిలో రాజకీయ మకుటముగా నుందువు".**

**పరిచయము:–** ప్రభువు నామములో మీకు నా వందనాలు. నా పేరు హనోకు. నేనొక అంగవైకల్యము గల వ్యక్తిగా యీలోకానికి కన్పించినను నన్ను గుర్తించి నాకు విలువైన రక్షణానుభవం గల జీవితాన్ని ప్రసాదించి ఆయనను సదా కీర్తించి కొనియాడే ధన్యతనిచ్చిన దేవునికే నా కృతజ్ఞతలు.

నేను మరుగుజ్జు ఆకృతిలో జన్మించాను. నేను రక్షణ టి.వి.లో పాడిన పాట నా జీవిత సాక్ష్యాన్ని వివరించగలదు.

ఓ యేసు ప్రభూ, నా యేసు ప్రభూ – ఇల బ్రతుకు లేనేలేదు నాకు
నీ కృపతో నన్ను రక్షించి – నాకై మరణము పొందితివి
ఏ యోగ్యత లేని నాకు త్యాగము చేసితివి
నీ కృపతో నాకు జీవమిచ్చి నాకై శాపము పొందితివి
నేను పాపినని తెలిసి ఎంతో త్యాగము చేసితివి
ఓ యేసూ, నా యేసూ – నా జీవితం నీకే అంకితమయ్యా

అని ఉచితముగా రక్షణ టి.వి.లో పాడే అవకాశాన్నిచ్చిన గొప్ప మనస్సున్న కార్యకర్తలకు నేను కృతజ్ఞత తెల్పుకుంటున్నాను. నాలాటి వికలాంగులు ఎందరో పాటలు పాడి ఆరాధించే కృప దేవుడిచ్చారు. ఫిలిప్పు రాంబాబు గార్లు భక్తిగల దేవుని బిడ్డలుగా దేవుని ప్రేమను బట్టి యోగ్యతలేని మమ్ములను, మా ఆత్మీయ జీవితాన్ని గుర్తించి, ప్రోత్సహించి దేవున్ని ఘనపర్చుటలో మాకు చేయూతనిస్తున్నారు. నిస్వార్థముగా సేవచేయు బిడ్డలను దేవుడే ఏర్పరచుకొని ఆరాధన అందుకుంటున్న నా యేసయ్యకేమివ్వగలను? నా రక్షణ పాత్రతో స్తుతించగలను.

మాలాటి వారిని పెద్దవారికి పరిచయము చేసి డబ్బు సంపాదించుకోవచ్చునని నన్ను ప్రలోభపెట్టారు గాని క్రీస్తు కొరకే జీవించాలని నిర్ణయించుకున్నాను. ఒకసారి

మా పాటలు క్రైస్తవ టి.వి. కార్యక్రమములో పాడే అవకాశము అడిగినప్పుడు వారు నీలాంటి అంగవైకల్యము గలవారికి అవకాశమిస్తే ప్రజలు విమర్శిస్తారు, ప్రశ్నిస్తారు. ఏమనగా క్రీస్తు కుంటి, గ్రుడ్డివారిని బాగుచేసారు కద! యీ వ్యక్తిని బాగుచేయలేదేమి? మా టి.వి.కి అర్హులు కాదన్నారు.

ఆ తర్వాత బాధపడిననూ, ఆశ వీడక మరొక ఛానల్ వారిని ఆశ్రయించగా సాల్మన్‌గారు అంగీకరించి నన్ను ప్రశ్నించారు. "హనోకూ, నీవు మరుగుజ్జుగా నున్నావన్న బాధ నీకు రాదా?" నాకా ప్రశ్నను బట్టి దేవున్ని గూర్చి సాక్ష్యమిచ్చే అవకాశం కల్గింది.

నేనే స్థితిలో వున్ననూ నా దేవునికి కృతజ్ఞత కల్గి వింతగా నున్న నన్ను చూచిన వారికి క్రీస్తు ప్రేమను ప్రకటించే గుర్తింపునిచ్చారు. సామాన్య జీవిగా జన్మించినచో మీరు ప్రశ్నించే అవసరత రాదు, నాలో ప్రత్యేకత నాలో క్రీస్తుపట్ల ప్రేమ ఆరాధన, సాక్ష్యము మరుగై పోయేది కదా సార్, అని జవాబిచ్చాను.

2004లో నన్ను కేబుల్ టి.వి.కి పరిచయం చేయగా నాటినుండి నేటివరకు డబ్బులు కోరుకోకుండా రక్షణ టి.వి.లో నాకు ప్రవేశం కల్గించారు. గ్రుడ్డివాడైన రవిశంకర్, సిరివెల్ల హానోకు గారి రచనలను, గీతాలను మేమంతా క్రమంగా పాడి కీర్తించుట ప్రభువు సంకల్పముగా భావిస్తున్నాము. ప్రజలు పైరూపాన్ని లక్ష్యపెట్టుదురు గాని ప్రభువు అంతరంగాన్ని, వారికి గల భక్తిని క్రీస్తుపట్ల ఆరాధన, ప్రేమను గుర్తించి ప్రోత్సహించగలరని నేనునమ్మి మంచి ఉద్యోగములో నుంటూ సేవచేయు భాగ్యమిచ్చిన దేవునికి నా కృతజ్ఞతలతో వందనాలు సమర్పిస్తున్నాను. నా ఆకారము నన్ను భక్తునిగా గుర్తించు ధన్యతనిచ్చింది. దేవునికే స్తుతి మహిమ కల్గునుగాక ఆమేన్.

# 10. సాధారణ వ్యక్తినైన నన్ను అసాధారణ అద్భుతాలకు సాక్షిగా నిలిపారు.

రాబ్బీ కైర్న్ క్రాస్ (అమెరిక)



**యెహెజ్కేలు 37:14 "నేను యెహోవానై యున్నానని మీరు తెలిసికొందురు. మీరు బ్రతికునట్లు నా ఆత్మను మీలో ఉంచి మీ దేశములో మిమ్మును నివసింపజేసెదను. యెహోవానగు నేను మాట ఇచ్చి దానిని నెరవేర్తునని మీరు తెలిసికొందురు; ఇదే యెహోవా వాక్కు".**

**పరిచయము:–** నేనొక అతి సామాన్య వ్యక్తిని. ప్రభువు నన్ను మార్చి గొప్ప అద్భుత దర్శనాల ద్వారా అనేకుల జీవితాలకు క్రీస్తును ప్రేమించు వారిగా మార్చు ధన్యతనిచ్చి ఆయన చిత్తములో గొప్ప సాధనముగా నేడు అనేక ప్రాంతాలలో వుపయోగించుకొనుచున్నారు. నేను మీమధ్య యీ సాక్ష్యము వివరించుట కేవలము క్రీస్తు నాకొరు మరణించిన గొప్ప త్యాగ అనుభవ ప్రభావమే.

**బాల్యము:–** నేను 1962వ సంవత్సరములో జన్మించాను. నా తల్లిదండ్రులెవరో నాకు తెలియదు. ఎవరో పుణ్యాత్ములు నన్ను పెంచుకున్నారు. దక్షిణ ఆఫ్రికాలో అందమైన పట్టణములో నాబాల్యం జార్జి అనే పేరున్న ప్రాంతములో గడిపాను. ఒకటవ తరగతిలోనే చదువులో ప్రగతి చూపలేనందున తృణీకరించబడ్డాను. ఏదోరీతిగా హైస్కూలు వరకు చదువు కొనసాగించగా డ్రగ్స్ ప్రభావము నాపై నున్నందున నన్ను గెంటివేసారు. ఆ పరిస్థితులలో రోషములో కష్టపడి చదివి ప్రలలో గుర్తింపు పొందాలని చాలా శ్రమపడ్డాను.

ఒంటరి పోరాటములో అకుంటిత దీక్షతో అంచెలంచలుగా పైకి రాగల్గాను. వ్యాపారములో మెళుకువలెన్నో సంపాదించి చాలా ధనికుడనయ్యాను. ఎందరో ఆశ్చర్యపడు రీతిగా మిలియన్లు సంపాదించాను. అప్పటికిక నా వయస్సు కేవలము 27 సంవత్సరాలుండేవి. లోకంలో లభ్యమైన సుఖాలు, వస్తువులు, స్నేహితులు ఎన్నో వనరులన్నీ పొందాను గాని నిజంమైన ప్రేమ, శాంతి నేను ఎక్కడా పొందలేదు. నా గుండెల్లో దిగులు పోలేదు. అసంతృప్తిగల జీవితాన్ని గడిపాను. అన్ని సమయాల్లో సంపాదించిన సొమ్మును బ్యాంకులో జమచేసే దారిలో ఒక చర్చి ఉండేది. ఒక్కొక్కసారి ఆ చర్చికి వెళ్ళి చందాలు యిచ్చేవాడిని. ఎన్నో సంవత్సరాలుగా అదే దారిగుండా వెళ్తూ చర్చిబైట నున్న చందా

పెట్టెలో చందా డబ్బులు వేసేవాడిని కానీ ఎన్నడైనా లోనికి ప్రవేశించలేదు.

ఒకరోజు దగ్గరలో నున్న హొటలులో కాఫీ త్రాగు సమయంలో ప్రక్కనున్న వ్యక్తి దారిలోనున్న చర్చి పాస్టరుగా పరిచయం చేసుకున్నారు. దేవుని ఆత్మ ప్రేరేపించినందున వెంటనే చాలాసొమ్ము చందా యిచ్చాను. డర్బన్, దక్షిణ అమెరికాలో ప్రభుని స్థలము (The Lord's Place) సరిగ్గా ఆచర్చి అవసరాలకు సరిపడు సొమ్ము రాబ్బీగారిచ్చారని నన్ను చాలా ప్రశంసించి కృతజ్ఞత తెల్పాడు. చర్చి లోపలికి రమ్మని ఆప్యాయంగా ఆహ్వానించాడు. పాస్టరుగారు చూపిన ప్రేమ ఆదరణ ఆకర్షించగా నేను చాలా సంతోషంగా ఆయన మాటల్ని విని క్రీస్తు సువార్తను వినే అవకాశము ద్వారా ఆరోజే రక్షణను స్వీకరించాను.

పాపక్షమాపణ నిమిత్తమైన ప్రార్ధన చేయువిధము నేర్పించారు. చెప్పనశక్యమైన సంతోషము నా హృదయంలో ప్రవేశించి శాంతిని అనుభవించాను. క్రీస్తు అద్వితీయ ప్రేమను రుచి చూచాను. గొప్ప ఆదరణ లభించగా పరిశుద్ధాత్మతో నింపబడి నూతన అనుభవాన్ని పొందాను. యిహలోక బంధాలు, తాపత్రయాలు, అవసరాలు, వైభోగాలన్నీ అత్యవసరము కాదని గ్రహించాను. వీటిపై జయము పొందాను. ఏది లోటైనదో అది పొందుకోగల్గాను. ఇక ఆచర్చి సహవాసంలో, ప్రార్ధన, వాక్యధ్యానము, సహవాసంలో కొనసాగాను.

1997వ సంవత్సరములో వేదాంత విద్యాభ్యాసము ద్వారా క్రీస్తు వాక్యమును మరింత ఎక్కువగా తెలుసుకొనగోరాను. క్రీస్తు కొరకు సాక్షిగా జీవించాలనే తపన ఆరంభమైనది. 1998వ సంవత్సరములో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసాను.

2002వ సంవత్సరములో డాక్టరేటు సంపాదించాను. హొలీ నేషనల్ కాలేజీలో ప్రతిభగల విద్యార్ధిగా నిలిచాను. ఇక బైబిలు కాలేజీలలో ప్రసంగించ సాగాను. SACOB (South Chamber of Bussiness) సంస్థలో ప్రముఖ వ్యక్తిగా వ్యవహరించాను. ఆ తర్వాత బ్రౌన్ విన్ (Bron Win) తో వివాహం జరిగింది. ఆమె కూడా నాతో మిషనెరీ సేవలలో చురుకుగా పాల్గొనేది. ప్రభువు మా వివాహ జీవితాన్ని ప్రేమించి యిద్దరు అమ్మాయిలనిచ్చారు. ఇశ్రాయేల్‌కి 9 సంవత్సరాలు, టెహిల్లాకు నాలుగు సంవత్సరాలున్నాయి. నా జీవితమంతా దేవుని సన్నిధి అనుభవించుటకే యిష్టపడుచున్నాను.

**1 కొరింథి 12:28 " మరియు దేవుడు సంఘములో మొదట కొందరిని అపొస్తలులు గాను, పిమ్మట కొందరిని ప్రవక్తలుగాను, పిమ్మట కొందరిని బోధకులుగాను, అటుపిమ్మట కొందరిని అద్భుతములు చేయువారిని గాను, తరువాత కొందరిని స్వస్థపరచు కృపావరములు**

**గలవారినిగాను, కొందరిని ఉపకారములు చేయువారినిగాను, కొందరిని ప్రభుత్వములు చేయువారిని గాను, కొందరిని నానా భాషలు మాటలాడువారినిగాను నియమించెను".**

ఆత్మీయ వరాలనింపుదలతో నా జీవితము స్వస్థతలు, అద్భుత కార్యాలు చేయుటకు ప్రభువు నన్ను సిద్ధపరిచారు. ఉపవాసము చేయు రోజులలో అద్భుత దర్శనాలనిచ్చి ఆయన సేవచేస్తూ స్వస్థత కూటాలను నిర్వహించి అనేకులకు పరిచర్య చేయాలని ప్రభువే నాకు తెల్పారు. ఆయన స్పష్టమైన సన్నిధి నాలో వుటుందని వాగ్ధానము చేసారు.

ఎందరో పాపములు ఒప్పుకొన రక్షణానుభవాన్ని పొందుట, వ్యాధిగ్రస్తులు వెంటనే స్వస్థత పొందుట, ఆత్మాభిషేకముతో ఆత్మీయ వరాలు పొందుట దర్శనాలు చూచుట, పరిశుద్ధాత్మ ఉనికి స్పష్టంగా ప్రదర్శన జరుగుట ద్వారా ప్రభువు గొప్పగా మహిమపర్చుకొనుట ప్రతి దినము దినచర్యగా నా జీవితము మారింది.

**అద్భుత అనుభవాలు ఆరంభము:–** ప్రభువు నన్ను ముఖాముఖిగా దర్శించారు. క్రీస్తు లోక పాపములు మోసుకొనిపోవు గొఱ్ఱెపిల్లగా, యూదా గోత్రపు సింహముగా, సజీవుడైన క్రీస్తుగా కనపరచుకున్నారు. ఆయన రాజ్యము స్థాపించుటకై నన్ను ఎన్నుకున్నారు. నాకు సాక్షి సమూహములో కొందరిని చూపించారు. వారి ద్వారా ప్రోత్సాహకరమైన హెచ్చరికలను పొంది ఆనందించాను.

ప్రభువుతో నా దర్శనాలు స్థానిక వార్తా పత్రికల వారు మొదటి పేజీలో ప్రకటించుట దేవుని కృప. అనేకులు దానిని చదివి నా మీటింగులలో ఆత్మీయమేలు పొందుచున్నాను. వాక్యము కాగితముపై నిర్జీవంగా కన్పించవచ్చును గాని, అది సజీవంగా శక్తితో నింపబడి క్రీస్తుతో మనలను ఐక్యపర్చాలని నా ప్రార్ధన.

ప్రభువు నా స్వంత సోదరునిగా నాముందు నిలిచి మాట్లాడేవారు. ఒక్కొక్క సారి నేను మాట్లాడితే వినేవారు. యిద్దరము కలిసి నడిచేవారము. క్రీస్తు దర్శనంలో ఆయన ఆకృతి అంత పొడవు కాదు, బలంగా కూడా లేదు, సన్నగా లేదు, పొట్టిగా లేదు, పొడవైన వెంట్రుకలున్నాయి. భుజము మీదుగా వుంటాయి. కొన్నిసార్లు గెడ్డం కన్పించేది. ఆయన వస్త్రాలు ఫ్యాషన్‌గాలేవు. అయిననూ పురాతనంగా కూడా లేదు. మొలకెత్తిన గోధుమగింజ రంగులోనున్నాయి. వదులుగా, పొడుగ్గా నున్నాయి. ఆయన వస్త్రాలు సరిగ్గా సరిపోయినట్లుగా నున్నాయి. క్రీస్తు చాలా దయగల వానిగా నున్నారు. ప్రేమామయునిగా, ప్రేమించదగిన వానిగా, సున్నితమనస్కునిగా కన్పించారు.

ఒక సముద్ర తీరంలో నన్ను కలిసారు. నాకోసం కనిపెట్టుట గమనించాను. ఆయన చేయిచాచి కరచాలనము చేసారు. నన్ను చూచి పలుకరించారు. వెల్‌కమ్ అన్నారు. నేనయితే మిమ్ములను చూచుట నాకానందంగా వుందన్నాను. చిరునవ్వుతో నాకూ సంతోషమే అన్నారు. నాకేమీ సందేశ మివ్వలేదు గాని నాకు ఆయన స్వంతమైన వాడనని కనపరచుకున్నారు. నా స్నేహితులిద్దరిని ప్రభువు నన్ను కలిసిన చోటుకు తీసుకొని వెళ్ళగా వారు కూడా ప్రభుని సన్నిధిని అనుభవించి ఆనందించారు. చాలా సార్లు ప్రభువు దర్శనమిచ్చారు.

ఒకసారి నన్ను కలిసినప్పుడు పేరుపెట్టి పిలిచారు. “రాబ్బీ, పైకి వచ్చి నన్ను కలుసుకో” నాకయితే ఏరీతిగా పైకి రావాలో నాకర్ధము కాలేదు. నా ఆత్మతో ఆయన మాట్లాడారని గ్రహించాను. “పైకిరా, పైకిరా, నీ వెక్కడ వున్నావో అక్కడనుండి రావాలి. పక్షిరాజు పయనించినట్లు పైకిరా” అన్నారు. రమ్మని పిలిచిన పిలుపు ఆత్మీయంగా ఉన్నత స్థానంలో ఆత్మీ ఎత్తులను తాకుటకేనని విశ్వాసి గ్రహించాలి.

గతంలో మోషేను పైకి రమ్మని పిలువగా వెళ్ళాడు. అది పర్వతమెక్కుట కాదు. భయాలనుండి, ద్వేషాలనుండి, అసహనము నుండి పైకి రావాలని అర్ధం కావలెను. తెరువబడిన పరలోక దృశ్యాలను చూడాలని ఆత్మీయ లోతుల్లోకి విశ్వాసిని నడిపించాలని ప్రభువు కోరుకుంటారు.

2008వ సంవత్సరము సెప్టెంబరు 17వ తేదీ 11.30 ఎ.యమ్ సమయంలో ప్రార్ధించు చుండగా పరలోకము తెరువబడింది. క్రీస్తు తన దర్శనంతో పాటుగా నలుగురు వ్యక్తులు కన్పించారు. వారెవరో నేను గుర్తించలేదు. మొదటిగా చూచిన వ్యక్తి కాస్త పొట్టిగా వుండి నల్లని పొడవైన వుంగరాల జుట్టుతో నున్నాడు. ఆయన పరిశుద్ధ పౌలుగా గుర్తించాను. “రాబ్బీ, ఎన్ని అవాంతరాలు ఎదురైనను, ఓర్పుతో విశ్వాస జీవితంలో సాగిపో” అన్నారు.

రెండవ వ్యక్తి ఎలీషా కన్పించి “నీవు చూచిన పరలోక దర్శనాలన్నీ అందరికీ వివరించి  చెప్పి అందరి విశ్వాసాన్ని బలపర్చు” అని తెల్పారు.

మూడవ వ్యక్తి దావీదు మహారాజుగా గుర్తించాను. ఎత్తైన వ్యక్తిగా సాదా జుట్టుతో గంభీరంగా నిలిచి, అలయక, సొమ్మసిల్లక సాగిపోవాలి. నిరుత్సాహము దరికి రానీయకు” అని హెచ్చరించాడు. చివరిగా అబ్రహాము నన్ను చూచి “నీవు నిబంధన జనముతో ఏకత్వం కల్గియున్నావు. అందరినీ నీ వారిగా విశ్వాసంతో నమ్మి వాస్తవాలను గుర్తెరిగి నమ్మకంగా దేవునిలో జీవించు” నాకు కన్పించిన వారు వేరే తరాల అంతరాలైనను,

ఐక్యంగా, ఆనందంగా కలిసి స్నేహభావంతో కలిసి మాట్లాడుట ఆశ్చర్యం కల్గించింది. మహిమాన్వితమైన ఆనందము వారి ముఖాలలో వెల్లివిరిసింది.

క్రీస్తు నావైపు తిరిగి "నా కుమారుడా గొప్ప సాక్షి సమూహముల మధ్య నీవున్నావు. ఉత్సాహము తెచ్చుకో, ప్రోత్సహించుటకై వచ్చాము. వారంతా నీన్ను నీసాక్ష్యమును కన్నులారా చూడడానికి వచ్చారు. పరలోకంలో నున్న వారంతా భూలోకంలో ఏమి జరుగుతుందో తెలుసుకోవాలనే ఆశలేని వారిగా నుండి నశించే వారి కొరకై ఆసక్తి గల వారిగా నుంటారు. క్రీస్తు నాతో చెప్పిన సందేశ మేమనగా నేను దర్శనంలో చూచినదంతా సాక్ష్యము చెప్పాలని ప్రతిమాట వివరించాలన్నారు.

**యెహోవా దేవుని ఉనికి దర్శనము**

**యెషయా 6:2 "దేవుడు ధవళ సింహాసనాసీనుడై పరిశుద్ధుడని దూతలు పొగడుచుండగా కెరూబులు సెరూపుల మధ్య నుండునని యెషయా వివరించాడు".**

అది 2008వ సంవత్సరము ఏప్రిల్ 15వ తేదీ మంగళవారము రోజున సింహాసీనుడైన దేవుని సన్నిధికి దర్శనము ద్వారా కొనిపోబడ్డాను. ఆ స్వరాలు, మాటలు నేను వ్రాయుటకు అర్హత, యోగ్యత, సమర్ధత లేనివాడనుగా నున్నాను. నేను నా శరీరముతోనే నున్నాను. సముద్ర తీరాన బల్ల దగ్గర కూర్చున్నాను. నా ఆత్మ మాత్రమే పయనిచుంట గ్రహించాను.

యోహాను తెల్పిన రీతిగా ఆత్మవశుడనయ్యాను. సింహాస నాసీనుడైన దేవుడు స్థలము ఒక గదికాదు. అది హాలుగాని భవనం కాదు. దేవుని సన్నిధి ఊపిరి తీసిన రీతిగా ఉంది. ఊపిరిలో ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసలో మేఘాల కదలిక కన్పించింది. నిచ్ఛ్వాసలో క్రీస్తు ఆకృతిగల రూపంగా రూపొందింది. దేవుని మహిమ అల్లల్లాడుట మగనించాను.

ఒకపెద్ద గారి ఆకృతి అనగా డోనట్ ఆకృతిగా మధ్యలో రంధ్రమున్నట్లు దానిగుండా విశ్వం కనిపస్తుంది. సింహాసనము ఒక పెద్ద కుర్చీకాదు. అది కేంద్ర స్థలము. అది విస్తరించి ఉంది. ఆయన నేను, నేను ఆయన కలిసివున్నాము. అప్పుడే ఆయనతో సమస్తాన్ని చూచి గ్రహించగలము. సమస్త సందేశాలు ఆ సన్నిధి నుండి వస్తున్నాయి. దానిని బట్టి నా ఉనికి చలనము ఆధారపడి యున్నాయి. ఆ సన్నిధి చివరకు క్రీస్తు ఆకృతిగా మారి కన్పించింది.

**యోహాను 7:38 "నాయందు విశ్వాసముంచు వాడెవడో లేఖనము చెప్పినట్లు వాని కడుపులో నుండి జీవజలములు పారునని బిగ్గరగా చెప్పెను".**

క్రీస్తు చెప్పిన మాట నెరవేర్పును చాలా స్పష్టంగా చూచి ఆశ్చర్యపడ్డాను. ఆ అనుభవము నేను స్వస్థతా ప్రార్ధనలు చేయునప్పుడు నా ముందున్న వారంతా నేను నా శరీరము రూపాంత అనుభవం ద్వారా క్రీస్తులో లీనమైపోయిన రీతి ధవళ సింహాసన సన్నిధి నుండి పరిశుద్ధాత్మ నా నుండి క్రీస్తు రూపము రుగ్మతలున్న వ్యక్తిని తాకుట ద్వారా రక్షణ, స్వస్థత లభించుట స్పష్టంగా చూడగల్గాను. నా సేవ గమనించిన వారు దర్శనముల గూర్చి సాక్ష్యమిచ్చుట ద్వారా దేవుడు నన్ను తనలో దాచుకొని నన్ను సేవకు ఉపయోగించుచున్నారు.

వాక్యములో చెప్పబడిన రీతిగా భూమి దేవుని పాద పీఠము, పరలోకము ఆయన సింహాసనా స్థలము. పరిశుద్ధాత్మతో నిండిన అనుభవంతో దూర భారాలు లేవు. ఆయన సన్నిధి పరలోకాన్ని భూమిని ఏకం చేస్తూ స్పర్శించగలదు.

నేను ఐగుప్తులో సేవ జరిగించే సమయంలో ఒక వ్యక్తి అరకిలో మీటర్ల రూరం నుండి దేవుని సన్నిధిని అనుభవించానన్నాడు. దేవుని కుడి పార్శ్వమున నున్న క్రీస్తు నాలోనుండి స్వస్థతా స్థలంలో యిద్దరం కలిసి ఆత్మరూపంలో స్వస్థత కోరిన వ్యక్తిని తాకు సాక్ష్యానుభవం చాలా ఆశ్చర్యం కల్గిస్తుంది. ఆ సమయంలో నా ఆత్మ సింహాసనా స్థలమును చేరి నా కడుపులోనుండి జీవజల నదిగా ప్రవహించిన ఆత్మ ఎదుటి వ్యక్తిని తాకినపుడే స్వస్థతలభిస్తుంది.

ఆఫ్రికాలో కారూ ప్రాంతంలో వర్షాలు లేనప్పుడు నేను మీటింగుచేసి వచ్చిన వెంటనే గతంలో లేనట్టి వర్షాలు లభించాయిన సాక్ష్యమిచ్చారు. భూమిని ఫలింపజేయు సమర్ధుడు క్రీస్తు మాత్రమే. మానసిక గాయాలతో ఒత్తిడి కల్గిన వారు విడుదల పొందుట సంతోషము, ఆనందము లభించుట చూచాను. చేతులు, కాళ్ళు లేనివారికి ఆత్మద్వారా ప్రార్ధించగా అవి ఏర్పడుట చూచాను. పాపం నుండి విడుదల పొందుట, సకల వ్యాధులు సమసిపోయి స్వస్థత పొందుట గమనించాను. వివిధ శాపాలు నుండి విముక్తి పొందారు.

కృపా సింహాసనము నుండి వింతైన వెలుగు కదిలే రంగులతో చలిస్తున్న మేఘాల ఉనికితో కన్పించేది. ఆ వింత శబ్ధాలనెన్నడూ నేను వినలేదు. ఆ శబ్ధాలు మేఘాలను కదిలించేవి. మహిమతో నిండిన మేఘాల చలనాన్ని చూచాను. క్రీస్తు ఆ మహిమ నుండి మానవాకారంతో చలించుట చూచాను. ఆయన సన్నిధి మహిమాన్వితమై, శాంతి నిండినదై, సాత్వీకముతో శక్తి గలదై యున్నది.

**బెతస్థ కోనేరు దర్శనము:–** ఒకరోజు ప్రార్థనలో దర్శనము ద్వారా పైన కప్పులేని హాలును చూచాను. బెతస్థ కోనేరు చుట్టూ ప్రజలున్నారు. పరలోక మహిమ నిండిన మేఘము ద్వారా వింతైన కాంతితో దూతలు ఎక్కుచు దిగుచుండుట చూచాను.

అది 2007వ సంవత్సరము నవంబరు 5వ తేదీ. ఆ దూతల పేర్లు క్రీస్తును అడిగాను. దూతలు నా లక్షణాలలో మిళితమైనవారు. నా మాట నెరవేర్చుటకై కృషి చేస్తారని తెల్పారు. క్రీస్తు ఆ దూతల పేర్లు కొన్ని తెల్పారు. ఓర్పు, ఆనందము, నీతి, నమ్మకత్వము, మంచితనము, దయ, కృప, క్షమ, ఐక్యత మొదలగు పేర్లు తెల్పారు.

2007వ సంవత్సరము డిసెంబరు 5వ తేదీ 6000 మంది దూతలను విడుదల చేసారు. వారు 600 మంది 10 గుంపులుగా మారారు. ఒకసారి పది అంతస్థుల ఎత్తులోనున్న దూతను చూచాను. మాటలలో ఆ శక్తి గల దూతను గూర్చి వర్ణించలేను. నేను చాలా చిన్న ఆకృతితో నుండి భయపడ్డాను. నన్ను తాకినపుడు చాలా శాంతి లభించింది. ప్రపంచంలో పెద్ద పెద్ద నాయకుల సమక్షానికి తీసుకొని వెళ్ళగా వారి హృదయాలు భయముతో బంధీలుగా నున్నట్లు గ్రహించాను.

చాలా కాలము తర్వాత ఆ పెద్దదూత బైబిలుతో బెతస్థ కోనేరు వద్ద 38 సం॥ల వృద్ధుడు ఆశించిన దూత కలచే నీటి ప్రాంతంలో పనిచేసిన దూతగా గ్రహించాను. దూతల దర్శనము మొదటిగా 1999వ సం॥రము 19వ తేదీన అర్జెంటీనాలో కల్గింది. విశ్వాసమును బట్టి దర్శనాలు పొందగలము. నాకు కన్పించిన దూత 10 అంతస్తుల భవనమున్నంత ఎత్తుగానుండి, ఆ శక్తి గూర్చి వర్ణించలేనంత వైభవంతో నుండగా కాస్త భయపడిననూ, నన్ను తాకినపుడు వింతైన శాంతి పొందాను.

2008వ సంవత్సరము మే 15వ తేదీ చూచిన దర్శనములో దూతలు రోడ్డున కిరువైపుల వరుసగా నిలుచుట చూచాను. ఆ తర్వాత వారు సిలువ ఆకృతిగా ఏర్పడి నిలిచారు. సందేశమందించుటకే వారు వచ్చారు గనుక అది సిలువ సందేశమే. ఒక మోకాలుతో నిలిచి మెడలువంచి యున్నదూతలు మనలో కొందరము సువార్త బోధించునప్పుడు మన సందేశాలను సరిగ్గా తెల్పుటకు సహాయం చేయుటకు ఆత్మలతో బలపర్చుటకై సంసిద్ధంగా నున్నట్లు గ్రహించాను. దర్శనములో ప్రభువు సన్నిధి నాలో తీనమైనప్పుడు అంగవైకల్యముతో నున్నవారు స్వస్థత పొందుట, ముక్కువిరిగిన వ్యక్తి స్వస్థత పొందుట, గుండె జబ్బుగలవారు, గాయపడినవారు, మానసిక గాయాలు గలవారు స్వస్థత పొంది ఆనందించారు.

నా ముందు, వెనుక, ప్రక్క దూతలు సిలువ ఆకారంతో నిలుచుట చూచాను. ఆ సిలువ చీకటిలో గొప్పగా ప్రకాశిస్తూనే ఉంది. ఆ వెలుగు ప్రతి దూతనుండి వెలువడుతూ పరలోకాన్ని ప్రతిబింబిస్తుంది. దవళ సింహాసనం నుండి వస్తున్న కాంతి ప్రతిదూత వద్ద చూడగల్గాను. సింహాసనము నుండి లభించే సందేశము క్రీస్తు సిలువయే. ప్రతిదూత సింహాసనము నుండి వెలుగును, శక్తిని స్వీకరించుచూ మహిమను ప్రదర్శించుట చూచాను. ప్రభు సన్నిది తరంగాలుగా నన్ను తాకుతుంది.

2008వ సంవత్సరము మే నెల 17వ తేదీ చెవులుగల వాడు వినును గాక అన్నట్లు దూతల సంతోషాలు, సందేశాలు ఆత్మవశులమైతే వినగలము. నేను చూచుచుండగా ఒకవ్యక్తి సందేశాన్ని వినుటలేదు. అతని చుట్టూ దూతలు లేరు. ఆశగలవారి ప్రాణాన్ని మాత్రమే తృప్తిపర్చు దేవుడని గ్రహించాలి.

Namaq wal and నన్ను ఆహ్వానించిన ఒక ప్రాంతంలో ఒక స్త్రీకి నడుము నొప్పితో పాటు కాలునొప్పి వున్నందున చాలా నిరాశతోనున్నది. ఆమెతో దేవుడు మాట్లాడారు. నా తలంపులు నీ తలంపుల వంటివి కావు. అది 2008వ సంవత్సరము మే 16వ తేదీ, రెండవ రాత్రి మీటింగు సమయంలో ప్రార్ధించింది. "ప్రభువైన యేసూ నీ చిత్తమైతే నన్ను తాకుము" వెంటనే పరిశుద్ధాత్మ శక్తి తాకుట ద్వారా క్రీస్తు ఊపిరిని నేననుభ వించాను. ఆత్మీయ నేత్రాలతో దర్శనంలో నేను ఆమె కాళ్ళవద్ద నిలిచినట్లుగా చూచింది. తూర్పువైపుగా తిరిగి నేను ప్రార్ధించు చుండగా ఆమె క్రీస్తు వస్త్రాన్ని తాకుచున్న అనుభవంతో ఆమెకళ్ళు తెరిచింది. దేవుని సన్నిధి తీవ్రంగా నున్నందున ఆమె కళ్ళు మూసుకొని ప్రార్ధించసాగింది. క్రీస్తు ఆమెతో సంభాషించుట గమనించింది.

ఒక పెద్ద హస్తము నన్ను తాకింది. అదే హస్తము నా మెడపై చేతినివేస్తూ నావైపు త్రిప్పింది. నేను చూస్తూ వుండగా ఆమె బాగా ఏడుస్తుంది. ప్రభువు స్వరంతో ఆమెతో మాట్లాడారు. "అమ్మా, నీ పాపాలకై నేను మరణించాను. సిలువ మోసి చనిపోయి పాతి పెట్టబడి తిరిగి లేచాను.

ప్రభువా నీ మాటలు నమ్మనందుకు క్షమించు అని అడిగింది. నీ సిలువను మోస్తూ నిన్ను వెంబడిస్తానని తెల్పింది. అంతేకాదు నీ ఆత్మతో నింపు. నీ సాక్షిగా వుంటానని తెల్పింది." అమ్మా, నీ చేతులు ఆశీర్వదింపబడినవి. వ్యాధిగ్రస్తులకు స్వస్థత, దెయ్యములను వెళ్ళగొట్టు ధన్యత పొందగలవని క్రీస్తు ఆమెతో చెప్పారు. నా సన్నిధిలో మోకరించు. నేను నీ రాజులకు రాజును. ప్రభువులకు ప్రభువునని తెల్పారు.

నేను నిన్ను ఎన్నుకున్నానని కూడా ఆమెకు తెల్పారు. నేను అర్హురాల్నికాను అని స్తుతించసాగింది. ఆత్మతో నింపబడి దూతల సమూహము మధ్య నిలిచింది. నా శరీరములో వెచ్చని భావం కల్గింది. చేతులెత్తి వుంచమన్న ఆదేశము ఆమె వినింది. నీకు నేనిచ్చిన వరాల్ని వాడుకో స్వస్థతా వరాన్నిస్తున్నానన్నారు.

నానామమును ఘనపర్చు రీతిగా పాటలుపాడు వరాన్ని వాడుకో. నన్ను ఆరాధించు అని ఆమెకు తెల్పారు. ఆమె పరమానంద భరితురాలై దేవుని కృపావరాల్ని, ఆత్మను పొంది ఆనందించింది. ఆదివారం ఆరాధనలో సాక్షిగా నిలిచి పాటలు పాడి ఆరాధించి దేవున్ని మహిమపర్చింది.

ఆమె పేరు మేరి. ఆమె వంటి సాక్ష్యాలు నా పరిచర్యలో అనేకమున్నాయి. ప్రభువు ఎన్నికలేని నన్ను తన సేవకై ఏర్పరచుకొని దివ్యదర్శనాలనిచ్చి ఆత్మవశముతో క్రీస్తుతో ఏకమై గొప్ప అద్భుతాలు, సూచక క్రియలు చేయు కృపావరాలతో అభిషేకించి వాడుకొనుచున్నారు. ఆయనకే సదా మహిమ కల్గుగాక. మీకు అట్టి ధన్యత కావాలంటే క్రీస్తు దరికి రండి. ఆయన మెల్లని స్వరం వినండి. ప్రభువు మిమ్ములను దీవించుగాక ఆమెన్.

# 11. నేను నమ్మిన దేవుడు అప్పుల బాధ నుండి విడిపించారు

**కిరణ్(దుబాయ్)**



**ఎఫెసీ 2:13 "క్రీస్తు యేసునందు క్రీస్తు రక్తము వలన సమీపస్థులై యున్నారు".**
**ఫిలిప్పీ 4:19 "దేవుడు తన ఐశ్వర్యము చొప్పున ప్రతి అవసరము తీర్చును".**

**పరిచయము:-** ప్రభువు నామములో మీకు శుభాకాంక్షలు. నేను మంచి జీవితం జీవించాలని ఆశించాను గాని ఎన్నో ఆర్థిక యిబ్బందులు పడ్డాను. దుబాయిలో ఉద్యోగము చేయదలచి కుటుంబము లో జీవించే రోజుల్లో గతంలో నా భార్య గోవాలో రిట్రీటులో ప్రభువును రక్షకునిగా స్వీకరించింది. 1995లో దుబాయి వెళ్ళాను. 1996లో బ్యాంకులో అప్పుచేసాను. అప్పటినుండి అప్పులు తీసుకుంటూనే కాలము గడిపాను. చాలా శోధనలు, బాధలు ఎదుర్కొన్నాను. జాన్సన్ సోదరుడితో మాకు పరిచయము కల్గింది.

2004వ సంవత్సరము నుండి ప్రభువును గూర్చి చాలా తెలుసుకొని ఆత్మీయంగా బలపడ్డాను. మా ఆత్మీయ జీవితానికి పునాదిగా నున్నారు. 2008లో క్రొత్త ఉద్యోగంలో చేరాను. 12 సంవత్సరాలుగా ఒక కంపెనీలో పనిచేసి ఆ డబ్బుతో కొంత అప్పు తీర్చాను. దేవుని బిడ్డలు అప్పుచేయరు. అప్పుయిచ్చేవారిగా వుంటారని తెల్పారు.

**2 దిన వృత్తాంతములు 20వ అధ్యాయములో యుద్ధకాలములో శత్రువులు ఆవరించగా స్తుతిచేసి ఊరకుండి రక్షణ చూడమన్న సందేశము** నన్ను ఆకర్షించింది. ప్రభువా, నాకు ఆర్థికంగా సహాయము చేయమని ప్రార్థించాను. నా కుమార్తె ఏదో కొనమనగా డబ్బు లేనందున కొనలేకపోగా ఆమె ఏడ్చింది. నేను చాలా దు:ఖపడ్డాను. నా భార్య నేను భారంతో ప్రార్థించాము. ఈ అప్పు కార్డుల బాధ వదలలేదు. ఇక డబ్బు లేకపోయినా అప్పుచేయను యిబ్బంది పడతానని నిర్ణయించుకున్నాను.

13 సుదీర్ఘ సంవత్సరాలుగా బాధలు పడ్డాము. బ్యాంకులో పనిచేస్తూ వచ్చిన ఆడబ్బు అప్పులు తీర్చుటకే సరిపోయేది. ఆ తర్వాత పదవ వంతు దేవునికివ్వాలని దైవసందేశాలు విన్నాను. అప్పు తీర్చుతూ, 10వ వంతు చెల్లించుట క్లిష్టపరిస్థితిగా తోచింది.

ఆ రోజుల్లో నాకు ఉద్యోగము పోయింది. దేవుని కివ్వాలని నిర్ణయించినప్పుడే ఉన్న ఉద్యోగము పోయింది.

ఆ రోజుల్లో దైవ వాక్యము నన్ను ఆదరించింది. ఆ రోజుల్లో అందరికీ శ్రమ రోజులుగానున్నాయి. ఒకసారిగా 2 నెలల జీతమిచ్చి ఉద్యోగము తీసివేసారు. ఆ జీతం అప్పులు తీర్చివేసాను. ప్రభువు కృపగా తలంచి స్తుతించాను. దేవుని దయతో నా స్థితి మార్చాడు.

నా సాక్ష్యమేమనగా దేవుని బిడ్డలకు ఇబ్బంది ఉండదు. యీ పరిస్థితులన్నీ దేవుని చిత్తంతోనే సమకూడి జరుగుతాయని నమ్మాలి. నేటికి నా జీవితంలో ఆత్మీయ ఆశీర్వాదాల పరంపరతో పాటు శారీరకంగా నాకు మంచి ఉద్యోగము, జీతము, ధన సంపాదన ఆరంభమై దేవుని దయను పొందగల్గాను. నా జీవితంలో నా అనుభవంలో అప్పులు చేయక దేవున్ని మాత్రమే నమ్మాలని మీకు సందేశమివ్వగలను. ఈ సాక్ష్యమును బట్టి జీవితాన్ని పూర్తిగా మార్చగల్గిన దేమి? దేవుని చిత్తముతో సమయోచిత వాక్య సహాయము సమస్యకు తాళము చెవిగా వుపయోగపడునని గ్రహించాలి. వాక్యాన్ని ధ్యానించాలి.

**ఎఫెస్సి 2:13 "దేవున్ని ఎరుగువారు అభిషేకము పొంది దైవరాజ్య వారసులై నిబంధన జనులై వారికి దేవుడు అండగా వుంటారు".**

ఎక్కువ సమయము దేవునితో గడిపినపుడు ఆయనే జవాబునిస్తారు. ఒక బిడ్డ ఏడ్చినపుడు ఎందుకేడుస్తున్నాడనే సంగతి గ్రహించి దేవునిని ప్రార్థించి తగిన జవాబును పొంది ప్రయోగాత్మకంగా దేవుని శక్తిపై పూర్తిగా ఆధారపడుట నా జీవితంలో స్పష్టంగా దేవుని చిత్తము నెరవేరింది. కేవలము బైబిలు ప్రతి సమస్యకు జవాబైయున్నది.

ప్రభువును నమ్మిన ప్రజలు ఎన్నడూ సిగ్గుపడరు. సిగ్గుపడే పరిస్థితులలో దేవుడు రక్షిస్తాడు. దేవుని బిడ్డలుగా నేను నా యింటివారు ఎన్నడూ అప్పుచేయమని నిబంధన చేసుకోగల్గాము. దేవునికి సంపాదనలో క్రమంగా 10వ వంతు ఇచ్చి ఆయనను ఘనపర్చుట మాకు నేర్పారు.

జాన్‌సన్ వంటి గొప్ప సోదరులు తగిన సమయంలో ప్రభువును గూర్చిన గొప్ప జ్ఞాన వివేకములను నేర్పించి కలిసి ప్రార్థించుట దేవుని సంకల్పము. దేవునిలో జీవించుటకు ప్రార్థన, వాక్యము, సహవాసము, ఆత్మాభిషేక అనుభవాలు అత్యవసరమని విశ్వాసులముగా నమ్మి సాగిపోదాము. దేవుని దయ మనతో నుండి గాక ఆమెన్.

# 12. ఎన్నికలేని నన్ను ఘనమైన పాత్రగా క్రీస్తుసేవ చేయు భాగ్యమిచ్చారు.

లూకా గారు (వేల్పూరు గ్రామము) (ప॥గో॥జిల్లా)



**1 కొరింధి 1:28,29ల "జ్ఞానులను సిగ్గుపరచుటకు లోకములో వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు. ఎన్నికలేని వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైన వారిని, తృణీకరింపబడిన వారిని, ఎన్నికలేని వారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు ".**

**పరిచయము:-** ప్రభువు నామములో మీకు వందనములు. నా జీవిత సాక్ష్యము ప్రచురించు భాగ్యాన్ని కల్గించిన దేవునికి, దైవజనులకు నా వందనాలు. నేను చాలా సనాతనాచారాలు గల గ్రామంలో జన్మించాను. గతకాలపు వ్యక్తులంతా ఐక్యతతో, గౌరవ మర్యాదలతో, వరుసలు కలిపి సంబోధిస్తూ ప్రేమతో సంచరించేవారు. సువార్తను ప్రకటించు వారి పాదాలు సుందరమైనవే కాకుండా, క్రీస్తుప్రేమ మిమ్ములను బలవంతము చేయుచున్నదని చాటిచెప్పుచూ, క్రియాత్మక క్రైస్తవులు విదేశాలనుండి ఆంధ్రప్రదేశ్‌కి విచ్చేసేవారు.

1937వ సంవత్సరములో ఇంగ్లాండులో బ్రిస్టల్ పట్టణము నుండి ఇద్దరు మిషనెరీ జంటలు, విలియము చౌడన్, జార్జి బీరు అనువారు నరసాపురము పాలకొల్లు ప్రాంతంలో గణనీయ సేవలనందించారు. సిలువ వేయబడిన క్రీస్తుప్రేమను ప్రకటించి సంఘములను స్థాపించారు. సండేస్కూళ్ళు నడిపించారు. పేదలను, విధవరాళ్ళను ఆదరించారు. స్కూళ్ళు స్థాపించి విద్యతోపాటు బాల బాలికలకు యేసుక్రీస్తు చేసిన అద్భుతాలు, సూచక క్రియలు, బైబిలు కథలు నేర్పిస్తూ దైవభక్తిలో ఉన్న వారికి ఆర్థికంగా సహాయపడేవారు.

అల్లికలు నేర్పించి, సొమ్ముచేసి అవసరాలు తీర్చుకొనే అవకాశాల్ని కల్గించారు. ఎన్ని వసతులు కల్గించినను, ప్రజలకు పల్లెలలో కడుపునిండా తిండి, తగిన వస్త్రాలు వుండేవికావు. చాలీచాలని భోజనము తింటూ, తెలిసీ తెలియని భక్తితో సాగిపోయే గ్రామంలో విప్పర్తి ప్రకాశం, సత్యవతమ్మ అనే దంపతులకు మూడవ సంతానంగా నేను జన్మించాను.

నా పేరు లూకా. నా తండ్రి రోడ్డు మరమ్మతులు చేసే పేదవాడు. తల్లి కూలిపని చేసేది. స్థానికి లూథరన్ స్కూలులో ప్రాథమిక విద్య నభ్యసించాను. ఎస్.ఎస్.ఎల్.సి.

చదివి హయ్యర్ గ్రేడ్ ట్రయినింగు పూర్తిచేసి టీచరుగా స్థిరపడ్డాను. ఫుట్‌బాల్ నేర్పుగా ఆడి టీముకు మంచి పేరుతెచ్చేవాడిని. 1937వ సంవత్సరములో బాప్టిస్టు సంఘ సభ్యురాలైన కొండాబత్తుల సామ్యేలు, చంద్రవతమ్మగారి కుమార్తె అమృతమ్మతో వివాహము జరిగింది.

నా భార్య క్రీస్తును ప్రేమించి రక్షణానుభవంతో భక్తిగల స్త్రీగా జీవించింది. నా భార్యకు గవర్నమెంటు ఉద్యోగము దువ్వలో లభించింది. అప్పట్లో నాకు ఉద్యోగం లేనందున వ్యసనాలకు బానిసగా మారాను. నా భార్యకు తెలియని రీతిగా అలంపూరులో అద్దెయింటిలో జీవిస్తూ నా రహస్య జీవితాన్ని కొనసాగించాను.

ఆ ఊరిలో అగ్రజాతికి చెందిన అన్య కుటుంబీకులు క్రీస్తును నమ్మినవారుండగా వారింటిలో దైవారాధనలను కొనసాగించేవారు. ప్రత్తిపాడు నుండి బ్రయింట్ దొరగారు వచ్చి వాక్యోపదేశం చేసేవారు. నా భార్య ఆరాధనలకు వెళ్తూ ఆత్మీయంగా బలపడి ఆనందిస్తూ నన్ను కూడా రమ్మని పిలిచేది. నేనురాను అని మొండిగా తిరస్కరించేవాడ్ని. నా చెడు అలవాట్లన్నీ గమనించి నా భార్య చాలా వేదనతో కాలం గడుపుచూ స్కూలుపని చూచుకొనేది.

ఒక మంచి విశ్వాసి అయిన మృత్యుంజయరావు గారికి నన్ను పరిచయం చేసినచో నాలో మార్పురాగలదని ఆలోచన చేసింది. నాకు శ్రావ్యంగా పాటపాడే తలాంతును బట్టి ప్రార్థనా కూడికలలో నన్ను పాటలు పాడమని ప్రోత్సహించగా ఆసక్తితో పాటపాడుట కారంభించాను. మెల్లగా దురలవాట్లు తగ్గాయి.

నన్ను పాటలు పాడి వాక్యం కూడా చెప్పమనగా ఏదో తెలిసిన మాటలు చెప్పిననూ నా స్వరం ఆకర్షణీయంగా నుండగా చాలా ఆనందించేవారు. నా భార్య వెళ్ళుచున్న సహవాసంలో టీచర్లు, సంఘపెద్దలు, మిషనెరీలు మృత్యుంజయాచారి గారు నన్ను పరిచయము చేసిన వారంతా నన్ను ప్రేమగా చూచేవారు. నాకు కూడా సంతోషంగా కాలం గడిచేది. దేవుని చిత్తము నాపట్ల నున్నందున నాలో బైబిలు కొనాలనే కోరికను బట్టి మంచి లేబుల్ వున్న బైబిలును ఖరీదుపెట్టి కొని స్వంతం చేసుకొని నెమ్మదిగా చదువుట కారంభించాను. బైబిలు పఠనములో దేవుడు నాతో సూటిగా మాట్లాడారు.

**హెబ్రీ 4:12 "దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులు గల ఖడ్గము కంటెను వాడిగా నుండి ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగును విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది".**

**యిర్మియా 31:33 "నేను చేయబోవు నిబంధన యిదే వారి మనస్సులలో నా ధర్మవిధిని వుంచెదను".**

యీ మాటలు ధ్యానిస్తూ వుండగానే నాలో పశ్చాత్తాపం ఆరంభమై పాప పంకిలమైన రోత జీవితమును గూర్చి దేవుని దగ్గర ఒప్పుకొని మారుమనస్సు పొందాను. నా నిబంధన వారి హృదయములో వ్రాసెదను. నేను వారి దేవుడనై యుందును అనే వాక్యము నా మనస్సులో స్థిరపడింది. నాలో మార్పును గమనించిన నా భార్య చాలా ఆనందించింది. బాప్తీస్మ అనుభవంకై ప్రార్థించాలని బ్రైంట్ దొరగారు హెచ్చరించగా ప్రత్తిపాడు సంఘపెద్ద వృద్ధుడు నాళం నర్సింహ మూర్తిగారు ఏలూరు కాలువలో బాప్తీస్మమిచ్చారు.

నా ఉద్యోగము రాచర్ల గ్రామములో చేయు కాలంలో ఆ స్కూలు యజమాని నన్ను, నా పనిని చూచి అభినందించినను, ఫాల్స్ అటెండెన్సు వేయాలన్నారు. వెంటనే “అయ్యా, నేను నమ్మిన నా దేవునికి నా చేతులు, నా శరీరమంతా సమర్పణ చేసియున్నాను. ఉదయాన్నే యింటింటికి వెళ్ళి పిల్లలను సమకూర్చగలను” అని జవాబిచ్చాను. యజమాని ఒత్తిడి ఎక్కువైనందున రిజైన్ చేయమని నిర్భందించగా ప్రభువు సేవార్ధము నా భార్యతో ప్రార్థించి, ఆలోచించి మౌనంగా రాజీనామా చేసి తర్వాత దైవసేవకు అంకితమయ్యాను.

**యోహాను 5:35 “అతడు మండుచూ ప్రకాశించుచున్న దీపమై యుండెను”.**

నేను సంపూర్ణంగా దేవుని సేవలో ప్రకాశించే నిర్ణయం అందరినీ సంతోషపర్చింది. నా పరిచర్యను దేవుడు దీవించగా గణనీయమైన ఆత్మీయ అభివృద్ధి గమనించాము. నాలో దేవుడిచ్చిన తలాంతులను బట్టి, సమర్పణ, స్ఫూర్తి, మాదిరి జీవితమును గమనించి రాచర్ల సంఘం నుండి మానుకొండ కృపానందం అనే సహోదరుడు కూడా నావలె సేవకు సమర్పించుకొనుట ఆనందం కల్గించింది. ఉభయ గోదావరి సంఘాలలో ఉజ్జీవము విరాజిల్లినది. ఫాక్సుగారు, అగ్రిప్పగారు కూడా నాతో కలిసి ప్రేమతో సేవ జరిగించుటను బట్టి స్థానికి దొరలు ఆనందించేవారు.

క్రీస్తులో సద్భక్తి కల్గి జీవించుట సైతానుకిష్టము లేనందున నన్ను నా భార్యను ద్వేషిస్తూ మాటలతో బాధించేవారు. అద్దె యింటిలో జీవించగా ఖాళీచేయమని నిర్భందించేవారు. రుద్రయ్యగారు సహాయము చేయగా యిల్లు విడిచి దేవుని ప్రేమ యిదిగో అనే పాట పాడుకుంటూ ఇశ్రాయేలుగారిల్లు చేరాము. మా సాక్షి జీవితము, సహనమును బట్టి 15 సంవత్సరాలుగా ఒకే యింటిలో జీవించాము. విభిన్న దొరలు సేవర్ధాము వచ్చి నా పరిచర్యను ప్రోత్సహించేవారు.

ఊనగల్లు అనే ప్రాంతంలో పరిచర్య ఫలితంగా నూతంగి కృపానందం అనే యువకుడు రక్షింపబడ్డాడు. ఆయన అత్తగారిల్లు అలంపురమే గనుక ఆత్మీయుడయ్యాడు.

ప్రత్యేక ఆత్మీయ వరాలతో నింపబడి ఉభయులు ఘనమైన సువార్త సేవచేయగల్గాము.

జాన్ మోషె అనే టీచరు నా సందేశాల ద్వారా క్రీస్తును అంగీకరించాడు. సువార్త పరిచర్యలో పౌలుకు, తిమోతి, ఎఫఫా తీతుల వలె దేవుని పరిచర్యలో దేవుడు ఆయన పరిచర్యలో అనేకులను జతపనివారిగా సిద్ధపర్చారు. అగ్రప్పగారైన దైవజనుని సహవాసంలో విప్పర్రులో పరిచర్యలో ఆటంకాలను ఎదుర్కొన్నాము.

ఒక కాలువ దాటు సమయంలో మంత్రగాడు స్నానము, జపం ముగించి బొట్లు విభూది ధరించి "ఈ దుష్టులు చెప్పు బోధనలను కట్టివేస్తున్నాను. ఎక్కడో వున్న మతమును తెచ్చి మన దేవుండ్లను సిగ్గుపరచుటకు యిక్కడ ప్రకటించు చున్నారని విమర్శించారు. నేను వెంటనే అతనికెదురుగా మోకరించి మౌనముగా ప్రార్థించసాగాను. ఈ వింత చూచుటకు అనేకులు మా చుట్టూ చేరారు. నేను ప్రార్థన మానలేదు. మంత్రగాడు వల్లించుట మానలేదు.

చివరకు సిగ్గుపడి "నేను తలచే దేవుండ్ల శక్తి, దేవతల శక్తి కంటే వారు ప్రార్థించే దేవుని శక్తి ఎక్కువయినది. ఒళ్ళంతా మండుచు దహించుకు పోతుందని పెద్దకేక వేసి పారిపోయాడు. వెంటనే పరిశుద్ధ పరిశుద్ధ ప్రభువా – వరదూత లైనా నిన్ వర్ణింపగలరా

అని గళమెత్తి గానం చేయగా మిగిలిన విశ్వాసులంతా ఏకీభవించి శ్రావ్యంగా పాట పూర్తిగా పాడి దేవున్ని స్తుతించారు. అనేకులీ సంఘటనను గమనించి విశ్వాసముతో దేవున్ని వెంబడించుట నాకు ఆనందం కల్గించింది. దొరల సందేశాలను అనువాదము చేయు అవకాశము కల్గినందున నేస్మిల్, ఫియిర్ గారు, బర్డుగారు, ఆడమ్స్‌గారు ఆనందించారు.

కృష్ణాయపాలెం సేవలో అన్యులు క్రీస్తును స్వీకరించారు. కొయ్యల గూడెం సేవలో ఒక నాస్తికుడు ఎదిరించగా ధైర్యముగా సువార్త బోధించగా నెమ్మది కల్గింది. నందమూరి సేవలో మాధుర్యము గల కంఠముతో కీర్తనలు పాడగా, నేను ఉన్నవాడను, అనువాడను అన్న అంశంపై బోధించాను.

సువార్తను ధైర్యముగా బోధించి అన్యుల ముందు సవాలుచేస్తూ స్వచ్ఛమైన బంగారు కడ్డీని మీముందు పడవేసాను. మీరెవరైనా గీటువేసి ఫలానా దోషముందని అనగల్గితే సమాధానము చెప్పడానికి నేనిక్కడే వున్నానని చెప్పగా ఎవ్వరూ నోరు ఎత్తలేకపోయారు. ప్రభుని సేవించుటలో ఆనందము కల్గినందున ప్రభుని వెంబడించు వారి సంఖ్య అధికమై ప్రభుని ప్రేమించువారితో ఆరాధన జరిగించేవాడిని. నా భార్య ఉద్యోగములో శోధనలు ఎదురయ్యాయి. గతంలో నేను ఎదుర్కొన్న సమస్య తలెత్తింది. తప్పుదు అటిండెన్సు వేయుటకు నా భార్య ఒప్పుకొననందున మరొక ఊరు తేతలికి తరలించారు. స్థానికంగా నున్న గ్రామంలో

గొప్ప సువార్త పరిచర్యను, సభ్యులను వదిలి వెళ్ళుటకు బాధపడ్డాము. ఆ ఊరిలోని సంఘము చాలా ఆత్మీయంగా హీనస్థితిలో నుండుట బాధ కల్గించగా శ్రమలలో సేవను కొనసాగించాను.

ఆ రోజుల్లో నా చిన్న కుమారునికి టయిఫాయిడు జ్వరం తీవ్రత 49 లంకణాలకు చేర్చింది. సేవచేయు తపతో బాబును డాక్టరుకు అప్పగించి దేవుని చిత్తానికి అప్పగించాను. కనిగిరి ప్రాంతంలో సేవకు వెళ్ళుట గమనించి, డాక్టరుతో సహ ప్రక్కనే వుండి గమనించిన వారంతా త్యాగపూరిత దైవసేవగా గుర్తించి ఆశ్చర్యపడ్డారు. నేను నమ్మిన నా ప్రభువు నా ప్రార్ధన ఆలకించి నేను తిరిగి వచ్చేసరికి జ్వరము తగ్గి నా బాబు కన్పించాడు. దేవునిప్రేమ సంఘంలో విస్తరించింది. డి.బి. బర్టు దొరగారు నన్ను గౌరవ ప్రిన్సిపాలుగా నియమించి బైబిలు కాలేజీని నిర్వహించు బాధ్యతలనిచ్చారు. నాకు వృద్ధాప్యము సమీపించగా సి.జఘన్యా గారి సహకార మందుకున్నాను.

నాకు ప్రభువిచ్చిన బిడ్డలు సుదర్శన రావు, జాన్ బాబు, శాంబాబులు నాకు ఆప్యాయత నందించారు. నా వృద్ధాప్యంలో ప్రభుని చేరు ఆకాంక్షతో ప్రార్థించేవాడిని. నాకు ప్రభువందించిన కుటుంబ బాధ్యతలన్నీ నమ్మకంగా నిర్వహించగల్గాను. మంచి యిల్లాలుగా, నా రక్షణకు మూలమైన నా సతీమణి అమృతమైన భక్తిని, ప్రేమనందించి సేవలో సహకరించిన నా ప్రియమైన స్నేహితురాలు 1976 సెప్టెంబరు 7వ తేదీన ప్రభువు చెంతకు చేరింది. దేవుని చెంత ఎల్లప్పుడు నిత్యవిశ్రాంతి, ఆనంద గాన తరంగాలే కావున తల్లి కోసం దు:ఖ పడవద్దని నా బిడ్డలను కోరాను. ఇట్లు ప్రభువు మహిమర్ధమై సమాధి కార్యక్రమము జయకరంగా జరిగించి దేవుని మహిమపర్చాము.

కొంత నిరుత్సాహము, నిరాదరణ, నా వృద్ధాప్యములో ఎదుర్కొన్నాను. ప్రభుని న్యాయపీఠము ఎదుట ధైర్యముగా నిలుచుటకు సిద్ధమయ్యాను. నేను సాత్వీకుడను, దీన మనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తుకొని నాయొద్ద నేర్చుకొనుడి. నాకాడి సుళువు గాని నా భారము తేలికగా నున్నది అని అభయమిచ్చి ఆహ్వానించిన యేసుప్రభుని కాడి క్రిందికి మెడవంచి వచ్చిన మంచి ఎద్దుగా యవ్వన రక్తమిచ్చి కొనిన నా యజమానునికి నా జీవితాన్ని సమర్పించి జీవించు భాగ్యము ప్రభువిచ్చారు. ఓ, విశ్వాసీ, దేవుని సేవచేయుటకు ప్రయాసపడాలి. గొప్ప బహుమానం యివ్వాలని కోరే క్రీస్తును చేరండి. ప్రభువు మిమ్ములను దీవించుగాక. ఆమెన్.

**ముగింపు:-**

**కీర్తనలు 48:14 "మరణ పర్యంతము ఆయన మనలను నడిపించును".**

**కీర్తనలు 116:15 "యెహోవా భక్తుల మరణము దేవుని దృష్టికి విలువగలది".**

దైవజనులైన లూకాగారు ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగ విరమణ తర్వాత దైవసేవలో నిమగ్నమై అనేక ఆత్మలన జాలరిగా జీవించారు. పరిశుద్ధాత్మ అనే సీరియల్ సందేశాలు, రాయబారి మాసపత్రికలో ప్రచురించారు. లోగోస్ లిటరేచర్ సర్వీసువారు యితర రచనలను ప్రచురించారు. వీరు వృద్ధాప్య దశలో ప్రార్ధన, వాక్యము ధ్యానించుటలో కాలము గడుపుచూ బలహీన స్థితిలో కూడా సంఘకూడికలు జయకరంగా జరిపించేవారు.

చివరి దశలో కోమాలోకి వెళ్ళారు. తన ముగ్గురు కుమారులు, కోడళ్ళు చాలా ఆప్యాయతతో వారికి పరిచర్య చేసారు. లూకా గారి జీవిత విశేషమేమనగా తన అంతిమ యాత్ర ఉత్సవం కొరకై స్వయంగా సిద్ధపడ్డారు. రెండు నెలల ముందుగానే ఆయన మరణించాక పెట్టు సమాధిపెట్టె లోపల వెలుపల దైవ వాక్యాల బ్యానర్లు సిద్ధంచేసారు. సంఘ పెద్దలకు హెచ్చరికలు చేసారు. తన రెండవ కుమారుడు భార్య మేరి ఎక్కువ పరిచర్య చేయు కాలంలో "ప్రభువు నన్ను పిలుస్తున్నారు". ప్రార్ధన ద్వారా, వైద్యం ద్వారా నా మరణాన్ని ఆపవద్దు అని తెల్పారు. "నా కొరకెవరూ కన్నీరు పెట్టవద్దు. ఆనందంగా పరలోకయాత్రకు సాగనంపండి" అని కోరారు. ఆయన మరణించిన తర్వాత సమాధి పెట్టెను ఏ దారిగుండా తీసుకొని వెళ్ళాలో తెల్పుచూ, ఏ వాక్యం చదవాలో, ఏ పాటలు పాడాలో తెల్పారు.

ఏ మలుపు దగ్గర ఎవరు సువార్త బోధించాలో నిర్ణయించారు. చనిపోయిన తర్వాత సమాధి ఆడంబరంగా నిర్మించుట గాని, జ్ఞాపకార్ధ కూడికలు పెట్టవద్దని తెలిపారు. ఆయన బైబిలును, సంచిని సంఘ పెద్దయిన అబ్రహాము కోరగా అది అప్పగించారు.

లూకా గారి మరణమునకు ముందుగా కీర్తన 23వ అధ్యాయమును మనమడు సుందర రావును చదవాలని కోరారు. ఆ తర్వాత జెకర్యా గ్రంథము చదివారు. చిన్నకోడలు మేరీని దాహమునకు నీరు కావాలని సైగ చేయగా రెండు గుటకలు వేసి ఈ జీవితయాత్ర ముగించి పరలోక యాత్ర ఆరంభించి 1992 ఆగస్టు 27వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రభుని చెంతకు ఆనందంగా చేరారు. మరణమును నిరర్ధకము చేసి, జీవమును, అక్షయతను వెలుగులోనికి తెచ్చిన ప్రభువైన క్రీస్తుయేసు యొక్క కృపా సువార్తను ప్రకటించుచు దైవజనుడైన లూకా గారి భూస్థాపన దేవుని మహిమార్ధం ఘనంగా జరిగినది. హల్లెలూయా. ఆమెన్.

---------

# 13. నిజమైన శాంతి సమాధానములు యేసు క్రీస్తులోనే గలవని నమ్మాను

గుత్తుల నిత్యానందము(రంగాపురము)(తూర్పుగోదావరి జిల్లా)



**2 తిమోతి 2:15 "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు వానిగాను నిన్ను నీవే దేవునికి కనపరచుటకు జాగ్రత్తపడుము".**

**పరిచయము:–** ప్రభువునామమునకే సదా మహిమ కల్గును గాక. నాపేరు నిత్యానందం. మాది పెద్దాపురము తాలూకా రంగాపురమనే కుగ్రామము. వ్యవసాయము చేసేవారము. పల్లెటూరి వాతావరణములో చక్కని ప్రశాంతత, అమాయక ప్రజలలో మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంతో నిండి వుండేది. నేను మధ్యతరగతికి చెందిన కుటుంబములో అన్యునిగా జీవించాను. విగ్రహారాధన చేసేవారము. బాల్యములోనే అక్షరాభ్యాసం చేయబడినందున గ్రంధాలు చదువుటలో చాలా ఆసక్తి కల్గి పుస్తక పఠనము పట్ల శ్రద్ధ కల్గి వుండేవాడిని. జ్ఞానము పెరుగుటను బట్టి నాలో నాకు ఎన్నో ప్రశ్నలు మనస్సులో వేదించసాగాయి.

"ఈ లోకంలో మనిషి ఎందుకు పుట్టుచున్నాడు? జన్మలు అనగానేమి? ఈ జీవితము ముగించిన తర్వాత మరో జీవితము వుంటుందా? ఈ సృష్టి ఎట్లు ఆరంభమయినది? ఎవరివలన, ఎవరి కొరకు జరిగింది. ఎక్కడ ప్రారంభమైనది? చివరకు ఎక్కడకు పోతుంది? ఎంతో మంది దేవుళ్ళున్నారెందుకు? ఎవరిని ఆశ్రయించాలి? ప్రశాంతమైన హృదయము పాపక్షమాపణ, మోక్షము ఎట్లు పొందగలము? ఎవరు యిస్తారు? ఎలా అన్వేషించాలి? యీ రీతిగా శతకోటి ప్రశ్నలు నా హృదయములో కలవరాన్ని కల్గించేవి.

నా తల్లిదండ్రుల పెంపకములో పారంపర్యంగా ఆచరిస్తున్న కులమర్యాద లాధారంగా సంక్రాంతి పండుగ సమయంలో పితరుల పేరున భోజనాలు పెట్టడము, కుక్కలకు అత్తెసరు అన్నము పెట్టుట, శ్రీరామ నవమి వేడుకలలో చందాలు సేవకరించి పేదలకు వస్త్రాలు, అన్నదానాలు చేయుట వాడుకగా నుండేది. శెట్టి, బలిజి సంఘ పెద్దగా, తాటి బెల్లము కోవోపరేటివ్ సొసైటీ ప్రెసిడెంటుగా పనిచేసేవాడిని. ఆ అన్యులందరి జీవితాల్లో

చదువుండాలని, మంచి అభివృద్ధిలోకి రావాలని తపనగా ఉండేది. స్వంత ఖర్చులు పెట్టుకొని అందరి సమస్యలు తీర్చుటకు బాధ్యత వహించేవాడిని.

మా తాత క్రీస్తు ప్రభువు బోధనలు విని నాకు విగ్రహారాధన మంచిది కాదనియు, సందేహూడిలో నున్న కులదేవతను పూజింపవద్దని చెప్పేవాడు. అయిననూ ఉత్సవాలు జరుపుట మానుకోలేదు. అనుకోని రీతిగా మా తాత క్రీస్తును గూర్చి తెలుసుకో అని చెప్పిన సలహా జ్ఞాపకము వచ్చినందు వలన క్రొత్త నిబంధన చదువుట కారంభించాను.

రాజమండ్రిలో జరిగిన క్రైస్తవ మహాసభలకు అమెరికా నుండి మిషనెరీలు వచ్చి మా కొరకు ప్రార్థించి మత్తయి సువార్త నందించారు. ఆ సువార్త చదివేకొలది క్రీస్తులో నున్న లక్షణాలన్నీ నాకు ఆసక్తి కల్గించాయి. ఆయనలో నున్న మహెూన్నత వ్యక్తిత్వం, అత్యున్నత దైవత్వం నా హృదయాన్ని ఆక్రమించగా వేదాలు, పురాణాలలో చదివిన విషయాలన్నీ బైబిలులో వున్న సత్యాలతో పోల్చి గ్రహించుటకు ప్రయత్నించేవాడిని. క్రీస్తు లోకరక్షకుడు అని వుంది. అయితే ఇతర మతాలలో రక్షణ లేదా? దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కాదుగాని పాపిని శిక్షించక ప్రేమించునని నమ్మాను.

నిత్యమూ నేను ధ్యానించే కృష్ణ శతకము, దాశరది శతకము, రుక్మిణీ కల్యాణము, భగవద్గీత మొదలగు గ్రంధాలు చదువుట మానివేసి బైబిలు కొనుక్కొని శ్రద్ధగా చదువుట కారంభించాను. నాలో కల్గిన నమ్మిక వలన క్రీస్తే ప్రభువని చదువసాగాను. క్రీస్తు ప్రభువు మాటల్లో జీవము ఆత్మ రెండూ వున్నాయని ప్రతి మానవుడు రక్షింపబడడానికి అంటే మోక్షము చేరుటకు అవే ఆధారమని నమ్మాను.

సమీపంలో నున్న దేవాలయానికి వెళ్ళి బాప్తీస్మము తీసుకొని సంఘ సభ్యుడనయ్యాను. కొందరితో కలిసి సువార్త కూటాలకు వెళ్ళుట కిష్టపడేవాడిని. క్రీస్తే నా రక్షకుడని, నా ప్రభువని చెప్పుచున్నప్పుడు లోలోపల చెప్పలేనంత ఆత్మస్థైర్యము, ఆదరణ, ఆనందం, తృప్తి, శాంతి నా హృదయమునిండా నిండిపోయేది.

1953వ సంవత్సరములో నాకొక కుమారుడు కల్గాడు. మా మామగారు నాకొక ఉత్తరము వ్రాసారు. బాబు రాత్రి పగలు ఏడుస్తున్నాడనియు, కులదేవత పేరు పెట్టినచో ఏడ్పు తగ్గునని సలహాయిచ్చారు. అప్పటి రోజుల్లో కుల దేవతను వదలి క్రీస్తును నమ్మి వెలుగులో ప్రవేశించాలని ద్వారం చేరాను గాని యీ శోధన నన్ను అలజడితో కలవరంతో నింపింది. "ప్రభువా, నా బిడ్డ నీ దాసుడుగా ప్రతిష్టించాలని నిర్ణయించుకున్నాను. నీవే నాకు ఎన్నటికీ దేవుడవు. నా హృదయంలో నీకు తప్ప ఎవరికీ స్థానమివ్వలేను. దేవదాస్

అనేపేరు పెట్టాలని మా మామగార్కి జవాబు వ్రాసాను. కొంత ఆవేశపడిన మామగారు సమ్మతించి దేవదాస్ అనేపేరు పెట్టగానే ఏడ్పు మానివేసాడట. నేను చిన్నప్పటి నుండి తాటికల్లు త్రాగేవాడిని. దేవున్ని నమ్మినను నా అలవాట్లు జయించలేనప్పుడు ప్రభువు నాకు వాక్యము ద్వారా బోధచేసారు.

**1 తిమోతి 4:14 " "**

ప్రభువ పూర్తిగా త్రాగుడు మానాలని తెల్పిన వెంటనే నేను మానుకున్నాను. నా స్వంత డబ్బు ఖర్చుపెట్టి మీటింగులనేర్పాటు చేసుకొనే అవకాశాలు కల్గించి గ్యాసులైట్లు ద్వారా బైబిలు బోధన ఆయా ప్రాంతాలలో జరిగే రీతిగా శ్రమించాను. బైబిలులో తర్ఫీదు కావాలనే ఆశకల్గింది. నన్ను నేను ఆత్మీయంగా ఎదిగి పైగా నిలిచి గౌరవించబడుట కిష్టము లేని పెద్దలు నన్ను నిరుత్సాహపరిచేవారు. నా సాక్ష్యము కోరేవారు గాని నన్ను కనిపెట్టి అవసరాలు గమనించేవారు కారు. కొన్ని సార్లు చార్జీలు సరిపోయేవి కాదు.

నా జీవితంలో నా ప్రార్ధనకు శక్తి వుందని గ్రహించిన సంఘటన నాలో విశ్వాసాన్ని పెంచింది. శ్రీ సత్యానందం అనే పెద్దగా నున్న వ్యక్తికి గుమ్మములోనే కట్లపాము కరిచింది. నేను వెంటనే రక్తము పిండి నూనెరాసి ప్రార్ధన చేసాను. ఆ తర్వాత పేదవారైన ఉప్పర వారి మధ్య సేవచేసాము. అపాయము తప్పింది. నల్లమిల్లి అనే గ్రామంలో నేనే వాక్య పరిచర్య చేయుచుండగా ఒక వ్యక్తి చాలా తీవ్రంగా విమర్శించి రాద్ధాంతం చేసాడు.

"మీ యేసు ఎంత గొప్ప దేవుడో చూడాలని లైట్లు పగులగొట్టాలని బెదిరించాడు. వ్యాధిగ్రస్తులందరికీ నూనెరాసి ప్రార్ధన చేయుచుండగా తలమీద ముసుగువేసుకొని నూనె గిన్నెతో వచ్చిన ఒక వ్యక్తిని చూచాను. ఎవరోనని ప్రశ్నించగా అరె, నిన్ను అవమానించి లైట్లు పగలగొట్టాలని బెదిరించింది ఈ వ్యక్తిగా చెప్పారు. నేను ఎంతో తగ్గింపు మనస్సుతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకొనగా అతిని భార్య "అయ్యా, దైవజనులైన మిమ్ములను నిందించినందుకు చాలా నష్టపడ్డామండీ. అని కన్నీటితో భార్య భర్తలు క్షమాపణకోరి ప్రార్ధన చేయించుకున్నారు.

ఆ తర్వాత మీటింగు చాలా జయకరంగా ముగిసింది. గతంలో లూధరన్ చర్చిలో చిలకరింపుతో కాక నీటిబాప్తీస్మంతో మంచి వున్నదని విశ్వాసులు హెచ్చరించగా నీట ముంపు బాప్తీస్మము పొందాను. పరిశుద్ధాత్మ నాతోవుండి నడిపించసాగింది. కొందరు విశ్వాసులు అన్యభాషలు మాట్లాడాలని ఒత్తిడి చేసేవారు. మాట్లాడని వారిని చిన్నచూపు చూచేవారు.

ఆ రోజుల్లో తెలిసి తెలియని స్థితిలో ప్రార్థన చేసేవాడిని. రహస్య పాపాలు వుండడము వల్ల నీవు భాషలలో మాట్లాడలేని స్థితిలో నున్నావని నా హృదయాన్ని గాయపర్చారు. పవిత్రత లేనివారు అపరిపక్వతతో నున్న కొందరి విశ్వాసుల మాటలు చాలా మందిని గాయపర్చి క్రీస్తుప్రేమను దూరపర్చుట గమనించగలము.

నాకు ఆ విమర్శల వల్ల మరింత శ్రద్ధతో ప్రార్థించసాగాను. కొందరు విశ్వాసులు వారి బలహీనతలను బట్టి విమర్శించుకొనుట వారి నిర్లక్ష్య జీవిత విధానాలు చాలా చిరాకు కల్గించేవి. కలత గల మనస్సు నుండి నెమ్మది పొందుటకు వాక్యాన్ని ధ్యానము చేసేవాడిని. నా ఆత్మీయ నేత్రాలు ప్రభువు తెరచిన స్థితికి సహకరించిన వాక్య భాగాలు

**1 కొరింథి 12,13,14 అధ్యాయాలు**

**గలతి 5:22**

**మత్తయి 7:22,23** వాక్యాలన్నీ నాలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని కల్గించాయి. మనుష్యులు మానసికంగా చేసిన గాయాలు, మనస్సులో కల్గిన దిగులు, చింతలు యివన్నీ వాక్యము ద్వారా పటాపంచలయ్యాయి. క్రీస్తు ప్రభుని నమ్మి ఆయనను పోలి నడుచుకోవడము ద్వారా పరలోక ప్రవేశము నిత్య జీవము పొందగలమని నమ్మిక నాలో ప్రభలంగా వుండేది. విభిన్న విశ్వాసుల అభిప్రాయాలు నన్ను నిరుత్సాహపర్చేవి. అయినను

**ఎఫెస్సి 4:5** లో బాప్తీస్మము ఒక్కటే అని స్పష్టంగా చూపి కృప చూపారు. ఆత్మలో తీవ్రత కల్గిన వాడనై బాగుగా ప్రార్థిస్తూ తీవ్రతతో

**కీర్తనలు 119:18** "దేవా నీ దర్మశాస్త్రమందు ఆశ్చర్యకరమైన సంగతులను గ్రహించుటకు నా కన్నులు తెరువుము" అని ప్రార్థించాను. దేవుని ఎదుట నిలువగల్గుటకు జాగ్రత్తపడాలి. సమస్తాన్ని పరిశీలించాలని తెలుసుకోగల్గాను. ప్రతి బోధను శ్రద్ధగా విని వాక్యానికి సరిపోతుందో లేదోనని అనుదినము పరిశోధించాలని

**అపొస్తులు 17:11** ఆధారంగా నీ బోధ వినువారిని రక్షించుకొనగలమనే సలహా పాటించాను లేనిచో బోధకులమైన మేము కఠిన తీర్పు పొందగలమని జాగ్రత్త వహించాము.

**సేవలో అవరోధాలు:–** నేను సువార్త ప్రకటించు భారంతో సమీప గ్రామాలలో అనేకుల కుటుంబాలు వ్యక్తిగతంగా, మీటింగుల ద్వారా, వాక్య బోధన ప్రార్థించుట ద్వారా ఆకర్షించబడి క్రీస్తును నమ్మి సంఘముగా ఏర్పడి ఆత్మీయంగా బలపర్చబడేవారు. కొందరు టీచర్లు బాలబాలికలను బెదిరించి వారి సంఘాలలోనే చేరాలని నిర్బంధించేవారు.

ఈ రీతిగా దోపిడీ జరుగుట బాధ కల్గించేది. కొన్ని సభలలో పెద్దలంతా భోజనాలు చేసి ఆనందించే సమయంలో నన్ను నిర్లక్ష్యం చేసి ఆకలితో యింటికి పంపేవారు. మీటింగుల సమయాల్లో కొందరు ఉచితంగా భోజనము చేస్తూ నన్ను టికెట్టు కొని భోజనం చేయాలని నిర్భందించేవారు. కొందరు విశ్వాసులు వస్తువులు మోయమని అడిగేవారు. శక్తికి మించి మోయగా అలసిపోయేవాడిని.

వివిధ గ్రామాలు కాలినడకన ప్రయాణిస్తూ డబ్బులు చాలీచాలని స్థితిలో, సకాలానికి భోజనము, అల్పాహారము లభించని స్థితిలో పౌలువలె ఆకలిదప్పులతో సేవను కొనసాగించాను. కొన్ని మీటింగులకు వెళ్ళినప్పుడు సాక్ష్యము వివరించుటకు అవకాశం యివ్వక అవమానించేవారు. దయ్యము పట్టిన వారిని ప్రార్థించమని నా దగ్గరకు తెచ్చేవారు.

సరియైన ఆత్మీయ స్థితి లేకపోతే విశ్వాసిని యితరులు గ్రహించగలరు. ఎన్నో యిరుకులలో సుగంధముగా మార్చి నన్ను ఆదరించిన ప్రభువు సేవ నమ్మకంగా కొనసాగించాను. యీ సేవలో నుండగా నా భార్య మరణం నన్ను చాలా కృంగదీసింది. మా బిడ్డలను చదివించుటకు, వివాహాలు జరిగించుటకు అనేక ఆర్థిక యిబ్బందులెదుర్కొన్నాను. ఈ పోరాటాలలో ప్రభువు అద్భుత కృపచూపారు. బంధువులలో అన్యులు నన్ను అపహాసించేవారు. అయిననూ ప్రభువు నా విశ్వాసాన్ని పరీక్షించుటకు శక్తినిచ్చారు.

**రోమా 8:18 "మనయెడల ప్రత్యక్షము కాబోవు మహిమ ఎదుట యిప్పటి కాలపు శ్రమలు ఎన్నతగినవి కావని ఎంచుచున్నాను"**

నా శ్రమలన్నీ భరించుటకు కారణమేమనగా ప్రభువు తప్ప మరొక రక్షకుడు లేడని దృఢంగా నామ్మను. వాక్య పఠనములోను, బోధనలోనూ లోతైన అనుభవాలను ప్రభువందించారు. ప్రభువిచ్చిన కృపా సువార్తను ప్రతి రక్షింపబడిన విశ్వాసి ప్రబలంగా వ్యాపింజేయుటకు నడుము కట్టాలి. అది ప్రధమ కర్తవ్యము. మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టరాదని తెలుసుకున్నాను.

**తీతుకు 1:9 "తాను ఆరోగ్యకరమైన బోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడు వారి మాట ఖండించుటకును, శక్తి వారగునట్లు ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుము"**

ఈ వాక్యము ఆధారముగా జీవించు కృప దేవుడిచ్చి దీవించారు. క్రీస్తు ఆత్మను కల్గిన మనము స్వతంత్రులము. ప్రభువు దీవించి కాపాడి బలమైన సాక్షులుగా మిమ్మలను

దీవించుగాక. ఆమెన్. నాపేరు జి.వి. రమణ. నాన్నగారిని సామ్యేలు బాబుగారు అరుదైన హంస అని ఘనంగా సన్మానించారు. అదే పేరున పుస్తకము ముద్రించబడింది.

1996 నవంబరులో నా తండ్రి క్రీస్తును ప్రేమించి ఆయన సన్నిధి చేరారు. బైబిలు గ్రంథములోని ముఖ్య విషయాలను సరిగ్గా ఉపదేశించాలనే భారం కల్గి ఉండేవారు. ప్రసంగాలు కొన్ని ముద్రించాము. ప్రభువు ఆయనకు అప్పగించిన సువార్త సాహిత్యసేవలో ఘనంగా ప్రశంశలందుకొని ధన్యునిగా జీవించారు. వీరి జీవితము అందరికీ ఆశీర్వాదకరంగా వుండాలని నా దీన ప్రార్థన. ఆమెన్.

---------

# 14. విగ్రహాల నారాధించే నేను నిజదేవుడు క్రీస్తే స్వస్థపర్చు రక్షకుడని నమ్మాను

**నీలు (ముంబాయి)**

**నిర్గమ 15:26 “నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే”.**

**యేసే సర్వాధికారి, యేసే మహోపకారి, యేసే ఆ సిల్వధారి**



**పరిచయము:–** ప్రభుని గొప్ప నామమునకు సదా స్తుతికల్గు గాక. నాపేరు నీలు. అన్య దేవతలనారాధించే కుటుంబములో జన్మించాను. మా జీవితమంతా 40 సంవత్సరాలుగా ఎందరో దేవుళ్ళను నమ్మకంగా సేవించి పూజలు చేస్తూ మా కాలాన్ని గడిపాము. ఏ దేవుడైనా మా ఆర్థిక సమస్యలను తీర్చగలడేమోనని చాలా ఆశతో కనిపెట్టాము. దర్శనమిచ్చి, అభయమిచ్చి, మనస్సుకు శాంతిని కల్గిస్తారేమోనని నిరీక్షించాము.

నా బిడ్డల చదువులకొరకు గాని, అవసరాలు గాని పట్టించుకోక పూజలకై సొమ్ము వెచ్చించి నష్టపోయాము. నిరాశ ఎదురై దు:ఖంతో నలిగిపోయాము. సమస్యల వలయాలు, ఆర్థిక యిబ్బందులు చుట్టుముట్టగా నిరీక్షణ కోల్పోయిన అసహాయులమయ్యాము.

అన్ని దేవుళ్ళను ప్రార్థిస్తూ మమ్ములను ఆదుకోవాలని వేడుకొనే సమయంలో అనుకోని రీతిగా టి.వి.లో క్రొత్త ప్రోగ్రామును చూచాను. అది సి.బి.ఎన్. వారి క్రైస్తవ సందేశాలు, సాక్ష్యాలు వివరించే ప్రోగ్రాము. హిందీ భాషలో ప్రచురించుట చూచి చాలా ఆశ్చర్యం కల్గింది. ఇక క్రమంగా చూచుట కారంభించగా యేసే నిజమైన మార్గము, జీవము, సత్యమని తెల్పారు. లోకరక్షకుడు స్వస్థపర్చు దేవుడు, అవసరాలు తీర్చువాడని ఎందరో వారి జీవిత సాక్ష్యాలు వివరించుట చూచాను. కేన్సరు వ్యాధిగ్రస్తులు స్వస్థత పొందుట, సకల వ్యాధులు గలవారికై ప్రార్థన చేయు పద్ధతులు గమనించాను. మానసికంగా, ఆర్థికంగా కృంగిన వారు వారి సమస్యలనుండి విడుదల పొందిన రీతిని స్వయంగా చూచి, వారి గాథలు వినుటవల్ల క్రీస్తు పట్ల ఆసక్తి కల్గింది.

ఆయినను మేము గతంలో పూజించిన దేవుళ్ళ శక్తిని కాదనలేని అయోమయ స్థితిలో ఆరాత్రి నా హృదయంలో కల్గిన కలవరాన్ని బట్టి నేను ఒక నిర్ణయంతో ప్రార్థించాను. “ఏ దేవుడు సృష్టించి పోషించి నిజముగా నా సమస్యలను పరిష్కరించి ఆదుకొనగలడో ఆ నిజమైన దేవుడెవరో నాకు తెలియజేయండి. నేను కనుగొనుటకు ఆశతో ఉన్నాను. ఆ

నిజమైన దేవుడెవరో కనపర్చు కొన్నచో నా జీవితమంతా సేవిస్తాను అని ప్రార్థించాను.

“ఆ రాత్రి అద్భుతమైన దర్శనమును చూచాను. ఆ క్రీస్తు మధురమైన మెల్లని స్వరంతో సూటిగా నాతో మాట్లాడారు. “అమ్మా, నీవు నిజమైన దేవుడెవరో కనుగొనుటకు ఆశించి ప్రార్థించావు కద! నేనే నిజమైన దేవుడను, రక్షకుడను” అనే మాట వినగానే అవాక్కయ్యాను. ఆనంద తరంగాలతో తేలియాడాను.

యేసే మార్గము, సత్యము, జీవమని టి.వి. ప్రోగ్రాములో చెప్పిన ప్రతిమాట సత్యమని నమ్మి మరింత ఆసక్తితో క్రీస్తును గూర్చి మరింత ఎక్కువ తెలుసుకోవాలని ఆశించాను. మాకు తెలిసిన వారినడిగి బైబిలు పొందాను. ఆ దివ్య సన్నిధి నన్ను ప్రభావితం చేయగా టి.వి.లో ప్రార్థించు విధానాన్ని అనుకరించి గతంలో శ్రద్ధతో చేసిన పూజలన్నీ మానివేసాను. క్రీస్తును ప్రార్థించుట కారంభించాను.

నాలో కల్గిన వింతైన విశ్వాసాన్ని బట్టి నా బిడ్డలు, నా భర్త పూర్తిగా క్రీస్తే నిజరక్షకుడని నమ్మారు. సమీపంలోనున్న క్రీస్తు ఆరాధనలలో పాల్గొన్నాము. గొప్ప ఉజ్జీవంతో పాటలు పాడి ఆరాధించు పద్ధతులన్నీ నేర్చుకున్నాము. క్రమముగా వాక్య పఠనములో, ప్రార్థనలో, సహవాసములో లీనమైయున్న సమయాల్లో మా యింటివారందరూ విభిన్న రోగాలతో నలిగిపోయి, కృంగిన స్థితిలో నున్న వారందరమూ అద్భుత స్వస్థతలను పొందాము. చెప్పనశక్యమైన వింత శాంతితో, ఆనందము మా గృహములో నూతన వాతావరణమేర్పడింది. మా జీవితాల్లో కల్గిన గణనీయమైన మార్పులు, ఆర్థికముగా అప్పులు తీరి సమృద్ధితో జీవించుట నా బంధువులు, యిరుగు పొరుగువారు గమనించారు. టి.వి. ప్రోగ్రాములో సాక్ష్యము చెప్పు రీతులను, ఆరాధించే విధానాలు అనుకరించి మంచి విశ్వాసులముగా మారిపోయాము.

ఇతరులంతా మాలో చూచిన క్రొత్త పద్ధతులు, ఆరాధన విధానాలు గమనించి మేము నమ్మిన క్రీస్తును తెలుసుకోవాలని ఆశించి మాతో కలిసి ఆరాధనలలో పాల్గొని మారుమనస్సు పొందారు. మా యింటిలోనే బైబిలు స్టడీ ఆరంభించి దేవుని ప్రేమను గూర్చి మరింత ఎక్కువగా తెలుసుకొనే ధన్యత అందరికీ కల్గిస్తు ఆనందించ గల్గుచున్నాము.

**అపొస్తు 10:36 “యేసు క్రీస్తు అందరికీ ప్రభువు”.**

యేసు క్రీస్తు నామముందు నమ్మి బాప్తీస్మము పొందు అవసరత గ్రహించి నీటి బాప్తీస్మము పొంది క్రీస్తు సంఘ సభ్యులమై మాగత వైద్యరీత్యా బిల్లులన్నీ తీర్చుకొని, సర్వ సమృద్ధితో సుఖ సంతోషాలతో క్రీస్తును వెంబడించు భాగ్యవంతులమయ్యాము. మీకు అట్టి ధన్యత కావాలా? క్రీస్తే రక్షకుడు. నమ్మండి. ఆమెన్.

# 15. నా రక్షణకు క్రీస్తే ఆధారమని నమ్మి క్రీస్తు ప్రార్థనలను ఆలకించువాడని ఆశ్రయించాను.

డాక్టరు ప్రీతి కృష్ణ



**కీర్తనలు 23:3 'నా ప్రాణమునకు ఆయన సేదదీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతి మార్గములో నన్ను నడిపించుచున్నాడు".**

**పరిచయము:-**నా బాల్యమంతా మంచి సాంప్రదాయాలు గల మంచి కుటుంబములో గడిచింది. మానవత్వమున్న మనుష్యులు సమాజంలో మంచి హృదయం కల్గి మనస్సాక్షితో జీవించుట, యితరులకు యిష్టం కల్గేలా మంచి మాటలు మాట్లాడుచు అందరి మన్ననలు పొందాలని ఆశించే దాన్ని. ఎన్నో వేల దేవతలు ఆరాధించే అవకాశాలున్నందున నా కిష్టమైన దేవుళ్ళను పూజించినను చదువులకు ఆటంకము కల్గించకుండా కాపాడే గణపతి దేవుడు నాకిష్టము గనుక ఎక్కువగా పూజించేదాన్ని.

ప్రతి తరగతిలో గొప్ప ప్రగతి సాధించేదాన్ని. మరింత విజ్ఞానం పొందాలనే ఆకాంక్షతో పెద్ద పేరున్న కాలేజీలో ఎమ్.బి.ఎ. చదువుటకై ఉత్తమ కళాశాలలో చేరాను. ఎంతో ఆశతో చేరిన నాకు నిరాశ మిగిలింది. నాలో వింతైన దిగులు బాధ చేరుకున్నాయి. శాంతిలేని స్థితి చేరుకొని మంచి ప్రగతి సాధించలేకపోయాను. మరణ వాంఛ మిగిలింది. నా యీ స్థితికి కారణము నేను నమ్మిన దేవుళ్ళేనని గణపతిని ప్రార్థించగా పెద్ద ఆకృతితో ఏనుగు నాకు కలలో కన్పించింది. నాకు ఆనందం బదులు కలవరము కల్గింది. నా స్థితికి సకారణము తెలిసికోవాలని ఆశించాను.

నేను నమ్మిన దేవుళ్ళంతా నాకు కారణము చెప్పలేకపోయినందున నా స్నేహితులు నాకిచ్చిన క్రీస్తుకు సంబంధించిన చిన్న గిడియన్ బైబిలు చదవాలనే వింత ఆశ కల్గింది. అది సరిగ్గా రాత్రి గడిచి ఉదయము 2గం॥ల సమయంలో జరిగిన సంఘటన తర్వాత నా సిస్టరు లేచి నన్ను గమనించగా నాలో ఏదో మార్పు కల్గినట్లుగా నాముఖము కాంతితో ప్రకాశిస్తున్నట్లుగా చూచి ఆశ్చర్యపడింది. "అరె, ఏమిజరిగింది? నీవు క్రొత్తగా కన్పిస్తున్నావు సుమా!" అని పలుకరించింది. నిజమే, నిజమైన దేవుడి దివ్యకాంతి నన్ను ఆవరించింది. నాలో వింత ఉత్సాహం, నూతనంగా కల్గింది. నా సత్యాన్వేషణ ఫలించింది. అన్ని దేవుళ్ళను

పూజించుట కేవలము నిష్ప్రయోజనమే. ఒక్క క్రీస్తు మాత్రమే సజీవుడు. జవాబు నిచ్చి శాంతినిచ్చే భగవంతుడనియు బైబిలు గ్రంధము సత్యవాక్కు అని పూర్తిగా నమ్మాను. కేవలము క్రీస్తు నన్ను రక్షించు నిర్ణయమును బట్టి నాలో తపన తీర్చుటకై నాలో అభిలాష కల్గించారని తర్వాత గ్రహించాను. బైబిలు తెరిచి చదువుట కారంభించాను. కాని నాకొక్క మాట కూడా అర్థం కాలేదు. నాకు నిజమైన దేవున్ని చూడాలి, నాలో అశాంతి తొలగించాలని తలస్తూ నిద్రపోయాను. ఆ రాత్రి అద్భుతమైన దర్శనము పొందాను.

ఒక దట్టమైన వింతైన కాంతి నా తలను దృఢంగా తాకి నా పూర్తి శరీరాన్ని ఆవరించి పాదాలను తాకుట స్వయంగా అనుభవించాను. ఆశ్చర్యంగా నాలో దాగిన దిగులు చింత ఆకస్మాత్తుగా మాయమయిపోయాయి. చెప్పనశక్యమైన ఆనందం నాలో నిలిచింది. నేనెన్నడూ అంతటి గొప్ప కాంతిని నేను చూడలేదు. ఆ జ్ఞాపకాలు నాటి నుండి నేటి వరకు నాలో నిలిచిపోయాయి.

ఆ నమ్మకము నా హృదయంలో నింపుకొని హాస్టలు నుండి మా యింటికి వెళ్ళగానే నా స్నేహితులలో క్రీస్తును వెంబడిస్తూ దైవారాధనలలో పాల్గొనే వారిని సంప్రదించి నా అనుభవాలన్నీ తెలియజేయగానే, క్రీస్తు సుబోధలలో ప్రాముఖ్యమైన దేమనగా నేనే వెలుగును, మార్గాన్ని, సత్యాన్ని, జీవాన్ని. నేనే ద్వారమునై యున్నాను. నా ద్వారానే మోక్షం చేరాలి. ఇరుకుమార్గంలో ప్రవేశించాలి. విశాల మార్గము మంచిది కాదు. భోగాలతో, వ్యసనాలతో నిండిన ఈ లోకంలో ప్రత్యేకించి జీవిస్తూ నన్ను వెంబడించాలి. నాలో సంతోషము, శాంతి దాగివున్నాయని చెప్పారని వివరించారు.

నేను ఆ మాటల్ని నమ్మి సమీపంలోనున్న క్రైస్తవ దేవాలయాన్ని దర్శించాను. స్థానిక పాస్టరుగారు క్రీస్తు ప్రేమతో నన్ను స్వీకరించి, ఆరాధనా క్రమాన్ని నేర్పించారు. రక్షణను గూర్చి వివరించారు. పశ్చాత్తాపంతో క్రీస్తు నాశ్రయిస్తే మారుమనస్సు లభిస్తుందన్నారు. నమ్ముట, బాప్తీస్మం ద్వారా సంఘ సభ్యురాలనై జీవించుట నాతోటి వారికి ఆశ్చర్యాన్ని కల్గించగా, "ప్రీతీ, నీలో యీ మార్పు ఎట్లు జరిగింది? క్రీస్తు మాత్రమే రక్షకుడా? ఆయనను మాత్రమే సేవిస్తానంటున్నావేమి? అని ప్రశ్నించేవారు. నా వేదనలన్నీ తొలగించిన వాడు క్రీస్తే. గణేష్‌ను ప్రార్థించినా జవాబు రాలేదు. ఎన్నో శ్లోకాలు వర్ణించాను. నెమ్మదెందుకు రాలేదు? నాలో భయాన్ని తొలగించి వెలుగుతో నింపిన క్రీస్తే నా రక్షకుడు.

ఈ క్రీస్తు నేనేమయి వున్నానో చెప్పగలరు. హిందు మతంలో నున్ననేను క్రీస్తులో ప్రత్యేకతను అనుభవంతో తెలుసుకున్నాను. ఆయనే ద్వారమై యున్నాడు. ఎన్నో వందల

ద్వారాలెందుకు వేరే ద్వారాలు కలవరాన్ని కల్గిస్తాయి. ఆయనను నమ్మి వెంబడించుటలో గొప్ప శాంతి, ఆనందాన్ని ప్రతిక్షణం అనుభవిస్తున్నాను. మీకు కూడా ఆ సంతోషము కావాలా? క్రీస్తే సజీవంగా నున్న రక్షకుడు. నీ ప్రశ్నలకు జవాబిస్తారు. నీ ప్రతి సమస్యకు పరిష్కారము నిస్తారు. అని సాక్ష్యమిచ్చుటలో ఆనందిస్తున్నాను.

పాస్టరుగారు ఆత్మీయ సత్యాలను బోధించుట ద్వారా ఆత్మీయంగా బలపడుచున్నాను. యేసులో నున్న పాపవిమోచనా శక్తిని వ్యక్తిగతంగా అనుభవించి దానిగూర్చి యితరులకు చెప్పడమే రక్షణసాక్ష్యము. తమ వ్యాధిని యేసు స్వస్థపరిచాడు అని చాలామంది తమ సాక్ష్యం చెబుతున్నారు. అది స్వస్థత సాక్ష్యమే గాని రక్షణ సాక్ష్యము కాదు. మన పాపమనే రోగమునుండి విడుదల పొందే అనుభవం చాలా ప్రాముఖ్యమైనది. విస్తార వేదాంత పాఠము కంటే వీసమైన సాక్ష్యము ఘాటు. తమ రక్షణ సాక్ష్యమును తరచుగా ఇతరులకు చెప్పేవారు తమ ఆత్మీయ జీవితములో జయములను ఎడతెగక చవిచూడగలరనేది నా అనుభవ సాక్ష్యము. క్రీస్తే నిజమదేవుడు రక్షకుడు అందరము నమ్మగల సత్యము. ఆమెన్.

# 16. దిక్కులేని నాకు దేవుడే దారి చూపి రక్షించారు

ఊర్వసి – ఢిల్లీ

**కీర్తనలు 23:3 "నా ప్రాణమునకు ఆయన సేద దీర్చుచున్నాడు. తన నామమును బట్టి నీతి మార్గములలో నన్ను నడిపించుచున్నారు".**



**పరిచయము:–** నేను ఢిల్లీలో నివసించు పేద కుటుంబములో జన్మించాను. తల్లి లేదు. తండ్రి నేను తమ్ముడు కలిసి జీవించేవారము. స్కూలులో చదివే రోజుల్లో మంచి విశ్వాసులైన టీచర్ల సందేశాల మేరకు ఒక తల్లివలె ఆదరించేది యేసు మాత్రమే. శ్రమలలో తోడుగా నుండి, కాపరిగా మంచి నీతి మార్గంలో నడిపించి, కష్టాలలో ఆదరించువాడు యేసేనన్నారు.

ఏ దారి లేని నా జీవితంలో సరియైన ప్రేమనిచ్చేవారు లేనందున క్రీస్తు ప్రేమను తెలుసుకొని రక్షణానుభవం ద్వారా బాప్తీస్మము తీసుకొని రహస్య క్రైస్తవురాలిగా నా తండ్రి దగ్గర జీవించసాగాను. మతపిచ్చితో మా నాన్న నా క్రైస్తవ విశ్వాస జీవితాన్ని అసహ్యించుకొని నన్ను చాలా బాధలుపెట్టి హింసించుట కారంభించాడు. మా తమ్ముడు నన్నుచూచి ఏడ్చేవాడు. ఎదురించుట చేతకాని వారంగా బాధలు భరించాము.

నా తండ్రికి త్రాగుడు అలవాటుండేది. రోజూ సంపాదించినదంతా త్రాగేసి యింటికి వచ్చి నన్ను కర్రతో చితకబాదేవాడు. గాయాలు నిండిన శరీరంతో, ముఖమునిండా దెబ్బలతో అవమానంతో దు:ఖముతో నా గుండె పగిలిపోయింది. క్రీస్తును రక్షకునిగా స్వీకరించినందుకు నాకు యిన్ని శ్రమలు అవసరమా అని బాధకల్గేది. జనులు మిమ్ములను నిందించి, హింసించి, మీ మీద చెడ్డమాటలు పలుకునప్పుడెల్లా మీరు ధన్యులని కొండమీద ప్రసంగములో క్రీస్తు మాటలు ఆదరణ కల్గించాయి.

ఈ లోకములో మీకు శ్రమ కల్గును. ధైర్యము తెచ్చుకోవాలి అనే మాటలు అభయాన్ని కల్గించేవి. నా బాధలకు అంతము వుందా! ప్రభువా, నీవు సిలువలలో ఉమ్మివేసిన వారిని క్షమించావు. రక్తము ప్రవహించే రీతిగా కొరడాలతో నిన్నుకూడా అన్యాయముగా శిక్షించారు. నా బాధలు నీకు తెలుసు. యింటి బయటకు వచ్చిన నన్ను చూచి యిరుగు పొరుగువారు వింతగా మాట్లాడేవారు. వారందరినీ పిలిచి, నా కూతురు

క్రీస్తును క్రొత్తగా నమ్మింది. అది వ్యభిచారము చేస్తుంది. వ్యభిచారి అని చెప్పి అవహేళన చేసేవాడు.

నా తండ్రి ప్రతిరోజూ కొట్టి బాధించినను ఎవరూ నన్ను ఆదుకోలేదు. ఏ తండ్రీ బాధించని రీతిగా శారీరకంగా, మానసికంగా నన్ను బాధించారు. మా నాన్న అన్నగారు నన్ను పోలీసు స్టేషనుకు అప్పగించి, ఈ అమ్మాయి వ్యభిచారి అని మా తమ్ముడు చెప్పాడు అని వారిద్దరూ కలిసి నన్ను పోలీసు వారి మధ్య వుంచి మీరేమి చేసుకోదలచినా పర్వాలేదు, శిక్షించండని అప్పగించి అవమానించారు.

నీవే నన్ను ఆదరించాలని ప్రార్థించేదాన్ని. ఈ శ్రమలు భరించుటకే నన్ను ఎన్నుకున్నారా? అని తలంచి, ఏదో ఒక ప్రత్యేక ప్రణాళిక నాపట్ల దాగివుందనే నిరీక్షణ నాలో దాగివుండేది. ఆ నిరీక్షణ ఫలితంగా నా తమ్ముడు నా పక్షంగా పోలీసు వారి దగ్గర "అయ్యా, మా అక్క అమాయకురాలు. పాపము చేయలేదు. నా త్రండ్రి త్రాగుబోతు. అబద్ధాలు చెప్పి నా అక్కను వ్యభిచారిగా చెప్పి బాధపెడ్తున్నాడు. ఆమె చేసిన పని యొక్కటే అదే యేసుక్రీస్తును నమ్ముకొనుట. అది మా నాన్నకు అయిష్టమయినందున అన్యాయముగా బాధిస్తున్నాడు. ఆమెను బాధించవద్దని ప్రాధేయపడ్డాడు.

మా తమ్ముడి ద్వారా దేవుడొక ప్రత్యేక మార్గాన్ని తెరిచి నాకు విముక్తినిచ్చాడు. అతని స్నేహితుడికి నా పరిస్థితి చెప్పాడు. నేను తన స్నేహితున్ని వివాహము చేసుకొని తండ్రి యిల్లు విడిచి పెట్టినచో నాకొక క్రొత్త మార్గము చూపిన ఫలితముండి నా శ్రమలన్నీ తప్పించుకొనగలనని ఆశతో నా వివాహము జరిగించాడు.

నా భర్త సాత్వీకుడు గనుక నేను చెప్పిన మాటలు అంగీకరించాడు. "ఏమండీ, నేను క్రీస్తును నమ్ముకున్నాను. చర్చికి వెళ్తాను. మీరు కూడా ఏకీభవించాలి" నా భర్త నా మాట మన్నించి, నన్ను గమనించి, నా విశ్వాసాన్ని గౌరవించి మారుమనస్సు పొందాడు. నా భర్త రక్షణ తర్వాత నా తమ్ముడికి, నా తండ్రికి క్రీస్తును గూర్చి వివరించగా వారుకూడా క్రీస్తును నమ్ముటకు నా భర్త సహాయపడ్డారు. నా ప్రభువు నాకు మంచి భర్తను, బిడ్డను, సోదరునిచ్చి నాన్నలో పశ్చాత్తాపం కల్గించారు. నా గొప్ప దేవునికి స్తుతి. ఆమెన్.

---------

## 17. దుష్ట శక్తుల బారినుండి క్రీస్తు నన్ను రక్షించి కాపాడారు.

**యాస్మిన్ సూరి (నార్త్ కారొలీనా)**



**ద్వితియోప 18:9 "నీ దేవుడైన యెహోవా నీకిచ్చు దేశమున నీవు ప్రవేశించిన తరువాత ఆ జనముల హేయ కృత్యములను నీవు చేయ నేర్చుకొనకూడదు. దయ్యముల యొద్ద విచారణ చేయు వానినైన మీ మధ్య ఉండన్యికూడదు".**

**పరిచయము:-** నా పేరు యాస్మిన్ సూరి. సిక్కు కుటుంబములో జన్మించాను. ఇండియాలో అన్యుల ఆచారాలతో చేతబడి శక్తుల ప్రభావంగల కుటుంబంలో క్షుద్రశక్తుల పూజలను గౌరవించే సాంప్రదాయాలలో పెరిగాను. చివరకు అమెరికా చేరాను.

బాల్యం నుండి యోగా, చేతబడుల పూజలు అలవాటయ్యాయి. అన్యదేవతల శక్తి ప్రభావాలాచరణలో నుండే అలవాట్ల వల్ల నాలో చెడు వ్యసనాలకు బలికాగల ప్రభావముతో నలిగిపోయాను. సిగరెట్లు, సినిమాలు, చెడుస్నేహితులతో కాలయాపన చేసే రోజుల్లో నా స్కూలు స్నేహితులలో కొందరు క్రీస్తును గూర్చి నాకు వివరించి బైబిలు నాకు బహుకరించారు. ఆ పవిత్ర గ్రంథము నా బ్రతుకులో గొప్ప ప్రభావాన్ని చూపించింది. నాకున్న రెండవ స్నేహితురాలు నా బలహీనతల నుండి విడుదలకై మంచి సలహాలనిచ్చి నన్ను జికట గల ఊబినుండి సంరక్షించింది.

నేను మొదటిసారిగా బైబిలులో చదివిన వాక్యము ద్వితియోపదేశ కాండము 18వ అధ్యాము. ఆ వాక్యభాగములో అక్షరాలన్నీ సజీవమై నా ముఖముపై ఎగిరిపడిన భావం కల్గింది. ఆ భావాలన్నీ స్పష్టంగా నా బలహీనతలన్నీ వ్రాయబడినట్లు గ్రహించాను. అనుకోని రీతిగా క్రమంగా నా పాత. రోత, హీన, బలహీనతలన్నీ నా ముందునిలిచి దేవుని అపారప్రేమ నన్ను తాకిన కొలదీ నా పాపం నాలో దహించి వేయసాగింది. గుండెపగిలేలాగ ఏడ్చి నా పాపాలన్నీ ప్రతి ఒక్కటి దేవునికి విరోధముగా చేసానన్న గుర్తింపు కల్గింది.

గతంలో నేను భద్రంగా దాచుకున్న చేతబడి పుస్తకాలు, వస్తువులు, పరికరాలన్నీ అగ్నిలో పూర్తిగా దహించివేసాను. తిరిగి పాత జీవిత అలవాట్లన్నీ అసహ్యించుకొని

మానివేసాను. చర్చికి క్రమంగా వెళ్ళుటకారంభించాను. నా క్రొత్త జీవితం గూర్చి మా అమ్మకు చెప్పాను. వారికన్నా సంఘంలో విశ్వాసుల సాహచర్యము, వారి మంచి సలహాలు, హెచ్చరికలు నాలో గొప్ప మార్పు కల్గించాయి. నాలో మార్పును నా స్నేహితులంతా స్పష్టంగా గమనించి ఆనందించారు. నాకు సంగీతం పట్ల చాలా ఆసక్తి వున్నట్లు గుర్తించి చాలా ప్రోత్సహించగా శ్రావ్యంగా పాటలు పాడే తలాంతు నాలో దేవుడుంచాడని గుర్తించాను.

జాన్ న్యూటన్ వ్రాసిన ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన పాట నా జీవితానికి సరిగ్గా సరిపోయింది. అమేజింగ్ గ్రేస్ నన్ను చెడిపోయిన జీవితాన్ని మార్చి క్రొత్త జీవితాన్నందించి యోగ్యుడను చేసిందని గొప్పగా వ్రాసిన పాటను నేను శ్రావ్యంగా అన్ని సంఘాల్లో జనాల్ని ఉద్రూతలూగించే ప్రతిభతో పాడగల్గిన నేర్పు ప్రభువు నాకిచ్చారు.

అమెరికాలో పాటలు పాడే గాయకురాలిగా దేవుడు నన్ను అభిషేకించి వాడుకొనుచున్నారు. గతంలో నాకు దేవుని గూర్చి బోధించినప్పుడు క్రీస్తు కొరకు మండే సూర్యునిగా వెలిగించబడి ప్రకాశించాలన్న తపన ఏర్పడింది. క్రైస్తవుల జీవిత విధానము చాలా ఉన్నతమైనది.


కొన్ని సంఘాలలో చేతబడి ప్రభావము వుంటుందని తెలుసుకోలేని స్థితిలో నున్న వారికి తెలియజేయాలనే ఆశతో ఉన్నాను. నేను కళ్ళుమూసుకొని పాటలు పాడి ఆరాధిస్తున్నా వెందుకు అని ప్రశ్నించినపుడు నా హృదయం దేవుని ప్రేమతో నిండి ఆరాధనా భావంతో మైమరచి కృతజ్ఞతతో నా గత చీకటి జీవితం నుండి వెలుగులోనికి రప్పించిన క్రీస్తును ఆరాధించుటలో తన్మయత్వం చెందుతాను అని చెప్పగలను.

నేను క్రీస్తును వెదుకలేదు. క్రీస్తే నన్ను వెదకి రక్షించి, ప్రేమించారు. నా కొరకు మంచి భవిష్యత్తును దేవుడే సిద్ధపర్చారు. తరతరాలుగా చీకటి కార్యాలు సమసిపోవాలి. దీవెనలు వెంటాడాలి. అన్ని ఆజ్ఞలు, సలహాలు పాటించుటకన్నా క్రీస్తును అనుభవ పూర్వకంగా తెలుసుకోవాలని గ్రహించాను. అన్ని సంఘాలలో నిజమైన ఆరాధన జరగాలి. నా జీవితంలో నేర్చుకున్న అనుభవాలు మీలో మార్పుతేవాలని నా ప్రార్ధన. ఆమెన్.

---------

# 18. నేను నమ్మిన క్రీస్తు సజీవుడు

**రీటా సుబరాయ్ (నార్త్ ఇండియా)**



**హెబ్రీయుల 13:5 "నిన్ను ఏ మాత్రము విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను".**

**పరిచయము:–** నా పేరు రీటా. నేను సాయిబాబాను భక్తితో పూజించే భక్తురాల్ని. అన్యుల కుటుంబంలో జన్మించి విద్యానంతరము వివాహము ద్వారా ఒక బాబును పొంది ఆనందంగా జీవించే రోజుల్లో నా బాబు గుండె బలహీనముగా వున్నదని వైద్యులు తెలిపారు. ఎన్నో పరీక్షలు జరిగిన తర్వాత గుండెలో రంధ్రమున్నదనియు, రక్తప్రసరణ సరిగా లేదన్నారు. అంతేకాదు ఆ పసిబాబుకు బైపాస్ ఆపరేషన్ చేయకపోతే ప్రమాదమగునన్నారు.

మాకు దిక్కుతోచలేదు. చాలా దు:ఖములో నుండగా మా దగ్గర బంధువులలో ఒకరు క్రీస్తు ప్రభువును రక్షకునిగా స్వీకరించి ఆనందంగా చక్కని సహవాసంలో క్రీస్తును ఆరాధించుట నాకు తెలుసు. వారు క్రీస్తును నమ్మవలసినదిగా ఏనాడూ నిర్భంధము చేయలేదు గాని మము నమ్మిన క్రీస్తు సజీవమైన దేవుడు. కష్టాలలో సహాయము చేస్తాడు. ఆర్థిక అవసరాలు తీర్చగలడు. సకల వ్యాధులను స్వస్థపర్చును. శ్రమలలో నున్న వారిని విడిపించి సమస్యలన్నీ పరిష్కరించి ఆపదలలో ఆదుకొనేవాడు ఏకైక దేవుడు క్రీస్తేనని మా బాబుకొరకు ఆంధోళన చెంది దు:ఖములో నుండగా చెప్పారు.

మాకు మా దేవుళ్ళున్నారని, పూజలు చేస్తూనే వున్నాము. అయితే నా బాబు ఆపరేషన్ కొరకు డాక్టరు త్వరపడి ఉదయము 11 గం॥ సమయంలో చేయుటకు నిర్ణయించారు. భయంతో,ఆంధోళనతో బాబును ఆస్పత్రిలో నుంచిన సమయంలో 10 గం॥ల సమయంలో నా బంధువులు చెప్పిన మాటలు ఆధారంగా ఆఖరి గంటలో ఒక్కసారి ఈ క్రీస్తు ఎవరో? ఎట్టివాడో? ఆయనలో ఒకవేళ మహాత్యముండి నా బాబుకు రక్షణ కల్గించగలడేమో నన్న ఆఖరి ఆశ నాలో చెలరేగింది. కన్నీటితో మౌనంగా ప్రార్థించాను. "నీవు సజీవుడవైన క్రీస్తువని, మహాత్యము గల వాడివని విన్నాను. నీవు నాకు సహాయపడి బాబుపట్ల దయతో రక్షిస్తే, నేను నిన్ను నమ్ముతాను. జీవితమంతా నిన్నే సేవిస్తాను"

నా బంధువులు చెప్పిన విషయాల్లో వారు వెళ్ళిన సంఘ పాస్టరుగారెన్నో సువార్త సత్యాలు బోధించారని, క్రీస్తు చేసిన అద్భుత స్వస్థతలు నమ్మలేని నిజాలని తెల్పారు. క్రీస్తే ఏకైక మార్గము. ఆ దారముగా నిలిచిన క్రీస్తుద్వారా పరలోకాన్ని చేరగలమనియు, నమ్మినవారు క్రీస్తు కొరకు సాక్షులుగా జీవించడానికి యిష్టపడతారు. వారి కడుపులో జీవజలనదులు ప్రవహిస్తాయి. క్రీస్తు జీవాహారంగా ఆత్మలను పోషించే గొప్ప దేవుడు. ఆయన సజీవుడు. శ్రమలలో ఆదరించు గొప్ప రక్షకుడు. నమ్మిన వారికి దుర్గము, కాపరిగా నుండి రక్షిస్తాడు అని తెల్పారు.

నాకు తెలిసీ తెలియని రీతిగా ప్రార్థించిన తర్వాత నా బాబును ఆపరేషన్ ధియేటరుకు తీసుకొని వెళ్ళి తిరిగి పరీక్షచేసారు. ఒక్కసారిగా ఆశ్చర్యపడి పరీక్షలన్నీ పరిశోధించి చూడగా బాబు గుండెలో రంధ్రము కన్పించలేదనియు, ఆపరేషన్ గాని, మందుల అవసరత గాని లేదని తేల్చిచెప్పారు. నాకు చాలా ఆశ్చర్యము కల్గింది. నేను చాలా చిన్న ప్రార్థన మాత్రమే నమ్మకంగా చేసాను. అనుకోని రీతిగా అద్భుతంగా జవాబు పొందాను. నా బాబు మామూలుగా ఆరోగ్యవంతుడైన బాబుగా మా మధ్య వుండుట నన్ను చాలా ఆనందపర్చింది. ఆ క్రీస్తును గూర్చి మరింత ఆలోచించసాగాను. ఏ రీతిగా దేవున్ని వెంబడించాలో తెలియలేదు.

నా బంధువులు తండ్రి కుమార పరిశుద్ధాత్మ ఉనికి గూర్చి వివరించారు. ఆయన నామంలో పరిశుద్ధాత్మ సహాయంతో అద్భుతాలు సంభవిస్తాయని తెల్పారు. అదెట్లుంటుంది? ఎలా పొందాలి? యిదే తపన, ఆలోచనలతో గడిపాను. నాకొక ఆలోచన కల్గింది. ఈ క్రీస్తు నాకు కనిపించాలి. నా బాబుకు కల్గిన అద్భుత స్వస్థతను, క్రీస్తును ప్రార్థించగా జవాబిచ్చారని చెప్పినచో అందరూ నమ్మకపోవచ్చు మరింత స్పష్టంగా క్రీస్తు నా జీవితములో అనుభంతోకి రావాలంటే ఏదో చేయాలి అని తలంచాను. వెంటనే ఆ రాత్రి గ్లాసునిండా నీళ్ళు నాముందుంచి మరలా ప్రార్థించాను.

"యేసూ, నేనీ నీరు నీపేరు చెప్పుకొని త్రాగుచున్నాను. నిన్ను నీవు కనపరచుకోవాలని కోరుచున్నాను. నిన్ను నేను చూడాలి" యిదే మాట పదే పదే ప్రార్థించి ప్రాధేయపడ్డాను. ఆ క్షణంలో ప్రభువు నన్ను దర్శించారు. అతి తెల్లని వస్త్రాలతో చారలు కూడా వున్నాయి. చేతిలో దుడ్డుకర్ర ఉంది. ఆయనను చూడగానే అప్రయత్నంగా నా కన్నీరు అవిరామంగా స్రవించాయి. క్రీస్తు రెండవసారి నా మనవి ఆలకించారు. క్రీస్తు నిజమైన దేవుడు. సజీవుడైన దేవుడు. స్వస్థపర్చగలడు. ప్రార్థనలు ఆలకించగలడు. శ్రమలలో మొఱ్ఱపెట్టినప్పుడు వినగలిగి రక్షించువాడు ఆయనేనని నమ్మాను.

నా మనవి ఆలకించి నా బాబును మరణము నుండి తప్పించినచో జీవితమంతా నేను నిన్ను నమ్ముతానని శపదము చేసినందున, ఆ మాట స్థిరపరచి క్రీస్తును నమ్మాను. నా బంధువుల సహకారంతో మంచి సంఘ సహవాసాన్ని కనుగొన్నాను. నా భర్తతో నా అనుభవాన్ని తెల్పి క్రీస్తునే నమ్ముదామని అడిగాను.

నేను సాయిబాబాను నమ్మిన వాడిని. కొంతకాలము కనిపెట్టిన తర్వాత నమ్మగలనని తెల్పారు. నేనుమాత్రము ప్రతివ్యక్తి కోసం వాక్యం చదివి ప్రార్థించుట నేర్చుకున్నాను. క్రీస్తును గూర్చి మరింత ఎక్కువ తెలుసుకోదలచాను. ప్రభువు సూటిగా నాతో మాట్లాడుట, నన్ను చాలా ఆనందపర్చింది.

మూడవసారిగా గిద్యోనువలె నిదర్శనాల ద్వారా క్రీస్తు సన్నిధికి చేరువయ్యాను. నమ్మి బాప్తీస్మ అనుభవం కోరాను. శనివారాలు సంఘములో చేరి ఆరాధించి ప్రార్థించు సమయంలో నా దగ్గర వారిలో ఎవరో కారు ప్రమాదానికెదురవుతారనియు, ఆయన అద్భుత రీతిగా వారిని ప్రాణాపాయము నుండి రక్షించగలరని క్రీస్తు నాకు తెలిపారు.

నేను క్రీస్తు చెప్పిన మాటల్ని నమ్మి ప్రార్థించసాగాను. సరిగ్గా సోమవారం నాకు ప్రభువు చెప్పిన వారికి కారుప్రమాదము సంభవించినపుడు అద్భుతంగా ప్రాణ నష్టము తప్పిందన్న వివరాలు తెల్పారు. ప్రభువు మాటలు సత్యాలు, నమ్మదగినవని ధైర్యంగా సాక్ష్యము చెప్పుటకు ఆధారము లభించింది. ఇక ఎన్నటెన్నటికీ క్రీస్తే నా ఆరాధ్య దైవమయ్యారు. క్రీస్తు నామములో నూనెనుపయోగించి ప్రార్థించుట నేర్పారు. వ్యర్థంగా నూనె వాడరాదనియు, నా నామములో నూనెరాసి ప్రార్థించినపుడు అద్భుతాలు లభించగలవని స్పష్టంగా తెల్పారు. ఎన్నో విలువైన విషయాలన్నీ ఆయనను గూర్చి సహవాసములోను, క్రీస్తు స్వరము, దర్శనాల ద్వారా తెలుసుకొని క్రీస్తుకు సాక్షిగా జీవిస్తున్నాను. నా అనుభవంలో నేను నమ్మిన క్రీస్తు విడువడు, ఎడబాయడు. యెహోవా ప్రతి సమస్యను చూచుకొనును. నా సాక్ష్యమును బట్టి క్రీస్తు సజీవుడని నమ్మండి. ఆమెన్.

---------

## 19. అంధకారము నుండి వెలుగైన క్రీస్తును కొనుగొన్నాను

**బ్రదర్ విఠల్‌రావ్ (మచిలీపట్నం, ఆంధ్రప్రదేశ్)**

**కీర్తనలు 110:105 "నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది".**



**పరిచయము:–** నా పేరు విఠల్. నా బాల్యం కృష్ణాజిల్లాలో కాజా అనే గ్రామములోనే గడిపాను. నామకార్ధ క్రైస్తవుల కుటుంబములోనే జన్మించి, చిలకరింపు బాప్తీస్మ క్రమము ఆచరించే సి.ఎస్.ఐ. సంఘములో అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటూ, భక్తిగల వారిగా నుంటూ, శక్తిని ఆశ్రయించని నామకార్ధ జీవితాన్ని జీవించాను. భయము, భక్తి లేనందున దొంగతనాలకలవాడు పడ్డాను. సరుకులు తెమ్మని తల్లిదండ్రులు యిచ్చిన సొమ్ములో కొంత వాడుకొని అబద్ధాలు చెప్పేవాడిని. నా విద్యాభ్యాసము మచిలీపట్నంలోనే గనుక డ్రామాలు వేస్తూ, పాటలు శ్రావ్యంగా పాడుచూ కాలయాపన చేస్తూ తిరిగేవాడిని.

సినిమా నటులతో పోటీలో పాల్గొనేవాడిని. డ్రామాల ద్వారా పేరుపొందాను. నా మనోనేత్రాలు మూసుకొనిపోయాయి గనుక నా ఆత్మీయ జీవితము హీనదశలో నున్నట్లు నన్ను ప్రభువు మార్గములో హెచ్చరించేవారు లేకపోయారు. డిగ్రీ పూర్తిచేసాక పాలకేంద్రములో పనిచేస్తూ అక్రమాలు చేసేవాడిని. కొంతకాలానికి ఆంధ్రప్రదేశ్ రోడు రవాణా శాఖలో ఉద్యోగము లభించింది.

నా జీవితం పట్ల శ్రద్ధగల నా సృష్టికర్త కనుదృష్టి నిరంతరము నన్ను కనిపెట్టి చూచినందున, నన్ను తన బిడ్డగా మార్చుకొనదలచి నాకు భక్తిగల భార్యను ప్రసాదించారు. శ్రమలు నా జీవితాన్ని తాకాయి.

**కీర్తనలు 119:7 "నీ కట్టడలు నేర్చుకొనుటకు శ్రమనొందుట మేలాయె"**

నన్ను మాట ప్రకారము నేను ట్రాఫిక్ ఇన్స్పెక్టరుగా నుండగా జీపు ప్రమాదము ఎదుర్కొన్నాను. ప్రభువే మరణము నుండి నన్ను రక్షించారు. నేను ప్రమాదము ఎదుర్కొన్న ప్రాంతము ఆళ్ళగడ్డ గ్రామములో బాంబులతో చంపుకొనేవారు. నా క్రింద పనిచేసే వ్యక్తి నామీద పగపట్టి నన్ను చంపించాలని మరొక వ్యక్తి సహాయం కోరాడని తెలిసింది. నీవు

క్రైస్తవుడవైనందున మరణము నుండి తప్పించుకున్నావని ఆ హంతకుడే నాకు తెల్పాడు. కపట సహోదరుల వలన బాధలనుండి ప్రభువు ఆశ్చర్యంగా తప్పించారు.

**రెండవ ప్రమాదము ఎదుర్కొనుట:–** ప్రభువు నన్ను ప్రమోషన్ ద్వారా సీనియర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టరుగా దీవించి సత్తెనపల్లెలో నివసించే కృపనిచ్చారు. పనిచేసే ఆఫీసులో పనిమనిషి సరిగా పని చేయనందున నేను పై ఆఫీసరుగార్కి ఆమెను గూర్చి రిపోర్టు చేయగా ఆమెకు ఆరునెలలు ఇంక్రిమెంట్ కట్చేసినందున బాధతో నాపై కక్షతో నాకు హాని కల్గించగలనని బెదిరించింది. నిజాన్ని గ్రహించగా నాకు నెమ్మది కల్గునట్లు దేవుడు కాపాడారు.

నాకు విరోధముగా రూపొందిన ఏ ఆయుధము కూడా వర్ధిల్లదు అని దేవుడు దీవించగా నన్ను బాధించాలనే కుట్రతో నున్న పనిమనిషికి ఉద్యోగము పోయింది. నాకు ఉత్తమమైన సూపర్వైజరు ఉద్యోగము లభించింది. నాకు ఆర్మూర్ అనే ప్రాంతమునకు బదిలీ అయింది.

**క్రైస్తవ సహవాసము లభించుట:–** ఆర్మూర్ ప్రాంతములో మాకు భక్తిగల విశ్వాసుల సహవాసము గల మందిరము లభించింది. నా భార్యకు భక్తిగల స్త్రీల సమాజములో చురుగ్గా వాక్య ధ్యానంలో, ప్రార్ధనలలో పాల్గొనే అవకాశాలు కల్గాయి. నాలో కూడా భక్తిగల భావాలు కల్గినందున క్రీస్తును ప్రేమిస్తూ వాక్యం చదువుట, ప్రార్ధించుట, క్రమంగా ఆరాధనలలో పాల్గొనే ఆత్మీయ మేలుపొందు ధన్యత లభించింది. బాప్తీస్మ అనుభవంలో నేను నా భార్య పాలుపొంది ఆనందించుట దేవుని కృపగా ఎంచి స్తుతించాము.

ఆ తర్వాత అదిలాబాద్ జిల్లా మించిర్యాలకు మంచి సహవాసమున్న ప్రాంతానికి ప్రభువే నన్ను బదిలీచేయించారు. ఆ ప్రాంతాలలో దైవసేవకునికి అన్యాయము జరుగుట బాధకల్గింది. దేవుని సేవకులను ప్రేమిస్తూ ఆత్మీయంగా ఎదుగుచున్న రోజుల్లో ఒక స్నేహితుడు మేమున్న అద్దెయింటికి సమర్పణ మినిస్ట్రీస్ అధినేత ముఖర్జీగారిచే ప్రార్ధనా కూడిక ఏర్పాటు చేయించారు. ఆ ప్రార్ధనలలో నన్ను నా భార్యను సూటిగా ప్రశ్నించిన రీతి నాకాశ్చర్యము కల్గించింది.

**రక్షణ స్థిరత అత్యవసరమని గ్రహించుట:–** మీరు రక్షణపొందిన నమ్మకము కల్గినవారేనా? మీ పాపాలు క్షమించబడిన నిశ్చయత వున్నదా? అనే ప్రశ్నకు జవాబుగా "పాస్టరుగారూ, మేము బాప్తీస్మము తీసుకొన్నాము. సేవచేయు అనుభవంతో నా భార్య ప్రసంగాలు చేయగలదు. క్రమంగా ఆరాధనలకు వెళ్ళుచూ ప్రార్ధించుచున్నాము" అని చెప్పగానే, మరలా అదే ప్రశ్న సూటిగా అడుగగా "ఔనండి, మేము రక్షణ పొందినట్లే" అని చెప్పగా మీకు పెండ్లయిందా?

అని అడిగారు. అదేమి ప్రశ్న? నా భార్య బిడ్డలను చూచారు కద! అయితే పెండ్లయిందని యింత ఖచ్చితంగా మీరు చెబుతున్నారు. పెళ్ళయినట్లే అనలేదు కద! రక్షణ స్థిరత అనగా పాపాలు దేవుని దగ్గర స్పష్టంగా ఒప్పుకోవాలి, ప్రభువు క్షమించినట్లు నిర్ధారణ కావాలి అన్నారు. యీ మాటలు నాకు చాలా వింతగా తోచగా, పాస్టరుగారు మా రక్షణకై ప్రార్థించి వెళ్ళిపోయారు.

నేటి క్రైస్తవ సమాజంలో ఆరాధన క్రమాలు, సంఘ పరిచర్యలు, సేవా కార్యక్రమాలు, చందాలిచ్చుట యివన్నీ ఎంతో ఆసక్తితో చేస్తూనే వుంటున్నారు గాని దేవునితో సన్నిహిత సహవాసము, పాపక్షమాపణ, రక్షణ నిశ్చయత, పరిశుద్ధాత్మ నడిపింపు లేనివారిగా ఎందరో వుంటున్నారు.

దేవుని నామములో కఠినముగా హెచ్చరించి సరిచేసే సేవకులు నేటి సమాజానికి అత్యవసరమని గ్రహించాను. వెంటనే మోకరించి గతంలో నేను చేసిన పాపాలు, ఆఫీసు వస్తువులను అనుమతి లేకుండా యింటికి తెచ్చి వాడుకున్న జగ్గులతో సహ తప్పుపనిగా తోచింది. ఆఫీసు కాగితాలు, వస్తువుల ఖరీదు తిరిగి చెల్లించాను.

గతంలో డ్రామాలు వేసినప్పుడు తీయించుకున్న ఫోటోలు అసభ్యకరమైనవిగా క్రీస్తుదాస్ అనే స్నేహితుని హెచ్చరిక మేరకు కాల్చివేసాను. ఆ తీర్మానము మనస్సు నెమ్మది కల్గించింది. అయితే రక్షణ స్థిరతలేదు. అయితే ఆ రోజుల్లో ఉజ్జీవ కూటాలు జరుగగా నేను నా భార్య వెళ్ళి చూడగా అనేకులు కన్నీటితో పాపాలు ఒప్పుకొనుట గమనించాము. దైవజనుడు మాతో మీరు ఒంటరిగా ప్రార్థనలో గడపండని హెచ్చరించారు. ప్రార్థనలో బైబిలు తెరిచి చూడాలనే ప్రేరణ కల్గింది.

**కీర్తనలు 133:1 "సహోదరులు ఐక్యత కల్గి నివసించుట ఎంతమేలు?".**

ఈ వాక్యము చదువగానే నాకు అందరితో సరియైన సమాధానము లేని స్థితి అర్థమయింది. నా స్వంత సోదరునితో గత 23 సంవత్సరాలుగా మాటలు లేని స్థితి దు:ఖపర్చింది. వెంటనే నా సోదరుని గృహమును ధైర్యంతో దర్శించి సమాధానపడగా నా మనస్సులో శాంతి నిలిచింది.

ఒకరోజు ఆఫీసులో నుండగా ప్రార్థించాలనే దు:ఖ భారం కల్గినందున యిల్లుచేరి గదిలో మోకరించి కన్నీటితో ప్రార్థిస్తూ "దేవా నాతో మాటలాడండి. నన్ను రక్షించండి. నాలో దాగిన పాపాలన్నీ తెలియజేయండి" అంటూ దీనంగా ప్రార్థించగా బైబిలు తెరిచి చూడు అని ఎవరో చెప్పిన అనుభవం కల్గింది. బైబిలు తెరిచినప్పుడు కీర్తనలు 23వ

అధ్యాయం కన్పించింది. ఆఖరు వాక్యము చదివే సమయంలో ఆ వాక్యము ఎగిరి నా హృదయాన్ని హత్తుకున్న భావం కల్గింది. **"నేను బ్రతుకు దినము లన్నియు కృపా క్షేమములే నా వెంటవచ్చును. చిరకాలము యెహోవా మందిరములో నేను నివాసము చేసెదను".** గొప్ప శాంతి నన్నావరించింది. నా పాపాలన్నీ క్షమించబడిన స్థిరనిశ్చయతతో, చాలాకాలము క్రైస్తవ జీవితము జీవించిననూ పొందని గొప్ప ఆనందము పొందగల్గాను. దైవజనుల నిత్య సహవాసం ఎంతో వివేకాన్ని, దైవ జ్ఞానాన్నందిస్తుందని గ్రహించాను.

ముఖర్జీగారు మాకు సమీపంలో నున్నంతకాలమూ, మాకు తలఎత్తిన ఎన్నో సంశయాలన్నీ తొలగించుకొనేవారము గాని, వారి కాపుదలలో విజ్ఞాపన, ప్రార్ధనలు మమ్ములను సంరక్షించేవి. వారు దూరమయ్యాక శోధనలనెదుర్కొన్నాము. నేను పబ్లిక్‌లో అన్ని రకాల పాటలు చాలా శ్రావ్యంగా పాడగల నేర్పును బట్టి నన్ను ఒక వేడుకలో పాటలు పాడాలని ఆహ్వానించారు. అనుకోని రీతిగా ముఖర్జీ గారు మా ప్రాంతానికి విచ్చేసినపుడు నా పాటల కార్యక్రమము గూర్చి తెలుసుకొని సూటిగా హెచ్చరించారు. "నీ స్వరాన్ని ప్రభువు మహిమార్ధము మాత్రమే వినియోగించాలి గాని లోకస్తులను సంతోషపెట్టుట దేవునిని అవమానపర్చుననే సత్యము గ్రహించుకో". నాలో యింకా లోకాశలపై జయము లేనందు ఆయన మాటల్ని నిర్లక్ష్యము చేసాను. విశ్వాసులలో చిన్న పొరపాట్లు గొప్ప నష్టాన్ని కల్గిస్తాయి కద!

అదే సమయంలో ఓ రాజకీయ సమావేశం ఆదిలాబాద్‌లో భారీ ఎత్తున ఏర్పాటు చేయబడింది. మంత్రి గార్ని మరియు ప్రముఖులను ఆహ్వానించారు. నేను చాలా ఆశతో పాట పాడుటకు సంసిద్ధమయ్యాను. నా భార్యకీ పరిస్థితి నచ్చలేదు. నా భార్య ప్రభువును దు:ఖపర్చరాదని చెప్పింది. నా సహవాసంలో వారంతా నా కోసము ప్రార్ధిస్తూనే ఉన్నారు.

అదిలాబాద్‌లో పెద్ద గ్రౌండ్‌లో పెద్ద పెద్ద షామియానాలు వేసారు. పెద్ద ఘనమైన వేదికలో వేడుకలు ఆరంభమయ్యాయి. సరిగ్గా నేను పాట పాడే సమయము వచ్చింది. "ఇప్పుడు శ్రీ విఠల్ రావ్ గారి అసిస్టెంటు మేనుజరు, ఆర్.టి.సి. మనకు ప్రత్యేక పాటలు వినిపిస్తారు. అని ఎనౌన్స్ చేయగా నేను హుందాగా నడుచుకుంటూ ఎత్తైన వేదిక చేరుటకు కాలుఎత్తాను. ఆ క్షణములో అంతా గందరగోళంగా పరిస్థితి తారుమారయ్యింది.

గొప్ప పెనుగాలి చెలరేగింది. పెద్దగా వర్షతీవ్రతకు షామియానాలన్నీ నేలకూడిపోయాయి. అధికారులు, ప్రజలంతా క్షణంలో చెదిరిపోయి ఖాళీ అయ్యారు. కుర్చీలన్నీ చెదిరిపోయాయి. నా గుండెలు జారిపోయాయి. క్షణంలో యిల్లుచేరాను. కేవలము

దైవసేకుల సలహాలు, నా భార్య నా కోసం చేస్తున్న ప్రార్ధనలు నా చెవులలో మారుమ్రోగాయి. నా పొరపాటు నాకు స్పష్టంగా అర్ధం అయింది. మోకరించి క్షమాపణ అడిగి ప్రార్ధించాను.

**హెబ్రీ 13:17 "మీపై నాయకులుగా నున్నవారు లెక్క చెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దు:ఖముతో ఆపని చేసిన యెడల మీకు నిష్ప్రయోజనము గనుక దు:ఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారిమాట విని వారికి లోబడియుండుడి".**

ఆ తర్వాత గుంటూరు జిల్లాలోని మాచర్ల డిపోకు బదిలీ చేసారు. దైవ సహవాసానికి దూరమయ్యానని చాలా బాధపడ్డాము. ఒక చిన్నయిల్లు అద్దెకు తీసుకొని నివసించే కాలంలో యింటి యజమాని వెంటేశ్వర్లు బట్టల వ్యాపారి చర్చికి వెళ్తూ కొంచెముగా క్రీస్తుపట్ల ఆసక్తితోనున్నారని గ్రహించాము. విగ్రహారాధన మానలేదు గాని క్రీస్తును ఆరాధించుట, ప్రార్ధించుట నేను గమనించాను. నామకార్ధంగా గుడికి వెళ్తున్నారే గానీ రక్షణ స్థిరతలేదు. సినిమాలు యిష్టపడేవారు.

చాలా మంది క్రైస్తవ కుటుంబాలు ఈ రీతిగా జీవించుట పరిపాటి. లోతైన భక్తి జీవితము కొనసాగించుటకు కొంత సమర్పణ చాలా అవసరము. మమ్మలను ప్రేమించి ఆత్మీయంగా నడిపించే ముఖర్జీ గారు మా ఊరువచ్చారు.

ఒకరాత్రి మా చిన్నయిల్లు దర్శించారు. మా యింటి జయమాని అతని భార్య ఆ దైవజనునితో మాట్లాడి ఆయన హెచ్చరికలు భక్తితో స్వీకరించగా పాపక్షమాపణ ద్వారా మారుమనస్సు పొంది నీటి బాప్తీస్మము తీసుకొన్నారు. విగ్రహాలన్నీ వారి యింటినుండి పడవేసేవారు. వారి పేర్లు మార్చుకొని షద్రక్ అరుణలుగా దేవుని సేవకులయ్యారు మా చర్లలో ఒక సంఘము స్థాపించారు.


క్రీస్తు ప్రేమను రుచి చూచిన నేను నా కుటుంబముతో యేసును సేవిస్తూ నా అనుభవా సాక్ష్యాన్ని వివరిస్తూ గొప్పగా దేవున్ని ఘనపర్చాలని ఆశతో ప్రార్ధిస్తున్నాను. ప్రియ చదువరీ, నామకార్ధ జీవితములో నీవుంటే, రక్షణ స్థిరతను కల్గి లోకాశలకు, లోక భోగాలకు లొంగిపోక క్రీస్తునే వెంబడించి నిత్యత్వం చేరాలని నా దీన ప్రార్ధన. ప్రభువు తోడుగా నుండుగాక. ఆమెన్.

---------

# ౨౦. శరీరాశలను జయించి క్రీస్తులో పయనించుట శాంతినిస్తుంది అని గ్రహించాను

పియా (నార్త్ ఇండియ)

**యెషయా 40:29 "సొమ్మసిల్లిన వారికి బలమిచ్చువాడు ఆయనే. శక్తి హీనులకు బలాభివృద్ధి కలుగజేయువాడు ఆయనే".**



**పరిచయము:–** నా బాల్యములో మంచి క్రైస్తవ కుటుంబములో జన్మించాను. మంచి క్యాథలిక్ క్రైస్తవురాలిగా క్రమబద్ధమైన జీవితాన్ని జీవిస్తూ మాస్ అనే ప్రార్థన జరిగే ఆరాధనలలో పాల్గొనేదాన్ని. పారిష్ ప్రీస్ట్ గార్కి చాలా సహకారాన్నిందిస్తూ మంచి వ్యక్తిగా పేరుతెచ్చుకున్నాను. ప్రతివేడుకలు, నవీనా ఆచరించుట 2 లేదా 3 మాస్‌లు జపాలు యివన్నీ ఆచరించాను. పేదలకు చందాలిస్తూ ఏ దిగులు చింత లేని జీవితం కొనసాగించాను.

నేను వివాహము చేసుకొన్న వ్యక్తి 10 సంవత్సరాలుగా పాధరు చదివే ప్రీస్ట్ కోర్సులో వుండి వెనక్కు వచ్చి 10 సంవత్సరాలుగా లోకభోగాలలో జీవించే వ్యక్తిగా గ్రహించాను. డబ్బులేని జీవితం పదిసంవత్సరాలు కాగా, డబ్బు భోగాలతో పది సంవత్సరాలుగా గడిపినను శాంతి నెమ్మది లేని ఖాళీ జీవితాన్ని గడిపే నా భర్తకు జీవితముపట్ల సరియైన అవగాహనలేదు. సరియైన ఉద్యోగము లేదు. మంచి యిల్లు, డబ్బు, భార్య, బిడ్డ వున్నను అశాంతితో, అసహనంతో గడిపే జీవితం గమనిస్తూ నాకు నిరాశ కల్గుటకారంభమైంది. నాకయితే అన్నీ వున్నాయి. ఉద్యోగం ఉంది కానీ శాంతికరువయింది. నా జీతం చాలేదికాదు. రాబడిలేదు. యితరులు పలికే నిరాశాభావాలు విమర్శలు నన్ను చాలా మరింత నిరుత్సాహ పూరితురాల్ని చేయగా ఆత్మహత్యా ప్రయత్నం చేసాను. నా భర్తతో మాట్లాడుట మానివేసాను. ప్రతివ్యతిరేఖ భావాలతో నిండిన నా హృదయ భారము తీరేదికాదనిపించేది.

మేము గతంలో కువైట్‌లో నివసించేవారం. తర్వాత బొంబాయి చేరాము. నా భర్త నన్ను గోవాలో జీవించాలని ఒత్తిడి చేసాడు. నా బాల్యమంతా బొంబాయిలోనే గడిపాను. కాని దేవుని చిత్తములో చివరకు గోవా మాకు పరమ ఉత్తము, ఆశ్రయ పురంగా మారింది. అది వాగ్దాన ప్రాంతము రమ్మని నా భర్త కోరిననూ నిరాకరించాను.

నేను రెండవ బిడ్డను గర్భముతో వున్నాను. నా భర్త గోవాలో నివసిస్తూ నన్ను ఒంటరిగా చేసాడు. నాకెవ్వరూ లేరనిపించింది. నా బంధువులమ్మాయి నాకు తోడుగా వచ్చింది. ప్రసవం సరిగా జరిగినను 10వ రోజు నా పరిస్థితి అతి ప్రమాదకరంగా మారింది. ఆగని రక్తస్రావం నన్ను కోమాలోకి చేర్చింది. నా పరిస్థితి గమనించి డాక్టరును పిలువగా ఆస్పత్రిలో చేర్చారు.

నేను క్రీస్తును నా రక్షకునిగా గ్రహించలేదు. క్రీస్తు నాకొరకై చనిపోయారని తెలుసుకోలేదు. నన్నెందుకు పుట్టించాడో తెలియదు. నా పట్ల దేవుని చిత్తమేమి అని గ్రహించకయే మరణించే స్థితికి చేరాను. నరకము తప్పని స్థితిలోనున్నాను. నా పరిస్థితిని డాక్టరు నా దగ్గర వారికి చెప్పుట ఏమనగా, ఆమెకు కావలసిన వారిని పిలువనంపించండి. చాలా ప్రమాదస్థితిలో నున్నదన్నారు. నా భర్తకు కబురుచేసారు. ప్రభువు సంకల్పములో నేను నా భర్తా వున్నామని గుర్తించులాగున నా భర్తకు క్రీస్తును గూర్చి రక్షణ మారుమనస్సు, పాపక్షమాపణ అవసరత క్రీస్తుప్రేమను వివరించే మంచి స్నేహితులు లభ్యమయ్యారు. గోవాలో గణనీయమైన సేవలు నిర్వహిస్తూ క్రీస్తుకు గొప్ప సాక్షిగా జీవించి ఆదర్శ వ్యక్తిగానున్న సోదరుడు జాన్సన్‌గారు పరిచయం ప్రభువిచ్చిన గొప్ప బహుమానమే. వాక్యము విలువ తెలిసుకొన్న నా భర్త నాకోసం ప్రార్థించాడు. వాక్యమే క్రీస్తు శరీరాధారిగా మనమధ్య నివసిస్తుందని గ్రహించి ఫోనులో జాన్‌సన్ గారిని సంప్రదించాడు.

నా భర్త "బ్రదర్, నా భార్య అసహాయస్థితిలో మరణపడకపై నున్నది ప్రార్థించండి" జాన్సన్‌గారు ప్రెయిజ్ ద లార్డ్ అన్నారట. చిన్న పిల్లవానివలె నమ్మి ప్రశాంతంగా వుండండి. అన్నీ సవ్యంగా జరుగుతాయి అని ధనాత్మక భావాలతో ధైర్యం చెప్తూ ఏమాత్రం అపనమ్మకం రానీయలేదని నా భర్త తెల్పాడు.

ఎవరినీ పిలువనంపించు అవసరత వద్దు, వాక్యము బ్రతికిస్తుంది. యేసు నామంలో ప్రార్థిస్తే ఆత్మపని జరుగుతుంది. సత్ఫలితాలను చూడగలము అని తెల్పిన తర్వాత ప్రార్థించాలని హెచ్చరించారు. క్రీస్తు సజీవంగా జీవించిన రోజుల్లో 12 సంవత్సరాలుగా రక్తస్రావ రోగంతో నున్న స్త్రీ యేసును చేరింది. విశ్వాసంతో చేరి అద్భుతం చూచింది. నీ భార్యకు కొన్ని గంటలు మాత్రమే రక్తస్రావ రోగము ఆరంభమైంది. దేవుడు ప్రార్థనలను ఆలకించి త్వరపడి జవాబునివ్వగల సమర్థుడు.

నమ్ముట నీవలనైతే నమ్మువానికి సమస్తము సాధ్యమే. దేవుని వాక్యము మనమధ్యన వుంది. క్రీస్తు వాక్యంలో శక్తిఉంది. ఆయన శరీరము బైబిలుగా మనమధ్యనే ఉన్నది.

ప్రభువా నీ వాక్యమును బట్టి, నీ నామమును బట్టి నా భార్యకు స్వస్థత నీయండి అని ప్రార్థించినచో అదే చాలు అని జాన్సన్ గారు తెల్పారు. జాన్సన్ గారికి దర్శనంలో యేసును చూచారు. ఎంతో ఆశావాదంతో ఉన్నారు. ప్రవచనాత్మకంగా, "నేను నీతో ఉన్నాను" అనే మాట ప్రవచనాత్మకంగా తెల్పారు. ఆక్షణంలో నాకు మంచి అద్భుత దర్శనము కల్గింది. ఒక వృద్ధుడైన వ్యక్తి ధవళ వస్త్రాలతో ప్రకాశవంతంగా కన్పించారు. నావైపు ఆసక్తితో గమనించుట చూచాను. ఆయన ముందు అతి చిన్న ఆటబొమ్మగా నేను టెడ్డీ బేర్ వలె నున్నట్లుగా చూచాను.

నేనొక ప్రకాశవంతమైన స్థలములో నున్నట్లుగా చూచాను. అద్భుతమైన ఆనందం, శాంతి నిలయమైన ఆ ప్రాంతము నుండి నేను అకస్మాత్తుగా క్రిందికి త్రోయబడ్డాను. చచ్చినవానివలె యోహాను చెప్పినట్లు పడియున్నాను. ఆ తర్వాత శ్రావ్యంగా పాడుచున్న మంచి సంగీతం నాకు వినిపించింది. అంతలో డాక్టరు మాటలు విన్పించాయి. "ఆమెను ఒంటరిగా వుంచండి". నాలో నెలకొన్న శాంతిని బట్టి యిదే మారుమనస్సు అనుభవమా అని తలంచాను.

గదిలోనికి ప్రత్యేకించి ఐ.సి.యు. నుండి మార్చారు. నేనే డాక్టరు గారి చేతిని తాకి "నేను స్వస్థత పొందాను. నేను మరణము నుండి జీవంలోనికి వచ్చేసాను. నాగూర్చి కలవరము వద్దు అని ధైర్యంగా వారితో చెప్పాను. నేనీలోకంలోకి వచ్చేసాను అన్న మాటలు ఆశ్చర్యాన్ని కల్గించాయి.

సహజంగా గమనిస్తే నాలో చాలా రక్తం కోల్పోయిన స్థితిలో చాలా నీర్సమైన స్థితిలో మిగిలాను. రక్తము ఒక ట్యూబ్ ద్వారా ఎక్కించడంతో పాటు మరొక గొట్టముతో సెలైన్ ఎక్కించుచున్న శబ్ధము స్పష్టంగా వినిపించగా నా ఎక్స్‌రే ఫొటోలు తీయాలని కోరారు. నడిచి వెళ్ళాలి రాగలవా అని అడిగారు. నా శరీరాన్ని డాక్టరు స్పష్టంగా చూచి వైద్యము చేస్తున్నారు

ఆత్మలో చురుగ్గా ఉన్నాను. శరీరము బలహీనమే గాని ఆత్మ చాలా శక్తివంతంగా ఉండుట తెలుసుకోగల్గాను. ఫొటోగ్రాఫీ తీసే మిషన్ కారులోనుండగా ఎవరో అద్దాలు పగులగొట్టి దొంగతనం చేసేసారు. ఈ రీతిగా జరిగే నష్టాలన్నీ నేను నా భర్తకు అవిధేయత చూపిన ఫలితమని నమ్మాను. దేవునికి కూడా నాపట్ల ప్రత్యేక ప్రణాళిక వుంది. ఈ పరిస్థితిలో నా భర్త నాకోసం భారంతో ప్రార్థిస్తూనే వున్నారు.

నా కోసం చాలా భారంతో ప్రార్ధించుట చూస్తున్నాను. దేవునికి నిరంతరము స్తుతిగానాలు చేసి మహిమపర్చుట ద్వారా ఆరాధించుట ద్వారా మనలో దాగిన వ్యతిరేఖ ఆలోచనలన్నీ సమసిపోయి ఆశీర్వాదం దిగివస్తుంది. యిహలోక మాలిన్యపు ఆలోచనలన్నీ దూరము కాగలవు. మా యిద్దరి వద్దనున్న డబ్బులన్నీ అయిపోయాయి.

నా భర్త గోవాలోనే ఉన్నారు. అక్కడనుండి ప్రార్ధించుచూనే వున్నారు. కేవలము 350రూ॥లు చేతిలోనున్నాయని నా భర్త చెప్పారు. దేవుడే ప్రతి అవసరాన్ని ఆయన ఐశ్వర్యమును బట్టి తీర్చగలరనే నమ్మకం ఉంది. ఆ క్షణంలో ఫోను రింగయింది. నా భర్త స్నేహితుడొకరు అనుకోని రీతిగా ఆపత్కాలములో నమ్మదగిన బాంధవునిగా పలుకరించాడు.

"నీవెక్కడ వున్నావు? ఏం చేస్తున్నావు? నేను మిమ్మెలను చూడాలని ఆశతో వున్నానని తెల్పాడు. నా భర్త వెంటనే నా భార్య ప్రమాదస్థితిలో వుంది. బొంబాయి వెళ్ళాలని చెప్పాడట. నీకేమైనా డబ్బుకావాలా అని అడిగాడట. 1000రూ యిస్తే చాలని నా భర్త చెప్పాడట. సరే ఆయన నా భర్తను వెంటబెట్టుకొని బ్యాంకుకు వెళ్ళగా అక్కడ సమస్య ఏర్పడగా డబ్బు డ్రా చేయలేకపోయాడు. వెంటనే నా భర్తకు స్నేహితుడు 20,000 రూపాయిలు అందించాడట. అది చాలా పెద్ద మొత్తము. ఆ పరిస్థితిలో నా భర్తకు డబ్బు చాలా అవసరమే. అప్పటి పరిస్థితిలో నా భర్త తన భార్యా బిడ్డల అసహాయ స్థితిలో కేవలము వాక్యము, ప్రార్ధన ఆయన సన్నిధిపై ఎక్కువ ఆధారపడినందున ఆయన అద్భుతము చూడగల్గాడు.

దేవుని రాజ్యాన్ని, నీతిని వెదకుటలో సమస్తము అందించగలడు అనగా సమస్తములో దేవుడు ఆర్ధిక అవసరాలు తీర్చుట కూడా యిమిడి వుందని స్పష్టంగా నమ్మి స్తుతించాము. నా భర్త దగ్గర తగిన సొమ్ము ప్రభువు ద్వారా పొందిన రీతిని బట్టి నా దగ్గరకు రావాలంటే విమాన ప్రయాణము ద్వారా 45 నిమిషాల్లో గోవానుండి బొంబాయి వచ్చి నన్ను చేరుట సులభమని ఎంచి విమానంలో బయలుదేరాడు.

నన్ను చేరి నా పరిస్థితి పరీక్షించుటకు అవసరమైన మిషనును సమకూర్చి నన్ను పరీక్షించారు. వారు నా మెడికల్ రిపోర్టు చూచి చాలా ఆశ్చర్యపడ్డారు. రక్తము సరిగా 13 యూనిట్లు ఉండుట గమనించి రక్తం ఎక్కించు పనిని ఆపారు. సమస్తము సరిగా ఉన్నదని తెల్పారు. నా భర్త విశ్వాసముతో ఆ రాత్రంతా వాక్యం ద్వారా ఆధారపడి చేసిన ప్రార్ధన ఫలితంగా నేను ప్రభుని దర్శనము చూచి ఆయన రక్తసిక్తమైన హస్తము నన్ను సమీపించి తాకుట వల్ల పొందిన స్వస్థత ఒక గొప్ప అద్భుత అనుభవము.

నాలో నున్న రక్తము నాదికాదు. క్రీస్తు నన్ను తాకినప్పుడు ఆయన పవిత్ర రక్తము దానిలో వుంచి నన్ను స్వస్థపర్చారు. నామకార్థ క్రైస్తవ జీవితము నుండి లోతైన భక్తిలోనికి నన్ను ప్రభువు నడిపించుటకై నాకీ శ్రమనిచ్చారు. భర్తకు లోబడుటను నేర్పించారు. అద్భుత దర్శనంతో నమ్మకము కల్గించారు.

నా భర్తకు విలువైన జీవితాన్ని జాన్సన్ గారి సువార్త బోధ ద్వారా గుర్తించి క్రీస్తే ప్రధాన కాపరిగా తన జీవితాన్ని అంకితము చేసే భాగ్యమిచ్చారు. వాక్యమే క్రీస్తు-క్రీస్తే వాక్యమని తెలియజేసారు. ప్రియ చదువరీ, మా జీవితాలను బట్టి క్రీస్తు మాట్లాడే దేవుడు. కనబడి స్వస్థపర్చే దేవుడు. దారి తప్పిన వారికి సకియైన మార్గము, జీవం నేనే అని తెలియజెప్పు దేవుడు సజీవుడైన క్రీస్తే. ప్రభువును రక్షకునిగా స్వీకరించి అద్భుత ఆనందాన్ని, శాంతిని, దీవెనలను పొందండి. దేవుడు మనలను దీవించును గాక. ఆమెన్

# 21. యేసు నన్ను వెదకి రక్షించి ఆయన సేవ అప్పగించి నడిపిస్తున్నారు

**రమేష్ అసలేటి (విజయవాడ)**

**మత్తయి 7:7 "ఆడుగుడి మీకివ్వబడును".**



**పరిచయము:-** నా బాల్యమంతా విజయవాడ గిరిపురము ప్రాంతములో గడిపాను. నామకార్ధ క్రైస్తవ కుటుంబములో జన్మించాను. నా తల్లిదండ్రులు ..., నా సోదరుడు రత్నాకర్, సోదరి రజని. నేను 1987లో జన్మించాను. క్రీస్తును గూర్చి సాక్ష్యమిచ్చుట చాలా ప్రాముఖ్యమైన అనుభవంగా తలంచి, నా ఈ సాక్ష్యాన్ని మీకందించే గొప్ప భాగ్యమిచ్చిన గొప్ప దేవునికే స్తుతి స్తోత్రములు సమర్పిస్తున్నాను.

తల్లిదండ్రులిద్దరూ పోలీసు ఉద్యోగం చేసేవారు. బాగా చదువుకొని మంచి భవిష్యత్తు పొందాలని ఇంగ్లీషు మీడియం స్కూలులో ప్రవేశపెట్టారు. అయినను నా పట్ల దేవునికి గొప్ప ప్రణాళిక వున్నదని నేను గ్రహించగల్గాను. మొదటి రోజుల్లో అద్దె యింటిలో నుండి పోలీస్ క్వార్టరులోనికి తరలినందున స్కూలు వెళ్ళుటకు యిబ్బంది కల్గినందున స్కూలు మానివేసి గవర్నమెంటు స్కూలులో తెలుగు మీడియంలోనికి మార్చారు. నా చదువులో చాలా వెనుకబడి పోయాను. సరియైన స్నేహితులు లేరు. సమీపంగానున్న స్టేడియంలో ఆటలు ఆడి యిల్లు చేరేవాడిని. స్కూలులో పాఠాలు నేర్చుకొనుటకు చాలా నిర్లక్ష్యము చేసాను. ప్రోగ్రెస్ రిపోర్టులో నేనే సంతకము పెట్టేసేవాడిని. తల్లిదండ్రులకు చాలా బాధకల్గించేవాడిని. ప్రోగ్రెస్ రిపోర్టు ఒకసారి బీరువా క్రింద దాచగా, యిల్లు కడుగువేళలో మా అమ్మ చూచి నా చదువులో వెనుకబడిన రీతినిబట్టి బాధపడింది.

మా అమ్మ నాన్నకు తెలియజేయగానే నన్ను బాధించారు. నేను పశ్చాత్తాప పడ్డాను. నామకార్ధ జీవితంలో కనీసం పండుగ సమయంలో క్రిస్మస్ నాటికలో ఏదో ఒక పాత్రలో నటించాలనే ఆశతో ఒక్క నెల మాత్రమే చర్చికి వెళ్ళేవాడిని. గొల్లగా గానీ, సత్రపు యజమానిగా నాకు చిన్న పాత్రనిచ్చేవారు. పండుగ క్రైస్తవుడనని చెప్పవచ్చు. నాకు ఒక మంచి కోరిక కల్గి దేవుడిని ప్రార్ధించాను. "నాకు చదువు రాదు గాని ప్రభువా నేను 10వ తరగతి పాస్ అయితే క్రమంగా చర్చికి వెళ్ళి నిన్ను ప్రార్ధించుకుంటాను". ఏదోరీతిగా పరీక్షలు వ్రాసి

రిజల్టు కోసము ఎదురుచూచే సమయంలో అద్భుతంగా 3వ తరగతిలో పాస్ అయ్యాను. ఉపాధ్యాయులంతా ఆశ్చర్యపడ్డారు.

నా కన్నా బాగా చదివే వారంతా ఒక్క మార్కులో ఫెయిల్ అయితే నీవెలా పాస్ అయ్యావురా మొద్దు వెధవా అని విమర్శించారు. నా ప్రభువు నా ప్రార్థన ఆలకించాడని నాకే తెలుసు. నేను ఒప్పుకున్న ప్రకారము చర్చికి వెళ్ళుటకారంభించాను.

విజయవాడలో తరచుగా యవ్వనస్తులకు ప్రత్యేక కూడికలు ఏర్పాటు చేయగా నేను స్నేహితులతో వెళ్ళి వాక్యము వినాలని ఆశించేవాడిని గాని, 1993లో నా జీవితానికి గొప్ప మార్పు కల్గిన సంఘటన ద్వారా ప్రభువు నన్ను ఎన్నుకున్నారు. నేను నా స్నేహితులు ఎన్నో పనులు చేసేవారం,గానీ వాక్యం సరిగా వినేవారం కాదు.

ఆరోజు డిసెంబరు 30వ తేదీ. ఒక దైవజనుడు నన్ను పిలిచి, నీవు దైవవాక్యం వినుటకే వచ్చావు. పనులు చేయుటకు కాదన్నారు. క్రీస్తు వాడుకొను వ్యక్తులు విలువైనవారు. క్రీస్తు వాక్యం విని దానిని యితరులకు తెల్పుటయే క్రైస్తవ జీవితమని స్పష్టంగా తెల్పారు. సమరయ స్త్రీ జీవజలాలను గూర్చి తెలుసుకొని ఆ ఊరి వారందరినీ నోటి మాటతో రక్షించగల్గిందని బోధించారు.

ఒక చిన్న కథ వివరించారు. అదేమనగా మూడు బొమ్మలు చేసిన కుమ్మరి వాటికి ధరలు నిర్ణయించాడు. ఒక బొమ్మపై ధర 500రూ,250రూ, ఉచితముగా గుర్తింపునిచ్చాడు. మూడు ఒకే రీతిగా నుండగా విభిన్న ధరలున్నాయి ఎందుకని అడుగగా ఒక బొమ్మలో రాయివేస్తే ఒకచెవి నుండి రెండవ చెవిలోకి వచ్చి బయటపడింది. రెండవ బొమ్మలో వేసిన రాయి చెవినుండి లోపలికి వెళ్ళి నిలిచిపోయింది. మూడవ బొమ్మ చెవిలో వేసిన రాయి నోటినుండి బయటకు వచ్చింది. 500రూ ఖరీదు గల బొమ్మను బట్టి కొందరు వాక్యము విని మనస్సులో ధ్యానించి నోటిద్వారా ప్రకటిస్తారనియు, 250రూ విలువగల బొమ్మ విని తమలో వాక్యం దాచుకొని వుంటారు. గాని ఉపయోగపడరనియు, వుచితముగా ధరలేని బొమ్మ విని బయటకు వచ్చినట్లు ఏమీ మనస్సులో ఉంచుకొనక వ్యర్థ జీవితాన్ని గడిపేస్తున్నారని చెప్పి, నీవేస్థితిలో నున్నావో ఆలోచించుకో అని దేవదానం పాస్టరుగారు వాక్యోపదేశం చేసారు. నేనే ఆ పనికి రాని బొమ్మగా నున్నానని గ్రహించాను. నీ ప్రాణం దేవుడు తీసుకొంటే నీగతి ఏమి? పరలోకం చేరగలవా? నరకమే నీగతి అని చెప్పగా నా స్థితిని గ్రహించుకోగల్గాను.

ఆ ఒక్క ప్రసంగ ఫలితముగా నాతోపాటు 14మంది మారుమనస్సు అనుభవాన్ని పొంది, క్రమంగా పాపస్థితి, పశ్చాత్తాప ప్రార్ధన విలువను గ్రహించాము. క్రమంగా ఆరాధనలలో పాల్గొని ఆత్మీయంగా బలపడ్డాము. వాక్యధ్యానము, ఏకాంత ప్రార్ధన అలవాటయింది. చివరకు 1994 జూన్ 1వ తేదీ నీటిద్వారా బాప్తీస్మం పొందాము.

నా జీవితములో క్రీస్తు ఆయనను వెంబడించే ధన్యత నిచ్చి కనికరించాడు. దావీదు గొర్రెల కాపరిస్థాయి నుండి లేవనెత్తి రాజుగా చేయగల్గిన ప్రభువు నన్ను రాజులు, యాజకుల సమూహములో చేర్చి నిరంతరము ఆయనను ధ్యానిస్తూ దేవుడిచ్చిన తలాంతులను ఆయన మహిమార్ధము ఉపయోగించు కృపనిచ్చారు.

దావీదు దేవునికి హృదయానుసారునిగా జీవించాడు. గతంలో 10వ తరగతి పాస్ అయిన వెంటనే ఐ.టి.ఐ. కోర్సులో చేరాను. వాక్యం గ్రహించి అనుసరించుటకు అవలంభించాను. ఒకరోజు పాస్టరుగారు లూకా 13:6లో వివరించిన అంజూరపు చెట్లు ఆకులున్నవి. ఫలములు లేనందున నరికివేయాలని తలంచగా, తోటమాలి బ్రతిమిలాడి మరొక సంవత్సరము బ్రతుకనివ్వాలన్నాడు. నాలో ఆ వాక్యము పనిచేసినందున ఫలించే వ్యక్తిగా జీవించాలని ఆశించి, అనేకమంది క్రీస్తును గూర్చి సరిగ్గా తెలుసుకొనలేక నశించిపోవు చున్నారని గమనించి, ఆత్మల భారముతో నేను ఆయన సేవ చేయాలని నిర్ణయించుకున్నాను.

చివరకు 1996వ సంవత్సరములో బైబిలు కాలేజీలో ప్రవేశించాను. నా తల్లిదండ్రులు నన్ను ఆటంకపర్చలేదు. మద్రాసు వెళ్ళి 2 సంవత్సరాలు తర్ఫీదుపొంది 1998లో విజయవాడ చేరాను. ఉద్యోగము కొనసాగిస్తూ, దైవసేవ చేయవచ్చునని తల్లిదండ్రులు, సన్నిహితులు సలహాలనిచ్చారు. నేను నమ్మిన దేవుడు నన్ను పోషించగల నమ్మదగిన వాడని తెల్పాను. ట్రయినింగు పూర్తి కాగానే, పాయికా పురంలో దేవదానం గారి వద్దనే సేవలో సహకరిస్తూ నా సేవ ఆరంభించాను.

1998వ సంవత్సరములో ఆరంభములో 200రూ జీతముతో ఆరంభించి 700రూ జీతము పొందినప్పుడు నా వివాహము జరిగింది. సంతృప్తితో సర్ధుకొని గడుపుచూ కొదువలేకుండా దేవుని సేవను ఆనందంతో కొనసాగించాను. 2010లో బేతేలు చర్చిలో స్వంతవారి మధ్య పనిచేయుటకు పిలుపువచ్చింది. స్వకీయుల మధ్య ఘనుడిగా ఎంచబడనేమోనని ఆలోచించాను. దేవుని కార్యాలు ఆశ్చర్యకరమైనవి. బైబిలు మోయుటకు సిగ్గుపడిన నేను రోజూ బైబిలు పట్టుకొని జీవించుట కిష్టపడుచున్నాను. ఆటోనగర్‌లో సేవ ఆరంభించాను.

వ్యాపారుల మధ్య 2008 నుండి సేవ ఆరంభించి మీటింగులు నిర్వహించి ఆ ప్రాంతంలో పనిచేసే వారికి వాక్యం చెప్పాలని ఆశించాను. ఆ ప్రాంతంలో రాత్రివేళ అల్లరి మాకు యిష్టంలేదన్నారు. తారీఖులు నిర్ణయించిన రోజులో బంద్ జరిగినందున మీటింగులు కొనసాగినందున అందరూ ఆశ్చర్యపడు రీతిగా భోజనాలు ఏర్పాటు చేయబడి, అందరూ భోజనం చేసి వాక్యం విని అద్భుతంగా ప్రభువు మహిమ పర్చబడిన రీతిగా, దీవెనకరంగా ముగించగల్గాము.

ఏమీ లేదన్న స్థితినుండి అన్నీ ఉన్నాయి అనే స్థితికి చేర్చారు. అన్యులందరూ మీ దేవుడు గొప్ప దేవుడని ప్రశంసించారు. 2011,2012 సంవత్సరాలలో 72 గంటలు ప్రార్ధనలు జరిగించాము. మీటింగు సమయంలో వర్షం వచ్చినను మీటింగు ప్రాంతంలో వర్షం ద్వారా తడిచిపోకుండా అద్భుతము జరిగింది. రుచిచూచి దేవుని ప్రేమను తెలుసుకొని నమ్మకంగా సేవ కొనసాగించాను. చాలాసార్లు బిడ్డలకు అనారోగ్యం వాటిల్లగా ప్రభువు స్వస్థపర్చారు.

ఆయన రెక్కల క్రింద చేరిన ప్రతి వ్యక్తికి ప్రభువు అద్భుత దీవెననిస్తారని అనుభవంతో చెప్పగలను. ఎన్నికలేని నన్ను వెదకి సేవకు ఏర్పాటుచేసుకొని దీవించిన ప్రభువునకై నా జీవితమంతా స్తుతి చెల్లించగలను. ప్రభువు అందరినీ దీవించాలని నా ప్రార్ధన. ఆమెన్.

## 22. అజ్ఞానురాలనైన నన్ను క్రీస్తు తన అమూల్య సేవకై పిలిచారు

**ఎస్తేరు (తులసి) (ఇరిపాక, తూర్పు గో॥జిల్లా)**

**కీర్తనలు 115:4,5 "వారి విగ్రహములు వెండి బంగారువి. అవి మనుష్యుల చేతిపనులు. వాటికి నోరుండియు పలుకవు".**



**పరిచయము:–** ప్రభువు పాదములకు నమస్కరించి వ్రాయు యీ సాక్ష్యము అందరికీ ఆశీర్వాదకరంగా నుండు గాక. నా అసలు పేరు తులసి. రక్షణ పొందిన తర్వాత ఎస్తేరుగా నా పేరు నిలిచింది. మాది తూర్పు గోదావరి జిల్లా, ఇరిపాక గ్రామము. విగ్రహాలను పూజించే కుటుంబములో జన్మించాను. కార్తీకనోములు బహు నిష్టగా చేస్తూ పూజకు అవసరమగు వంటకాలు రకరకాలు వండి విగ్రహాల కర్పించిన తర్వాత మేము తినేవారము.

పూజకు ముందుగా స్నానం చేసి, ఆ నీటిలో ఇసుక పోగుచేసి పువ్వులమర్చి, ముగ్గు, పసుపు, పండ్లు, అగరు వత్తులతో అలంకరించి మ్రొక్కి తర్వాత నీటిలో కలిపివేసేవారము. జీవములేని సృష్టిని పూజించిన అమాయకత్వముతో గడిపాము.

నేను గౌరీ పూజ కూడా చేసేదాన్ని. ఉపవాస వ్రతాన్ని పాటించేదాన్ని. తెల్లవారక ముందే 3 గంటలకు అన్నం తిని సాయంత్రము వరకు ఏమీ తినేవారం కాదు. ఎన్ని పూజలు చేసిననూ నా మనస్సులో నిజమైన శాంతి గాని, తృప్తి, ఆనందము గాని ఏమాత్రము వుండేది కాదు. అందరిని చూచినపుడు వారివలె ఖరీదయిన బట్టలు లేవని, నగలు లేవని అమ్మమీద చాలా కోపము వచ్చేది. ఆడంబరంగా జీవించాలనే తపన వల్ల యితరుల బట్టలు అడిగి ధరించి ఆనందించేదాన్ని. అలంకారాలు, వేషధారణపై ఆసక్తి వుండేది.

నా అక్కకు మాత్రమే కొత్త బట్టలు కొనేవారు. నాకు బాధగా ఉండేది. 12 సంవత్సరాల వరకు చెవులు కుట్టించలేదు. నన్ను చూచిన వారంతా, నేను చాలా దురదృష్ట వంతురాలిననియు, ధరిద్రమంతా నాతోనున్నదని అన్నారు. నాకు చాలా దు:ఖము కల్గేది. అందరూ నిద్రించిన తర్వాత నేను వెంకటేశ్వర స్వామి బొమ్మ దగ్గర చేతులు జోడించి "స్వామీ, నాకు క్రొత్త బట్టలు దయచేయవా" అని ఏడ్చేదానిని.

అదే రీతిగా పూర్తి సంవత్సరము పూజలు చేస్తూ నాకు మంచి జరగాలని ప్రార్థించిననూ ఏ జవాబు లభించేది కాదు. మా నాన్నగారికి రేషన్ వ్యాపారముండేది.

చిల్లర డబ్బులన్నీ లెక్కపెట్టమని నా కప్పగించేవారు. నేను కొంత దాచుకొనేదాన్ని. ఆ డబ్బులన్నీ పుస్తకాలలో దాచిపెట్టి వినాయకుని ముందు పెట్టేదాన్ని. ఈ రీతిగా దొంగడబ్బులు దేవుడికివ్వరాదని తెలియలేదు.

**నిజదేవునితో పరిచయము:–** నా అక్క సరస్వతికి క్రీస్తును నమ్ముకున్న స్నేహితులుండేవారు. ఆమె క్రీస్తే నిజమైన మార్గము, సత్యము, జీవమని నమ్మి క్రీస్తు నామములో క్రమంగా ప్రార్ధన చేసుకొనేది. మా అందరి రక్షణ కొరకై ప్రార్థించేది. మా నాన్నగారికి తెలియకుండా క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళి కన్నీటితో ప్రార్ధించుట నాకు వింతగాతోచేది. ఆమె యింట్లో బైబిలు ధ్యానిస్తూ ప్రార్థించుచూ, విగ్రహ పూజలు చేయనందున మా కెవరికీ నచ్చేదికాదు. కాని విసుగక మా కొరకు రేడియో ప్రసారాలు వినే అవకాశాలు కల్గించి క్రీస్తు సువార్తను మేము అర్థం చేసుకోవాలని చాలా శ్రమ పడేది. నాన్నగారు లేని సమయంలో ఆరాధన, స్తుతి కృతజ్ఞత కూటాలు ఏర్పాటి చేసి మంచి బోధకులను యింటికి ఆహ్వానించేది. మా అక్క అవిరామంగా, అకుంఠిత దీక్షతో మా జీవితాలు మారాలని చేసే ప్రయత్నాల ఫలితంగా నాలో మార్పు కల్గింది. క్రీస్తు ప్రేమ, దయ, కనికరం గల దేవుడని గ్రహించి యింకా ఎక్కువ తెలుసుకోవాలనే ఆసక్తి కల్గింది.

ఒకసారి మా అక్క ముఖర్జీ గారు వాక్య బోధన చేసిన క్యాసెట్టు కొన్నది. మా ఫ్యామిలీ డాక్టరుగారు జేసుబాబు అన్నయ్య మాకు వైద్యము చేసేవారు. ఆయనను దర్శించడానికి దైవజనుడు వచ్చేవారు. మాకు సందేశాలు వినిపించాలనే కోరికతో మా అక్క వాళ్ళింటి ప్రక్కగా నివసించే ఒక యవ్వనస్తుని సహాయంతో టేప్‌రికార్డరు తెప్పించి ఆ మంచి సువార్త యిష్టములేని ఆ అబ్బాయి వినాలని కోరకతో ప్రార్ధించి వినిపింపజేసింది.

అదే ఆత్మలభారం గల విశ్వాసి చేయు మంచి పని అని తర్వాత గ్రహించాను. అదేరాత్రి అక్కకు ఆ అబ్బాయి మారుమనస్సు పొందాలనే కోరికను బట్టి ప్రార్ధనా ఫలితంగా సజీవుడైన క్రీస్తు తన మెల్లని స్వరంతో సూటిగా మాట్లాడారట. “బాబూ, నా మాటలంటే నీకు నిర్లక్షమెందుకు? ఎందుకీరీతిగా హేళనగా మాట్లాడుచున్నావని గద్దించారట. ఆ ప్రభుని మాటను విన్న వెంటనే అతనిలో గణనీయమైన మార్పు కల్గిందట. వెంటనే మా అక్క అతనికి దేవున్ని గూర్చి వివరించి,

“తమ్ముడూ, నీవు దేవునికొరకే జీవించాలి. ఈ లోకంలో ఏమి సంపాదించిననూ, సర్వమూ వ్యర్థమగును సుమా!” అని తెల్పిందట. ఆ మాటలన్నీ నమ్మి వెంటనే ప్రభువును రక్షకునిగా స్వీకరించి మారుమనస్సు పొందాడు. గొప్ప ఆదర్శవంతునిగా క్రీస్తుప్రేమ

ప్రభావితము చేయగా కట్నం తీసుకోకుండా వివాహము చేసుకొన్నాడు. మా అక్కకు క్రీస్తుపట్ల గల భక్తి విశ్వాస్యతను గమనించుచున్న నేను, యవ్వనస్తుని జీవితంలో కల్గిన మారుమనస్సును గుర్తించి విశ్వాసంతో నిలిచాను.

మాకు తెలిసిన జేసుబాబు అన్నయ్యకు దైవజనుడైన ముఖర్జీగారు మామగారయ్యారు. వారి కుమార్తె రూతు అక్కను వివాహము చేసుకొని మా ఊరిలో స్థిరపడుట దేవుని ఉచితకృపగా భావించి చాలా ఆనందించాము. వైద్యపరంగా ఆ అన్నయ్య మా నాన్నగారిని దర్శించి దేవుని గూర్చిన సంగతులన్నీ వివరించేవారు. స్వతహాగా మా నాన్నగారు నీతిగా జీవిస్తూ ప్రజల క్షేమము కాంక్షిస్తూ రాజకీయ రంగంలో కృషిచేస్తున్నందున తన స్వంత సొమ్ము కూడా ఖర్చుచేస్తూ ఆపదలో అవసరాల్లో నున్న వారికై శ్రమించేవారు. ఒకరోజు ఆ అన్నయ్యతో మాట్లాడిన మాటలు విన్నాను. “జేసుబాబూ, ఈ ఊరిలో భక్తిచేసే వారి ప్రవర్తన సరిగాలేదు. ఎవ్వరికీ నచ్చుటలేదు. నీవైనా పదిమంది వ్యక్తులను మంచి మార్గంలోనికి నడిపించి దైవభక్తి గలవారిగా మార్పు తేగల్గితే నేను కూడా అదే మార్గాన్ని అనుసరించగలను” అని తెల్పారు.

మా నాన్న మమ్ములను బయట జరిగే ప్రార్థనలకు వెళ్ళనిచ్చేవారు కారు. మీకిష్టమయితే యింట్లోనే వుండి ప్రార్థన చేసుకోవచ్చునని తెల్పారు. ఆ రోజుల్లో జేసుబాబు నాన్నగారు కూడా మా ఊరిలోనే నివసించసాగారు. ఆయన మా నాన్నగార్కి దేవుని మాటల్ని చెప్పేవారు. వారింట్లోనే ఆదివారాలు ఆరాధనను ఆరంభించారు. తరచుగా మా యింటికి వచ్చి ప్రార్థించేవారు. ఒకరోజు మా నాన్నగారిని గద్దిస్తూ “మీరు చుట్టలు త్రాగుట మానివేయాలండీ” అన్నారు. వెంటనే దైవాత్మ పనిచేయగా ఆ త్రాగుట మానివేసారు. మా యింట్లో అప్పుడప్పుడు ప్రార్థనా కూడికలను ఏర్పాటు చేసేవారు. మా అక్క నేర్పిన దేవుని భక్తి, దైవజనుల వర్తమానాల ప్రభావము వల్ల నేను ప్రార్థన నేర్చుకొన్నాను. ప్రార్థించుట వల్ల నా బలహీనతలన్నీ స్పష్టంగా తెలియసాగాయి.

గతంలో మా యింటి ఎదురుగా ఒక వృద్ధురాలికి ఒక కోడి రోజూవచ్చి గ్రుడ్డుపెట్టేది. ఒక కోతి వచ్చి పెరట్లో పెట్టిన గ్రుడ్డును తినివేసేది. అదే సమయంలో నేను ఆ గ్రుడ్డు రోజూ తెచ్చుకొని తినేదాన్ని. దేవుడా పాపాన్ని దొంగవని గుర్తుకు తెచ్చారు. పుల్లలు కూడా దొంగతనం చేసాను. మా అమ్మను విసిగించాను అందరికీ క్షమాపణ తెల్పాను. నా కొరకు సిలువ వేయబడిన క్రీస్తే నాలో పాపక్షమాపణ పొందిన అనుభవమిచ్చారన్న నెమ్మది పొందాను.

**1 యోహాను 1:7 "యేసు రక్తము మన ప్రతి పాపములనుండి మనలను పవిత్రులనుగా చేయును".** ఈ వాక్యము నాపట్ల నెరవేరింది. నాకు రక్తస్రావమనే వ్యాధి వుండేది. గతంలో ఎందరో దేవతలకు పూజలు చేసిననూ తగ్గలేదు. నా ఆత్మీయ స్వస్థతతో పాటు శారీరక స్వస్థత నాకు లభించగా నా శరీరములోని భారమంతా తొలగిపోయింది.

మా నాన్నగారు రాజకీయాల గొడవలలో చాలా గాయపడ్డారు. మరణము అంచుకు చేరగా ఆస్పత్రిలో చేర్చాము. దయగల యేసు దర్శనములో మా నాన్నగార్కి కన్పించారు. తెల్లని వస్త్రాలు ధరించి కాంతివంతమైన ముఖవర్చస్సుతో కన్పించి చేయిచాచి గాయాలను ముట్టినట్లుగా చూచారు. అంతేకాదు ఆయన గాయాలు స్వస్థపర్చుటకై ఇంజక్షన్ చేసి చేయిపట్టి నడిపించి వెళ్ళిపోయారు. మరణావస్థనుండి జీవముపొంది యింటికి క్షేమంగా చేరారు. దేవుని ప్రత్యేక ప్రణాళిక మా అందరిలో సమృద్ధిగా నెరవేరుట మాకు చాలా ఆశ్చర్యము, ఆనందము కల్గించింది. లెమ్ము తేజరిల్లుము, నీకు వెలుగు వచ్చిందన్న ఆదేశమును బట్టి ముఖర్జీ గారి హెచ్చరికలు పాటిస్తూ ఆయన క్రమాన్ని ప్రశంసిస్తూ క్రీస్తు ప్రేమను గ్రహించగల్గారు.

ఎంతటి మార్పు కల్గిననూ, మమ్ములను ప్రార్థనలకు బయటకు పంపుట కిష్టపడేవారు కారు. మా నాన్న లేని సమయంలో ధైర్యము చేసి మందిరానికి వెళ్ళిపోయాను. నేనింటిలో లేనందున నన్ను పేరుపెట్టి పిలిచి అడుగగా ఆమె ప్రార్థనకు వెళ్ళిందని తెల్పారు. ఎందుకామెను పంపావని అమ్మను చాలా కోపడ్డారు.

"ఆ మాట మీరు అనవద్దు నేను వినవద్దు" అని ధైర్యంగా చెప్పింది. మా నాన్నకు కనువిప్పు కల్గి మౌనంగా ఉండిపోయారు. ఎన్నడూ నా మాట ఎదురించలేని అమ్మ కూడా దేవుని సన్నిధి కొరకు ధైర్యముగా జవాబిచ్చినది గనుక మరలా ఆటంకము చేయక నేను ఆరాధనలకు వెళ్ళుటకు అనుమతి యిచ్చారు.

ఆ తర్వాత ముఖర్జీ గారు మాయిల్లు దర్శించి మా నాన్నతో దేవుని విషయాలను సంప్రదించారు. రక్షణ చాలా అవసరమనియు, యేసు ద్వారా మాత్రమే ఆత్మకు విమోచన లభిస్తుందనియు, చెప్పగా మా నాన్న చివరిగా క్రీస్తును అంగీకరించుటకు నిర్ణయించుకున్నారు. పాపాలన్నీ వినయముతో ఒప్పుకొని, తనకు విరోధముగా నున్న వారితో సమాధానపడ్డారు. క్రైస్తవ దేవాలయాలకు వెళ్ళుటకు అడ్డుపెట్టే వ్యక్తిగా నుండే వారు క్రమంగా మారి ఆయనే స్వయంగా ప్రార్థనలకు వచ్చి ఆరాధనలలో పాల్గొనేవారు. మంచితనము, ధర్మకార్యాలు, ఒకనిని పరలోకము చేర్చావు, గాని యేసే మోక్షానికి నిజమైన మార్గమని దృఢంగా నమ్మారు.

**అపొస్త 26:18 "యేసు నందలి విశ్వాసము ద్వారా పాపక్షమాపణ, పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యము పొందగలము".**

అనే వాక్యాన్ని నమ్మారు. జన్మ, కర్మ పాపాలను తొలగించే ప్రభువు క్రీస్తేనని విశ్వసించారు. ఆ తర్వాత పరలోక ప్రవేశానికి పూర్తిగా సిద్ధపడిన తర్వాత ప్రభువునందు నిద్రించి పరలోకం చేరారు. అన్యాచారాలకు దూరంగా క్రైస్తవ పద్ధతిలో సమాధి చేసాము. మా బంధువులంతా ఆశ్చర్యపడే రీతిగా వింతగా చూచారు. నాన్న మరణించిన దిగులు లేకుండా పరలోక వాతావరణము మమ్ములను ఆనందపర్చింది. మా ఆత్మీయ జీవితాలకు బలాన్ని యిచ్చి స్థిరపర్చిన వ్యక్తి ముఖర్జీ గారిని బట్టి దేవునికి కృతజ్ఞత చెల్లిస్తూనే వున్నాము. మా అమ్మ కూడా పూజలు మానివేసి దేవున్ని నమ్ముకొని బాప్తీస్మము తీసుకొని సహవాసంలో ఆనందించు ధన్యత పొందింది. నా బ్రతుకులో క్రీస్తు చాలాసార్లు వాక్యం ద్వారా నడిపిస్తున్నారు.

**మీకా 7:19 "వారి పాపములన్నిటిని సముద్రపు అగాధములో పడవేతువు".**

ఆ వాక్యము ద్వారా నేను సంపూర్ణముగా నా జీవితాన్ని దేవునికి సమర్పించుకొని నీటి బాప్తీస్మము పొందాను. అప్పటి నుండి తులసిగా నున్న నాపేరు మారి ఎస్తేరు నయ్యాను. నేను దేవుని సేవ ఎట్లు చేయాలి? చదువురాని దానినని నా మనస్సులో దిగులుతో ప్రార్థించుచుండగా ముఖర్జీగారు ప్రసంగంలో ప్రవచనాత్మకంగా "చదువురాని దానినని, అజ్ఞానినని నిరుత్సాహము ఎందుకు? నీ చదువు, జ్ఞానము ప్రాముఖ్యము కాదు. నీవు అందుబాటులో నుండిన చాలునన్నారు.

**యిర్మీయా 1:4 "గర్భములో నుండగా నిన్నెరిగితిని".** నేను సేవకు సిద్ధపడగా ఆటంకాలు ఎదురయ్యాయి.

**యిర్మీయా 15:19 "వారు నీతట్టు తిరగవలెను గాని నీవు వారితట్టు తిరుగరాదు".**

యేసువైపు మాత్రమే చూచుచూ సాగిపోవాలని నిర్ణయించుకున్నాను. సేవకు సమర్పించుకొని వెనుకకు తిరగరాదని అందరూ బెదిరించారు. నా యింటివారే నాకు శత్రువులై వ్యతిరేఖించారు. మా తల్లి ఆ రోజుల్లో చాలా నీర్సమై లేవలేని స్థితికి చేరింది. యీ ఆటంకాలన్నీ ఏ రీతిగా ఎదుర్కొవాలో ప్రార్థించుకున్నాను. దేవుడు మరలా వాక్యము ద్వారా మాట్లాడారు.

**యిర్మీయా 1:17 "కాబట్టి నీవు నడుము కట్టుకొని నిలువబడి నేను నీ కాజ్ఞాపించినదంతయు వారికి ప్రకటన చేయుము. భయపడకుము. వారి యెదుట నీకు భయము పుట్టింతును".**

నా కొరకై యీ గొప్ప సత్యాలు ప్రభువు దాచివుంచారని దేవున్ని స్తుతించాను. గొప్ప సత్యాలను దాచిన బైబిలు మనకు అందుబాటులో నుంచి మంచి జీవితాన్ని జీవించు ధన్యతనిచ్చిన దేవునికి వేయినోళ్ళతో స్తుతించిననూ జీవితము చాలదన భావిస్తాను.

**యోబు 5:21 "నోటి మాటల చేత కలుగు నొప్పి నీకు తగులకుండా ఆయన నిన్ను చాటుచేయును".**

నా స్వకీయుల మాటలు బాధించగా ఈ వాక్యము ద్వారా దేవుడే చాటుచేసి ఆదరించారు. దైవ సేవకులు నాకు ఆత్మీయ తల్లిదండ్రులయ్యారు. మా నాన్న నేర్పిన క్రమము నాకు సేవలో జయ జీవితము జీవించే కృప నిచ్చింది. నేడు నాకు దేవుని పుస్తకాలు అమ్ము పరిచర్యను అప్పగించారు. ఒకప్పుడు అజ్ఞానం నుండి నన్ను తన ఉచితకృపతో రక్షించి తన అమూల్య పరిచర్యకై పిలిచారు. అంతము వరకు ప్రభుని బిడ్డగా జీవించాలని నా కొరకై ప్రార్థించండి. ప్రభుని కృప మీతోనుండు గాక. ఆమెన్.

---------

# 23. మరణ ఛాయలో వెలుగునిచ్చిన క్రీస్తు నా ప్రభువు

**చిట్టి సుందర కుమారి (హన్నా) (చిన గొల్లపాలెము)**

**యెషయా 40:28 “ఆయన జ్ఞానము శోధించుట అసాధ్యము. సొమ్మసిల్లిన వారికి బలమిచ్చు వాడు ఆయనే”.**



**పరిచయము:–** నా పేరు హన్నా. నేను నామకార్థ క్రైస్తవ కుటుంబములో పుట్టాను. మాది కృష్ణాజిల్లా తాడినాడ గ్రామము. నేను బాల్యములో నిజాయితీగా లేను. దొంగతనములు, అబద్ధములతో గడిపాను. నేను చేసిన దొంగతనాలు తమ్ముళ్ళకి అంటగట్టి తప్పించుకున్నాను. మా నాన్న వాళ్ళను కొట్టి బాధించేవారు.

అనుకోని రీతిగా స్నేహితుల ప్రభావంతో సినిమాలను చూస్తూ అబద్ధాలు చెప్పి ప్రార్థనా కూటాలకు వెళ్తున్నాననేదాన్ని. వయస్సుతో పాటు నాలో పాపం కూడా పెరిగిపోతూనే ఉంది. విద్యాభ్యాసం కొరకు భీమవరము హాస్టలులో చేరాను. నేను ఏడవ తరగతిలో నుండగా మరో అమ్మాయితో కలిసి హాస్టలు గేటు దూకి పారిపోయి మా యిల్లు చేరాము. ఇక చదువు ఆపివేసి పొలము పనులు చేసుకొనేదాన్ని. నాకు దేవుని భయము లేనందున, నాకు వయస్సు సరిగా రాకపోయినా భారం వదిలించుకోవాలని నాకు వివాహం చేసారు. అత్తగారిల్లు చేరాను.

అది కుగ్రామమైన చిన్న గ్లొపాలెము. రాకపోకలు చాలా అరుదుగా వుంటాయి. నా భర్త త్రాగుబోతు. నేనుభర్తను వదలి పుట్టిల్లు చేరాలని సలహా యిచ్చిన వారున్నారు. అయినను మా అత్తగారు చాలా మంచి వ్యక్తి. క్రీస్తును నమ్మిన విశ్వాసి. ప్రార్థనా పరురాలు. నా భర్త నన్ను శ్రమపెట్టినప్పుడు ఆమె అతనిని గద్దించి నన్ను ఓదార్చి, నాగురించి ప్రార్థనచేసేది. నన్ను కూడా క్రీస్తును నమ్మి ప్రార్థించమని ప్రోత్సహించేది.

నేను అందరినీ భ్రమలోపెట్టి నా పాప జీవితాన్ని కొనసాగించాను. నాలో నెమ్మది లేదు. సారా, కల్లు కాసి అమ్మి కల్తీచేసి నందున డబ్బులు సంపాదించేదాన్ని. పరాయి ఊరు వెళ్ళి సారా అమ్ముట ఎవరికీ తెలిసేది కాదు. నా భర్త తల్లి నా ప్రవర్తన గ్రహించి సైతాను బానిసగా మారుచున్నావని హెచ్చరించేది.

మేము బ్రతుకుతెరువు కోసము వేరే ప్రాంతము వెళ్ళి పనులు చేసుకొని బ్రతికే రోజుల్లో నా మూడు సంవత్సరాల వయస్సుగల బిడ్డ నా రెండవ అమ్మాయి అన్నామణి ప్రక్కనున్న చెరువులో పడిపోయి తామరాకుల మధ్య తేలిపోయి వుంది. ఆమెను మోసి యింటికి తెచ్చి, కొన ప్రాణముతో నుండగా డాక్టరు వద్దకు తీసుకొని వెళ్ళాము. ఆమె తిరిగి జీవముతో నుండునో లేదో తెలియలేదు. ఏడుస్తూ దేవున్ని తలంచుకున్నాను.

ఆ రాత్రి కలలో పెద్దగాలి వీచగా నా దగ్గరున్న బైబిలులోని కాగితాలు ఎగిరిపడుచుండగా అవన్నీ ఏరుకొని తిరిగి బైబిలులో పొందుపర్చు చున్నట్లుగా చూచాను. నిద్రలేచి కాస్త ఆందోళన చెందాను. అయినను నా పాతజీవితాన్ని వదలలేదు. నేను చాలా గొడవలలో తలదూర్చి ఎందరిలో బాధించేదాన్ని. మాటకు రెండు అదనపు మాటలు చేర్చి కరకుగా పలికేదాన్ని.

నా పాపపు స్థితి ఎట్టిదనగా పనులభారంతో వలసవెళ్ళి నెల్లూరులో కష్టించి జీవనం గడిపే రోజుల్లో నేను నా స్నేహితులము కూరగాయలు కొనుగోలు చేయుటకు వెళ్ళునప్పుడు దుకాణాదారుడు చాలా కోపంతో తృణీకరించి పొమ్మనగా మేమంతా కలిసి అతని జుట్టుపట్టి క్రిందకు పడవేసి బాధించి కొట్టులోని కూరగాయలను చిందర వందరగా పడవేసి నష్టం కల్గించాము. అట్టి చెడ్డపనులు చేయుటలో పాపిగా జీవించాను. నా పాపస్థితిని బట్టి చాలా ఆందోళన, అశాంతి నాలో నిలిచాయి.

నా భర్త ఆస్థి అంతా నష్టపరిచే రీతిగా త్రాగేవాడు. ఒకరాత్రి బిడ్డలతో మరణించాలని ప్రయత్నించాను. నా చిన్నకుమార్తె అభ్యర్ధన ద్వారా మా మరణాన్ని దేవుడే తప్పించాడు. “అమ్మా, మనము చనిపోవద్దు” ఈ మాటలు నన్ను మేల్కొలిపాయి. ఆ సమయంలో మరణం దాటిపోయింది. దేవునికి నా పాపజీవితాన్ని తప్పించి తన బిడ్డగా మార్చుకొనే సంకల్పముండుటను బట్టి దైవజనుడైన ముఖర్జీ గారిని మా ప్రాంతము పంపారు. దైవజనుని వాక్యము ప్రతి వ్యక్తి హృదయాన్ని కదిలించింది. గాని నా హృదయంలో చలనము రాలేదు. రెండవరోజు వాక్యము రెండంచుల ఖడ్గముగా నాలో దూసుకొని వెళ్ళింది. పాపమునకు జీతము మరణము అనే మాట నాలో సంచలనాన్ని కల్గించింది. పాపాలు దేవుని ఎదుట ఒప్పుకోవాలని, దేవుడు దయతో క్షమించు ప్రేమామయుడని తెలియజేయగా హృదయభారంతో ప్రార్ధించుట కారంభించాను. రాత్రి ప్రార్ధనలో గడిపినపుడు ఒక దర్శనము కల్గింది.

అది ఒక పెద్ద బావి. దానిలో చాలా చెత్త ఉంది. అది తీసి బయటకు పారవేస్తున్నాను. ఆ దర్శనము గూర్చి విశ్వాసియైన మా అత్తగారికి చెప్పాను. "అమ్మా, నీ హృదయాన్ని నీవే బాగుచేసుకోవాలి". అని ఆమె వివరించింది. ఆ తర్వాత మూడవరోజు నేను వాక్యము అతి శ్రద్ధగా విన్నాను. హృదయాన్ని దేవుడే తెరిచినప్పుడు దైవవాక్యము మధురంగా ఉంటుందని గ్రహించాను.

"నీ పాపాలు ఎలాంటివైనా ఒప్పుకోవాలి. దొంగిలించిన వస్తువులున్నాయా? ఎవరి వద్ద దొంగిలించావో వారికిచ్చేయాలి అని తెల్పారు. "ఆయన ముఖము ప్రకాశవంతంగా కన్పించగా భయము కల్గింది. గతంలో ఒకరియింట్లో రిస్ట్‌వాచ్ దొంగతనం చేసాను. అది తిరిగి యిచ్చేసాను. దుకాణంలో సరుకులు తీసుకొని డబ్బులు చెల్లించక పారిపోయేవాడిని. యీ రీతిగా నా పాపాలన్నీ సినిమా రీలులాగా నాముందు కదిలాయి. అవన్నీ వరుసగా ఒప్పుకొన్నాను.

మా ఊరిలోని వారంతా గొడవలు, అరుపులతో గందరగోళంగా ఉండేవారు. దైవవాక్య ప్రభావం వల్ల అందరిలో పాపభీతి కల్గింది. ప్రతి వ్యక్తిలో పశ్చాత్తాప భావం కలిగి కన్నీటితో ఎవరి పాపాలు వారు ఒప్పుకొనుట చూచి నా పాపముల భారం బరువైనందున "దేవా, నా భయంకర పాపాలు క్షమించండి" అని బిగ్గరగా ఏడ్చాను. విరోధుల కాళ్ళపై పడి క్షమాపణ అడుగుట వింతగా తోచింది. నాలోనున్న చెత్తంతా తీసివేస్తున్న కల నెరవేర్పు జరుగుట ఆశ్చర్యం కల్గించింది.

మరొక దర్శనాన్ని చూచాను. ఒక సోదరి చేతిలో బైబిలు తెరువబడి ఉంది. నా చెవిలో ఒక స్వరం వినబడింది. "అమ్మా, నీ పాపాలు యింకా మిగిలివుంటే అన్నీ ఒప్పుకో" అని రెండుసార్లు విన్పించింది. నా పాపాలే కాక, నా తల్లిదండ్రుల పాపాలు, ప్రతి చిన్నతప్పులన్నీ దేవుని ముందు ఒప్పుకొని క్షమాపణ వేడుకున్నాను. ఎవరిదగ్గర ఏమేమి వస్తువులను తీసానో వారికి తిరిగి యిచ్చేసాను. రిస్ట్‌వాచికి తగిన ఖరీదు లేనందున నా కాళ్ళపట్టాలు పొట్లాము కట్టి గతంలో ఏ ఊరిలో తీసుకొన్నానో అక్కడ యివ్వగా, "అమ్మా, మేము నీలో మార్పును చూచాము. వస్తువు వద్దులే అన్నారు. ఐస్‌క్రీము వాడి దగ్గర, దుకాణం దగ్గర చేసిన దొంగతనాలన్నీటికి డబ్బులు చెల్లించాను. నా తల్లిదండ్రుల వద్ద చేసిన మోసాన్ని ఒప్పుకున్నాను. నా భర్తపట్ల అవిధేయత, నిర్లక్ష్యము, మోసము చేసిన రీతిని బట్టి కన్నీటితో క్షమాపణ తెల్పాను.

ఆ రోజుల్లో ఆర్థిక స్థితి సరిగా లేనందున కరువులో వుండి బాధపడేవారం. మాకు 7 సంవత్సరాలుగా వర్షాలు లేవు. ఒకవేళ వర్షాలు వచ్చినపుడు చేపలు, రొయ్యలు నిండుగా చేరేవి. ఎండిపోయిన స్థితిలోనున్న ఆ ప్రాంతం వల్ల మాకు పనులుండేవి కాదు. దైవజనుడు ఎలియావలె ప్రార్థించి, మీరంతా మీ పాపాలు ఒప్పుకొన్నందున దేవుడు కనికరించి వర్షాలు పంపగలడని తెల్పారు. ఆయన ప్రార్థించిన ఫలితంగా మంచి వర్షాలు పొందాము. రొయ్యలు, చేపలు మరలా చూచి ఆనందించాము. మాకా దైవజనుని సందేశాలన్నీ చాలా ఆత్మీయ బలాన్ని చేకూర్చుచున్నందున ఆకివీడు వెళ్ళి మీటింగులకు హాజరయ్యి ఆనందించేవారము. ఆహ్వానం ద్వారా ఆయన మా దగ్గరకు వచ్చి ఆరాధన జరిపించి విశ్వాసులుగా మమ్ములను మార్చారు.

ఆ రోజుల్లో యితర ప్రాంతాల్లో సేవలో నిమగ్నమయిన దైవజనుడు క్రమంగా మాకు బోధించుటలో లోపమైనందు ఆత్మలో నీరసించి వెనుకబడ్డాము. కొందరు మరణించారు. నా భర్త అకాల మరణము నన్ను బాధించింది. ఆ పరిస్థితుల్లో కొందరు బోధకులను మా ఊరు పంపగా ఉజ్జీవము ఆరంభమయింది ఆయన మాపట్ల కనికరము కల్గి మా ఆత్మలను ఉద్ధరించి క్రీస్తు ప్రేమకు సాక్షులముగా తిరిగి సంసిద్ధము చేసారు. నేను ఎల్లప్పుడు కృతజ్ఞతతో దేవున్ని స్తుతిస్తూనే ఉన్నాను.

చీకటిలోను, మరణచ్ఛాయలో నశించిపోతున్న నాపైకి దేవుడు తన మహాకృప వల్ల వెలుగును ప్రకాశింపజేసాడు. మోడుబారిన నా జీవితము చిగురించింది. ఆయన నామమునకు ఘనత మహిమ కల్గునుగాక. ప్రభువు తన వాక్యము ద్వారా నన్ను ఆదరించారు.

**యెషయ 6:6"ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్తమాయెను".**

ఈ మాట నన్ను చాలా ధైర్యపరచింది. గతంలో గొప్ప పాపిగా నుండగా నన్ను ప్రభువు వెదకి రక్షించారు. నా బిడ్డలను పరిశుద్ధతతో బైబిలు నేర్పించుచు భక్తితో పెంచుకున్నాను. వారు ముగ్గురూ మారుమనస్సు అనుభవాన్ని పొంది, క్రీస్తుకు సాక్షులుగానున్నారు. వారిలో యిద్దరు దైవసేవకులుగా ప్రభువును సేవించుట నాకు దేవుడిచ్చిన గొప్ప ధన్యతగా భావించి కృతజ్ఞతతో ఆ మహిమ గల దేవున్ని నమ్మకంగా సేవిస్తున్నాను. మా కొరకు ప్రార్థించండి. దేవుని దీవెన మనపై ఉండును గాక. ఆమెన్.

---------

## 24. నిజ రక్షణానుభవం అనగా క్రీస్తును అంగీకరించి వెంబడించుటయే

**జ్యోతి (నరసాపూర్, కరీము నగర్ జిల్లా)**



**యిర్మియా 17:9 "హృదయము అన్నిటికంటే మోసకరమైనది. అది ఘోరమైన వ్యాధి కలది".**

**పరిచయము:–** మాది కరీంనగర్ జిల్లా, నర్సాపూర్ గ్రామము. అన్యుల కుటుంబములో జన్మించాను. మా యింట్లో చిన్నదానిగా గారాబంగా పెరిగాను. మా ఊరిలో పెద్ద చదువులు చదివే అవకాశము లేనందున సాంఘీక సంక్షేమ హాస్టలు స్కూలులో చేర్పించగా అక్క, నేను కలిసి గడిపేవారము. నా స్నేహితురాలు నన్ను యేసయ్యను తలంచుకొని ప్రార్ధన చేయాలని కోరేది. నేనేమాత్రము లక్ష్యపెట్టేదాన్ని కాదు. ఆమె నాకోసం భారంతో బాధ్యతగా ప్రార్ధన చేసేది. కాని చదువు పూర్తి అయ్యాక నేను ఒక సందర్భములో సువార్త కూటానికి వెళ్ళాను.

ప్రభువు నాతో సూటిగా మాట్లాడారు. "నీ పాపమనే రోగము నుండి విడుదల పొందే అనుభవం చాలా ప్రాముఖ్యమైనది. విస్తార వేదాంత పాఠముల కంటే క్రీస్తే రక్షకుడు అని చాటిచెప్పే సాక్ష్యము ఘాటు. తమ రక్షణ సాక్ష్యమును తరచుగా ఇతరులకు చెప్పేవారు తమ ఆత్మీయ జీవితములో జయములను ఎడతెగక చవిచూడగలరు. బైబిలు చదువుట కాసక్తి చూపాను. నా చిన్నతనములో మా నాన్నగారు చనిపోయారు. మా అమ్మకు అనారోగ్యం వచ్చింది. హైదరాబాదులో బంధువుల దగ్గర ఆమెను వుంచి మంచి వైద్యము చేయదలచాము. ఆ ప్రాంతంలో మంచి బోధచేయు దైవజనులున్న ఆలయానికి ఆదివారము వెళ్ళేదాన్ని.

"నీవు యేసుప్రభువును నమ్ముతున్నానంటున్నావు కద! నా రోగం కోసం ఏనాడైనా ప్రార్ధన చేసావా"? అని అడిగింది. అమ్మ లేకపోతే మాకిక దిక్కెవ్వరు అని తలంచి, నాకు సరిగా ప్రార్ధించుట తెలియకపోయినను, మోకాళ్ళు వంచి ప్రార్ధించాను. ఆమెపై దుష్టశక్తుల ప్రభావము వుండటము వల్ల ఆమె క్షీణించిందని గ్రహించాము. ఆమె కొరకు ప్రక్కయింటి వారిని పిలచి ప్రార్ధనలు చేయించాను. ఆమెలో దయ్యము విలవిల లాడిస్తుంటే నాకు

భయము కల్గింది. అయినను యేసు రక్తములో, ఆయన నామములో ప్రార్థించగా ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలైంది.

యేసయ్య చాలా గొప్ప శక్తి వంతుడగు దేవుడని దృఢంగా నమ్మకము కల్గింది. అప్పటికే మా పిన్ని, మామయ్యలు 15 వేలు ఖర్చు పెట్టారు. ఖర్చు లేకుండా కేవలము ప్రార్ధన ద్వారా స్వస్థత లభించిన రీతినిబట్టి నా మనస్సు మారింది. నా చదువులన్నీ వ్యర్ధమే గనుక క్రీస్తు సేవ చేయుట యోగ్యమైన పనిగా భావించాను. బైబిలు కాలేజీలో చదివి దేవున్ని గూర్చి మరింత తెలుసుకోవాలని ఆశించాను.

ఆ సంస్థలో చేరాలంటే పదవ తరగతిలో ఉత్తీర్ణురాలను కావాలి. నీటి బాప్తీస్మము తీసుకొని వుండాలి. యీ శరతులను పొంది, మూడు సంవత్సరాల పాటుగా కోర్సు పూర్తిచేసాను. నేను చదివిన వేదాంత జ్ఞానమున్ననూ సరిగా ప్రార్ధించుట నేర్చుకోలేదు. మా వార్డెను ప్రార్థించి ధైర్యపర్చారు. దేవుని సంపూర్ణ చిత్తము తెలుసుకోలేకపోయాను. నన్ను యీ కోర్సునుండి వెనక్కు పంపండని ప్రార్ధించాను. ప్రభువును గాయపర్చాను. 6 నెలలుగా సేవలో సెలక్టయి కొనసాగి గూడూరు వెళ్ళాను.

**2 తిమోతి 2:2 "సామర్థ్యమైన నమ్మకమైన వారికి పరిచర్య అప్పగించు" అనే** ఆదేశానుసారము నేను ప్రసంగించాను. నాకు మంచి పాస్టరు అనే పేరు వచ్చింది. ఏ ప్రాంతానికి వెళ్ళి సేవచేయ దలంచక పాస్టరు గారి సహకారంతో ఒక ఆస్పత్రిలో పనిలో నిమగ్నమయ్యాను. ఆ ప్రాంతములో దేవుడు విలువైన పాఠాలు నేర్పించాడు.

దేవుని మహిమార్ధము చేయు పరిచర్యలో ఎప్పుడూ ఘనమైన విజయాలు దాగివుంటాయి. ఎందరో వ్యాధిగ్రస్తులు నా ప్రార్ధనా ఫలితంగా స్వస్థత పొందుట కారంభమైంది. మా అక్కతో నేను చెప్పినదేమనగా నీవు కోరినట్లు ఏ ఉద్యోగాన్ని చేయను గాని కేవలము దేవుని సేవ మాత్రమే చేయగలను అని తెల్పాను. అయిననూ నేను ఎమ్.ఎల్.టి. కోర్సు పూర్తిచేసాను. యేసయ్యను దూరము చేసుకొన్ననూ ఆయన మనలను ప్రేమించుటలో జాప్యము చేయరు. నేను మరలా స్టడీ కొనసాగించాను. ఒక సంస్థలో చేరాను. నాకు మంచి గుర్తింపు, స్పిరిట్యువల్ ఆవార్డ్ యిచ్చారు. ఎన్ని పదవులలో నున్ననూ రక్షణ స్థిరత లేదని గ్రహించాను.

ఏ యోగ్యత లేకున్నను కాకతీయ మెడికల్ కాలేజీలో వరంగల్‌లో నున్న ఒక ఖాళీ నాకే దక్కింది. అక్కడ వసతికై ప్రయత్నించగా ఒక క్రైస్తవ సంస్థలో చర్చి సమీపములో

కొందరు బసచేస్తున్నారని తెలిసి వారిలో చేరాను. చర్చి కార్యక్రమాల్లో పాల్గొని మంచి దైవజనుని ప్రసంగాలు వినుట వల్ల చాలా ఆనందించేదాన్ని.

దైవజనుడు సూటిగా గద్దించేవారు. నా ప్రార్ధనా సమయాన్ని పెంచుచూ దేవునితో సహవాసము గడుపుట కారంభించాను. ఆ దైవజనుడు ముఖర్జీ గారు ఒక ఆదివారం ప్రసంగించుటలేదని తెలిసి నిరుత్సాహపడ్డాను. ఆ సందర్భములో లాజరన్ గారనే పెద్ద వయస్సు గల అంకుల్ "అమ్మా, దేవుడు మాట్లాడాలనుకుంటే ఎలాగైనా నీతో మాట్లాడతారు. నువ్వెందుకు బాధపడతావు. చర్చిలో మంచి దేవుని సందేశాలున్న పుస్తకములున్నాయి. వాటిని చదువుటకారంభించుకో అన్నారు.

అనుకోని రీతిగా నా దృష్టి ఒక మంచి పత్రికపై పడింది. అది చదవాలనే ప్రేరణలో తీసి చదివాను. దేవుని దృష్టి మనపై నున్నప్పుడు ఈలోకములో మనలను ఎవరు గుర్తించకపోయినా, గ్రహించకపోయినా దేవుడు ఘనపరుస్తాడు. నాలో చాలా ధైర్యము కల్గింది. ఒకరోజు ప్రసంగంలో క్రీస్తు సిలువ మోసిన సీమోను తన మెడపై సిలువనుంచగానే అతడు వెనక్కు తిరగలేకపోయాడు. దేవుని చిత్తాన్ని అతడు నెరవేర్చాడు. ఆ వాక్యం నాలో గొప్ప సంచలనాన్ని కల్గించగా కన్నీటితో రక్షణ స్థిరత కావాలని పశ్చాత్తాపంతో ప్రార్థించగా వాక్యం ద్వారా ప్రభువు నన్ను తాకారు. ప్రభువు నమ్మదగిన దేవుడు.

**కీర్తనలు 40:1 "యెహోవా కొరకు సహనముతో కనిపెట్టు కొంటిని. ఆయన నాశనకరమైన గుంటలో నుండి, జిగటగల దొంగ ఊబిలోనుండి నన్ను పైకెత్తెను".**

ఈ వాక్యం ద్వారా పాప ఊబిలో నుండి లేపి రక్షణ స్థిరతనిచ్చారు. ప్రభువు నన్ను చేర్చుకొని తన బిడ్డగా అంగీకరించినందున ఆనందంతో సమర్పణ సహవాసంలో కొనసాగాను. సహవాసంలో అందరము ఆత్మీయాభివృద్ధి పొందగల్గాము.

మా గ్రామంలో కూడా ప్రార్ధనా కూటాలు సిద్ధపరచి కరపత్రాలు సిద్ధపర్చాము. మంచి పనిని నిర్వహించునపుడు తప్పక వ్యతిరేఖతలు తప్పవు. ఆ గ్రామపెద్దలు 2013 ఫిబ్రవరిలో జరిపే కూటాలను ఆటంకపర్చారు. మా దగ్గర సరియైన సొమ్ములేదు. దేవుని పనిని కేవలము మనుష్యుల సహాయంతో చేయలేము. విశ్వాసంతో దేవుని ఆత్మద్వారా జరిగించగలము. ఆ పరిస్థితుల్లో నన్ను కలుసుకోవలసిందిగా గ్రామపెద్దలు కబురు చేసారు. సరిగ్గా ఆ రోజు నేను వెళ్ళి కనిపెట్టగా ఆ వ్యక్తి రాకుండా నేను ఎదుర్కొనకుండా ప్రభువే నన్ను సంరక్షించారు.

ప్రభువు మహాకృపవల్ల చాలా గొప్పగా మీటింగ్సు పూర్తయ్యాయి. మీటింగు జరిగిందా అని అడిగిన పెద్దమనిషితో బాగా జరిగాయని తెలుపగా మౌనంగా వుండిపోయాడు. ఈ సందర్భమును బట్టి గొప్ప దేవుడు గొప్ప కార్యాలు చేయగలడని తెలుసుకోగల్గాము. చాలా గొప్ప సందేశాలు నాకు చాలా గొప్ప ఆత్మీయ కనువిప్పు కల్గించాయి. పాటలద్వారా కూడా ప్రభువు కనువిప్పు కల్గిస్తారు. మా దైవసేవకుని మాటలను బట్టి

**కీర్తన 32"ఎవని అతిక్రమములు మన్నించబడెనో, పాప పరిహార మెవడొందెనో వాడు ధన్యుడు".** ఆ మాటలు వినిన ఒక స్త్రీ పాపాలు ఒప్పుకొని దైవసేవకురాలిగా రూపొందింది. యేసులో వున్న పాపవిమోచనా శక్తిని వ్యక్తి గతంగా అనుభవించి దానిని గూర్చి యితరులకు చెప్పుట రక్షణ సాక్ష్యము.

**అపొస్తల కార్యాలు 9:22, 26 అధ్యాయాలు**

**గలతి 1, ఫిలిప్పీ 3 మరియు 1 తిమోతి 1:12-17**

ఆత్మీయ సత్యాల వివరణ చాలా అమూల్యమైనది. సాక్ష్యాన్ని తరచుగా చెప్పుచూ, క్రీస్తు నన్ను మార్చిన అనుభవాన్ని ప్రతిచోటా వివరించు భాగ్యము ప్రభువు నాకిస్తున్నారు. ఎన్నికలేని నన్ను ప్రభువు నాకు ప్రతి అనుభవంలో విలువైన పాఠాలు నేర్పించి విలువైన సందేశాలందించే దైవ జనులను నాకు పరిచయము చేయించి నా ఆత్మీయ జీవితాన్ని బలపర్చిన ప్రభువునకే నా జీవితాంతము కృతజ్ఞత కల్గి వుంటాను. నా గ్రామములో దేవుని సువార్త ద్వారా రక్షణలో నిలిచి ప్రభువును ఘనపర్చు ప్రజలు చేరాలనే వారికొరకు ప్రార్థించమనవి. ప్రభుని ప్రేమ సదా మనతో నుండుగాక. ఆమెన్.

# 25. దురాత్మల శక్తిపై విజయమిచ్చి క్రీస్తు సాక్షిగా నన్ను మార్చారు.

**జీవ(చెన్నాయ్)**



**మార్కు 16:17 "నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుదురు. రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురు".**

**పరిచయము:-** మేము మద్రాసులో జీవిస్తూ దేవాలయంలో పూజారులుగా నుంటూ నాగేంద్రుడిని నిత్యము పూజలు చేసేవారము. అన్యులముగా ప్రత్యేక పూజా సమయంలో చెప్పులు లేని కాళ్ళతో నిప్పులపై నడిచి మంత్రాలను చదివేవారము. మాకేమీ హానికలిగేది కాదు. నేను కూడా పూజలు చేస్తూ నిమ్మకాయలు మంత్రించి జనాలకిచ్చేవాడిని. నేను నా చెల్లి అమ్మ నాన్నలతో సర్ప పూజలలో సంపూర్ణంగా లీనమయి అందరినీ పూజకు ప్రోత్సాహానిచ్చేవారము.

మా జీవితాలలో సైతాను శక్తి ప్రభావము దాగివుండేది. క్రీస్తును గూర్చి మాకెవరూ తెలుపలేదు. నేను చదువుకొనే రోజుల్లో సరిగ్గా 16వ యేట 1995వ సంవత్సరములో ట్యుటోరియల్ కాలెజీలో ప్రవేటు చదువుకై ఒక క్రైస్తవ సంస్థలో చేరాము. క్రైస్తవులంతా ఫారిన్ మతస్తుల దేవుడ్ని అవసరాలకోసము వెండిస్తున్నారని భ్రమలో నుండేవాడిని. కాని వారి సత్ప్రవర్తన, మంచితనము, ప్రేమ, వారి స్నేహభావాలు నన్ను ముగ్ధుడిని చేసాయి. సండేస్కూలు తరగతులలో వారు పాడే పాటలు, మంచి మాటలు నన్ను చాలా ప్రభావితము చేసాయి.

మా దేవుళ్ళను, క్రీస్తును పోల్చి ఆలోచించసాగాను. క్రొత్త దేవుని సుబోధనలు చాలా నచ్చాయి. ఆత్మవిషయమై దీనులు ధన్యులు. సాత్వీకులు ధన్యులు. నీతికొరకు ఆకలదప్పులు గలవారు ధన్యులు. యీ రీతిగా వీరి బోధనలలో నేనే మార్గము, సత్యము, జీవమని చెప్పిన మాటలు నా హృదయాన్ని తాకాయి.

నా నాగ దేవుడిని నేను మర్చిపోతానేమోనని లోపల భయంతో "నాగ దేవుడా, నన్ను క్రొత్త దేవుడి ప్రభావంలో పడకుండా చేయమని ప్రార్థించుకున్నాను. బైబిలులో

ఒకమాట నాకు పదే జ్ఞాపకం వచ్చేది. నా శాంతినే మీకిస్తున్నాను. అందువల్ల నాలో లోటుగానున్న శాంతి సంతోషము నాకు వీరి సాహచర్యంలో లభించింది. అద్భుతమైన అనుభవాలన్నీ నన్ను ఆవరించాయి.

నేను క్రీస్తును ప్రేమిస్తున్నానని నా స్నేహితులు గ్రహించగా వారితో మాటలు తగ్గించి దేవుని ధ్యానంలో నుండగా మా అమ్మకు చెప్పి నన్ను యిరుకున పెట్టారు. మా అమ్మ నాతో "నా యింటిలో నీకు స్థానంలేదు. నీవు నమ్మిన క్రీస్తే నిన్ను పోషిస్తాడు" అని అరిచింది. లేదా 100 సార్లు మన దేవునిచుట్టూ తిరిగి మంత్రాలు వల్లించాలని ఆదేశించింది. చేసేదిలేక యిల్లువిడిచి వెళ్ళలేక యేసు నామమునకై జయము. యేసు రక్తమునకే జయమని వేయిసార్లు స్తోత్రంచేస్తూ మా దేవాలయం చుట్టూ తిరిగాను. మా సమాజములోని పెద్దలంతా నన్ను చేరి నీ దేవుడే సిలువపై ఏడ్చాడు కద! నిన్నేమి రక్షించగలడు? మన దేవుడే గొప్ప అని చెప్పి నాగపూజలే చేయాలని బలవంతం పెట్టారు.

"అయ్యా, నేను క్రీస్తు ప్రేమను, శక్తిని రుచిచూచాను. నేను ఆ క్రీస్తును మర్చిపోలేను. నేను నా జీవితాంతము ఆయననే నమ్ముతానని ప్రమాణం చేసాను. నేను నా విద్యాభ్యాసాన్ని బి.ఎ. తర్వాత ఎం.ఎ. పూర్తిచేసాను. బైబిలు కోర్సు కూడా పూర్తిచేసి బాప్తీస్మము తీసుకొని ఆత్మాభిషేకాన్ని పొంది, ప్రతిచోట సాక్షిగా జీవిస్తూ, కరపత్రాలు పంచుచూ క్రీస్తుకొరకు నమ్మకమైన సాక్షిగా జీవించసాగాను.

మన మతాన్ని, నాగదేవుళ్ళను మర్చిపోయానని నన్ను చూచి చాలా ఆశ్చర్యపడి తృణీకరించారు. నా తల్లి నాపై చేతబడి శక్తులను ప్రయోగించింది. మంత్రించిన వస్తువులను నా తలక్రింద నుంచింది. నా ప్రాణము, నా తల్లి ప్రాణము రక్షించమని క్రీస్తును ప్రార్థించాను. స్నానాల గదిలో మంత్రించిన పొడరు వుంచుట, తినే భోజనంలో మందుపెట్టినను ఆ పౌడరుల ప్రభావము నాపై పనిచేయలేదు. నా దేవుడు నన్ను రక్షించాడు.

గతంలో నా తల్లి నేను ఉపవాసముండి నిప్పులపై నడిచేవారము. గంధం పూసి మంత్రాలు వల్లించేవారము. నాగశక్తి మాతో ఉండేది. కింగ్ కోబ్రా దేవాలయంలో ప్రతి శుక్రవారము పాలుపోసి పూజలు చేయగా ఆ పాము వచ్చి పాలుత్రాగి పోయేది.

ఒకరోజు ఆ నాగశక్తి నా తల్లిని ఆవరించింది. ఆమె పామువలె నృత్యం చేస్తూ బుసలుకొట్ట సాగింది. ప్రక్కింటివారిని పిలిచాను. మీ అమ్మకు నాగదేవత ఆవరించింది అని చెప్పారు. ఆ నాగదేవతను ప్రశ్నించి ఎందుకు మా అమ్మను ఆవరించావని అడిగాము.

నేను పది అడుగుల గుంటలో పడియున్నాను. నన్ను లేపండి అని అసహాయతతో మా సహాయము కోరింది. నాగదేవత శక్తి క్రీస్తు శక్తిముందు చాలా తక్కువేనని ఆ సందర్భములో నాతల్లి నమ్మింది. ఇక భయము లేదని తెలిసి పాములు పట్టేవాడిని పిలిచి ఒకత్రాడు పుట్టలోనుంచి ఆ పామును పట్టి బయటకు రప్పించగా నాతల్లి ఆమె మెడపట్టుకొని నొప్పి అని ఏడ్చింది. పాస్టరుగారి సహకారంతో బలమైన ప్రార్ధనలు చేయగా ఆపాము బయటకు వచ్చి రెండు ముక్కలుగా పడిపోయింది. వెంటనే అమ్మ మెడనొప్పి నుండి విడుదల పొందింది.

గతంలో బైబిలును కాల్చివేసిన అమ్మ నేడు నన్ను అడిగి క్రీస్తే సర్వశక్తి గలవాడని నమ్మి, బైబిలును ఆశ్రయించి క్రీస్తును రక్షకునిగా స్వీకరించింది. యీ మార్పువల్ల నా చెల్లి, మా నాన్నగారు కూడా క్రీస్తును ఏకైక రక్షకునిగా నమ్మి స్వీకరించారు. నా పరిసరాల్లో నున్న చీకటిశక్తుల ప్రభావమంతా తొలిగాపోయింది. నా సేవను గూర్చి దేవుడు సూటిగా నాతో మాట్లాడారు.

నేపాలును చూపించారు. ఆ భాష నాకురాదు. హిందీలో కరపత్రాలు పంచుటకు ఆరంభించాను. నేను వారి మతాన్ని కించపరిచి క్రీస్తు మతంలోకి మార్చాలని శ్రమపడుచున్నానని ఎంచి నన్నుకొట్టి బాధించారు. చీకటి గదిలో బంధించారు. చెన్నై నుండి నేపాలు వెళ్ళి యీ శ్రమలు పొందుటకేనా ప్రభూ అని ఏడ్చాను. నీవు నన్ను రక్షించినచో నీసేవ చేయగలనని దీనంగా ప్రార్థించాను. నన్ను వారు వదిలిపెట్టిన తరువాత పట్టుదలతో హిందీ నేర్చుకున్నాను.

ఆ తర్వాత ఎనిమిది భాషలు నేర్చుకొని తర్జుమా చేయు సమర్ధత పొందాను. ట్రయిబల్ దండు వారికి సంఘాలు నిర్మించి సువార్త బోధించుట, కొందరికి బైబిల బోధించుటలో దర్ఫీదునిచ్చి సేవచేయించుట, మిషనెరీల నందరినీ యేసంటే తెలియని ప్రజలమధ్య యేసే దేవుడని తెలియజెప్పు భారంతో సేవకొనసాగిస్తున్నాను.

మద్రాసు మారుమూల పామును పూజచేయు పూజారిగానున్న నన్ను వెదకి రక్షించి గొప్ప తలాంతులనిచ్చి ఆయనకు బలమైన సాక్షిగా నన్ను నేడు నిలిపారు. సువార్త ప్రకటించేవారి పాదాలు సుందరమైనవి గనుక నా పాదాలు బండపై నిలిపి క్రొత్త గీతాన్ని నా నోట నుంచారు. ఆ క్రీస్తుకే మహిమ కలుగును గాక. నా సాక్ష్యము మీకు ప్రయోజనకారిగా నుండాలని నా ప్రార్థన. ఆమెన్.

---------

## 26. వ్యసనముల నుండి విడుదలనిచ్చి క్రీస్తు నన్ను రక్షించారు

– సుగుణ భూషణరావు (మచిలీపట్నం)

**కీర్తనలు 23:1 "యెహోవా నా కాపరి. నాకు లేమి కలుగదు".**

**పరిచయము:–** సజీవుడైన సర్వశక్తి గల క్రీస్తు ప్రభువు నామములో మీకు శుభములు. నా పేరు సుగుణ భూషణరావు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఒక గ్రామములో నా జీవితాన్ని గడిపాను. విగ్రహ పూజలు మా కుటుంబాల్లో అధికంగా ఉండేవి. ఆంజనేయ స్వామి భక్తుడను. కాళిదాసుడిగా కాళిను కూడా భక్తితో పూజించేవాడిని. క్రీస్తును గూర్చి తెలుసుకొనుట కేనాడూ యిష్టపడలేదు.

నేను 1975లో ప్రేమలత అనే మంచి వ్యక్తిని పెండ్లాడాను. చాలా అన్యోన్య దాంపద్యముతో, సంతానంతో ఆనందించాము. అయితే 1982లో నా భార్యకు గుండె జబ్బు ఆవరించింది. ఆపరేషను చేయించుకున్నది. ఆ శ్రమలో నుండగా క్రీస్తును నమ్మిన విశ్వాసులతో ఆమెకు పరిచయము కల్గింది. ఆమె క్రీస్తును పూర్తిగా విశ్వసించి, బైబిలు చదివి ప్రార్థించుకొనుట నాకు యిస్టము లేకున్ననూ ఆమె నమ్మకాన్ని గౌరవించి అనుమతించాను.

ప్రభువు ఆమెతో మాట్లాడేవారు. స్వస్థపర్చు యెహోవాను నేనే అన్నమాట నమ్మి ధైర్యంగా జీవించింది. తన మరణస్థితి ప్రభువు తనకు బయలుపర్చారు. చివరకు 1997వ సంవత్సరము ఆగస్టు ఒకటవ తేదీన ఆమె నేను ప్రభువు సన్నిధి చేరుటకు సిద్ధంగానున్నానని తెల్పి నాకు సమయము ఈ లోకంలో ముగిసింది. నా ప్రభువు నన్ను ప్రేమతో పిలుస్తున్నారు. పరలోకము చేరగలను అని నాతో చెప్పింది.

ఆమె బ్రతికిన రోజులలో క్రీస్తునే నమ్మింది. నా భార్య నన్ను కూడా క్రీస్తును నమ్మాలని, నా సిగిరెట్లు త్రాగే అలవాటు మానుకోవాలని చాలాసార్లు తెల్పింది. నాకు ఆ మాటలు వినాలనిపించేది కాదు. ఆమె గతంలో హిందూ నమ్మకాలను వదిలిపెట్టింది. మంచి అర్థమున్న మంచి పాటలు పాడుకొనేది.

"నడిపించు దేవా నీ ఆత్మ బలముతో – అల్ప విశ్వాసిని ఆత్మతో నింపుమయా
ఆగని నీ సేవలో ఆయుధముగా నన్ను మార్చుము

అలసిపోయిన నాకు దిక్కుగా నున్నావు – వేరెవరూ లేరునాకు
చేతకాని దానను చెంతనుండుము – చెదిరిపోనీయకు చేకూర్చుము

నీ నీడలో నీ సాక్షిగా సాగిపోనీయుము – నీ సేవలో నన్ను అభిషేకించుము
నీవు గాక ఎవరూ నాకు లేరు – నీ చల్లని నీడలో సాగిపోనీయుమయా

ఆ పాటలు పాడుచూ ప్రార్థించు నా భార్య మాటల ప్రభావము వల్ల నేను నా సిగిరెట్ల అలవాటు నుండి పూర్తిగా దూరమయ్యాను. అది దేవుని కృప వలననేనని గ్రహించి నెమ్మదిగా క్రీస్తు విశ్వాసి నయ్యాను. కొన్ని పరిస్థితుల వల్ల సౌది అరేబియా వెళ్ళు అవకాశము కల్గింది.

అది 1982వ సంవతసరము కొన్ని సంవత్సరాలుండి తిరిగి వచ్చాను. వేరే ఏదైనా వ్యాపారము చేయాలని ప్రయత్నించాను. నేను సిగిరెట్ల వ్యాపారము చేయ ప్రయత్నించగా అది దేవుని చిత్తము కాదని నా భార్య వ్యతిరేఖత చూపింది. మరొక క్రొత్త వ్యాపారము ఆరంభించ దలచి నాకు తెలిసిన స్నేహితులను సంప్రదించాను.

వారు పూజలు చేసి అన్ని దేవతల విగ్రహాలతో పాటు యేసు ప్రభువు బొమ్మ పెట్టాలని సలహాయిచ్చారు. నేను సమ్మతించలేదు. యేసు మాత్రమే నిజ దేవుడు. ఆయనను మాత్రమే నమ్ముతానని ఖచ్చితంగా తెల్పాను. ఆ విశ్వాసము కాపాడుకొనుటను బట్టి కరుణగల దేవుడు నన్ను కరుణించి నా బిడ్డలను, నన్ను దీవించారు. అందరూ మంచి వివాహాలు చేసుకొని స్థిరపడ్డారు. క్రీస్తే నిజమైన దేవుడని సాక్ష్యమిస్తూ జీవిస్తున్నాను. నా కొరకు ప్రార్థించండి. ఆమెన్.

---------

## 27. నేను నమ్మిన దేవుడు ఎంతైన నమ్మదగిన దేవుడు

## ఇద్దరు స్నేహితుల కథ (సజీవ సాక్ష్యము)

–డాక్టరు కె.వి. క్రాంత్

**కీర్తనలు 99:5 "యెహోవా మన దేవుడు".**

ప్రియ పరిశుద్ధ పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసు నామమున శుభాభి వందనములు. దేవుడు చేసిన అద్భుతమైన స్వస్థతను గూర్చి మీతో పంచుకోవాలని అనుకుంటున్నాను. ఇక వినండి. ఇద్దరు స్నేహితుల కథ.

ఒంగోలు పట్టణం సివారులో ఉన్న జాషువా కాలనీలో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారిపేర్లు నారాయణ మరియు ప్రభు. నారాయణ బేల్దారి మేస్త్రి. ప్రభు కూరగాయలు వ్యాపారం. ఇద్దరు ఒకే కాలనీలో ఉంటు జీవనము సాగిస్తున్నారు. అయితే ప్రభు రెడ్డి కులానికి చెందిన వ్యక్తి. ఇతడు కొన్ని నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుచున్నాడు. కుటుంబీకులు మరియు ఇతర వ్యక్తులు కలిసి ఇతనిని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. కొన్ని రోజుల ట్రీట్‌మెంట్ తరువాత డాక్టర్లు ఇక లాభం లేదని గుంటూరు తీసుకొని వెళ్ళండి అని చెప్పారు.

కుటుంబస్తులు డబ్బులు పోగుచేసుకొని గుంటూరులో ఉన్న యన్.ఆర్.ఐ. హాస్పటల్‌కి తీసుకొని వెళ్ళారు. అక్కడ కూడా కొన్నిరోజులు ట్రీట్‌మెంటు తీసుకున్న తరువాత డాక్టర్లు ఇక లాభంలేదు ఇతడు చనిపోతాడు. ఎన్ని మందులు వాడిన ఇక ఉపయోగం ఉండదు కనుక ఇతనిని ఇంటికి తీసుకొని వెళ్ళండి అని చెప్పారు. అప్పుడు చేసేది ఏమీలేక అతనినిన ఇంటికి తీసుకొని వచ్చారు.

మరల కొన్ని దినముల తరువాత ఎలాగైనా ఇతనిని బ్రతికించుకోవాలని కుటుంబస్థులు మద్రదాసులో ఉన్న పెద్ద హాస్పటల్‌కి తీసుకొని వెళ్ళి చేర్పించడం జరిగింది. అయితే వీరికి అక్కడ కూడా నిరాశే మిగిలింది. యౌనవనస్థుడైన "ప్రభు" దేహం పూర్తిగా క్షీణించి పోయింది. అవయవాలు పనిచేయడం ఆగిపోయినాయి. శ్వాస తీసుకోవడం కూడా కష్టమయింది. మనిషి చూచుటకు జీవములేని శవముగా మారిపోయాడు. అప్పుడు

డాక్టర్లు ఇక ఇతడు చనిపోయినట్లే వాడుతున్న మందులకు ఇతని దేహము స్పందించడము లేదు. ఇక ఇతడు చనిపోయినట్లే. శ్వాస పీల్చుకోవడం అతి కష్టముగా ఉన్నది. కనుక ఇతనిని మార్చ్యురి గతి (శవాలు బధ్రపరుచు గది) లో పెట్టవలసి ఉన్నదని చెప్పారు.

ఈ వార్త విన్న కుటుంబీకులు ఎంతో క్రుంగిపోయి, కుమిలిపోయి చేసేది ఏమీలేక కొన ఊపిరితో ఉన్న "ప్రభు"ని ఒంగోలు జాషువా కాలనీలో ఉన్న తన స్వగృహానికి తీసుకొని వచ్చారు. డాక్టర్లు చివరిగా చెప్పిన మాట ఏమిటంటే ప్రభుకి ప్రాణాంతకరమైన వ్యాధి సోకిందని తెలియజేశారు. ఒంగోలు తీసుకొని వచ్చిన తరువాత అతని స్నేహితులు, బంధువులు చివరి చూపుకొరకు అతని యొద్దకు వచ్చుచున్నారు. కుటుంబస్థులు అతను బ్రతకడని తులసి నీరు తీసుకొని వచ్చి నోటిలో పోశారు. అయితే కొన ఊపిరితో ఉన్న ప్రభు ఆ నీరు మింగలేక ఊసివేశాడు. కుటుంబస్థులు దండలు, ఫ్లెక్సీ భూస్థాపన కొరకు సిద్ధం చేస్తున్నారు. ఎన్నో డబ్బులు ఖర్చుపెట్టారు. కొన్ని నెలలు హాస్పటల్‌లో చూపించారు. అయినా లాభం లేక అందరు దు:ఖములో మునిగిపోయారు. ఈ విధముగా ఉండగా నాకు నారాయణ మేస్త్రి దగ్గరనుండి ఫోను వచ్చింది. ముందు చెప్పిన విధంగా నారాయణ ప్రభు రెడ్డి ఇద్దరు మంచి స్నేహితులు. నారాయణ మేస్త్రి ఈ విధంగా చెప్పాడు. అయ్యా! మీరు నాతో వచ్చి చావు బ్రతుకుల్లో ఉన్న నా స్నేహితుని కొరకు మీరు ప్రార్దన చేయాలి. మీ ప్రార్ధన దేవుడు ఆలకించి నా స్నేహితున్ని స్వస్థపరుస్తాడు దయచేసి మా కాలనీకి వచ్చి నా స్నేహితుని కొరకు ప్రార్థించమని జాషువా కాలనీకి రమ్మని ఫోనులో వేడుకున్నాడు. అప్పుడు నేను అతనిని గురించి ప్రార్థించి దేవున్ని వేడుకున్నాను.

ప్రభువా! ఈ కాలనీ వాసులు కుటుంబస్థులు మరియు స్నేహితులు ప్రభు రెడ్డి స్వస్థత కొరకు నీ వైపునకు చూస్తున్నారు. అతనిని స్వస్థపరచు తండ్రి అని ప్రార్థించాను. ప్రార్థించి నేను లేచిన తరువాత నాకు ఎంతో నెమ్మదిగా ఉంది. యేసు ప్రభువు చావు బ్రతుకుల్లో ఉండి, మరణకరమైన ఈ యౌవ్వనస్థుడిని స్వస్థపరుస్తాడని నాకు గట్టిగా విశ్వాసము కలిగింది. ఈ సంఘటనలో మీకు ఒక విషయము చెప్పాలి. నారాయణ మేస్త్రి యేసు ప్రభువును ఇంకా పూర్తిగా నమ్ముకోలేదు. ఈయనకు కూడా అనేక వ్యసనాలు ఉన్నాయి. మరియు ఉద్యమాలలో పాల్గొంటు ఉంటాడు. వృత్తిరీత్యా బేల్‌దార్ మేస్త్రి. అయితే ఇతని విశ్వాసము గొప్పది. ఇతడు యేసుని గట్టిగా నమ్మాడు. యేసుప్రభువు తన సేనహితున్ని స్వస్థపరుస్తాడని.

ఆ రోజు నేను మరికొందరు సహోదరులు కలిసి ప్రభు ఇంటికి వెళ్ళాము. నారాయణ మేస్త్రి మాకు ఎదురుపడి మమ్ములను ప్రభు ఇంటికి తీసుకొని వెళ్ళాడు. అప్పటికే అక్కడికి దాదాపు 50 మంది ప్రార్థనకు వచ్చి ఉన్నారు. ఒక పెద్ద టెంటు, కుర్చీలు, లైటింగ్ మరియు మైక్ సిస్టమ్ అంతా ఏర్పాటుచేసి ఉన్నారు. ఇరుగుపొరుగు వారు, కానీ వాసులు అందరూ ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు ఏమి జరుగుతుందో అని. అదే సమయములో ప్రభు రెడ్డి ఇంటి బయట మంచము మీద స్పృహలేని స్థితిలో పడి ఉన్నాడు. అప్పుడు నేను “లూకా సువార్త” 7వ అధ్యాయంలో ఉన్న ఒక కథ చెప్పాను. “నాయీను గవిని” దగ్గర యేసుప్రభువు విధవరాలి యొక్క ఏకైక కుమారుడ్ని స్వస్థపరచుట”. యేసు ప్రభువు గవిని దగ్గర పాడిని ముట్టినపుడు చనిపోయిన యౌవ్వనస్థుడు బ్రతికించబడ్డాడు. అందరు వాక్యము చాలా శ్రద్ధగా విన్నారు. అదే సమయంలో వారందరిలో ఒకటే ప్రశ్న “ప్రభురెడ్డి బ్రతుకుతాడా”, యేసు ప్రభువు స్వస్థపరుస్తాడా”! నేను నాతోటి సహోదరులు కలిసి ఇంటిలోనికి వెళ్ళాము. అక్కడ మంచము మీద ప్రభురెడ్డి పడుకొని ఉన్నాడు. ఇంటి వారందరూ ఏడుస్తూ ఉన్నారు. ప్రభురెడ్డి అక్క విశ్వాసి ఆమెతో నేను అన్నాను కొబ్బరి నూనె ఉందా అని! వెంటనే కొబ్బరి నూనె తెచ్చి నా చేతిలో పెట్టింది. నేను ప్రార్థించి మూడు చుక్కలు ప్రభురెడ్డి నోటిలో వేశాను. ప్రభురెడ్డి తన పాపములు యేసు సన్నిధిలో ఒప్పుకున్నాడు. యేసుప్రభువా నన్ను మన్నించమని వేడుకున్నాడు. నేను చెయ్యిపెట్టి అతనిని ముట్టి వేడుకున్నాను. నాతో కలిసి ఉన్న సహోదరులు అందరు వేడుకున్నారు. నేను వారియొక్క అమ్మతో చెప్పాను. అమ్మా! మీ కుమారుడు బ్రతుకుతాడు. నిశ్చయంగా ఉండండి అని చివరిగా ప్రార్థించి మేము ఇంటికి వచ్చేశాము.

ఇట్లుండగా మూడు రోజులు తర్వాత నా ఆఫీస్‌కి నారాయణ మేస్త్రి వచ్చి నాతో అన్నాడు యేసుప్రభువు చాలా గొప్పవాడు. ఆయనే నిజమైన దేవుడు. ఆయనలో మహిమ ఉన్నది. దయచేసి నాకు బాప్తీస్మము ఇవ్వండి. నేను ప్రభువును నమ్ముకుంటున్నాను. ఈ మాట వినగానే నాకు చాలా సంతోషము కలిగింది. అప్పుడు నేను నారాయణ మేస్త్రిని అడిగాను ఇంత అకస్మాత్తుగా నిర్ణయం తీసుకోవడానికి గల కారణం ఏమిటి? అప్పుడు అతడు చెప్పాడు. అయ్యా! నా విన్నపము మన్నించి నా దగ్గరకు వచ్చి ప్రభు రెడ్డికి ప్రార్థన చేసావు. చేసుప్రభువు చాలా గొప్పవాడు. నా స్నేహితుడు బ్రతికాడు. యేసుప్రభువు బ్రతికించాడు. కనుక నేను కూడా ఆయనను నమ్ముకుంటున్నాను. ఈ వార్త వినగానే నా కెంతో సంతోషం కలిగింది.

అన్ని నామముల కంటే ఘనమైనది యేసయ్య నామము. ఆ నామములోనే రక్షణ, స్వస్థత కలదు. రెండు రోజుల తరువాత కొత్తపట్నంలో ఉన్న సముద్రంలో నారాయణ మేస్త్రికి బాప్తీస్మము ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ప్రతి ఆదివారము తన స్నేహితుడైన ప్రభురెడ్డిని తీసుకొని ఆరాధనకు వస్తున్నాడు. ఎంతగొప్ప సాక్ష్యమో కదా! నారాయణ విశ్వాసమే ప్రభురెడ్డిని స్వస్థపరిచింది. ఇప్పుడు ప్రభురెడ్డి జీవితమే ఒక సజీవ సాక్ష్యము. నా ప్రియ స్నేహితులారా! యేసు ప్రభువు ఎంతైనా నమ్మదగినవాడు. ఆయనకు అసాధ్యమైనది ఏదియు లేదు. "నీవు నమ్ము ఆయన మహిమను చూచెదవు". యేసు ప్రభువు నామమునకే మహిమ, ఘనత ప్రభావములు యుగయుగములు చెల్లునుగాక" ఆమెన్. "దేవుడు మిమ్ములను దీవించును గాక".

---------

## 28. నేను నిన్ను ఏర్పరచుకొని యున్నాను అని వాగ్ధానమిచ్చి క్రీస్తు నన్ను నడిపించారు

-మదన్ మోహన్ (తణుకు)

**సామెతలు 28:20 "నమ్మకమైన వారికి దీవెనలు మెండుగా కలుగును".**



నా ప్రియమైన అన్నలకు, తమ్ముళ్ళకు, అక్కలకు, చెల్లెళ్ళకు, నా ప్రభువును రక్షకుడునైన యేసుక్రీస్తు నామములో శుభములు. నేను నాది అని చెప్పేవారు దేవుడొక్కడే. ఆ దేవుడే నన్ను ఏ విధముగా ఏర్పరచుకొనియున్నాడో మూడు విషయాలలో చెప్పాలని ఆశపడుచున్నాను. అవి.

1. తప్పించిన దేవుడు
2. ఒప్పించిన దేవుడు
3. రప్పించిన దేవుడు

**1. తప్పించిన దేవుడు:-** నాపేరు మదన్ మోహన్, దేవుడు నన్ను మా తల్లి దండ్రులకు ప్రథమ సంతానముగా (బహుమానముగా ఇచ్చియున్నారు). నాకు ఒక్క తమ్ముడు మరియు ఇద్దరు చెల్లెళ్ళు. నేను పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు పట్టణంలో జన్మించియున్నాను. చిన్ననాటి నుండి నేను బాగా అల్లరి చేస్తూ ఉండేవాడిని. నా ప్రాథమిక విద్యాభ్యాసములో అనగా నేను మూడవ తరగతి చదువుతున్న సమయములో నేను, నా తోటివారు కలసి వేసవికాలం సెలవులలో మా ఇంటి దగ్గర ఖాళీ స్థలములో గాలిపటం ఎగురవేస్తూ ఉన్నాము. అక్కడే ఒకాయన పెంట ( వ్యర్ధమైన తుక్కు మొ॥) అంటించి దానిపై చెత్త వేశాడు. నేను నాకేమి అవుతుందిలే అని గర్వించి మూర్ఖత్వంతో పెంట పైకి ఎక్కాను. అంతే నా రెండు కాళ్ళు పెంటలో దిగబడి కాలిపోయాయి. అప్పుడు మా ఇంట్లో మా తాతయ్య, బామ్మగారు మాత్రమే ఉన్నారు.(తల్లి దండ్రులు ఊరికి వెళ్ళారు).

కొద్ది దినములు ఆర్.యం.పి. డాక్టర్ గారు చూశారు. ఈలోపు మా అమ్మగారు ఊరినుండి వచ్చారు. నన్ను చూచి ఏడ్చారు. ఆ తరువాత నా కాళ్ళు బాగా కాలిపోవటం వలన నాకు ధనుర్వాతం వచ్చింది. నురుగులు గ్రక్కుతూ, కళ్ళుగ్రుడ్డలు తేలేస్తూ, నా కాళ్ళ చర్మము ఊడిపోతూ ఉందంట. అప్పుడు డాక్టర్ గారు మీ బిడ్డ విషయమై మేము ఏమీ చెప్పలేము అని అన్నారట.

ఆ రాత్రి మా అమ్మగారు, మా అమ్మమ్మ గారు అందరూ నా కొరకు ప్రార్ధించారట. వీరితో పాటు అనేకమంది ప్రార్ధించారని మా అమ్మగారు చెప్పారు. ఈ ప్రార్ధనల ఫలితంగా దేవుడు వారి మొఱనాలకించి నన్ను మరణము నుండి తప్పించాడు. మరుసటి రోజున ఒక పెద్దామె ఎవరో వాళ్ళ బంధువులు హాస్పటల్లో ఉంటే చూద్దామని వచ్చి అనుకోకుండా నన్ను చూచి ప్రభువా ఈ బిడ్డను బ్రతికించు అని ప్రార్ధించి వెళ్ళింది. నేను స్వస్థత పొందిన తరువాత హాస్పటల్కు వచ్చి ఆమె నాకు ఒక జత బట్టలు పెట్టి, 100 రూపాయలు ఇచ్చి వెళ్ళింది. చూశారా! దేవుని ప్రేమ ఎంత గొప్పదో! ఇప్పటికి నాకు ఆ బట్టలు గుర్తున్నాయి. ఆమె ఒక హైందవ కుటుంబము నుండి రక్షింపబడిన చౌదరిస్ అని తెలిసింది. ఈ విధంగా మరణ అపాయము నుండి ఆ రాత్రి దేవుడు నన్ను తప్పించాడు. **కీర్తనలు 68:20 "నమ్మకమైన వారికి దీవెనలు మెండుగా కలుగును. మరణము నుండి తప్పించుట ప్రభువైన యెహోవా (యేసుక్రీస్తు) వశము."**

**2. ఒప్పించిన దేవుడు:-** ఆ విధంగా నా బాల్యములో అనగా నా ఏడవ సంవత్సరములో నన్ను మరణ అపాయము నుండి తప్పించిన గాని నేను ఎదుగుతున్న కొద్ది

**ఆది 6:5 "నరుని హృదయం బాల్యం నుండి చెడ్డది"** అవే విధానంలో మాటల్లో, చూపుల్లో, ప్రవర్తనలో చెడుగా జీవిస్తూ ఉండేవాడిని. అలాగే క్రిస్మస్ పండుగలకు, గుడ్ ఫ్రైడేకు చర్చికి వెళ్తూ ఉండేవాడిని గాని నాలో ఏవిధమైన మార్పులేదు. పైకి అందరి దృష్టిలో నేను చాలా మంచి వాడిగా కనిపించేవాడిని గాని అంతకంతకు చాలా దుష్టత్వముతో నా హృదయం నిండిపోయి ఉండేది.

చివరకు మాటలలో, తలంపులలో, ప్రవర్తనలో చెడిపోయిన వానిగా ఉండటమే కాకుండా అప్పుడప్పుడు తాటిచెట్టు నుండి వచ్చే తాటి కల్లు త్రాగుతు ఉండేవాడిని. ఈ విధంగా చర్చికి వెళ్తూ ఇంటర్లోకి వచ్చాను. చిన్నప్పుడు మా తల్లిదండ్రులు నన్ను సండేస్కూల్కి పంపిస్తూ ఉండేవారు. ప్రతీరోజు ఒక అధ్యాయము బైబిల్లో నుండి ఉదయం లేవడంతోనే చదవాలని సండేస్కూల్ టీచర్స్ చెప్పేవారు. గనుక నేను అలా చేసేవాడిని. ఇంటర్ చదువు అయ్యాక నేను బాప్తీస్మము తీసుకుందాం అనుకున్నాను గాని ఇంటర్ పాస్ అయ్యాక, డిగ్రీలో చేరాక, డిగ్రీ అయ్యాక చూద్దాం అనుకుని ఉన్నాను. డిగ్రీలో జాయిన్ అయ్యాక 6 నెలలు గడిచాక 1999 డిసెంబర్ నెలలో ఒక ప్రకటన చేశారు. అదేమిటంటే 2000 సం॥ జనవరిలో బాప్తీస్మములు ఉన్నవి సిద్ధపడినవారు పేర్లు ఇవ్వండి అని చెప్పారు గాని నేను పట్టించుకోలేదు.

ఆ విధంగా ప్రతిరోజు బైబిల్‌లో ఒక అధ్యాయం చదువుతూ ఉండగా ఒకరోజు నా డైలీ పోర్షన్ వేరే అయినప్పటికి, నా దృష్టిని దేవుడు "ప్రకటన 3:19-20" మీదికి మళ్ళించాడు. ఈ వాక్యములో "నీవు ఆసక్తి కలిగి మారుమనస్సు పొందుము" అనేమాట నా హృదయములో పొడవబడి ఎవరో మాట్లాడినట్లు నాలో గోచరిస్తూ 4-5 రోజుల వరకు నెమ్మది లేనివాడిగా ఉన్నాను. అప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు నాతో మాట్లాడుతున్నాడని గ్రహించి నా పాపములన్నిటిని ఆయన యెదుట ఒప్పుకున్నాను. అప్పుడు నా హృదయములో ఎంతో నెమ్మది, సంతోషాన్ని పొందుకున్నాను.

ఈ విధంగా 2000 సం॥ము జనవరి 9వ తేదీన నీటి బాప్తీస్మము తీసుకొని క్రీస్తు బిడ్డగా చేయబడ్డాను. ఈలాగున కఠినాత్ముడనైన నన్ను ఒప్పించి, రక్షించినాడు.

**3. రప్పించిన దేవుడు:-**

**ఎ.జాబ్ :-** ఆ విధంగా డిగ్రీలో రక్షించిన దేవుడు ఫస్ట్‌క్లాస్‌లో బి.యస్.సి. డిగ్రీ పాస్ అవుటకు కృప చూపాడు. డిగ్రీ అయిన తర్వాత యమ్.యస్.పి.జి.లో ఇనుస్ట్రుమెంటేషన్ కోర్స్ చేయడానికి ఆంధ్రా యూనివర్సిటిలో ప్రభువు సీట్ ఇచ్చారు. హాస్టల్ సీట్ రాకపోతే హెబ్రోను సహవాసములో ఉన్న షాలేము ప్రార్ధన మందిరములో గెస్ట్‌గా ఉండటానికి దేవుడు కృపనిచ్చాడు. ఇక్కడే ప్రభువు తన వాక్యమును నాకు అర్ధమయ్యేలా చేశాడు. దేవుని సేవ చేయాలనే ఆసక్తి కూడా నాకు కలిగింది. కోర్స్ పూర్తి చేసుకొని మా ఊరు వచ్చాను.

ఇంటికి వచ్చిన తర్వాత దేవుడు సేవలో అనగా వాక్యము చెప్పడములో, వీధి సువార్తలో బలముగా ఆయన నన్ను వాడుకున్నారు. మా పాస్టరు గారు కూడా నన్ను ఆయన దగ్గరే ఉండమన్నారు గాని అప్పటికే మా ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఉద్యోగం చేయాలని హైదరాబాద్ రావాలనుకున్నాను.

మా పాస్టర్ గారి ద్వారా 2004వ సం॥ము మార్చి నెలలో హైదరాబాద్‌లో KPHB కి వచ్చాను. తరువాత జీడిమెట్లలో, బోరబండలో నివసిస్తూ సుమారు 6 నెలలు జాబ్ లేకుండా ఉన్నాను. ఈ సమయంలో ఆత్మీయ సహోదరులు (ప్రభువు బిడ్డలు) నాకు సహాయం చేస్తూ వచ్చారు. ఇక్కడకు రావడానికి కూడా మరియొక పాస్టర్ గారు చార్జీలు గా రూ. 1,000/- ఇచ్చారు. 6 నెలలు తర్వాత డేటా ఎంట్రీ , బిల్డింగ్ సూపర్ వైజరుగా, టీచర్‌గా, 2,500 - 4,000/- వరకు పనిచేస్తూ వచ్చాను. కార్వేలో జాబ్‌చేస్తూ ఉండగా అమీర్‌పేట్‌లోని ఫస్ట్ ఇండియన్ కార్పోరేషన్ కంపెని (డేటా ఎంట్రీ) గురించి ఒకరు

చెప్పారు. ఒక ఆదివారం ఇంటర్వ్యూకి వచ్చాను. 3 రౌడ్లు అయినాయి. 3వ రౌండ్లోనే నన్ను ఒక పెద్దాయన సెలెక్ట్‌చేశారు. తర్వాత తెలిసింది ఆయనే ఆ కంపెనీ GM అని.

ఈ విధముగా ఆ పెద్దాయన మా తమ్ముడుకు కూడా ఉద్యోగము ఇచ్చారు. మా పెద్ద చెల్లెలు పెళ్ళి విషయములో కూడా సహాయము చేశారు.

**బి. దేవుని సేవ పిలుపు :-** హైదరాబాద్‌లో KIC లో ఉద్యోగం చేస్తూ సుమారు 1 సం॥ము ప్రతీ 2వ శనివారం హెబ్రోను టీమ్ వారు వెళ్ళే సువార్త పరిచర్యలో పాలుపొందుతూ ఉండేవాడిని. అంతేకాకుండా వరంగల్ జిల్లాలో, ఆయా చోట్లకు సువార్త దండయాత్రకు వెళ్తూ ఉండేవాడిని. ప్రభువు ఆ సువార్త దండయాత్రలో చక్కటి పాటలు పాడువానిగాను, వాక్య పరిచర్య చేయువానిగాను నన్నుంచెను. ఈ క్రమములో 2010వ సం॥లో బైబిల్ థియాలజీ కోర్స్ చేయాలనే ఆలోచనతో ACTC, భారత్ బైబిల్ కాలేజీల (BBC) గూర్చి విని వాటిని గూర్చిన విషయాలు సేకరించాను. చివరకు బోరబండలోని ఒక దైవసేవకుని పరిచయం మేరకు మియాపూర్‌లోని ఆంధ్రప్రదేశ్ బైబిల్ కాలేజ్ (APBC) లో (B.Th ) కోర్స్‌లో జాయిన్ అయ్యాను. ఉదయం 9 గం॥ల నుండి మ॥1 గం॥ వరకు కాలేజ్ చదువుతూ మధ్యాహ్నం నుండి జాబ్‌కు వెళ్ళేవాడిని. చివరకు ప్రభువు యొక్క సేవ పిలుపుకు అనుగుణంగా COGNIZANT కంపెనీలో జాబ్ చేస్తున్న నేను 12-12-2012న నా బాబ్‌కు రిజైన్ ఇచ్చి పూర్తిగా ప్రభు సేవకు సమర్పించుకున్నాను.

దేవుని సేవ విషయమై దేవుని వాగ్ధానములే నాకు ఆదారములైయున్నవి. నేను బాప్తీస్మము తీసుకున్న 2000 సం॥ములో ప్రభువు నాకు ఇచ్చిన బాప్తీస్మ వాగ్ధానం

**యెషయా 43:1 “...నేను నిన్ను విమోచించియున్నాను. భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను. నీవు నా సొత్తు”** మరియు2001వ సం॥లో నూతన సం॥ వాగ్ధానం

హగ్గయి 2:23 **“నేను నిన్ను ఏర్పరచుకొనియున్నాను గనుక ఆ దినమున నేను నిన్ను తీసుకొని ముద్ర యుంగరముగా చేతును”**

తరువాత దైవ సేవకుల ద్వారా ఈ వాగ్ధానము యొక్క అర్థాన్ని తెలుసుకున్నాను. ఇది సేవా పిలుపును గూర్చిన వాగ్ధానమని వారు చెప్పారు.

12-12-2012న రిజైన్ చేసిన తరువాత దేవుని సన్నిధిలో కనిపెట్టినప్పుడు ఆయన నా పిలుపును గూర్చి తరువాత పరిచర్య ఎక్కడ చేయాలి అనే దాని విషయమై జవాబిచ్చారు. నా పిలుపు “కాపిరి పిలుపు” అని ప్రభువు మాట్లాడుటయే కాకుండా ఒక

దైవదాసుని ప్రవచనం ద్వారా కూడా ప్రభువు సమాధానము ఇచ్చారు. నేను మహబూబ్ నగర్ ప్రాంతములో సేవ చేయాలనే ఆశ ఉన్నప్పటికిని ప్రభువు అమీర్‌పేటలోని నాగార్జున నగర్‌లో సహోదరులు శాంతకుమార్ గారి కాంపౌండ్‌లో 7-4-2013న ఉ॥ 9 గం॥లకు బల్ల, ఆరాధన ప్రారంభించుటకు ప్రభువు అన్ని విధాలుగా ద్వారం తెరుస్తూ వచ్చారు. ఈ యొక్క సేవ పరిచర్య ప్రారంభించుటకు APBC వారు నాతోటి సహోదరులు, సహోదరిలు నాకెంతగానో సహాయ సహకారాలు అందించారు.

ఈ విధముగా నన్ను మరణ అపాయము నుండి తప్పించి, పాపం వల్ల వచ్చే ఫలితం నరకాగ్ని గుండం నుండి నా ఆత్మను రక్షించి, నన్ను ఇక్కడకు రప్పించి ఎన్నో మేలులు చేసి తన మహిమగల పరిచర్యను నాకుఇచ్చి నన్ను ఏర్పరచుకొనిన ఆ దేవుడు యేసు క్రీస్తు ప్రభువే.

---------

# 29. విగ్రహాల పూజ నుండి తప్పించి క్రీస్తు నన్ను రక్షించాడు

**-పొట్టి వీరయ్య (సినీ నటుడు) (హైదరాబాద్)**



**కీర్తనలు 3:8 "రక్షణ యెహోవాదే".**

**పరిచయము:-** నేను అన్యుడను. నిష్టగల పూజలు చేసేవాడిని. మెడలో రుద్రాక్ష మాలలు. అంతేకాకుండా అనేక రకములైన మాలలు కూడా వేసుకునేవాడిని. నుదుట నామాలు పెట్టుకునేవాడిని. సూళ్లూరుపేటలో ఆవుల ప్రసాద్ రావు తండ్రి అబ్రహాం వీరు క్రైస్తవులు. వీరి కుటుంబంతో నాకు పరిచయం ఉన్నది. వారి ఇంట నేను దేవుని మాటలు విన్నాను. ఆ కుటుంబం వారు నన్ను ఎంతో ప్రేమగా ఆదరించారు. మద్రాసులో నేను సినిమాలో నటిస్తూ ఉండేవాడిని. అప్పుడప్పుడు నేను మద్రాసు నుంచి సూళ్లూరుపేట వెళ్లేవాడిని.

1989లో నా కుటుంబంతో హైదరాబాద్ వచ్చాను. నేను ప్రసాద్‌రావు గారి దగ్గర యేసును గూర్చిన మాటలు విన్నప్పటికి అంత శ్రద్ధగా వినలేదు. నాకు పాస్టర్ నళిని అమ్మగారు పరిచయమై "మీరు దేవున్ని నమ్ముకోవాలి. దేవుడు మీ పట్ల నాకు భారము పెట్టారు. మీ కొరకు నేను ప్రార్థించుచున్నాను" అని చెప్పారు. నేను కనబడినప్పుడల్లా ఇదే మాట చెప్పేవారు. "నేను అయ్యప్ప స్వామి భక్తుడిని. 29 సార్లు శబరిమలై వెళ్లినాను. యేసయ్యే నన్ను ఆయన దగ్గరకు నడిపించినప్పుడు అప్పుడే వస్తాను" అని ఆమెతో చెప్పాను.

దేవుడు నన్ను అమ్మగారి దగ్గరకు తెలియని రీతిగా నడిపించారు. యేసును గురించి సువార్తను ప్రకటించారు. దాదాపుగా సంవత్సరం విని మందిరానికి వచ్చుట ప్రారంభించాను. నేను తప్పక బాప్తీస్మం పొందాలని ఆశ కలిగి "అమ్మా నాకు బాప్తీస్మం ఇమ్మని" అడిగాను. 2-10-2013 రోజు బాప్తీస్మము తీసుకొని యేసయ్యను రక్షకునిగా అంగీకరించాను. నా హృదయంలో ఆనందమున్నది. అది దేవదేవునికే చెల్లునుగాక. నన్ను వాక్యం ద్వారా రక్షణలోనికి నడిపించిన నా ఆత్మీయ తల్లిదండ్రీ శ్రీమతి & పాస్టర్ నళిని అమ్మకు సొలోమోను అయ్యగార్లకు నా వందనములు.

ఇట్లు
గట్టు పొట్టి వీరయ్య,
పెనుయేలు ప్రార్థన మందిరం, క్రిష్ణానగర్, యూసుఫ్‌గూడ, హైదరాబాద్

## ౩౦. విత్తినదే కోయుదుము

డా॥ యస్.వి.జోబ్.



జీవితములో ఆనందమునకు మూలము మంచి విద్య, మంచి సంపాదన అను వింతైన తత్వముతో ప్రోత్సహించబడి ఏదో విధముగా వీటిని సాధించవలెనను వాంఛతో యౌవనకాలములో నా ప్రణాళికను సిద్ధము చేసుకొంటిని. క్రైస్తవ గృహము, దానిలోని భక్తిగల క్రమశిక్షణ ఎటువంటి ప్రభావమును చూపలేదు. కాని దానిని నేను వ్యతిరేకించలేదు. భక్తిగలవానిగా కనుపరచుకొనుటకు ఎంతో ప్రయత్నించితిని. నా తల్లిదండ్రులకు, స్నేహితులకు మంచివానిగా కనుపరచుకొనుటకు మంచి వేషము వేసుకొంటిని. కష్టపడి చదివి తరగతిలో ప్రధమునిగా నుండుటకు ప్రయాసపడితిని.

నా జీవితములో సంభవించిన గొప్ప విపత్తు ఏదనగా మూడు సంవత్సరముల నా కుమార్తె పోలియో వ్యాధి వలన నడవలేక పోవుట. ఆమె పరిస్థితి సరిచేయబడలేనిదను తలంపు నాకు కలిగించిన వేదన వలన ఎన్నో నిద్రలేని రాత్రులను గడిపితిని. అటువంటి ఉపద్రవము నాకెందుకు సంభవించవలెను? ఈ విధముగా శిక్షించబడుటకు నేనేమి పాపము చేసితిని? ఈ తలంపులు రాత్రింబవళ్ళు నన్ను వెంటాడుచుండెను.

ఈ సమయములోనే ఫిషరీస్ విభాగములో ఉన్నతమైన పదవిలోనున్న నేను అన్యాయముగా అణచివేయబడి, పదోన్నతి నిరాకరించబడి నిరాశతోనున్న పరిస్థితిలో ఆ పదవిని విడిచిపెట్టి మద్రాసు విశ్వవిద్యాలయములో ఒక పదవిని తాత్కాలికముగా స్వీకరించితిని.

ఈ పరిస్థితులలో అనేకమైన కుదరని వ్యాధులను స్వస్థపరుచుటకు దేవుడు వాడుకొనుచున్న సాధారణ సువార్తిక సహవాసము యొక్క వ్యవస్థాపకుడైన శ్రీ.యన్.దానియేలు గారిని కలుసుకొనుటకు ఆహ్వానించబడితిని. నేను నా కుమార్తెను తీసుకొని వెళ్ళినప్పుడు నేను ఎదురు చూచిన దానికి వ్యతిరేకముగా ఆయన ఒక్క నిమిషము నా బిడ్డవైపు చూచి నాతో మాత్రమే మాట్లాడెను.

ఒక బిడ్డతో దేవుడు ఒక కుటుంబమును దీవించిన తరువాత ఆ బిడ్డను శపించడని నా పాపమే నా బిడ్డ మీదికి ఈ ఉపద్రవము తెచ్చినదని చెప్పెను. మరియు యేసు క్రీస్తును

గూర్చిన జ్ఞానము నా తలలో మాత్రమే ఉన్నదని, సిలువలో క్రీస్తు మరణము ద్వారా కలుగు రక్షణానుభవము నా హృదయములో లేదని చెప్పెను. ఈ మాటలు నాలోనున్న లోతైన అవసరతను తాకినవి. నా బిడ్డయొక్క పరిస్థితికి నా పాప శాపమే కారణమను తలంపు నన్ను పిచ్చివాణ్ణి చేసినది. నేను నిరాశ చెందకుండునట్లు దానియేలు గారు "ఈ రాత్రి నేను ఉపవాసముండి ప్రార్థించెదను. నీవు కూడా ప్రార్థన చేయుము. ప్రభువు నీతో మాట్లాడి నీ పాపములను కనుపరచును. వాటిని దేవుని యెదుటను, మనుష్యుల యెదుటను ఒప్పుకొని, నీ సమస్యను దేవుని యెదుట పెట్టిన యెడల ఆయన నీ బిడ్డను స్వస్థపరచును" అని చెప్పెను.

ఆ రాత్రి నేను మామూలుగా చేసి ప్రార్థనలను గాక ఉపవాసముండి ప్రార్థించితిని.

యాకోబు 5:16 "నీతిమంతుని ప్రార్థన మనఃపూర్వకమైనదై బహు బలము గలదై యుండును". రోమా 2:4 "దేవుని కృప నన్ను రక్షణలోనికి నడిపించినది". నాలోని చీకటి, స్వనీతి, స్వీయపరితాపము అను ముసుగు తొలగిపోయినవి. నా అబద్ధములు, దొంగతనములు, అపవిత్రత, జారత్వముతో నిండిన నా గత జీవితమును నేను స్పష్టముగా చూడగలిగితిని.

ఆ సమయములోనే అదుర్భాటు కలిగించు సంఘటన ఒకటి నాకు సంభవించినది. పబ్లిక్ సర్వీస్ కమీషను నా పేరును ప్రతిపాదించినప్పటికిని మద్రాసు, తమిళనాడు ప్రభుత్వము నాకు ప్రధాన ప్రొఫెసరు ఉద్యోగమును ఇచ్చుటకు నిరాకరించినది. రాజకీయ ఒత్తిడి వలన నా విద్యార్థికి ఆ పదవి ఇవ్వబడుట నాకు మిక్కిలి బాధ కలిగించినది.

ఈ విషయము ఎంతవరకు న్యాయమని ప్రభువును ప్రశ్నించుచు బైబిలును తెరచితిని. నాకు భీతి కలిగించు, ఆశ్చర్యము కలిగించు జవాబు వచ్చినది. "మోసపోకుడి, దేవుడు వెక్కిరింపబడడు. మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును" (గలతీ 6:7). స్కాలర్‌షిప్ పరీక్షలలో జయము పొందిన వారికి మద్రాసులో పేరుగాంచిన మద్రాసు క్రిష్టియన్ కళాశాలలో నాలుగు సంవత్సరములు చదువుకొను అవకాశము దొరుకును. ఆ పరీక్షలో నేను మోసము చేసి నాకంటే ఎక్కువ విద్యార్హతలు గల నాతోటి విద్యార్థికి రావలసిన సీటును నేను సంపాదించితిని.

ఆ తరువాత నాకంటే తక్కువ విద్యార్హతలు గల వ్యక్తి ప్రధాన ప్రొఫెసర్ ఉద్యోగమును పొందుట ద్వారా నేను విత్తిన దానిని కోసితినని ప్రభువు నన్ను ఒప్పించెను.

నా జీవితములో నిజమైన దేవుని దీవెన ఎందుకు లేదో విశ్వవిద్యాలయములో బంగారు పతకము పొందిన నేను పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఎందుకు రాలేదో, కెనాడాలోని టొరాంటో విశ్వవిద్యాలయములో డాక్టరేట్ పొందిన తరువాత ఒక సంవత్సరము ఎందుకు ఖాళీగా ఉన్నానో, ఉద్యోగము వచ్చినప్పుడు తక్కువ స్థాయి ఉద్యోగము ఎందుకు వచ్చినదో, నా విద్యార్థులు ప్రొఫెసర్ పదవులు సంపాదించగా నేను 14 సంవత్సరములు ఎందుకు రీడర్‌గానే మిగిలిపోతినో, నా బిడ్డ ఎందుకు అంతగా భయంకరముగా మొత్తబడినదో స్పష్టముగా గ్రహించగలిగితిని. ఈ గ్రహింపుతో నేను కలవరపడి నా దుష్ట జీవితము నుండి విడుదల పొందగలిగితిని.

ఒక పాపి పశ్చాత్తాపపడి మారుమనస్సుకు తగిన ఫలములను ఫలింపవలెనని బైబిలు చెప్పుచున్నది. కావున మోసము చేసి తీసుకొనిన స్కాలర్‌షిప్ డబ్బును కళాశాలకు తిరిగి ఇచ్చివేసితిని. పరీక్షలో మోసము చేసిన విషయమును ప్రిన్సిపాల్ వద్ద ఒప్పుకొంటిని. నా శత్రువులతో సమాధానపడితిని. నా భార్య విషయములో అపనమ్మకముగా ప్రవర్తించినందుకు ఆమెను క్షమాపణ కోరితిని. ఈ కార్యములు దోషభరితమైన నా మనస్సాక్షికి గొప్ప ఊరట కలిగించినవి.

రక్షణను గూర్చిన నిశ్చయత దయచేయుమని ప్రార్థనలో ప్రభువు సన్నిధిలో కనిపెట్టితిని. ప్రార్థనకు జవాబుగా "క్రీస్తు యేసునందు జీవమునిచ్చు ఆత్మయొక్క నియమము పాప మరణముల నియమము నుండి నన్ను విడిపించెను" (రోమా 8:2) అను రక్షణ నిశ్చయతను నాకిచ్చెను. వెంటనే గొప్ప సంతోష సమాధానములు నన్ను సంపూర్ణముగా నింపివేసినవి. నా ఆరోగ్యము కుదుట పడినది. మనుష్యుల ఊహలకు వైద్యముతో అసాధ్యమైన నమ్మశక్యము కాని కార్యము నా కుమార్తె జీవితములో జరిగినది. నా విద్యను గూర్చిన గర్వము, శాస్త్రీయ విజ్ఞానము మీద నాకున్న విశ్వాసము నన్ను వీడిపోయినవి. దేవుని నీతి యెదుట నా నీతి మురికి గుడ్డల వలె నున్నట్లు నాకు గ్రహింపైనది. యేసు నొక్కి వక్కాణించిన "నేనే మార్గమును సత్యమును జీవమునై యున్నాను" (యోహాను 14:16) అను సత్యము నా జీవితములో స్థిరముగా స్థాపించబడినది.

అప్పటి నుండి బైబిలు నాకెంతో ప్రశస్తమైనదిగా మారిపోయినది. పరిశుద్ధాత్మ దేవుడు నన్ను నడిపించుట ప్రారంభించెను. అనుదిన జీవితములోని ప్రతి విషయములో ఆయన నడిపింపు కొరకు వెదకితిని. నాకు రక్షకునికి ఏర్పడిన సజీవ సంబంధము ఆనందకరమైన వాస్తవముగా నుండెను. ఏ తాంత్రికుడు హస్తసాముద్రికుడు చేయలేని రీతిలో ప్రభువు ఒక సమయములో మరణాపాయమును గూర్చి హెచ్చరించి తప్పించెను.

పాతవి గతించెను. సమస్తమును క్రొత్తవాయెను. నేనొక నూతన సృషిగా మారిపోతిని (2 కొరింథీ 5:17)

స్వార్ధము నన్ను విడిచిపెట్టి నశించుచున్న ఆత్మల కొరకైన భారము నన్ను పట్టుకొనినది. అవసరతలోనున్న వారి భారములను దేవుని సన్నిధిలో పెట్టి తరువాత వారు పొందిన విడుదలను బట్టి ఆనందించుచుంటిని. నా దీనమైన సేవలో గొప్పవారు, బీదవారు వివిధ రకములైన విశ్వాసము గల అనేకులు సంతోషముగా యేసు క్రీస్తు ప్రభువుని రక్షకునిగా అంగీకరించినారు. సత్యమునకు శత్రువులైన వారు 'బలవంతపు మత మార్పిడి' అని చెప్పకుండునట్లు బలవంతముగాని, డబ్బును ఎరచూపుట గాని ఎన్నడు చేయలేదు.

ప్రియ చదువరీ! ఒకప్పుడు నేను క్రైస్తవుడనని చెప్పుకొని జీవించినట్లుగా గాక నిజమైన క్రైస్తవత్వము ఒక వ్యక్తి హృదయములో, గుణ లక్షణములలో నిజమైన మార్పు తెచ్చునని మీరు గ్రహించి యున్నారని విశ్వసించుచున్నాను. నా పాపముల కొరకు, లోక పాపముల కొరకు సిలువ వేయబడిన ఆ రక్షకుడైన యేసు క్రీస్తు ప్రభువు లోకము ఇవ్వలేని సంతోషమును, సమాధానమును నీకిచ్చుటకు నీ కొరకు కూడ వేచియున్నాడు.

ఆ విధముగా ప్రభువైన యేసు క్రీస్తు ఆయన అమూల్యమైన, పాప రహితమైన, ప్రశస్త రక్తముతో నన్ను విమోచించెను. మన తీర్థయాత్రలు, ఆచార సంబంధమైన బలులు, ఆరాధనలు, పుణ్య కార్యముల వలన ఎటువంటి ప్రయోజనము లేదు గాని సిలువలో యేసు చేసిన విమోచన బలియాగమునందలి విశ్వాసము మాత్రము పాపిని రక్షించగలదు. ఈ అద్భుతమైన రక్షణను నిజమైన పశ్చాత్తాపము విరిగిన హృదయముతో మాత్రమే పొందగలము. ఇది నా స్వానుభవము.

**ముగింపు: –** "డా॥ జోబ్ తన ఆరోగ్యము క్షీణించుచున్నదని, నడుచుట కూడా కష్టమగుచున్నదని నాతో చెప్పితిరి. అందువలన అనుభవము గల వ్యక్తి తమిళనాడులోని మధురైలో దాని చుట్టునున్న ప్రాంతములలో సేవచేయుటను కొనసాగించుట మంచిదని తలంచితిని.

ఆ తరువాత బర్మా సరిహద్దులలో నున్న మణిపూర్‌లోని ఇంఫాల్‌లో ఒక యౌవనస్థుడు అకస్మాత్తుగా ఖాళీ చేసిన స్థానములో సేవచేసెదనని నాకు వ్రాసిన ఉత్తరమును చూచి ఆశ్చర్యపడితిని. తాను నడిపించిన యౌవనస్థుడు ఖాళీ చేసిన స్థలములో సేవచేయవలెనని డా॥ జోబ్ తలంచెను.

ప్రమాదకరమైన ఆ స్థలములో గృహములలో ప్రజలను దర్శించుటకు ఎంతో నడవవలసిన స్థలములో డా॥ జోబ్ గారు సేవ చేయుటను అనుమతించుట నాకు

అసాధ్యమైనదిగా కనిపించెను. ఆ సమయములో ఆ ప్రాంతములోని కొండ తెగల మధ్య ఎన్నో పోరాటములు, రక్తపాతములు జరుగుచున్నందున నేను కొంచెము వెనుకంజ వేసితిని.

కాని డా॥ జోబ్‌ను ఆ స్థలములో పనిచేయుటకు అనుమతించమని ప్రభువు నాతో చెప్పెను. డా॥ జోబ్ శ్రీమతి మార్జొరి జోబ్ అక్కడికి వెళ్ళి వివిధ తెగల ప్రజల మధ్య అంకిత భావముతో నిస్వార్థముతో చేసిన సేవను ఈ ప్రాంత ప్రజలు ఎన్నడు మరువలేరు.

గుండె సంబంధమైన వ్యాధుల చికిత్సకు తగిన వైద్య సదుపాయము లేని ఆ స్థలములో డా॥ జోబ్‌కు గెండెపోటు వచ్చెను గాని ప్రభువు ఆశ్చర్యకరముగా ఆయనను బాగుచేసెను. ప్రమాదము నుండి, ఆస్పత్రి నుండి బయట పడేవరకు అక్కడి ప్రజలు రాత్రింబవళ్ళు ఆయన కొరకు ప్రార్థించిరి.

మణిపూర్‌లో పదమూడు సంవత్సరములు ప్రభువు కొరకు ప్రయాసపడిన తరువాత చెన్నైలోని బ్యూలా తోటలోనున్న బైబిలు కళాశాల విద్యార్థుల సంరక్షణ బాధ్యత వారి కొరకు కనిపెట్టుకొని యుండెను. శ్రీమతి మార్జొరి జోబ్ ప్రభువు పిలుపు నందుకొనిన తరువాత డా॥ జోబ్ గారు బిడ్డల సంరక్షణలో నుండుటకు బదులు దేవుని పిలుపు వచ్చువరకు దేవుని మందిరములో సేవ చేయుటకు ఎంచుకొనెను".

ప్రభువు పాపమును హృదయములో నుంచుట కిష్టపడదు. యదార్థ హృదయాలను ప్రేమించి దీవించుదురని ఈ భక్తుని సాక్ష్యము వివరిస్తుంది. అనేకులకు స్ఫూర్తినిచ్చే ఈ సాక్ష్యము ద్వారా దీవెనలు లభించును గాక. ఆమెన్.

---------

## 31. క్రీస్తును లక్ష్యపెట్టిన వాడను కాను

– బ్రదర్ జి. ఏబెల్



నేను ఆంధ్ర రాష్ట్రములోని ఒక మధ్య తరగతి కుటుంబములో జన్మించితిని. నా తల్లిదండ్రులు బాప్టిష్టు సంఘమునకు చెందిన సామాన్యమైన వ్యక్తులు. నా తల్లిదండ్రులు నామకార్ధ క్రైస్తవులైనందున ప్రార్ధన, బైబిలు చదువుట, సంఘారాధనలకు హాజరగుట వంటి మంచి క్రైస్తవ అలవాట్లు మాత్రమే నేర్పించిరి గాని నిజమైన మారు మనస్సును గూర్చి నేర్పించలేదు.

మతము అనునది మానవ కల్పితమైనదని, ప్రజలను నైతికమైన క్రమశిక్షణలో, కట్టుబాట్లలో నుంచుటకు ఏర్పాటు చేయబడినదని తలంచితిని. క్రైస్తవ్యము కూడా మానవుని దుష్ట స్వభావమును మార్చగల శక్తిలేని మరియొక మతమని తలంచితిని. ప్రసంగములు చేయు అనేకులు వారు బోధించిన వాటిని ఆచరించకపోవుటను గమనించిన నేను క్రైస్తవత్వమును గూర్చి ఈ అభిప్రాయమును ఏర్పరచుకొంటిని.

యౌవనస్థునిగా జీవితమును అనుభవించవలెనను నిశ్చయతతోనున్న నేను సిగరెట్లకు బానిసనైతిని. నాటకాలలో కూడా నటించుచుంటిని. వీటితో పాటు అపవిత్రతలోనికి దిగిపోయి వ్యభిచారములో జీవించుట కారంభించితిని. పాప భోగములకు లోతుగా బానిసనైన నేను వాటివలన కలుగు క్షణికానందమును పొందుచుంటిని గాని ఆ తరువాత భరించలేని దు:ఖము, బాధకు లోనగుచుంటిని. నా మనస్సు అపవిత్రతతో, వ్యభిచారముతో నిండియుండుటను బట్టి చదువు మీద మనస్సు పెట్టలేకపోతిని.

ఈ పరిస్థితిలో 'హరిజను'లని పిలువబడుచున్న వెనుకబడిన వారికి సేవచేయవలెనని ఆశించితిని. కావున వీరి పునరుద్ధరణ కొరకు ఏర్పాటు చేయబడిన పార్టీలోచేరి, ఆ పార్టీ నాయకుని ఆరాధించుట కారంభించితిని. క్రైస్తవ విద్యార్థులు ఉన్నత విద్య నభ్యసించుటకు ప్రభుత్వము సహాయము చేయనందున వెనుకబడిన కులములకు చెందినవారు హిందువులుగా మారి షెడ్యూల్డు తెగలో చేరి ఉపకారవేతనములు పొందమని అనేకులను ప్రోత్సహించితిని.

ఒక వ్యక్తికి మొదట ఆహారము, ఆ తరువాత వస్త్రములు, ఆ తరువాత మంచి ఉద్యోగము మాత్రమే జీవితములో ఆవసరమని దేవుడు అవసరము లేదని తలంచుచుంటిని.

“పరలోకమును నిశ్చయముగ ఎవరును యెరుగరు గనుక మొదట శరీరాశలను నెరవేర్చుకొనవలెనని” తంచుచుంటిని. ఒక వ్యక్తి కొంచెము మంచి జీవితము జీవించిన యెడల మరణము తరువాత జీవితమంటూ ఉంటే ఆ వ్యక్తి దేవుని యొద్దకు వెళ్ళగలడని కూడా తలంచుచుంటిని. అన్ని మతములు ఒక్కటేయని అన్ని మతములు ఒక్క విషయమునే వివిధ రీతులలో నేర్పించుచున్నవని దృఢముగా చెప్పుచుంటిని. నైతికముగా మంచి జీవితము జీవించవలెనని నేను కోరితిని గాని అది నాకు సాధ్యపడలేదు.

నా తల్లిదండ్రులు నా విషయమై ఎంతో వేదన చెందుచుండిరి. వారి గద్దింపులను నేనెన్నడు లక్ష్యపెట్టలేదు. సహో.దానియేలు గారి కూటములలో మారు మనస్సు పొందిన నా చిన్నాన్న తన జీవితములో అనుభవించిన మార్పును గూర్చి చెప్పుచుండెను. గాని అపవిత్రతతో నిండియున్న నేను దేవునివైపు తిరుగుటకు నిరాకరించితిని.

ఉన్నత పాఠశాల విద్యను ముగించిన తరువాత ఉన్నత చదువులు చదువుటకు, ఉపకార వేతనములను పొందుటకు నా పేరు మార్చుకొని హరిజనునిగా మారిపోవుటకు తలంచుచున్నానని నా తండ్రితో చెప్పితిని. కాని నా తండ్రి దానికి అంగీకరించలేదు. అందుకు నేను మరణము తరువాత పరలోకము చేరుటయను వ్యర్థమైన తలంపుతో ఈ లోకములో అభివృద్ధి చెందు అవకాశాలను పొందకుండ చేయుచున్నావని నా తండ్రితో చెప్పుట నా దుష్టత్వమునకు పరాకాష్ట. ఆ సమయములో పోలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్‌లో సీటు వచ్చినది. కళాశాలలో చేరుటకు ముందు నేను నా చిన్నాన్న ఇంటికి వెళ్ళితిని. మా చిన్నమ్మ దినమంతా నా ఆత్మ రక్షణను గూర్చి బోధించినది. సమయమంతా ఆమె దేవుని గూర్చి మాట్లాడుట విని “మా చిన్నమ్మకు నిజముగా మతపిచ్చి పట్టినది” అని తలంచుచు మరునాడే ఆ ఇంటినుండి వెళ్లిపోవలెనని తంచితిని.

ఆ రాత్రి మా చిన్నమ్మ క్రీస్తే నిజమైన రక్షకుడని నన్ను నమ్మించుటకు ప్రయత్నించినను దానిని అంగీకరించుటకు నేను నిరాకరించితిని. ఆమె చెప్పిన దానిని వ్యతిరేకించుచు ఇతర దేవుళ్లైన రాముడు, కృష్ణుడు, బుద్ధుడు కూడా దేవుని స్వరూపములేనని వాదించితిని. అప్పుడు మా చిన్నాన్న “నీవు చెప్పిన వారంతా దేవుళ్లైతే నీ పాపములను వారి దగ్గర ఒప్పుకొనుము. వారు నీ పాపములను క్షమించి నీ జీవితమును మార్చిన యెడల నీవు వారిని దేవుళ్ళని చెప్పవచ్చును” అని చెప్పెను. చివరిగా “నీ పాప జీవితము నుండి విడిపించి నిన్ను మార్చివేయగల దేవుడు క్రీస్తు తప్ప ఎవరును లేరని ” ఖచ్చితముగా చెప్పెను. ఈ మాటలు నన్ను సూటిగా తాకినవి.

క్రీస్తును గూర్చి వారు మరి కొంచెము సేపు మాట్లాడిన తరువాత మేము ముగ్గురము మోకరించగా మా చిన్నాన్న ప్రార్థించుట కారంభించెను. నాకు వణుకు ప్రారంభమైనది. నేనెందుకు కణుకుచున్నానో నాకే తెలియదు. నాకు సంభవించుచున్నది నిజమేనా యని ప్రార్థన మధ్యలో కళ్ళుతెరచి చూచి నిజమని రూఢిపరచుకొంటిని. తరువాత నేను "దేవా! నేను పాపిని, గ్రహింపులేకుండా నీ సత్యమునకు వ్యతిరేకముగా వాదించితిని" అని ప్రార్థించుచుండగా గొప్ప వెలుగు నా మృదయము మీద ప్రసరించినది. పశ్చాత్తాపాత్మ నన్ను గట్టిగా పట్టుకొనగా బిగ్గరగా ఏడ్చుచు నా పాపములను ఒప్పుకొనుటకు ఆరంభించితిని. జ్ఞాపకమున్న పాపములన్నింటిని లోతైన దు:ఖముతో ఒప్పుకొంటిని. ఈ విధముగా దేవుని సన్నిధిలో నా పాపములను ఒప్పుకొనుచు మూడు దినములు ప్రార్థించితిని.

నా హృదయమును, నా జీవితమును సంపూర్ణముగా ఆయనకు లోబరచుకొనిన తరువాత నా పాప భారము హృదయమునుండి తొలగిపోయినది. గతములో ఎన్నడు లేని సంతోష సమాధానములు నా హృదయమును నింపినవి. నా తలంపులు, చూపులు, కోరికలు, అలవాట్లు నూతనపరచబడినవి.

నేను నా ఇంటికి తిరిగి వచ్చిన తరువాత నన్ను చూచిన వారందరు నాలో కలిగిన సంపూర్ణ పరివర్తనను గుర్తించగలిగిరి. నా శత్రువుల యొద్దకు వెళ్ళి క్షమాపణ అడిగితిని. వెంటనే ప్రభువ హస్తము నన్ను వాడుకొనుట కారంభించెను. నేను ప్రార్థించగా దెయ్యములు పట్టిన వారి నుండి దెయ్యములు పారిపోయినవి. వ్యాధిగ్రస్థులు స్వస్థపడిరి. నేను విద్యార్థిగా నుండగానే నా విద్యను ముగించి దేవుని సేవ చేయవలెనని ఒక దినమున ప్రార్థనలో ప్రభువు నాతో చెప్పెను. రెండు సంవత్సరములు ఉద్యోగము చేసిన తరువాత దేవుని సేవ చేయుటకారంభించితిని.

**సంకలన కర్త వ్యాఖ్య :–** "సహోదరుడు ఏబెల్ మచిలీపట్టణములోన అనేక సంవత్సరములు దేవుని సేవ చేసెను. ఎక్కువ ప్రార్థనతో, త్యాగముతో అనేక ఆత్మలను సంపాదించి ఆ స్థలములో దేవుని సేవను కట్టెను. అతని మరణ సమయములో 'నన్ను ఆహ్వానించుటకు ప్రభువు వచ్చుచున్నాడ'ని చెప్పెను. జీవితాంతము అతడు ప్రభువునకు నమ్మకముగా సేవ చేసెను".

---------

# 32. నేను నిష్ప్రయోజకుడనైన లోకస్థుడను

**డా॥ జాషువా జేసుదాస్**

దక్షిణ భారత దేశములోని ఒక క్రైస్తవ గృహములో జన్మించితిని. నా తండ్రి ఒక బ్రాహ్మణుడు. గృహములో నేనే పెద్దవాడనైనందున ఎంతో గారాబముగా పెంచబడితిని. నేను పాఠశాలలోనున్నప్పుడు చెడ్డ స్నేహములకు అలవాటుపడి ఇంటినుండి డబ్బులు దొంగిలించి నా తల్లిదండ్రులకు తెలియకుండా సినిమాలకు వెళ్ళుచుంటిని.

స్నేహితులతో కలిసి సిగరెట్లు త్రాగుచు అమ్మాయిల వెంట తిరుగుచుండుటను బట్టి పాఠశాలకు క్రమముగా వెళ్ళేవాడిని కాను. ఆ దినములలోనే రౌడీగా మారి పాఠశాలలోని బెంచీలను, గోడలను విరుగగొట్టు చుండేవాడను. నా ఉపాధ్యాయులు కూడా నేనంటే బయపడేవారు. నేను ఇతరులను పరిహాసము చేయుచు నాకంటే చిన్నవారిని కొట్టేవాడిని. సమ్మెలు మరియు మిగిలిన అసాంఘిక కార్యకలాపములలో చురుకుగా పాలుపొందుచుంటిని. ఇంటిలో తల్లిదండ్రులతో తరుచు గొడవపడుచు వారికి గొప్ప తలనొప్పిగా మారిపోతిని. నా ఉన్నత పాఠశాల విద్యను ముగించిన తరువాత వృత్తి విద్యలో చేరుటకు అవసరమైన శిక్షణ పొందుటకు కళాశాలలో చేరితిని. అక్కడ నా పరిస్థితి మరీ అధ్వాన్నముగా మారిపోయినది. నాలో దేవుని భయము లేనందున శరీరాశలు నెరవేర్చుకొనుటయే నా జీవితములో ఏకైక లక్ష్యముగా నుండెను.

ఒక సమయములో మా కళాశాల గేటు వద్ద నిలువబడి ఆ దారిలో పోవుచున్న అమ్మాయిలను గూర్చి అసభ్యముగా మాట్లాడుచుండగా వినిన ఒక హిందూ విద్యార్థి "నీవు క్రైస్తవుడవై యుండి అలాంటి మాటలు ఎలా మాట్లాడుచున్నావ"ని గద్దించెను. రౌద్రముతో ఆమెను అసహ్యమైన పదజాలముతో తిట్టి కొట్టెదనని బెదించితిని.

నాకు ఆటలంటే ఎంతో ఇష్టం. 'టేబుల్ టెన్నిస్' ఆటలో ప్రావీణ్యము సంపాదించి పట్టణములో జరిగిన అనేక పోటీలలో గెలిచితిని. కళాశాల ఛాంపియన్‌గా పాల్గొని విశ్రాంతి దినమును అపవిత్రపరచితిని. నాకున్న హిందూ స్నేహితురాండ్ర దగ్గర నా క్రైస్తవ పేరును బట్టి సిగ్గుపడుచుంటిని.

అటువంటి స్థితిలో కూడా నా సంఘములో పాటలు పాడు ప్రత్యేక బృందములో సభ్యునిగానుంటిని. నేనెంత భక్తిహీనుడననగా ఆడపిల్లలను చూచుటకు మాత్రమే చర్చికి

వెళ్ళుచుంటిని. కళాశాలలో రెండు సంవత్సరములు శిక్షణ పొందిన తరువాత వైద్య కళాశాలలో ప్రవేశించితిని. వైద్య కళాశాలలో చేరుటకు నాముఖ్యమైన లక్ష్యము డబ్బు సంపాదన. ఎటువంటి ఆటంకము లేకుండా శరీరాశలు నెరవేర్చుకొన వచ్చుననునది రెండవది.

కొన్ని నెలల తరువాత వైద్య విద్యార్థులు, నర్సుల కొరకు జరుగుచున్న ఒక ప్రత్యేక క్రైస్తవ కూటమునకు నేను ఆహ్వానించబడితిని. అయిష్టముగానే ఆ కూటములకు హాజరైతిని. ఆ కూటములలో ప్రభువు నా పాపములను నాకు చూపించుట ప్రారంభించెను. జాతకములు చూచుట, మంచి రోజులు, ముహూర్తములను చూచుట మొదలగు హిందూ ఆచారములు గృహములో నుండినవి. వాటిని నేను ఆసక్తితో ఆచరించుచుంటిని. ప్రభువైన యేసు క్రీస్తు పటముతో పాటు ఇతర హిందూ దేవుళ్ళ పటములు మా గృహములో నుండినవి. ప్రతి శుక్రవారము ఆ పటములకు పూలుపెట్టి ధూపము వేయుచుంటిని. హిందూ దేవుళ్ళపై గల ఆసక్తి వలన హిందూ దేవాలయములను దర్శించేవాడను.

నిర్గమ కాండము 20:3-5 లో చెప్పబడిన రీతిగా ఈ హేయమైన కార్యములు ఆయన దృష్టికి పాపములని చూపించెను. "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని క్రింది భూమియందేగాని భూమి క్రింద నీళ్ళయందే గాని దేని రూపమునయినను విగ్రహమునయినను నీవు చేసుకొనకూడదు. వాటికి సాగిలపడకూడదు. వాటిని పూజింపకూడదు. ఏలయనగా నీ దేవుడనైన యెహోవానగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలను గైకొను వారిని వెయ్యితరముల వరకు కరుణించువాడనై యున్నాను". "యెహోవా సెలవిచ్చునదేమనగా అన్యజనముల ఆచారముల నభ్యసింపకుడి. ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును. అయితే మీరు వాటికి భయపడకుడి. జనముల ఆచారములు వ్యర్థములు" (యిర్మియా 10:2,3).

హిందూ విగ్రహములను దేవతల పటములను తీసివేయవలెనని ప్రభువు నాకు చూపించెను. దేవుని కృపవలన ఈ విషయములో దేవునికి లోబడితిని. ఒక దినమున సహో.జాషువా డానియేల్ గారు ప్రసంగించుచుండగా అక్కడనున్న వ్యత్యాసమైన ఆత్మీయ వాతావరణమునకు, వర్తమానమునకు నేను ఆకర్షితుడనైతిని. క్రమముగా కూటములకు హాజరగుట కారంభించితిని. సహో॥ జోగారు నాతో తరచుగా మాట్లాడేవారు. ఆ

కూటములలో క్రీస్తు సిలువ ద్వారానే రక్షణ మార్గమని నాకు చూపించబడెను. అప్పటినుండి నా పాపములను క్షమించుమని దేవునిని వేడుకొనుట కారంభించితిని. ఈ లోకవైభవము నా ఆత్మీయ ఆకలిని తృప్తిపరచలేదను గ్రహింపు కలిగినది. ఈ లోకములో అవసరమైనవన్నీ కలిగియున్నను నాకు తృప్తిలేదు. గనుక అంతరంగములో సంతోషము, సమాధానము పొందవలెనను వాంఛ కలిగినది.

ఒక దినమున నేను ప్రార్థించుచుండగా లోతైన ఒప్పుకోలు ఆత్మ నామీదికి వచ్చి ప్రేమగల ఆయన హృదయమును నేనెంతగా దు:ఖపరచితినో దేవుడు నాకు కనబరచెను. క్రీస్తును నేనే సిలువ వేయుచున్నానను గ్రహింపు వచ్చినది. నా పాపలముల నిమిత్తము దేవుని యెదుట బిగ్గరగా ఏడ్చుచుండగా నేను ఎవరిని బాధపెట్టితినో వారినందరిని క్షమాపణ వేడుకొనవలెనని దేవుడు నాకు చూపించెను. నేను గర్విష్టుడనైనందున నన్ను నేను తగ్గించుకొనుట చాలా కష్టమైనది.

నా అపవిత్రమైన జీవితమును తల్లిదండ్రుల వద్ద ఒప్పుకొంటిని. నా ఉపాధ్యాయులు, స్నేహితుల యొద్ద క్షమాపణ కోరితిని. దేవుని యెదుట నన్ను నేను తగ్గించుకొని నా మనస్సాక్షిని సరిచేసుకొంటిని. హృదయమంతటితో ప్రార్థించుచుండగా "మంచు విడిపోవునట్లుగా నేను నీ యతిక్రమములను మబ్బు తొలగునట్లుగా నీ పాపములను తుడిచివేసియున్నాను. నేను నిన్ను విమోచించియున్నాను. నా యొద్దకు మళ్ళుకొనుము" (యెషయా 44:22) అను బైబిలు వాక్యము ద్వారా దేవుడు నాతో మాట్లాడెను. ఈ వాక్యములు నా హృదయమును గొప్ప సంతోష మాధానములతో నింపినవి. సజీవుడైన నా రక్షకుడైన ప్రభువు నా హృదయమును సంపూర్ణముగా తృప్తిపరచెను. నేను దేవుని బిడ్డలను ప్రేమించి నా పాత స్నేహితులను కలుసుకొనుట, వారితో సినిమాలకు వెళ్ళుట మానివేసితిని.

నేను వైద్య విద్య ముగించిన సమయములో "వైద్యపట్టా పొందిన తరువాత నేనేమి చేయవలెను?" అను ప్రశ్న హృదయములో ప్రారంభమైనది. ఉన్నత విద్య చదువవలెనని నా తల్లిదండ్రులు కోరిరి. భారత ప్రభుత్వము మంచి జీతముతో కెప్టెన్ హోదాలో సైన్యములో వైద్యాధికారిగా నుండుటకు వ్యక్తిగతముగా ఆహ్వానించినది.

బొంబాయిలో ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభించి ఎక్కువ డబ్బు సంపాదించమని నా బంధువులు సలహానిచ్చిరి. నేను ఉపవాసముండి ప్రార్థించగా దేవుడు "పర్వతములెక్కి మ్రాను తీసుకొని వచ్చి ఈ మందిరమును కట్టించిన యెడల దానియందు నేను సంతోషించి

నన్ను ఘనపరచు కొందునని యెహోవా సెలవిచ్చుచున్నాడు" (హగ్గయి 1:8) అని నాతో మాట్లాడెను. నా జీవితాంతము వైద్య మిషనెరీగా ఆయనను సేవించవలెనని దేవుడు నాతో చెప్పినందున సంతోషముగా నేను ఆయన చిత్తమునకు లోబడితిని. నా వైద్య విద్య ముగించిన తరువాత కోయంబత్తూరులో అవసరతలో నున్న స్థలములలో ప్రయాసపడుటకు ప్రభువు నన్ను నడిపించెను. ఆయన పరిశుద్ధ సేవ చేయుటలో నేను పరిపూర్ణమైన సంతోష సమాధానములను అనుభవించుచున్నాను.

**సంకలన కర్త వ్యాఖ్య :–** "తమిళనాడులోని కోయంబత్తూరులోని లూథరన్ కంటి ఆస్పత్రిలో కంటి వైద్య నిపుణునిగా డా॥ యేసుదాసు అనేక సంవత్సరములు పనిచేసెను. కుటుంబ అవసరతల కొరకు వైద్యసేవ ద్వారా వచ్చిన చిన్న ఆదాయమును వాడుకొనుచు ఆ పెద్ద పారిశ్రామిక పట్టణములో మన సహవాస కేంద్రము యొక్క ఆత్మల భారమును భరించుచున్నారు. మన విద్యార్థుల మధ్య సేవకొరకు సంపూర్ణముగా సమర్పించుకొనిన ఫ్యూషియా అతనికి సాటియైన సహకారిగా సేవలో సహాయము చేయుచున్నారు.

ఉజ్జీవ కూటముల కొరకు అతనిని పంపిన ప్రతి స్థలములో డా॥ జేసుదాసు దేవునికొరకు ముమ్మరముగా, నమ్మకముగా ప్రయాసపడుచున్నారు".

---------

## 33. సుఖానుభవమే నా మతము

సహో. జి.బి. సాల్మన్

నేను క్రైస్తవ గృహములో జన్మించినప్పటికిని దేవుని వాక్యమును చదువుటను గాని, ప్రభువైన యేసు క్రీస్తును గూర్చి నేర్చుకొనుటను గాని లక్ష్యపెట్టలేదు.

చిన్న వయసులోనే అనేకమైన అపవిత్రమైన పాపములలోనికి దిగిపోయి చెడు అలవాట్లకు బానిసనై దేవుని హృదయమునకు ఎంతో వేదనను కలిగించితిని. పాఠశాలలో చదువుచుండగా అన్నిరకములైన మురికి నవలలు, ఇతర పుస్తకములు చదువుట ద్వారా నా హృదయము నేను అదుపుచేయలేని, జయించలేని పాపపు తలంపులతోను, కోరికలతోను, నా కండ్లు పాపపు చూపులతోను నిండిపోయినవి.

"ఒకవేళ దేవుడంటూ ఉంటే ఆయన ఎక్కడో కోట్ల మైళ్ళ దూరములో నున్నాడు. ఆయనకు నా జీవితమును గూర్చి ఏమి ఆసిక్తి? ఆయన పరిశుద్ధుడైనందున నా వంటి పాపులతో ఎటువంటి సంబంధమును పెట్టుకొనుటకు ఇష్టపడడు" అని చెప్పుచుంటిని. పాప భోగములను అనుభవించుటకే ఈ లోకములో జన్మించితినని తలంచితిని.

రెండవ ప్రపంచ యుద్ధ సమయములో 21 సంవత్సరముల వయస్సులో సైన్యములో చేరి మూడున్నర సంవత్సరములు పనిచేసితిని. నేను త్రాగుడు, సిగరెట్లు, లైంగిక వాంఛలను ప్రేరేపించు సినీమాలను తరచు చూచుటయందు ఆనందించుచుంటిని. ఒక దుష్టుడైన యౌవనస్థుడు చేయగలిగిన పాపములన్నింటిని చేసితిని.

సైన్యము నుండి తిరిగి వచ్చిన తరువాత నా స్వస్థలములోనే ఉద్యోగము దొరికినది అప్పుడు మునుపటికంటే భయంకరమైన, దుష్టమైన, అపవిత్రమైన జీవితమును జీతవించుట కారంభించితిని. నా దుష్ట జీవితమును బట్టి 'గుండెదడ' అను వ్యాధి నను పట్టకొనినది. అనేకమైన మందులు వాడితిని గాని ప్రయోజనము లేకపోయేను. దేవుడు నా స్థితికి, నా గతికి, నా మృతికి నన్ను విడిచిపెట్టాడని నేననుకొంటిని.

ఒక సంవత్సరము నా స్వస్థలములో పనిచేసిన తరువాత మద్రాసులో సాంకేతికి కోర్సు చదువుటకు మద్రాసుకు వెళ్ళవలసి వచ్చినది. మద్రాసులోనున్న సమయములో ఆత్మలో నెమ్మదిలేని వానిగా రాత్రుళ్ళు గడుపుచు అప్పుడప్పుడు నిద్రమాత్రలు

వేసుకొనుచుంటిని. క్రమముగా నా ఆరోగ్యము క్షీణించుట కారంభించగా ఏమి చేయవలెనో తెలియక నిరాశపడిపోతిని.

ఈ పరిస్థితులలో నా కళాశాలలో నున్న ఒక యౌవనస్థునితో నాకు పరిచయము ఏర్పడినది. ఒక ఆదివారము సాయంత్రము అతడు నా గదికి వచ్చినప్పుడు సినిమాలకు వెళ్దామని చెప్పితిని. అందుబాటులో నున్న సినిమాలన్నీ అపవిత్రతను ప్రేరేపించేవే. అందుకతడు "నేను క్రైస్తవుడను, అటువంటి వాటిని చూచుటకు రాలేను" అని చెప్పి సినిమాలకు వచ్చుటకు నిరాకరించెను.

ఈ మాటలు నాకు ఆశ్చర్యము కలిగించినవి. "అంత భక్తి మాటలు మాట్లాడుచున్నావేంటి?" అని ప్రశ్నించగా అతడు రక్షణ పొందిన వృత్తాంతమును నాకు వివరించెను. "నేను కూడా నా శరీరాశలను నెరవేర్చుకొనుచు, సిగరెట్లతో, సినిమాలతో జీవించుచుంటిని. సాధారణ సువార్తిక సహవాసము యొక్క సేవకులైన యన్. దానియేలు గారి ద్వారా వాక్యము నా జీవితమును మార్చినది" అని చెప్పెను.

వెంటనే "నేను కూడా అటువంటి నూతన జీవితమును యేసు క్రీస్తులో పొందగలనా?" యని ప్రశ్నించగా అతడు "దేవుడు తప్పక సహాయము చేయును. నీవు వచ్చి దేవుని వాక్యము వినుము" అని చెప్పెను. అప్పటి నుండి సహవాసపు కూటములకు హాజరగుట కారంభించితిని.

ఆదివారము ఆరాధనలకు వెళ్ళి దేవుని వాక్యమును శ్రద్ధగా వినుచుంటిని. దేవుని సేవకులైన దానియేలుగారు ఆయన వర్తమానములో "యౌవనస్థుడా! నీ పాపములను బట్టి పాపరహితుడైన క్రీస్తు శరీరము సిలువలో నలుగగొట్టబడినది. దేవుడు నిన్ను విడిచిపెట్టాడని నీవనుకొనుచున్నావు. నీవు దేవునిని విడిచిపెట్టావు గాని దేవుడు నిన్ను విడిచిపెట్టలేదు" అని చెప్పెను. ఆ మాటలు సూటిగా నా హృదయమును తాకినవి. సిలువ దృశ్యము నా మనస్సులోనికి వచ్చినది. చిన్నబిడ్డవలె దేవుని సన్నిధిలో విరిగిపోతిని. "ప్రభువా! నా వంటి పాపిని నీవు రక్షించిన యెడల నా జీవితకాలమంతా నీకు మంచి సాక్షిగా నుందును" అని ప్రభువును కన్నీటితో వేడుకొంటిని.

ఆరాధన ముగిసిన తరువాత గతికి వెళ్ళితిని గాని నా హృదయములో గొప్ప అలజడి ఉండినది. కావున నేను ప్రార్థించుచు నిజమైన పశ్చాత్తాపముతో నా పాపములను దేవుని యెదుట ఒప్పుకొంటిని. ప్రభువు హస్తము బలముగా నా మీదికి వచ్చి నా పాపములన్నింటిని గూర్చి నన్ను ఒప్పించెను.

నేను పూర్తిగా మరచిపోయిన కొన్ని విషయములను ప్రభువు నాకు చూపించెను. యోబు 22:5,6 వాక్యముల ద్వారా ఆయన నాతో మాట్లాడెను. “నీ చెడుతనము గొప్పది కాదా? నీ దోషములు మితిలేనికి కావా? ఏమియు ఇయ్యకయే సోదరుల యొద్ద నీవు తాకట్టు పుచ్చుకొంటివి. వస్త్రహీనుల బట్టలను తీసుకొంటివి” అని ప్రభువ నాతో మాట్లాడెను. దేవుని వాక్యము నా పరిస్థితిని స్పష్టముగా నాకు చూపించినది. నా పొరుగు వాని యొద్ద కొన్ని వస్తువులను తాకట్టు క్రింద తీసుకొంటిని. అవి నా పెట్టెలోనే ఉన్నవి. నేను తాకట్టుగా తీసకొనిన వస్తువులలో ఒకటి ‘కోటు’

దేవుడు అంత స్పష్టముగా నాతో మాట్లాడుచుండగా నేను నా హృదయమును శ్రద్ధతో పరిశీలించుకొనుచు దాచబడిన పాపములను చూపుమని ప్రభువును వేడుకొంటిని. అప్పుడు ప్రభువు “నీ వ్యభిచారమును, నీ సకిలింపును, నీ జారకార్యములను, నీ కామాతురతను నేనెరుగుదును. పొలములోనున్న మెట్టలమీద నీ హేయ క్రియలు నాకు కనబడుచున్నవి” (యిర్మీయా 13:27) అని మాట్లాడెను.

ఆ తరువాత యెహెజ్కేలు 18:20 లో నున్న “పాపము చేయువాడే మరణము నొందును” అను వాక్యము ద్వారా మాట్లాడెను. నా ఆత్మీయ పరిస్థితిని స్పష్టముగా నాకు కనబరచిన వాక్యములు చదివిన తరువాత నా అపవిత్రమైన జీవితమును గూర్చి లోతైన పశ్చాత్తాపము నా మీదికి వచ్చినప్పుడు నా రక్షకునికి ఆటంకముగానున్న విషయములను తీసివేయవలెనని నిశ్చయించుకొంటిని.

ఒక యౌవనస్థురాలిని నా హృదయములో విగ్రహముగా చేసుకొంటిని. నా హృదయములో నున్న విగ్రహమును పూర్తిగా తీసివేయవలెనని దేవుడు నాతో చెప్పెను. నేను బాధపెట్టిన వారిని, మోసగించిన వారిని, పోట్లాడిన వారిని క్షమాపన కోరుకొంటిని. నా విషయములను సరిచేసుకొనుటకు వెంటనే 200 మైళ్ళు ప్రయాణము చేసితిని. ఆ విధముగా నేను నా పాపములను ఒప్పుకొని సరిచేసుకొనినప్పుడు క్రీస్తు రక్తము నా పాపములను కడిగివేసినది.

ఈ నా పాపములను క్షమించినట్లు 1 కొరింథీ 6:11 లో నున్న వాక్యము ద్వారా దేవుడు నాతో మాట్లాడెను. “మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని ప్రభువైన యేసు క్రీస్తు నామమున... నీతిమంతులుగా తీర్చబడితిరి.” అద్భుతమైన సంతోష సమాధానములు నా హృదయమును నింపివేసినవి. నా గుండె దడ పూర్తిగా పోయినది.

ఆ విధముగా నా ఆత్మ కడుగబడినది. నేను సంపూర్ణముగా దేవునికి చెందినవాడనైతిని. నా శరీరము కూడా ఆరోగ్యము పొందినది. దేవుడు నా కొరకు గొప్ప కార్యములను చేసెను.

**సంకలన కర్త వ్యాఖ్య :–** "సహో. జి.బి. సాల్మన్‌ను దేవుడు అనేక రకములుగా వాడుకొనెను. మిగుల ఆసక్తితో అనేక సంవత్సరములు ప్రభువు కొరకు ప్రయాసపడెను. సహో. సాల్మన్ సహవాసములో ప్రవేశించినప్పుడు సహవాసము గడ్డు పరిస్థితిలో నుండినది. కొన్ని స్థలములలో గొప్ప వ్యతిరేకతలను ఎదుర్కొనవలసి వచ్చినది.

ఉజ్జీవ కూటములు ప్రారంభించుటకు ముందుగా వెళ్ళు బృందమునకు అతడు నాయకుడుగా నుండెను. ఆసక్తిగల ప్రజల సహాయముతో ప్రజలు కూర్చుండుటకు వెదురు, తాటి ఆకులతో పందిరి వేయుట వంటి పనులను చేసి స్థలమును కూటముల కొరకు సిద్ధపరచుచుండెను.

నా తండ్రి పరలోకమును చేరిన తరువాత సాల్మన్ భుజముల మీద మరియొక బాధ్యత పడినది. ప్రభువు చేత ముట్టబడి రూపాంతరపరచబడిన వారిని వాక్యముతో పోషించి సంరక్షించవలసి వచ్చినది.

మిక్కిలి తక్కువ వనరులతో అనేక గ్రామములలో పట్టణములలో ప్రార్థన మందిరములను కట్టుట, ఆత్మలో మేల్కొల్పబడిన వారికి వాక్యమందించుట వంటి బాధ్యతలు అతనికి ఇవ్వబడినవి. సహో. సాల్మన్ స్వలాభము నపేక్షించక ప్రశస్తమైన మన ప్రభువు కొరకు సేవ చేసెను. అంతము వరకు ప్రభువుకు నమ్మకముగా నుండెను".

---------

# 34. గొప్ప విశ్వాస వీరుడు

# సహో. బొల్లెద్దు జాన్ గారి వృత్తాంతము

**(జాషువా దానియేలు గారిచే చెప్పబడినది)**

1944 వ సంవత్సరము ఫిబ్రవరి నెలలో లూథరన్ మిషనులో మిషనెరీగా పనిచేయుచున్న జాన్.సి.పియరీ దొరగారి ఆహ్వానము మేరకు నా తల్లిదండ్రులు సముద్రతీర ప్రాంతములోని రేపల్లెలో ఉపాధ్యాయులకు, సంఘ సభ్యులను, మిగిలిన పనివారికి ఉజ్జీవ కూటములు జరిగించుటకు ఆహ్వానించబడిరి.

ఈ మిషను ఎవరిని ప్రేమించి పరిచర్య చేయుటకు సిద్ధపడెనో ఆ ప్రజల నుండే ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనుచుండెను. ఆ సంఘము మిగుల ప్రమాదకరమైనది. అది అవిధేయులతో నిండియున్న సంఘము. మా తల్లిదండ్రులతో ఈ మిషను హృదయమంతటితో సహకరించెను. కొన్ని దినములు కూటములు జరిగిన తరువాత గొప్ప ఉజ్జీవము చెలరేగినది. స్త్రీ పరురుషులు దేవుని కృపకొరకు కనిపెట్టిరి.

బోర్డింగ్‌లో నున్న బాలికలు ఏడ్చుచుండిరి. దు:ఖించు స్త్రీ పురుషులకు సలహాలనిచ్చుటకు బాలికలను హాస్టలుకు పంపివేసిరి. హాస్టలుకు వెళ్ళుచున్న విద్యార్థులకు క్రీస్తు మరణ పునరుత్థానములను గూర్చి చెప్పి పశ్చాత్తాపములోనికి నడిపంచమని హాస్టలు బాధ్యత వహించుచున్న మిషనెరీ అమ్మగారిని నా తండ్రి హెచ్చరించి పంపెను. దేవుడు ఆ బాలికలను క్షమాపణ సమాధానములతో దర్శించువరకు వారు బిగ్గరగా ఏడ్చుట వినబడుచుండెను. తరువాత ఏడ్పులు ఆగిపోయినవి. వారి పాపములు క్షమించబడినందున వారి దు:ఖము సంతోషముగా మార్చబడినది.

సంఘములో శక్తివంతమైన పాపపు ఒప్పుకోలు ఆత్మవచ్చినది. సంఘములో పేరుమోసిన పెద్దలు దేవుని హస్తపు తాకిడి క్రిందికి వచ్చిరి. వారిలో మిషనెరీని చంపెదనని బెదిరించినవారు కూడా ఉండిరి.సంఘములో కలవరము కలిగించు వారిలో ఒకరు మిషనెరీ గుడారమునకు నిప్పుకూడా పెట్టిరి. ఈ వ్యక్తి పశ్చాత్తాపపడుట ప్రారంభించి రాత్రంగా ఏడ్చుచుండెను. ఆ భవనములోని వరండాలన్నీ పశ్చాత్తాపపడుచు, సలహాల కొరకు ఎదురు చూచుచున్న స్త్రీ పురుషులతో నిండిపోయినవి. అక్కడ వేచియున్నవారు అనేకులుండుట

వలన కొద్దిమందికి మరుసటి ఉదయము సలహాలనిచ్చెను. ఆ రాత్రి నా తల్లిదండ్రులకు రెండు గంటల విశ్రాంతి మాత్రమే దొరికినది.

ఈ గొప్ప ఉజ్జీవములోనికి భయంకరమైన త్రాగుబోతైన జాన్ గారు వచ్చిరి. కూటములు ముగింపునకు వచ్చినవి. స్త్రీ పురుషులు దు:ఖించుటను, పాస్టర్లతో కలిసి మిషనెరీ గారు కూడా ఏడ్చుటను చూచిన జాన్‌గారి హృదయములోనికి మారుమనస్సు పొందాలనే ఆశ వచ్చినది. ఆ స్థలములోనున్న సువార్తికున్ని కలుసుకొనగా అతడు జాన్‌ను నా తండ్రియొద్దకు తీసుకొని వచ్చెను. నా తండ్రి అతనికి నూనె రాసి ప్రార్ధన చేసి “కూటములు ముగిసినవి. కాని నీవు ఇంటికి వెళ్ళి ప్రార్ధన చేసి పాపములు ఒప్పుకొనుము. దేవుడు నీతో మాట్లాడును” అని చెప్పెను.

అంతేగాక “నీవు సేవకుడవైనను, సంఘపెద్దవైనను నీవు నీ పాపములకొరకు పశ్చాత్తాపపడని యెడల నీవు నరకమునకు వెళ్ళుదువని” నాయన అతనిని ఖండితముగా హెచ్చరించెను. “నీ వెన్నడు నీ పాపములకొరకు పశ్చాత్తాప పడలేదు గనుక నీవు నరకమునకు వెళ్ళుటయే కాదు నీకు బాప్తీస్మమిచ్చిన వారు కూడా నరకములోనే ఉందురు” అని కూడా చెప్పెను.

బలమైన ఆత్మతాకిడి అతని మీద నున్నందున దేవునిని వెదకవలెనను ఆశ కలిగియున్నందున అతడు త్వరపడి తన గ్రామమునకు వెళ్ళెను. మార్గములో ఆ ప్రాంతములో పండించిన మంచి నాటుపొగాకు కొనుక్కొని వెళ్ళెను. హిందువురాలైన అతని తల్లి 5 సంవత్సరముల ప్రాయములోనే అతనికి చుట్ట త్రాగుట అలవాటు చేసెను. అతని గ్రహింపు ఆ మెట్టుకు మూయబడినది. అతని యౌవన కాలము మరియు ఆ తరువాత జీవితమంతా మోసముతో, వ్యభిచారముతో, త్రాగుడుతో గడిచిపోయెను.

అతనికి చదువు లేనప్పటికిని నెలకు రూ. 8/–ల జీతమునకు ప్రాధమిక పాఠశాల ఉపాధ్యాయునిగా అతనిని నియమించిరి. ఆ దినములలో అది పెద్ద మొత్తము. ఈ ఏర్పాటు వలన విద్యార్ధుల కంటే ఉపాధ్యాయులే నిస్సందేహముగా ఎక్కువ మేలు పొందుచుండెను. ఉపాధ్యాయుడు కుర్చీలో కూర్చొని పెద్దబాల శిక్ష మిగిలిన ప్రాధమిక పాఠములు చదువుకొనుచుండగా విద్యార్ధులు వారు చేయగలిగినవి వారు చేయుచుండిరి. అతడు ఇతరులను ప్రభావితము చేయగల రూపము గలవాడని ఇక్కడ చెప్పవలెను. విద్యా విభాగములోని పాఠశాలల జూనియర్ ఇన్‌స్పెక్టరు పాఠశాలను దర్శించిన సమయము అలనికి భీతి గొలుపు అనుభవము. కాని ఆ కష్టము నుండి లంచముతో సులువుగా

తప్పించుకొనేవాడు. అన్యాయము చేయు అలవాటుగల అధికారి కొన్నిసార్లు అరటి పండ్ల గెలతో ఆనందముతో తన దారిన తాను వెళ్ళేవాడు.

క్రైస్తవమత ప్రచారము చేయు (కేటకిష్టు) వానిగా ఆదివారము ఆరాధన జరిగించిన దరువాత చచ్చిన మనస్సాక్షితో సంఘపెద్దలతో కలిసి దాదాపు ప్రతి ఆదివారము సారా దుకాణమునకు వెళ్ళేవాడు. ఒక వ్యక్తి ఎటువంటి పాపములు చేసినప్పటికిని వాటిని ఒప్పుకొనిన యెడల ఫరవాలేదని బోధించి సంఘసభ్యుల యొక్క, తన యొక్క మనస్సాక్షిని నిమ్మళపరచుకొనుటకు ప్రయత్నించేవాడు. కంటిలో శుక్లములు వచ్చినందున కనుదృష్టి మందగించి చదువలేకపోవుట కవలన ఉద్యోగమును విరమించుకొనవలసి వచ్చినది. అదీ జూన్ యొక్క గత జీవితము. కాని ప్రస్తుతము కూటమునుండి తిరిగివచ్చి దేవునిని వెదకి ఆత్మ రక్షణ పొందవలెనను దృఢమైన నిశ్చయతతో నుండెను.

ఒక పెద్ద చుట్టను సిద్ధము చేసుకొని కొంచెము త్రాగి ప్రక్కన పెట్టుకొని ప్రార్థించుటకు మోకాళ్లూనెను. ఆ తరువాత అతడెన్నడు చుట్టను ముట్టలేదు. ఆ మురికి చుట్టను పడవేయుటకు మాత్రమే అతడు దానిని ముట్టెను.

అతడు ప్రార్థించుట ప్రారంభించగా దేవుని ఆత్మ అతని మసక బారిన ఆత్మమీద పడినది. సజీవుడైన పరిశుద్ధుడైన దేవుని యెదుట అతని పాప స్వభావము, నీతి బాహ్యమైన జీవితమును బట్టి అతడు పడిన బాధ వేదన ఇంతంత కాదు. అతని ఏడ్పులకు అనేకులు మూసి ఉన్న అతని ఇంటి తలుపు వద్దకు వచ్చిరి. ఎవరైనా మరణించిరేమోయని భయపడిరి. అతని చుట్టు జరుగుచున్న విషయములను అతడు ఏమాత్రము పట్టించుకొనలేదు.

మధ్య రాత్రిలో అతని ఆత్మీయ కండ్లు తెరువబడి ప్రకాశవంతమైన తెల్లని వస్త్రములు ధరించిన వారిమధ్య అతడు మురికి గుడ్డలు ధరించుకొని యుండుట కనబడెను. తరువాత అతని మురికి వస్త్రములు తీసివేయబడి సౌందర్యమైన తెల్లని అంగీ వేయబడినది. ప్రభువు చేత అభిషేకించబడి "ఈ దినమునుండి నిన్ను ఫాదరుగా అభిషేకించుచున్నాను". అని చెప్పబడెను.

మహిమకరమైన ఈ దర్శనము తరువాత ఉదయముననే లేచి బైబిలు తీసుకొని "ప్రభువా! రాత్రి జరిగినదంతా నిజమేనా?" అని ప్రశ్నించి బైబిలు తెరువగా మార్కు 25 కనబడినది. "కుమారుడా! నీ పాపములు క్షమించబడినవి". అతని ఆత్మను మహిమ ఆవరించినది. అతని కండ్లు స్వస్థపడి 8 సంవత్సరముల తరువాత చదువగలిగెను. ఆ విధముగా అతడు ఒకేసారి ఆత్మీయ స్వస్థతను, శరీర స్వస్థతను పొందెను.

సహో. జాన్‌తో ప్రభువు 2 రాజులు 9:3లో నున్న వాక్యము ద్వారా కూడా మాట్లాడెను. "తైలపు గిన్నె తీసుకొని అతని తలమీద తైలము పోసి – నేను నిన్ను... అభిషిక్తునిగా చేసితినని యెహోవా సెలవిచ్చుచున్నాడు". వెంటనే సహో. జాన్ జీవితములోనికి క్రీస్తు జీవితము నదీ ప్రవాహమువలె వచ్చెను. అతడు వెళ్ళి ప్రార్థించిన ప్రతి స్థలములో ఆశ్చర్య కార్యములు జరిగినవి.

అతని గ్రామములో ఉజ్జీవము చెలరేగినది. వ్యాధిగ్రస్థులు స్వస్థపరచబడుట, దెయ్యములు తరిమి వేయబడుట సర్వసాధారణముగా జరుగుచుండినది. సమాజమంతా సజీవ దేవుడైన ప్రభువును, యేసు క్రీస్తును గూర్చిన గ్రహింపుతో పట్టబడినవి.

అనేక సంవత్సరములు త్రాచు పామును ఆరాధించిన ఒక హైందవ భూస్వామి మారుమనస్సు పొందెను. ప్రతి దినము పామును పిలిచి పాలుపెట్టి ఆరాధించుట అతనికి వాడుక. ఇప్పుడు పాముల పుట్టనుండి పామును బైటకు తీసి దాని తలను చితక గొట్టెను. క్రైస్తవేతరులనేకులతో ప్రభువైన యేసు మాట్లాడుచుండగా వారి విగ్రహములను తీసి పారవేసిరి. సహో. జాన్ వచ్చి వారిని కలుసుకొనుటకు ప్రజలు మధ్య రాత్రి వరకు వేచియుండేవారు. అతడు దేవుని ఆత్మతో శక్తితో నిండియుండి రోజులు తరబడి నిద్రలేకుండా కొన్నిసార్లు కొద్ది నిద్రతో గడపగలిగేవాడు.

ఆ గ్రామములోని దీవెనను గూర్చి వినిన నా తండ్రి అచ్చటికి వెళ్ళెను. చూచిన దానినిబట్టి నాయన హృదయము పులకించెను. నాయన ప్రార్థనలకు జవాబుగా మొదటి శతాబ్ధ క్రైస్తవత్వము కళ్ళముందు వాస్తవముగా కనిపించినది. జాన్ ముందు కూర్చొని యుండిన స్త్రీపురుషుల ముఖములు ఆత్మీయమైన ప్రకాశముతో వెలుగుచుండెను. దేవునిని వారు ఎరుగుదురు. ఆయన ప్రేమను వారు రుచిచూచిరి. ఆయన వారితో మాట్లాడెను. వారి ప్రార్థనలకు జవాబుగా దేవుడు కార్యములు చేయగా వారు చూచిరి. యేసు వారి మధ్య సజీవునిగా నుండెను. అది వాస్తవము.

ఆ స్థలములో ఉజ్జీవము వ్యాపించుచుండెను. సహో. జాన్‌ను దేవుడు బలముగా వాడుకొనుచుండుటను చూచిన నా తండ్రి అతనిని తర్ఫీదు చేయుట ప్రారంభించెను. ఉజ్జీవ కూటములకు నా తండ్రి కలిసి వెళ్ళు బృందములో అతడు ఒక సభ్యుడయ్యెను. అవి ఉజ్జీవము ప్రారంభములో నున్న గడ్డు రోజులు. అయినను నాయన ఎంపిక చేసుకొనిన వారికి తర్ఫీదు నిచ్చుచుండెను.

నా తండ్రి యొద్ద కొంచెము డబ్బు మాత్రమే ఉండేది. మమ్మును ఆహ్వానించినవారు నా తండ్రి వెంటవచ్చుచున్న బృందమును గమనించుకొననందున నాయన యొద్దనున్న కొద్ది డబ్బుతోనే వారి అవసరతలన్నింటిని చూచుకొనుచు సహో. జాన్‌ను కూడా అనేక స్థలములకు తీసుకొని వెళ్ళి తర్ఫీదు నిచ్చుచుండెను. సహో. జాన్ ప్రభువులో ఎదిగి బలపడిన తరువాత కూటములలో అతనికి ఎక్కువ బాధ్యతలు ఇవ్వబడెను. ప్రారంభములో స్వస్థపరచు సేవలో నాయనకు సహాయముగా నుండేవాడు. కాని పెద్ద కూటములలో వేలాదిమందికి వ్యక్తిగత పరిచర్య అవసరమైయుండగా సహో. జాన్‌కు స్వస్థపరచు సేవా బాధ్యత పూర్తిగా అప్పగించబడినది.

ఒక స్థలములో కూటములు జరుగుచుండగా ఒక మహమ్మదీయుడు మిక్కిలి వేదనతో నా తండ్రి యొద్దకు వచ్చెను. అతని భార్య మూడు దినములుగా ప్రసవవేదనతో మిక్కిలి బాధపడుచుండెనట. అతని బాధ్యత సహో.జాన్‌కు అప్పగించబడెను. ప్రార్థన చేసి జాన్ అతనితో "గర్భములో ఇద్దరు శిశువులున్నారు. ఒకటి మృతి చెందినది" అని చెప్పెను. వెంటనే అతడు ఇంటికి పరుగెత్తుకొని వెళ్ళగా భార్య ప్రసవించినది. ఒక శిశువు మరణించినది. ఒక శిశువు సజీవముగా పుట్టినది. ఆ మహమ్మదీయుడు, అతని భార్య ప్రభువు వైపు తిరిగిరి. అతని బాప్తీస్మము తరువాత అబ్రహాము అని అతనికి పేరు పెట్టబడినది.

మారుమనస్సు పొందిన ఒక ప్రభుత్వ ఉద్యోగి మద్రాసులో పేరుగాంచిన ఆస్పత్రిలో చేర్చబడెను. అతనికి క్యాన్సర్ వ్యాధియని వైద్యులు నిర్ధారించిరి. అతడు కలవరముతో, భయముతో తన చిన్న కుటుంబమును గూర్చి చింతించుచు చిక్కి శల్యమయ్యెను.

నాయన అతని కొరకు ప్రార్థించి వైద్యులు నిర్ధారించిన వ్యాధి అతనికి లేదని చెప్పెను. అతని గొంతులో గుచ్చుకొనియున్న రెండు అంగుళముల చేపముల్లు వలన సమస్య ఏర్పడినదని ప్రభువు సహో. జాన్‌కు బయలుపరచెను.

వైద్యులు ఆపరేషను చేసి ముల్లును తీసివేసిరి గాని ఆపరేషను సమయములో జరిగిన పొరపాటు వలన స్వరపేటిక దెబ్బతిని స్వరము స్పష్టముగా రాలేదు. కాని ప్రార్థన తరువాత అతని స్వరము సాధారణ స్థితికి వచ్చినది.

సహో. జాన్ రక్షణ పొందిన 5 సంవత్సరముల తరువాత పేరుగాంచిన నేరస్థుల గ్రామమైన స్టువార్టుపురములో కూటములు జరిగించుటకు ఆహ్వానించబడెను. ఆ స్థలమునకు వెళ్ళుట సులువైన విషయముకాదని యెరిగి ప్రభువుతో "ప్రభువా! వారు దొంగలు, భయంకరమైన ప్రజలు. మీరు యెరూషలేమునకు వెళ్ళినప్పుడు గాడిదమీద కూర్చొన్న

రీతిగా నా మీద నుండుము. ఫిన్నీ దినములలో వలె అక్కడ నీ ఆత్మ కార్యములు చేయుము. లేనియెడల అచ్చటికి వెళ్ళుటవలన ప్రయోజనము లేద”ని ప్రార్థన చేయగా దేవుని ఆత్మను, శక్తిని ప్రజల మీదికి పంపెదనని దేవుడు వాగ్ధానము చేసెను.

స్టువార్టుపురములో కూటములు ప్రారంభమైనప్పుడు అనేక ఆశ్చర్యకార్యములు అచ్చట జరిగినవి. హిందువులు, క్రైస్తవులు కరుడుగట్టిన నేరస్థులు కూటములలో నుండిరి. దేవుని బలమైన హస్తము స్త్రీపురుషుల మీదికి రాగా వారు హృదయములో మొత్తబడి నేలమీద పడి సిలువ వేయబడిన రక్షకుని యెదుట వారి పాపముల నిమిత్తము విలపించుచుండిరి. మరణించిన వారికొరకు విలపించిన వారివలె నేలమీద పడి దొర్లుచుండిరి.

కొందరు కండ్లు మూయబడినవి. పరలోక దర్శనము ఎంత బలముగా నున్నదనగా వారు కండ్లను తెరువలేక పోయిరి. దేవుని ఆత్మచేత మొత్తబడిన కొందరిని కూటములనుండి బైటకు తీసుకొని వెళ్ళవలసి వచ్చినది. దేవుని ఆత్మయొక్క శక్తివంతమైన తాకిడి వలన కొంతమంది కరుడుగట్టిన నేరస్థులు మార్చబడిరి. ఆ స్థలము మీదికి అద్భుతమైన మార్పు వచ్చినది.

ఉజ్జీవము ప్రారంభమైన తరువాత క్రొత్తగా మారుమనస్సు పొందినవారు నాయనను స్టువార్టుపురమునకు ఆహ్వానించిరి. అక్కడ ఉన్న స్త్రీ పురుషులలో అనేకమంది వారి జీవితములను వృధా చేసుకొనిన వారివలె కనిపించిరి. ప్రాధమిక విషయములు కూడా వారికి నేర్పించవలసి వచ్చినది. దేవుని సన్నిధి శక్తితో అక్కడ ఉండెను. ఉజ్జీవము మరింత బలపడినది.

ఈ మొట్టమొదటి కూటము తరువాత అనేకమైన ఉజ్జీవ కూటములు అక్కడ జరిగినవి. కాలక్రమేణ అవి ప్రతి సంవత్సరము జరుగుచు పెద్ద కూటములుగా మారినవి. అమ్మ నాన్నలు ప్రతి సంవత్సరము స్టువార్టుపురమునకు వెళ్ళి మారుమనస్సు పొందినవారికి అనేక విషయములు నేర్పించుచు సేవను కట్టిరి. ఇక్కడ ప్రభువు సేవ లోతుచేయబడి బలపడిన తనరువాత మిగిలిన స్థలములకు ఉజ్జీవము వ్యాపించినది. శారీరక స్వస్థతలు, దెయ్యములు వెళ్ళగొట్టబడుట అనేక సామాజిక వర్గముల క్రైస్తవేతరులు మారుమనస్సు పొంది ప్రభువుని వెంబడించుట వంటివి ఆ స్థలములో విరివిగా జరిగినవి.

సహో. జాన్ జీవితములో అనేకమైన అద్భుతమైన కార్యములు జరిగినవి. ఒక వ్యక్తి దేవుని ఆత్మతో సంపూర్ణముగా నింపబడి అద్భుతమైన అధికారము కలిగియున్నప్పుడు

ఎటువంటి గొప్ప కార్యములు జరుగునో తెలుసుకొనుటకు చెప్పుకోదగిన మూడు సంగతులను మీకు తెలియజేసెదను.

ఒక సమయములో సహెూ. జాన్ ప్రార్థన కొరకు ఏకాంత స్థలమును వెదకుచు వెళ్ళెను. దట్టముగా పెరిగిన చెట్ల మధ్యనుండి వెళ్ళుచుండగా దారికి అడ్డముగా పడగవిప్పిన త్రాచుపాము కాటు వేయుటకు సిద్ధముగా నుండెను. ఏ సహాయము లేకుండా దానిని కొట్టి చంపుటకు ప్రయత్నించుట ప్రమాదకరము. ఒక వ్యక్తి పామును ఎదుర్కొనవలసి వచ్చినప్పుడు దానికి నమస్కరించవలెనని హిందువురాలైన తల్లి చిన్నతనములో సహెూ. జాన్‌కు చెప్పినది.

కాని దానికి వ్యతిరేకముగా సహెూ. జాన్ “ఓ! సర్పమా! నీ తలదించుము. నేను దేవుని సేవకుడను” అని అధికారముతో దానిని గద్దించెను. వెంటనే ఆ పాము తలదించి వెళ్ళిపోయినది. పరి. ఫ్రాన్సిస్ తానే తోడేలును గద్దించినప్పుడు కూడా జరిగినది. ఆయనను యదార్థముగా విశ్వసించువారికి క్రీస్తు దయచేయు అధికారముతో భక్తులు గద్దించినప్పుడు ఈ కార్యములు జరిగినవి. ప్రభువైన యేసు శిష్యులతో “రోగులను స్వస్థపరచుడి, చనిపోయిన వారిని లేపుడి, కుష్టురోగులను శుద్ధులనుగా చేయుడి, దయ్యములను వెళ్ళగొట్టుడి. ఉచితముగా పొందితిరి. ఉచితముగా ఇయ్యుడి” (మత్తయి 10:8) అని చెప్పెను.

అనేక శతాబ్ధములుగా ఇవే కార్యములను మన మిషనెరీలు చేయుటకు ప్రయత్నించిరి. మొదట పాశ్చాత్య దేవశములనుండి వచ్చిన మిషనెరీలు పశ్చిమ దేశములలో కవులు, పురాణ గ్రంథకర్తలు సృష్టించిన దేవుళ్ళను ఆరాధించుచున్న అన్యులకు సువార్తను తెచ్చిరి. గ్రీసులో, రోమాలో విగ్రహారాధన రాజ్యమేలుచున్న దినములలో పౌలు విడుదలనిచ్చు సువార్తను అందించెను. ప్రజలు వారి విగ్రహములను, బలాత్కారమును, రక్తపాతమును కలిగించు ఆటపాటలను విడిచి సజీవుడైన దేవుని తట్టు తిరిగిరి.

ఆ తరువాత ఈ మధ్యకాలములో స్త్రీ పురుషులు రక్షకుని గూర్చిన అపరిమితమైన ప్రేమతో రగిలించబడి క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించవలెనను కోరికతో మండిపోవుచు తూర్పు దేశములకు క్రీస్తు సువార్త నందించుటకు వారి సౌఖ్యమును, క్షేమమును విడిచిపెట్టిరి. వారు వెళ్ళిన ప్రతిచోట వ్యాధిగ్రస్థులను స్వస్థపరచి, దెయ్యములను వెళ్ళగొట్టి, కుష్టురోగులను శుద్ధులను చేసి సువార్తను ప్రకటించి ప్రభువు ఆజ్ఞలను పాటించిరి. దేవునిచేత పురికొల్పబడిన సేవకుల జీవితములో శక్తివంతమైన అద్భుతములు జరుగుట అనునది విడదీయలేని బాంధవ్యముగా మారినది.

భారత దేశములో ప్రత్యేకముగా అనేకమంది నాటువైద్యులు, తాయెత్తులు కట్టేవారు ఉన్నచోట దేవుని బలమైన హస్తము వలన కలిగిన విడుదల, స్వస్థత మనుష్యుల మీద ఎంతో ప్రభావమును చూపెను. ప్రభువైన యేసు అందరు దేవుళ్ళలో ఒకరుగా గాక సజీవుడైన దేవుడని గుర్తించుట ప్రారంభించిరి.

అనేక గ్రామాలలో, పట్టణములలో సహో. జాన్ దేవుడు పంపిన నిజమైన మిషనెరీ. దేవుడు అతనిని గొప్పగా వాడుకొనుచుండగా యేసు క్రీస్తు నామములో అతడు చేసిన అద్భుతములు చూచుచున్న గ్రామస్థులను అతని ఇంటిలోనే జరిగిన కార్యము తలక్రిందులు చేసినది. సహో. జాన్‌కు హైందవురాలిగా నున్న ఒక సహోదరి కలదు. అతని ఇంటికి చుట్టము చూపునకు వచ్చి అకస్మాత్తుగా అనారోగ్యముపాలై మరణించినది. ఇంటికి వచ్చిన సహోదరి యొక్క మరణమును సహో. జాన్ ఒక సవాలుగా తీసుకొనెను.

గ్రామములోనే ఉన్న మిషను ఉపాధ్యాయుని పలిపించి తన సహోదరి బ్రతుకునట్లు కలిసి ప్రార్థన చేయుదము రండని ఆహ్వానించెను. ఈ అసాధారణమైన అద్భుత కార్యమునకు సిద్ధముగా లేని ఆ ఉపాధ్యాయుడు అక్కడ నుండి వెళ్ళిపోయెను. సహో. జాన్ రెండవసారి మూడవసారి ప్రార్థించెను. మూడవసారి నూనె రాసి ప్రార్థించినప్పుడు ఆమె కండ్లు తెరచి కూర్చొనినది. ఇది ఒక అద్భుతమైన విజయము. ఈ కార్యము వ్యక్తిగతముగా అనిని ఎంతో బలపరచినది. మరణించిన ఆమెను బ్రతికింయుటను గూర్చి వినిన అనేకుల ఆనందించిరి. ఈ విషయమును యౌవనస్థుడైన క్రైస్తవునిగా నేను వినినప్పుడు నా చిన్న విశ్వాసము బహుగా బలపడినది.

మొట్టమొదట మేము సహో. జాన్ గ్రామీణ శైలి మాటలను సుళువుగా అర్థము చేసుకొనలేకపోతిమి. కాలక్రమేణ అతడు ధారాళముగా మాట్లాడగలిగెను. తెలుగులో చక్కగా మాట్లాడగల మంచి వక్తగా మారిపోయి పెద్ద పెద్ద సమూహములను తన వర్తమానములతో మంత్ర ముగ్ధులను చేసేవాడు.

స్వస్థపరచు వరము ప్రమాదకరమైనదని గర్వము రాకుండా చూచుకొనుడని అద్భుతములు చేయు సువార్తికులను నా తండ్రి హెచ్చరించుచుండెను.

ఒకసారి తనకు తెలియకుండానే ఒక గొప్ప కార్యము జరిగినది. తరువాత గర్వము తనలో ప్రవేశించినందు స్వస్థపరచు వరమును పోగొట్టుకొంటినని తరువాత లోతుగా పశ్చాత్తాపపడినప్పుడే తిరిగి పొందితినని సహో. జాన్ నాతో చెప్పెను.

ఒక సమయములో సహో. జాన్ పడకమీద కదలలేని పరిస్థితిలోనున్న ధనవంతుడైన హిందువు ఇంటికి ఆహ్వానించబడెను. ప్రమాదకరమైన పరిస్థితిలోన్ను అతనిపట్ల ప్రభువు గొప్ప కార్యము చేసినందున అతడు వెంటనే పడక మీదనుండి లేచెను. సహో. జాన్‌ను దేవునిగా ఎంచి నేలకు వంగి నమస్కరించెను. ఆ సమయములో తాను దేవుడను కానని సహో. జాన్ అతనిని గద్దించి దిద్దుటకు బదులు ఆ విషయమై హృదయములో ఆనందించి తృప్తి పొందను. పాపం! సహో. జాన్! ఉన్నత కులము, అంతస్థు కలిగిన హిందూ ధనవంతుడు ఈ దీన సేవకున్ని తనతో సమానముగా ఎంచి గౌరవించినందుకు పొంగిపోయెను. ఇది సహో. జాన్ హృదయులోనికి గర్వమును తెచ్చినది. ప్రేమగల రక్షకుని దు:ఖపరచినది.

కొంతకాలము స్వస్థపరచు శక్తిని దేవుడు అతనినుండి తీసివేసెను. అతడు పశ్చాత్తాపపడిన తరువాత దేవుడు మరల వాడుకొనుట కారంభించెను. జీవితాంతము సహో. జాన్ దేవున్ని నమ్మకముగా సేవించుట కొనసాగించెను.

---------

# 35. పవిత్రనదిలో ఆత్మహత్యయే శరణ్యమని తలంచితిని

సహో. పాల్ నాధన్

**(జాషువా దానియేలు గారిచే చెప్పబడినది)**



దక్షిణ భారతదేశములోని హిందూ కుటుంబములో పుట్టి పెరిగితిని. సజీవుడైన దేవునిని గూర్చి నాకేమాత్రము తెలియదు. నేను బాలునిగా నున్నప్పటి నుండి దుష్టమైన, అపవిత్రమైన జీవితము జీవించితిని. జీవితమును సంపూర్ణముగా అనుభవించవలెననునదియే నా జీవిత ధ్యేయం.

నాకు 18 సంవత్సరముల ప్రాయములో నా తండ్రి మరణించెను. మా కుటుంబ వ్యాపారమైన సబ్బుల పరిశ్రమ వలన ఎక్కువ ఆదాయము రానందున సినీమా పరిశ్రమలోనికి వెళ్ళి డైరెక్టరునై ఎక్కువ డబ్బు సంపాదించగోరితిని గాని రెండు మూడు సంవత్సరములలో నష్టములో కూరుకుపోతిని. నా అపవిత్ర జీవితముతో పాటు ఉబ్బసము వ్యాధి కూడా ప్రారంభమైనది. అప్పటికి నాకు వివాహమై ఒక పాపకూడా ఉన్నది. సినిమా వ్యాపారములో నష్టము వచ్చినందున దానిని మానివేసితిని.

నాకు ముగ్గురు పిల్లలు పుట్టి నా వయస్సు 35 సంవత్సరములు వచ్చువరకు క్రీస్తు సత్యమును గూర్చి నాకు తెలియదు. నా బాధలన్నింటిని క్రీస్తే సమాప్తము చేయగలడని నాకు కొంచెము కూడా తెలియలేదు.

ప్రస్తుతము నా ఉబ్బసము అను వ్యాధి చికిత్స కొరకు సాధ్యమైనన్ని పద్ధతులలో ప్రయత్నించితిని. భారత దేశములో అనుభవము గల వైద్యులచే నడిపించబడుచున్న వెల్లూరు క్రిష్టియన్ మెడికల్ సెంటర్‌లో కూడా వైద్యము కొరకు ప్రయత్నించితిని గాని ఫలితము లేకపోయినది.

ఐదు సంవత్సరములు విపరీతముగా బాధపడిన తరువాత ఎవ్వరికీ చెప్పకుండా ఇల్లు విడిచి వెళ్ళిపోతిని. ఈ సమయమంతటిలో నా అపవిత్ర జీవితము కూడా పెరుగుచుండెను. కుటుంబములోని వారికి నా వ్యభిచార జీవితమును గూర్చి తెలియదు.

హిందువులచే బహుగా ఆరాధించబడు బ్రహ్మపుత్రలో మరణించిన యెడల నా ఆత్మ నేరుగా మోక్షమునకు చేరునను నమ్మకము నన్ను గట్టిగా పట్టుకొనినది. అందుచేత

సుదీర్ఘ ప్రయాణము చేసి (1200 మైళ్ళు) కలకత్తా దాటి వెళ్ళితిని. చివరకు ఆ పుణ్యనదిని చేరి లాంచి యెక్కి నదిలోపలికి వెళ్ళి నా శవము కూడా ఎవరును చూడకూడదని తలంచితిని. నాకు ఈతరాదు. నీళ్ళలోనికి వెళ్ళి రెండు మూడు సార్లు పైకి లేచితిని. తరువాత స్పృహ కోల్పోతిని. తెలివి వచ్చే సమయమునకు నది ఒడ్డున ఉంటిని. ఆ విధముగా నా ప్రాణము కాపాడబడినది.

రెండవ ప్రపంచ యుద్ధము జరుగుచున్న దినములవి. జపాను వారు భారతదేశమును ఆక్రమించుకొనుచుండిరి. నేనున్న స్థలమునకు దగ్గరలోనున్న మణిపూర్‌లో యుద్ధము జరుగుచుండెను. అనేకులు శత్రుసైన్యము వలన మరియు జిగటవిరేచనముల వలన మరణించుచుండిరి. ఆ సమయములో నేను కూడా సైన్యములో చేరవలెనని తలంచితిని.

ఈశాన్య ప్రాంతములోని షిల్లాంగ్‌లోనున్న సైన్యపు అధికారిని కలుసుకొనుటకు అచ్చటికి వెళ్ళితిని. మరుసటి దినము నాకు పరీక్ష పెట్టు దినము. ఆ రాత్రి ఒక ఇంటి వరండాలో పండుకొని యుండగా ఒక ఎలుకో లేక పురగో నా కాలిని కరిచినందున నా కాలు వాచినది. నా కాలిని చూచిన సైన్యాధికారి నా దరఖాస్తును తిరస్కరించెను. నిరాశతో ఇంటికి తిరిగివచ్చితిని.

ఈ మధ్య కాలములో నా తల్లి, నా కుటుంబము నన్ను కనుగొనుటకు వార్తాపత్రికలలో ప్రకటనలు చేసి ఎంతో ప్రయత్నించిరట. నేను ఇంటికి తిరిగి వచ్చినప్పుడు నా తల్లి స్పృహ కోల్పోయినది గనుక ఆమెను ఆస్పత్రికి తీసుకొని వెళ్ళవలసి వచ్చినది. నాకుటుంబము వారు నన్ను ఒక గదిలో పెట్టి గదికి ఒక వ్యక్తిని కాపలాపెట్టిరి.

నా మనశ్శాంతి కొరకు నా తల్లి అనేకమైన హిందూ వ్రతములు, పుణ్యకార్యములు చేయించినది. పూజ కొరకు పెద్ద మొత్తములో బంగారము కొనమని ఒక పూజారి నా తల్లికి సలహానిచ్చెను. ఆ బంగారమును చిన్న ధాన్యపు గింజల మాదిరి తయారు చేసి మంత్రములు, సంస్కృత శ్లోకములు వల్లించుచు ఒక్కొక్క గింజను ఒక కుండలో వేసిరి. ఆ ఖర్చుతో కూడిన కర్మకాండ జరిగించినప్పటికిని నా ఉబ్బసము వ్యాధిగాని, నా మనోవ్యాధిగాని కొంచెమైనను తగ్గలేదు.

నా ఆరోగ్య సమస్యకు సబ్బుల పరిశ్రమ మంచిది కాదని మందుల కంపెనీలో పనిచేయుట మంచిదని ఒక వైద్యుడు సలహా ఇచ్చెను. వెంటనే కాంపౌండరు కోర్సులో చేరి 7 సంవత్సరములు చదివి కాంపౌండరుగా పని చేయుటకు యోగ్యతను సంపాదించి ఒక

మందుల షాపును నేనే స్వయముగా ప్రారంభించితిని. ఈ సమయములోనే ప్రతినెల వందమైళ్ళ దూరములో నున్న హిందూ దేవాలయమును దర్శించి పూజలు చేయుచుంటిని. దక్షిణ భారతదేశములోని అనేక పుణ్యక్షేత్రములను కూడా దర్శించితిని.

నా కుటుంబములో నా తల్లికి నా సహోదరునికి ఆస్తి పంపకము విషయమై పెద్ద తగాదా ప్రారంభమైనది. ఆ గొడవలో నేను కలుగజేసుకొనలేదు. ఆస్తిలో నాకు వాటా అవసరములేదని చెప్పి నా స్వంత జీవితమును జీవించుటకు నన్ను విడిచిపెట్టమని చెప్పితిని.

నేను మొండిగా నుండి ఎన్నడు ఏవిధముగా ప్రవర్తించెదనో ఎవరికీ తెలియని పరిస్థితిలో నుండగా నన్ను నమ్మలేక నా భార్య తన తండ్రి ఇంటికి వెళ్ళిపోయినది. నేను నా స్నేహితునితో కలిసి ఒక ప్రెస్‌లో పని చేయుట ప్రారంభించి మందుల ఫ్యాక్టరీని పాండిచ్చేరిలో ప్రారంభించితిని. ఈ స్నేహితుడు నా పట్ల ఎంతో దయతో నుండి నన్ను ఒక జ్యోతిష్యుని యొద్దకు తీసుకొని వెళ్ళెను. నా కుటుంబము 7 సంవత్సరములు శాపము క్రింద ఉన్నదని ప్రాముఖ్యమైన పుణ్య క్షేత్రములు దర్శించినచో ఈ శాపము తీసివేయబడునని చెప్పెను. ప్రతినెల మద్రాసుకు 100 మైళ్ళ దూరములోనున్న హిందూ దేవాలయమును దర్శించవలెనని చెప్పెను. ఆ ప్రకారమే ముఖము మీద బంగారు రేకు పెట్టబడిన ఆ దేవుని గుడిని ప్రతినెల దర్శించి కానుకుల సమర్పించితిని గాని నా జీవితములో మార్పులేదు.

వ్యాపారములో నాతో భాగస్వామిగా నున్న వానితో కలిసి విపరీతముగా త్రాగుటను కొనసాగించితిని. పూజారి చెప్పినట్లు పూరి, హరిద్వార్, ఋషికేష్, మధుర, ద్వారక మొదలగు పుణ్య క్షేత్రములను ఒక దాని తరువాత ఒకటి దర్శించితిని. ముస్సోరీలో చేసిన ప్రార్థనలకు ప్రత్యేక ఫలము దొరుకునని చెప్పిరి గాని నేను ఎక్కడా ఏమాత్రము మేలు పొందలేదు.

కలకత్తాకు మరల వెళ్ళి కాళీఘాట్‌లో చిన్నపిల్లలను ఒక దేవతకు బలిగా అర్పించు స్థలములో పవిత్ర గంగా స్నానము చేయవలెనని తలంచితిని గాని ఆ నీరు చాలా మురికిగా నున్నందున ఆ నదిలో అడుగుపెట్టలేదు. కాశీలో నున్న మూడు నదుల సంగమములో స్నానము చేయుటకు వెళ్ళితిని గాని అచ్చట సగము కాలిన శవములను నదిలో పారవేయుటను, ఆ ప్రక్కనే ప్రజలు స్నానము చేయుటను చూచి భరించలేక నా గదికి వెళ్ళి స్నానము చేసితిని. నా ఉబ్బసకు కొరకు హైదరాబాదుకు వెళ్ళి “మంత్రించిన చిన్న చేప”ను తింటిని. నా జీవితములో శారీరకముగా మానసికముగా ఏమార్పు రాలేదు.

ప్రతి సంవత్సరము హరిద్వార్‌కు వెళ్ళి గంగానదీ తీరాన పవిత్ర వచనములు వల్లించుచు మూడు గంటలు వాటిని ధ్యానించుచుంటిని. ఆ విధముగా 5 సంవత్సరములు చేసితిని. నది ఒడ్డున దైవ ధ్యానము చేసిన యెడల ఉబ్బసము వ్యాధి నయమగునని చెప్పిరి గాని ఏ ఫలితము లేకపోయెను. తీర్థయాత్రలకు వెళ్ళు సమయములలో కూడా నా త్రాగుడును నేను విడిచిపెట్టలేదు. దైవ ధ్యానములు, మంత్రములు నాకు ఏమాత్రము సహాయము చేయలేదు. అందువలన సీసా సహాయము తీసుకొంటిని. పాండిచ్చేరిలో నేను నా స్నేహితుడు త్రాగుటకు కూర్చొని బాగుగా త్రాగి ఒకరి గొంతు ఒకరు పట్టుకొని పడిపోతిమి.

ఆ తరువాత నేను నా మామ గారి ఫ్యాక్టరీలో పనిచేయుట ప్రారంభించితిని. ఆ ఫ్యాక్టరీలో సాధారణ సువార్తిక సహవాసమునకు చెందిన ఒక యౌవనస్థుడు ప్రభువైన యేసు అతని జీవితములో జరిగించిన కార్యములను నాకు వివరించెను. ఆ విషయములు వినుట వలన కలిగిన ఆసక్తితో నేను సహవాసమునకు వెళ్ళుటకు ఆశించితిని గాని ఒక నామకార్థ క్రైస్తవుడు నన్ను ఆటంకపరిచెను.

అనేకమందితో ఎంతో ఆరాధించబడుచున్న సాయిబాబాను దర్శించితిని గాని అతని వలన ఏ మేలు జరగదని నా హృదయము చెప్పినది. అతని యొద్దకు వెళ్ళవద్దని ఒక స్నేహితుడు నన్ను ముందే హెచ్చరించెను. మరియొక "గురువు" ను దర్శించమని నా తల్లి, నా సహోదరుడు నన్ను బలవంత పెట్టిరి గాని ఆక్కడ కూడా నిరాశే ఎదురైనది.

నా మామ వ్యాధి బాధను తగ్గించుకొనుటకు ప్రతి దినము ఇంజక్షను వేసుకొనమని సలహానిచ్చెను. ఆ సమయములో గొప్ప నిరాశతో కత్తి తీసుకొని ఛాతిలో పొడుచుకొంటిని గాని వెంటనే ఆస్పత్రికి తీసుకొని వెళ్ళుటను బట్టి ప్రాణాపాయమునుండి తప్పించబడితిని.

నా భార్యను తెచ్చుకొని ఆమెతో కలిసి యుండమని నా తల్లి సలహా చెప్పినది గాని నా భార్య దానికి అంగీకరించలేదు. ఆ తరువాత నా తల్లిని విడిచిపెట్టి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన అరవింద ఆశ్రమములో చేరి పర్యవేక్షకునిగా ఒక ఉద్యోగమును సంపాదించితిని. అక్కడ పని చేయుచున్నప్పుడు నా చుట్టు జరుగుచున్న కార్యములను చూచినప్పుడు నా భ్రమ తొలగిపోయినది. "లోకములో జరుగుచున్న పాపములన్నీ ఈ ఆధ్యాత్మిక కేంద్రములో కూడా జరుగుచున్నవి. ఇక్కడ నేనెందుకుండాలి?" అని తలంచి అక్కడనుండి మరియొక పేరుగాంచిన ఆశ్రమమునకు వెళ్ళితిని. ఆ ఆశ్రమమునకు కేంద్రమైన తిరువనంతపురమునకు నా చికిత్సకొరకు నన్ను పంపిరి. శరీరమునకు నూనె రాసుకొని నగ్నముగా అడవిలో

ధ్యానము చేయుటకు అక్కడికి పంపబడితిని. దీనివలన నేను నా వ్యాధినుండి స్వస్థపరచ బడుదునని మనశ్శాంతిని కూడా పొందుదునని చెప్పిరి. కాని ఫలితము కనబడనందున పాండిచ్చేరిలోని “ఆరొవిల్లి” అను అంతర్జాతీయ కేంద్రమునకు వెళ్ళితిని.

ఆరొవిల్లిలో ఆరునెలలు గడిపి పూర్తిగా నిరాశతో నిండిపోతిని. ఒక దినమున పార్కులో నిరాశగా కూర్చొనియుండగా ఒక పాస్టరు కలిసి నాకు అవసరమైనది బాప్తీస్మము అని చెప్పెను. మద్రాసులో నున్న ఒక చర్చిలో నాకు బాప్తీస్మమిచ్చి ఒక నెల తరువాత ఆ సంగములో స్థిరపరచిరి. కాని నా పాత జీవితము నిరాటంకముగా సాగుచుండెను.

ప్రతి ఆదివారము ఉదయము ఆరాధన తరువాత వరుసగా మూడు సినిమాలు చూచి రాత్రి వ్యభిచార గృహమును దర్శించుచుంటిని. ఈ విధముగా రెండు వారములు గడచిన తరువాత బాప్తీస్మము వలన నా శరీరమునకు గాని, నా ఆత్మకు గాని ఏమేలును జరుగలేదని గ్రహించి చర్చిబైట నిరాశతో నిలువబడి ‘బాప్తీస్మము వలన లాభమేమి?’ అని నన్ను నేను ప్రశ్నించుకొంటిని.

ఆ సమయములో ఎవరో ఒక వ్యక్తి వచ్చి “ఈ సమీపములోనే డా॥ జయసింగ్ అని ఉన్నారు. అతడు నీకు సహాయము చేయగలడు” అని చెప్పెను. అదే రోజు డా॥ జయసింగ్ గారికి ఫోను చేయగా రాత్రి పదిగంటలకు కలవ వచ్చునని చెప్పెను. ఆ రాత్రి ఆయన ఒక మురికి వాడలో ప్రసంగించి ఇంటికి ఆలస్యముగా వచ్చెను. ఆయన నాతో మాట్లాడి సాధారణ సువార్తిక సహవాసము సిద్ధము చేసిన మూడు పుస్తకమలను నాకిచ్చెను.

ఆ మూడు పుస్తకములను ఆ రోజు రాత్రే చదివితిని. వాటిలో ఒకటి చార్లెస్ జి. ఫిన్నీ జీవిత చరిత్ర. అతడు దేవునిచే బహుగా వాడబడిన అమెరికా దేశస్థుడు. ఆ పుస్తకము చివరి అట్టమీద సహవాసము యొక్క చిరునామా ఉన్నది. ఆ తరువాత బుధవారము సహవాసమునకు వెళ్ళి కూటములో కూర్చుంటిని. కూటము తరువాత డా॥ జయసింగ్ గారు ఆదివారము కూటమునకు రమ్మని ఆహ్వానించగా నేను “నా స్వంత చర్చి ఉండగా నేనెలా రాగలనని”చెప్పితిని. అప్పుడు డాక్టరు గారు “అయితే ఉదయము పెందలకడ అక్కడ చర్చికి వెళ్ళి 10 గంటలకు ఆరాధనకు ఇక్కడికి రమ్మ”ని ఆహ్వానించెను.

నేను ఉదయము 6 నుండి 7 వరకు జరుగు మా చర్చి ఆరాధనకు వెళ్ళి తరువాత సహవాసములోని ఆరాధనకు వచ్చితిని. ఆత్మీయ ఆహారము దొరకని ఆ సాధారణ ఆరాధనకు, దేవుని వాక్యమే కేంద్రముగా, బలముగా వివరించిన దానికి చాలా వ్యత్యాసమున్నట్లు

క్రమక్రమముగా వివేచించగలిగితిని. సహవాసము యొక్క విలువను గ్రహించితిని. నా జీవితమును ఏ మాత్రము పరీక్షించుకొనకుండా పశ్చాత్తాపము, నూతన హృదయమును గూర్చి తెలియకుండా త్వరపడి బాప్తీస్మము తీసుకొనిన సంఘమునకు వెళ్ళుట మానివేసితిని.

సహవాసము యొక్క కూటమునకు హాజరైనప్పుడు నాతో కలిసి చదివిన వ్యక్తిని అక్కడ కలుసుకొంటిని. అతని బంధువు ఒకరు సహవాసమునకు వెళ్ళవద్దని హెచ్చరించిన సంగతి అతనితో చెప్పగా అతడు సహవాసములోని వారు దేవుని వాక్యము ప్రకారము జీవించుచున్నారో లేదో నీవే గమనించి తెలుసుకొనగలవని నాతో చెప్పెను.

నేను దేవుని వెదకుట ప్రారంభించిన సమయములో సహవాసము యొక్క పెద్దకూటములు పేరు గాంచిన నాస్తికుని పేరట కట్టిన పెద్దహాలులో జరిగినవి. ప్రకటించబడిన వాక్యము నాతో సూటిగా మాట్లాడుట ప్రారంభించినది. నా సహోదరునికి రూ. 600/–లు ఇవ్వవలసి యుండెను. అతడు శిక్షణ పొందకుండానే సర్టిఫికెట్ ఇప్పించుట కొరకు డబ్బు తీసుకొంటిని గాని అతనికి సర్టిఫికెట్ ఇవ్వలేదు. డబ్బు తిరిగి ఇ్వలేదు.

నా అపనమ్మకత్వమును గూర్చి పరిశుద్ధాత్మ చేత ఒప్పించబడి అతని డబ్బు అతనికి తిరిగి ఇచ్చివేసితిని. నా తల్లికి వ్యతిరేకముగా చేసిన పాపములను ఒప్పుకొనుచు ఆమె ఊరిలో లేనందున ఉత్తరము వ్రాసితిని. నా భార్యకు వ్యతిరేకముగా చేసిన పాపములను ఒప్పుకొనుచు నన్ను క్షమించమని నా భార్యకు ఉత్తరము వ్రాసితిని. ఒక సమయములో టిక్కెట్టు లేకుండా చేసిన రైలు ప్రయాణమును గూర్చి ఒప్పుకొని రైల్వేవారికి డబ్బు తిరిగి ఇచ్చివేసితిని.

ప్రతి సాయంత్రము ప్రశాంతముగా ఉండే స్థలమునకు ప్రార్థన కొరకు వెళుచుంటిని. సహవాసములో రక్షణ పొందిన చక్రవర్తి అను సహోదరుడు నన్ను నడిపించెను. భద్రముగా దాచుకొనిన హిందూ పురాణములు, విగ్రహారాధనకు సంబంధించిన పుస్తకములు నా భవిష్యత్తును చెప్పే జాతకములను కాల్చివేసితిని. నేను నా పాపములను తీసివేసుకొనుచు తిరిగి ఇచ్చివేయవలసిన వాటిని ఇచ్చివేసిన యెడల నిజమైన విశ్వాసము నా హృదయములోనికి వచ్చి దేవుడు నాతో మాట్లాడి నన్ను క్షమించునని అతడు నాతో చెప్పెను. నేను ప్రార్థించుచుండగా ఏదో ఒక విషయము నన్ను పట్టివేసియున్నదని గ్రహించితిని. ఒక దినమున సహో. జాషువా డానియేల్ గారి దగ్గరకు వెళ్ళి నా ప్రార్థనలకు దేవుడు ఎందుకు జవాబిచ్చుటలేదు, పాపములను క్షమించుట లేదని ప్రశ్నించగా సహో. జాషువా డానియేల్ గారు "నీవు క్షమాపణ కోరవలసిన శత్రువులెవరైనా యున్నారా?"

అని ప్రశ్నించెను. ఆ రాత్రి ప్రభువు ఒక విషయమును నాకు చూపించెను. నా పొరుగువాడైన యౌవనస్తుడు మా తోటలోని కొబ్బరి కాయలు కోసినందుకు రక్తము కారునంతగా అతనిని కొట్టితిని. ఈ విషయములో ప్రభువును క్షమాపణ అడిగి నేరుగా ఆ యువకుని యింటికి వెళ్ళి అతని క్షమాపణ కోరితిని.

ఒక దేవాలయములో నేను సంపాదించిన అద్దము ఒకటి నా యొద్ద ఉండినది. క్రొవ్వొత్తి వెలిగించి అద్దములోనికి ఏకాగ్రతతో చూచినప్పుడు నా ఇష్టదైవము అందులో కనిపించునని దానిని తెచ్చుకొంటిని. కాని దానిని పారవేసితిని. ఆ సమయములో నేనొక కంపెనీలో పనిచేయుచు దానికొరకు దొంగలెక్కలు వేయుచుంటిని. ఆదాయపు పన్ను విభాగమును మోసపుచ్చుటకు తప్పుడు లెక్కలు వేయుటయే నా ఉద్యోగము. నేను ఆ ఉద్యోగమును విడిచిపెట్టి డా॥ జయసింగ్ గారి క్లినిక్‌లో పనిచేయుటకు చేరితిని.

నేను ప్రార్థించుచు రక్షణ నిశ్చయత వాక్యము కొరకు ప్రభువును అడిగినప్పుడు లూకా 5:20 ద్వారా దేవుడు నాతో మాట్లాడెను. "మనుష్యుడా! నీ పాపములు క్షమించబడియున్నవి". నా గత పాపములు, నా వ్యభిచార స్వభావము నన్ను విడిచిపెట్టినవి. అనేక సంవత్సరములుగా నన్ను ఏలుబడి చేసిన త్రాగుడు నన్ను విచిడి పోయినది. ఆ సమయములోనే నా ఉబ్బసము వ్యాధినుండి ప్రభువు నన్ను విడిపించెను.

ఒక దినమున డా॥ జయసింగ్ నా గృహమును దర్శించినప్పుడు నా తల్లి అతనితో "యేసు కృపను బట్టి నా కుమారుడు స్వస్థపరచబడెను. మేము వేలకొలది రూపాయిలను వ్యర్థముగా ఖర్చుపెట్టితిమి. అతడు బాగున్నాడు. భార్య కూడా తిరిగి వచ్చునట్లు ప్రార్థించండి" అని చెప్పినది.

గత దినములలో నేను మా మామ ఇంటి తలుపుకొట్టినప్పుడు ఆమె తలుపు తీసేది కాదు. కాని నాలో కలిగిన మార్పును గూర్చి తెలిసిన తరువాత ఆమె నన్ను ఆహ్వానించి మాట్లాడుచుండెను. నా వలన ఆమె ఎంతో శ్రమపడినది. ఆమె మరణించక మునుపు ప్రభువైన యేసునకు ప్రార్థించుట ప్రారంభించినది.

**సంకలన కర్త వ్యాఖ్య :–** "సహో. పాల్ నాథన్ మద్రాసులోని రాయపురములో నున్న డా॥ జయసింగ్ గారి క్లినిక్‌లో పేదరోగులకు చివరివరకు పరిచర్యచేయుచు అనేక సంవత్సరములు ప్రయాసపడెను. ప్రభువు అతని జీవితములో తెచ్చిన మార్పు అనేక హృదయములతో మాట్లాడినది.

---------

# 36. త్రాగుబోతు సిపాయి కథ

**సహో. నతానియేలు**



ఆంధ్రప్రదేశ్‌లోని చిన్న గ్రామములో నేను జన్మించితిని. నా తండ్రి నామకార్థ క్రైస్తవుడు. నేను కూడా అనేక సంవత్సరములు అలాగే జీవించితిని.

చిన్నవానిగా నేను రక్షణ సైన్యము వారు కట్టించిన గుడికి ఆదివారపు బడికి వెళ్ళుచుంటిని గాని ప్రభువైన యేసు క్రీస్తు నెరుగను. నా బాల్యమునుండి చుట్టలు త్రాగుట ప్రారంభించితిని. అది నా బలమైన అలవాటుగా మారి వారమునకు ఒకటిన్నర కిలోల పొగాకు త్రాగుచుంటిని.

యౌవనునిగా నేను నా తండ్రితో కలిసి నాటుసారా త్రాగుచుంటిని. అది నా మీద పెద్ద పట్టు సాధించి చివరకు భోజనము లేకపోయినను విపరీతముగా త్రాగుచుంటిని. ఒకసారి పందెము కాసి 23 ముంతలు నాటుసారా త్రాగితిని (ఒక ముంత దాదాపు ఒక లీటరు) మత్తు కలిగించు ఇతర పానీయములను కూడా పెద్ద మొత్తములో తీసుకొనుచుంటిని.

సారాతో పాటు అపవిత్ర జీవితము తోడైనది. వ్యభిచార జీవితమునకు నేను పూర్తిగా బానిసనైతిని. దానిని గూర్చి అందరికి తెలిసిపోయినది.

ఆ అవమానమును భరించలేక సైన్యములో ఫిరంగి దళాధికారిగా చేరితిని. సైన్యములో మూడు నెలలు మాత్రమే పనిచేసితిని. మలేరియా వ్యాధి ప్రబలి అనేకమంది సైనికులు మరణించుచుండగా నేను భయపడి ఏదో కారణముతో అక్కడనుండి విడుదల పొందవలెనని తలంచి, చెవిటివానిగా నటించుట కారంభించితిని. వైద్యపరీక్షల కొరకు ఆస్పత్రికి పంపగా వారు కొన్ని మాత్రలు ఇచ్చిపంపిరి.

ఒకసారి నా అధికారి తుపాకీతో బెదిరించెను. కాని నేను చెవిటివానివలె నంటించితిని. నా వైద్యాధికారులను కూడా పూర్తిగా మోసము చేసినందున నేను చెవిటి వాడనని నిర్ధారించి ఇంటికి పంపుటకు ఏర్పాట్లు చేసిరి. నా కొరకు ఒక సహాయకున్ని ఏర్పాటు చేసిరి. అతడు దాదాపు ఇంటివరకు వచ్చి నీవు ఇంటికి క్షేమముగా వెళ్ళమని నా చెవిలో గట్టిగా అరచి చెప్పెను. ఈ ఆటను మిలటరీ సహాయకుడు నాతో ఉన్నంతవరకు కొనసాగించితిని.

ఇంటికి చేరిన తరువాత వివాహము చేసుకొంటిని. త్వరలోనే నా పాత జీవితము నన్ను గట్టిగా పట్టుకొనినది. నా గ్రామములో ఒక సంఘమునకు చేరినవారు కూటములను ఏర్పాటు చేసి యుండగా నా భార్య వాటికి హాజరగుచుండినది. నేను బాగుగా త్రాగి ఆమెను కొట్టి కూటములకు వెళ్ళవద్దని ఆజ్ఞాపించితిని.

నా దుష్ట అలవాట్లను విడిచిపెట్టునట్లు సువార్తికులు ఏదైనా సహాయము చేయగలరేమోనని నా భార్య వారిని ఇంటికి ఆహ్వానించుచుండెడిది. నా పాపముల నుండి విడుదల పొందుటకు యేసు నామమున ప్రార్థించుమని వారు నాతో చెప్పగా వారిని నేను అపహసించితిని. ప్రార్థనకు రమ్మని సువార్తికులు నన్ను ఆహ్వానించినప్పుడు చాలా నిర్లక్ష్యముగా చేతిలో చుట్టతో వారితో వెళ్ళుచుంటిని. నా చెంపల మీద ఉమ్మిరాసుకొని సుళువుగా నటించుచుంటిని. మారుమనస్సు పొందిన వ్యక్తిగా వారిని నమ్మించినందున గ్రామములో నన్ను క్రైస్తవ నాయకునిగా నియమించిరి. కాని నేను అపవిత్రమైన జీవితములోనే కొనసాగుచుంటిని. త్రాగి ఆరాధనలను జరుపుటకు వెళ్ళుచుంటిని.

నేను ఈ విధముగా జీవించుచున్న సమయములో సాధారణ సువార్తిక సహవాసమువారు మా గ్రామములో ఉజ్జీవ కూటములు జరిపించుచుండిరి. ఒకప్పుడు త్రాగుబోతుగానుండి మారుమనస్సు పొందిన సహో. జాన్ కూటములను జరిపించెను. సహవాసపు సేవకులను తృణీకరించి వాళ్ళకు ఎదురుగానున్న స్థలములోనే కూటములను జరిగించితిని. సహవాసపు సువార్తికులను కొట్టవలెనని కూడా ప్రణాళిక వేసుకొంటిని. నా భార్య సువర్తికులకు భోజనము పంపుటకు ప్రయత్నించినప్పుడు ఆమెను కొట్టుచుంటిని. వీటన్నింటిని బట్టి దేవుడు నాకొక వ్యాధిని పంపి శిక్షించెను.

సహోసము యొక్క పెద్దకూటములు విజయవాడలో ఏర్పాటు చేయబడినవి. నా స్నేహితులలో ఒకరు నన్ను కూటములకు రమ్మని ఎంతో బ్రతిమిలాడిరి. అతనితో కలిసి నా భార్య కూడా ఎంతో బ్రతిమిలాడినది. “ఈ సమస్యను వలపన్ని నన్ను కూటములకు తీసుకొని వెళ్ళవలెనని తలంచుచున్నారు” అని తలంచితిని గాని చివరకు కూటములకు వెళ్ళితిని.

గొప్ప సమూహములను చూచి నేను ఆశ్చర్యపడితిని. కూటము మొదలైనప్పుడు సహో. జాషువా డానియేల్ గారు ప్రసంగించుట ప్రారంభించి “ఓ! గర్విష్టుడా! నీవెవరివైనను సరే, పశ్చాత్తాపపడి నీ పాపమలును ఒప్పుకొనవలెను” అని చెప్పెను. ఈ మాటలు బాణమువలె లోతుగా నాలోనికి దూసుకొని పోయినవి. వర్తమానము ముగిసిన తరువాత

అందరిని ప్రార్ధనకు మోకరించమనెను. అకస్మాత్తుగా దేవుని హస్తము బలముగా నా మీదికి వచ్చినది. నేను చేసిన పాపములన్నీ వరుసగా నా కండ్లముందుకు వచ్చినవి. కన్నీళ్ళతో నా పాపములను ఒప్పుకొంటిని. దేవుని ఆత్మ నా మీదికి బలముగా రాగా ఓదార్పుపొంద నొల్లని దు:ఖముతో గట్టిగా మొఱ్ఱపెట్టుచుంటిని. నా వేదనను చూచి సమూహములో నుండి సువార్తికులు వచ్చి నామీద చేతులుంచి ప్రార్ధించిరి.

నేను నా పాపములను ఒప్పుకొనిన తరువాత ప్రభువు నాతో "మంచు విడిపోవునట్లుగా నేను నీ అతిక్రమములను మబ్బుతొలగునట్లుగా నీ పాపములను తుడిచివేసియున్నాను" (యెషయా 44:22) అని మాట్లాడెను.

నా పాపపు అలవాట్లనుండి ప్రభువు నన్ను విడిపించెను. గొప్ప సంతోషము, సమాధానము నా హృదయమును నింపినవి. నేను సంపూర్ణముగా మార్పు చెందితిని.

ఆ తరువాత ఒక రాత్రి ప్రభువు నాతో మాట్లాడి తన సేవకొరకు నన్ను పిలిచెను. నా పిలుపును గూర్చి ప్రార్ధించిన తరువాత సహో. దానియేలు గారు సాధారణ సువార్తిక సహవాసములో సేవకునిగా నన్ను అంగీకరించి తర్ఫీదునిచ్చిరి.

ప్రభువుకు ప్రార్ధించుచు ఆయనను సేవించుచుండగా ఆయన నన్ను వాడుకొనెను. గుంటూరు జిల్లాలోని ఒక గ్రామములో నేను ప్రసంగించి రోగుల కొరకు ప్రార్ధించగా ఉబ్బసము, మధుమేహము, రక్తపోటు మరియు ఇతర వ్యాధులనుండి ప్రజలను ప్రభువు స్వస్థపరచెను. యేసు నామమున ప్రార్ధించినప్పుడు దీర్ఘకాలముగా బాధించుచున్న దెయ్యములు పారిపోయినవి.

యేసు జరిగించిన అద్భుతములను, విడుదలను చూచిన క్రైస్తవేతరులు కూడా కూటములకు హాజరగుట ప్రారంభించిరి. సజీవుడైన ప్రభువు వైపుకు తిరిగిరి. వారి జీవితములు సంపూర్ణముగా రూపాంతరపరచబడినవి.

"అతడు పరలోకమునకు పిలువబడు వరకు విశిష్ఠమైన రీతిలో ఈ దీనసేవకుని వాడుకొనుటయందు ప్రభువు ఆనందించెను".

---------

# 37. ఖర్చుతో కూడిన కర్మకాండలు, తీర్థయాత్రలు నాకు శాంతిని పాపక్షమాపణను ఇవ్వలేదు.

ఒక వ్యాపార వేత్త అద్భుత గాధ

సహో. సూరయ్య



నా 15వ యేట నుండే హిందూ ఆచారములను, కట్టడలను పాటించుట ప్రారంభించితిని. మోక్ష ప్రాప్తి కొరకు నిర్ణయించబడిన కర్మకాండలను ఆచరించి కానుకలను సమర్పించుకొనుచుంటిని. వివాహము తరువాత నా భార్య, నేను పూజారిని పిలిపించుకొని సంస్కృత శ్లోకములు పఠనము చేయించుకొనేవారము. ఆచార సంబంధమైన కర్మకాండ జరిగించుచున్న సమయములో భార్యభర్తలమైన మేము పట్టువస్త్రములు ధరించుకొని పూజారి యెదుట కూర్చొనవలసి వచ్చేది. ఈ విధముగా ఎంతో సమయము, డబ్బు వీటికొరకు వెచ్చించవలసి వచ్చినది.

హిందూ సాంప్రదాయముల ప్రకారము మోక్షప్రాప్తికి తీర్ధయాత్రలు చేయవలసియున్నది. నా భార్యతో కలిసి భారతదేశములోని పవిత్ర నదులను దర్శించి కానుకలు సమర్పించుకొంటిమి. మా పాపములు పరిహరించబడి నూతన జీవితము ప్రారంభమగునను నమ్మికతో ఆ నదులలో పవిత్ర స్నానములు ఆచరించితిమి, నా కర్మకాండలు, తీర్ధయాత్రల వలన నా దురాశలో, గుణశీలములలలో ఎటువంటి మార్పురాలేదు. సరికదా! నైతికముగా మరింత పతనమై, వ్యాపారములో మోసములోనికి లోతుగా దిగిపోతిని.

హైందవ నాటకములలో గొప్ప గొప్ప మునులు, ఋషుల (పుణ్యపురుషుల) పాత్రలను పోషించేవాడిని. రంగ స్థలములో భక్తిగీతములను ఆలపించుచు నా అనుదిన జీవితములో అదే ఆసక్తిని, పవిత్రతను సంపాదించు కొనవలెనని ఆశించేవాడిని. కాని అది నాకు అసాధ్యముగా నుండెను. నా నిజ జీవితము, రంగస్థలము మీత పవిత్ర నటన ఏమాత్రము సంబంధము లేనివిగా నుండెను. నా నటనను రక్తి కట్టించుటకు స్టేజి మీదకు వెళ్ళకముందు మద్యము త్రాగవలెనని నేర్పించిరి. ఒక సమయములో నల్లమందు కూడా తీసుకొనుచుంటిని.

యేసు ప్రభువ నన్ను మార్చు వరకు నూతన జీవితము పొందవలెననెడి నా వాంఛ తీరలేదు. నాకు 35 సంవత్సరములు వచ్చు వరకు యేసు ప్రభువును గుర్చిగాని, జీవితములను పూర్తిగా మార్చివేయగలడని గాని ఎవ్వరు నాకు చెప్పలేదు. నా ఐదు సంవత్సరముల కుమార్తె ఉబ్బసము వ్యాధితో బాధపడుచుండినది. ఒక సమయములో మూడు దినములు శ్వాస తీసుకొనుటకు ఎంతో బాధపడినది.

ఇంగ్లాండులో శిక్షణ పొందిన పేరుగాంచిన వైద్యుడు మా బిడ్డను పరీక్షించి ఈ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చినదని, వైద్య పరముగా చేయగలిగినదేమీ లేదని మంచి ఆహారమే శరణ్యమని చెప్పెను. “మన బిడ్డకు మంచి వైద్యము చేయించగల సామర్థ్యము మనకున్నది గాని అందుబాటులో ఏ వైద్యము లేద”ని నేను, నా భార్య బాధపడసాగితిమి.

ఆ సమయములో నా భార్య స్నేహితురాలు ఒకరు యేసు నామములో ప్రార్ధన చేసిన యెడల ఎలాంటి వ్యాధియైనా బాగుపడుచున్నదని, తాను కూడ స్వస్థత కొరకు ప్రార్థించుచున్నదని చెప్పినది. అటువంటి దిక్కుతోచని నిస్సహాయ స్థితిలో నున్నప్పుడు ఒక స్త్రీ వచ్చి మా కుమార్తె కొరకు ప్రార్థించి వెళ్ళిపోయినది. మా బిడ్డ స్వస్థపడినది. కాని ఆ స్త్రీ ఎవరో తెలియలేదు.

ఈ గొప్ప అద్భుతముతో నేను, నా భార్య “ఈ గొప్ప దేవునికి ఎలా ప్రార్థించవలెనో మనకు తెలియదే?” అని ఆలోచించుచుంటిమి. ప్రార్ధన అనగా మంత్రములు, శ్లోకములు, జపములు నేమోయని తలంచితిమి. ఎందుకనగా మాకు ప్రార్ధన అంటే తెలియదు. మా పొరుగున ఉన్న నామకార్ధ క్రైస్తవుడైన ఉపాధ్యాయుడు ప్రభువైన యేసునకు చేయవలసిన ప్రార్ధనలను మాకు వ్రాసి ఇచ్చెను. ఉదయమున, సాయంత్రము నేను నా భార్య ఆ ప్రార్ధనలను వల్లెవేయుచుంటిమి. ఆ ప్రార్ధనలలో ఒకటి “మేము చేయవలసినవి చేయలేదు. చేయకూడనివి చేసియున్నాము” అని ఉన్నది.

ఆ సమయములో మా గ్రామములో త్రాగుడు, దొంగతనములనుండి విడుదల పొందిన తిమోతి అను వ్యక్తి మేము మారుమనస్సు పొంది నూతన పరచబడవలెనని మాతో చెప్పెను. ఇదెలా సాధ్యమని నేను ప్రశ్నించగా “శక్తితో ప్రకటించబడిన దేవుని వాక్యము వినినయెడల దేవుని శక్తి నీ జీవితమును సంపూర్ణముగా రూపాంతర పరచున”ని చెప్పెను.

ఒక శనివారము గజదొంగలు, నేరగాళ్ళ ఆవాసముగా పేరు గాంచిన గ్రామములో సాధారణ సువార్తిక సహవాసము జరిగించుచున్న కూటములనకు తిమోతి నన్ను తీసుకొని

వెళ్ళెను. కొన్ని సంవత్సరముల క్రితము దేవుడు శక్తివంతముగా ప్రజలను దర్శించినప్పుడు అనేకమంది అక్కడ మారుమనస్సు పొందిరి.

దేవుని వాక్యము ప్రకటించబడుచుండగా నా జీవితము తెరచిన పుస్తకమువలె నా యెదుట పెట్టబడినది. వ్యాపారములో మోసములు, అబద్ధములు, నా అపవిత్రమైన జీవితము, నా భార్య పట్ల అపనమ్మకత్వము మొదలగునవి నా కండ్లముందుకు వచ్చినవి. వెంటనే నేను విరిగిపోయి నా పాపముల నిమిత్తము ప్రభువైన యేసు యెదుట విలపించుచుంటిని. నా భయంకరమైన అపరాధములు పాపములను బట్టి క్రుంగియున్న నేను అదుపుచేసుకొనలేక దేవుని యెదుట సాష్టాంగపడితిని.

ఇద్దరు సేవకులు నన్ను కూటములో నుండి బైటకు తీసుకొని వెళ్ళి మధ్యరాత్రి వరకు నాతో ప్రార్థించిరి. వారు వెళ్ళిన తరువాత పశ్చాత్తాపముతో కూడిన ప్రార్థన నాలో పెల్లుబికి వచ్చుచున్నందున ప్రార్థించుటను కొనసాగించితిని. తెల్లవారుచుండగా నా భారము తొలగిపోయి నా హృదయము సంతోష సమాధానములతో నిండిపోయినది.

ఆదివారము ఆరాధన తరువాత ఇంటికి వెళ్ళి నేను చేసిన తప్పిదములను సరిచేసుకొనుట కారంభించితిని. శత్రువులను క్షమాపణ అడిగి ఇతరులకు ఇచ్చివేయవలసిన డబ్బును తిరిగి ఇచ్చివేసితిని. ఇంటికి వెళ్ళి నా భార్యను చూడగానే నన్ను నేను అదుపు చేసుకొనలేక బిగ్గరగా ఏడ్చుచు నా అపవిత్రతను, నా అపనమ్మకత్వమును గూర్చి ఒప్పుకొంటిని. నా అపవిత్రమైన వ్యసనముల కొరకు ఇతర స్త్రీల కొరకు ఖర్చు పెట్టిన పెద్ద మొత్తమును దాచిపెట్టుటకు నా ఆదాయము విషయము అనేకసార్లు ఆమెకు అబద్ధములు చెప్పినందున క్షమాపణ వేడుకొంటిని.

నాతో కలిసి ప్రార్థించుటకు నా భార్య రెండు మూడు దినములు సంశయించినది. భయపడినది. ప్రార్థించుటకు దేవునిచే ప్రేరేపించబడినందున నా ప్రార్థన శక్తివంతముగా నుండెను. నాల్గవ దినమున నా భార్య నాతో కలిసి మోకరించినది. వెంటనే దేవుని ఆత్మ ఆమె మీదికి బలముగా రాగా విరిగినలిగిన హృదయముతో క్షమాపణ కొరకు యేసు ప్రభువును వేడుకొనినది. అప్పుడు ఆమె తన మనస్సాక్షిని కడిగివేసుకొనుటకు తిరిగి ఇచ్చి వేయవలసినవి ఇచ్చివేసినది. కొన్ని వెండివస్తువులను, ఒక సబ్బును తిరిగి ఇచ్చివేయవలసి వచ్చినది.

నేను వ్యాపారములో మోసము చేసిన వారి యొద్దకు వెళ్ళి ఒప్పుకొని డబ్బును తిరిగి ఇచ్చివేయుటకు నాకు దాదాపు రెండు నెలలు పట్టినది. ప్రభువు నాకు చూపించిన

ప్రతి పాపమును సరిచేసుకొంటిని. దేవుని బలమైన హస్తము నా మీద నుండుట వలన నాకు ఆకలిలేకపోయెను. దేవుడు నాతో మాట్లాడుచు ప్రార్ధనకు నన్ను ప్రేరేపించుచుండెను.

నేను తిరిగి ఇచ్చివేయవలసినవి ఇచ్చివేసి నా మనస్సాక్షిని శుద్ధి చేసుకొనిన తరువాత యెషయా 43:25 ద్వారా ప్రభువు నాతో మాట్లాడెను. "నేనే నా చిత్తానుసారముగా నీ అతిక్రమములను తుడిచి వేయుచున్నాను. నేను నీ పాపములను జ్ఞాపకము చేసుకొనను". ఈ వాక్యమును చదువగా నా హృదయము ఆనందముతో గంతులు వేసినది. ఈ రీతిగా ఆయన స్వరక్తముతో నా పాపములను కడిగి శుద్ధీకరించి నూతన హృదయమును, సంతోష సమాధానములను నాకు అనుగ్రహించినది యేసు ప్రభువే.

**సంకలన కర్త వ్యాఖ్య :–** దేవుడు మాట్లాడిన లోతైన ఆశ్చర్యకరమైన అనుభవము పొందిన కొంతకాలమునకు సూరయ్య గారి జీవితమును శక్తినంతటిని రారాజు సేవలో వాడవలెను ప్రభువు అతని జీవితములో చేసిన కార్యములను ఇతరులతో పంచుకొనవలెనను దేవుని పిలుపు అతనికి వచ్చినది.

సూరయ్య గారిని పిలిచిన ప్రభువు అతనిని బలముగా వాడుకొనుట కారంభించెను. గుంటూరులో అనేకమందికి ప్రేమతో ఆత్మీయముగా సహాయం చేయుచు, ఆత్మలో లేవనెత్తుచు అనేక సంవత్సరములు ప్రయాసపడెను. ప్రభువు నడిపింపుతో అవసరత కలిగిన యరియొక స్థలమునకు అతడు పంపబడెను.

వ్యాపారవేత్తలతో నిండిన ఈ పట్టణములో ప్రజలను పాపములనుండి విడిపించి సంతోష సమాధానములు గల జీవితములోనికి నడిపంచుచు మంచి సేవను ప్రారంభించెను. వృద్ధుడైన సూరయ్యగారు తన 90వ పడిలో కూడా సజీవుడైన రక్షకుని సేవను నమ్మకముగా కొనసాగించుచునన్నారు.

---------

# 38. దిక్కులేని వారికి అండగా నిలిచిన క్రీస్తు కీర్తనీయుడు

**–మారియోకాపెచ్చి (ఇటలీ)**

**విలాప 3:31 "ప్రభువు సర్వకాలము విడనాడడు. ఆయన బాధపెట్టినను తన కృపా సమృద్ధిని బట్టి జాలిపడును.".**



**"సినిమాల్లో ఆఖరికి శుభం కార్డు పడుతుంది. మరి జీవితంలో శుభం కార్డు పడేదాకా ప్రార్ధనతో పోరాడితే, తప్పకుండా శుభం కార్డే పడుతుంది".**

సంవత్సరము : 1941

ప్రదేశం : టైరోల్, ఇటలీ

ఇంటిని పోలీసులు చుట్టుముట్టేసారు. తల్లిని అరెస్టు చేసారు. అమ్మ తనను ఎదురింటి రైతుకప్పగించింది.

పోలీసులతో వెళ్ళిపోతున్న అమ్మ ఒక్కసారి వెనక్కి వచ్చి కొడుకును ముద్దుపెట్టుకొని పోలీసులతో వెళ్ళిపోయింది.

ఇదంగా గుడ్లప్పగించి చూస్తుండి పోయాడు ఆ పసివాడు.

ఆ పసివాడికి తండ్రి కూడా లేడు.

జరుగతున్నది ఏదీ ఆ పిల్లవాడికి అర్ధం కాలేదు, ఎందుకంటే అప్పటికి తన వయస్సు మూడున్నర సంవత్సరాలు మాత్రమే.

ఆ పిల్లవాడు తల్లిని మళ్ళీ చూడగలడా?

పోలీసులతో వెళ్ళిపోతున్న ఆమెకు తెలుసు తను తన కొడుకును చూడటం అదే ఆఖరు సారని...!

అసలేం జరిగింది? ఎందుకిలా అయ్యింది?

అది రెండో ప్రపంచ యుద్ధ కాలం. గెస్టాపోలు చెలరేడిపోతున్న రోజులవి. గెస్టాపో అంటే జర్మనీ యొక్క రహస్య పోలీసు. గెస్టాపోలు చేసి ఆకృత్యాలకు, అఘాయిత్యాలకు అంతులేదు. ఆ చరిత్రను ఏ సిరాతోనూ రాయలేం.

ఒక వేళ ఏవరైనా ఆ చరిత్రను పూర్తిగా రాసినా...!

చదివిన ప్రతి ఒక్కరి మనస్సులో తప్పకుండా కలిగే భావన. “భగవంతుడా, నాకు చదవడం రాకుండా ఉంటే ఎంత బాగుండేది”....!

లూసీ ఫాసిస్టు శక్తులను వ్యతిరేకించే కార్యకర్తల్లో ఒకరు. ఏ క్షణంలోనైనా తనను కూడా పోలీసులు అరెస్టు చేస్తారనే విషయం అర్థమయిన లూసి తన దగ్గరున్న నగలు, ఇతర విలువైన సామగ్రినీ అమ్మేసి వచ్చిన డబ్బులను ఎదురింటి రైతు కుటుండానికి ఇచ్చి తన మూడున్నరేళ్ళ బాబు సంరక్షణ బాధ్యతలను అప్పచెప్పింది. ఊహించిందే జరిగింది...

గెస్టాపోలు రావడం, లూసీని అరెస్టు చేయడం జరిగిపోయింది. గెస్టాపోలతో వెళ్ళిపోతున్న లూసీకొక విషయం స్పష్టంగా తెలుసు. తన కొడుకును చూడటం ఇక ఎప్పటికీ జరగదని... ఎందుకంటే గెస్టాపోలు ఆమెను తీసుకెళ్ళేది కాన్సంట్రేషన్ క్యాంపుకి కాబట్టి.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో రాజకీయ ఖైదీల్ని, తమ వ్యతిరేకుల్ని ఉంచడానికి తయారు చేసినవే కాన్సంట్రేషన్ క్యాంపులు, ఖైదీలను కౄరాతి కౄరంగా హింసించడానికి, అతి ఘోరంగా చంపడానికి వధశాలలుగా ఆ కాన్సంట్రేషన్ క్యాంపులను ఉపయోగించేవారు.

కాన్సంట్రేషన్ క్యాంపులలో ప్రమాదకరమైన బ్యాక్టీరియాలు ఖైదీల శరీరాల్లోకి జొప్పించి, వాళ్ళను భయంకరమైన రోగాలకు గురిచేసేవారు. ఆ తరువాత ప్రయోగాల పేరిట దారుణంగా హింసించేవారు.

కాన్సంట్రేషన్ క్యాంపుల్లో ఒక్కరోజు నరకంలో వందేళ్ళతో సమానమనుకొనేవారు. అప్పట్లో కాన్సంట్రేషన్ క్యాంపులకు తీసుకెళ్ళబడ్డ వాళ్ళలో 90 శాతం మందిని శవాలుగా మార్చేసేవారు. అలాంటప్పుడు కాన్సంట్రేషన్ క్యాంపుకి తీసుకెళ్ళబడుతున్న లూసీ మదిలో “తను కొడుకును చూడటం బహుశా ఇదే ఆఖరు సారి” అనే ఆలోచన రావడం సహజమే.

ఆ పసివాడి తల్లి లేని జీవితం ఎదురింట్లో మొదలైంది. ఒకరోజు అమెరికన్ యుద్ధ విమానాలు విచక్షణారహితంగా జనావాసాల మీద కాల్పులు జరిపాయి. ఒక బుల్లెట్టు ఆ పిల్లవాడి కాలి నుండి దూసుకుపోయింది. వైద్యం జరిగింది, కాలు నయమయ్యింది కాని కాలి మీద మచ్చ మాత్రం అలాగే మిగిలిపోయింది. కాలం సాగిపోతుంది కాని ఆ చిన్న హృదయానికి అమ్మలేదు అనే గాయం ఇంకా మానలేదు. అప్పటికే ఆ అబ్బాయి తల్లికి దూరమై, ఆ ఇంట్లోకి వచ్చి సంవత్సరం అయ్యింది. తన పెంపకం కోసం, ఎదురింటి వాళ్ళకి తల్లి ఇచ్చిన డబ్బులు అయిపోయాయి. డబ్బులు లేని కారణంగా ఇంట్లో

ఉంచుకున్న వాళ్ళు తనను ఎక్కడో వదిలేసి వెళ్ళిపోయారు. అప్పుడు తన వయస్సు నాలుగున్నర సంవత్సరాలు మాత్రమే...!

ఆ పసి పావురం గూడు చెదిరింది, దాని గుండె పగిలింది.

ఏమీ అర్థం కాని ఆ పావురానికి ఏడుపొచ్చింది. ఏడుపొచ్చినప్పుడు అమ్మ గుర్తొచ్చింది. అమ్మ గుర్తొచ్చి మళ్ళీ ఏడుపొచ్చింది....

చాలా రోజులకు అమ్మ జ్ఞాపకాలు గుర్తుకు వచ్చేసరికి వెక్కి వెక్కి ఏడ్చాడు. అప్పుడు అది గుర్తొచ్చింది... ఆ కథ... ఒక గొర్రె తప్పిపోతే గొర్రెల కాపరి తన వద్దనున్న 99 గొర్రెలను వదిలేసి తప్పిపోయిన ఆ ఒక్క గొర్రెను వెతుక్కుంటూ వెళ్ళిపట్టుకోవడం. "ఔను నిజమే. అది నా యేసుప్రేమ. అది ఎంతటి అద్భుతాన్నైనా చేయగలదు". అమ్మ తనతో చెప్పిన ఆ చిన్న నాటి సండేస్కూలు పాఠాలను గుర్తుచేసుకోసాగాడు. తనతోపాటు రోడ్డుమీద పండుకొన్న స్నేహితుడైన ఒక వీధి బాలుణ్ణి బ్రతిమిలాడి, తన పాత చినిగిపోయిన బైబిలును తీసుకొని ఇక అదే పనిగా చదవటం మొదలు పోట్టాడు.

చిన్నప్పుడు అమ్మ తన చేత కంఠస్థం చేయించిన వాక్య భాగాన్ని గుర్తు చేసుకున్నాడు. అది యోహాను 17:15. "నీవు లోకములో నుండి వారిని తీసుకొని పొమ్మని నేను ప్రార్థించుట లేదుకాని దుష్టుని నుండి వారిని కాపాడుమని ప్రార్థించుచున్నాను". ఈ వాక్యాన్ని తిరిగి కంఠస్థం చేశాడు. "నా దయనీయ పరిస్థితిని మార్చు ప్రభువా" అంటూ కన్నీళ్ళతో క్రీస్తుకు ప్రార్థించేవాడు... ఎందుకో తెలియదు, ఏదో అద్భుతం జరుగబోతున్నట్లు అనిపించింది.

ఎవరూ దగ్గరకు తీసుకోరు, పట్టించుకునేవారే లేరు, దిక్కులేని పరిస్థితంటే ఖచ్చితంగా యిదే... ఇప్పుడు తనకు మిగిలిన దారి తన దారి చూసుకోవడం మాత్రమే అన్న విషయం అర్థం కాని వయస్సు.

దిక్కులోచని ఆ బాలుడు దిక్కులేని ప్రయాణాన్ని మొదలు పెట్టాడు.

రోడ్లమీద పడుకొనే వాడు, ఇక్కడ అక్కడ, ఎక్కడ దొరికితే అక్కడే ఉండి పోయేవాడు. అప్పుడప్పుడు అనాథాశ్రమాల్లో కూడా గడిపేసాడు. ఎన్నో నెలలు తన లాంటి వీధి బాలలతో బ్రతికేసేవాడు.

ఏది దొరికితే అదే భోజనం. భోజనం లేని రోజులు, ఆకలితో నిద్ర పట్టని రాత్రులు ఆ పసివాడి జీవితంలో ఎన్నెన్నో...!

అవును మరి ఆకలేస్తే అన్నం పెట్టడానికి తల్లిదండ్రులు లేనప్పుడు ఇలాగే ఉంటుంది. ............. ఇలా దాదాపు నాలుగు సంవత్సరాలు గడిచాయి............ ఒక రోజు రోడ్డు మీద పడి మూలుగుతున్న తనను మునిసిపాలిటీ వాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రిలో పడేసారు. టైఫాయిడ్, సరి అయిన తిండి లేకపోవడం వల్ల మాల్ న్యూట్రిషన్ అయ్యాయి.....

అప్పటికే అతడు ఆసుపత్రిలో చేరి దాదాపు సంవత్సరం కావొస్తుంది. ఆ బాలుడు పారిపోకుండా ఆసుపత్రి వాళ్ళు తగిన జాగ్రత్తలే తీసుకున్నారు.

ఆ సమయంలో ఆసుపత్రికొచ్చిన ఒకావిడ ఆ బాలుడిని అక్కున చేర్చుకుంది. ఆమెవరో అతనికి తెలియదు. ఆవిడ ఎవరో కాదు, అతడిని వెతుక్కుంటూ అక్కడికి చేరుకున్న తన తల్లి. సంవత్సరం నుండి ఆమె తన కోసం గాలిస్తుంది అన్న విషయం ఆ బాలుడికి తెలియదు. కాని ఆ బాలుడి తల్లి ఇలా హఠాత్తుగా ఎలా రాగలిగింది? అసలు విషయమేమిటంటే....

1945వ సంవత్సరం అమెరికన్ సైన్యాల పుణ్యమా అని కాన్సంట్రేషన్ క్యాంపుల్లో అప్పటికి బతికున్న వాళ్ళు విముక్తులయ్యారు. అలా విముక్తులైన వాళ్ళలో లూసీ ఒకరు. జైలునుండి బయటికొచ్చిన లూసీ ఒకే ఒక్క పని, తన కొడుకుని వెదకటం.

ఆమె తన కొడుకు కోసం వెతకని చోటులేదు. తిరగని ప్రదేశం లేదు. అలా సంవత్సరం నుండి గాలిస్తున్న లూసీకి ఆ బాలుడు చివరికి ఆ ఆసుపత్రిలో అనూహ్యంగా దొరికాడు.

లూసీ తన కొడుకును తిరిగి చేరుకున్న రోజు 6 అక్టోబర్ 1946. అది ఆ అబ్బాయి తొమ్మిదవ పుట్టినరోజు కావడం కేవలం యాదృచ్ఛికం.

అదే రోజు లూసీ తన కొడుకుని ఆసుపత్రి నుండి డిస్‌చార్జ్ చేయించుకుంది. కొడుకుతో పాటు రోమ్ చేరుకోగానే లూసీ చేసిన మొదటి పని తన కొడుక్కి స్నానం చేయించి, కొత్త బట్టలు తొడిగించడం.

ఆ అబ్బాయి స్నానం చెయ్యడం ఈ ఆరు సంవత్సరాల్లో అదే మొదటిసారి. అక్కడి నుండి అమెరికాలో ఉన్న అన్న దగ్గరికి షిప్పులో ప్రయాణమైంది.

ఇటలీలో పశువులా బ్రతికిన ఆ అబ్బాయి అమెరికాలో మనిషిలా జీవించడం మొదలుపెట్టాడు. అతడికి తెలిసిన భాష ఇటాలియన్. అది కూడా మాట్లాడటం మాత్రమే. ఇంగ్లీషులో ఒక్క ముక్క అర్ధమవ్వదు. ఏనాడూ స్కూలు మొహం చూసి ఎరుగని తను

తొమ్మిదవ ఏట స్కూలులో మొదటి సారి అడుగుపెట్టాడు.

ఇంగ్లీషు ముక్క కూడా రానివాడు, జీవితంలో ఏనాడూ బడి మొహం కూడా చూడని తను, తొమ్మిదేళ్ళ వయస్సులో, అందునా ఇంగ్లీషు మీడియంలో చదువుకోవాల్సి రావడం....!

అతడికి అసలు చదువు అబ్బుతుందా...!

ఇది సంభవమేనా?

ఆ పిల్లవాడు స్కూలుకు వెళ్ళాడు. ఇతర విద్యార్థుల కంటే ఎక్కువగా కష్టపడాల్సి వచ్చినా చదువుల్లో మెల్లమెల్లగా పుంజుకున్నాడు. చాలా కష్టపడినా అతి మామూలు స్థాయి విద్యార్థిగా మాత్రం నిలబడగలిగాడు. ఆటపాటల్లో మిగతా వాళ్ళ కంటే మెరుగ్గానే ఉండేవాడు.

స్కూలు దాటి కాలేజ్‌లో ప్రవేశించాడు. చదువుల్లో అతడి స్థాయికి ఇది అతి గొప్ప విజయమే. ఏమీ తెలియని స్థాయినుండి కాలేజ్ వరకు, నిజంగానే చాలా కష్టమయిన ప్రయాణం.

ఏంటియాక్ కాలేజ్‌లో రాజకీయ శాస్త్రాన్ని అభ్యసించడం మొదలు పెట్టాడు. ఆ సబ్జెక్ట్ అంతగా రుచించని కారణంగా సైన్సు బ్రాంచ్‌కి మారిపోయాడు. ఫిజిక్స్, కెమెస్ట్రీ, మేథ్స్ సబ్జెక్ట్‌లు అతడ్ని ఎంతగానో ఆకట్టుకొన్నాయి. ఆ కాలేజ్‌లో మ్యాథ్స్ మరియు సైన్సుల్లో ప్రతీకోర్సును అభ్యసించాడు. మేథ్స్, సైన్సు సబ్జెక్టులను అర్థం చేసుకోవడంలో అమితమైన ఆనందాన్ని పొందాడు.

కాని ఒక ప్రశ్న తననెప్పుడూ బాధించేది. ఇప్పటిదాకా తను ఇతరుల అనుభవాలు, నిర్వచనాలు, ప్రతిపాదనలు, సిద్ధాంతాలు చదువుకోవడం, అర్థం చేసుకోవడం, అన్వయించుకోవడం మాత్రమే చేస్తున్నాడు. కానీ ఇలా ఎంతకాలం? తనూ ప్రపంచానికి ఏదైనా అందించాలి.

ఏమందించాలి, ఎలా అందించాలి? ఈ ప్రశ్నలే తనను వేధించసాగాయి.

ఈ అంతర్మథనం సాగుతూనే ఉంది. అంతలో తనని మాలిక్యూలర్ బయాలజీ సబ్జెక్ట్ ఆకర్షించింది. ఈసారి ఆ సబ్జెక్టును అభ్యసించడం మొదలుపెట్టాడు.

మాలిక్యూలర్ బయాలజీలో తన సాధన ఏ స్థాయికి చేరుకుందంటే నోబెల్ బహుమతి పొందేంత వరక.

తను ఫిజాయాలజీ కేటగిరిలో 2007 సంవత్సరానికి ప్రపంచంలోనే అత్యుత్తమైన బహుమానం నోబెల్ పురస్కారాన్ని పొందాను.

తను ప్రతిపాదించిన జీన్ టార్గెటింగ్ సిద్ధాంతం వైద్య శాస్త్రాన్ని ఎన్నో అడుగులు ముందుకు తీసుకెళ్ళింది.

ఒక్కసారి ఆలోచించండి

మూడున్నర సంవత్సరాల వయస్సుకే తల్లినుండి దూరమవ్వడం.

ఆ చిన్ని వయస్సులోనే కాల్పులకు గురవ్వడం

నాలుగున్నర సంవత్సరాల వయస్సులోనే ఎలాంటి సపోర్టు లేకుండా బతకాల్సి రావడం

చిన్న వయస్సులోనే రోడ్లమీద దిక్కులేకుండా బ్రతకడం.

ఆ పసి వయస్సులో మాడ్చే ఎండల్ని ఎలా ఓర్చుకొనుంటాడు?

మెరిసే మెరుపులు, ఫెళ్ళున పడే పిడుగుల శబ్ధాలు విపరీతంగా భయపెట్టినప్పుడు ఆ పసి గుండె ఎంత వేగంగా కొట్టుకుందో?

చీకటి రాత్రుల్లో భయమేసినప్పుడు ఎంతగా ఏడిచాడో...

తల్లిదండ్రుల సంరక్షణలో పెరిగే పిల్లల మీదే ఎన్నో దౌర్జన్యాలు, ఆకృత్యాలు జరుగుతుంటాయి. అలాంటిది ముందు వెనుక ఎవ్వరు లేక ఆ పిల్లవాడు ఎన్ని దాష్టికాలు ఎదుర్కొన్నాడో?

ఎన్నోసార్లు ఆకలిని తీర్చుకోవడం కోసం ఎంగిలి మెతుకుల కోసం చెత్తకుప్పల్లో పశువులతో పోరాటం చెయ్యాల్సివచ్చేది.

---------

# 39. నా కృప నీకు చాలును అని నా యేసు చెప్పారు

**లేన్స్ ఆర్మ్ స్ట్రాంగ్ (అమెరికా టెక్సాస్)**

**యెషయా 38:17 "మిక్కటమైన ఆయాసమునకు నెమ్మది కలుగుటకు కారణమాయెను".**



**2 కొరంథీ 5:17 "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి, పాతవి గతించెను. ఇదిగో క్రొత్తవాయెను".**

టి.బి., హెచ్.ఐ.వి., బ్లడ్ క్యాన్సర్ ఇవన్నీ నిష్ణాతులైన వైద్యులు సైతం నమ్మకం చెప్పలేని భయంకర రోగాలు. రోగి బ్రతకవచ్చు లేదా చనిపోవచ్చు. "వైద్యం చేస్తాం గ్యారంటీ మాత్రం చెప్పలేం". వైద్యశాల ఎక్కడైనా – ఏదైనా ప్రతి వైద్యుడి మాట ఇలాగే వుంటుంది. క్యాన్సర్‌తో రోగి చనిపోవటం మానవ సహజం. దాని బారినుండి పూర్తిగా కోలుకోవటం, అది మానవాతీతం. కోలుకున్న తరువాత ఆ రోగి ఏడుసార్లు ప్రపంచస్థాయి క్రీడల్లో విజేతగా నిలవడం యావత్ ప్రపంచాన్నే అబ్బురపరిచే అద్భుతం. ఆ కథను ఇప్పుడు మీరు చదవబోతున్నారు.

ఈ కథానాయకుడు భక్తి, శ్రద్ధలు గల క్రైస్తవుడు. అనుకోకుండా ఒకరోజు అనారోగ్యం పాలైయ్యాడు. వైద్యుడు అతనికి వచ్చిన జబ్బుకు ఏదో నోరు తిరగని పేరు పెట్టి, తమవల్ల కాదంటూ హుందాగా ప్రక్కకు తప్పుకున్నాడు. అయితే ఇతడు, తనకు క్రీస్తు మీద ఉన్న ప్రేమను ఏ మాత్రం సన్నగిల్లనీయకుండా నా దేవుడు సజీవుడు. నన్ను ఖచ్చితంగా నయం చేస్తాడు' అంటూ విశ్వాసంతో ముందుకు అడుగువేశాడు. ఫలితం అతడు బాగుపడటమే కాదు, చివరకు అతనొక ప్రపంచ ప్రఖ్యాత క్రీడాకారుడుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

అక్టోబర్ 2–1996–టెక్సాస్, ఆస్టిన్లోని ఒక హాస్పటల్ గది.
ఆ గదిలో ఇద్దరు. ఒకరు డాక్టరు, మరొకరు పేషెంట్

ఏం చెప్పబోతున్నాడా అని ఉద్విగ్నంగా డాక్టర్ వంక చూస్తున్నాడా పేషంట్. డాక్టర్ తన సీటులోంచి నిలబడి ఆ పేషెంట్‌ని చేరుకొని అతడి వీపు తడుతూ చెప్పాడు...

"నీకు టెస్టిక్యులరీ కేన్సర్ థర్డ్ స్టేజీలో ఉంది. నీకు కేన్సర్ అబ్డోమెన్. లంగ్స్, లింఫ్ నోడ్స్ మరియు బ్రెయిన్ వరకు వ్యాపించింది".

అది విన్న ఆ పేషెంట్ అదిరిపడి నిలబడ్డాడు.వెంటనే కళ్ళు బైర్లు కమ్మి కిందపడ్డాడు. కిందపడింది కేన్సర్ వల్ల కాదు, తనకు కేన్సర్ ఉన్నదని తెలిసినందువల్ల... పరీక్షల్లో అతనికి అరుదైన కేన్సర్: కొరియోకేర్సినోమా ఉన్నట్టు తేలింది.

అతనికి లంగ్స్‌లో నలభై మరియు మెదడులో రెండు ట్యూమర్లు కూడా ఉన్నట్టు తేలింది. ఆ పేషెంట్ : ప్రపంచ సైక్లింగ్ ఛాంపియన్, సైక్లింగ్ ప్రపంచ రాజు, రారాజు లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్, అతని వయస్సు 25 సంవత్సరాలు మాత్రమే....

తేరుకోవడానికి చాలా సమయమే పట్టింది. తప్పదు కాబట్టి తేరుకున్నాడేమో! నాకు ఇంకెంత టైం మిగిలి ఉంది....? డాక్టర్ని అడిగాడు. “కంగారు పడకండి, లెట్ అజ్ హోప్ ఫర్ ది బెస్ట్” అని బదులిచ్చాడు డాక్టర్.

“నా ప్రశ్నకు సూటిగా సమాధానమివ్వండి ప్లీజ్” అర్థించాడు. “సాధారణంగా ఇలాంటి కేసుల్లో మాగ్జిమం వన్ ఇయర్” చెప్పాడు డాక్టర్ ! మరో గంటలో ఇలాంటి కేసుల స్పెషలిస్ట్ డాక్టర్ నికొలస్ ముందున్నాడు లేన్స్ ఆర్మ్ స్ట్రాంగ్.

మీరు వర్రీ అవ్వకండి. ఇలాంటి కేసుల్లో సక్సెస్ 40 శాతం అంటున్న డాక్టర్ని వారిస్తూ...

“కేన్సర్ నా మీద దాడి చేసింది. నేను దానిమీద యుద్ధం ప్రకటిస్తున్నాను. ఇక నేను చావడమోఎ లేదా కేన్సర్ని చంపడమో జరగాలి, అందుకే నేను కేన్సర్ని చంపడానికి నిశ్చయించుకున్నాను” ప్రకటించాడు లేన్స్ ఆర్మ్ స్ట్రాంగ్ ఆ మాటలన్న లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ని సంభ్రమాశ్చర్యాలతో చూస్తుండిపోయాడు

డాక్టర్ నికొలస్....

మరునాడు రేడియేషన్ థెరపీ బదులు అతను ఆపరేషన్ చేయించుకున్నాడు.

ఈ పద్ధతి కొంచెం రిస్కుతో కూడుకొన్నదే అయినా, ట్యూమర్లు తొలగించుకోవడానికి ఆపరేషన్‌కు సిద్ధమయ్యాడు.

సాధారణంగా అయ్యే ఖీమోథెరపీలోలా కాకుండా ఇఫోసమైడ్ కూడా ఇవ్వబడింది. ఇది చాలా బాధాకరమయింది. ఆర్మ్‌స్ట్రాంగ్ దీనిని  ఓర్చుకొన్నాడు.

“చర్మాన్ని” లోపలినుండి బయటనుండి ఒకేసారి సూదులతో పొడుస్తున్నాట్టుగా అనిపించేది. బాగా వేడి చేసిన కమ్మీలతో తోలును కాల్చేస్తున్నట్లు మంటగా ఉండేది. బయటికొచ్చేసిన మెద నరాలు, కండలు కరిగిపోవడం, బరువు తరిగిపోవడం తనకు తెలుస్తూనే ఉంది.

అస్తమానూ వాంతులవ్వడం, రోజులో చాలా భాగం కడుపులో దేవినట్లుండడం, ఓహ్....నరకంలో ఉన్నట్లుండేది.

వెంట్రుకలు రాలటం, లోనికెళ్ళిన కళ్ళు, చిరిగిపోవడానికి సిద్ధంగా ఉన్న చెంపలు, అద్దంలో తన ముఖం చూసుకున్నప్పుడల్లా తనకు భయమేసేది.

గుండెల్లో గునపాలు దించుతున్నంత బాధ....

ఏ కీలుకాకీలు విరిచేస్తున్నారనిపిస్తుంది...

ఓహ్... అగాధపు అంచుల్లో చిక్కుకున్నాననిపిస్తుంది...

ఇలా బాధలతో కూడుకున్నా వైద్యం కొనసాగింది. “దయచేసి నన్ను ఈ భయంకర వ్యాధి బారినుండి కాపాడు ప్రభువా. ఆ పిదప నువ్వు నాకిచ్చే జీవితం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా నిన్ను మహిమపుస్తాను” అంటూ ఆ వ్యాధి పడకపై మూల్గుతూ దేవున్ని ప్రాధేయపడేవాడు... ఒకరోజు....

లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ కేన్సర్ మీద విజయం సాధించాడు. కేన్సర్ లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ చేతుల్లో ఓడిపోయింది. కాదు, కాదు, చనిపోయింది....

ఊహూ, చంపబడింది....!

లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ రేసింగ్ ట్రాక్ మీదే కాదు లైఫ్ ట్రాక్ మీద కూడా ఛాంపియన్‌గా నిలుచున్నాడు....

అవును మరి, ఎందరినో చంపేసే కేన్సర్ని చంపేసినవాడు ఛాంపియనే కదా...

సైక్లింగ్ ట్రాక్ మీద కాదు లైఫ్ ట్రాక్ మీద కూడా దూసుకెళ్ళాలన్న తన కలల్ని అతనింకా మరిచిపోలేదు. మరువ లేకపోతున్నాడు. అందుకే బెడ్‌లో పడుకొని ఉన్న అతడు కదలటం మొదలు పెట్టాడు....

డ్డాబ్బ్ అనే శబ్ధం....!

మ్.మ్.మ్మా, తల పేలిపోయినంత బాధ... తను మంచం నుండి దిగబోయి పడిపోయాడు...

ధబేలున పడ్డాడు... ఓహ్, ఎముకలన్నీ విరిగిపోయినంత నొప్పి.... ఈ సారి నిలబడబోయి కింద పడ్డాడు... పాక్కుంటూ సైకిల్ని చేరుకున్నాడు....

సైకిల్ని అందుకొన్నాడో లేదో, ఈసారి దానితోపాటు కింద పడ్డాడు.

అమ్మా.... అనే కేక అప్రయత్నంగా అతని నోట వెలువడింది.

ఇలానే చేస్తూ, ఇలాగే చేస్తూ, పడుతూ లేస్తూ, లేస్తూ పడుతూ... మళ్ళీ ప్రాక్టీస్ మొదలు పెట్టాడు.

'నడవడం కూడా చేతకానప్పుడు పాక్కుంటూ మరివెళితేనే విజయం వరిస్తుంది' అనే విషయం అతనికి తెలుసు....

లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ మెల్లమెల్లగా పుంజుకున్నాడు.

ఆ తరువాత కాలంలో గతం కన్నా ఎక్కువగా విజయాలను సొంతం చేసుకున్నాడు.

సైక్లింగ్ ప్రపంచంలో "టూర్ డి ఫ్రాన్సే" అతి ప్రతిష్టాత్మకమైన కాంపిటీషన్.

తన జీవితాశయం టూర్ డి ఫ్రాన్సేను గెలవడం.

నిజానికి కేన్సర్ నిర్ధారణకు ముందు ఒక్కసారి కూడా తను టూర్ డి ఫ్రాన్సే గెలిచి ఎరుగడు. అలాంటిది 1995 నుండి 2005 వరకు ఏడు సార్లు టూర్ డి ఫ్రాన్సే టైటిల్ గెలిచాడు.

నేడు లేన్స్ ఆర్మ్‌స్ట్రాంగ్ తన పేరున ఒక కేన్సర్ ఫౌండేషన్ స్థాపించి ఎందరికో సేవ మరియు స్ఫూర్తిని అందిస్తున్నాడు.

**యెషయా 38:17 "మిక్కుటమైన ఆయాసము నాకు నెమ్మది కలుగుటకు కారణమాయెను".**

---------

# 40. ఒంటరి తనంలో తోడు క్రీస్తే

–హువాంగ్ నెహుయ్ (థాయివాన్)

**"తండ్రి ఉంటే అందరికి కొండంత ధైర్యం. కాని ఒక్కరికి మాత్రం తండ్రి అంటేనే గుండె నిండా భయం, భయం".**

సంత్సరం : 1988ని ఆహ్వానిస్తూ, తైవాన్ లోని థైపీ పట్టణం మొత్తం కొత్త పెళ్ళికూతురిలా ముస్తాబైంది. అందరి మొహాల్లో నవ్వులు, మనసుల్లో ఎన్నో ఆనందాలు. అందరూ బిజీ బిజీగా అటు ఇటు తిరుగుతున్నారు. అదే పట్టణంలో చీకట్లో ఒక పార్కులోని బెంచ్ మీద కూర్చొన్న 24 సంవత్సరాలతను ఏడుస్తున్నాడు....

మౌనంగా, దీనంగా రోదిస్తున్నాడు.

ప్రపంచమంతా సంతోషంగా నూతన సంవత్సర వేడుకల్లో, సంబరాల్లో మునిగి ఉంటే, ఇతను మాత్రం అలా చీకట్లో ఒంటరిగా ఏడుస్తూ...?

కారణం : తన వాళ్ళు, తన సొంత తల్లిదండ్రులు అతడిని తన్ని తరిమేయడం. దీనికి మించిన విషాదం ఏమైనా ఉంటుందా?

తన నేరం : తనకు ఇప్పటికీ తెలియదు...

అసలేం జరిగింది...?

సంవత్సరం : 1964,

ఆర్థికంగా స్థిరంగానే ఉన్న ఒక జంటను పుత్రోదయం కలిగింది. ఆ అబ్బాయికి వారు ప్రేమతో హువాంగ్ నెహుయ్ అనే పేరు పెట్టారు. ఆ బాబుని వాళ్ళు అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు.

ఆ రోజుల్లో తైవానులో జబ్బుకైనా, జలుబుకైనా సాధారణంగా నాటు వైద్యం మీదే ఆధారపడేవారు. అప్పట్లో తైవానులో మూఢనమ్మకాలు కూడా ఎక్కువే.

ఒకరోజు హువాంగ్‌కి బాగా జ్వరం వచ్చింది. బామ్మగారు ఆ అబ్బాయితో ఏదో భస్మంతో పాటు ఇంకేదో పాలల్లో కలిపి తాగించింది.

ఆ నాటు వైద్యం వికటించింది.

ఫలితం : ఆ బాలుడికి శరీరంలో ఒక వైపు పక్షవాతం సోకింది.

వంకరైన శరీరంతో, వంకర మొహంతో వున్న బాలుడు ఇంటికి అశుభం తీసుకొస్తాడని భావించిన తల్లిదండ్రులు, అతడిని వదిలించుకోవాలని నిర్ణయించుకున్నారు.

దీనిని ఆ బాలుడి బామ్మ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ చిన్నారిని తనే స్వయంగా పెంచుకోవడానికి తీసుకెళ్ళిపోయింది. ఇక అబ్బాయి పెంపకం తన బామ్మ దగ్గర, తల్లిదండ్రులకు, తోడ పుట్టిన వాళ్ళకు దూరంగా చాలా దూరంగా మొదలైంది.

ఆ పిల్లవాడి ఆరోగ్యం మరియు బామ్మ యొక్క ఆర్థిక పరిస్థితి రెండూ అంతంత మాత్రంగానే ఉండేవి.

ఆ బాలుడు తన 13 సంవత్సరాల వయస్సులో మొదటిసారి స్కూలుకెళ్ళాడు. మొదట్లో అర్థం చేసుకోవడం, ఏదైనా నేర్చుకోవడం చాలా కష్టంగా వున్నా, మెల్లిగా పికప్ అయ్యాడు.

ఆ వయస్సులో చదువు మొదలు పెడితే...! నేర్చుకోవటానికి ఎంత కష్టపడాలో ఎవ్వరైనా ఊహించగలరు.

సాధారణంగా దెబ్బతగిలినప్పుడు నోట వచ్చే పదం "అమ్మ". కాని అతడి నోట్లోంచి అప్రయత్నంగా వచ్చే పదం "బామ్మా".

అన్నీ వున్నా ఏమీ లేని ఏకాకి తను. అందరూ వున్నా ఎవ్వరూ లేని ఒంటరి తను... తను కూడా అందరిలా తల్లిదండ్రులతో, తోడబుట్టిన వాళ్ళతో ఎందుకు ఉండటం లేదని బామ్మని అడిగినప్పుడల్లా దొరికే సమాధానం :

నిశ్శబ్ధం.

ఆమె మాత్రం ఏం చెప్పగలదు...? ఏమని వివరించగలదు....?

మిగతా పిల్లలు తమ తల్లిదండ్రులతో వుండడం అతడికెప్పుడూ వింతగా తోచేది... మితగా పిల్లలు తొడపుట్టిన వాళ్ళతో ఆడుకోవటం విచిత్రంగా అనిపించేది... అయిన వాళ్ళే అడ్డు తొలగించుకోవాలి అనుకొన్నప్పుడు ఇతరులు మాత్రం ఎందుకు దగ్గరకు రానిస్తారు...?

అంగవైకల్యం, సరిగ్గా పలకలేడు, నడువనూ లేడు. పైగా చూడ్డానికి అంతగా బావుండని మొహం. అందుకే ఆ బాలుడికి ఎవ్వరితోనూ పెద్దగా స్నేహాలు ఏర్పడలేదు.

తనకు 22 సంవత్సరాలు వచ్చేసరికి ఆర్థికపరమైన ఇబ్బందుల వల్ల లాటరీ టికెట్లతో పాటు పూలు అమ్ముకొంటూ చదువు కొనసాగించేవాడు.

తీరిక సమయాల్లో యూనివర్సిటీ ఆఫ్ తైవానులో చైనీస్ భాష మరియు సైకాలజీ క్లాసులకు వెళ్ళేవాడు. అంగవైకల్యం వుంది. అందరిలా స్పష్టంగా మాట్లాడలేను, సరిగ్గా నడువనూలేను అని బాధపడకుండా కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఉన్న ఆనందాన్ని ఆస్వాదించాడు. సైకాలజీ తరగతుల్లో నేర్చుకొన్న విషయాలను తన పూల వ్యాపారానికి అన్వయించుకున్నాడు.

పగటి పూట ఇంటింటికి, రాత్రుళ్ళు క్లబ్బులకు, పబ్బులకు, బార్లకు వెళ్ళి పూలు అమ్ముకొనేవాడు. క్లబ్బుల్లో, పబ్బుల్లో, బార్లలో పూలు అమ్మడానికెళ్ళినప్పుడు కస్టమర్ల కోరిక మేరకు పాటలు పాడాల్సి వచ్చేది.

మాటలే స్పష్టంగా పలకలేని తనతో పాటలు పాడించుకొని వికృతానందం పొందే లోకం....!

ఎన్నో సందర్భాల్లో వెకిలి చేష్టలు, వెకిలి మాటలకు గురయ్యేవాడు. అంగవైకల్యం వున్నా తనకు ఇలాంటివి తప్పవు అన్న సత్యం అతడికి తెలియంది కాదు. ఈ ప్రపంచంలో తనలాంటి వాళ్ళు బతకాలంటే ఆ మాత్రం భరించాల్సిందే అన్నది అతడికి అనుభవం నేర్పిన విషయం.

సాధారణంగా అందరూ ఏడిపించేవారు. అయినా సరే తదుపరి కస్టమర్ని చిరునవ్వుతో (బహుశ గుండెల్లో మండుతున్నా కూడా ) చేరుకొనేవాడు.

సంతోషంగా ఉన్న కుటుంబాల్ని చూసినప్పుడల్లా గుండె చివుక్కుమనేది. “తెలీని బాధ కాదు, తెలిసిన బాధే కలిగేది”.

తప్పదు కాబట్టి మళ్ళీ తేరుకొనేవాడు...

ఎప్పటికైనా తన వాళ్ళు తనను దగ్గరకు తీసుకోకపోతారా అనే వెర్రి ఆశతో బ్రతికాడు...

ఒకరోజు బామ్మ చనిపోయింది.

ఉన్న ఒక్క దిక్కుని దేవుడు లాక్కున్నాడు. తనను దిక్కులేని వాడిని చేసాడు. కుటుంబ సభ్యులందదూ అంత్యక్రియలకు హాజరయ్యారు. వాళ్ళలో ఒక్కరూ అతడిని ఓదార్చడం అటుంచి కనీసం పలకరించిన పాపాన పోలేదు. అంత్యక్రియలు ముగిసాయి.

అప్పుడైనా తనను తనవాళ్ళు దగ్గరకు తీసుకుంటారన్న అతడి ఆశలు అడియాసలు అయ్యాయి. కనికరంలేని తండ్రి నెహుయ్‌ని ఇంట్లోంచి వెళ్ళిపొమ్మన్నాడు... ఎక్కడికి పోవాలి? దిమ్మెరపోయిన తను ఆందోళనతో అడిగాడు.

బామ్మ కూడా లేదుగా అంటూ భోరుమన్నాడు. నన్ను ఎవరు రానిస్తారు అంటూ కన్నీళ్ళ పర్యంతం అయ్యాడు. నేను కూడా మీతోనే ఉంటానంటూ ఏడవసాగాడు. అక్కున చేర్చుకొని కన్నీళ్ళు తుడిచి, ధైర్యం చెప్పాల్సిన తండ్రి, అతడిని తన్ని మరీ ఆ ఇంట్లోంచి తరిమేసాడు... బామ్మను కోల్పోయిన దు:ఖంలో ఉన్న తనకు, తన వాళ్ళను చూసి ఏమూలో కాస్త ధైర్యం కలిగిన మాట వాస్తవం.

కాని కన్న తండ్రే ఇలా చెయ్యడం ...! నమ్మలేకపోతున్నాడు....!

అతడిని ఇంట్లోంచి తరిమేసిన రాత్రి ప్రపంచం మొత్త నూతన (1988) సంవత్సర వేడుకల్లో మునిగి తేలుతోంది. తను మాత్రం దు:ఖంలో కన్నీళ్ళలో మునిగిపోయాడు. చీకట్లో ఒక పార్కులోని బెంచ్ మీద కూర్చొని ఏడుస్తూ చాలాసేపు గడిపేసాడు.

అప్పుడతనికి అర్ధమయిన విషయం తనకు ప్రపంచంలో మిగిలి ఉన్న ఏకైక బంధం తను మాత్రమే అని. తరువాత ఎప్పటిలాగే ఆ రాత్రి కూడా పూలమ్ముకోవడానికి బయలుదేరాడు. ఎంతైనా బాధలు, కష్టాలు అతడి ప్రియ నేస్తాలు కదా. అందుకే వీటికి అలవాటు పడిపోయాడు. కాని ప్రయాణం మాత్రం ఆపలేదు. ఎవరి కోసం ఆగని కాలం తన మానాన సాగిపోయింది.

ఇక్కడ హువాంగ్, జీవితంలో ఒక అనుకోని అద్భుతం జరిగింది. తైవాన్ దేశం క్రైస్తవ్యానికి బద్ధ వ్యతిరేకమైన కమ్యూనిస్ట్ దేశం. ఒకరోజు అతడు మార్కెట్లో పూలు అమ్ముతుండగా తనను ఒక వృద్ధుడు కలిశాడు. పేరు జోసఫ్ స్టాలిన్. వృత్తి పూల వ్యాపారి. ప్రవృత్తి దొంగ చాటుగా క్రీస్తును ప్రకటించడం. హువాంగ్ ఒక అర్ధరాత్రి క్లబ్‌లో పూలు అమ్ముతుండగా అతనిని జోసఫ్ కలిశాడు. చాలాసేపు ఏవో కబుర్లు. నిదానంగా క్రీస్తును గురించి ఆయన చేయగల అద్భుతాలను గూర్చి వివరించాడు.

చివరగా జోసఫ్ అతడితో "ఎన్నో రోజులుగా నిన్ను గమనిస్తున్నాను. నీ జీవితంలో ఒక మార్పురావాలని నీవు కోరుకుంటే నేను ప్రకటిస్తున్న క్రీస్తును వెండించు. నిర్ణయించుకోవాల్సింది నీవే". ఆ మాటలకు హువాంగ్ బలంగా ఆకర్షితుడయ్యాడు. క్రీస్తులో బాప్తీస్మం తీసుకుని క్రైస్తవుడిగా మారాడు. ఇక అప్పటి నుండి తనకు ఎవరూ లేరనే దిగులు

పోయింది. క్రమం తప్పకుండా ప్రతిరోజు బైబిలు చదివేవాడు. చెప్పనశక్యము కాని మహిమాయుక్తమైన ఆనందాన్ని అనుభవించసాగాడు.

...........

ఈ రోజు థైపీ పట్టణంలోని మూడు అతి పెద్ద ఫ్లవర్స్ షాపు యజమాని పేరు : హువాంగ్ నెహుయ్. అతడే బామ్మ ముద్దుల మనవడు.

ఎలాంటి శారీరక లోపాల్లేని చాలా మందికి ఆ షాపులు ఉద్యోగాల్ని కల్పిస్తున్నాయి..! హువాంగ్ నెహుయ్ ఖాళీ సమయాల్లో స్వయంగా ఎన్నో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటుంటాడు. పరోక్షంగా మరెన్నో సేవా కార్యక్రమాలు అతని ఆధ్వర్యంలో నడుస్తున్నాయి కూడా....

ఇతరుల మీద ఆధారపడాల్సిన తను, ఈ రోజు ఎందరికో జీవనాధారాన్ని కల్పిస్తున్నాడు. కుటుంబం చేత వెలివేయబడ్డ తను జగమంతా కుటుంబాన్ని సృష్టించుకున్నాడు....

హువాంగ్ నెహుయ్ రాసిన పుస్తకం : **"Facing The Sun"** తైవానులో అతి పెద్ద సంచలనం.

ఈనాడు అతడు అంగవికలురకు, ఏమీ లేని వారికి మాత్రమే కాక అన్నీ సక్రమంగా వున్న వాళ్ళకు కూడా స్ఫూర్తి ప్రదాత....

హువాంగ్ నెహుయ్ తన పుస్తకంలో ప్రశ్నిస్తాడు :

నేల మీద కుక్కలా ప్రాక్కుంటూ ఉండాల్సిన నేను,

వీధుల్లో బిచ్చమెత్తుకుంటూ బ్రతకాల్సిన నేను,

ఈ రోజున నా దేశమై తైవానులో అంగవైకల్య అద్భుతాన్ని....

ఐతే బైబిలులో వ్రాయబడినట్లు నేనెప్పుడు బలహీనుడనో అప్పుడే బలవంతుడను కాబట్టే క్రీస్తు తనకు సాక్షిగా నన్ను ఎన్నుకున్నాడు. ఆకాశమందు నీవు తప్ప నా కెవరున్నారు యేసూ! నీవు నా కుండగా లోకములో వున్న ఏదియూ నాకక్కరలేదు ప్రభువా. కృతజ్ఞతలు క్రీస్తు....

---------

# 41. మాఫియాలో మార్పు

–దావూద్ ఇబ్రహీమ్

**2 కొరింథి 5:17 "ఏవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి పాతవి గతించెను ఇదిగో క్రొత్తవాయెను".**



చర్చిలో సండేస్కూల్ జరుగుతుంది.

"పిల్లలు మీకు బైబిలులో పౌలుగా మారిన సౌలు గురించి తెలుసు కదా" ప్రశ్నించాడు సండే స్కూల్ మాష్టారు.

"మొదట కత్తి పట్టుకొని వీరంగం చేసినవాడు. ఆ పిదప కత్తిని వదిలి ప్రభువుకు శిష్యుడుగా మారాడు".

"అతనే రాజేష్ ఆ కథ నీకు బాగా గుర్తుందే" "ఎందుకు గుర్తుండదు మాష్టారు ఈ నెలలోనే దాన్ని రెండు సార్లు చెప్పారుగా.

కాని నాకు ఓ అనుమానం ఉంది". "ఏంటి రా అది"
"ఈ కథ ఆ రోజుల్లో కాబట్టి జరిగి ఉంటుంది మాష్టారు. కాని ఈ రోజుల్లో అయితే అది జరిగే పనేనా?"
"దేవుడికి అసాధ్యమైనది ఏముంటుంది రా" "కాని ఇప్పటి పరిస్థితులు పాత రోజుల్లో లాగా లేవు కదా మాష్టారు". "రాజేష్ రోజులు మారవచ్చు. కాని మార్పు చెందని దేవుడు రా మన యేసు. ఆయన నిఘంటువులో అసాధ్యమనే పదం కనబడదు". సండే స్కూల్ మాష్టారు చెప్పాడు.

సందేహం అనేది మన మనుష్యులకు ఉండే సహజ నైజం. చిన్న పిల్లవాడు కాబట్టి ఆ రోజు సండేస్కూల్‌లో రాజేష్ బయటపడ్డాడు. బయటకు కనబడకుండా మనలో కూడా ఎందరికో ఈ సందేహం ఉండి ఉంటుంది కదా.

"యేసు క్రీస్తు నిన్న నేడు, ఒక్కటే రీతిగా ఉన్నాడు. అవును యుగయుగములకును ఒక్కటే రీతిగా ఉండును" (హెబ్రీ 13:8)

ఈ నిజన్ని ఋజువు చేయడానికే కొన్ని దశాబ్దాల క్రితం యుంబాయి అండర్ వరల్డ్ మాఫియాలో జరిగిన ఈ వాస్తవ గాధ...

"ప్రతాప్ నాకు ఈ సెక్యురిటీని చూస్తుంటే ఒళ్ళంతా కంపరంగా ఉంది రా. ఎదో

ప్రశాంతంగా బ్రతుకుతున్న నన్ను ఈ విధంగా ఇబ్బంది పెట్టడం నీకు భావ్యం కాదు".

"అలా మాట్లాడవద్దు గుల్షన్, నీ మీద మాఫియా దాడి జరగబోతున్నట్టు మాకు ఇంటిలిజేన్స్ రిపోర్టు వచ్చింది. అందుకే ఈ ఏర్పాట్లు. ఇప్పటికి మూడు నెలలు పూర్తయింది. మరో రెండు నెలలు చూసి నీకు ఉన్న ఈ సెక్యూరిటిని తొలగిస్తాను".

"మన స్నేహాన్ని గౌరవించి ఒప్పుకుంటున్నాను కాని నాకైతే ఈ తతంగాన్ని చూస్తుంటే ఒళ్ళంతా కంపరంగా ఉందిరా".

ప్రతాప్ ముంబాయికి క్రొత్తగా వచ్చిన పోలీస్ కమీషనర్. టి-సిరీస్ క్యాసెట్ల సంస్థ అధినేత మరియు ఆడియో కింగ్ గుల్షన్ కుమార్ తన ప్రాణ స్నేహితుడు. గుల్షన్ కుమార్ సంగీత ప్రపంచంలో పెనుమార్పులు తెచ్చాడు. క్యాసెట్ ధరలు తగ్గించడం ద్వారా పైరసీని అరికట్టగలిగాడు. వందల కోట్లు సంపాదించి అందులో కొంత భాగం ధాన ధర్మాలకు వెచ్చించాడు. ఈ క్రమంలో అతనికి ఎందరో శత్రువులు తయారయ్యారు. వారిలో ప్రమాదకరమైన శత్రువు పేరు ముంబాయి అండర్ వరల్డ్ మాఫియా.

తనకు కొన్ని నెలల క్రితం మాఫియా వర్గాల నుండి రెండు కోట్ల రూపాయలు కావాలంటు బెదిరింపు కాల్స్ వచ్చాయి. చివరకు ఇక ఈ కాల్స్‌తో విసుగెత్తి భరించలేక తన స్నేహితుడు ముంబాయ్ పోలీస్ కమీషనర్ ప్రతాప్ సిన్హాకు విషయం చెప్పాడు. ఇక అప్పటి నుండి అతని చుట్టు కమాండో రక్షణ వలయం ఏర్పడింది. అయితే కాలం కలకాలం ఒకేలాగా సాగదు కదా.

ఒకరోజు అతన్ని దురదృష్టం వెంటాడింది. గుల్షన్ కుమార్ తన కారులో ఆఫీసుకు పోతున్నాడు. చౌరస్తా సెంటర్ దగ్గర ట్రాఫిక్ లైట్లు, సరిగ్గా తమను ఆపిన 3 నిమిషాల సమయంలో అతను తనతోపాటు డ్రైవర్ మరియు బ్లాక్ క్యాట్ కమాండో ముగ్గురు రక్తపు మడుగులో పడిఉన్నారు. మాఫియా షార్ప్ ఘూటర్‌లు తమను 3 నిమిషాలలో చంపి పారిపోగలిగారు.

ఆ సంఘలన యావత్ బాలివడ్ పరిశ్రమను కదిలించింది. పేరు మ్రోసిన బాలివుడ్ కథానాయకులు షారుఖాన్, సల్మాన్‌ఖాన్‌లు సైతం మాఫియాకు తలవంచక తప్పలేదు. కారణం ప్రాణభయం. వారు సినిమాల్లో మాత్రమే కథానాయకులు గాని నిజ జీవితంలో కాదు కదా.... ఈ దుర్మార్గానికి మరో పేరే ముంబాయ్ అండర్ వరల్డ్ మాఫియా.... మాఫియా చీకటి సామ్రాజ్యం.

ముంబాయ్‌లో మాఫియా చీకటి సామ్రాజ్యానికి 1960లో అంకురార్పణ జరిగింది. 1980 ప్రాంతంలో అది తీవ్రస్థాయికి చేరింది. ఆ పిదప కొన్ని దశాబ్ధాలకు ప్రభుత్వ వత్తిడితో మరియు ఇతర కారణాల వల్ల చల్లబడింది. మాఫియా చీకటి సామ్రాజ్యానికి అడ్డాగా మారింది ముంబాయి. దాని సామ్రాజ్య అధినేతలు హాజీమస్తాన్. వరదరాజన్ మొదిలియార్, కరీమ్‌లాల, అహ్మద్‌ఖాన్, వీరంతా మద్రాసీయులే. ఇటు నుండి అటు వలస వెళ్ళినవారే.

అతడి పేరు ఇబ్రహీం కాస్‌కర్, నిరుపేద పోలీస్ హెడ్ కానిస్టేబుల్, పస్తులతో కుటుంబాన్ని నెట్టుకొచ్చాడు. ఇతడికి 12 మంది సంతానం. ఎనిమిది మంది మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. డిపార్ట్‌మెంట్‌లో గౌరవ మర్యాదలు గల హెడ్ కానిస్టేబుల్‌గా మంచి పేరు తెచ్చుకున్నాడు.

కుటుంబ ఖర్చుల కోసం అప్పుడప్పుడు మాఫియా సామ్రాజ్యానికి తనవంతు సమాచారం అందిస్తుండేవాడు. అంత వరకే. అతని పెద్ద కొడుకు పేరు సబీర్ ఇబ్రహీం. రెండవ కొడుకు దావూద్ ఇబ్రహీం. ఆకలి ఎక్కడ వుంటుందో అక్కడ ఆవేశం కట్టలు తెచ్చుకుంటుంది. అదే జరిగింది ఇబ్రహీం కస్‌కర్ కొడుకుల విషయంలో. పోలీస్ క్రైమ్ బ్రాంచ్‌లో అతడు గౌరవనీయుడైన హెడ్ కానిస్టేబుల్ కావచ్చు. అయితే కుటుంబ ఖర్చులు, పిల్లల ఆలనా పాలనా ఖర్చులు తనను ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఆ క్రమంలోనే అతడు కుటుంబ ఖర్చుల కోసం మాఫియా మనుష్యులకు తన సహాయ, సహకారాలు అందించడమే కాదు తన కొడుకుల నడవడికను గమనించడంలో కొంత నిర్లక్ష్యం చేశాడు. ఆ నిర్లక్ష్యంలో నుండి ఉద్భవించిన వాడే ముంబాయి మాఫియాను దశాబ్ధ కాలం మకుటంలేని మహారాజులాగా ఏలాడు.

అతడే దావూద్ ఇబ్రహీం కస్‌కర్ ఉరఫ్ దావూద్ ఇబ్రహీం. ఇక అక్కడ నుండి మొదలైంది దావూద్ మారణకాండి. మాదక ద్రవ్యాలు, ఆయుధాల స్మగ్లింగ్, వీడియో పైరసీ, సుపారి హత్యలు, మట్కా వ్యాపారం, బాలీవుడ్ బడా నేతలతో బేరాలు. ఇలా ఒకటి కాదు ఇతను అన్ని అక్రమ వ్యాపారాల్లోను అనతి కాలంలోనే అందవేసిన చెయ్యిగా పేరు పొందాడు. ఇతని సామ్రాజ్యం ఎన్నో దేశాల్లో విస్తరించింది.

దావూద్ ఇబ్రహీంను పట్టుకోవాలని ప్రభుత్వం చేయని ప్రయత్నమంటూ లేదు. అయితే అతని మనుష్యులు అన్ని శాఖలలో ఉండటంతో అతడు అండర్ గ్రౌండ్‌లో తన కార్యకలాపాలు నిర్విరామంగా సాగించగలిగాడు,. ఇందలో అతడు వందలు కాదు వేల కోట్ల రూపాయలు సంపాదించాడు. పెట్టుబడి తక్కువ ప్రతిఫలం ఎక్కువ...!

ఆ రోజుల్లో ఇతని భయం బడా వ్యాపార వేత్తలను – బాలీవుడ్ దిగ్గజాలను వణికించింది. దావూద్ ఇబ్రహీంను మంచి చేసుకోకపోతే మనుగడ ఉండదు అనే విధంగా ఎందరిలో తారెత్తించిన ముంబాయి డాన్‌గా అవతరించాడు. ఇతని ముఖ్య అనుచరుడి పేరు చోటా రాజన్. దావూద్ సామ్రాజ్య విషయాలన్నింటిలో అతనిదే అంతిమ నిర్ణయం.

మరో మాటలో చెప్పాలంటే దావూద్ ఇబ్రహీంకు అతడే కుడిభుజం. పృథ్వీరాజన్ తన సమీప బంధువు. మైక్రోబయాలజీలో ఢిల్లీ విశ్వవిద్యాలయం నుండి పి.జీ పూర్తిచేసాడు. ఆ పిదప ఉద్యోగం కోసం ఎన్నో ఇంటర్‌వ్యూలకు హాజరు అయ్యాడు. ఫలితం శూన్యం. నిరుద్యోగం... మళ్లీ అదే సమస్య... ఆకలి ఫలితంగా కర్చుల కోసం తన అన్న చోటరాజన్ దగ్గర అతడి గ్యాంగ్‌లో చేరాడు. కొన్ని సంవత్సరాలు బాగానే గడిచింది. అయితే కాలం ఎప్పుడు ఒకేలా నడవదు కదా. పృథ్వి జీవితంలో అనుకోని అపస్మృతి ఎదురైంది. అది ఆర్థిక సమస్యకాదు ఎవరు తీర్చలేని సమస్య.

"ఎంత ఖర్యయినా పర్వాలేదు డాక్టర్. నా చెల్లి వ్యాధిని నయం చేయండి"

"నీ బాధను నేను అర్థం చేసుకోగలను పృథ్వి. నీ చెల్లి శ్రావ్యకు బ్లైడ్ క్యాన్సర్. కౌంట్ బాగా తగ్గిపోయింది. అన్ని పరీక్షలు చేసి చూసాం. మేము చేయగలిగింది ఏమి లేదు. ఐ యామ్ సారీ. శ్రావ్య మరణపు అంచులకు దగ్గరవుతుంది". డాక్టర్ సుభాష్ గౌడ్ చెప్పాడు. "మేరేమి చేయలేరా"

"పృథ్వి నేను 22 సంవత్సరాలుగా ఈ వైద్య వృత్తిలో ఉన్నాను. ఇలాంటి భయంకరమైన వ్యాధి తగ్గితే అది అద్భుతమే అవుతుంది. అలాంటి అద్భుతాలు ఎక్కడో జరిగాయని విన్నానే తప్ప ఎక్కడ చూడలేదు"

పృథ్వీరాజన్‌కు తన చెల్లి శ్రావ్య అంటే ప్రాణం కన్న ఎక్కువ. అమ్మ, నాన్నలు చిన్నప్పుడే చనిపోవడంతో చెల్లికి అన్ని తానై పెంచాడు. వచ్చే సంవత్సరం తన పెళ్ళి చేద్దామనుకున్నాడు. ఆ తరువాత తను పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. అంతలోనే అకస్మాత్తుగా ఈ విషాదకరమైన వార్త. మాఫియా కార్యకలాపాల్లో పృథ్వి ఎంత బిజీగా ఉన్న ప్రతిరోజు ఎంతో కొంత సమయమైన తన చెల్లితో అప్యాయంగా కబుర్లు చెప్పేవాడు. అంతలోనే ఇలా జరిగింది. డిసెంబర్ 1974లో ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆమె తీవ్రవాద కార్యకలాపాలను అరికట్టడానికి ఎంతో శక్తివంతమైన ఎమర్జన్సీని విధించింది. ఈ చట్టం ప్రకారం ఏ వ్యక్తినైనా అతడు ఎంత పలుకుబడి ఉన్నవాడైన కావచ్చు. అతడిని

కోర్టు ఆదేశాలతో సంబంధం లేకుండా అరెస్ట్ చేయవచ్చు. ఎదురు తిరిగితే కాల్పులకు సైతం సిద్ధం.

మన దేశ చరిత్రలో ఈ చట్టాన్ని ప్రయోగించిన ఏకైక ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ మాత్రమే. ఈ ఎమర్జన్సీ సమయంలో చిన్న, పెద్ద తేడా లేకుండా దొరికిన వాడిని దొరికినట్లు అరెస్ట్ చేశారు. పోలీసులు. ఈ ప్రత్యేక చట్టం వారికి ఆ ధైర్యాన్ని ఇచ్చింది. దీనితో దావూద్ ఇబ్రహీం లాంటి డాన్‌లు మొదలు పృథ్వీ రాజన్ లాంటి సాధారణ రౌడీ షీటర్‌ల వరకు అందరిని పోలీసులు అరెస్ట్ చేసి జైలులో పడవేశారు. పృథ్వీకి 2 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించబడింది.

ముంబాయ్ అండర్ వరల్డ్ సామ్రాజ్యంలో పటాన్‌ల ఆధిపత్యానికి అడ్డుకట్టవేసి మకుటం లేని డాన్‌గా స్థిరపడిన దావూద్ ఇబ్రహీంకు సైతం ఎమర్జన్సీ మసమయంలో ఇబ్బందులు తప్పలేదు. పోలీసులు నాన్‌బెయిలబుల్ వారెంట్ మీద అరెస్ట్ చేశారు. మాఫియా సామ్రాజ్యాన్ని అణచగడానికి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ఎమర్జన్సీ సమయాన్ని చక్కగా ఉపయోగించుకుంది. పోలీస్ వ్యవస్థను తన ఆధీనంలో ఉంచుకుంది. పోలీసులకు సైనిక సర్వాధికారాలు ఇవ్వబడ్డాయి.

ఇక అంతే... పోలీసు అధికారులు అమిత ఉత్సాహంతో రెచ్చిపోయారు. బడా వ్యాపారవేత్తలు, బాలీవుడ్ చిత్ర ప్రముఖులు, రాజకీయ నాయకులు, కాకలు తీరిన మాఫియా డాన్‌లు భయంతో వణికిపోయారు. ఎన్నో ఏళ్ళుగా మాఫియా మీద ద్వేషం ఉన్నా ఏమీ చేయలేక తమలో తామే కుమిలిపోయిన పోలీస్ వర్గాలు పగతో రగిలిపోయాయి.

ఆరెస్ట్‌లతో ముంబాయి మహానగరం అట్టుడికి పోయింది. తీవ్రవాద కార్యకలాపాల టాడా – రా చట్టాలతో మాఫియా అగ్రనేతలకు చుక్కలు చూపించారు. కారాగారాలలో ఖైదీల మధ్య సిండికేట్ల్ స్నేహం ఏర్పడకుండా మాఫియా మనుస్యులను ఒకేచోట పెట్టకుండా రాష్ట్రంలోని వివిధ జైళ్ళకు పోలీస్ అధికారులు తరలించారు. ఇందిరా గాంధీ ప్రవేశ పెట్టిన ఎమర్జన్సీ చట్టం క్రింద యావత్ భారతదేశం కదిలిపోయింది. ఈ క్రమంలో పృథ్వీ రాజన్‌ను తన ముఠా మనుష్యులకు వేరుగా మరో జైల్లో ఉంచారు. అక్కడ జైల్లో తన కష్టాలు వర్ణనాతీతం.

“అన్న నీతో కొంచెం మాట్లాడవచ్చా”

“మాట్లాడుతున్నాను కథా పృథ్వీ ఏమిటి విషయం”

"గత కొద్ది నెలల నుండి నిన్ను గమనిస్తున్నాను. అందరితో కలివిడిగా నవ్వుతూ మాట్లాడతావు. జైల్లో ఖైదీలు అందరు పడుకున్న తరువాత గదిలో ఒక మూలకు వెలుతురు వద్దకు వెళ్ళి గంటలు తరబడి బైబిల్ చదవడంలోను – దైవ ప్రార్ధనలలోను గడుపుతావు. జైల్ వార్డెన్ దగ్గర నీ గత జీవితం గురించి తెలుసుకున్నాను. కొన్ని సంవత్సరాల క్రితం కిరాత కసాయి హంతకుడిగా బీహార్‌లో బ్రతికావు. నీ మీద నమోదుకాని కేసు అంటు ఏమీ లేదు. వ్యభిచారాలు, హత్యలు, మట్క, మాదక ద్రవ్యాలు ఇలా బీహార్‌లో ఎన్నో ఛార్జ్ షీట్‌లు నీ మీద నమోదు అయ్యాయి. కాని కోర్టులో ఏదీ నిరూపించబడలేదు.

ఈ క్రమంలో కోట్లు సంపాదించావు. రాజకీయ నాయకులకు సైతం ఫైనాన్స్ చేసేస్థాయికి చేరుకున్నావు. కనుసైగతో పాలిటిక్స్‌ని – పోలీసు వ్యవస్థని ఎన్నో దశాబ్ధాలు శాసించావు. చివరకు ఒకరోజు నీకున్న ఆస్థిని – అంతస్తును వదిలి వేసుకొని కోర్టులో అప్రువర్‌గా మారి నీ మీద గతంలో నిరూపణ కాని కేసులలో నిందితుడుగా మారావు. నీ చర్యకు రాజకీయ నాయకులు – పోలీసు అధికారులు నోర్లు వెల్లబెట్టారు. నీకు కోర్టులో ఆరు సంవత్సరాలు జైలు శిక్ష విధించబడింది. అందులో ఇప్పటికి మూడు సంవత్సరాలు అయిపోయాయి.

మన జైలు వార్డెన్ గారు నీకు క్రీస్తు ప్రభువు కనబడి మాట్లాడారు అన్నారు. అందుకే నీ అంతట నీవే పోలీసులకు లొంగిపోయావని చెప్తున్నారు. రహస్యంగా రాత్రులు గంటలు తరబడి నీ ప్రార్ధన జీవితాన్ని గమనిస్తున్న నాకు అది నిజమే అనిపిస్తుంది. ఇదంతా నిజమేనా అన్న నీ పేరు అనురాగ్ యాదవ్ అని తెలిసింది".

"అన్ని విషయాలు తెలుసుకున్నావుగా పృథ్వి. ఇక నేను చెప్పడానికి ఏముంది".

"అంత డబ్బుని – డాంబికమైన జీవితాన్ని ఎలా వదులుకోగలిగావు".

"పృథ్వి మన భాషలో వేదాంతం – వైరాగ్యం అని రెండు పదాలున్నాయి. అన్ని అనుభవించాక వచ్చేది వేదాంతం. వట్టి మాటలలో చేర్చేది వైరాగ్యం. దాన్నే స్మశాన వైరాగ్యం అంటారు. మన బంధువుల సమాధి కార్యక్రమం పూర్తయిన తరువాత వచ్చేది ఇదే. జీవితం మాయ అనిపిస్తుంది. అది కాసేపు మాత్రమే సుమా. ఇక నేను చెప్పిన మొదటిది వేదాంతం.

రాజు సింహాసనం మీద రాజ్యాన్ని ఏలుతూ ఉంటాడు. అనుకోకుండా ఒక రోజు నిరాశక్తితో ఆ రాజు సత్యాన్వేషణకు రాజ్యాన్ని వదిలేస్తాడు. అన్ని అమర్చిపెట్టే ఉన్నాయి. కాని అనుభవించ బుద్ధికాలేదు. ఏదో తెలియని శూన్యత తనని ఆవరించింది. ఇదే జరిగింది

పృథ్వి నా విషయంలో. జీవితంలో ఎదిగే క్రమంలో యవ్వన వయస్సులో తుపాకి చేపట్టాను. జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలనుకున్నాను.

స్మగ్లింగ్, డ్రగ్స్, మట్కా, రాజకీయాలు. ఈ వ్యాపారాలలో కోట్లు సంపాదించాను. కాని శత్రువుల చేతుల్లో నా వారిని కోల్పోయాను. అమ్మ, నాన్న, అక్క, అన్న, చెల్లి, తమ్ముడు, మామయ్య, మరిది అందరిని నా శత్రువులు సంవత్సర వ్యవధిలో చంపేవారు. ఇదంతా చూసిన నేను ఒణికిపోయాను. ఆత్మహత్య చేసుకుందామని నా లైసెన్స్ రివాల్వర్ని నా కణతలకు గురిపెట్టుకున్నాను. దర్వాజ చప్పుడుతో ఆగాను. తీసి చూస్తే పాష్టర్ గారు. నా గురించి ఆయనకు ఎవరో చెప్పినట్లున్నారు. పాష్టరు గారిని లోపలకు ఆహ్వానించాను. ఆ పాష్టర్ గారితో నాకు ఉన్నది ముఖ పరిచయం మాత్రమే కారులో వెళ్తున్నప్పుడు ఆయనను తరచుగా చర్చిలో చూస్తుండేవాడిని. అందుచేత పోల్చుకోగలిగాను. అయితే ఈ క్లిష్ట పరిస్థితిలో ఇప్పుడు ఆయన నా ఇంటికి ఎందుకు వచ్చారో అర్థం కాలేదు. అడిగితే బాగోదని మౌనంగా ఉండిపోయాను.

ఆయన నన్ను భయం, భయంగా చూడటాన్ని గమనించాను. ఆయనకే కాదు నేనంటే ఆ ప్రాంతంలో అందరికి అంతే భయం ఉంటుంది. నేను చేసే పనులు అలా ఉంటాయి మరి. తనతో మాములుగా సంభాణను ప్రారంభించాను. అయితే ఆయన చెప్తున్న మాటలకు నేను బిత్తరపోయాను. అప్పుడు సమయం మధ్యరాత్రి 12 కావస్తుంది. ఆ సంభాషణను నేను నా జీవితంలో ఎప్పటికి మర్చిపోలేను...

“అనురాగ్ గారు మిమ్మల్ని ఈ వేళప్పుడు డిస్టర్బ్ చేసినందుకు దయతో నన్ను క్షమించండి. ప్రతిరోజు పండుకోబోయే ముందు కాసేపు నా యేసయ్యకు ప్రార్థన చేసుకోవడం నాకు అలవాటు. ఈ రోజు కూడా అలాగే ప్రార్థన చేసుకుంటుండగా ప్రభువు మీ వద్దకు వెళ్ళి ప్రార్థన చేయమన్నారు. మీ వద్దకు అర్ధరాత్రి సమయంలో వచ్చే ధైర్యం నాకు లేదు.

సందేహించాను.... అయితే ప్రభువు బలవంతపెట్టడంతో మీ వద్దకు ఇలా వచ్చాను”. అంటు కొంతసేపు నాకు క్రీస్తు సువార్తను చెప్పి సుదీర్ఘంగా నా గురించి ప్రార్థించారు పాష్టర్ గారు. ఆ అనుభవాన్ని నేను మరువలేను. పాష్టర్ గారు ప్రార్థన పూర్తిచేసేలోపు నాకు ఒళ్ళంతా చెమటలు పట్టాయి. ఎదో శక్తి నన్ను ఆవరించినట్లు నాకు అనిపించింది.

“అనురాగ్ గారు రాబోయే రోజుల్లో మిమ్మల్ని క్రీస్తు ప్రభువు తన సేవలో వాడుకోబోతున్నారు. అది ఎలాగో నాకు తెలియదు. బైబిల్లో పౌలు రాసిన విధంగా

లోకంతో పాటు నశించకుండునట్లు ప్రభువు చేత శిక్షింపబడుచున్నాము (1 కొరింథీ 11:32). మొదట్లో కొంతకాలం మీరు క్రీస్తు కొరకు పాట్లుపడాలి తప్పదు. అయితే ఆ కష్టాలలో క్రీస్తు మిమ్మల్ని బలపరుస్తాడు.

కనుక ఆ బలహీన సమయంలోనే మీరు బలపరచబడతారు. ఇది మీ గురించి దేవుడు నాకిచ్చిన ప్రవచన వాక్యం" అని చెప్పారు పాష్టర్ గారు. తరువాత నన్ను దీవించి ఇంటికి వెళ్ళిపోయారు. ఇంక తరువాత పనులు చకచకా పూర్తి చేశాను. చేసింది నేను కాని చేయించింది నా ప్రభువే. ఇక ఆ రోజు నుండి పృధ్వి ఈ రోజు వరకు నన్ను నా యేసయ్య వదిలిపెట్టలేదు. అందుకే నా ముఖంలో ఇంత ప్రశాంతత. అది నా ప్రభువు నాకిచ్చిన తన నిశ్చయత. ఇక ఆ తరువాత నా అనుచరులతో చెప్పకుండా కోర్టుకి వెళ్ళి అన్ని కేసుల్లోను అప్రువర్‌గా మారాను. సమాజం, పత్రికలు, మీడియా వర్గాలు బిత్తరపోయాయి. ఇదేదో కొత్త నాటకం అనుకున్నారు. అయితే రోజులు, నెలలు, సంవత్సరాలు గడుస్తున్న కొద్ది నాలోని మార్పును వారు ఒప్పుకోక తప్పలేదు. క్లుప్తంగా ఇది పృథ్వి నా సాక్ష్యం".

"కాని అన్న దీనివల్ల మీకేమి ప్రయోజనం".

"ఇంత అని మాటల్లో వివరించలేను పృథ్వి. ఇన్ని సంవత్సరాలుగా ప్రతిరోజు నా ప్రభువు నన్ను చెప్పనశక్యం కాని తన మహిమాయుక్తమైన ఆనందంతో నింపుతున్నాడు. నేను లోకంలో ఉన్నప్పుడు కోట్లు చూశాను. సర్వసుఖాలు అనుభవించాను. కాని ఇప్పుడు నాకు నా ప్రభువు ఇస్తున్న అమిత ఆనందం ముందు అవి ఎందుకు పనికిరావు. పృథ్వి ఈ మాటలను నేను అనుభవపూర్వకంగా చెప్తున్నాను".

"అనురాగ్ అన్న మరి మీకు పెళ్ళి – పిల్లలు...?"

"చెప్పానుగా పృథ్వి నేను లోకంలో ఉన్నప్పుడు అనుభవించని సుఖం అంటు ఏదీ లేదు. ఎందరో అమ్మాయిలను ఎంతో కాలం అనుభవించాను. కొందరిని ఇష్టపూర్వకంగా, మరెందరిలో బలత్కారంతో. నేను చేసిన పాపాలు ఇక్కడితో చాలు. బైబిల్‌లో పేతురు చెప్పినట్లు... "మనము పోకిరి చేష్టలు, దురాశలు, మధ్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహ పూజలు మొదలైన వాటియందు నడుచుకొనుచు, అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును" 91 పేతురు 4:3)

అందుకే ఇక నా జీవితంలో పెళ్ళి అనే మాటకు తావులేదు. నేను బ్రతికినంత కాలము నా యేసయ్య సేవ చేస్తు తృప్తిగా కనుమూస్తాను. నేను శోధించబడిన తరువాత

సువర్ణమువలె కనబడుదును అంటాడు బైబిలులో యోబు. యెహోవా నన్ను కఠినముగా శిక్షించెను గాని మరణమునకు అప్పగించలేదు అంటాడు దావీదు. కాబట్టి పృథ్వీ ఈ నా శేషజీవితం క్రీస్తుకే అంకితం. నా జైలు శిక్ష ఇంకొద్ది సంవత్సరాలలో అయిపోతుంది. ఆ తరువాత క్రీస్తు సువార్త అందని అండమాన్ లాంటి ప్రాంతాలలో సువార్తీకుడిగా పనిచేయాలనుకుంటున్నాను".

"అనురాగ్ అన్న ఒక సందేహం నా చెల్లి పేరు శ్రావ్య. డాక్టర్లు బ్లడ్ క్యాన్సర్ కాబట్టి బ్రతకదని చెప్పారు. క్రీస్తు నా చెల్లిని స్వస్థపరచగలడా?"

"ఖచ్చితంగా పృథ్వీ అయితే అందుకో షరతు. నువ్వు దానికి వెల చెల్లించాలి. నీ శిక్షాకాలం కొద్ది సంవత్సరాలలో పూర్తవుతుంది. అప్పటిదాకా ప్రతిరోజు సందేహించకుండా మోకాళ్ళమీద ప్రభువు వద్ద నీ చెల్లి స్వస్థత కోసం గోజులాడు - కన్నీరు కార్చు. ఈ విషయంలో నా సహకారం నీకు ఉంటుంది. నమ్మిట నీ వలనైతే నమ్మువానికి సమస్తము సాధ్యమే పృథ్వీ".

"తప్పకుండా అన్న. అదే గనుక జరిగితే నా చెల్లికే గనుక తగ్గితే నేనూ నీతోపాటే ప్రభు సేవలో నా శేషజీవితాన్ని గడుపుతాను. నీ అంత కాకపోయినా నేను కూడ నా జీవితంలో అనుభవించని దంటు ఏదీ లేదు. ఇక చాలు అన్న. ఇక్కడితో ఆపేస్తున్నాను".

"మంచిది పృథ్వీ ఇక ఈ రోజు నుండి మన పని ప్రార్థన మాత్రమే. ఈ బైబిలును వీలైనంత ఎక్కువ సమయం మోకాళ్ళ మీద చదువు. ఏవైనా అనుమానాలు ఉంటే నన్ను అడుగు". "థాంక్స్ అన్న ఈ జైల్లో నాకు నీతో పరిచయం కావడం నా అదృష్టం" అంటూ కన్నీళ్ళతో అనురాగ్ చేతుల్లోకి వాలిపోయాడు పృథ్వీ.

ఇక ఆ రోజు నుండి పృథ్వీ జీవితంలో సరిక్రొత్త అధ్యాయం ప్రారంభమైంది. అనురాగ్ ప్రోత్సాహంతో తన జీవితం కోసం, చెల్లి స్వస్థత కోసం రేయింబవళ్ళు ప్రార్థనలో ప్రభు పాధ సన్నిధిలో గడిపాడు. సమయం ఇట్లే గడిచిపోసాగింది. ఈ ఇద్దరు మిత్రుల సాక్ష్యాన్ని గమనించిన ఆ జైల్లోని 12 మంది ఖైదీలు మారి ప్రభువులో రక్షణపొందారు.

అనురాగ్ లాగానే పృథ్వీ కూడా ఇక శేషజీవితంలో పెళ్ళి ప్రసక్తి లేకుండా ప్రభు సేవలో గడపాలని తీర్మానించుకున్నాడు. మాఫియా చీకటి సామ్రాజ్యానికి స్వస్థి పలుకుతున్నట్లుగా ఆ జైలు నుండి మిత్రులకు తన సాక్ష్యాన్ని వివరించాడు. కొంతమంది నమ్మారు. చాలా మంది నవ్వారు.

ఆ రోజుల్లో క్రీస్తులో రక్షణ పొందిన బాలీవుడ్ భామ "మోనికా భేడీ" సాక్ష్యం పృథ్వికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. మోనికా భేడీకి కూడా మాఫియా చీకటి సామ్రాజ్యంతో సంబంధం కలిగి ఉండటం విశేషం. చివరకు ఈ ఇద్దరు మిత్రులు తమ జైలు శిక్ష కాలాన్ని ముగించుకుని విడుదలయ్యారు. వీరి సత్ ప్రవర్తనక బహుమతిగా ప్రభుత్వం వీరి శిక్షా కాలాన్ని కొంత తగ్గించింది.

"మీరు చెప్తున్నది నిజమేనా డాక్టర్".

"నిజం పృథ్వి నీ చెల్లికి బ్లడ్ క్యాన్సర్ ఉందని నిర్ధారించిన డాక్టర్ నేనే కాని ఇప్పుడు శ్రావ్యని పరీక్షించిన తరువాత తనలో ఆ జబ్బు ఆనవాలు ఏ మాత్రం లేవు".

"అది ఎలా డాక్టర్"

"శ్రావ్యకు బ్లడ్ క్యాన్సర్ ఎలా వచ్చిందంటే కొన్ని సంవత్సరాల క్రితం శాస్త్రీయంగా వివరించాను కాని అది ఇప్పుడు ఎలా పోయింది. అని నువ్వు అడుగుతున్న ప్రశ్నకు నా దగ్గర జవాబు లేదు. దానికి నువ్వు అద్భుతం అని పేరు పెట్టినా సరే మరే పేరు పెట్టినా సరే నాకు అభ్యంతరం లేదు. ఎన్నో దశాబ్దాల నా ఈ వైద్య వృత్తిలో నీ చెల్లి కేసు నాకు ఒక అంతుచిక్కని మిస్ట్రీగానే మిగిలిపోతుంది".

కపాడియ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అధినేత సుభాష్ గౌడ్ జవాబిచ్చారు. ఇక ఆ తరువాత పృథ్వి తన చెల్లి శ్రావ్య వివాహాన్ని మిత్రుడు అనురాగ్ ప్రోద్భలంతో ముంబాయ్‌లోని సెయింట్ పీటర్స్ క్యాథరడల్‌లో జరిపించాడు. ఆ పిదప ఇద్దరు స్నేహితులు చత్తీస్‌ఘడ్‌లో ప్రభు సేవలో ముందుకు కదిలారు. వీరి సాక్ష్యం ఎందరినో ఆకర్షించింది... ఆకట్టుకుంది. ఈ స్నేహితులు ఆనాటి నుండి క్రీస్తు సేవలో ముందుకు కొనసాగుతున్నారు. రాతి గుండె నుండి సైతం రాగాలు పలికించగల గొప్ప దేవుడా నీకు స్తోత్రం."…. నేనిది వరకే పట్టుకొని యున్నానని తలంచుకొనను. అయితే ఒకటి చేయుచున్నాను. వెనుక ఉన్నవి మరచి ముందున్న వాటి కొరకై వేగిరపడుచు" క్రీస్తు యేసు నందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలెనని గురియొద్దకే పరిగెత్తుచున్నాను."

భారతదేశ చరిత్రలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లబడిన ఈ కథకు అవసరమైన అంశాలను ప్లాట్‌గా నాకు అందించిన 'ముంబాయ్ మిర్రర్', ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రికల ప్రముఖ నేర పరిశోధనా విలేకరి ఎస్. హుస్సేన్ జియాది గారికి నా కృతజ్ఞతలు….జాన్ శేఖర్

---------

# 42. అమ్మల కథ

## MOTHER'S DAY చరిత్ర

**శ్రీమతి జార్విస్**



అక్షరాలలో మొదటి మాట అమ్మ. అలాగే ఆయుష్షుకు ఆనవాలం అమ్మ. జీవిస్తుందో లేదో Guarantee లేకపోయినా పురిటి నొప్పుల బాధలను పంటి బిగువున అణిచిపెట్టి మరో జన్మగా పిలువబడే ప్రసవానికి పూనుకుంటుంది అమ్మ. తొమ్మిది నెలలు మోసి పురిటినొప్పులతో అష్టకష్టాలు పడ్డా ప్రసవించాక తను కన్నబిడ్డ ఏడుపుతో పులకించిపోయేది అమ్మ. ఇలా చెప్పుకుంటూ పోతే 'అమ్మ'కు ఎన్నో నిర్వచనాలు – మరెన్నో సుభాషితాలు. MOTHER'S DAY (అమ్మల దినం) గా ఈనాడు యావత్ ప్రపంచం గౌరవ మర్యాదలతో పాటించే ఈ పవిత్ర దినం ఆవిర్భవించడానికి ఒక కన్నీటి గాథ కారణం.

తెలియని వారికోసం, తెలుసుకోవాలనుకునే వారికోసం తెర వెనుక దాగివున్న ఆ కడు దీనగాథను చెప్తాను. ఇప్పటికి 70 సంవత్సరాల క్రితం జార్విస్ అనే ఆమెకు వచ్చిన ఆలోచనే ఈనాడు మనమంతా ప్రతి సంవత్సరం **MOTHER'S DAY** గా పాటిస్తున్న అమ్మల దినానికి అంకురం. అన్నా జార్విస్ చిన్ననాటి నుండే తన అన్న, చెల్లెళ్ళతో క్రమం తప్పకుండా ఆలయానికి వెళ్ళేది. తనకు 20 సంవత్సరాలు వచ్చేనాటికి ఉన్నత చదువులు అభ్యసించి వర్జీనియాలోని కన్యల ఆశ్రమంలో ఉపాధ్యాయునిగా చేరింది. అయితే **MOTHER'S DAY** (అమ్మల దినం) గా ఒక రోజున ప్రపంచం పాటించాలనే తలంపు మొదట వచ్చింది తన తల్లికి. ఆమె పేరు శ్రీమతి .జార్విస్. అయితే అనుకోని అపశృతిలా 31 డిసెంబరు 1902న తన భర్త **(Anna Jarvis** తండ్రి) గుండెపోటుతో మరణించాడు. కాలప్రవాహంలో వీరి కుటుంబం ఫిలడెల్ఫియాకు వలసవెళ్ళింది. ఒక పవిత్ర ఆశయ స్థాపన కోసం ఎన్నో కలలు కన్న శ్రీమతి జార్విస్ ఆ రోజును చూడకముందే, తన భర్త మరణించిన 3 సంవత్సరాలకు కన్నుమూసింది. తన తల్లి ఆశయ సాధనను తన భుజస్కంధాలపై వేసుకొని ముందుకు సాగింది జార్విస్. ఎప్పటికైనా తన తల్లి కలలుకన్న 'అమ్మల దినం' (**MOTHER'S DAY)** ఆవిర్భవాన్ని తన కన్నులారా, బ్రతికి ఉండగానే చూడాలనుకుంది.

అందుకోసం ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చింది. ఎందరో అధికారులను, దేశ నాయకులను కలిసింది. అందుకుగాను తన ఆస్థి కరిగిపోవడం మొదలైంది తప్ప, అంతకు మించి ఫలితం శూన్యం. రోజులు గడుస్తున్నకొద్దీ తన ఐశ్వర్యం, ఆరోగ్యం కొవ్వొత్తిగా కరిగిపోయాయి. అన్నా జార్విస్ అన్నయ్య క్లాడియోస్ అనారోగ్యంతో చనిపోతూ తన కోట్ల ఆస్థినంతా చెల్లెలు పేరుమీద వ్రాసి మరణించాడు.

అయితే జార్విస్‌కు ఇక్కడా దురదృష్టం వెంటాడింది. ఏవో కొన్ని కోర్టు సమస్యల కారణంగా తన అన్నయ్య తనకు ఇచ్చి వెళ్ళిన ఆస్థిని ప్రభుత్వం వశపరచుకుంది. తను, తన గ్రుడ్డి చెల్లెలు 'ఎల్సా' తోటి ఘోరమైన అనారోగ్యంతో ఒక చిన్న గదిలో తినీ తినక దుర్భర జీవితాన్ని జార్విస్ గడిపింది. నెమ్మదిగా జార్విస్‌కు కూడా తన చెల్లిలా చూపు మందగించడం ప్రారంభమైంది.

కథ ఇలాగే సాగితే ఇక మనం చెప్పుకోవడానికి ఏమీ ఉండేది కాదు. అయితే అనుకోకుండా ఒకరోజు ప్రాత:కాల వేళ వ్యాహ్యాళికై వాకింగ్ చేస్తున్న అన్నా జార్విస్ యొక్క చిన్ననాటి మిత్రుడు విల్సన్ ఆ గుడ్డి అక్కా చెల్లెళ్ళ దయనీయ పరిస్థితిని చూడడం జరుగుతుంది. అతడు ఆ దేశంలో కెల్లా పేరు ప్రఖ్యాతులు గల ప్రసిద్ధి లాయర్.

పరిస్థితిని ఆకళింపు చేసుకున్న అతడు ఆలస్యం చేయకుండా వెంటనే ఆ అక్కా చెల్లెళ్ళను తక్షణ చికిత్స కోసం హాస్పటల్‌కి తరలించాడు. ఈలోగా ఎక్కడెక్కడో స్థిరపడ్డ జార్విస్ చిన్ననాటి మిత్రులకు తెలియబరిచి అందరి విరాళాల రూపేణా వచ్చిన లక్షల రూపాయలను బ్యాంక్‌లో జార్విస్ ఫౌండేషన్ పేరుమీద ఒక ఖాతా తెరిచాడు. జార్విస్ జీవితాంతం విలాసంగా బ్రతకడానికి సరిపోయేటంత సొమ్ము పోగయింది. ఆసుపత్రి నుండి ఆ అక్కా – చెల్లెళ్ళను ఒక విలాసవంతమైన భవనానికి తరలించారు. అక్కడితో కథ ఆగిపోలేదు. సంవత్సరంలోని ఒక రోజును 'అమ్మల దినం'గా ప్రత్యేకపరచాలనే తన ప్రగాఢ కోరికను జార్విస్ లాయర్ మిత్రుడికి చెప్పింది. వెంటనే స్పందించిన విల్సన్ తనకున్న పేరుప్రఖ్యాతులను ఉపయోగించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశాలదృక్పథం గల మానవతా సంస్థలకు తెలిసేలా చేశాడు. సరిగ్గా 8 నెలల వ్యవధిలోనే వీరి కృషికి ప్రతిఫలం వచ్చింది.

కోట్ల రూపాయలతో అమ్మల దినాన్ని పాటించడానికి సంస్థ స్థాపించబడింది. ఒక ఆదివారాన, మే 10, 1908 నాడు మొట్టమొదటి అమ్మల దినం ఆంద్రెయ ఆలయంలోని ఆరాధన కార్యక్రమంలో ఆనందోత్సవాల నడుమ ఘనంగా జరిగింది.

ఇక ఆనాటి నుండి ఈనాటి వరకు అదే రోజును 'అమ్మల దినం'గా యావత్ ప్రపంచం పాటిస్తుంది. ఎందరో వ్యక్తులు, సంస్థలు తమవంతు కృషిగా కోట్లాది రూపాయలను "అమ్మల దినపు నిధి"కి విరాళాలు ఇచ్చారు. గుర్తింపు పొందిన రోజుగా అన్ని దేశాల ప్రభుత్వాలు అమ్మల దినాన్ని పాటించడం ద్వారా గౌరవిస్తున్నాయి.

1934 చివర్లో అమెరికా ప్రభుత్వం ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అన్నా జార్విస్ యొక్క ఫొటోతో ఆమె జ్ఞాపకార్థం ఒక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఈనాడు మనం తెలిసో, తెలియకో జరుపుకుంటున్న ఈ అమ్మల దినానికి ఇంతటి దీనచరిత్ర దాగివుంది. తన తల్లి కలలుకన్న 'అమ్మల దినం' ప్రపంచం పాటించాలనే ప్రగాఢ వాంఛను జార్విస్ తన చివరి రోజుల్లో చూసుకొని ఆనందభాష్పాలు జల జల రాలుస్తూ ఈ లోకానికి వీడ్కోలు పలికి పరలోకాని పయనమయింది. "ఆకలిని తీర్చి – ఆనందాన్ని పంచే అమ్మకు **MOTHER'S DAY** (అమ్మల దినం) ప్రపంచం పాటించడం ద్వారా ఒక ప్రత్యేక గుర్తింపు లభించినట్లయింది.

---------

# 43. మంచం మీదనుండి క్రీస్తు మహిమను చాటిన మహానుభావుడు

**– మైఖేల్ పంజిలో**



ఒకసారి మీరు మంచం మీద పండుకొని మీ ఇంటి పైకప్పుకేసి చూడండి. మీ ఇంటి పైకప్పు విస్తీర్ణం సుమారు ఎంత ఉంటుంది? 36 (6×6) చ॥ అడుగులు ఉంటుందని జూజాయిగా అనుకుందాం. ఇప్పుడు మీరు మంచం మీద పండుకొని పైకప్పుకేసి ఎలా చూస్తున్నారో, అదే భంగిమలో మిమ్మల్ని ఒక చెక్కబల్ల మీద పండుకోబెట్టి ఇనుప సంకెళ్ళతో ఆ బల్ల పడకుండా బంధించి, మీ ఇంటి పైకప్పుకు రంగులేస్తున్నారు.... ఊహించుకోండి.

మీ ఇల్లు ఇంచుమించు 12 అడుగులు ఎత్తు ఉంటుందనుకోండి, అలా కాకుండా 36 అడుగుల ఎత్తు 360 (36×10) చ॥ అడుగుల విశాల భవంతి పైకప్పుకి అలా పండుకుని పిచ్చిపిచ్చి గీతలు కాదు, అద్భుతమైన క్రీస్తు దృశ్యాలను తెల్లవర్ణ చిత్రాలుగా – కళాఖండాలుగా చిత్రీకరించడాన్ని ఊహించగలరా? కళ్ళు తిరుగుతున్నాయి కదూ! కానీ, ప్రపంచ అద్భుతాలలో ఒకటిగా పిలువబడే ఈ అపూర్వ సాహసం రోమ్‌లో జరిగింది.

ఆ గీసిన చిత్రకారుడి పేరు నిష్ట సన్నిధి పరుడైన ప్రపంచ ప్రఖ్యాత మైఖేల్ ఏంజిల్, రోమ్‌లోని సిస్టీన్ అనబడే అతి పెద్ద ఆలయం లోపల ఈనాడు మన కళ్ళకు జిగేల్‌మనిపించే ఎన్నో వందల తైలవర్ణ క్రీస్తు చిత్రాలు ప్రత్యక్షమవుతాయి. ఇంత సాహసం చేసి అంత ఎత్తులో గాలిలో వ్రేలాడుతూ ఈ ఆలయ పైకప్పుకు ఈ చిత్రాలను చిత్రీకరించడానికి మైఖేల్ ఎంజిలో అనబడే ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడికి పట్టిన వ్యవధి ఎన్నో సంవత్సరాలు.

మీ కిదంతా ఆశ్చర్యంగా అనిపిస్తుంది కదూ. కాని రోమ్‌లోని సిస్టీన్ ఆలయ విశాల పైకప్పు లోపల మనకు ఈనాడు కనిపిస్తున్న చక్కటి క్రీస్తు తైలవర్ణ చిత్రాలు ఇందుకు సజీవ సాక్ష్యాలు. మొదట్లో కొన్ని దశాబ్ధాల క్రితం ఈ ఆలయాన్ని నిర్మించాక ఆనాటి పోప్ గారికి, పైకప్పులో పలుచిత్రాలు వేస్తే అది ఒక ప్రపంచ అద్భుతంగా చరిత్రలో మిగిలిపోతుందని అనుకున్నాడు. ఆలోచనైతే వచ్చింది కాని ఇంతటి సాహసోపేతమైన కార్యానికి ఎవరు పూనుకుంటారు?

నెలలు తరబడి బల్లమీద పండుకొని చిత్రాలను గీసే ప్రయత్నంలో తరచుగా మీదపడే రంగులు, కంట్లో పడి, ఏమాత్రం ఆ చిత్రాలు గీసే వ్యక్తి ఏమరుపాటుగా ఉన్నా ఆ 36 అడుగుల ఎత్తులో ఉండే చెక్కబల్ల మీద నుండి క్రిందపడితే వచ్చేది కళాఖండం కాదు – చిందరవందరమై పోయినట్టి అతని శవం.

ఏదేమైతేనేం, పోప్‌గారి ఆదేశాల ప్రకారం అలాంటి సాహసం చేయగల, చిత్రీకరించగల మంచి హస్తవాసి గల వ్యక్తి కోసం అన్వేషణ కొన్ని సంవత్సరాల పాటు కొనసాగింది. అలా చేయగలవారు ఈ ప్రపంచంలోనే ఎవరూ ఉండరని తెలుసుకొన్న పోప్‌గారు తన ప్రయత్నాన్ని విరమించుకోబోతుండగా అనుకోని అద్భుతంలా ఈ సాహసానికి 'నేను సిద్ధం' అంటూ ఒక వ్యక్తి ముందుకొచ్చాడు. అతడే మైఖేల్ ఏంజిలో.

ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడిగా అప్పటికే అతనికి మంచి గుర్తింపు ఉంది. అతడి స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు ఈ సాహసానికి పూనుకోవద్దని శతవిధాలా ఒప్పించాలని ప్రయత్నించి విఫలమయ్యారు. "క్రీస్తు మహిమార్థం నా జీవితకాలంలో ఇప్పటి వరకూ నేను ఈ మహనీయునికి ఏమీ చెయ్యలేకపోయాను.

ఈ నా చివరి రోజుల్లోనైనా ఆయన మహిమార్థం నేను ఈ పనికి ఉపక్రమిస్తున్నాను. ఇప్పటికే యావత్ ప్రపంచం నన్ను ఒక ప్రఖ్యాత చిత్రకారుడిగా గుర్తిస్తుంది. నిజమే కాని ఇప్పటి వరకు నేను గీసిన చిత్రాలన్నీ డబ్బుకోసం – ఘనత కోసం – ఖ్యాతి కోసం గీసాను. కాని ఈ సాహస చిత్రాలను నా ఆత్మీయావేశాన్ని తృప్తిపరచుకోవడానికి – క్రీస్తుకు నా వంతు సేవగా భావిస్తున్నాను.

తప్పకుండా గీస్తాను, గీయగలను. ఈ నా సాహసోపేతమైన కార్యం పూర్తిచేయడానికి ఎన్ని సంవత్సరాలు పట్టినా సరే, నేను వెనుకాడను. **"నేను నమ్ముకున్న నా ప్రభువే తన దేవదూతలను పంపి నాకు కాపుదలనిస్తాడు"** అంటూ ఎంతో సాహసవంతమైన ఈ పనికి అతడు పూనుకున్నాడు.

కొన్ని సంవత్సరాలకు అత్యద్భుతమైన కళాఖండాలైన ఈ చిత్రాలు అతనిచేత పూర్తిచేయబడ్డాయి. దురదృష్టకరమైన విషయం ఏమిటంటే, మైఖైల్ ఏంజిలొ తాను గీసిన చిత్రాల పని అంతా పూర్తయ్యాక, వాటివైపే చూస్తూ ఆనందభాష్పాలు జలజలా రాలుస్తూ నేలమీద కూలిపోయాడు.

అసలు విషయం ఏమిటంటే అన్ని సంవత్సరాల పాటు అదే భంగిమతో ఎంత ఎత్తులో గాలిలో వ్రేలాడుతూ క్రీస్తు చిత్రాలను చిత్రీకరించడం వల్ల వెన్నుపూస పూర్తిగా

పాడైపోయింది. తప్పనిసరి పరిస్థితుల్లో వైద్యులు దాన్ని తొలగించారు. వృద్ధుడైన మైఖేల్ ఏంజిలొ ఇక తన శేష జీవితాన్ని అదే ఆలయంలో తన జీవితాంతం రోజూ ఎడతెగని ప్రార్థనలతో గడిపాడు. ఇంతటి ఘనమైన సాహస కళాఖండాన్ని చిత్రీకరించినందుకు అతనికి ఆలయ అధికారులు బలవంతం చేసినా గీసినందుకు నయాపైసా పారితోషకం తీసుకోలేదు.

"నా రక్షకుడైన క్రీస్తు చిత్రాలకు వెలకట్టి పాపం చేయమంటారా?" అంటూ ఎదురు ప్రశ్నించాడు. ఇంతటి ఘనచరిత్ర గల ఆలయం రోమ్‌లోని వాటికన్ పట్టణంలో ఉంది. క్రీస్తు శకం 1508వ సంవత్సరంలో ఆనాటి పోప్ గారైన సిక్స్‌డస్ ఏలుబడిలో ఈ ఆలయ నిర్మాణం – అంతకుమించిన ఈ ఆలయానికే గర్వకారణమైన పైకప్పు లోపల క్రీస్తు చిత్రాలు పూర్తిచేయబడ్డాయి. కడు దయనీయమైన ఈ సందర్భానికి సరిపోయే సంఘటనను చెప్పి ముగిస్తాను.

మైఖేల్ ఎంజిలో చిత్రాలను చిత్రీకరించడం పూర్తిచేశాక ఆ పడక బల్లను క్రిందకు దించేశారు. మరుసటి రోజు మైఖెల్ ఎంజిలొ తాను గీసిన చిత్రాలను మనస్సులోనే క్రీస్తుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ పరిశీలిస్తుండగా తాను గీసిన చిత్రాలలో ఒక చిన్న అపశృతి ( తప్పు) అతడికి కనిపించింది. అంతే, అతడు క్షణం ఆలస్యం చేయకుండా మరలా బల్లను పైకప్పుకు కట్టించి ఆ తప్పును సరిదిద్దడానికి పూనుకున్నాడు.

"పోనీయరాదా మైఖేల్, ఆ చిన్న తప్పును చిత్రాలు గీయడంలో ఎంతో అనుభవం ఉన్న నేనే కనుక్కోలేకపోయాను. ఈ చిన్న తప్పును ఎవరు పట్టుకుంటారు చెప్పు" అంటూ అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న బైఖేల్ ఏంజిలోను తన ప్రాణమిత్రుడు ఎంతో వారించాడు. అతనికి ఇలా జవాబిచ్చాడు. "నిజమే మిత్రమా, ఆ తప్పును ఎవరూ గుర్తించలేకపోవచ్చు. కాని నా మనస్సాక్షి పసికట్టిందిగా? దానికి నేను సంజాయిషీ చెప్పుకోలేను" అంటూ మరలా ఎంతో ప్రయాసతో ఆ చిన్న తప్పును సరిదిద్దాడు.

**"ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు"**

అంటూ ఈ అధ్యాయాన్ని ముగిద్దామా.......

---------

# 44. విద్యార్థులేమి చేయగలరు? అని సంశయము రావచ్చు.

మిషనెరీ సేవలో ఒక విద్యార్థి

## హోసన్న మనోకరన్ జీవిత గాథ

ఇది ఒక కాలేజీ విద్యార్థిగా చదువుకుంటూ అదే సమయంలో ఒక మిషనెరీగా పని చేసిన ఒక యౌవన స్త్రీ జీవిత గాథ. క్రీస్తు పట్ల వారి ప్రేమను తమ చుట్టూ ఉన్నవారితో పంచుకొనేలా అనేకమంది విద్యార్థులకు ఆమె జీవితం ఒక గొప్ప సవాలుగా నిలుస్తుంది.

జననం: 22-11-1983 మరణం: 3-9-2011

1983 నవంబరు 22న జన్మించిన హోసన్న క్రీస్తు కొరకు అమూల్యమైన త్యాగపూరిత సువార్త సేవ చేసింది. డాక్టరుగా 28వ యేట మృత్యువాత పడి 2011 సెప్టెంబరు 3న ప్రభువును చేరిన అమరజీవి. ఆమె జీవిత ధ్యానం ఆశీర్వాదకరం.

### 1 ఉపోద్ఘాతం

హోసన్న మనోకరన్ తమిళనాడులోని కాంచీపురం పట్టణంలో 1983 నవంబరు 22వ తేదీన ఒక అపరిపక్వ (నెలతక్కువ బిడ్డ) శిశువుగా జన్మించింది. ఆమె తల్లిదండ్రులు జె, నవమణి మనోకరన్, రోజియా మనోకరన్‌లు తమిళనాడు ప్రభుత్వంలో సివిల్ ఇంజనీర్లుగా పనిచేస్తుండేవారు. 1985లో వారు తమ ఉద్యోగాలకు రాజీనామా చేసి మిషనెరీలుగా హర్యానా రాష్ట్రానికి తరలిపోయారు. హోసన్న కూడా ఒక చిన్న శిశువుగా వారితో కలిసి వెళ్ళింది. ఆమె తమ్ముడు తంబోస్ దాదాపు తొమ్మిది సంవత్సరాల తరువాత జన్మించాడు.

మిషన్ సేవా ప్రాంతంలో తన తల్లిదండ్రులు ఆర్థికంగా, భావోద్రేకాల పరంగా, సామాజికంగా ఎదుర్కొన్న సమస్యలను గమనిస్తూ హోసన్న పెరిగింది. ఆమె తల్లిదండ్రులు తమ ఉద్యోగాలను వదిలిన తరువాత ఒక సాధారణమైన జీవిత విధానాన్ని అలవర్చుకున్నారు. అక్కడ ఉన్న కొన్ని పాఠశాలల హాస్టళ్ళలో స్కాలర్‌షిప్ ఇచ్చి హోసన్నను చేర్చుకోవడానికి వారు సిద్ధపడినప్పటికీ మనోకరన్ దంపతుఉలు మాత్రం తమ కుమార్తెను తమతో ఇంటిలోనే ఉంచుకొని చదివించారు. ఆ విధంగా ఆమె ప్రతి పిరిస్థితికీ అలవాటు పడిన అనుభవంలో పెరిగింది. ఆమె ఎన్నడూ తలకెదురైన అసౌకర్యాలు, అననుకూలతలను లెక్కచేసేది కాదు.

ప్రతి విషయంలో సర్దుకుపోతూ ఎంతో ఆలోచనాయుక్తంగా మెసులుకునేది. అంతేగాక ఇతరులకు ఎంతో సహాయకరంగా ఉండేది. స్కూలుకు వెళ్ళడం ప్రారంభించక ముందునుండే ఆమె తన తల్లిదండ్రులకు ఇంటిపనిలో సహాయపడుతూ ఉండేది. కిచెన్‌లో పాత్రలు కడగడానికి వాటిని తల్లికి అందించడంలో ఆమె ఉతికిన బట్టలను ఆరవేయడంలో సహాయపడేది. తండ్రితో కూర్చొని ఆయన తన స్నేహితులకు, ప్రార్ధనా సహకారులకు పంపించే సమాచార పత్రికలను కవర్లలో పెట్టడం, వాటిపైన స్టాంపులు అంటించడం వంటి పనులు చేస్తూ సహాయపడేది.

సాధారణమైన కుటుండంలో పెరిగిని పిల్లలు అనుభవించే కొన్ని అంశాలకు భిన్నమైన అంశాలు మిషనెరీల పిల్లలకు అందుబాటులో ఉంటాయి. హొసన్నకు దక్కిన అలాటి ఒక ఆధిక్యత ఏమిటంటే రెండు రకాల సంస్కృతుల మేళవింపు. తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లో కనిపించే విభిన్న సంస్కృతులలోని శ్రేష్ఠమైన అంశాలను ఆమె పుణికిపుచ్చుకుంది. హర్యానా రాష్ట్రభాష, మన జాతీయభాష అయిన హిందీతో సహా ఇంగ్లీషు, సంస్కృతం (స్కూల్లో), పొరుగు రాష్ట్రమైన పంజాబ్‌లో మాట్లాడే పంజాబీ భాషలను అనర్గళంగా నేర్చుకోవడం ఆమెకు దక్కిన మరో ఆధిక్యత.

ఇవన్నీ కాక తన మాతృభాష అయిన తమిళం ఉండనే ఉంది. ఇలాటి రెండు విభిన్న సంస్కృతుల సంగమంలో పెరిగిన హొసన్నకు అది భవిష్యత్తులో తాను చదవబోయే రష్యా దేశ భాష. దాని సంస్కృతికి తేలికగా అలవాటు పడి దానిని అన్వయం చేసుకోవడానికి దోహదం చేసింది. హొసన్న తల్లిదండ్రులు తమ పరిచర్య నిమిత్తం పదేపదే వేర్వేరు క్రొత్త ప్రదేశాలకు తరలిపోవలసి రావడం వలన ఆమె కూడా తన చదువును వేర్వేరు పాఠశాలల్లో కొనసాగించవలసి వచ్చింది.

ఆమె తల్లిదండ్రులు చిన్నపిల్లల పరిచర్యలో సహకరిస్తూ ఉండేవారు. వారు ఇండియా మిషన్స్ అసోసియేషన్‌తో కలిసి పరిశోధనలు చేస్తూ, స్థానికి సంఘంలో యౌవనస్తుల కార్యక్రమాల్లో, రిట్రీటుల్లో పాల్గొంటూ, అక్కడి పాస్టర్లకు శిక్షణనిస్తూ ఉండేవారు. ఆమె తల్లి ఒక చిన్న లైబ్రరీని నడిపించేది. ఆరవ తరగతి వరకు హొసన్న జగధిరిలోని సెయింట్ థామస్ స్కూల్లో, ఒక సంవత్సరం పాటు చండీఘడ్‌లోని ఎయిర్ ఫోర్స్ పాఠశాలలో చదివింది.

ఆ తరువాత అనిత మెట్రిక్యులేషన్ స్కూల్లో చదువు కొనసాగించింది. ఆమె తల్లి చెన్నయ్‌లో ఇ.ఎల్.ఎస్. బుక్ షాపులో కొంతకాలం పనిచేసింది. ఆమె తండ్రి రచనా

వ్యాసంగంలో, బోధనలో మిషనెరీల శిక్షణ, సమీకరణ విభాగాల్లో పనిచేశాడు. హోసన్న చెన్నయ్‌లోనే ఎస్.బి.ఒ.ఎ. స్కూల్లో తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తిచేసింది.

**2 మిషనెరీ పరిచర్య ఇంటిలోనే ప్రారంభం అవుతుంది**

చెన్నయ్‌లోని ఒక స్కూల్లో చదివేటప్పుడు హోసన్న భోజన సమయంలో విద్యార్థులకు ఒక చిన్న సహవాసాన్ని ప్రారంభించింది. దాని ద్వారా కొద్దిమంది విద్యార్థులు ప్రభువును తమ రక్షకునిగా అంగీకరించారు. వారి ద్వారా ఆమె ఎల్లప్పుడూ క్వయర్ బృందాలు, నృత్య శిక్షణా కార్యక్రమాలు (కొరియోగ్రఫీ) ఏర్పాటు చేసి ప్రదర్శనలు జరిగించేది. కాని ఆమె మాత్రం ఎప్పుడూ తెరవెనుక వ్యక్తిగా నిలిచిపోవడానికి ఇష్టపడేది. అంతేగాక, ఉత్తర భారతదేశానికి స్వల్పకాలిక మిషన్ యాత్రలకు వెళ్ళేవారికి నాయకత్వ శిక్షణ నివ్వడంలో హోసన్న చురుకుగా పాల్గొనేది. వారికి వ్యవహారికి హిందీ భాష, పాటలు, కంఠత వాక్యాలు నేర్పిస్తూ వాటిని అక్కడ వారి ప్రార్థనా సమావేశాలకు వచ్చే వారికి ప్రదర్శించడంలో శిక్షణనిచ్చేది.

హోసన్న తన చిన్న వయస్సునుండి వైద్య వృత్తి పట్ల ఆకర్షితురాలైంది. ఆమె తల్లిదండ్రులు ఉత్తర భారతదేశంలో మిషనెరీలుగా జగధిరి క్రిస్టియన్ హాస్పటల్, హెర్బర్ట్ పూర్ ఆస్పటల్, లూథియానా క్రిస్టియన్ హాస్పట్ వంటి మిషన్ వైద్యశాలల్లో పనిచేశారు. అక్కడి క్రైస్తవ డాక్టర్లు చలామంది కుటుంబాలతో హోసన్న ఇంటికి వస్తూ పోతూ ఉ ండేవారు. బాల్యం నుండి హోసన్న ఏనాటికైనా తానొక మిషనెరీ డాక్టరు కావాలని కలలు కనేది.

2002వ సంవత్సరంలో తన ప్లస్ టు కోర్సు ముగించింది. వెంటనే ఏదైనా వైద్య కళాశాలలో చేరాలని ఆమె నిర్ణయించుకొని దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో ప్రవేశం కోసం ధరఖాస్తు చేసింది. కాని ఆ సమయంలో వైద్య కళాశాలల్లో ప్రవేశానికి ఉన్న విపరీతమైన పోటీ కారణంగా ఆమె ప్రయత్నాలు ఫలించలేదు.

హోసన్న తల్లిదండ్రులు ప్రభువును సేవించాలన్న తీవ్రమైన వాంఛను బాల్యం నుండి ఆమెలో కలిగించి పెంపొందింపచేశారు. వైద్య కోర్సులో ప్రవేశం లభించనందున ఏమి చేయాలో తోచని ఆమె పరిస్థితిని బట్టి వారు సహజంగానే నిరాశకు గురయ్యారు. వైద్య వృత్తి కోర్సుకు బదులు మానసిక శాస్త్రం చదవమని వారు ఆమెకు సూచించారు. కాని వైద్యవిద్య కోర్సును చదవాలనే ఆమె నిర్ణయం స్థిరంగా ఉంది. ఆమె ప్రార్థిస్తూ ఉండగా తాను వైద్య వృత్తి విద్యాకోర్సు చదవడానికి వైద్య కళాశాలలో చేరడమే దేవుని చిత్తమని

ఆమెకు రూఢిగా అవగాహన అయ్యింది. దానితో ఆమె ఆ కోర్సు చేయడానికి ఉన్న ఇతర అవకాశాలను వెదకడం ప్రారంభించింది. త్వరలో ప్రపంచ వ్యాప్తంగా తాను వైద్య విద్య చదవడానికి అనేక అవకాశాలు ఉన్నాయని గ్రహించింది.

ఆమె తండ్రి స్నేహితుడు ఒకాయన ఆమెను రష్యా వెళ్ళమని సూచించాడు. ఒక మిషనెరీ నాయకుడుగా ఆమె తండ్రి చాలామంది యౌవ్వన విద్యార్థులను తమ జీవితాల్లో దేవుని చిత్తమేమిటో ఎరిగి దానిని జరిగించడానికి క్రొత్త క్రొత్త ప్రదేశాలకు వెళ్ళి ఇతరులను ప్రభువైన యేసు క్రీస్తు దగ్గరకు నడిపించాలని ప్రోత్సహించేవాడు. హెూసన్నలో, ఆమె తల్లిదండ్రుల్లో కూడా వెళ్ళడానికి సంకల్పమైతే ఉంది గాని దానికి కావలసిన వనరులే వారికి లేవు. దానికి కావలసిన ధనం వారిదగ్గర లేదు.

దానికి జవాబు తండ్రి దగ్గర సిద్ధంగా ఉంది. ఆయన తన కుమార్తెతో అన్నాడు, "నీవు వెళ్ళవచ్చు. అయితే నీకున్న ఒకే ఒక్క సాధనం సజీవుడైన మన రక్షకునిలో విశ్వాసమే. ఆయనే నీకు కావలసింది అనుగ్రహిస్తాడు" అయితే డబ్బు ఎక్కడనుండి వస్తుంది అన్న ప్రశ్న అలాగే ఉంది. ప్రార్థనలో దేవుని నడిపింపు కోసం కనిపెట్టారు. కొన్ని రోజులకు మనోకరన్ స్నేహితుడు ఆయన్ని కలిసి, "బ్రదర్, గత 15 సంవత్సరాలుగా మీరు దేవుణ్ణి సేవిస్తున్నారు. ఆయన మిమ్మల్ని ఎన్నటికీ విడిచిపెట్టడు. మీరు చేసిన పరిచర్య ద్వారా దేవుడు వందలాది మందిని ఆశీర్వదించాడు. మీరు వాళ్ళని సంప్రదిస్తే మీకు సహాయం చేయడానికి చాలామంది ఇష్టంగా ముందుకు వస్తారు" అని సలహా ఇచ్చాడు.

అయితే హెూసన్న తండ్రికి డబ్బు గురించి ఎవరినైనా అడగటం చాలా కష్టమైన పనిగా తోచింది. ఏదేమైనప్పటికీ ధైర్యం తెచ్చుకొని మనస్సు కూడగట్టుకొని తనకు తెలిసిన దాదాపు 200 మంది స్నేహితులకు ప్రార్థనాపూర్వకమైన సహాయం కోసం ఇ మెయిల్స్ పంపించాడు. డాక్టర్ అజయ్ లాల్ అనే స్నేహితుడు రూ. 80,000/-లకు ఒక్క చెక్కు పంపించాడు. అది హెూసన్న మాస్కోలో రష్యన్ భాష నేర్చుకోవడానికయ్యే ఖర్చులో మూడవ వంతుకు సరిపోతుంది. హెూసన్న తండ్రి ఆమెతో "నా జీవితమంతటిలో ఇంతవరక ఇంత పెద్ద మొత్తాన్ని నేను చూడలేదు. ఒక మిషనెరీకి దాదాపు ఒక సంవత్సరం జీతంతో ఇది సమానం" అన్నాడు. ఇంకా మరికొంత మంది స్నేహితులు కూడా తమ చేతులు కలిపి తమ వంతు సహాయం పంపించారు.

న్యూ కల్వరి చర్చి సీనియర్ పాస్టరుగా ఆయన ఆ సంఘ నాయకులతో చర్చించారు. తత్ఫలితంగా 2002వ సంవత్సరం ఆ సంఘం ద్వారా హెూసన్న ఒక మిషనెరీ విద్యార్థినిగా

ప్రతిష్ఠించబడింది. ఆమె కోర్సుకయ్యే ఖర్చులో 10 శాతం భరించడానికి ఆ సంఘం అంగీకరించింది.

సాధారణంగా ఇండియాలో ఆడపిల్లలు ఒంటరిగా ప్రయాణించడానికి అనుమతించరు. అయితే తమ చదువుల నిమిత్తం అనేక కుటుంబాలు తమ పిల్లలను అమెరికా, ఇంగ్లండ్, ఇంకా ఇతర అభివృద్ధి చెందిన దేశాలకు పంపించారు. బహు తక్కువమంది మాత్రమే తమ పిల్లలను, అందులోనూ ఆడపిల్లలను 'ఇనుప తెరవెనుక దేశాలు' అని పిలవబడిన రష్యా కూటమిలోని దేశాలకు పంపించేవారు. రష్యా కూటమిలోని దేశాలు రాజకీయంగా అస్థిరంగా ఉండడం వలన ప్రపంచం వారిని అనుమానపు ధృక్కులతో చూసేది. అయితే హెూసన్న ఆమె తల్లిదండ్రులు ప్రభువు నడిపింపుకు లోబడి తమ ప్రణాళికలలో ముందుకు సాగారు.

ఫలితంగా, 2002వ సంవత్సరం అక్టోబరులో హెూసన్న తన జీవితంలో మొట్ట మొదటిసారి విమానం ఎక్కి మాస్కో నగరానికి బయలుదేరింది. ఆమె ఉద్దేశం తానొక "మిషనెరీ డాక్టరు" కావాలని. అయితే ఆమెపట్ల దేవుని ఉన్నతమైన ఉద్దేశం ఆమె ముందుగా "మిషనెరీ విద్యార్థి" కావాలని.

ఒక పరాయి దేశంలో జీవితం ప్రారంభంలో చాలా కష్టంగా అనిపించింది. జీరోకన్నా తక్కువ ఉష్ణోగ్రతల మధ్య సరైన వేడి దుస్తులు లేకపోయినప్పటికీ ఆమె దానిని తట్టుకొని అతి కష్టసాధ్యమైన రష్యను భాషను నేర్చుకోవడానికి దేవుడు హెూసన్నకు సహాయం చేశాడు.

హెూసన్న మాస్కో నగరంలో ఒక సంవత్సరం పాటు రష్యను భాష నేర్చుకొంది. సహజంగానే భాషలను అతి తేలికగా నేర్చుకోగలిగిన ఆమె రష్యను భాషను కూడా త్వరితంగా నేర్చుకోగలిగింది. సంస్కృత వ్యాకరణంలో ఆమెకున్న పరిజ్ఞానం రష్యను భాష వ్యాకరణం నేర్చుకోవడానికి ఎంతో సహాయపడింది. ఐరోపాలో ఎక్కువభాగం, ఇరాన్, పాకిస్తాన్, ఇండియా దేశాల్లో వాడుకలో ఉన్న ఇండో-యూరోపా భాషలన్నిటికీ మూల భాష ఒకటి కావడమే దీనికి కారణం. రష్యను భాషకు, సంస్కృతానికి మధ్య ఆశ్చర్యజనకమైన పోలిక ఉంది.

తరువాత హెూసన్న సెయింట్ పీటర్స బర్గ్‌లోని ఒక వైద్యకళాశాలలో చేరింది. ఆమె అక్కడ చదువుతూ ఉండగానే తన స్నేహితుల మధ్య వ్యక్తిగత సువార్త పరిచర్యను ప్రారంభించింది. మొదట ఇద్దరు ముగ్గురు విద్యార్థులు సువార్తపట్ల ఆకర్షితులై త్వరలోనే

క్రీస్తును అంగీకరించారు. అయితే ఆమె ఆ కాలేజీలో చేరిన కొద్ది కాలానికే పరిస్థితులు వ్యతిరేకంగా మారడం ప్రారంభించాయి. తమకు జీతాలు తక్కువగా ఉన్నాయనే కారణంతో ఆ కాలేజి ఉపాధ్యాయులు సమ్మె ప్రారంభించారు. అనేక వార్తా పత్రికలు, రేడియో, టెలివిజన్ చానళ్ళలో ఆ కాలేజీలో జరుగుతున్న అక్రమాలు, ఆర్థిక అవకతవకల గురించి వార్తలు గుప్పుమన్నాయి. చాలామంది విద్యార్థులు ఆ కాలేజీని విడిచిపెట్టి వేరే ప్రారంతాలకు వెళ్ళి చదువు కొనసాగిస్తున్నారు. హొసన్న తనను కూడా మరొక మంచి ప్రాంతానికి నడిపించమని ప్రభువును ప్రార్థించింది.

## 3. నూతన సరిహద్దులు, బెలారస్

దేవుడు హొసన్నను బెలారస్‌లో విటెస్క్ అనే ఊరిలోని వైద్య కళాశాలకు నడిపించారు. బెలారస్‌ను "తెలుపు రష్యా" అని పిలుస్తారు. గతంలోని సోవియట్ రష్యా కూటమి దేశాలకు చెందిన ఒక స్వతంత్ర దేశం అది. ఈ దేశపు అధికార భాష రష్యన్. ఆమె అక్కడికి చేరక ముందే దేవుడు తన పనిని అక్కడ ప్రారంభించాడు. ఆ వైద్య కళాశాలలో అప్పటికే విశ్వాసులైన కొద్దిమంది క్రైస్తవ విద్యార్థులు తాము ఏ విధంగా ఒక సహవాసంగా కూడి ప్రభువును ఆరాధించాలి అనే విషయం ఆలోచిస్తున్నారు. వారు తరచుగా సమావేశం అవుతున్నప్పటికీ సంస్థాగతమైన, నాయకత్వపరమైన లక్షణాలు వారిలో లోపించాయి. వారంతా కలిసి ఏ విధంగా ప్రభువును ఆరాధించాలి అనే విషయం పై హొసన్న వారితో తన భావాలు పంచుకున్నది.

### హౌస్ ఆఫ్ ప్రేయర్ ఫర్ ఆల్ నేషన్స్ (హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్):

బెలారస్‌లోని విటెస్క్‌లో ఉత్సాహంతో ఉరకలు వేసే ఒక క్రైస్తవ సమాజం రూపుదిద్దుకుంటున్నది. ప్రతి ఆదివారం సుమారు 20 మంది స్త్రీ పురుషులు ఆరాధనకు సమకూడేవారు. వారి సమావేశాలకు తన గదిని వాడుకొనేందుకు ఒక విద్యార్థి సంతోషంగా అంగీకరించాడు. ఆ గుంపు అందరూ కలిసి ఒక అంతర్జాతీయ సహవాసాన్ని ప్రారంభించారు. దీనినే తరువాతి కాంలో 'హౌస్ ఆఫ్ ప్రేయర్ ఫర్ ఆల్ నేషన్స్" (హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్) అని పిలిచారు. వివిధ దేశాల విద్యార్థులు వారాంతపు సమావేశాలకు హాజరయ్యేవారు. వారిలో ఐదుగురు విద్యార్థులు ఒకరి తర్వాత ఒకరు దేవుని వాక్యాన్ని ప్రకటిస్తుండేవారు. వివిధ సంస్కృతుల సమ్మేళనంతో కూడిన వాద్యబృందం తయారైంది. వారంతా కలిసి ఐదు భాషల్లో దేవుని ఆరాధించడం ప్రారంభించారు. రష్యన్, ఇంగ్లీష్, ఘనాయన్, హిందీ, తమిళం.

వారు తమ పాటలను ఈ భాషలలోనికి అనువదించేవారు. ఈ నాలుగు భాషల్లోను ప్రావీణ్యం ఉన్న హొసన్న ఆ పాటలను అనువదించడంలో పాత్ర వహించేది. హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్.లో సామూహిక ఆరాధనపై హొసన్న దృష్టి సారించింది. ఆరాధనలో, వాద్యబృందంలో నైపుణ్యం కలిగిన విద్యార్థులను ఆమె ఆహ్వానించి చేర్చుకుంది. దానిలో పాల్గొనే ప్రతి విద్యార్థి ముఖంలో కనిపించే వెలుగు, మెరుపులో వారి ఆరాధనలోని ఆనందం స్పష్టంగా కనిపించేది.

అనేక దేశాలనుండి, విభిన్నమైన మత, సాంఘిక నేపథ్యాలనుండి వచ్చిన అనేకమంది విద్యార్థులు ప్రభువైన యేసు క్రీస్తును వ్యక్తిగతంగా సంధించి ఆయన శిష్యులుగా మారారు. హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్. చాలా ఔట్‌రీచ్ కార్యక్రమాలు జరిగించేది. హాస్టల్ గదుల్లోని ప్రతి ఒక్క విద్యార్థిని దర్శించి వారికి ఒక చిన్న బహుమతిని, ఒక సువార్త పత్రికను ఇచ్చేవారు. ఆ అంతర్జాతీయ హాస్టల్‌లోని 12 అంతస్థులలోని 600 మంది విద్యార్థులకూ అక్కడ ఒక సజీవమైన క్రైస్తవ సహవాసం నడిపించ బడుతున్నదని తెలుసు. ఈ చిన్న సాక్ష్య సమూహానికి తమ ఉపాధ్యాయులకు, ప్రొఫెసర్లకు, చివరికి తమ డీన్‌కి కూడా ప్రభువు గురించిన సాక్ష్యం చెప్పడానికి దేవుడు అవకాశాలు ఇచ్చి బలపరిచాడు.

**ప్రమాదపు అంచులలో:** బెలారస్ దేశం అప్పటికి ఇంకా కమ్యూనిస్టు సంప్రదాయపు కోరల్లోనుండి బయటికి రాలేదు. ఆరాధనా స్వేచ్ఛకు కట్టుబాట్లు విధించారు. ఒక మిషనెరీ విద్యార్థిగా హొసన్న తన సువార్త పరిచర్య నిమిత్తం ఎప్పుడూ కాలేజినుండి బహిష్కరణ, దేశం నుండి పంపివేయబడడం అనే ప్రమాదానికి లోనై ఉండేది. ఆమె తల్లిదండ్రులు ఆ విషయమై భయపడుతున్నప్పటికీ ఆమెను దేవుడే తన సంకల్పాలను నెరవేర్చుకోవడానికి అక్కడికి నడిపించాడని, కాబట్టి ఆమె విషయం ఆయనే శ్రద్ధ వహిస్తాడని వారు అర్థం చేసుకున్నారు. హొసన్న అయితే ప్రజలను క్రీస్తు దగ్గరకు నడిపించే బృహత్తర కార్యక్రమంలో భారంతో ముందుకు సాగుతూనే ఉంది.

**నాయకత్వ అభివృద్ధికై శిక్షణ:** హొసన్న అనుసరించిన వ్యూహాల్లో ప్రాముఖ్యమైనది విద్యార్థి సమాజంలో నాయకులను అభివృద్ధి పరచడం. ఒక మార్గదృకురాలిగా ఆమె సమర్థులైన విద్యార్థులను తన చేతి క్రిందికి తీసుకొని వారికి శిక్షణ నిచ్చేది. అది ఎల్లప్పుడూ 'ఒకరితో ఒకరు' అనే పద్ధతిలోనే ఉండేది. ఆయా నాయకులను తయారు చేయడంలో ఆమె ప్రతి వారంలో కొన్ని గంటలను ప్రత్యేకంగా కేటాయించుకొనేది. ఆరాధన నడిపించడం, బైబిలు బోధన, వ్యక్తిగత సువార్త పరిచర్య, మా మూడు విషయాల్లో ఆమె నాయకులకు మార్గదర్శకత్వం చేసేది.

విద్యార్థులకు బోధించడం మాత్రమే కాక, బైబిలును లోతుగా ధ్యానించడం ఎలాగో ఆమె వారికి నేర్పింది. కొన్ని పదాలను ప్రత్యేకంగా నొక్కి చెప్పడం ఆమె ఎంతో ఇష్టపడేది. "మనిషి గతాన్ని చూసి ఏడుస్తాడు; దేవుడు భవిష్యత్తును చూసి నవ్వుతాడు. దేవునిలో విశ్వాసం ఎదిగే కొద్దీ మానవునిలో ఒక కొత్త నిరీక్షణ పుడుతుంది. మనిషి తన భవిష్యత్తును చిన్న చిన్న ముక్కలుగా దర్శించ గలుగుతాడు". ఆమె తన ప్రసంగాలను ముందుగా, చక్కగా, ప్రార్థనాపూర్వకంగా సిద్ధపరచుకొనేది. వాటిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ రూపంలో, దృశ్యరూపంగా చూపించడం ద్వారా వారికి స్పష్టంగా అర్థం అయ్యేందుకు దోహదపడేది. ఎవరైతే తనను అడుగుతారో వారికి ఆ ప్రెజెంటేషన్‌ని కాపీలు చేసి అందించేది.

హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్. సభ్యులు తమ వ్యక్తిగత సువార్త పరిచర్యలో ఎంతో నైపుణ్యం చూపేవారు. వారంతా ఆ అంతర్జాతీయ హాస్టల్‌లోని ప్రతి విద్యార్థిని క్రిస్మస్ సమయంలో సువార్తతో పలకరించేవారు. కొద్ది కాలంలోనే ఆసక్తితో ఉరకలు వేసే నాయకులు హొసన్న చుట్టూ చేరారు. ఆమె ఎల్లప్పుడూ వారు ఒక ఫలవంతమైన పరిచర్యను కలిగి అభివృద్ధి పొందే అవకాశాలను కల్పిస్తూ వారిని ప్రోత్సహించేది.

**నాయకుల జీవితాల పై పెట్టుబడి:** ఆయ చోట్ల జరిగే అంతర్జాతీయ సమావేశాలకు సహవాసంలోని విద్యార్థులు వెళ్ళేలా హొసన్న వారిని ప్రోత్సహించేది. తద్వారా వారికి తగిన గుర్తింపు, నేర్చుకోవడానికి మంచి అవకాశాలు కల్పించేది. సాధారణంగా చాలామంది నాయకులైన వారు అలాంటి అంతర్జాతీయ సమావేశాలు జరిగినప్పుడు వాటిని గురించి ఇతరులకు సమాచారం అందకుండా, వాటిని చాలావరకు తమకోసం, తమవారి కోసం దాచిపెట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే హొసన్న దృక్పథం విశాలమైనది, వాక్యానుసారమైనది. నూతన విశ్వాసులను ప్రోత్సహించి వారికి సరైన గుర్తింపు కలిగించేలా ఆమె చూపే ఆసక్తిలో అది ప్రస్ఫుటమవుతుంది.

**క్రైస్తవ సాహిత్యం ద్వారా పరిచర్య:** బాల్యం నుండీ హొసన్న మంచి గ్రంథాలు చదివే అలవాటును అలవరచుకుంది. ఆమె తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ఆమెకు మంచి సాహిత్యాన్ని చదివేలా ప్రోత్సహించేవారు. ఇంటిలోనే ఆమెకు ఒక మంచి లైబ్రరీ ఉండేది. తన దగ్గర ఉన్న మంచి క్రైస్తవ గ్రంథాలన్నిటితో తన హాస్టల్ రూమ్‌లో ఒక లైబ్రరీని ప్రారంభించింది. ఇతర దేశాలలోని ఆమె స్నేహితులు కొందరు తమ దగ్గరున్న పుస్తకాలు, సిడిలు ఆమెకు పంపించారు. నూతనంగా విశ్వాసులైన వారు ఆధ్యాత్మికంగా తమ అనుమానాల నివృత్తికోసం ఆ లైబ్రరీలోని పుస్తకాలు తీసుకొని చదవడం ద్వారా క్రైస్తవ విశ్వాసం గురించి మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి అదెంతో దోహదపడింది.

హొసన్న తండ్రి ఒక మంచి రచయిత. ఆయనెప్పుడూ ఆమెను చదవడానికి, వ్రాయడానికి ప్రోత్సహించేవాడు. "మిషనెరీ విద్యార్థి" అనే పేరుతో ఆమె వ్రాసిన వ్యాసం అనేకమంది విద్యార్థులు రష్యా, చైనాలకు వెళ్ళి చదివేలా పురికొల్పింది. ఆ వ్యాసం అంతర్జాలంలో (ఇంటర్ నెట్), ఇంకా అనేక అంతర్జాతీయ ప్రచురణల్లో ముద్రించబడింది. దానిని చదివిన ఒక విద్యార్థిని దానిని తన బైబిల్లో పెట్టుకొని తాను కూడా ఒక మిషనెరీ విద్యార్థినిగా రష్యా దేవానికి వెళ్ళాలని పట్టుదలతో ప్రార్థించింది. ఆశ్చర్యకరంగా త్వరలోనే ఆమె హొసన్న చదువుతున్న కాలేజీలోనే చేరి ఆమె నడిపిస్తున్న సహవాసానికి హాజరయ్యింది. అలాగే అనేకమంది మిషనెరీ విద్యార్థులు రష్యా, చైనా, ఇతర దేశాలకు వెళ్ళి చదవడం ప్రారంభించారు.

ఆమె వ్రాసిన ఇంకా చాలా వ్యాసారు ఇ.మెయిల్స్ ద్వారా, కరపత్రాల ద్వారా ఎంతో ప్రాచుర్యం పొందాయి. అనేకమంది యౌవనస్థులు వాటి ద్వారా ప్రభావితులై తాము కూడ ఆమిషనెరీ విద్యార్థులుగా వెళ్ళడానికి తీర్మానించుకొన్నారు. ఒక మిషనెరీ దంపతులు వాటిని చదివి తమ కుమారుణ్ణి కూడ ఆ మిషనెరీ విద్యార్థిగా ప్రతిష్ఠించాలని నిర్ణయించుకొన్నారు. ఒక యౌవనస్తురాలు ఒక మిషనెరీ డాక్టరుగా వెళ్ళడానికి తనను తాను ప్రతిష్ఠించుకొంది. ఆమె 2010వ సంవత్సరంలో ఒక మెడికల్ కాలేజీలో చేరింది. ఒక పాస్టరుగారి కుమారులు ఇద్దరు తమ తల్లిదండ్రులు విడాకుల తీసుకొని విడిపోవడం వలన కలత చెంది తమ విశ్వాసంలో నుండి తప్పిపోయిన వారు హొసన్న పంపిన ఇ మెయిల్స్ ద్వారా పశ్చాత్తాపపడి క్రీస్తు దగ్గరకు తిరిగి వచ్చారు.

**బహుభాషా కోవిదురాలు:** విభిన్నమైన భాషలు నేర్చుకోవడానికి హొసన్నకు దేవుడు సహాయం చేశాడు. ఏ భాషనైనా బహు స్పష్టమైన ఉచ్చారణతో పలికేది. ఆమె ఇంగ్లీషు, తమిళం, హిందీ, సంస్కృతం, రష్యను భాషలను అవలీలగా చదవగలిగేది, వ్రాయగలిగేది. 2006వ సంవత్సరంలో రష్యా నుండి ఒక పాస్టరుగారు ఇండియా వచ్చి దాదాపు పది నగరాలను దర్శించి ఆయా సభల్లో మాట్లాడాడు. ఆయన ప్రసంగాలను రష్యను భాషనుండి హిందీలోనికి అనువదించడానికి ఎవరూ లభించకపోవడంతో హొసన్న తన సెలవు దినాల్లో ఆయనతోబాటు ఆయా నగరాలు ప్రయాణించి ఆయన ప్రసంగాలకు అనువాదం చేసింది.

## 4. సాంస్కృతిక, జాతీయ హద్దులు దాటి ఆవలివైపుకు

**హొసన్న ఒక విశ్వ పౌరురాలు:** ఆమె ఆలోచనలు ఎప్పుడూ జాతీయతా హద్దులను దాటి ఒక విశాలమైన ప్రపంచ దృక్పథంలో అన్ని సంస్కలృతలు, జాతీయతలను స్పృశిస్తూ

పయనించేవి. ఆమె ప్రతి ఒక్క వ్యక్తితోను సాదర పూర్వకంగా, గౌరవంగా వ్యవహరించేది. ఆ విదంగా చేయడంలో ఆమె బైబిలు విలువలను ఆచరణాత్మకంగా చేసి చూపించేది. ఎన్నడూ, ఏ ఒక్క వ్యక్తినీ ఆమె తక్కువగా చూసేది కాదు. చాలామంది ఆమె ఉత్తర భారతదేశంలోని రాష్ట్రానికి చెందిన వ్యక్తి అని భావించేవారే కాని తమిళనాడుకు చెందినదని ఎవరూ అనుకొనేవారు కాదు.

**స్త్రీల సమాజం:** హొసన్న వారాంతపు దినాల్లో స్త్రీలకోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహించింది. అదే విధంగా పురుషులు కూడా సమావేశం అయ్యే విధంగా ప్రోత్సహించేది. వాటికి హాజరయ్యే విద్యార్థినులు, స్త్రీలు "ఈ ప్రత్యేక స్త్రీల సమాజం మాకు పాటలు పాడుకోవడానికి, ఒకరి భావాలు మరొకరితో పంచుకోవడానికి, కలిసి ప్రార్థించుకోవడానికి, వాక్యాన్ని ధ్యానించుకోవడానికి ఎంతో మంచి అవకాశం కల్పించింది" అని ఎంతో సంతోషించేవారు. హొసన్న దేవుని వాక్యాన్ని ఎంతో అధికారపూర్వకంగా బోధించేది. లేఖనాలను బహు లోతుగా ధ్యానించి వాటిలో దాగి ఉన్న సత్యాలను వెలికి తీసి వాటిని మన అనుదిన జీవితంలో ఎదురయ్యే ప్రశ్నలకు సరైన జవాబులుగా నిరూపించడంలో హొసన్న తనకు తానే సాటి.

**దాతృత్వం అనే కృప:** "హొసన్న ప్రభువు కోసం ఇవ్వడం అంటే ఏమిటో మాకు నేర్పించింది. ప్రతి ఆదివారం మేమంతా చందా వేసుకొని దానిని కూడబెట్టేవారం. పండుగల సమయాల్లో సువార్త పరిచర్య నిమిత్తం ఆ సొమ్మును మేము వాడేవారం. ఆమె తన స్వంత ధనాన్ని ముందుగా వెచ్చించి ఆ తరువాత ఇతరులను ఇవ్వడానికి సవాలు చేసేది. ఆమె చూపిన దాతృత్వగుణం ఇతరులు ఉదారంగా ఇచ్చేలా ఎంతో పురికొల్పేది" అని ఆ సహవాసంలోని విద్యార్థులు సాక్ష్యమిచ్చారు. తన తల్లిదండ్రులు ఎంతో కష్టాలకోర్చి తన ఖర్చుల నిమిత్తం డబ్బు పంపిస్తున్నారని హొసన్నకు తెలుసు. అయినప్పటికీ ప్రభువు కోసం ఇచ్చే విషయంలో ఆమె ఎట్టి పరిస్థితులలోనూ వెనుకంజ వేసేది కాదు.

**బహిరంగ సువార్త ప్రకటన:** క్రిస్మస్‌కు ముందుగానే హొసన్న ఆ కాలేజీలోని అందరు విద్యార్థులకు, బోధనా సిబ్బందికి ప్రభువును గూర్చి ప్రకటించడానికి సహవాసంలోని విశ్వాసులను సిద్ధపరిచేది. హాస్టల్ లో నివసిస్తున్న వారందరికీ బహుమతులు కొనడానికి డబ్బు పోగుచేసేది. ఆ గదుల్లోని విద్యార్థులకు బహుమతులను ఇచ్చి వారికి క్రిస్మస్ శు భాకాంక్షలు చెప్పేందుకు విశ్వాసులను గుంపులుగా చేసి బాధ్యతలను అప్పగించేది. క్రిస్మస్ అంటే కేవలం పండుగ జరుపుకోవడానికే కాక, సువార్తను పంచుకోవడానికి అది వారికి

ఒక మంచి అవకాశం. అదే సమయంలో ఆమె వివిధ భాషల్లో సువార్త కరపత్రాలను పోగుచేసి వాటిని పంచేది.

హెూసన్న చిన్న చిన్న గుంపులను ప్రోత్సహించి వారితో ఎక్కువగా సమయం వెచ్చించేది. ఒకరిద్దరు అబ్బాయిలు లేక అమ్మాయిను చేరదీసి వారికి ఆధ్యాత్మికమైన సత్యాలను బోధిస్తూ ప్రతి ఒక్కరూ సత్యంలో, విశ్వాసంలో ఎదిగేలా ప్రోత్సహించేది. "ఈ రోజు అసాధ్యమని నేను దేనినైతే తలుస్తానో అది రేపటి దినాన తప్పక సాధ్యపడుతుంది" అని ఆమె తరచుగా చెప్తుండేది.

**పరిస్థితులను చక్కదిద్దడంలో నైపుణ్యత:** హెచ్.పి.ఎఫ్.ఎ.ఎన్ సహవాసానికి ఆమె ఒక మంచి స్థాయిని కల్పించింది. దాని ఆర్థిక వ్యవహారాల విషయం తాను నిర్వహించకపోయినా దానిని సరిగా నిర్వహించుకోవడంలో ఆమె తన సహాయసహకారాలు అందించేది.

క్రీస్తు కోసం హెూసన్న ఎల్లప్పుడూ ఎంతో భారం, గొప్ప తృష్ణ కలిగి ఉండేది తన జీవితంలో దేవునికే ఎప్పుడూ ప్రప్రథమ ప్రాధాన్యతనిచ్చేది. తన హృదయాంతరంగాల్లో దేవునిపట్ల లోతైన ప్రేమను అనుభవిస్తూ ఓటమినెరుగని ఆ ప్రేమను ప్రతి ఒక్కరూ అనుభవించాలని ఆమె కోరుకుంది. ఆమెకు ఆధ్యాత్మికత, అనుదిన జీవితం, ఈ రెండింటికీ తేడా కనిపించేది కాదు. తన జీవితాన్ని దేవునికోసం జీవించింది. దేవుడు ఆమెను ఏర్పాటు చేసుకున్నాడు. ఆమెను విద్యార్థుల మధ్య తన మహిమకోసం అద్భుతంగా వాడుకున్నాడు.

**ఆతిథ్యం:** వంటలు చేయడంలో హెూసన్నకు మంచి నైపుణ్యం ఉంది. ఆ సహవాసంలోని వారికోసం, తన స్నేహితులకోసం వంటలు చేయడం ఆమెకు ఎంతో ఇష్టమైన పని. కృపాసహితమైన ఆమె ఆతిథ్యాన్ని సహవాసంలోని సభ్యులంతా ఎంతో ఆనందించేవారు. ఎప్పటికప్పుడు కొత్త కొత్త వంటకాలను తయారుచేయడానికి ప్రయత్నించేది. ఆమె చేసిన బిర్యాని, అప్పటికప్పుడు తయారుచేసిన బ్రెడ్, కేకులు వారెంతో ఇష్టంగా భుజించేవారు.

**నాయకురాలు:** హెూసన్న ప్రభావసహితమైన ఒక గొప్ప నాయకురాలి లక్షణాలను నిండుగా పుణికిపుచ్చుకుంది. ఆమె ఎన్నడూ సహవాసంలో నాయకత్వ హెూదాను కోరుకోకపోయినా, ఆమె చేసే పనులు చూసినవారికి ఆమెలో గొప్ప నాయకత్వ లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపించాయి. ఆమె ఒక మంచి టీచరు కూడా. గీతలు, బొమ్మల సహాయంతో వైద్య విద్యను వారికి నేర్పిస్తూ ఉండేది. ఏ పని చేసినా గొప్ప ఆత్మవిశ్వాసంతో చేసేది. ఎవరైనా ఆమెకు ధైర్యం, ఆత్మవిశ్వాసం ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నిస్తే "నాలో నివసించే నా సజీవుడైన దేవుని దగ్గరనుండి" అని చిరునవ్వుతో జవాబిచ్చేది.

దేవుడు హెూసన్నకు మంచి స్వరాన్ని బహుమానంగా ఇచ్చాడు. దానిని ఆమె దేవుని మహిమార్థం ఉపయోగించింది. ఆమె సోలో పాటలు పాడగలిగేది, బృందగానాల్లో కూడా ఇతరులతో కలిసి పాడేది. పాటలకోసం ఆమె నిలబడినప్పుడు ఆమె ముఖం ఎంతో వెలుగుతో ప్రకాశించేది. కీబోర్డు వాయించడం కూడా చేర్చుకొంది. ప్రఖ్యాత క్రైస్తవ గాయకులు డాన్ మెయిన్, హిల్‌సాంగ్ సంగీతం అంటే ఆమెకెంతో ఇష్టం. ఆస్ట్రేలియాలోని హిల్‌సాంగ్ ఆరాధన కార్యక్రమంలో పాల్గొనాలనే తీవ్రమైన కోరిక కలిగి ఉండేది.

**గొప్ప క్రమశిక్షణ కలిగిన వ్యక్తి:** క్లాసులకు, ఇతర కార్యక్రమాలకు ఎప్పుడూ సమయానికి హాజరయ్యేది. ఎవరినీ తనకోసం ఎదురుచూసే విధంగా చేసేది కాదు. ఆ కాలేజీ డీన్, ఇతర అధికారులు ఆమె క్రమశిక్షణాయుతమైన జీవితాన్ని ప్రశంసాపూర్వకంగా గమనిస్తూ ఉండేవారు.

చదువును, పరిచర్యను నడిపించడాన్ని సమతూకంగా చూసుకోవడం చాలా కష్టమైన పని. అయితే ఆ రెంటినీ చక్కగా జరిగించడంలో దేవుడు హెూసన్నకు గొప్ప కృపను అనుగ్రహించాడు. ఒక ప్రక్క ఆర్థిక ఇబ్బందులు. ఆమె చదువుకు సంవత్సరానికి 6 వేల డాలర్లు అవసరమైనప్పటికీ కేవలం 2 వేల డాలర్లు మాత్రమే ఆమెకు క్రమంగా వచ్చేవి. మిగిలిన మొత్తం కోసం ఆమె కేవలం దేవునిపైనే ఆధారపడేది. కొన్నిసార్లు ఆతృతచెంది, నిరాశపడిన సమయాలు ఎదురైనా ఆ సంవత్సరాలన్నిటిలో దేవుడు ఆమె తన వైద్య విద్యను పూర్తి చేసేందుకు అద్భుతంగా సహాయం చేశాడు. ఒక వ్యక్తి తన జీవితంలో తన స్వంతగా దేనినైతే ఆశించి చేయాలని కోరుకుంటాడో దానంతటికంటే అతని జీవితంలో దేవుని చిత్తం అమలు జరగడం ఎంత శ్రేష్ఠమైనదో చెప్పడానికి బెలారస్‌లో ఆమె గడిపిన విద్యార్థి జీవితం గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది.

**బెస్ట్ స్టూడెంట్ అవార్డ్:** హెూసన్న ఎప్పుడూ తన చదువును నిర్లక్ష్యం చేయలేదు. “నేను ఇతరుల్లాగా తెలివైన దానిని కాదు గాని, నేను దేవుని కోసం పనిచేశాను., దేవుడు నన్ను హెచ్చించాడు” అని ఆమె ఎప్పుడూ చెప్తూ ఉండేది. ఆమె చదివిన యూనివర్సిటీలో రష్యాయేతర విద్యార్థులకు బెస్ట్ స్టూడెంట్ అవార్డులు ఎన్నడూ ఇచ్చేవారు కాదు. అప్పటికి ఆ అవార్డు పొందిన అతి కొద్ది రష్యాయేతరులలో హెూసన్న ఒక వ్యక్తి కావడం విశేషం.

## ముంచుకొచ్చిన వ్యాధి

2009వ సంవత్సరములో ఆమె ఎదుర్కొన్న ఆరోగ్య సమస్య వలన ఆమె ఒక సంవత్సరం చదువు కోల్పోవలసి వచ్చింది. ఎలాగోలా ఆరోగ్యం కూడగట్టుకొని ఆమె తన

చదువును కొనసాగించడానికి తిరిగి వెళ్ళింది. ఆమెతో కలిసి చదివిన క్లాసుమేట్స్ పై క్లాసులకు వెళ్ళిపోయారు.ఆ సమయంలో ఆమెకు ఒక స్వప్నం కలిగింది. ఆమె తన స్నేహితులతో కలిసి ఒక రైల్లో ప్రయాణిస్తూ ఉంది. రైలు ఒక స్టేషన్‌లో ఆగినప్పుడు ఆమె స్నేహితులంతా దిగిపోయినా ఆమె మాత్రం దిగిపోకుండా తన ప్రయాణం ముందుకు కొనసాగించింది. బహుశా ఆమె తన అంతిమ గమ్యానికి ప్రయాణిస్తున్నదేమో ఆ కలను ఆమె అంతగా పట్టించుకోలేదు.

2010 అక్టోబరులో ఆమెకు చిన్న చిన్న అంటురోగాలు సోకాయి. బెలారస్‌లో ఉండగా ఆమె వాడిన మందులకు ఏమీ ఫలితం కలుగలేదు. ఆమె తన స్వరాన్ని కోల్పోయింది. ఏమైనా తన చదువును పూర్తి చేయాలని ఆమె భావించింది. 2011లో ఇండియాకు ప్రయాణమైంది. తన డిగ్రీ ప్రధానోత్సవానికి కొన్ని వారాలు మాత్రం సమయం ఉంది. ఒక నెల మెడికల్ లీవు తీసుకొని 2011 జూన్ నెలలో జరిగే డిగ్రీ ప్రధానోత్సవానికి తిరిగి వెళ్తాననే నమ్మకంతో ఇండియాకు తిరిగి వచ్చింది.

చెన్నయ్‌లోని ఆసుపత్రులలో వైద్య సహాయం తీసుకున్న తరువాత ఫిబ్రవరి నెలలో వెల్లూరులోని క్రిష్టియన్ మెడికల్ కాలేజికి తరలించబడింది. అక్కడ ఆమెకు వచ్చిన జబ్బు 'మల్టి డ్రగ్ రెసిస్టెంట్ ట్యూబర్కులోసిస్' (ఎమ్‌డిఆర్‌టిబి) అని నిర్ధారించారు. తీసుకున్న మందులన్నీ పని చేయకపోగా ఆమెపై దుష్ప్రభావం చూపే ఆ జబ్బు వలన వాంతులు కాకుండా రోజుకు మూడుసార్లు మందులు వేసుకున్నప్పటికీ రోజూ ఆమెకు వాంతులవుతూ ఉండేవి.

ఒక ఎక్స్‌రే పరీక్షలో ఆమె జబ్బు మరింత ముదిరిపోయిందని తెలిసింది. చాలా మంది నిష్ణాతులైన డాక్టర్లు హెూసన్నకు వైద్యం చేశారు. వారిలో ప్రఖ్యాతి గాంచిన ఒక ప్రొఫెసర్ "ఆమె జీవించడానికి 50 శాతం అవకాశం మాత్రమే ఉంది. సామాన్యంగా ఆ జబ్బుతో మా దగ్గరకు వచ్చిన ప్రతి ముగ్గురిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు" అని విస్పష్టంగా చెప్పాడు. డాక్టర్ల సలహా మేరకు ఆమె శరీరం సహకరించక పోతున్నప్పటికీ ముందులను కొనసాగించారు. ఒక డాక్టరయితే ఆమె పొట్ట భాగాన్ని కోసి తెరచి మందులను నేరుగ పేగుల్లో పెట్టవచ్చని సూచించాడు. అయితే హెూసన్న దానిని తిరస్కరించింది.

ఇక వేరే మార్గం లేక ఆమె తల్లిదండ్రులు ప్రాచీన సాంప్రదాయిక వైద్యమైన సిద్ధ ఆయుర్వేదాన్ని ప్రయత్నించి చూద్దామని ఆలోచించారు. పదే పదే వాంతులు కావడం వలన ఆమె ఆరోగ్యం అప్పటికే బాగా క్షీణించింది. కనీసం బాత్‌రూమ్‌కి నడిచి వెళ్ళడానికి

కూడా కష్టమైపోయింది. ఎవరో ఒకరు దినమంతా ఆమెకు సహాయంగా ఉండాల్సి వచ్చింది.

మొదట్లో ఆమె తాను బాగుపడి జీవించాలని కోరుకున్నప్పటికీ, ఆ తరువాత ఆ కుటుంబమంతా కలిసి ఆ విషయంలో ప్రార్ధనలో కనిపెట్టి చివరికి దేవుని చిత్తానికి ఆమెను అప్పగించారు. కేవలం కొద్ది సంవత్సరాలే అయినప్పటికీ ఆమె తల్లిదండ్రులు హొసన్న లాంటి కుమార్తెను తమకు ఇచ్చినందుకు దేవునికి వందనాలు చెప్పారు.

హొసన్న చనిపోవడానికి మూడు నెలల ముందు ఆమెకు ఒక దేవదూత ఆమె దగ్గరకు వచ్చినట్లు ఒక దర్శనం కలిగింది. కొంతకాలం పాటు ఆమె తల్లిదండ్రులు ఆమెకు ఆయుర్వేద వైద్యం అందించారు. కొడైకెనాల్ దగ్గరలోని అండిపట్టి అనే ఊరికి ఆమెను తీసుకెళ్ళారు. రెవరెండ్ ప్యాట్రిక్ జాషువగారు అక్కడ ఉన్న సహో. పి.ఎ.జేసుదాసన్ దంపతుల ఇంటిలో ఆమె ఉండి వైద్యం పొందే ఏర్పాటు చేశారు. ఆ దంపతులు ఎంతో దయతో ఆమెను చేర్చుకొని అక్కడి ఆయుర్వేద డాక్టరు దగ్గర అన్ని వైద్య సదుపాయాలు పొందేలా చూశారు.

ఆ ప్రాంతం మంచి ప్రశాంత వాతావరణంతో వైద్య చికిత్సకు అనువుగా ఉంది. జేసుదాసన్ గారు ఆయన సతీమణి, హొసన్న విసయంలో ఎంతో శ్రద్ధ చూపారు. హొసన్న, ఆమె కుటుంబం వారికి తెలియకపోయినా తమ ఆతిథ్యమిచ్చి ఆదరించడానికి కారణం కేవలం వారిలోని క్రీస్తు ప్రేమ తప్ప మరేదీ కాదు. హొసన్న లోలోపల విపరీతమైన బాధ ఉన్నప్పటికీ పైకి చాలా ధైర్యాన్ని కనపరిచేది. తన జీవితంలో ఏదైనా గొప్ప అద్భుతం జరిగి తాను బాగుపడేలా చేయమని లేక తనను తన పరలోకపు ఇంటికి తీసుకెళ్ళమని దేవునికి ప్రార్థించమని ఆమె ఇతరులను అడుగుతుండేది. ఆమె తన తల్లితో "దేవుడు కేవలం నా ఊపిరి తిత్తులను బాగుచేస్తే చాలు, కనీసం నేను ఒక వీల్ చెయిర్‌లో కూర్చుని నా జీవితమంతా ఆయన సేవ చేస్తాను" అనేది.

మార్కు 5:26 "తనకు కలిగినదంతయు వ్యయము చేసుకొని యెంత మాత్రమును ప్రయోజనము లేక మరింత సంకటపడెను".

తన అనారోగ్యాన్ని బట్టి మాత్రమే కాక, తాను తీసుకునే మందుల వలన కూడా మరింత బాధపడింది. సెప్టెంబరు 2వ తేదీన ఆమె "నేను చనిపోబోతున్నాను" అని చెప్పింది. ఆమె తండ్రి ఆమెను మందలించాడు. ఆయనే తన చేత్తో తినిపిస్తుండగా ఆమె భోజనం చేసి, పళ్ళరసం తీసుకుంది. ఆమె తల్లి రోజీ ఆమెకు స్నానం చేయించింది.

హెూస్న ఎంత అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఎప్పుడూ చిరునవ్వుతో కనిపించేదని ఆమె తల్లి గుర్తుచేసుకుంది.

అదే రోజు మధ్యాహ్నం 12 గంటకు హెూసన్న స్పృహ కోల్పోవడం ప్రారంభించింది. ఆమెకు ఊపిరి తీసుకోవడం కష్టమైపోయింది. సాయంత్రం 4 గంటల సమయానికి ఆమె తన ఆఖరు శ్వాస విడిచి తాను ప్రేమించి, సేవించిన తన యజమాని దగ్గరకు వెళ్ళిపోయింది.

సెప్టెంబరు 3వ తేదీన హెూసన్న అంత్యక్రియలు క్రిస్టియన్ అసెంబ్లీ విశ్వాసుల మధ్య జరిగాయి. చెన్నయ్‌లోని రాయపురంలో ఆమెను సమాధి చేశారు. సమాజంలోని అన్ని రంగాల్లోని ఆమె స్నేహితులు, పాస్టర్లు, మిషన్ నాయకులు ఆమె సమాధి కార్యక్రమానికి వచ్చి ఆమెకు తమ అంతిమ నివాళులు అర్పించారు. ఆమెతో చదివిన స్నేహితులు కొందరు ఇండియాలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చి దు:ఖంలో ఉన్న కుటుంబాన్ని ఆదరించారు. ఆమె తల్లి కోరిక ప్రకారం హెూసన్న భౌతిక కాయానికి ఒక పెండ్లి కుమార్తెగా వస్త్రాలంకరణ చేశారు. హెూసన్న తన మరణంలో సహితం చిరునవ్వు నవ్వుతూనే ఉంది. ఆమె సేవా దృక్పధం నేటి తరానికి మేల్కొలుపు కావాలి. ప్రతి విద్యార్థి మిషనెరీ కావాలి. ఆమె జీవితం గొప్ప ఆదర్శనీయం సువార్త ప్రకటించు వారి పాదాలు సుందరాలు. దేవునికే మహిమ కలుగును గాక. ఆమెన్.

---------

## 45. మోడుబారిన నా జీవితాన్ని చిగురింపజేసిన నా రక్షకుడు క్రీస్తు

**సుజాత గవిని**

**యాహోను 25:2**

**"నా దేవా నీయందు నమ్మిక యించి యున్నాను. నన్ను సిగ్గుపడనీయకుము"**



**పరిచయము:-** యేసుక్రీస్తు పేరిట మీకు నా వందనములు. ఈ సాక్ష్యము వివరించు అవకాశమిచ్చిన దేవునికే స్తుతి కల్గుగాక. నా పేరు సుజాత నేను 10వ తరగతి ముగించిన తరువాత నర్సింగు ట్రైనింగ్ పూర్తి చేశాను. నేను అన్యుల కుటుంబంలో జన్మించినందున పూజలు చేస్తూ విగ్రహాలనే ఆశ్రయించేదానిని. హిందూ దేవుళ్ళు దయ చూపిస్తారని శ్రద్ధగా పూజలు చేసేదాన్ని. నా తల్లిదండ్రులు నాకు నా 13వ యేటనే వివాహము చేసినారు. చాలా అమాయక స్థితిలో నేను వివాహానుభవం ఎదుర్కొన్నాను. నాకేమీ తెలిసేది కాదు. నా భర్త అన్ని వ్యసనాలకు బానిసగా జీవిస్తూ త్రాగుడు, వ్యభిచారములో మునిగిపోయేవాడు. నాకు తెలియని స్థితిలో నా భర్త స్థితి చూసి చాలా దుఃఖపడ్డాను. చాలా సమస్యలు ఎదుర్కొనవలసి వచ్చినది.

ప్రతి దినమూ నన్ను బాధించేవాడు త్రాగివచ్చి నన్ను కొట్టి హింసించేవాడు నాకు అదే స్థితిలో ఇద్దరు బిడ్డలకు తల్లినయ్యాను. నా జీవితంలో సుఖం, ప్రేమ అనుభవించలేదు. నాకు తెలిసినవారు, క్రీస్తును నమ్మిన విశ్వాసులు నాకు పరిచయం అయ్యారు. క్రీస్తు ఆదరించి ప్రేమించి పరిస్థితులను మార్చు శక్తిమంతుడని చెప్పేవారు. వారు వెళ్లు ప్రార్థనా మందిరము నేనుండే ఇంటికి సమీపముగా ఉండేది. నేను ఆ మందిరానికి వెళ్ళిననూ నాకు శాంతి లభించలేదు. నా జీవిత భారం భరించరానిది అయినది. నేను నా భర్త వేధింపులను భరించలేక నా తల్లిదండ్రుల సహకారంతో నా భర్తకు విడాకుల పత్రాలు పంపాను. త్వరలో నా బాధల సాక్షాలధారంలో నాకు విడాకులు లభించాయి. అయినను నా ఒంటరి తనంలో నా యిద్దరి బిడ్డలతో పోషణ చాలా భారం అయినది. నేను ఆ ప్రాంతాన్ని విడిచిపెట్టి మరొక కొత్త ప్రాంతము చేరాను. నేను చదివిన నర్సు కోర్సు నాకు ఆధారమయినది. ఒక ఆస్పత్రిలో నర్సుగా ఉద్యోగాన్ని ఆరంభించాను. దగ్గరగా ఉన్న క్రైస్తవ దేవాలయమునకు వెళ్లి ఆరాధనలలో పాల్గొనేదాన్ని. కొంత మనస్సుకు నెమ్మది కలగినది. ఆస్పత్రిలో జీతము సరిగ్గా లేనందున క్రొత్త డాక్టరుగారి వద్ద ఉద్యోగాన్ని ఆరంభించాను. ఈ రెండవ డాక్టరుగారు

దయగలవారు నా పరిస్థితిని గ్రహించినవారై నన్ను చాలా ఆదరణతో దయతో చేసేవారు. దేవునికే స్తుతి చెల్లించినాను. నా తల్లిదండ్రులు నన్ను విడిచిననూ దేవుడే నన్ను ఆదుకొన్నారు.

కీర్తనలు 27:10-14 వాక్యాలు నన్ను చాలా ఆదరణ కల్గించాయి.

**నా జీవితానికి ఆధారము లభించినది:**

నేను క్రీస్తును నమ్మి ఆయనను ఆరాధించుట ఆరంభించిన తరువాత నా జీవితానికి క్రొత్త మలుపు లభించినది. నేను పని చేస్తున్న డాక్టరు దగ్గరకు ఒక వ్యక్తి కాలు సమస్యతో చేరాడు. అతని కాలుకు ఆపరేషన్ చేయవలసిన స్థితిలో ఆయనను ఎవరూ ఆదుకునేవారు లేరు. అతని తల్లిదండ్రులు వారి పనులభారం వలన అతనిని కనిపెట్టి చూడలేని స్థితిలో ఒంటరిగా బాధపడుట గమనించాను. నేను మొదట జాలిపడి ప్రేమతో సేవలు చేయుట ఆరంభించాను. నేను చూపిన పరిచర్యకు ప్రతిఫలంగా అతను నన్ను ప్రేమించానని చెప్పాడు. నేను కూడా అతనిని అంగీకరించాను. నా పరిస్థితి చెప్పాను. విడాకులు తీసుకున్నాననియు, ఇద్దరు బిడ్డలకు తల్లిగా ఉన్నానని తెలిపాను. నా పరిస్థితి తెలిసికొన్ననూ, నాతో వివాహానికి సమ్మతించి, నన్ను నా బిడ్డలను సంరక్షిస్తానని మాట యిచ్చాడు. నేను ప్రార్ధనా పూర్వకముగా కనిపెట్టి వాగ్దానాన్ని పొందాను.

యెషయ 61:7,8

దేవుడే నాకిచ్చిన నడిపింపును బట్టి నేను పెండ్లి చేసుకొన్న విజయ కుమార్‌గారి ఆత్మీయ జీవితము పట్ల శ్రద్ధ వహించాను. నేను కూడా అన్యుల నుండి క్రీస్తును వెంబడిస్తున్నానని చెప్పి మందిరానికి రావాలని కోరినాను. క్రమంగా దేవాలయినికి రావడం ఆరంభించారు. ఆయనలో మొదట మొండితనంతో నిరాకరణ ఎదుర్కొన్ననూ పట్టదలతో ప్రార్థించగా ఆయనలో మార్పును చూశాను. ఆయన కాలు నొప్పి తీవ్రమయినప్పుడు దేవునికి ప్రార్థించి నెమ్మది పొందినందున మారుమనస్సు అనుభవాన్ని అందుకున్నారు. నేను 2013లో సంఘంలో క్రమముగా నీటి బాప్తీస్మము తీసుకొన్నాను. నా భర్తకు కాలునొప్పి వలన ఆపరేషన్ జరుగుటకు దాదాపు 4 లక్షలు సొమ్ము అవసరమైనది. కేవలము ప్రార్ధన ద్వారా అద్భుతంగా 30 వేలులో ఆపరేషన్ పూర్తి అయినది. స్వస్థత లభించిన అద్భుతం చూశాము. నా జీవితంలో ఒంటరితనంలో దేవుడు ఆదరించి క్రొత్త జీవితాన్ని ప్రసాదించారు. ప్రార్థన ద్వారా నా భర్తను రక్షించుకోగలిగాను.

ప్రియ చదువరీ నీవు కూడా క్రీస్తే నిజమైన దేవుడని నమ్మి ప్రార్థించుకో దేవుడు దీవించు గాక ఆమెన్.....

## 46. మరణపు అంచులు తాకిన నా జీవితాన్ని రక్షించిన జీవాధిపతి నా క్రీస్తు

**విజయ కుమార్**

యెహాను 14 “ **నేను మార్గమును సత్యమును జీవమునై యున్నాను**”



**పరిచయము:–** ప్రభువు నామములో మీకు వందనములు. నేను హైందవ కుటుంబములో, విగ్రహాలు పూజించే కుటుంబంలో జన్మించాను. నేను బి.ఎ. చదివినాను. అదనముగా ఐ.టి.ఐ. ఆటోమొబైల్ కోర్సు కూడా చేశాను. పూజలు, యాత్రలు చేస్తూ బాల్యమును గడిపాను. సరియైన శిక్షణ కరువైనందున చెడు అలవాట్లుకు గరైనాను. సిగరెట్టు త్రాగుట, మద్యపానము సేవించుటకు అలవాట పడ్డాను. ఆ రీతిగా నా జీవితము కొనసాగించే రోజులలో ఒక ఉద్యోగము నా 22వ సంవత్సరములో లభించినది. వ్యర్ధమైన జీవితంలో నాకు ఒకనాడు సైకిల్ ప్రమాదము ఎదురైనది నా తుంటి ఎముకకు తీవ్ర గాయమైనది. వెంటనే గుంటూరు ప్రైవేటు ఆస్పత్రిలో చేరాను. అక్కడ ఆపరేషన్ చేశారు. తుంటి భాగమునకు ఆధారమునకు కొన్ని స్క్రూలు అమర్చినారు. 6 నెలలు గడిచిననూ నా గాయమునకు ఉపశమనము రాలేదు. ఆపరేషన్ విజయవంతం కాలేదని గ్రహించాను. నొప్పి తగ్గలేదు. తిరిగి మరొక ఆసుపత్రి ఎన్.ఆర్.ఐ. ఆసుపత్రిలో చేరాను. మరలా సంవత్సరము గడిచిననూ ఏమీ మార్పు రాలేదు. నొప్పి తగ్గలేదు. మరొక ఆసుపత్రి తిరుపతి వెళ్లి చేరాను. మరలా ఆపరేషన్ చేశారు. అప్పటికి నాపై మూడుసార్లు ఆపరేషన్ నిర్వహించుట సంభవించినది. ఫలితము ఏమీ రాలేదు. ఎముకలలో రక్త ప్రసరణ లేనందున ఎముకలు క్షీణించి క్రుళ్ళిపోయాయి. ఆ ఎముక గాయము చివరకు క్యాన్సరుగా మారింది. మరొకసారి చీరాల ఆసుపత్రికి వెళ్ళి చూపించాను. ఎముక తీసివేయాలన్నారు. ఆసుపత్రిలో ట్రీట్‌మెంటునకై తగిన ఆర్థిక స్తోమత సరిపోలేదు. కృత్రిమ అవయవము అమర్చాలన్నారు. మరణము తప్పదని హెచ్చరించారు. ఇక చేసేది లేక అప్పులు చేసి కృత్రిమ అవయవము అమర్చుటకు నిర్ణయించుకొని చికిత్స చేయించుకున్నాను. నొప్పి మాత్రము ఏమీ తగ్గనందున రోజుకు నొప్పి నివారణకై 5 నుండి 8 మాత్రలు వాడేవాడిని. నడవలేని స్థితి ఏర్పడినది. నేను ఆసుపత్రిలో చివరిగా ఆపరేషన్ చేయించుకొన్న రోజులలో ఒక నర్సు నాకు చాలా ఓర్పుతో, ప్రేమతో పరిచర్య చేసింది. నా తల్లిదండ్రులు వారి జీవనోపాధి నిమిత్తము నిమగ్నమైనందున నా కొరకు ఆస్పత్రిలో కనిపెట్టి చూసుకొను సమయము నా కొరకు

వినియోగించలేకపోయారు. ఒంటరిగా బాధ అనుభవించేవాడిని. నాకు పరిచర్య చేసిన నర్సు క్రీస్తును నమ్మిన విశ్వాసి గనుక

:: **2** ::

నా పట్ల శ్రద్ధ వహించి నాకు క్రీస్తును గూర్చి సువార్త తెల్పి, ఆయన స్వస్థపరచు దేవుడనియు, ప్రేమ కనికరములు గలవాడని నన్ను నమ్ముకోవలసినదిగా సలహా ఇచ్చేది. నేను ఏమాత్రము లక్ష్యము చేయలేదు. నీవే నా కొరకు ప్రార్థించు అని చెప్పాను. ఆమె సపరిచర్యలు ఫలితంగా నాకు ఆమె పట్ల ప్రేమ ఏర్పడగా వివాహము చేసుకొన్నాను. నాకయితే పూర్తిగా నొప్పి తగ్గలేదు. నేను చాలా మొండివాడిగా ఉన్నాను. ఆమె ప్రార్థనా జీవితము నన్ను క్రమముగా మార్చి వేసింది. ఆమె చూపిన ప్రేమ వలన క్రీస్తు ప్రేమను నేను కనుగొన్నాను. నా కుటుంబీకులంతా అన్యులైనందున నా క్రొత్త విశ్వాసాన్ని, నా వివాహాన్ని వారు అంగీకరించలేదు. నన్ను వ్యతిరేకించినారు. నేను లక్ష్యపెట్టలేదు. ప్రార్థనా మందిరమునకు నా భార్యతో వెళ్లి క్రీస్తు విశ్వాసులతో కలిసి ఆరాధనలలో పాల్గొనేవాడిని. నా మనస్సు చాలా ప్రశాంతముగా మారింది. నా పాపాలకై పశ్చాత్తపపడి క్రీస్తును రక్షకునిగా స్వీకరించాను. మారుమనస్సు జీవితము చాలా ఆనందం కలిగించినది.

**క్రొత్త అనుభవాలను ఎదుర్కొనుట:**

నా వివాహము మారు మనస్సు పొందిన సంవత్సరం 2010వ సంవత్సరంలో జరిగింది. దేవుడు తన ప్రత్యేక ఉద్ధేశ్యము కొరకై ఏర్పారుచుకొన్నారని తెలిసికోగలిగాను. యెషయా 41:9-12 వాక్యము ద్వారా ప్రభువు నాతో మాట్లాడారు.

నా నొప్పి సమస్య పూర్తిగా సమసిపోలేదుగాని, నీకు తోడైయున్నాననియు, బలపరుస్తాననియు సహాయము చేయుటకు తీక్షణ హస్తములలో ఆదుకుంటాననియు, నన్ను కోప్పడినవారంతా సిగ్గుపడతారని తెల్పారు. నా శరీరంలో ఎముకలు పాడైపోతున్నాయని తెలుస్తునే ఉంది. క్రొత్త డాక్టర్లును సంప్రదించాను. దాదాపు 4 లక్షలు ఖర్చు అవుతుందనియు 6 నెలలు చికిత్స కావాలని తెలిపేవారు. దిక్కులేని స్థితిలో, డబ్బులు లేని పరిస్థితులలో కేవలము ప్రార్థనను ఆశ్రయించాము. సంఘమంతా అత్యాసక్తితో ప్రార్థించారు. నేను క్రీస్తును నమ్మి ఆయనను వెంబడిస్తూ క్రమంగా ఆరాధనలలో పాల్గొంటున్న రీతిని బట్టి సైతాను నాపై దాడి చేసి నన్ను, నా విశ్వాసాన్ని కృంగదీయాలని ప్రయత్నిస్తున్న సైతానుపై విజయము కలిగినట్లు భావంతో ప్రార్థించాలని దైవజనుడు తెలిపారు. ఆ తరువాత 2013 క్రిస్మస్ కాలంలో మరొక ప్రమాదానికి గురైనాను. రైలుట్రాక్ దాటుసమయంలో

పడిపోయినాను. మరణించానని అందరూ తలంచారు. వెంటనే స్పృహ వచ్చి లేచాను. ప్రభువు మరలా నాతో జీవాన్ని ఇచ్చి బ్రతికించారు. ఆయనను నమ్మినందున నన్ను రక్షించారని నమ్మి దేవుని స్తుతించాను.

**:: 3 ::**

**క్రీస్తు వాక్యం ద్వారా మరలా నాతో మాట్లాడారు.**

కీర్తనలు 118: 13-20

**యెహోవా నా రక్షణాధారము నేను పడిపోవునట్లు గట్టిగా త్రోసితివి నాకీ సహాయము చేయుము.**

నేను నా భార్య ప్రార్థన చేయు సమయంలో ఆయన తన చిత్తాన్ని స్పష్టంగా మాకు బయలు పరిచారు. ఒక డాక్టరుగారు చికిత్సకై 3 లక్షలు అవసరమన్నారు. మరొక డాక్టరుగారు ఒంగోలులో కృత్రిమ అవయవము తీసివేస్తానని అభయమిచ్చారు. నేను ఆలోచించసాగాను. దైవ జనునితో ప్రార్థించి సంప్రదించగా రెండవ డాక్టరు సలహా మేరకు కృత్రిమ అవయవాన్ని తీసివేయు ఆపరేషన్ జరిగించారు. అది నాలుగు గంటలు పట్టినది. రక్తము ఏమీ లోపం లేని స్థితిలో దేవుడే అద్భుతంగా జరిగించారు. మరొకసారి వాక్యం ద్వారా నన్ను ధైర్యపరిచారు.

యెషయా 57:16 నుండి 20 వచనాలు నేను స్వతంత్రించుకొన్నాను. ఆపరేషన్ జరిగిన నెలలోపే నేను సరిగా నడవగలిగినాను. అద్భుత స్వస్థత పొందాను. నేను నా సంఘస్తుల సమక్షములో ప్రార్థించి సాక్ష్యము వివరించాను. దేవుడు అద్భుతంగా ఆపరేషన్ ఖర్చులు డాక్టరు తీసుకోలేదుగాని కొన్ని లక్షల ఖరీదు గల ఆపరేషన్ కేవలం రూము రెంటు, మందుల కొరకు కొన్ని వేలు మాత్రమే సరిపోయాయి. ప్రభువు అద్భుతంగా సహాయ పడ్డారు. దిక్కులేని స్థితిలో ప్రభువు నాపట్ల చూపిన కృపకై ఏమి చెల్లించగలను? నా రక్షణ పాత్రను చేబూని నిండు హృదయంతో కృతజ్ఞత సమర్పిస్తూ క్రీస్తుకై నా జీవితాంతము సాక్షిగా జీవిస్తూ ఆయనను మహిమపర్చుటకై నిర్ణయించుకున్నాను. నా జీవితం ఆయన కొరకే అర్పించగలను. నా సాక్ష్యము మీకు మేలుకరంగా విశ్వాసాన్ని అభివృద్ధి పర్చాలని నా రక్షకున్ని ప్రార్థించుచున్నాను. ప్రభువు మిమ్ములను దీవించునుగాక ఆమెన్.....

# 46. అద్భుతాలు చేయు క్రీస్తు నన్ను మరణము నుండి రక్షించిన రక్షకులు

**యార్లగడ్డ విశాల్, విజయవాడ.**

**కీర్తనలు 119:71** **"నీ కట్టడలను నేర్చుకొనుటటకు శ్రమనొంది యుండుట నాకు మేలాయెను"**



**పరిచయము:-** నా పేరు ప్రభు విశాల్, నా తల్లిదండ్రులైన విద్యాసాగర్‌గారు, విజయలక్ష్మిగార్లకు ఏకైక పుత్రునిగా జన్మించాను. 1996వ సంవత్సరము అక్టోబరు 24వ తేదీన జన్మించాను. నా తల్లి మంచి వశ్వాసి. ఆమె తన విశ్వాసాన్ని అమ్మ, అమ్మమ్మగార్ల నుండి పొందిననూ నేను పుట్టిన తరువాత బాప్తీస్మ అనుభవాన్ని పొందింది. ఆమె జీవితంలో చాలా అద్భుతాలు చవిచూసింది. నేను బాల్యము నుండి యిదే విశ్వాసములో ఉన్నాను.

క్రీస్తును నా స్వంత రక్షకునిగా స్వీకరించలేదు. ఆచార క్రమంలో కొనసాగాను. కొన్ని ప్రమాదకరమైన అనుభవాలు నన్ను క్రీస్తును గూర్చి మరింతగా తెలిసికొనే ధన్యతనిచ్చాయి.

నా తల్లికి కూడా అదే అద్భుతము చేసిన క్రీస్తు ఎన్నో విలువైన జీవిత పాఠాలు నేర్పించారు. నా తల్లి విజయలక్ష్మి తన 15వ ఏట తీవ్రమైన జ్వరము వాంతుల వలన చాలా క్షీణస్థితిని చేరిందని ఎందరో గొప్ప డాక్టర్లను సంప్రదించిననూ ఏమీ తగ్గలేదు. మరణము తప్పదని చాలా దుంఃఖంలో ఉండగా క్రీస్తే స్వస్థపరచు దేవుడని అందరూ ఆయననే ఆశ్రయించి ప్రార్థించగా నా తల్లి వైద్య రిపోర్టు చాలచోట్ల పంపి ప్రార్ధనలో కనిపెట్టారట. ఆ రోజుల్లో అద్భుతంగా ఆ రిపోర్టులు ఫలితము చూసి కేవలం ఫుడ్ పాయిజన్ వలన జరిగిన ప్రమాదమని నిర్దారణ చేయగా దేవుని స్తుతించి మరింత విశ్వాసంతో ప్రార్ధించిందట. ఆమె పెదపూడి ఇష్మాయేలుగారి సహవాసంలో ప్రార్ధన వాక్యము పరిశుద్ధాత్మ నడిపింపు, విజ్ఞాపన ప్రార్ధనల ప్రభావాన్ని గూర్చి వివరంగా తెలిసికొని ఆత్మీయంగా బలపడేది. కేవలము స్వల్ప మందులు ప్రార్ధన ఫలితంగా నా తల్లిపూర్తిగా స్వస్థత పొందింది. నా తల్లి వివాహము నాటికి నాన్నగారు విశ్వాసి కానందున అన్యుల వివాహము చేయలేక సోషల్ మ్యారేజ్ జరిగింది. ఆ తర్వాత నేను పుట్టుటకు 20 రోజల

ముందు అమ్మ ఒకరి ఇంట్లో వుండగా తెల్లవారు సమయంలో నా తల్లి ఒంటరిగా నుండగా గొప్ప శబ్ధమును విన్నదట. భయంతో ఆమె వున్న పెంకుటిల్లు నుండి బయటకు వచ్చిన వెంటనే, పెళ పెళమని యిల్లంతా కూలి పోయింది. అమ్మ బ్రతికిందో లేదోనని అంతా చేరి ఆమె బయటకు వచ్చిన రీతి ఆశ్చర్యం కల్గించింది. ప్రభువే

:: **2** ::

ఆమెను రక్షించి పిలిచి ప్రాణము నిలబెట్టారు. నేను 20 రోజుల తర్వాత పుట్టినపుడు నాపై నరాలు ముడిపడి యుండగా ప్రధమ దినాన ఆపరేషన్ చేసారట. నేను బ్రతకాలని మా నాన్న యేసును ధ్యానించగా నాకు కల్గిన స్వస్థతను బట్టి ఆ రోజే మా నాన్న విగ్రహాలన్ని దూరం చేసికొని ప్రభుని నమ్మారు. మా అమ్మా నాన్నల విశ్వాస ఫలితంగా నాకు మంచి క్రైస్తవ వాతావరణంలో జీవించే ధన్యత కల్గింది. మా అమ్మ పుట్టిల్లు ఘంటసాల పాలెము. మా నానమ్మ గారిది ముదునూరు. వారంతా క్రీస్తును నమ్మారు. వారు క్రైస్తవ సువార్త అందించిన ఫలితంగా విగ్రహాలను వదలి క్రీస్తును నమ్మినందున ఎన్నో శ్రమలు ఎదుర్కొన్నారు. మా నాన్న అమ్మగార్లు ఈ శ్రమల ధాటికి దూరంగానే ప్రశాంతంగా ప్రభుని నమ్ముటను బట్టి వారు విజయవాడలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కొనసాగుచూ సమీపంలో గాస్పిల్ చర్చ్ సహవాసంలో జోసెఫ్ మోజెస్ గారు ఆనీ అంటీలు నిర్వహించే ఆత్మీయ సన్నిధిని బట్టి మా కుటుంబమెంతో ఆనందంలో సంతోషంలో మంచి విశ్వాసుల పరిచయాలలో క్రమంలో సాగిపోవుట దేవుని కృపయే. మేము గత 16 సంవత్సరాలుగా గొప్ప ఆత్మీయ అద్భుతాలను ఎదుర్కొని సాక్షులుగా జీవిస్తున్నాము. నా బాల్యం నుండి జోసెఫ్ అంకుల్ గారు ఆనీ అంటీలు నిర్వహించే సండే స్కూలు అనుభవాలు నాకు విశ్వాసంలో పునాదిగా నిలిచాయి.

**బాల్యంలో కాన్సర్ వ్యాధి ఎదుర్కొనుట:**

నా బాల్యంలో 9 సంవత్సరముల వయస్సున్నపుడు అకస్మాత్తుగా నా కాలిలో సన్నగా నొప్పి ఆరంభమై తీవ్రమయింది. విజయవాడలో ప్రముఖ డాక్టర్ల వద్ద వైద్యము చేయించాము. సిటి స్కాన్, ఎమ్.ఆర్.ఐ.లు. జరిగాయి. వారి జ్ఞానంలో యిది ఎముకల క్యాన్సరుకు సంబంధించిన నొప్పిగా నిర్ధారణ చేశారు. హైదరాబాద్‌లో పెద్ద ఆస్పత్రిలో చూపించుకోవాలని సలహానిచ్చారు. నిమ్స్ ఆస్పత్రిలో మరలా విభిన్న పరీక్షలు చేశారు. వారు కూడా ఎముకలలో క్యాన్సర్ అని పూర్తిగా నిర్ణయించి చెప్పారు. మరి ఎక్కువ పెద్ద పరీక్షలు చేయాలని బయాప్సీకి చివరిగా పంపి, వైద్య జవాబుకై నిరీక్షించుటకు 8 రోజులు

సమయము కావాలన్నారు. చాలా రోజులుగా ఆస్పత్రిలోనే వున్నాము. క్యాన్సర్ వ్యాధి చిన్నది కాదు కదా. చిన్న వయస్సులో ఆ వ్యాధి ఎదుర్కొనుటతో పాటు నేనే నా తల్లిదండ్రులకు ఏకైక కుమారుడనై నందున చాలా గారాబముతో పెంచు సమయంలో ఈ బాధ భరించరాని దయ్యింది. నా తల్లి, నాన్నగారు, మా సంఘస్థులంతా చాలా భారంలో ప్రార్థించేవారు. నేను కూడా నాకు తెలిసిన ప్రార్థన చేసికొనేవాడిని. నా కొరకు సంఘం చూపిన ప్రేమ, మమ్ములను ఆదరించిన తీరు మరువలేనిది. సంఘము అత్యాసక్తిలో ప్రార్థిస్తే చెరసాల తలుపులు తెరువ బడ్డాయి. ఎన్నో గొప్ప అద్భుతాలు జరుగునని సూచనగా నా రిపోర్టు చివరకు వచ్చింది. ఎంతో ఆతృతతో డాక్టర్లు, మేము, సంఘము వారు ఎదురు చూచుచుండగా, తారుమారై రిపోర్టు చూచి డాక్టర్లు ఆశ్చర్యపడ్డారు. గతంలో హైదారబాద్ నిమ్స్ వారి అనుమానంతో చేసిన పరీక్షలు, విజయవాడలో తేల్చిన వైద్య ఫలితాలు స్పష్టంగా ఎముకల క్యాన్సరు తెలుపు చుండగా, ఫైనల్ రిపోర్టులో క్యాన్సరు లేదని తెల్పుట కేవలము ప్రభువు నన్ను కనికరించి చేసిన అద్భుతమని ధృఢంగా నమ్మి, దేవునికి కృతజ్ఞత తెల్పి స్తుతించాము. క్రైస్తవులు సేవించే దేవుడు గొప్ప స్వస్థతనిచ్చు దేవుడు మా బంధువైన హిందువులు స్నేహితులు మానుంచి ఆశ్చర్యము కనపర్చిరి. ఇక మా సంఘమువారు, కుటుంబముతో సహా చెప్పనశక్యమైన ఆనందంలో దేవుని ప్రేమలో కొనసాగుచూ ఆ విద్యభ్యాసం ఆనందంతో కొనసాగించాను.

నా ఎముకలలో క్యాన్సర్ లేదు ఫ్రాక్చరు మాత్రమే మిగిలిందన్నారు.

**<u>రెండవ ప్రమాదము ఎదుర్కొనుట:</u>**

నేను ఆనందంగా తల్లిదండ్రుల ప్రేమను పొందుచూ చక్కగా చదువు కొనసాగించే రోజులలో 2010వ సంవత్సరంలో నేను మోటారు సైకిల్‌లో ప్రయాణించే సమయంలో పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొన్నాను. కాలికి పెద్ద గాయమైనది, కాలు మొత్తం కోయబడినట్లు కోసుకొని పోయింది. రక్తపుమడుగులోనుండి ఆస్పత్రికి తీసుకొని వెళ్ళి ఐ.సి.యు.లో ఉంచినారు. నేను మొదటగా చూసింది నా తల్లిదండ్రులు కాదు గానీ నా సంఘము నడిపే జోసెఫ్ మాజెస్ అంకుల్‌గారు, ఆనీ ఆంటీ నన్ను ఎంతో ఆదరించి ధైర్యపరిచారు. కుంటివాడినైపోతానని అందరూ చాలా భయపడ్డారు. తీవ్ర గాయం భయం కల్గించింది. ఆ సమయంలో నా జీవితాన్ని సంపూర్ణముగా క్రీస్తుకు సమర్పణ చేసుకున్నాను.

చావు గోతి నుండి నన్ను సంరక్షించిన క్రీస్తునే వెంబడించదలచి పూర్తి సమర్పణలో మారుమనస్సు అనుభవాన్ని పొందాను. త్వరలో కోలుకొని మామూలుగా నడకను కూడా

పొందగల్గుట రెండవ అద్భుతము. నా జీవితంలో నన్ను క్రీస్తు తన బిడ్డగా అంగీకరించి ఆయన చిత్తములో నన్ను జేయుటకే యీ రెండు గొప్ప ప్రమాదాలను అనుమతించి రక్షించే సమర్ధునిగా నిరూపించుకొని  నా జీవిత సాక్ష్యము ద్వారా ఆయన మహిమ పొందుదలచినారని తెలిసుకోగలిగాను. నా జీవితంలో అసాధ్యములను సుసాధ్యము చేసిన దేవునికి బహిరంగముగా సాక్ష్యం చెప్పుటకై నీటి బాప్తీస్మము తీసుకొన్నాను. యువత ద్వారా ఎన్నో పనులు సాధ్యం కాగలవని గ్రహించాను.

<u>మూడవ అద్భుతము:</u>

మా కుటుంబము గత సంవత్సరములో 2014వ సంవత్సరము గొప్ప అద్భుతాన్ని అనుభవించాము. మా నాన్నగారు రియల్ ఎస్టేట్ పని మీద బ్యాంకులో నుండి 3 లక్షల రూపాయలు డ్రా చేసి కారులో ఇల్లు చేరారు. తీరా ఇల్లు చేరి చూసుకొనేసరికి 1 లక్ష కనిపించలేదు. కేవలం 2 లక్షల రూపాయలు మిగిలాయి. కారంతా గాలించాము. బ్యాంకు వద్దకు వెంటనే చేరి ఎంక్వైరీ చేశాము. 3 లక్షలు డ్రా చేసినట్లు బ్యాంకు బుక్కులో ఉన్నది. ఎవరికీ చెప్పుకోలేదు మౌనముగా యీ నష్టాన్ని భరించి ప్రార్ధించాము. ప్రభువా యీ నష్టమును మీరే సరి చేయగలరు, మీ చిత్తమే జరుగుగాక, మాకు తెలియుట లేదు, సర్వం మీకే తెలుసును అని ప్రార్ధించి వెళ్లిపోయాము. సరిగ్గా 3 నెలలు గడిచాయి మా విశ్వాస జీవిత క్రమంలో ఏమీ మార్పులేదు. ఆరాధనలలో క్రమముగా పాల్గొని దేవుని సేవిస్తునే ఉన్నాము. ఆ తరువాత కారును శుభ్రపరచి కడిగించి కూడా వెదికాము. అయిననూ ప్రభువు మా కష్టార్జితము పట్ల శ్రద్ధ కలిగినవాడు కనుక ఒక ఆదివారం ఆరాధనలకు వెళు ్ళ సమయంలో అదే కారులో వస్తువులు దాచు పెట్టెలోనుండి డబ్బుల కాగితాలు కనిపించాయి. తెరచి చూడగా పోగొట్టుకున్న 1 లక్ష రూపాయలు మొత్తము దొరికాయి. మా ఆశ్చర్యముకు అంతము లేదు.


కేవలం ఈ అద్భుతము ప్రభువు వలననే జరిగిందని అందరమూ నమ్మి దేవుని స్తుతించాము. నేను, నా తల్లిదండ్రులు నేడు అతి శ్రద్ధతో దేవుని సహవాసంలో ఆత్మీయంగా అభివృద్ధి పొందుచున్నాము. నా సాక్ష్యము ఆశీర్వాదకరంగా ఉండినట్లు ప్రార్ధించండి ఆమెన్.....

---------

# 48. జీవమిచ్చిన క్రీస్తు నారక్షకుడు

**రాణి పాల్ గారు**

**కీర్తనలు 40 : 2-10**



ఈ వాక్యములను జ్ఞాపకము చేసుకుంటూ నా ప్రభువు నా జీవితంలో రక్షణనిచ్చి ఆయన నీతికి, సత్యమునకు, కృపకు, రక్షణకు, సాక్షిగా నిలిపి, నా పాదములు బండమీద నిలిపి నా అడుగులు స్థిరపరచిన దేవునికి నా హృదయపూర్వక కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తున్నాను.

నేను హైందవ సాంప్రదాయ కుటుంబములో జన్మించాను. గుంటూరుజిల్లా చిలకలూరిపేట దగ్గర గోపాళం వారి పాలెం మా తండ్రిగారి స్వగ్రామము. మా తాతగారు ఆఊరిలో రామాలయము కట్టించి ఆచార్యులను పెట్టి నిష్టగా పూజలు చేయించేవారట. మా అమ్మగారి తల్లిదండ్రులు కూడా గుటూరుజిల్లా చింతపల్లిపాడు గ్రామము.

(కోటేశ్వరమ్మ) మా అమ్మగారు వారి తల్లిదండ్రులు చిన్నతనంలోనే నిజామాబాద్ జిల్లా ధర్మారం అనే గ్రామము వచ్చి స్థిరపడినారు. మా న్నాగారు ఒక్కరే నరసింహారావు నిజామాబాద్ జిల్లా ధర్మారం వచ్చి అక్కడ స్కూల్ టీచరుగా స్థిరపడినారు. ప్రభువు సంగతి తెలియదు. వారి వివాహము అయిన తరువాత ఒకసారి మా అమ్మ మరణసమయములో (మరణ స్థితిలో) బాధపడుచుండగా ప్రభువు ఆమెను దర్శించి నేనే దేవుడనని చెప్పి తన ప్రత్యక్షత అనుగ్రహించారట. వెంటనే అమ్మకు స్వస్థత కలిగి ప్రభువునకు హృదయమిచ్చింది. అప్పటి నుండి భక్తిగా వాక్య ప్రకారముగా జీవిస్తుండేది. మా నాన్నగారు దేవుడు లేడనే (కమ్యూనిస్ట్) తత్వం కలవారు. మానవుడు నీతిగా, యదార్థంగా, మంచి మనిషిగా, పరోపకారిగా, ఎవరికి ఏ కీడు తలపెట్టకుండా అందరికి మేలుచేస్తూ జీవించాలి అనే భావము నాన్న కలిగియుండేవారు.

కుటుంబికులు, ఇరుగు పొరుగువారు, బంధువులు, ప్రభువును నమ్ముకున్నందుకు చిన్నచూపు చూస్తూ మా అమ్మను ఎంతో ద్వేషించారు. మా నాన్నకు అమ్మ ప్రభువును నమ్మటం ఇష్టంలేదు. మా అమ్మ ఎంతో నిష్టతో భక్తిగా ప్రార్థన చేస్తూ పరిశుద్ధాత్మ పొంది మా నాన్నగారి కొరకు, మా కొరకు ప్రార్థిస్తూండేది. అందరి రక్షణ కొరకు నిత్యము ప్రార్థన చేసేది. నాక్కూడ అమ్మ ప్రభువును నమ్మటము అసలు ఇష్టముండేదికాదు. మానాన్న గార్కి ఇద్దరు అన్నయ్యలు, ఇద్దరు చెల్లెళ్ళు, అక్క వుండేవారు.

మా బంధువులను బట్టి, కులాన్ని బట్టి, బలగాన్ని బట్టి ఎంతో గర్వించి అతిసయించాను.

నా 13వ సం॥రంలో హైద్రాబాదులో మా అత్తమ్మ మామయ్య వాళ్ళింటికి వెళ్ళి ఎండాకాలం గడిపేదాన్ని. మామయ్య వారి చెల్లెల పిల్లలతో పాటుగా సోమవారం, గురువారం, శనివారం, గుడికెళ్ళి వాళ్ళు చేసిన పూజలు నేనుకూడా చేసి బొట్టు, పూలు పెట్టుకొని వచ్చేదాన్ని. వాళ్ళతో సినిమాకెళ్ళి బాగా సంతోషంగా గడపడానికి ఎక్కువ ఆశక్తి చూపి వారి పూజించే దేవుడు అంటే, వాళ్ళంటే ఎంతో అతిశయము.

ఇంటికి వచ్చాక అమ్మకు వ్యతిరేకంగా నా మనసులో బాధపడుతూ, దేవుడంటే, దేవుని ప్రజలంటే, దేవున్ని నమ్మి భక్తిగా ఉన్నవారిని చూచి చాలా చిన్నచూపు. అసహ్యంచుకొని ద్వేషించేదాన్ని. అమ్మ అయితే ఓపికతో అందరి కొరకు ప్రార్ధన చేస్తూ ఉండేది. అమ్మ రక్షించబడిన 14 సం॥ల వరకు ఆయన ఎన్నో విధాలుగా పరీక్షిస్తూ ఉండేవారట. తర్వాత తన సాక్ష్యముతో చెప్పారు. నా భార్య ప్రవర్తనను బట్టి ఈ జీవముగల దేవున్ని నేను కనుగొని రక్షించబడ్డాను అన్నారు. నాన్నకు యెహోషువ అని పేరు మార్చారు. అమ్మకు ఎస్తేరమ్మ అని పేరు పెట్టారు. మేము ముగ్గురము పిల్లలం. మానాన్న కూడ ఆరక్షణపొందారు అని ఇంకా నేను కోపం పెంచుకున్నాను.

మా అమ్మ ప్రార్ధన చేసుకుంటుంటే నాకు ఇష్టంలేక, తలవెంట్రుకలు లాగటం, తన్నుకుంటూ పోవడం, వీపులో గుద్దటం, చేస్తుండేదాన్ని అయినను నన్ను ఏమి అనేదికాదు. ప్రార్ధన మానేది కాదు. అలాగే దినాలు జరుగుతున్నాయి. నాలో కోపం, చిరాకు, బాధ ఎక్కువైంది. ఒకరోజున నేను స్కూల్ నుండి ఇంటికి వచ్చేసరికి మా ఇంటిలో ఉపవాస ప్రార్ధన చేసుకుంటున్నారు. అది చూచి నాకు తలమీద బండపడినంత బాధ కలిగింది.

ఇంతమంది దేవుళ్ళు మనకుండగా ఆ ఇంగ్లీషు వాళ్ళ దేవుణ్ణి పట్టుకున్నారు. అసలు విడువలేనంత ఏముంది ఇందులో చూద్దాం అని నేను కూడా వాళ్ళ మధ్యకు వెళ్ళి అసలు సంగతి ఏమిటో చూద్దాం. ఇంకా ఏమైనా నాకు తప్పులు కనిపిస్తే ఇంకా గట్టిగా నిలబడి వాళ్ళను ఎదిరించవచ్చు అని నా పుస్తకాలు దూరంగా విసిరేసి, వారిమధ్యకు వెళ్ళి కూర్చున్నాను. నాకసలు కోపం అంటే తెలియని నెమ్మదిగల మనస్తత్వం అలాంటిది. దేవుని మార్గమును గూర్చిన ద్వేషం. ఎందుకంటే మా బంధువులకు అందరికి ఇష్టంలేక మార్గం ఎన్నుకున్నారు అనేది ఒక పట్టుదల, కోపం, చిరాకు ఎక్కువై అయిష్టంగా కూర్చున్నాను.

యెషయా 65:1 “నాయెద్ద విచారణ చేయని వారిని నా దర్శనమునకు రానిచ్చితిని. నన్ను వెదకనివారికి నేను దొరికితిని. నేనున్నాను ఇదిగో నేనున్నానని నా పేరు పెట్టబడని

జనమతో చెప్పుచున్నాను” అని పరిశుద్ధగ్రంథములో వ్రాయబడిన మాటలు ఆక్షణంలో నా జీవితములో జరిగించాడు. దేవుని నామమునకే మహిమ కలుగును గాక.

అక్కడి వారందరు ఉపవాసముతో ఏకాత్మతో శబ్ధములో ప్రార్ధించుచుండగా కొద్ది నిమిషాలలో వారి మధ్య కూర్చున్న నాకు ఒక కరెంటుషాక్ లాగా గొప్పశక్తి ఆవరించింది. ఇక్కడ వాక్యం గుర్తుంకొచ్చింది.

యోబు 42:5,6 “దేవుని కన్నులార చూచినప్పుడు, నన్ను నేను అసహ్యించుకొని, ధూళిలోను, బూడిదలోను, పడి పశ్చాత్తాపపడుచున్నాను” అని ఉంటుంది. నిజమే అలాంటి అనుభూతి కల్గింది నాకు. నాకు తెలియకుండానే నేను పాపిని అని బిగ్గరగా ఏడుస్తున్నాను. దేవున్ని దేవునిగా తెలుసుకోలేకపోయాను, తృణీకరించాను, ఎలా బాధపెట్టాను. అంధకారంలో జీవించాను. పరిశుద్ధాత్ముడు నన్ను ఒప్పింపజేస్తూ నేను జన్మ, కర్మ పాపిని అని ఒప్పుకుంటూ ఆయన పరలోక ప్రత్యక్షత, కల్వరి దర్శనముతో నన్ను నేను మరచి తన్మయత్వంతో ఏడుస్తూ నేను ఎప్పుడు ఎరుగని భాషలు మాట్లాడుతూ హల్లెలూయ స్తోత్రము అంటూ ప్రపభువు అంటే తెలియని నన్ను పరిశుద్ధాత్మతో నింపినారు.

ఆనందంతో క్రొత్త భాషలు మాట్లాడుతూ ప్రభువును చూస్తున్నాను. ఆ సమయంలో నాకు ప్రభువును గూర్చి, పరలోక రాజ్యమును గూర్చి స్పష్టమైన అవగాహన కల్గింది. అదే సమయంలో ప్రభువు నన్ను కృపావరంలతో నింపాడు. 2గం॥లు ప్రభువుతో ఆనందిస్తూ పరలోక దర్శనంతో చెప్పనశక్యమైన సంతోషముతో నా హృదయము నింపబడినది.

అప్పుడు నాకు గతం గుర్తుకు వచ్చింది. హైదరాబాదులో నేను గుడిలోకి వెళ్ళి వాళ్ళతోపాటుగా దండము పెట్టుకొని బొట్టు పెట్టుకొని వచ్చాము. అప్పుడు ఎలాంటి స్పందనగాని, పాప పశ్చాత్తాపము గాని, దేవుని ముఖ దర్శనము ఏమి కలుగలేదు. జీవముగల దేవుని సన్నిధిలో ఆయన ప్రత్యక్షతతో పాపక్షమాపణ, పశ్చాత్తాపము, నేను పాపిని అని గ్రహించగలిగాను కదా అని జ్ఞాపకము తెచ్చుకొని నేనెంత ధన్యురాలను,

నా ప్రభువును నేను చూచాను. ప్రభువు నాతో మాట్లాడటము నేను ప్రభువుతో మాట్లాడుతూ ఎంతో సంతోషము, సంతృప్తినిచ్చింది. దేవునితో గడిపే సమయము అప్పటి నుండి బంధువులు, స్నేహితులు నా దృష్టిలో అల్పులుగాను, దేవున్నినమ్మిన ప్రజలు ఘనులుగాను, అదృష్టవంతులుగాను గ్రహించాను.

యిర్మీయ 9:23 లో వున్నట్లుగా జ్ఞాని తన జ్ఞానమును బట్టియు, శూరుడు తన శౌర్యమును బట్టియు అతిశయింపకూడదు. ఐశ్వర్యవంతుడు తన ఐశ్వర్యమును బట్టియు అతిశయింప కూడదు. అతిశయించువాడు దేనిని బట్టి అతిశయించవలెననగా భూమి మీద కృపచూపుచూ, నీతి న్యాయములు జరిగించుచున్న యెహోవాను నేనేయని గ్రహించి నన్ను పరిశీలనగా తెలుసుకొనుటను బట్టియే అతిశయింపవలెను. అట్టి వాటిలో నేనానందించువాడనని యెహోవా సెలవిచ్చుచున్నాడు"

ఈ మాట నా జీవితంలో నెరవేర్చినట్లుగా నేను తర్వాత తెలుసుకున్నాను.

ప్రసంగీకులు 12:2 లో "బాల్యదినములందే నీసృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము"

అనే మాట నెరవేరినందుకు నా జీవితంలో గొప్ప ఆనందంతో నిండిపోయాను. దేవునికి నేను అంకితమయ్యాను. నాకు "యేసుచాలు" అనే ఒక తృప్తికరమైన అనుభూతితో ఒక మంచి స్నేహితునిగా సహవాసముతో ఆనందించుచున్నాను. సోమవారం స్కూల్‌కు వెళ్ళాను. అలంకరణ అంటే (నగలు, పువ్వులు) అన్నీ పెట్టుకొని స్కూల్‌కు లేటు అయినా ఫరవాలేదు అనుకునే నాకు వాటిమీద మనసు లేకుండా ప్రభువే నాకుచాలు. నాకు ఏమియు వద్దు అనే సమర్పణగా నా మనసు నిండిపోయింది.

నాలో మార్పును టీచర్స్ అందరు గ్రమించి మాన్నాగారి దగ్గర అన్నారట. మీ అమ్మాయిని కూడ మతంలో దించారా అని మా నాన్నగారితో అంటే, ఆ అమ్మాయిని అడగండి అంటే నా దగ్గరకు వచ్చి నన్ను అడిగినారు. 9వ తరగతి చదువుచున్నాను. నేను ఒక్క క్షణం దేవుని చూచాను. సర్ ఒక మనిషిని మనిషి మార్చలేరు కాని నన్ను దువుడు మార్చుకున్నాడు. తన్నుతాను నాకు ప్రత్యక్ష్య పరచుకున్నారు. నేను దేవునికి అంకితమయ్యాను అని చెప్పినప్పుడు నెమ్మదిగా వెళ్ళిపోయారు. నా చదువులో దేవుని సహాయముంది. ఎక్కువ ప్రార్ధన, ఆయన దర్శనం, ప్రత్యక్షతలో ఆనందిస్తూ కళ్ళు తెరిచినా, మూపసినా నాకు సర్వస్వము ప్రభువే అనే తృప్తిగా ఉన్నాను. దేవునితో ఉన్న ఆనందము మాటల్లో వ్రాయలేకపోతున్నాను.

ఈ విధంగా నిష్టకలిగి ప్రభువు భక్తిచేస్తూ ఆత్మలో ఆనందిస్తున్న నాలో నూతన మార్పు పుష్పవతినయ్యాను. అప్పుడు ఇంట్లోనే 15 రోజులున్నాను. మా ఊరిలో దయ్యము పట్టిన ఒక స్త్రీ అమ్మదగ్గరకు వచ్చింది. ఆమె కొరకు నూనెరాసి ప్రార్ధించినప్పుడు దయ్యము బయటకు వచ్చి ఆమె పేరు, చేయించిన వారి పేరు చెప్పింది. ఆమె తల్లికి భయంవేసి మీ దగ్గర ఉంచుకోండి అంటే ఆమె ఒకప్రక్క నేను ఒక ప్రక్క అమ్మ దగ్గర పడుకునాము.

మాంత్రికుడు ఊళ్ళోనే ఉంటాడు. భిక్షగాడు ఆరాత్రి నాకు దర్శనంలో మాంత్రికుడు వేరే వాళ్ళను తెచ్చుకొని ఎక్కువ మంత్రప్రయోగము చేసినట్లుగా చూచి మెళకువతో ప్రార్థించండి అంటే నాన్న స్కూల్ నుండి వచ్చాక ఆ రాత్రి అమ్మ నాన్న నేను ప్రార్థించేవాళ్ళము. ఒకసారి నా మీదకు పంపిస్తే నా నోటిమాట రావటంలేదు. ఆకాశంలో తేలిపోతున్నట్లుగా అనిపించింది. సైగచేసి ప్రార్థించమంటే అమ్మ నాన్న ప్రార్థిస్తే అప్పుడు నా ప్రాణం తేరుకొని ఎక్కడనుండో తిరిగి తిరిగి వచ్చి క్రింద కూర్చునట్లుగా అనిపించింది.

మరుసటిరోజు ఆ సాతాను ఆమెను తాకి వచ్చి మాట్లాడుతూ అది శక్తినై మింగుదామని దగ్గరకు వస్తే మా అమ్మాయిని ముట్టనివ్వలేదు. "దేవుడు నన్ను గద్దించాడు" ఆ బిడ్డను ముట్టకు ఆమె నాసొత్తు. నా వరాలతో నింపుకున్నానని దేవుడు చెప్పాడు అని చెప్పింది. అప్పుడు దేవుని కాపుదల, పిలుపును గ్రహించి దేవుని మహిమపరిచాను.

తెల్లవారేసరికి మా ఇంటి ముందు కాంపౌండు దగ్గర పసుపు, కుంకుమ, నిమ్మకాయిలు, బొమ్మలను పెట్టి ఆ మాంత్రికుడు వెళ్ళాడు. ఉదయం చూసేసరికి ఇరుగు పొరుగువారికి తెలిసి భయముతో చూస్తుండగా అమ్మ వెళ్ళి అవి మనలను ఏమిచేస్తాయి! దయ్యము పని అంటూ ఊడ్చి ఎత్తిపోసింది. జీవముగల దేవుడు మాతో, మాలో ఉ న్నాడనే విశ్వాసము, నిరీక్షణ, ధైర్యము ఉండేది. తరువాత నేను రక్షణ బాప్తీస్మము పొందాను.

ముందుగా నాపేరు ఝాన్సీరాణి. తరువాత షారోను రాణిగా మార్చారు. మా అమ్మ, పిన్ని "చర్చ్ ఆఫ్ గాడ్" సంఘ సభ్యులుగా ఉండేవారు. కొంతకాలంగా ఏ సేవకులు లేని సమయంలో ప్రార్థించే వాళ్ళట. ప్రభువా నీవు ఎన్నుకొన్న సేవకుని పంపించు అని ప్రార్థించుకున్న సమయంలో నిజామాబాదులో ఎవరో చెప్పారట. ధర్మారంలో జంపాని వీరయ్యగారి కుమార్తెలున్నారు. ఎస్తేరమ్మ, రూతమ్మ అంటే దర్శించుటకు ఒకసారి దైవజనులు బి.యస్.పాల్ గారు వస్తే గృహములోకి చేర్చుకొని ప్రార్ధన చేయించుకొని అప్పటినుండి ఆ సహవాసముకు వెళ్ళారు.

దేవుని సేవకులు అమలాపురంలో అన్యులుగా ఉన్న కుటుంబములో జన్మించి తన 17వ సం॥ము దేవుని దర్శనము పొందుకుని రక్షించబడి పాల్.పరంజ్యోతయ్య గారి దగ్గర తర్ఫీదు పొంది అయన ద్వారా ఆ సంఘములో వివాహము చేసుకొన్నారు. 6 సం॥లు అక్కడే సేవచేసి తరువాత ఇద్దరి పిల్లలతో పి.యం.సామ్యేలుగారి ద్వారా ఐ.పి.సి. సంస్థ తరపున నిజామాబాదు పంపించారు. 1966లో ఫ్డీదీ లో (సంపూర్ణ సువార్త) తెలంగాణాలో అప్పటికి సంఘము అంటూలేదు. వీరి పరిచర్య ద్వారా I.P.C స్థలము, కుందేశ్వర్‌లో

గ్రా.వి. సామ్యేలు గారి ద్వారా కొని అక్కడ సేవ కొనసాగిస్తుండగా చాలామంది రక్షించబడటము సేవ విస్తరిస్తున్న సమయము, సంఘము బహుబలంగా ఉన్న సమయములో దేవుని సేవకునికి జీవితంలో ఒక అగ్ని పరీక్ష, తీరని వేదన కల్గింది. దైవజనురాలు 1973 సం॥లో దేవుని పిలుపు అందుకొని వెళ్ళటము. 4గురు పిల్లలు. 11,8,5,3 ల వయస్సు గల చిన్నవారు. వీరిని చూసుకుంటూ గుండెబద్దలయిన సమయములో వీరి తల్లి దండ్రులకు ఒక్కరె కుమారుడు. వారు కూడా నిజామాబాదు వచ్చారు. ఆ సమయములో సంఘము ఎంతో ఆదరించినారు. అభిమానులు ఎంతో ఆదరించటము, ఎంతో కష్టపడి దేవుని సేవ చేశారు. I.P.C సంస్థ నియమమును బట్టి భార్య లేకుండా సంఘమును నడిపించకూడదు గనుక పిల్లలను దీశ్శుతీఃఅఅస్త్ర లో పెట్టి సువార్తికునిగా తిరిగి సేవచేయాలి అని తీర్మానించుకున్నారట. సంఘమంతా ఎంతో భారంతో ప్రార్థిస్తూ ఆదరిస్తున్నారు.

ప్రభువుతో నా యాత్రాజీవితము కొనసాగుచుండగా నా తల్లి దండ్రులతో దేవుడు మాట్లాడుచున్నారట. నీ కుమార్తెను సేవకు ఇవ్వు అని. వారు కొంచము భయపడి ఎలాగు ప్రభువా, 4గురు పిల్లల తండ్రి, మరియు సంఘభారము ఇవన్నీ మోయాలి అని ప్రార్థనలో పెట్టుకున్నప్పుడు ప్రార్థించగా దేవుడు వారిని బలపరచిన విధానము గొప్పది.

అబ్రహాము , శారా యొక్క విశ్వాసము జ్ఞాపకము చేసుకొని దేవుని మాటకు లోబడినవారు. అప్పటి మా విశ్వాసము ఎలాగంటే ప్రభువు ఏమి చెపితే అది చేయటం. "ఆయన చిత్తము నెరవేర్చుటే ఆహారము, సంతోషము" అన్నట్లుగా దేవుని మాట జ్ఞాపకము చేసుకోవాలి. అలాగు కొన్ని నెలలు వారు ప్రార్థించి నాతో చెప్పినప్పుడు నేను ఇష్టపడలేదు. ఎందుకు అంటే నాకు చదువుమీద మమకారము ఎక్కువ. బాగా చదవాలి, లాయరు కావాలి అని నా చిన్ననాటి కోరిక. వెంటనే ప్రభువు ఆత్మపొందిన దానను నేను అన్నాను ప్రార్థన చేస్తాను.

ప్రభువు నాతో కూడా మాట్లాడితే అప్పుడు చెప్తాను అని. దేవుని సన్నిధిలో ప్రార్థించగా దేవుని వాక్యము అంటే చాలా గురి. ఆ వాక్యమే మనలను నడిపించేది. ప్రభువా నేను బైబిలు తెరిచి కళ్ళుమూసుకొని నా వ్రేసు ఎక్కడ పెడతానో దానినే నేను అనుసరిస్తాను అని అడిగినాను. (అందరు ఇదే చేయాలి అని నేనటంలేదు. ఎందుకంటే ఆ చిన్న విశ్వాసంతో ఆ పద్ధతి పాటించాను).

యెషయ 41:4 "ఎవడు దీనినాలోచించి జరిగించెను! ఆదినుండి మానవ వంశములను పిలిచినవాడనైన యెహోవానను నేనే" ఈ మాటలు చదివాక దేవుడే ఇది

ఆలోచించి జరిగిస్తున్నాడనే ఒక విశ్వాసము నాలోకి వచ్చింది. చదువు అంటే ఇష్టం ఎలాగ అన్నప్పుడు ప్రభువు ఈ మాట గుర్తుచేశారు.

1 తిమోతి 4:8,9 “శరీర సంబంధమైన సాధనము కొంచము మట్టుకే ప్రయోజనకరమవును గాని దైవభక్తి యిప్పటి జీవము విషయములోను, రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును. ఈ వాక్యము నమ్మదగినదియు, పూర్ణాంగీకారమునకు యోగ్యమునై యున్నది”. నీ చిత్తమునకు లోబడుచున్నాను దేవా నీకప్పగించుకొంటున్నాను అని నా సమ్మతి తెలియజేశాను.

అప్పుడు అమ్మానాన్న సంఘములో ఉన్న వై.యస్.జాన్‌బాబు రక్షించబడినారు. (SI) పాండురంగారావు గారు జాన్‌బాబుగారిలో చెప్పినపుడు వారు దేవుని చిత్తమని గ్రహించి మంచిది ప్రార్ధన చేస్తాము అన్నారట. సంఘమంతా భారంతో ప్రార్ధిస్తున్నారు. దైవజనులు మాత్రం నేను 10 రోజులు ఉపవాసముండి ప్రార్ధన చేసుకొంటాను. ప్రభువు నాకు బయల్పరిచిన దానిని బట్టి చేస్తాను అని ప్రార్ధించిన తరువాత ఒక దర్శనములో “నేను గుమ్మములో నిలబడిఉన్నానట” ఇదిగో ఈమె నీ కుటుబాన్ని సంఘమును నడిపించగలదు అనే మాట వినబడిందట. అలాగే సంఘమంతా కృపమ్మ అని మంచి విశ్వాసి అలాగు కొందరికి నన్ను ప్రభువు చూపించారట. ఇక దేవుని చిత్తమని గ్రహించి దేవునికి లోబడినారు. ప్రార్ధనలో కనిపెట్టుకుని ఉన్న సమయములో సంఘములో పెద్దలు చాలా బలంగా నిలబడినారు.

ఆ సమయము ఎలాగుందంటే దేవుని చిత్తము అని తెలిసినవారికి సంతోషంగాను దేవుని మాట (చిత్తము) నెరవేరుతుంది అనే ఆలోచనతో ఉన్నారు. దేవుని సంగతి తెలియని వారికి చాలా విడ్డూరంగాను, అయోమయంగాను ఉంది. నాకేమో 18 సంIIల చిన్నపిల్ల. సంఘమును ఎలా నడిపిస్తుంది. పిల్లల్ని ఎలా చూచుకుంటుంది. అంతా ఎదురుచూస్తున్నారు. ఇది ఎలా జరుగుతుందా అని దైవజనునికి అప్పటికి 33 సంIIలు మా బంధువులు మరొకసారి అంతా అయోమయమునకు గురై అమ్మా నాన్న మీద చాలా ఆయాసపడినారు. అన్నీ ప్రభువువైపు చూస్తు జరిగించారు. మా నాన్న ఊళ్ళో అందరిని పిలిచి చాలా ఘనంగా చేశారు. నిజామాబాదులో సంఘపెద్దలు, చాలా మంది పెద్ద పెద్ద ఉద్యోగస్తులు అందరు వై.యస్. జాన్ బాబుగారు, సరళసూర్య ప్రకాష్ గారు వీరి ఆధ్వర్యములో ్రాశీశ్రీఱషెవ ఢీుఱఅం తో అనేక కార్లల్లో వచ్చినారు. అందరి పేర్లు చెప్పటానికి స్థలభావముతో క్లుప్త పరుస్తున్నాను. I.P.C సంస్థాపకులైన APO.PIM సామ్యేలుగారు వచ్చి ఈ వివాహము జరిగించారు.

1974 ఏప్రిల్‌లో చాలా దీవెనకరంగా జరిగింది. నాకు ఒకటే తలంపు దేవుడు ఇచ్చిన బాధ్యతను నమ్మకంగా జరిగించాలి. కృపతో ఇచ్చిన బిడ్డలను దేవుని లెక్కకు వచ్చే విధంగా పెంచాలి, చూడాలి అని ఒక యదార్ధమైన ప్రేమ, నమ్మకముతో స్వీకరించాను. ఇప్పటివరకు ఈ సంగతులు తెలియజేయలేదు. సాక్ష్యము గనుక వ్రాయాలి అని వ్రాస్తున్నాను.

ఎంతో సంతోషముతోను దేవునికి మహిమ కలిగే విధంగా మేమందరము 8 మందిమి. మా అత్తమామలు మాతోనే ఉన్నారు. సేవ అంటే ఎంతోగొప్ప. సేవ జరగాలనే తపన ఉండేది. అప్పుడు ప్రభువును అడిగినాను ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇంకా ఇద్దరు కుమారులను ఇచి నీ సేవకై వాడుకో అని. పరిచర్యలో ఉంటుండగా సాతాను శక్తులను ప్రయోగించారు నాపై. ఎవరు పంపితిరో వారి దగ్గరకు వెళ్ళువరకు ఆత్మతో గర్ధిస్తూ (అన్యభాషలతో) ప్రార్ధించినపుడు జయము కల్గింది. ఇలాగు, 2,3 మార్లు జరిగింది. ప్రభువు గొప్పవాడు నాలో ఉన్నవాడు. లోకములో ఉన్న వానికంటే సర్వశక్తిమంతుడు నా పక్షమున ఉండి జయమిచ్చారు. 1975లో ఒక బాబును ఇచ్చారు. సేవ చాలా దీవెనకరంగా జరుగుతుంది.

దైవపజనులకు దేవుడిచ్చిన దర్శనమును బట్టి 1977 జనవరిలో I.P.C కి రాజీనామా చేసినారు. స్వతంత్రంగా పనిచేయాలి అని దేవుని మీద ఆనుకొని ధైర్యంగా విశ్వాసముతో సాగిపోతున్నాము. 1977 ఏప్రిల్‌లో ఒకబాబు జన్మించాడు. 6గురు పిల్లలు, మేమిద్దరము, అత్త మామలు ఏ ఆధారమును చూచి బయటకు రాలేదు. కేవలము దేవుని మాటమీద "పనివాడు జీతమునకు పాత్రుడు" అనే మాటను జ్ఞాపకము చేసుకున్నాము.

సైకిలుమీదనే పరిచర్య 40 కి.మీ. పరిధిలో చేస్తామన్నారు. 1978లో ఒక విధవరాలి ద్వారా ఒక దీబశ్రీశ్రీవ్ ఇచ్చారు. ఆ కాలంలో 10 వేలు అవే మొదటిసారి మేము అంత డబ్బులు చూడటము. 3 రోజులు ఉపవాసముండి ప్రార్ధించి కొన్నారు. దానిమీద సేవలో 13 సం॥లు జరిగించారు. 1979లో ఒక స్థలము దేవుడిచ్చారు. నాన్నగారి ద్వారా పిల్లలందరు Convent School లో చదువుతున్నారు. 1977 నవంబరులో ఆంధ్ర వెళ్ళినారు. మా మామయ్యగారు షుగర్ ఎక్కువై అక్కడనే ప్రభువు పిలుపుతో పరలోకము చేరినారు. ఆయన మీకెంతో అండగా ఉండేవారు.

ఎనోన మార్గాలు ద్వారా(సహాయం చేసేవారు) అవకాశము కల్పించినా, దేవుడే మాకు సహాయకుడై నడిపించాలి అని ఒకసారి ప్రభువు మాకు చూపించిన దర్శనమును బట్టి దేవుని మీద ఆధారపడి జీవించాలి అని చేర్చుకున్నాము.

1975లో కరీంనగర్ జిల్లా మెట్టపల్లిలో (నిజామాబాదుకు 65 కి.మీ) కూడా సేవ ప్రారంభించినాము. అక్కడ అందరు హిందువులు రక్షించబడినారు. అనేక వ్యతిరేక శక్తులనుండి తప్పించబడినారు. బుల్లెట్‌ను, నిన్ను తగులపెట్టేస్తాము. ఇక్కడకు వచ్చి అందరిని మార్చివేస్తారా? అనే ఉక్రోషముతో ఉంటే (ఆరోజు) ప్రతి ఆదివారము బుల్లెట్ మీద వెళ్ళి అక్కడ ఆరాధన చేసి వస్తారు. ఒకరోజు ప్రేరేపణ లేదని అగినారు. ఆ రోజు తప్పించుకున్నారు అని వాళ్ళన్నారు. తప్పించబడ్డారు. మొదటిగా రక్షించబడిన ఆమెను చంపాలని చూశారు. అతనే ఉరిపెట్టుకొని చనిపోయాడు.

ఒక అమ్మ సండేస్కూల్ నడిపిస్తుంటే వచ్చి బైబిళ్ళు పడేసి మురికి కాల్వలో మీ అంతుచూస్తా అనుకుంటూ వెళ్ళాడట. అతన్ని ఎవరో ఒకరు నరికి చంపారట. అక్కడ దయ్యముపట్టిన ఒక స్త్రీ బాగుపడి ప్రార్థనకు వస్తుంటే ఆమెను ఆటంకపరచి మీ గురువును చంపేస్తా అని తిరిగిన అతను యాక్సిడెంటులో చనిపోసరికి చాలా క్లుప్తంగా వ్రాస్తున్నాను. అక్కడ అందరికి (BJP.R.SS) వారు ఎక్కువ. ఇది బయటకు మనము రాయకూడదు. భయము కల్గింది. వారి దేవుడను గాని, ఆ సేవకున్ని గాని మనము ఏమైనా అంటే మనకే నష్టము అని వూరుకున్నారు. చాలా జరిగాయి. అవన్నీ వ్రాయటం లేదు. అక్కడ దయ్యములచే పీడించబడినవారు ఎక్కువ. రోగములు స్వస్థత. అనేక అద్భుత సూచక క్రియలతో దేవుడు అద్భుతంగా అనేకులను రక్షించుకున్నారు. అనేక కులాల నుండి వచ్చినవారున్నారు. విశేషమేమంటే మా పరిచర్యలో కులాలకు తావు లేకుండా ఒకేరకము చేత కొనబడి, ఒకే కుటుంబముగా, ఒక తండ్రి పిల్లలుగా ఐకమత్యముతో, ప్రేమతో, బేదభావములు లేకుండా పరిశుద్ధ కుటుంబముగా నడిపించబడుతున్నాము అనే ఒక సంతోషము మాకున్నది. చుట్టప్రక్కల గ్రామాల్లో నుండి వస్తూంటారు. అక్కడ కూడా మందిరము కట్టబడింది. 1982లో చిన్న పెంకులతో ఇల్లు నిర్మించాము. అప్పటిలో Apo. పి.యల్ T. పరంజ్యోతయ్యగారి పెద్దకుమారుడు బిషప్ సర్జన్‌రాజుగారు వారి సతీమణి చిన్న గృహప్రతిష్ఠ చేశారు. ఆ ఇంట్లో ఉంటూ ప్రక్కనే మందిరము కట్టుటకు ఆరంభించినాము. దేవుని బిడ్డలు ధారాళముగా (ప్రభువుకు) సమర్పించుకున్నారు. అన్యులు కూడా ఇచ్చారు. ప్రతి ఒక్కరు మా పేరు చెప్పకండి అని దేవుని పనికిచ్చారు. ఎప్పుడైతే లేదో అప్పుడే ప్రభువు పాదాలదగ్గర మొఱ్ఱపెట్టుకుంటుంటే అద్భుతంగా తన కార్యము దేవుడు నెరవేర్చాడు.

1982లో మొదలుపెట్టి 88 వరకు కొనసాగింది. ఆత్మీయ తండ్రిగారు 1988 ఫిబ్రవరి 25న APO.P.L. పరంజ్యోతయ్యగారు వచ్చి ఆలయ ప్రతిష్ఠ జరిగించారు. దేవున్ని మహిమ

పరిచినారు. మహిమగల సంఘము కట్టి దేవుని యెదుట నిలబెట్టాలి అనే ఆశతో Glorious Church ని స్థాపించారు. పరిసర గ్రామాల్లో కూడా పరిచర్య జరుగుతూవుంది. NZB దగ్గరలో అంజుమాన సారనులో ఒక చర్చి కట్టించారు. కొండపల్లి యేసుదారు గారున నడిపిస్తారు. వారు మా సహవాసములో వున్నారు. చింతకుంట అనే గ్రామములో ఒక చర్చి కట్టించారు. మిగతా చోట్ల Cell Groups గా మందిరాలు లేదు నడిపించబడుతున్నారు. Bombay లో కూడా పరిచర్య ఎజరుగుతూఉవంది. Bro.యేసుదాసుగారు చూస్తామన్నారు. సంఘపెద్ద, అప్పుడప్పుడు మేము వెళ్ళి (2 నెలలకు ఒకసారి) సంఘమును బలపర్చి వస్తూంటాము.

1988 నుండి 1992 వరకు పి.యల్. పరంజ్యోతిగారు సభలకు వచ్చేవారు. తరువాత రోజుల్లో అనేక గొప్ప దైవజనులు వచ్చినారు.

1992లో సెప్టెంబరులో ప్రభువు పిలుపును బట్టి అత్తమ్మను దేవుడు పిలిచినారు. దేవుడు ముందుగానే చూపించినారు. అద్భుతంగా ఆమె సిద్ధపడి దేవుని రాజ్యం చేరింది.

1995లో మానాన్న గారు ప్రభువు సన్నిధికి వెళ్ళారు. సేవలో మాకెంతో సహాయంగా ఉండేవారు. సభలు పెట్టినప్పుడు ఆయనే అంతా చూసుకునేవారు. ధర్మారంలో సంఘము కూడా నడిపించేవారు. అద్భుతమేమంటే 1995 ఫిబ్రవరి జరిన ఆఖరి మీటింగులో దైవజనుడు బోధిస్తూ ప్రభువు పిలిసే పరలోకానికి వెళ్ళడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు అంటే ఎవరు చేయి ఎత్తలేదు. మా నాన్న మాత్రమే చెయ్యి ఎత్తారు. మార్చి 7దిన ప్రభువు సన్నిధికి వెళ్ళారు. మేము ఢిల్లీలో వుండగా రాత్రి 3 గం॥లకు స్వప్నములో దేవుడు చూపించాడు నిదర్శనము. నాన్న వెళ్ళటం పరిచర్యలోను, కుటుంబములోను చాలా కొరతవుంది. దేవుడు నాతో మాట్లాడి బలపర్చినాడు.

2005లో దుబాయి కరామా చర్చి సిల్వర్ జూబ్లీ వేడుకలకు ప్రసంగీకునిగా ఆహ్వానించారు. పాస్టర్ జంగిల్ సామ్యేలుగారు అక్కడ 1 నెలరోజులుండి అక్కడ మా సంఘస్తులను కూడా చూచి వచ్చారు. పరిచర్యలో కారు, ఆర్మోనియం, బుల్లెట్ కారు ఇవన్నీ ఇచ్చారు స్తోత్రం.

2007లో మేము అనుకోకుండా అడగకుండా దేవుడు ప్రయాణము సమకూర్చాడు. మా ఆత్మీయ బిడ్డలు సేవలో ఎంతో సహకరించినారు. మమ్ములను ఎక్కువ ప్రేమించిన కుటుంబము వారు కూడా సేవలో వున్నారు. దూళిపూడి గురుప్రసాద్ రావు, జీవన కుమారి వారి ప్రోత్సాహముతో వారే మా ఖర్చులను భరించి మమ్ములను ఇశ్రాయేలు

దేశము తీసుకెళ్ళారు. అందును బట్టి మేము దేవునికి ఎన్నో కృతజ్ఞతలు చెప్పినాము. వారి ప్రేమను సదా అభినందిస్తూ దేవున్ని స్తుతించాము.

మాకిచ్చిన 6గురు పిల్లలు వారు ఎంత చదువుకుంటే అంతచదివించాలి. వారు ఏది అడిగినా లేదు అనకూడదు అనే ఒక విశ్వాసముతో ఉండి నడిపించాము. బాగా చదువుకున్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహములు అయినవి. మంచి కుటుంబాలలో నుండి బుద్ధిమంతులైన, భక్తి పరులుగా ఉన్న ప్రేమగల అల్లుళ్ళను దేవుడిచ్చారు. వారంతా హైదరాబాదులో సెటిలయ్యారు. పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు. ముగ్గురు కుమారులు వారికి వారుగా సేవకు సమర్పించుకోవటం ప్రభువు ఇచ్చిన ధన్యత.

పెద్దబాబు ఉద్యోగము చేస్తూ దానికి రాజీనామా చేసి వచ్చి బైబిల్ కాలేజిని పూనేలో చేసినాడు. 1993లో మే 14న గుంటూరు బీమినేని సుబ్బారావు (మోజెస్) గారి కుమార్తెను మాధవిని పెద్దబాబుకు చేసుకున్నాము. బ్ర.జాన్ వెస్లీ పాల్ పెండ్లి అయిన తరువాత 1 సం॥ విజయవాడ మోజెస్ చౌదరిగారి (దైవజనులు) మరునాత విశ్వాస సమాజము వారి బైబిలు కాలేజిలో లెక్చరర్‌గా పనిచేసి తిరిగి మా దగ్గరకు నిజామాబాదు వచ్చి పరిచర్యలోనికి 2010లో వచ్చారు. ఇక్కడ మాతో వున్నారు. ఇపుడు ఈ పరిచర్య చూస్తున్నారు. వారికి ఇద్దరు పాపలు. దేవునికి వ్యతిరేకంగా జీవించిన కుమారుడును రక్షించుకొని ఇప్పుడు గొప్పసేవ చేయించుకుంటున్నారు ప్రభువు. ఓపికతో ప్రార్థించాము. ఆయన రక్షణకొరకు దేవునికే మహిమ కలుగును గాక.

రెండవ బాబు విజయ్‌పాల్ M.B.A.చేసి ఉద్యోగము చేస్తున్నపుడు దేవుని దర్శనముతో రాజీనామా చేసి వచ్చి 40 రోజులు ఉపవాసముండి తరువాత ఆత్మపొందుకొని బెంగుళూరులో ౹ఖువఎం లో బైబిలు కాలేజి చేసి MA.Mth, M.B.A. Vijay Pal 2002 జూన్ 26న వివాహము. గుడివాడ సజ్జా బర్నబాసుగారి రెండవ కుమార్తె ప్రజ్వలను రెండవ బాబుకిచ్చినారు. గుడివాడలో Z.P.T.M.లోనే 10 సం॥ సేవచేసి ఇకూస్ బైబిల్ కాలేజికి డేరెక్టర్‌గా ఉన్నాడు. ఇప్పుడు హైదరాబాదులో కాలేజి పెట్టి (బ్రాంచి) సంఘపరిచర్య చేస్తున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. అద్భుతంగా ఆయన పరిచర్యలో ప్రభువు వాడుకొంటున్నారు. చిన్నవాడే దేవునిస్వరం విన్నాడు. సేవపిలుపు అయితే బాగా చదువుకొని ఉద్యోగము చేసివస్తానని చెప్పినాడు ప్రభువుతో. అలాగే దేవుని దర్శనమునకు విధేయుడయ్యాడు.

3వ బాబు సాల్మన్‌రాజు డిగ్రీ పూర్తిచేసిన తరువాత బైబిల్ కాలేజికి వెళ్ళుటకు ఇష్టపడలేదు. ఎందుకంటే అప్పటికే మా ఇద్దరి కుమారులు బయట వేరొక పరిచర్యలో ఉన్నారు. ఇక్కడ పరిచర్య ఒక్కరికి కష్టముగదా. నేను తప్పకుండా ఇక్కడ ఉండాలి అని మా దగ్గరనే ఉండి పరిచర్యలో సహకరిస్తూ ఎంతో అభివృద్ధిలోకి పరిచర్యను నడిపించాడు.

2008 అక్టోబరు 7న గుడివాడ Life of the World Minstrees Founder President అయిన ఇతంజలిస్ట్ పులికాక సాలెమన్ గారి మూడవ సంతానము హెప్సిబా ప్రియదర్శినిని మా అబ్బాయికి చేసుకున్నాము. Softwear Job చేస్తూ రాజీనామా చేసి వచ్చింది.

2009 లో వారు ఇప్పుడు మెట్టపల్లిలో (కరింనగ్ జిల్లా) చర్చి పరిచర్య జరిగిస్తున్నారు. దేవుడు వారిని అద్భుతంగా వాడుకొంటున్నారు. వారికి పాప, బాబు. మాకెలాంటి విశ్వాసమో మా కుమారులకు కూడా అదే విశ్వాసము. దేవునిపై ఆధారపడి ఆయన పని చేస్తున్నారు. దేవునికి స్తోత్రములు.

మాకున్న మరొక సంతోషము ఈ దైవజనుల ద్వారా రక్షించబడిన చాలామంది మంచి విశ్వాస జీవితంలో, సేవలో బలంగా వాడబడుచున్న గొప్ప భక్తులున్నారు. అందును బట్టి దేవునికే మహిమ. (గత 35 సం॥ల క్రితము) వెనిగళ్ళ అరుణరేఖ వారి తల్లి తండ్రి, లలిత, వెంకటేశ్వరరావుగారు. భానుప్రసాద్ అరుణ పిన్ని, బాబాయి లీలా నరసింహారావు గారు ఇపుడు ఆయన సేవచేస్తున్నారు. నిజామాబాదులో మేమంతా ఒకే విశ్వాసములో బ్రతికిన వాళ్ళము. సంఘ సహవాసములో బలంగా, ఆశక్తిగా వుండేవారు. స్కూల్ టీచర్స్‌గా ఉంటూ బోధన్ నుండి నిజామాబాద్ ప్రార్థనకు వచ్చేవారు. వారింట్లో ఎప్పుడూ ప్రార్థనలు జరుగుతూ ఉండేవి. ఎప్పుడు ఆత్మలభారము కలిగి ఉండేవారు. సేవలో సహకరించేవారు. అరుణ, భాను మంచి విశ్వాసములో పెరిగినారు. వారి తల్లి నిత్యము ప్రార్థించేవారు. అనేక మందిని క్రీస్తులో ప్రభావితం చేశారు. మంచి సాక్షులుగా ఉండేవారు.

అరుణ రక్షణబాప్తీస్మము తీసుకొని ఎంతో భక్తిగా తన చిన్ననాడే ఆత్మల భారముతో ఉండేది. వాక్యము మీద ఆశతో జీవించేవారు. చిన్నతనంలో తల్లిదండ్రులను ఒక్కసారిగా ప్రభువు తీసుకున్నారు. అమ్మాయిని బ్రతికించింది అనర్గళమైన ఆత్మవిశ్వాసము. నిరంతరము ప్రభువుమీద ధ్యాస, ప్రభువు పనికై తపన, మధ్యలో 20 సం॥ల తర్వాత బంధుత్వంగా కలిశాము. ఎంతో ధైర్యంగా ప్రభువు మాటమీద ఆశపెట్టుకొని జీవిస్తున్నారు. గద్దె

భానుప్రసాద్–శాంతి, వెనిగళ్ళ రాజేంద్ర ప్రసాద్–అరుణ రేఖ. వీరు అమెరికాలో స్థిరపడినారు. వీరి విశ్వాస జీవితము చాలా గొప్పది.

2010 జూన్‌లో మేము విజయవాడ నుండి మా మేనమామ కారులో హైదరాబాదు వస్తున్నాము. డ్రైవరు స్పీడులో నడిపిస్తున్నాడు. తెలియకుండా అకస్మాత్తుగా కోదాడదగ్గర ఒక ఆవు పరుగెత్తి వచ్చి మా కారును అడ్డుకుంది. ముందు అద్దంమీద పడి ఎగిరి దూరంగా పడి చనిపోయింది. ముందు అద్దం పగిలి ఒక ముద్దగా వచ్చి పాస్టరుగారి మీద పడింది. సడన్‌బ్రేకుతో ఆగింది.

నొసటమీద గట్టిగా తగిలి కుప్పకూలినట్లయింది. అందరు పరుగెత్తివచ్చారు. మాకు నోటిమాట రాలేదు. చనిపోయారు అనుకున్నారట. అద్దం పగిలి చిన్న చిన్న రవ్వలు అందరిమీద పడినవి. డ్రైవరు తను ఉన్నారు నేను అన్నయ్య, వదిన, వారి మనవరాలు వెనుక కూర్చున్నాము. దేవుని యొక్క మహాకృప వలన భయంకరమైన మరణము నుండి దేవుడు విడిపించి కాపాడినారు. కారు ముందు భాగమంతా పాడైపోయింది.

2011 ఏప్రిల్ 19 19–14–2011లో నాభర్తగారి పట్ల అద్భుతము చేశారు. సాయంత్రము 6 గ॥ల సమయంలో హై.బీపితో ఒక్కసారిగా కుర్చీలోనుండి జారి క్రిందపడిపోయారు. నా కళ్ళముందే కళ్ళుమూయబడ్డాయి. నోరు బిగుసుకు పోయి నురగ, రక్తము వచ్చాయి. అచేతనంగా ఒక శవంలాగా పడిపోయారు. జూన్‌గారు వచ్చారు. పెద్దబాబు ఇద్దరు కలిసి బొలేరాలో వేసుకొని ఆస్పటల్‌కు వెళితే హైదరాబాదు వెళ్ళమన్నారు. రాత్రికి సికింద్రాబాద్‌లోని యశోద హాస్పటల్‌లో చేరినాము. ధూళిపూడి గురుప్రసాద్‌రావుగారి అబ్బాయి ప్రభాకర్ ఎంతో సహకరించాడు. డాక్టర్‌తో మాట్లాడి చేర్పించారు. పిల్లలందరు హైదరాబాద్‌లో ఆస్పటల్ దగ్గర ఎదరుచూస్తున్నారు. రాజు, ప్రియ మెట్టపల్లి నుండి వచ్చారు. జాన్‌గారు ఆయన్ని అంబులెన్స్‌లో తీసుకొని వెళ్ళారు. చెప్పలేము, భరోసా ఇవ్వలేము అన్నారు. ట్రీట్‌మెంటు మొదలుచేశారు. కోమాలోకి వెళ్ళిపోయారు. ఐ.సి.లో పెట్టినారు. MRI Scan లు అన్నీ తీస్తున్నారు. బాడీ ఏమి సహకరించడంలేదట. చల్లగా బకెట్‌తో నీళ్ళుపోసినట్లుగా ఉంది అని డాక్టర్స్ అంటున్నారు.

అందరు ఏడుస్తున్నారు. ప్రార్థనచేస్తున్నారు. హాస్పటల్‌కు వచ్చి దర్శించి వెళుతున్నారు. బయట పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. నేను బాధతో ఏడుస్తూ కుర్చీలో కూర్చుంటే దేవుని మాట నాకు వినిపిస్తుంది. 30వ కీర్తన చదువు అని. నాదగ్గర ఎప్పుడూ చిన్న బైబిలు ఉంటుంది. తీసి చదివినాను. వాక్యాలు వ్రాయాలంటే స్థలం చాలదు. నాలో గొప్ప ధైర్యము,

సమాధానము, ఆదరణ కల్గింది. ఆరోజు శుక్రవారము ఆశలు వదులుకున్నాము. అలాగే ఒంటరిగా కూర్చున్న లాజరు సమాధి జ్ఞాపకము వచ్చింది. మహిమకొఱకు జీవించాలి అంటారు కదా! ఒట్టిగానే మహిమ వస్తుందా? కష్టపడాలి. సమాధిలో అన్నట్లుగా నేను మహిమపొందుతాను అన్నమాట జ్ఞాపకము తెచ్చుకొని విశ్వాసము పెరిగింది.

అందరు ఉపవాసమండి ప్రార్ధన చేస్తున్నారు. ఆదివారము తెల్లవారు జామున కొంచెము కదిలారట. 8 గం॥లకు వెళ్ళేసరికి కళ్ళుతెరచి డాక్టరును చూస్తుంటే అన్ని పరీక్షించినవారు నన్ను గుర్తుపట్టినారు. కాలుచేయి పడిపోతుందేమో, మాటరాదేమో, ఏదోఒకటి దెబ్బతిని తిరిగి వస్తారనుకున్నారు. అద్భుత దేవుడు తన పునరుద్ధాన శక్తితో లేపారు. నేను దేవుని దగ్గర ఉన్నాను, ఇక్కడెందుకు ఉన్నాను అంటున్నారు. హాస్పటల్‌కు ఎవరు తీసుకొచ్చారు అంటున్నారు. చూచిన దర్శనం చెప్పారు. పరలోకంలో దేవునితో ఉన్నారట. "నిన్ను నేనే తీసుకొచ్చాను అని ఒక్కక్షణంలో అక్కడ ఎంతోమంది ఏడుస్తున్నారు నేను చూడలేను పో అన్నారట"

పోయి నేనేమిచేయాలి అంటే నా ప్రేమను పంచు, పునరుద్ధాన శక్తితో లేపాను అని ప్రకటించు అన్నారట. మా రెండవ బాబు ఏడ్చి ప్రార్థించాడంట. ప్రభువా పునరుద్ధానము గూర్చి బోధిస్తున్నాము అనుభవించలేదు. మా నాన్నను నీ పునరుద్ధాన శక్తితో లేపు అయ్యా అని అడిగినాను. నా దేవుడు బ్రతికించాడు అని అలా పిల్లలందరు ఒక్కొక్కరు ఎంతో దేవున్ని అడిగి పొందుకున్నారు. నా తల్లి, పిన్నిలు ఎవరని చెప్పను ఉపవాసముండి ప్రార్థించి జవాబుతెచ్చారు. దైవసేవకు ఆత్మీయ బిడ్డలు ఎంత ప్రేమతో జవాబు తెచ్చుకున్నారు. వారంరోజులు జనరల్ రూమ్‌లో ఉండాలి అన్నారు. మంగళవారము డాక్టరు వచ్చి చూచి పరీక్షించి అంతా బాగుంది. మీరు వెళ్ళిపోవచ్చు అన్నారు. ఒక్కరోజులో అని టెస్టలు నార్మల్‌గా వచ్చాయి. దేవుని మహిమపరిచి ఇంటికి వాచ్చము.

నా జీవితంలో మరణ అపాయము నుండి తప్పించబడ్డాను. 1995లో చనిపోయాను అనుకున్న నేను ప్రభువు కృపవలన బ్రతికినాను. 2009లో గర్భసంచికి పుండువుంది ఆపరేషన్ అన్నారు దేవునికి ప్రార్ధన చేసుకొని వారంరోజుల తరువాత స్కాన్‌చేస్తే అంతా నార్మల్ అని రిపోర్టు వచ్చింది. గొప్ప దేవుడు ఆయన చేసిన మేళ్ళు ఎన్నో.

2012లో జూన్ 9వ తారీఖున మాకు అమెరికా ప్రయాణము. మేము ఎప్పుడు అనుకోలేదు. వెళ్లితే మా పిల్లలు వెళతారేమో గాని మాకు అమెరికా గురించి ఆ తలంపు లేదుగాని ఒక్కమాట మాత్రము నిజము భూ దిగాంతముల వరకు దేవునికి సాక్షులై

యుండాలని ఆశించేవాళ్ళము. అలాగే ఆత్మీయ బిడ్డలు అమెరికాలో ఉండటము, వారి ప్రేమను మేము పొందటము అనేది కేవలము దేవుని కృప. ఆయన సంకల్పము.

అమెరికాలో ఉన్న శ్రీ వెనిగళ్ళ రాజేంద్ర ప్రసాద్, అరుణా రేఖ వీరిద్దరు మమ్ములను ప్రేమించి ఇచ్చిన ఆహ్వానమును బట్టి ఎప్పుడు దేవున్ని స్తుతిస్తూ వారి కొరకు ప్రార్థిస్తూ ఉంటాము.

బిజినెస్ టికెట్ ఫస్ట్ క్లాసులో రావటానికి అన్ని ఏర్పాట్లు చేసి వీల్ చైర్లు కూడా ఏర్పాటుచేసి మాకు అన్ని సంగతులు చెపుతూ ఎంతో జాగ్రత్తగా మా ప్రయాణము గురించి శ్రద్ధ తీసుకొన్నారు. చాలా క్షేమకరంగా అమెరికా చేరుకోవాలి అని పిల్లలందరు, సంఘంము అంతా ప్రార్థనచేసి హైదరాబాదు వచ్చి మమ్ములను సెండాఫ్ చేశారు.

ఎంతోక్షేమకరమైన ప్రయాణముతో మేము 2012 జూన్ 10న J.F.K లో దిగినాము. మమ్ములను ఎంతో ప్రేమతో Airport కు వచ్చి రిసీవ్ చేసుకున్నారు. ప్రసాద్‌బాబు, ఇంట్లో బేబి, పిల్లలు ఎంతో ప్రేమతో రిసీవ్ చేసుకున్నారు. విమానములో ఉన్నంతసేపు దేవుని క్రియలు ధ్యానించుకుంటూ ప్రసాద్ అరుణ కుటుంబాన్ని బట్టి దేవున్ని ప్రార్థిస్తూ సంతోషంగా రాగలిగినాము. వచ్చిన తరువాత రోజూ వాళ్ళతో గడిపే అనుభవము మాటల్లో చెప్పలేను. ఆ బిడ్డలు విశ్వాసముతో వారు దేవుని కొఱకు జీవిస్తున్న విధానము, ఆశక్తి, దేవుని సేవకులయెడల చూపుచున్న ప్రేమ, ఆతిథ్యము, దేవుని సేవపట్ల ఉన్న తపన, విరామము అంటూ లేకుండా దేవుని కొఱకు వారు సమయము వెచ్చించటము, వారి పిల్లలను పెంచేవిధానము, దేవుని కొఱకు, దేశం కొఱకు అనేకుల రక్షణార్థమై వారి కుటుంబము సిద్ధపడేవిధానము చాలా గొప్పది.

తల్లి దండ్రులను చూచిన దానికంటే ఎక్కువైన ప్రేమను మాకు పంచారు. వారి ప్రేమ, ఔదార్యము గొప్పది. పిల్లలు కూడా హృదయపూర్వకంగా ప్రేమించి గౌరవించేవారు. న్యూ జెర్సీ కాన్‌ఫరెన్స్‌లో రవి జెకర్యా గారితో మా సాక్ష్యము పంచుకొనుటకు, వారితో గడుపుటకు సమయము కల్పించారు. ఫిలిగెల్పియా, న్యూ జెర్సీ వెళ్ళివచ్చాము. ఎక్కువ ఈ కుటుంబముతో కలిసి ప్రార్థించుటకు దేవుడిచ్చిన సమయము మాకెంతో తృప్తినిచ్చింది.

అలాగే గద్దె భానుప్రసాద్, శాంతి వారి గృహములో కూడా సంతోషంగా గడిపినాము. వారి చిన్ననాటి విశ్వాసము, ప్రేమ అలాగే ఉన్నది. వారి తల్లి ప్రార్థన విశ్వాసమే ఆ బిడ్డలను ఈ రీతిగా నడిపించినది. అరుణ మేము దేవుని కార్యాలు గురించి

మాట్లాడుకునేటపుడు దేవుడు ఆ బిడ్డల జీవితంలో ఎన్నో ప్రతికూల పరిస్థితుల్లో దేవునిపై, ఆయన వాక్యము, వాగ్దానములపై ఎలా ఆధారపడినారో తెలుసుకొని దేవున్ని స్తుతించినాము. మమ్ములను తృప్తిపరచి కుటుంబమంతా విమానాశ్రయంకు వచ్చి మమ్ములను సాగనంపుతుంటే గుండెలనిండా కృతజ్ఞతతో కూడిన దు:ఖము వచ్చింది.

ఆ బిడ్డలు మమ్ములను ప్రేమించిన విధానము తలపోసుకుంటూ వారి కొరకు ప్రార్ధించుకొంటూ క్షేమంగా హైదరాబాదు చేరినాము. 3 నెలలు ఈ బిడ్డలతో ఉండే అవకాశము అమెరికాలో మాకు కల్గింది. అన్యజనాంగములో నుండి రక్షించుకొని ఒక మాదిరికరమైన కుటుంబముగా ఉంచినందుకు దేవుని యందు అతిశయించి దేవుని మహిమపరిచాము.

ఇండియాలో కూడా చూడని సేవకులను, అనేకులను చూచి వారితో గడిపే అవకాశము మాకు అమెరికాలో వీరింటిలో కల్గింది. 2013లో దైవజనులకు (ఆయన) నడుమునొప్పి, వెన్నెముకలో నొప్పి, నడవలేని స్థితి మంచము మీదనే ఉన్నారు. హాస్పటల్‌కు వెళితే MRI Scan చేశారు. 5 చోట్ల నరము వొత్తుకుని భయంకరమైన బాధ అనుభవించారు. డాక్టరు ఆపరేషన్ చెయ్యాలి అన్నారు. మాకు భయము వేసింది. దేవుని దగ్గర బాగా ప్రార్ధించినాము. చాలా క్లుప్తపరుస్తున్నాము. డాక్టరు సత్యన్నారాయణ దగ్గరకు వెళ్ళారు. దేవుడు అద్భుతకరుడు. డాక్టరు చెప్పారు కొన్ని మందులు ఇచ్చి ఏదో పేరుకు ఇచ్చారు. ఆపరేషన్ పడుతుందనే అనుకుంటున్నాము కాని విశ్వాసము గొప్పది దేవుని కొరకు ఎదురుచూస్తున్నాము.

ఆశ్చర్యకరుడు. డాక్టరు ఆశ్చర్యపడేరీతిలో 2 నెలల్లో తిరిగి మామూలు స్థితిలో నడువగలిగినారు. ప్రయాణములు ఎక్కువ చేయవద్దు అన్నారు గాని సేవలో అనేకచోట్ల తిరుగుతూనే వున్నాము. నా మోకాళ్ళు రెండు అరిగిపోయినవి. 5వ స్టేజీలో ఉంది ఆపరేషన్ చెయ్యాలి అన్నారు. నాకు భయము వేసింది. దేవుడు నా జీవితములో ఎన్నో చేశారు. ప్రభువే స్వస్థపరచి బాగుచేయాలి అని దేవునిమీద భారము వేసినాము.

2015 జూన్ 23న మరియొకసారి ప్రభువు ఆ బిడ్డల ప్రేమనుబట్టి మాకు వారియెడల ఉన్న ప్రేమనుబట్టి వారు మళ్ళీ ఫస్ట్ క్లాస్ టికెట్స్, వీల్ చైర్స్ అన్ని సమకూర్చి, మాకోసం టికెట్స్ పంపించారు. హైదరాబాదులోని వారంతా ప్రార్ధించి పంపించారు. ఎంతో క్షేమకరంగా న్యూయార్క్ వచ్చాము. అరుణ, ప్రశాంత్ వచ్చి మమ్ములను రిసీవ్ చేసుకొని ఎంతో ప్రేమతో మమ్ములను ఇంటికి తీసుకొచ్చారు. కుటుంబమును బట్టి దేవున్ని స్తుతించినాము. వారితోపాటు అనేక స్థలాలను వెళుతూ దేవున్ని మహిమపరుస్తున్నాము.

ప్రతిరోజు ఇంట్లో ప్రార్థన, పాటలు, వాక్యము ఎంతో దీవెనకరంగా ఉంటుంది. పిల్లలు ఎన్నో తలాంతులు కల్గి దేవుని కొరకు వాడబడుట వర్ణించలేని ఆనందము. ఆదివారము ఉదయము మొదలు రాత్రివరకు దేవని సేవలోనే వుంటారు. ఎల్లప్పుడు దేవుని సేవకులు వస్తూంటారు. నిత్యం దేవుని మహిమపరుస్తారు. కుటుంమంతా దేవునికొరకే అంకితమయ్యారు. వారికొరకు ప్రార్థించే అవకాశమునుబట్టి నిత్యము దేవున్ని మహిమపరుస్తున్నారు. వారిని దేవుడు తన పరిచర్యలో బహుబలంగా వాడుకోవాలని ప్రార్థించుదాము.

న్యూ జెర్సీ కాన్ఫరెన్స్‌కు వెళ్ళినపుడు పెర్సిస్‌సుకుమారి కలిశారు. ఫిలదెల్ఫియా సుకుమార్ అలాగే అందరితో కలిసి సంతోషించాము. ఒకసారి అన్నారు (ప్రసాద్ బాబు) మీ సాక్ష్యము వ్రాయండి గ్రేస్ ఆంటికిస్తాము చక్కగా చేస్తారు అన్నారు. తరువాత గంటా బాబుగారు రావటం గ్రేస్ విజయగారు ఫోను చేయటం అరుణకు అరుణ చెప్పింది. మా అంకుల్ ఆంటి వచ్చారు అనగానే ఆవిడ మాట్లాడి మీ సాక్ష్యము వ్రాసి పంపించండి అన్నారు.

సాక్ష్యము గురించిన ఆ ఆశక్తి చూసినపుడు దేవుడు ఆ బిడ్డకిచ్చిన తలాంతును ఎంత ఓపికగా నెరవేరుస్తున్నారని దేవున్ని స్తుతించినాము. సాక్ష్యాన్ని చాలా క్లుప్తపరచి వ్రాయటం చాల కష్టమైంది. దేవుడు జరిగించిన కార్యాలు దేవుని చిత్తమైతే తన దాసులద్వారా వ్రాయటం జరుగుతుంది. ఆగస్టు 5న మా ప్రయాణము జ్ఞాపకము చేసుకోండి. అలాగే సాక్ష్యము పుస్తకాలు ఇచ్చి ఎన్నో సాక్ష్యాలను బట్టి దేవున్ని స్తుతించుటకు ఇచ్చిన అవకాశమును బట్టి మిమ్ములను ఎంతగానో అభినందిస్తూ మీ కొరకు, కుటుంబము కొరకు ప్రార్థిస్తున్నాము.

# 48. మాను మూకును కాను, గానీ మామూలు మనిషిగా మార్చి స్వయంగా మాట్లాడిన రక్షకుడు నా క్రీస్తు

– లక్ష్మి/డోర్క, శ్రీకాకుళం



యెషయా 35:4,5 'ఆయన వచ్చి తానే మమ్ములను రక్షించును. గ్రుడ్డి వారి కన్నులు తెరవబడును. కుంటివాడు దుప్పి వలె గంతులు వేయును. మూగవాని నాలుక పాడును.

పరిచయము :

ప్రభువు పవిత్ర నామములో మీకు శుభములు. నా పేరు బుడమూరి లక్ష్మి. మాది శ్రీకాకుళం జిల్లా, పొందురు మండలము లోలుగు గ్రామము. తల్లి ఎల్లమ్మ, తండ్రి వెంకయ్య. జ్వరంతో నోరు, కుడి కాలు చచ్చుపడిపోయాయి. ఒక మధ్య తరగతి వ్యవసాయదారుల ఇంటిలో జన్మించాను. నా జన్మ ఆనందకరమైనది కాదు. అంగవైకల్యముతో జన్మించాను. పోలియో వల్ల కాళ్ళు, చేతులు సరిగ్గా పని చేయలేని స్థితి. నోరు మాట్లాడలేదు. చెవులు వినబడవు. నోటిలో సొంగకార్చుకుంటూ అసహ్య స్థితిలో నా బాల్యాన్ని గడిపాను. మా స్వకీయులంతా వారికున్న పొలము 3 ఎకరాలు అమ్మేసి, ఎన్నో ఆస్పత్రుల చుట్టూ తిరిగారు. ముఖ్య పట్టణాల్లో విశాఖ, హైదరాబాద్‌లో డాక్టర్లు కాలు, చేయి రాదు. కుంటి జీవితమే గతి అని నిరార్ధరణ చేయగా కర్రతో రోడ్డుల వెంట స్నానం లేక అన్నం లేక అసహాయ స్థితిలో తిరిగే దాన్ని. ఆదరించేవారు లేరు. అసహ్యించుకొనే వారి మధ్య మాటలు లేని నేను యవ్వనంలో అడుగు బెట్టాను. మా స్వంత వారు గుళ్ళు గోపురాలు తిరిగినను నాకు స్వస్థత రాకపోయినందున దేవుడు లేడని నేను నాస్తికునిగా నిలిచాను. నా తల కూడా స్థిరంగా నిలిచేది కాదు. ఒక ప్రక్కకు ఒరిగిపోయేది అంతలో ఎవరో నన్ను దయ తలచి వికలాంగులకు వసతి ఉందని చెప్పి మూగ చెవిడి వారికి మాట్లాడే సంజ్ఞల భాష నేర్పించే అవకాశముందని జాలితో నన్ను తీసుకొని వెళ్ళి చేర్చారు. గతంలో నాపై ఖర్చు పెట్టలేక నన్ను వదిలేసారు.

బస్టాండు, రైల్వేస్టేషన్‌లో భిక్షము అడుగుతూ గడిపేదాన్ని. సరియైన బట్టలుండేవి కావు.

మా స్వకీయులంతా నన్ను పోషించి సంరక్షించే సమయము డబ్బు లేక నన్ను వదిలేసి పొలం పనులు చూచుకొని వారి బ్రతుకు వారు చూచుకున్నారు. నా ఒంటరి జీవితంలో జాలి గల వారి దయతో మూగ వారి భాష తెలిసుకోగలిగాను. అంతేకాదు మూడు చక్రాల బండి కూడా ఇచ్చారు. ఏదైనా చిన్న పని చేయగలనేమోనని ఎందరినో ఆశ్రయించాను. నా భాష అర్థం కానందున ఎవరూ సాహించలేదు. మరి కొందరు ప్రేమతో నా పరిస్థితి గుర్తించి నాకొక చిన్న కిరణా షాపు పెట్టుకొనుటకు అంగవైకల్యము గల వారికి లోను (అప్పు) ఇస్తున్నారని చెప్పారు. ఎందుకో ఏదో రీతిగా సంజ్ఞలతో చెప్పగల్గి షాపు ద్వారా బ్రతకాలని నేను ఒక ఆఫీసరు గారిని ఆశ్రయించాను. నా జీవితంలో క్రీస్తు ప్రేమను కనపరచి క్రీస్తును పరిచయం చేసిన ఆ ఆదర్శ మూర్తి నా ఆరాధ్య దైవం. దేవుని బహుమతియే. ఎందరో వ్యక్తులు నన్ను చూచేవారు. నా ఆకలి గుర్తించిన వారు అరుదు. నన్నొక పిచ్చి అమ్మాయిగా దూరంగా నిలిపి అసహ్యతతో తృణీకరించారు.

## క్రీస్తు ప్రేమ చూచాను :

ఆప్యాయత చూపిన మొదటి వ్యక్తి భారతీ గారే నేను లోను కొరకు సంతకం చేయాలని ఆఫీసులోనికి వెళ్ళగానే అపురూపమైన క్రీస్తు కాంతి ఆమె ప్రేమ నిండిన ముఖంలో చూచాను. కొండ మీద ప్రసంగం తర్వాత జనులు ఆకలితో నుండగ జాలితో కదిలింపబడ్డారన్నారు. అదే దయతో 'అమ్మా, లక్ష్మీ అన్నం తిన్నావా?' అని ఆప్యాయంగా పలకరించారు. నన్ను ఎదురుగా నున్న కుర్చీలో కూర్చోమన్నారు. సంతకం పెట్ట గలవా అని అడిగారు. ఆకలి బాధ తెలిసిన వ్యక్తి గనుక తన అన్నాన్ని నా ముందుంచి తిను అంది, నేను వెంటనే ఆకలితో ఎడమ చేతితో తిన సాగాను.

'అరె అలా అన్నం చిందిపడిపోకుండా జాగ్రత్తగా నెమ్మదిగా కుడి చేత్తో తినాలమ్మా' అని నేర్పించారు. అంతేకాదు గులాబి రంగు జేబు రుమాలుతో నా మూతి తుడిచి, బల్ల మీద చిందిన అన్నం తుడిచారు. నీరు త్రాగించారు. కృతజ్ఞతతో సైగ చేశాను. ఇక నాతో క్రీస్తును గూర్చి చెప్పసాగారు.

## క్రీస్తు గూర్చి ప్రప్రథమంగా విన్నాను :

'అమ్మా లక్ష్మి, నీవు అన్ని దేవుళ్ళను పూజించావు కదా, ఏ దేవుడూ లేదని

చెబుతున్నావు. నీ మూగ భాష నాకు అర్థమవుతుందిలే. అయితే నాకు తెలిసిన ఒక డాక్టరున్నారు. ఆయనకు డబ్బులిచ్చే అవసరం లేదు. నీకు పనిచేయని నోరు, చెవులు, కాలు, చేయి తిరిగి వస్తాయి. స్వస్థత లభిస్తుంది. ఇదిగో ఎదురుగా నున్న క్యాలండరు చూచావా, ఆ బొమ్మలో నున్న వారే ఆ డాక్టరు యేసుక్రీస్తు' అన్నారు. నాకు చాలా కోపం వచ్చింది. నేనే దేవుళ్ళను నమ్మను. నాకీ మాటలు చెబితే నీ ఉద్యోగం తీయించేస్తాను. నీ పని నీవు చూచుకో అని కోపంగా అరిచాను. ఎదురుగా ప్రశాంత వదనంతో గొర్రె పిల్ల నెత్తుకున్న యేసుక్రీస్తు మంచి గొర్రెల కాపరిగా నిలిచారు. మా ఇల్లు ఎవరో దోచుకున్నారు. నాకు ఆధారం లేదు. మరలా భారతి గారిని చేరాను. ఎందుకొచ్చావు లక్ష్మీ నాతో వస్తావా అని అడిగారు. ఆమె బండి మీద నన్ను ఇంటికి తీసుకొని వెళ్తూ, అ వ్యస్థంగా పెరిగిన చింపిరిగా వాసనతో 15 రోజులుగా స్నానం లేని స్థితిలో నున్న నన్ను జుట్టు కత్తిరించే మంగలితో బాయ్ కటింగ్, (అంట కత్తిరి) చేయించారు. ఇల్లు చేరగానే స్నానం చేయించి మంచి బట్టలిచ్చారు. నేను నేడు ఆలోచిస్తే క్రీస్తు చెప్పినట్లే భారతి గారు ఆచరించి భళా నమ్మకమైన మంచి దాసురాలని గ్రహిస్తాను. క్రీస్తు పరిచర్య చేయలేని వారితో చెప్పినట్లు కాక భారతి గారి చేసింది గొప్ప ప్రేమ కార్యమే. మత్తయి 25:43 "పరదేశినై యుంటిని మీరు నన్ను చేర్చుకొనలేదు. దిగంబరినై యుంటిని నాకు బట్టలియ్యలేదు. రోగినైయుంటిని మీరు నన్ను చూడరాలేదు" ఈ మాటలు బట్టి క్రీస్తు కోరిన పనులన్నీ విశ్వాసి చేయాలని క్రీస్తు ఆశయం మరొక సందర్భములో క్రీస్తు కొందరిని ఆహ్వానించగా పెండ్లి విందు సిద్ధముగా నున్నది పిలువబడిన వారు పాత్రులు కారు రాజమార్గమునకు పోయి మీకు కనబడువారినందరిని పిలువుడని చెప్పారు. మాలాటి వెట్టి వారిని దేవుడు ఎన్నుకొని రక్షించి తన పరిచర్యకు చదువులేని నన్ను, ఆనాధను అంగవైక్యలముతో రోడ్డు మీద పిచ్చి స్థితిలో నన్ను పెంటకుప్ప నుండి లేవనెత్తి బండపై నా అడుగులు స్థిరపరిచన క్రీస్తును కనుగొన్నాను. ఆశ గల ప్రాణములను తృప్తిపరచు క్రీస్తు నాకు క్రొత్త జీవితాన్ని ఆరంభించుటకు భారతి గారిని ఉపయోగించారు. నా పనులు నేను చేసుకొనే రీతిగా భారతి గారు నేర్పారు. వారికిద్దరు అబ్బాయిలు ఉండగా నన్నొక స్వంత కుమార్తెగా ప్రేమించి 6 లేక 7 సంవత్సరాలు ఓర్పుగా పెంచారు. ఆమెను ఎందరో ప్రశ్నించేవారు. 'భారతి గారూ,

మీరా పిచ్చి లక్ష్మి పట్ల అంత దయ చూపి శ్రమ, ఖర్చు వినియోగించుట ఎందకండీ అనగా" నాకు నేను నమ్మిన ప్రభువు ఈ లక్ష్మికి స్వస్థత నిచ్చి, ఆమె పాటలు పాడి దేవుని సాక్షిగా ఉండగలదేమోనన్న నిరీక్షణ ఆమెను చూడగానే కల్గింది. ప్రభువే ప్రవచనాత్మకంగా నాలో ఆ భావం రేకెత్తించగా నాకీ ప్రేమ కల్గింది. ఆమెను క్రీస్తు కొరకు సాక్షిగా నిలిచే వరకు పెంచుతానన్నారు. భారతి గారు ఆమెతో చర్చికి తీసుకొని వెళ్ళేది. చర్చి స్థలం గుర్తుంచుకున్నాను. కానీ బజార్లు తిరగే గతం వల్ల సినిమా పిచ్చి నాలో పాపంగా నిలిచింది. ఒక రాత్రి ఇల్లు విడిచి వెళ్ళి సినిమా హాలులో గడిపే సమయంలో పడిపోయాను. నన్ను గుర్తించి మేడమ్ భారతి గారి ఇంటికి చేర్చగా నేను అబద్ధము చెప్పాను. పాస్టగారింటికి వెళ్ళానన్నాను. వ్యభిచారంతో పట్ట బడిన స్త్రీ వలె సిగ్గుతో నున్నాను. వెంటనే ఎంతో ఉద్రేకంతో భారతి గారు క్రీస్తు దేవాలయంలో విక్రయం చేయువారిని శిక్షించిన రీతిగా నన్ను కర్రతో బాగా కొట్టారు. చాలా దుఃఖంతో మరలా ఇల్లు వదలి బస్సు స్టాండు దగ్గర ఒక బెంచి మీద పండుకొని నిద్రపోయాను.

**ప్రభువు నన్ను మొదటిగా దర్శించారు :**

నాకు చాలా ఒంటరితనం కల్గింది. దెబ్బల బాధతో జ్వరం వచ్చింది ప్రభుని మెల్లని స్వరాన్ని విన్నాను. 'లక్ష్మి, లేమ్మా' అన్నారు. ఆ తర్వాత భారతి గారు ఎక్కడి కెళ్ళావమ్మా అని జాలితో తిరిగి చేర్చుకున్నారు. తప్పిపోయిన కుమారుడి తిరిగి వచ్చినరీతిగా బాధ పశ్చాత్తపం కలిగాయి. వేడి నీళ్ళతో స్నానం చేయించారు. ఆమె స్వయంగా టవెల్‌తో తుడిచి మంచి బట్టలిచ్చారు. ఆ జ్వరం 7 రోజులు కొనసాగింది. మరలా ప్రభు స్వరం విన్నాను.'లక్ష్మి, నీ పాపాలన్నీ ఒప్పుకో' అని రెండవసారి స్వరంతో మాట్లాడారు. నేను వెంటనే భారతి గారి కాళ్ళు పట్టుకొని క్షమించమని నమస్కరించి మూగ భాషతో వేడుకున్నాను. 'లక్ష్మి, నేను దేవుడను కాదమ్మా క్రీస్తు పాదాలు పట్టుకోవాలన్నారు. నాకు ఏది పగలో, రాత్రో తెలియ లేదు. నేను పాపిని తప్పులు చేశాను. క్షమించండి అన్నాను.

నా గత నిర్లక్ష జీవితంలో చేసిన ప్రతి పాపము సినిమా రీతి వలె నా ముందు తిరుగసాగింది. దిగులు కల్గింది. ఏడ్చేదాన్ని. ఈ రీతిగా భారతి గారింట్లో 3 నెలలు గడిచాయి. నాలాంటి మూగదానికి ఎన్నో పాపాలున్నాయి. ఇక మామూలుగా జీవించే మంచి మనస్సున్న వ్యక్తులకు మరెన్ని పాపాలుంటాయోనని తలంచేదాన్ని. ఆ రాత్రి

దుఃఖంతో నిద్రపోయాను. ఆ క్షణం సిలువపై వ్రేలాడు క్రీస్తును చూచాను. నేనెన్నడూ పటము కూడా చూడలేదు. కానీ గొర్రె పిల్లతో నున్న క్రీస్తు సిలువపై ఉన్నాడని గుర్తించగలిగాను. 'లక్ష్మీ, నేను నీ కొరకే మరణించాను' అని స్వరంతో చెప్పారు. నిజమే క్రీస్తు నీ కొరకు నా కొరకు సృష్టిలో ప్రతి మానవుని కొరకు సిలువపై మరణించారు. యోహాను 3:16 దేవుడు లోకాన్ని ప్రేమించారు. అద్వితీయ కుమారుని లోకానికి పంపి ఎవరూ నశింపక పరలోకం చేరాలనే ఆయన కోరిక క్రీస్తు కిరీట ధారిగా నున్నారు. చేతులతో మేకులు, రెండు కాళ్ళకు ఒకే మేకు కొట్టబడింది. మేకు నుండి కాళ్ళ ద్వారా రక్తము నీరు నాపై చింది ప్రవహించసాగాయి. కళ్ళు మూసినా తెరచినా వెలుగు కనిపించసాగింది. ఆ స్వరం మాటలే వింటున్నాను. 'లక్ష్మీ, నీ పాపాలు క్షమించబడ్డాయి' అని వినిపించుట మాత్రమే కాక, గోడ మీద వాక్యం కనిపించింది. నాకు చదువు రాదు గాని అర్థమైంది. ఆ వాక్యం నాకు చెవిలో వినిపించింది. 1 యోహాను 1:9 'ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులుగా చేయును' నిజమే అబద్ధాలు, మోసాలు, పగ ద్వేషము, నిరుత్సాహం, నిర్లక్ష్యము, కాలయాపన, దూషణ, త్రాగుడు, అల్లరితో కూడిన ఆట పాటలన్నీ పాపాలే. ఆ రోజుల్లో కాకినాడ నుండి ప్రసంగీకులు దైవజనులు మా ప్రాంతం వచ్చారు. మంచి ఉజ్జీవ కుటాలు నిర్వహించారు. భారతి గారితో క్రీస్తు స్వరం గూర్చి చెప్పాను. 'నా పాపాలు క్షమించారండి. క్రీస్తు గూర్చిన మాటలు వినాలని ఉంది. దయతో మీరు ఆయన దగ్గరకు తీసుకొని వెళ్ళండి' అని అడుగగా, మనకు సంబంధించిన సంఘం కాదు నాకు కుదరదన్నారు. నేను చాలా బలవంత పెట్టగా నన్ను తీసుకొని వెళ్ళగా గురువారం మధ్యాహ్నం మీటింగుకు వెళ్ళగా, ఆ ప్రాంతమంతా జనాలు, స్థలము దొరకలేదు. చర్చి, బయట అడుక్కునేవారు కూర్చుండే చోటులో నా కర్రతో తల ఊపుతో, కాళ్ళు చేతులు వంకరతో నడుస్తూ వెళ్ళి మౌనంగా కూర్చుని వున్నాను. ఈ రీతిగా శుక్ర, శనివారాలు అక్కడే గడిపేశాను.

నేను క్రీస్తు రక్షించిన రోజు మొదలు మనస్సు ప్రశాంతంగా క్రీస్తు స్వరం జ్ఞాపకాలతో గడిపే ఆ రోజుల్లో మరొకసారి చాలా ఎక్కువ సేపు స్వరం వినిపించింది. దైవ వాక్యం నాకు ఏమీ తెలియదు. ఆయన చెప్పే మాటలు బైబిలులో ఉంటాయని కూడా గుర్తించలేని అసహాయురాల్ని. యెషయా 39:1-9 'యెషయా గ్రంథంలో విలువైన మాటలన్నీ

విన్నాను' ప్రత్యేకించి వచ్చి తానె మమ్మును రక్షించును. గ్రుడ్డి వారి కన్నులు తెరవబడును. చెవిటి వాని చెవులు విప్పబడును. కుంటివాడు దుప్పి వలె గంతులు వేయును. మూగ వాని నాలుక పాడును అరణ్యములో నీళ్ళు ఉబుకును అడివిలో కాలువలు పారును. ఎండమావులు మడుగులగును ఎండిన భూమిలో నీటి బుగ్గలు పట్టును. నేను చర్చి బయట ఒంటరిగా కూర్చున్న రెండు రోజులు వరుసగా ఇవే మాటలు రింగుమంటూ పదే పదే వినిపించసాగాయి. రాత్రి పగలు వరుసగా అదే స్వరం విన్నాను. ప్రసంగం ముగిసిన వెంటనే జనాలందరూ ఇంటికి వెళ్లిపోయిననూ నేను అక్కడే పడి ఉన్నాను. నాకు రోడ్డుపై, బస్సు స్టాండు బెంచీపై ఒంటరిగా జీవించుట అలవాటైంది. గనుక భయం లేదు. ఎవరో దయతో దుప్పటి కప్పారు.

ప్రభువు దర్శనము రెండవసారి చూచాను :

ప్రభువు ఉనికిని చూచాను. లక్ష్మి అని పిలిచారు. కోటి సూర్యుని కాంతితో వెలుగుతో కన్పింగా చాలా భయం కల్గింది. మెల్లగా నా కుంటి కాలపై మెత్తని హస్త స్పర్శ అనుభవించాను. యిర్మియా 1:4-10 దైవ వాక్యం గోడపై చూపించి, చదువు లక్ష్మి అన్నారు. నాకు చదువు రాదని ఏడ్చాను. సరే నేనే చదువుతాను నీవు శ్రద్ధగా విను లక్ష్మి అన్నారు. నేను నీళ్ళలోనికి దిగే ముందు ప్రార్థన చేసుకున్నాను. 'ప్రభువా నా పట్ల అద్భుతము జరిగితే నా కాళ్ళు చేతులు, నోరు చూపిస్తూ యేసే మాట్లాడే దేవుడని నన్ను హీనపర్చిన వారందరి ముందు కనిపించి సాక్షమివ్వానలి యేసుతో నిబంధన చేసుకున్నాను. వెంటనే కాంతి గల వెలుగు కనిపించింది. టి.వి.కన్నా వెలుగుగా ఉ ంది. నీటిలో నుండగా ఒక్కసారిగా జిగేల్‌మనే కాంతితో జిమ్ అని కరెంటు షాకు కొట్టిన వెంటనే గుండె ఝల్లుమంది. షాకు తగిలిన భావం నా చేతికి కాళ్ళకున్న వంకరలన్నీ సమసిపోయి, అందరి కాళ్ళు, చేతుల వలె మామూలు వ్యక్తిగా మారాను. అంగవైకల్యం పూర్తిగా పోయింది. వెంటనే సైతాను స్వరం కూడా స్పష్టంగా వినిపించింది. దానిని గుర్తించగలిగాను. యిర్మియా 1:4-10 'గర్భంలో నిన్ను రూపింపక ముందే నిన్నెరిగితిని-ప్రవక్తగా ప్రతిష్టించాను. బాలడననవద్దు నేను పంపు వారి యొద్దకు పోవలెను. ఆజ్ఞాపించినానని చెప్పవలెను. భయపడకు, నిన్ను విడిపించుటకు తోడై యున్నాను.' ఈ మాటలన్నీ స్వయంగా స్వరంతో చెప్పారు. నీ నోటి నా మాటలు ఉ

ంచాను. పెళ్ళ గించుటకు, విరుగ గొట్టుటకు నశింపజేయుటకు పడ ద్రోయుటకు కట్టుటకు నాటుటకు జనముల మీద రాజ్యాముల మీదను నిన్ను నియమించానని వివరంగా బోధించారు. చదువు రాని అంగవైకల్యంతో నున్న అనాధను గూర్చి ఇన్ని మాటలు చెప్పుచుండగా పౌలు వ్రాసిన మాటలు ఆ తర్వాత గ్రహించగలిగాను.

'మిమ్ములను పిలిచి చూడుడి జ్ఞానులు, ఘనులు గొప్ప వంశము వారిని కాదు జ్ఞానులను సిగ్గు పర్చాలని వెఱ్ఱి వారిని, బలవంతులను సిగ్గు పర్చుటకు బలహీనులు ఏర్పరచుకున్నారు.

నా చెవిలో చదువు నేర్పారు. నా చేయి చాపి మాటలన్నీ వివరించారు. నాకు స్పష్టంగా మాట వచ్చేసింది. చదువు ప్రభువే నేర్పించారు. నా మీద గొప్ప వెలుగు ఆవరించింది. అంతలో చర్చి గేటు తెరిచారు. చర్చిలోనికి అందరూ వచ్చేశారు. భారతి గారు కూడా వచ్చారు. ఆ రోజు ప్రసంగ సారాంశము నికోదేము క్రీస్తును రహస్యముగా దర్శించుట నాకు రక్షణ తర్వాత బాప్తీస్మము అవసరము ఈ వాక్యం నేర్పించి నీటి మూలముగా ఆత్మ మూలముగా జన్మించుట అవసరమని క్రీస్తు చెప్పారంటే నా కెందుకో ఈ అనుభవము కావాలని కోరిక కల్గింది. నా నోరు వచ్చింది. కాళ్ళు వస్తాయని ఆశ కల్గింది. నేను భారతి గారు ద్వారా బాప్తీస్మము కావాలని పేరు ఇచ్చాను. లక్ష్మి, లక్ష్మి రావాలి అని పిలిచారు. కఱ్ఱతో కుంటుతూ 4 మంది సహాయంతో తొట్టిలోకి దించారు.

నా దగ్గర క్రరలు లేవు. సరిగ్గా 15 మెట్లు స్వయంగా ఎక్కాను. సైతాను చెప్పగా విన్న దేమనగా 'నీకు కాళ్ళు రాలేదు. కఱ్ఱ తీసుకో' ఇంతలో పాస్టరు గారు అమ్మా లక్ష్మి నీ పేరు డోర్కా. నేను డోర్కా అని పిలుస్తాను అన్నారు. 15 మెట్లు పైకి ఎక్కి రాగానే కఱ్ఱలు విసిరి వేశాను. ఇక యిర్మియాలో చెప్పిన మాటలు నమ్మాను. దేవుని మాటలు ఆధారంగా నన్ను ఎన్నో స్థలాలకు పంపుతారు. నాకు సందేశమిస్తారు. నేను అందరితో ఆయన చెప్పిన మాటలన్నీ నా పట్ల జరిగిన అద్భుతాలన్నీ వివరించాలన్న ప్రత్యేక భారం కల్గింది. భారతి గారికి చాలా కృతజ్ఞతలు తెలిపి ఒక సంచిలో కొన్ని బట్టలు తీసుకొని ఎన్నో ప్రాంతాలు ఒంటరిగా సాక్షిగా బయలుదేరాను. హైదరాబాద్, విశాఖ వెళ్లాను. నన్ను పరీక్షించిన డాక్టరు కాళ్లు, చేతులు ఎన్నిటికీ మాటలు కూడా

రావని చెప్పిన పరీక్షించిన డాక్టర్లను దర్శించి క్రీస్తే పరమ వైద్యుడు బాగు చేసాడని క్రీస్తు సువార్త చెప్పాను. ప్రతి చోట నీ సాక్షిగా ప్రభువా నేనుండుటన్లు ఆత్మాభిషేకము నిమ్ము, ఆత్మీయరూపడా అంటూ తెలియని ప్రాంతాలు ప్రభువు నన్ను పంపియున్నాడు.

**వ్యాధి సంభవించగా స్వస్థత పొందాను**

ఒకసారి టిబి గడ్డలు ద్వారా బాధపడ్డాను. కేన్సరు రొమ్ము పై నున్నదని పరీక్ష ద్వారా చెప్పారు. ఆపరేషన్ బల్లపై నుండగా ప్రభువు మాట ద్వారా స్వస్థపర్చారు. డాక్టరు రెండవసారి పరీక్షించగా ఏ వ్యాధి లేదని పంపించేశారు. కాళ్ళు ఇచ్చిన దేవుడే స్వస్థపర్చగలరని దృఢంగా నమ్మాను. ఒకసారి ప్రమాదంలో బస్సు క్రింద పడ్డాను. చాలా గాయపడగా చనిపోయాననుకున్నారు. అద్భుత స్వస్థత లభించింది. సువార్త చేయుచుండగా ఎన్నో ఆటంకాలు, విమర్శలు, నిరాదరణ దెబ్బలు ఈ రీతిగా ఎన్నో అవాంతరాలు ఎదురయ్యాయి. ప్రభువే విడిపించేవారు. బోన్‌టిబి, టైపాయిడ్, మలేరియా జ్వరాలు రాగా, క్రీస్తు స్వస్థపర్చారు.

**ఒరిస్సాలో ఎదుర్కొన్న శ్రమ :**

క్రీస్తు నా శ్రమలో ఎన్నో మాటలు బోధించేవారు. 'నీకు బంధకములు, శ్రమలు, పిడిగుద్దులు కాచుకొని వున్నాయి. నా కొరకు సాక్షిగా ఉంటావు. ఆత్మలను సంపాదిస్తావు. నిన్ను నేను తప్పిస్తాను' నాకు కొండంత ధైర్యం వచ్చేది. కీర్తనలు 91 చివరి వచనాల్లో ఏడు వాగ్ధానాలున్నాయి. శ్రమలో తోడుగా ఉంటాను. మొఱ్ఱపెడితే ఉత్తరమిస్తాను. రక్షణ చూపిస్తానన్నారు. ఒరిస్సా కొండలలో 15 మంది భూత వైద్యుల సమక్షంలో సువార్త బోధించసాగాను. నాకు ప్రభువు ఏ ప్రాంతానికి వెళ్తే ఆ ప్రాంతంలోని భాష మాట్లాడగలను. అది దైవ వరం. మంచి రాగం, స్వరంతో పాటలు దూతలు దర్శనమిచ్చి నేర్పేవారు. రండో.. రారండి ప్రభుని చెంతకు చేరండి నమ్మి నమ్మి నమ్మండి ప్రభు యేసు క్రీస్తును నమ్మండోయ్ మీరు భూదిగంతాల్లో నా సాక్ష్యులుగా ఉంటారన్న వాగ్ధానము నా పట్ల నెరవేరింది. నా పాట ఒరియాలో నున్నందున ఆశ్చర్యపడి పాటను విన్నారు. అయ్యాలారా, యేసును నమ్ముకున్నాను. అద్భుత శక్తులున్న దేవుడు నా కాళ్ళు చేతులు నోరు ఆయనే ఇచ్చారు. క్రీస్తును నమ్మి పరలోకంనకు వారసులవ్వండి. మీ దుష్ట శక్తుల ప్రభావంతో మీ పనులు ఆపండి. అవన్నీ వ్యర్థమండీ 'అనగానే నన్ను 24 దెబ్బలు కొట్టారు. నాతో వచ్చిన క్రైస్తవులు పారిపోగా నలుగురు మిగిలారు. ఎవరైనా

క్రీస్తును నమ్మితే సిగ్గుపడరు. శ్రమలు సహిస్తారు అన్నాను. ఆ దేవుడే నాకు నరకము పరలోకం చూపారు. యేసును నమ్మిన వారి కెన్నడూ శిక్ష విధి లేదండి. ఈ మాటలన్నీ ముక్కు, నోరు గుండా రక్తధారలు స్రవించగా నొప్పి తెలియని స్థితిలో మాట్లాడుచూ మీ హృదయాలు యేసుకు ఇవ్వండి అంటూ అరిచాను. తెల్లని వస్త్రాలు రక్తముతో నిండాయి. అంతలో ఒక మాంత్రికుడు చేతబడి చేసే క్షుద్రశక్తులను ప్రయోగించే భూతవైద్యుడు ముందుకు వచ్చాడు. నా మెడపై మూడు దెబ్బలు కొట్టారు. వారంతా హిందీ మాట్లాడారు. నా కళ్ళ అద్దాలు చిదుకగొట్టారు. ఈ సందర్భంలో ఏలియా, బయలు దేవత ముందు సవాలు గుర్తుకు తెచ్చారు. ఆ రోజుల్లో అద్భుతాలు చేయలేదా నాకసాధ్యమేదైనా కలదా? అన్నారు. నీకే శక్తి ఉంటే ఇదిగో మా ముందు కుంటి, గ్రుడ్డి, మూగ వ్యక్తులను తెచ్చారు. యేసు నామంలో నాలో స్వస్థతా శక్తిని ప్రభువు చూపగా వారంతా స్వస్థత పొందారు. చూచిన వారు క్రీస్తు శక్తి గొప్పదన్నారు. భజరంగ్ మతస్తులు ఫోను ద్వారా నా గూర్చి తెలుసుకొని వచ్చారు. నా ముందున్న మాంత్రికుడు నన్ను బాధించదలిచాడు. అతను చాలా మందిని చంపాడట. 'అమ్మాయీ, నీవు చిన్న పిల్లవు నా దగ్గరకు వచ్చి నన్ను ఢీకొన్న వారేవరూ బ్రతుకలేదు వెళ్ళిపో అన్నాడు.

దానియేలు తమ దేవుని నెరుగు వారు బలము కల్గి గొప్ప కార్యాలు చేస్తారన్న వాగ్దానము గుర్తింది. అయ్యా నాకు భయం లేదన్నాను. నన్ను చూచి 38 మంది పారిపోయారు తెలుసా అంటూ నా ముందే మట్టిలో బొమ్మను చేసి నీటిలో పెట్టాడు. మట్టి నీటిలో కరిగే స్వభావం గలదు. ఆ నీరు రక్తంగా మారుట చూచాను. నాలో క్రీస్తు నాకు బోధిస్తున్నారు. 'అమ్మా డోర్కా, గతంలో మోషె కాలంలో మాంత్రికులు నీరు రక్తంగా కర్రను పాముగా మార్చలేరా కొన్ని దుష్ట శక్తులకు ప్రకృతిపై అధికం పొందుకుంటారు. గానీ జయించలేరు. నన్ను కూర్చు అని అజ్ఞాపించి ఆ మట్టిపై ఎముకలోంచి పట్టుకో అన్నాడు. ఆ బొమ్మ కాలు విరిచాడు. ఆ బొమ్మ ముందుగా మాట్లాడుచు ఈ అమ్మాయిని చంపు అని స్వరంతో మాట్లాడుట విన్నాను. ఆ బొమ్మ నాలుక కత్తిరించాడు. దాని పవర్ పోయింది. వేరే కాంథహార్ ఫోన్ చేశాడు. అమ్మాయి నీకీ శక్తి ఎలా వచ్చింది? అని ప్రశ్నించాడు. వింతగా ఆ చేతితో చేసిన బొమ్మ నా స్పర్శలో కరిగింది. ఆ బొమ్మ చనిపోయింది.

ఆ మాంత్రికునిలో అనుభవాలన్నీ సెప్టెంబరు 2011లో జరిగాయి. అది ఒరిస్సా ప్రాంతము. ఆ మాంత్రికుడు ఓడిపోయడు. నీలో దేవుని శక్తి, నీ ధైర్యము చూచానమ్మా అన్నాడు. తెలియక చేసిన పాపాలన్నీ ఒప్పుకోండి అన్నాను. అందరిముందూ ప్రభువు ఆయన దూతలు నేర్చిన పాటలు పాడాను. ఒక పాపి మారితే యేసు పాదాలు చేరితే అంబరాన సంబరం ప్రభూ నీ ప్రేమతో నడిచాను. ప్రభువా నీ నీడలో తిరిగాను. ప్రభువా, నీ ప్రేమకు కృపకు నేనేమి ఇవ్వగలను? నా జీవితం నీకే అంకితము నీకే అర్పించి సేవ చేస్తాను. నీ పరలోకం చూపించావు వివరించి నడిపించావు. నాకు దృష్టినిచ్చి ఇహ లోకం చూపించావు. నేను నీ సిలువ సాక్షిగా జీవిస్తాను. సరిగ్గా 2011లో అక్టోబరు 19వ తేదీ ఫోనులో 62 సంవత్సరాల చేతబడి వ్యక్తితో యేసును నమ్మాలి అని శోధన బాధలు పరీక్షలు ఎదుర్కొన్న ఫలితంగా అతను మారి బాప్తీస్మం తీసుకొనుట ప్రభుని కృప. అతని క్రియలు గతంలో నాకాశ్చర్యం కల్గించేవి. మట్టితో నిమ్మకాయలు తీసి 1000 రూపాయలుగా మార్చారు. మట్టిని నోటిపై ఉంచాడు. అద్దాలలోనున్న మరుగుజ్జు దయ్యాన్ని శవమైన 3 సంవత్సరాల మరుగుజ్జును పిలిచాడు. పడుచుగా ఉంది. అది నన్ను చంపెయ్యమంది చివరకు నా ప్రార్థనతో క్రీస్తు శక్తి ఉండగా అది మరణించి సర్వనాశనమై మట్టి కరిగిపోగా అతని మాంత్రిక శక్తి మాయమైంది. అదే దేవుని మహా శక్తి అని స్తుతించాను. అక్టోబరు నెలలో గుంటూరు డాక్టరు సరళా ఎలిషా గారింటికి వచ్చాను వీరితో పాటు డాక్టర్ సంధ్యాలామ్ గారు నన్ను ఆదరించారు. స్త్రీల మీటింగులో సాక్ష్యమిచ్చాను. వారి దగ్గర నుండగా అమెరికా రావే వారు నిర్వహించే సెల్ ఫోన్ పరిచర్యలో హైదరాబాద్‌లో నున్న సులోచనా ప్రకాష్ ఆంటీ గారు నాకు చాలా కాలంగా తెలుసు. వారు నా ఫోను ద్వారా 30 పైగా సభ్యులు రోజు రాత్రి 9 గంటల వరకు జరిగే ప్రార్థనలో అక్టోబరు 14వ తేదీన నా సాక్ష్యము వివరించగా వారంతా చాలా ఆశీర్వదించబడి నట్లు ఫోను ద్వారా తెలపగా ఆనందించి వారి కొరకు ప్రార్థించాను. అదే నెలలో ఒకసారి నా కళ్ళు మసగలు వచ్చాయి. అక్టోబరు 14వ తేదీ మనుషులు కనిపించలేదు. నన్ను ప్రేమించే డాక్టర్లు మందులు తెచ్చారు. ప్రభువు స్వరంతో మాట్లాడారు. 'భయపడకు అని చెప్పగానే దర్శనంలో ఒక కొండ ఎక్కాను. క్రీస్తు చేతులు చాపి అందుకున్నారు.

**పరలోక దర్శనము చూచుట :**

ఆకాశం తెరువబడింది. బంగారు వీధులు 12 గోత్రాలు దూతల గానాలు అన్నీ చూచాను. ప్రకటనలో వర్తన సరిగ్గా అలాగే ఉంది. ధవళ సింహాసనము చూచాను. క్రీస్తు ఆసీనులై యున్నారు. నాకు నరకం కూడా చూపమని క్రీస్తు దూతలకాజ్ఞాపించారు. నన్ను తీసుకెళ్ళారు. గాబ్రియేలు, రఫాయేలు మొదలైన దూతలు కన్పించారు. 1 నుండి 6 గేట్లున్నాయి. వాటికి పాపముల పేర్లు ఉన్నాయి. బోర్డుపై వ్రాసారు. నాకు తెలిసిన వారు కూడా ఉన్నారు. నరకంలో బాధలో ఉన్న వారి నోటిలో నుండి పురుగులు ఉ ండుట చూచి భయపడ్డాను. నేను ఏడుస్తున్నాను. యేసు నన్ను పరలోకం తెచ్చేశారు. నా కళ్ళు సహజంగా చూడలేని స్థితిలో నుండగా ఆయన కండ్ల నుండి రెండు కాంతిగల నక్షత్రాలు నా కళ్ళల్లోకి దూసుకొని వచ్చాయి. 15 రోజులు గ్రుడ్డిగా ఉన్నాను. 'దేవునికి అసాధ్యమేమీ ఉండదు' ఈ మాటలో నాకు కళ్లు వచ్చాయి. హల్లెలూయా. దేవుని భాషలో పాట నేర్పారు. తెలుగులో కావాలని అడిగాను. కొండంత దేవుడు అండగా నీకుండగా నీ గుండెలో సుడిగుండాలెందుకో ప్రియుడా ఆ సమయంలో అబ్రహాము, ఇస్సాకు, దినకరన్‌గారు, ఆమోసు, దావీదు ఈ రీతిగా బైబిలు వ్యక్తులను చూచాను. ప్రార్థనలో ఆరంభించి నా సాక్ష్యమును ప్రతిచోట వివరిస్తూ క్రీస్తు కొరకు సాక్షిగా ఉ న్నాను. నా కోసం ప్రార్థించండి. ప్రభువు కృప సదా మీతో ఉండుగాక ఆమెన్.

ప్రార్థన : ప్రియమైన యేసు రక్షకా, 2000 సంవత్సరముల క్రితం నా కరొకు భూలోకంలోకి వచ్చి మూడున్నర సంవత్సర పరిచర్యలో నా వంటి కుంటి, గుడ్డి వారిని బాగు చేశావు. కుష్టు వారిని లేపావు. నా కొరకు నీ ప్రేమను చూపి ఎందరో భారతి మేడమ్ గారి వంటి భక్తులు నీ ప్రేమ చూపించే వారి ద్వారా బ్రతికిస్తున్నావు. వందనాలు. ఈ సాక్ష్యము చదువారికి వినే చెవులు, చూచే నేత్రాలు ఇవ్వండి. నిన్ను రక్షకునిగా స్వీకరించు ధన్యత నిచ్చి సాక్షులుగా భూ దిగంతాలలోనుండు ధన్యత ఇవ్వండి. పేతురు యాకోబు వలె మేము చెప్పక ఉండలేమన్న తపన మాకు ఇవ్వండి. అందరిని దర్శించండి యేసు నామమంలో ప్రార్థిస్తున్నాము తండ్రి ఆమెన్! ప్రార్థనా అవసరాలుంటే నాకు ఫోను చేయండి. నా సెల్ ఫోను నెం. 9000636890